అఖిల

అఖిల భారత పత్రిక

జనవరి 2013



Let us serve the Truth

మనం పరమ సత్యాన్ని సేవించుదాం

12/1/2013.

ఏది సత్యం

అజ్ఞానం అంటే ఏమిటి

అజ్ఞానం అనగా అవిద్య, వేరుచేసే చైతన్యం, అహంబుద్ధి, దాని నుంచి ప్రవహించే జీవితం, వేరైన చైతన్యానికీ, అహం బుద్ధికీ, జీవితానికీ అతి సహజంగా ఉండేది అంతా. విశ్వమేధస్సు అతిమానస (దివ్యజ్ఞాన) ప్రకాశంనుంచి వేరుపడిపోయిన దాని ఫలితం ఈ అజ్ఞానం, ఆ విధంగా మహాసత్యమును కోల్పోయింది.— అది అస్తిత్వసత్యం, దివ్యచైతన్యసత్యం, శక్తీ, కార్యకలాపాలసత్యం, దివ్యానందసత్యం.

దాని ఫలితంగా దివ్యజ్ఞాన ప్రకాశంలో సృష్టించబడిన సమగ్రసత్యంతోనూ, దివ్యసామరస్యతతోనూ కూడిన ప్రపంచానికి బదులుగా పాక్షికసత్యంతో, పాక్షికమైన తప్పులతో నిండి, అధమస్థాయికి చెందిన విశ్వగత మేధస్సుతో ముక్కలైన సత్యంమీద ప్రతిష్టించబడిన ప్రపంచంలో మనం ఉన్నాం.

దీనినే శంకరులవంటి చింతనాపరులైన మన ప్రాచీనులలో కొంతమంది, దీని కంతటికి వెనుకనున్న ఉన్నతోన్నతమైన మహాసత్యాశక్తిని గ్రహించలేక, దీనిని మహా మాయగా ముద్రవేసి, అదే దైవంయొక్క మహోన్నత సృజనాత్మకశక్తిగా తలచారు.

ఈ సృష్టియొక్క చైతన్యంలోని సమస్తమూ పరిమితమైన లేదా పరిపూర్ణ ప్రకాశంనుంచి వేరు పడటం మూలంగా వక్రీకరించబడినది; అది దర్శించే మహా సత్యంకూడా కేవలం పాక్షిక జ్ఞానమే. అందువలన అది అజ్ఞానమని పిలువబడింది.

*

కాని ఈ అజ్ఞానం కేవలం ఈ విశ్వమహాప్రకృతిలోని ఒక భాగంమాత్రమే. ఇదే సమస్తమూకాదు, ఆద్య ఆధిపత్యశక్తీ లేక సృష్టికర్తా కాదు: అది తన ఉన్నతోన్నతమైన మూలంలో స్వయం పరిమితిని విధించుకునే మహాజ్ఞానం, దాని నిమ్నభాగంలోని ప్రభవంలో సైతం, అది పూర్తి భౌతిక మహా అచేతననుంచి బయలు వెడలినప్పుడు కూడా, కనుగొనాలనే తపనతో, తనను తాను తిరిగి పొందడానికీ, దాని నిజలక్షణమైన మహా జ్ఞానమును సృష్టికి మూలంగా అభివ్యక్తం చేయడానికీ అవిరళ కృషిచేసే అణచిపెట్టబడిన మహా చైతన్యం.

శ్రీఅరవిందులు

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

SABCL, Vol. 22,P381; Vol. 19, P845(CWSA22: 878)

ఏడుపొరల అజ్ఞానం

మనం ఈ అజ్ఞానంవైపు ఒక పరి పరికించి చూస్తే సర్వసాధారణంగా భౌతికంలోనూ, అనంతాకాశంలోను మరియు కాలానుగతమైన విశ్వంలోనూ వేరు ఉనికిని కలిగి ఉన్న మనకు, మనం ఏ దృష్టి కోణంలోనుంచి చూసినా లేక దానిని సమీపించినా అది బహుముఖాలతో కూడి తనదైన అజ్ఞానమనే వాస్తవికతలో అస్పష్టతతో మసకబారి పోయిన పార్శ్వంగా కుంచించుకు పోయినదిగా కనిపిస్తుంది.

మొదటిది, మూల అజ్ఞానం

మన అస్తిత్వానికీ, పరిణామానికీ మూలమైన నిరపేక్షతను గురించిన అజ్ఞానంలో మనం ఉన్నాం; అస్తిత్వపు పాక్షికసత్యాలనూ, ప్రాపంచిక సంబంధాలనూ, ఉనికికి సంబంధించిన సంపూర్ణ సత్యానికి బదులుగా తీసుకుంటాం— అది మొదటిది, మూల అజ్ఞానం.

రెండవది, విశ్వపరమైన అజ్ఞానం

మనం ప్రదేశరహితమైన, కాలరహితమైన, అచలమైన, మార్పులేనటువంటిదైన పరమ ఆత్మను తెలుసుకోలేని అజ్ఞానంలో ఉన్నాం; విశ్వం నిరంతర చలనాన్నీ, దానిలో పరస్పర వినిమయంవలన మహాకాలంలోనూ, మహాప్రదేశంలోనూ జరిగే విశ్వసంబంధమైన పరిణామాన్నీ, ఉనికికి సంబంధించిన సంపూర్ణ సత్యంగా మనం అనుకుంటాం— అది రెండవది విశ్వపరమైన అజ్ఞానం.

మూడవది, అహంపరమైన అజ్ఞానం

మనం మన సార్వత్రికమగు విశ్వ ఆత్మనూ, విశ్వపరమైన ఉనికినీ, విశ్వపరమైన చైతన్యాన్ని, మనకు అన్ని అస్తిత్వాలతో పరిణామాలతోటీ కల అనంత ఏకత్వాన్నీ, తెలియని అజ్ఞానంలో ఉన్నాం; మనం మన పరిమితమైన అహంభావకమనస్సునూ, ప్రాణికాన్నీ, దేహాన్నీ మన నిజమైన ఆత్మగా అనుకుంటూ, వాటికి సంబంధించని దానినంతా అనాత్మ అంటాం— అది మూడవది, అహంపరమైన అజ్ఞానం.

నాల్గవది, కాలపరమైన అజ్ఞానం

మనం మహాకాలంలోని మన నిరంతర పరిణామం తెలియని అజ్ఞానంలో ఉన్నాం; మహా ప్రదేశంలోని అత్యల్ప క్షేత్రంలో, మహా కాలంలోని అత్యల్ప సమయభాగమైన ఈ అల్పజీవితాన్ని, మనకు ప్రారంభదశగానూ, మనకు మధ్యదశగానూ, మనకు ముగింపుగానూ అనుకుంటాం— అది నాల్గవది, కాలపరమైన అజ్ఞానం.

ఐదవది, మానసికపరమైన అజ్ఞానం

అతి తక్కువ సమయం తీసుకునే ఈ కాలానుగత పరిణామంలో సైతం మనం మన బృహత్తరమైన, జటిలమైన అస్తిత్వాన్ని తెలియని అజ్ఞానంలో ఉన్నాం; మనలో అది మనం బాహ్యంలో పొందే పరిణామానికి అతి చైతన్యంగా, అధోచైతన్యంగా అంతరంగ చైతన్యంగా, చుట్టూ ఆవరించి యున్న చైతన్యంగా ఉన్నది; మనం బాహ్యంలో పొందే ఆ పరిణామాలను కొన్ని బాహ్యంలో ప్రదర్శితమయ్యే దాని మనో సంబంధిత అనుభవాలను, మన సమస్త ఉనికీ అదే అని అనుకుంటాం — అది అయిదవది, మానసికపరమైన అజ్ఞానం.

ఆరవది, శారీరక, మానసిక, జీవనములతో నిండిన వ్యవస్థాపరమైన అజ్ఞానం

పరిణమించుతున్న మన శారీరిక, మానసిక, జీవన సంవిధానాన్ని తెలుసుకోలేని అజ్ఞానంలో ఉన్నాం; మనం మన మనస్సు లేక జీవితం లేక శరీరం లేక ఏ రెండింటిని గాని లేక అన్నింటినిగాని మన నిజమైన ప్రధాన సూత్రంగా లేక మనం ఉన్నదాని కంతటికీ అదే సమస్తంగా అనుకుంటాం. వాటన్నింటినీ రూపొందించి, తన నిగూఢ సన్నిధితో నిర్ణయించి, వాటి కార్యకలాపాలాన్నింటినీ, తాను బయల్పడుతూ, సర్వోత్కృష్టంగా నిర్ణయిస్తున్న దాని దార్శకతలేని వాళ్ళం— అది ఆరవది, శారీరక, మానసిక, జీవనములతో నిండిన వ్యవస్థాపరమైన అజ్ఞానం.

ఏడవది, ఆచరణపరమైన అజ్ఞానం

ఈ అజ్ఞానాలన్నింటి ఫలితంగా, మనం అసలైన జ్ఞానాన్ని, పాలనావ్యవస్థనూ,

ఈ ప్రపంచంలో జీవనభోగాన్నీ కోల్పోతున్నాం. మన ఆలోచనలలో, ఇచ్ఛలో, ఇంద్రియ సంవేదనలలో, చేతలలో మనం అజ్ఞానంలో ఉన్నాం. ప్రతిక్షణం తారసపడే ప్రపంచంలోని ప్రశ్నలకు తప్పైన లేక అసమగ్రమైన ప్రతిస్పందనలను ఇస్తుంటాం. అసంఖ్యాకమైన పొరపాట్లూ కోరికలతో, పెనుగులాటలూ వైఫల్యాలతో, బాధలూ సుఖాలతో, పాపమూ తొట్రుపాటుతో, ఒక వక్రమార్గాన్ననుసరించి, లక్ష్యం మార్చుకో గలందులకై గుడ్డిగా తడుముకుంటూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటాం — అది ఏడవది, ఆచరణపరమైన అజ్ఞానం.

శ్రీఅరవిందులు

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

(SABCL19: P654-55(CWSA22: 680-81)

ఏడుపొరల అజ్ఞానాన్ని రద్దుచేసే విధం

అజ్ఞానం గురించిన మన భావన తప్పనిసరిగా మహోన్నత జ్ఞానం గురించిన మన భావనను నిర్ణయిస్తుంది. మన జీవితం అజ్ఞాన భూయిష్టమై మహోన్నతజ్ఞానాన్ని ఏకకాలంలో ఖండిస్తూ, అన్వేషిస్తూ ఉండటం మూలంగా, అదే మన మానవప్రయత్నం లక్ష్యాన్నీ, విశ్వకార్యధ్యేయాన్నీ, నిర్ణయిస్తుంది. అప్పుడు పరిపూర్ణజ్ఞానం అనే దాని అర్థం, ఏది అది కోల్పోతున్నదో, విస్మరిస్తున్నదో దానిని కనుగొనటంతోను, మన చైతన్యంలో ఏడుపొరల ఆత్మ సాక్షాత్కారంతోనూ, ఆ ఏడుపొరల అజ్ఞానాన్ని రద్దుచేయడమేనని అవగతమౌతున్నది.

దానర్థం అన్నింటికీ మూలమైన, నిరపేక్షం అనే జ్ఞానం కలిగిఉండటం; పరమ ఆత్మా, పరమ ఆత్మశక్తీ, పరమ అస్తిత్వ జ్ఞానముతో పాటుగా, పరమ ఆత్మ పరిణామమూ, పరమ అస్తిత్వ పరిణామమూ, పరమ ఆత్మశక్తి అభివ్యక్తతనూ విశ్వానికి సంబంధించిన జ్ఞానంగా కలిగిఉండటం; మన చైతన్యంలోని నిజాత్మతో ఏకమైనదానినిగా ఈ విశ్వపు జ్ఞానాన్ని కలిగి ఉంటూ, ఆవిధంగా దానినుంచి వేరనేభావనతో, అహంజీ వనంతో దానినుంచి కలిగిన విభజనను రద్దుచేయడం; మన చైత్య అస్తిత్వ జ్ఞానంతో పాటుగా, మృత్యువుకూ, భూఉనికికీ దూరంగా మహాకాలంలో అమృతత్వమును, పట్టుదలతో అభిలషించేదాని జ్ఞానాన్ని కలిగి ఉండటం; మన బాహ్యంవెనుకగా మహో

న్నతమై, అంతరంగంలోలోన మన ఉనికిని కలిగిన జ్ఞానాన్ని కలిగి ఉండటం; మన మనస్సుకూ, జీవితానికీ, దేహానికీ, అంతరంగంలోని ఆత్మకూ, వాటికిపైన ఊర్ధ్వంలోని అతిచైతన్య ఆధ్యాత్మికమునకూ, అతిమానస అస్తిత్వమునకూగల సంబంధ జ్ఞానాన్ని కలిగిఉండటం; చిట్టచివరగా, అసలైన సామరస్యతా, సరైన రీతిలో మన ఆలోచనలనూ, ఇచ్ఛనూ, చేతనలనూ అమలుచేయడం; మానవ ప్రకృతినంతా పరమ ఆత్మశక్తీ, పరమ ఆత్మా, దివ్యత్వమూ, పరిపూర్ణ ఆధ్యాత్మిక మహాయదార్థమూ అనే సత్యము నందు ఎరుకతో వ్యక్తీకరించగలిగే పరివర్తన జ్ఞానమును కలిగి ఉండటం.

కాని ఇదంతా ప్రస్తుతం ఉన్న చైతన్యం మూసలో అధ్యయనముతో తెలుసుకోగలిగే, పూర్తి చేయగలిగే మేధోజ్ఞానంకాదు; అది అవశ్యం ఒక అనుభవం, ఒక పరిణామం, చైతన్యమార్పు, అస్తిత్వమార్పుకావాలి. ఇదంతా అస్తిత్వ మహాపరిణామంలో సంభవించే లక్షణం. మన మానసిక అజ్ఞానం మన పరిణామదశలో కేవలం ఒక మజిలీ అనేది వాస్తవవిషయం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ

(SABCL Vol. 19; p.681-82)

ఏది అసత్యం

అసత్యం అవిద్య కాజాలదు. కానీ అది దీనికి అంతిమ ఫలితం. ఈ అసత్యం అసుర శక్తి చేత సృష్టించబడి, ఈ సృష్టిలో జోక్యం చేసుకుంటుంది. అది సత్యం నుండి వేరైపోయింది. అందువలన దానితో జ్ఞానపరంగా కుంచించుకుపోయినదయింది. తప్పు పట్టుటకు వీలుగా తయారయింది. సత్యానికి వ్యతిరేకమయింది. మరోలా చెప్పాలంటే సత్యాన్నే వక్రీకరించేందుకు దానిని పట్టుకొని వుంటుంది. ఈ శక్తి ఈ ఘోర అసుర శక్తి, ఈ రాక్షసమాయ, దాని వక్ర చేతనను నిజమైన జ్ఞానంగా దాని ఇచ్ఛా పూర్వకవికారాలను సత్యవైరుధ్యాలను యదార్థ రూపాలుగా మన ముందుకు తెస్తుంది. వక్రమై వక్రీకరిస్తున్న చైతన్యంలోని ఈ విరూపాలనే, ఈ శక్తుల్నే, మనం ప్రతికూల జీవులనీ, ప్రతికూలశక్తులనీ పిలుస్తాం. ఎప్పుడెప్పుడు వాటి అజ్ఞాన సముదాయం నుండి కలుగచేయబడిన ఈ వక్రతలను 'సత్య' జనితాలుగా మనముందు

వుంచుతామో అదంతా అసత్యమే.. యోగపరంగా చెప్పాలంటే ఇదే మిధ్య, 'మోహం.'

ఒక్కసారి ఒకే చేతననుండి వివిధ చేతనలు వేరుపడ్డాయో అవి నిర్నిరోధంగా వెళ్ళి అజ్ఞానంలో పడిపోయాయి. అలా అజ్ఞానం యొక్క అంతిమ ఫలితం 'నిశ్చేతనం' అయింది.

ఈ చిక్కటి దట్టమైన నిశ్చేతనలోనుండీ ఈ వస్తుప్రపంచం విప్పారుచ్చుకొంటూ, లేస్తూ వుంది. దాని నుండీ పరిణామ ప్రక్రియ ద్వారా 'ఆత్మ' చైతన్యము లోనికి పరిణమించడానికి పోరాటం చేస్తూవుంది.

లోపల దాగివున్న ప్రకాశం వైపుకు ఆకర్షితురాలౌతూ ఊర్ధ్వముఖంగా ఎదుగుతూన్నప్పుడు అది తాను పోగొట్టుకున్న ఏ దైవత్వం నుండీ పుట్టుకొచ్చిందో ఆ దైవత్వంలోనికి గ్రుడ్డిగా నడక సాగిస్తుంది.

ఏది జ్ఞానం?

మనలోను, అందరిలోను భగవంతుని ఉనికి ఉన్నదనే విషయం అందరికీ విదితమే. అయితే ఆ భావనపై దృష్టిని ఏకాగ్రంగా నిలిపి తద్వారా సమకూరిన సజీవ సాక్షాత్కారంతో పాటు ఆ భావనపై నిరంతర ధ్యాసను కలిగి వుండడమనేది యోగ పరిభాషలో జ్ఞానం, జ్ఞానంకోసం చేసే కృషి, అని అనబడుతుంది.

శ్రీఅరవిందులు

అనువాదం: హర్షవర్ధన్

అసత్యంపై విజయం

ప్రశ్న: సంపూర్ణ అసత్యం, సంపూర్ణ అబద్ధం అసలుండవని శ్రీఅరవిందుల అభిప్రాయమా?

జవాబు: సంపూర్ణ అబద్ధం ఉండజాలదు. వాస్తవానికి ఆ అవకాశం లేదు. ఎందుకంటే, అన్నింటివెనుక దైవం ఉన్నాడు. ఇది ఎలా ఉందంటే, కొన్ని మూలకాలు ఈ విశ్వం నుండి అదృశ్యమౌతాయా అని అడిగినట్లుంది. విశ్వ వినాశం అంటే అర్థం ఏమై ఉంటుంది. మన తప్పునుండి మనం బయట పడితే, దేనిని 'నాశనం' అని అనగలం. రూపం మాత్రమే — కనబడేది మాత్రమే — నాశనం అయింది. నిజంగా పైకి కన

బడేదంతా నాశనం అయింది, ఒకదాని తరువాత ఒకటి. ఇంకా ఇలా చెప్పబడింది, వ్రాయబడింది, అనేకచోట్ల వినాశకరశక్తులను పరివర్తన చేయవచ్చు అంటే, అవి వాటిలో గల దైవంయొక్క ఎరుక పొంది, దైవంగా రూపొందుతాయి. లేదా అవి నాశనమౌతాయి. కాని నాశనమవడం అంటే ఏమిటి? వాటి రూపమా? వాటి చైతన్య రూపాన్ని కరిగించవచ్చు. కాని, దేనివల్ల అవి మనగలుగుతున్నాయో, దేనివల్ల అన్నింటికీ అస్తిత్వముంటుందో (సృష్టిలో) దాని నెలా నాశనం చేయగలం? విశ్వం ఒక వస్తురూప అభివ్యక్తీకరణ. అనంతకాలంలో ఉంటున్న ఆతని స్వయం దర్శనం. అందుచే సర్వం ఉండకుండా పోవడం ఎలా సాధ్యం? అనంతుడు, కాలాతీతుడు, ఎటువంటి హద్దులు లేని వాని నుండి ఆవలకు ఏది వెళ్ళగలదు? అంతా అతడే అయినపుడు ఇంకెక్కడికెళ్ళాలి? అతడొక్కడే ఉన్నాడని చెప్పినప్పుడు అతడు ఒకచోట ఉన్నట్లు చెప్తున్నాం. అది అవివేకం. అక్కడి నుండి దేనిని తీసుకుపోగలం? ప్రస్తుతం అభివ్యక్తమైవున్న విశ్వం నుండి, దాని ఆవల, వేరొక విశ్వం అభివ్యక్తమై ఉన్నట్లు ఊహించవచ్చు మనం. ఇలా అభివ్యక్తమై ఉన్న విశ్వాలపరంపరలో, ముందున్న విశ్వంలో ఉన్నది, తరువాతి విశ్వాలలో ఉండకపోవచ్చు. ఇది తేటతెల్లమే. ముద్దకట్టినట్లున్న మొత్తం అసత్యం, అబద్ధం — ఇప్పుడు మనం అబద్ధం, అసత్యంగా భావిస్తున్నవి — భవిష్యత్ లో వికసనం చెందుతున్న వేరొక ప్రపంచానికి ఎంతమాత్రం చెందక పోవచ్చు. ఇవి మనం ఊహించవచ్చు, అర్థం చేసుకోవచ్చు. కాని నాశనం చేయబడడం?

ఎక్కడకు పోగలదు అది నాశనం చేయబడడానికి. నాశనం చేయడం అని మనం అన్నప్పుడు — మనం ఆలోచించేది, దాని రూపాన్ని; అది చైతన్య రూపం కావచ్చు లేదా పదార్థరూపం కావచ్చు, కాని, ఎప్పుడూ రూపాన్నే. కాని రూపం లేని దానికి నాశనం చేయడం ఎలా?

మనం అదృశ్యమయ్యే సంపూర్ణ అసత్యం గురించి మాట్లాడేటప్పుడు, గతంలో నిరంతరంగా నివశిస్తూ, భవిష్యత్ అభివ్యక్తీ కరణాలకు ఎంతమాత్రం చెందని వస్తు సమూహాల గురించే మనం మాట్లాడేది. అతని నుండి లేదా దాని నుండి ఎవరూ బయటకకు పోలేరు.

*

అసత్యాన్ని బయటకు తేవడం, దానిని దివ్యవెలుగు ముందుంచడమే, నిజంగా,

ఒక గొప్ప పరివర్తన. అది అంతిమ విజయానికి దారి తీస్తుంది. ప్రతి అసత్యాన్ని దాని ముసుగు తొలగించి ఉంచడమే ఒక విజయం.

తప్పును ఒప్పుకున్న ప్రతిమారు, ఒక చీకటి లోకాల ప్రభువును నాశనం చేసి నట్లు; అది తనకు తానుగా ఒప్పుకొనుట కావచ్చు; కాని అది మనస్ఫూర్తిగా, నిజా యితీగా ఉండాలి. సున్నితంగా ఒప్పుకొని మరుక్షణమే మర్చిపోయేది కాకూడదు. ఆ తప్పు తిరిగి చేయకుండా ధృఢమైన నిర్ణయం తీసుకుందుకు కావల్సిన బలం కలిగి ఉండాలి. అది గురువులో మూర్తీభవించిన దైవం ఎదుట ఒప్పుకొనుట కావచ్చు. నీవు వ్యక్తిగతంగా గురువు ఎదుట సూటిగా నీ తప్పు ఒప్పుకొని, ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు, ఆ నిర్ణయం ఇక ఎంతమాత్రం నీదిగా ఉండదు. నీవు నిజాయితీగా ఉంటే, నీ నిర్ణయానికి దైవామోదం ఆశీస్సులు ఉంటాయి.

శ్రీమాత

అనువాదం: ఎస్.వై. సోమయాజులు

సత్యం ఒక నిరవధిక సంకీర్ణమయమైన వాస్తవము

సత్యమనేది అంతులేని సంకీర్ణమయమైన ఒక వాస్తవము. ఎవరైతే దాని సంకీర్ణతను గుర్తించి కూడా నిరుత్సాహపడకుండా ఉంటారో ఆ సత్యానికి దగ్గరయే అవకాశం వారికే ఎక్కువగా ఉంటుంది. మనం ఆ మొత్తం సంకీర్ణతను, యదార్థతను, ఉద్వి గ్నతను, భావనను దాని వెనుక దాగివున్న సత్యాన్ని, పర్యవసనాన్ని, వైరుధ్యాన్ని, మార్పును, ఆదర్శ అభ్యాసాలను, సాధ్యాసాధ్యతలను (అయినా ప్రయత్నించవలసి నవే) పరిశీలించాలి. ఇంకా ఆ ఉధృత ప్రాపంచిక వాహినిలో, ఆ సుడిగుండంలో ఆత్మను ప్రశాంతంగానూ, దృష్టిని స్పష్టంగాను ఉంచుకుంటూ ఏదో ఒక సామరస్య సమాచారంకోసం సర్వత్రా అన్వేషిస్తూ, పర్యవసానసత్యంలో తక్షణ అవసరాన్ని, తక్షణ అవసరంలో పర్యవసాన సత్యాన్ని విస్మరించకుండా అఖండ ప్రణాళికలో దేని సముచిత స్థానంలో దానికి కేటాయించడం మరవకూడదు.

కొంతమంది ఊహాత్మక అవగాహనతో సత్యాన్ని అన్వేషించవచ్చుననుకుంటారు. తార్కికవాదం మాదిరిగా ఇది మంచి సాధనమే, కానీ దాని మాదిరి ఇది కూడా లక్ష్యాన్ని చేరకుండా వీగిపోతుంది. ఆ విధంగా కొంతదూరం తీసుకొనివెళ్ళి అక్కడ

వదిలివేసే ఈ రెండింటినీ కూడా ఒప్పుకోకూడదు. ఆ రెండింటినీ చక్కగా సమీకరించుకొని సరైన నిర్ణయానికి రావచ్చునని మరికొంతమంది అనుకుంటారు. అది కొంత కాలం దాకా బాగానే ఉంటుంది. ఆ తర్వాత తరం వారు మాత్రం ఈ సున్నిత సమీకరణాన్ని తలక్రిందులు చేసేస్తారు. అంతకంటె మొరటు పరిశోధనకి అంగీకరిస్తారు, లేదా ఇంకా సున్నిత సమీకరణం కావాలనుకుంటారు. మత విశ్వాసపరులు ఏదో ఒక ప్రేరణపై ఆధారపడతారు. కానీ ఆ ప్రేరణ మెరిసే మెరుపు వంటిది. అది కొంత ప్రాంతాన్ని దేదీప్యకాంతితో వెలిగించి మిగిలిన దాన్ని చిమ్మ చీకటిలో ముంచుతుంది. ఆ చిన్న ప్రాంతమే మొత్తం విశ్వమనుకుంటే మాత్రం అది పెద్దపొరపాటే. సత్యం అంటే పూర్తి అవగాహన కల్పించి మన ఉనికికి హేతువైన కీలక సమాచారాన్ని తెలియచేసే సాధనమేమీ లేదా? ఉన్నదనే నేననుకుంటున్నాను. కానీ ప్రస్తుత మానవ పరిణామదశ అందుకు సంసిద్ధం కాలేదు. దాని అత్యున్నత దశ ఇంకా ఆ మెరుపుల సరిహద్దుల్లోనే ఉంది. శుద్ధమైన మానవ మేధస్సు మాత్రమే ఆ ఉన్నత శిఖరాలకు చేర్చగలదు. అంతకు తప్ప మేధోభావుకులను దూషించేవారుగానీ లేక వారిని మూఢంగా అనుసరించేవారుగానీ ఈ జ్ఞానాన్ని పొందలేరు. ఎందువల్లనంటే ఇది కేవలం ఇంద్రియ జ్ఞానంతోగానీ, మనసు ఆలోచించి సమకూర్చుకునేదానితోగాని నెరవేరదు. అది సూటిగా బుద్ధికే అవగతమవుతుంది.

*

ప్రశ్న. సత్యాన్ని సాధించటం ఎలా?

మనిషి మానసిక జీవి కాబట్టి సహజంగా తను అన్నిటినీ మనసుకే ఆపాదిస్తాడు. విశ్వంలో మనసు ఒక గొప్ప నేత అనీ, కర్త, సృష్టికర్త, ఒక ప్రధాన ప్రతినిధి అని మనస్సుతోనే ఊహిస్తాడు. కానీ ఇది పొరపాటు; ఎందువల్లనంటే జ్ఞానం పొందాలనుకున్నా కూడా ఆ మనస్సు మాత్రమే చేతికందివచ్చే ఏకైక ఉపకరణం కాదు, అది మాత్రమే ఆకాంక్షించదు, ఆవిష్కరించదు. సువిశాలమై సరి సూటిగా పనిచేసే పరాప్రకృతి చర్యకీ మహావిస్తారమై అమోఘముగా నర్తించే పరమేశ్వరుని పరచేతనా చర్యకీ మధ్యన విరామంలో పనిచేసే ఒక అప్రధాన పాత్ర ధారి మాత్రమే అది

మనస్సు చేయగల ఏ పనీకూడా అది నిష్క్రియగా ఉన్నప్పుడు గానీ, ఆలోచనా రహిత స్థితిలోగానీ జరిగే పనికంటే గొప్పగా ఉండదు.

మనస్సు నిశ్చలంగా ఉన్నప్పుడు సత్యానికి బయల్పడే అవకాశం దొరుకుతుంది.

మనస్సుతో ఆలోచించి సత్యాన్ని తెలుసుకోలేరు. కేవలం సత్యంతో తాదాత్మ్యం తోనూ, నిశ్శబ్ద దర్శనంతోనూ దానిని పొందవచ్చు. శాశ్వత దిగంతాల నిశ్శబ్దనీరవ కాంతులలో సత్యం కాపురముంటుంది. తర్క వితర్క చర్చల రణగొణ ధ్వనుల మధ్యకి ఆమె అసలు రాదు.

మనస్సులో ఆలోచన అనేది సత్యానికి పారదర్శకత కలిగిన ఒక కాంతివంత ఆచ్ఛాదన కావచ్చు గానీ అది దాని దేహంకాదు. కాబట్టి దాని వైపు చూడకుండా ఆ ఆచ్ఛాదన లోనుంచి లోపలికి దృష్టి సారిస్తే దాని ఆకృతి కొద్దిగా నీకు కనిపించ వచ్చు. అక్కడ సత్యంయొక్క ఆలోచనారూపం ఉండవచ్చు. అయితే అది దివ్య తేజస్సు నుంచి మంచి కూర్పుతో వెలువడ్డ అతిమానస భావన. ఇంకా అతి మానస వాచకమైనా కావచ్చు కానీ మనసు అతి భారంతో ప్రతిరూపంగా తయారు చేసే అతుకుల బొంత మాత్రం కాదు. అతి మానసభావన సత్యాన్ని తెలుసుకొనే మార్గం కాదు గానీ దాన్ని వ్యక్తపరిచే ఒక విధానం. ఎందువల్లనంటే అతిమానసంలో సత్యం స్వయం కృతమై, స్వీయఅస్తిత్వంతో ఉంటుంది. అది దివ్యతేజస్సు సంధించిన బాణమే కానీ సత్యాన్ని చేరగల వారధి కాదు.

ఆలోచనలనుంచీ, మాటలనుంచీ పూర్తిగా విరమించు. లోపల నిశ్చలంగా ఉండి పైనున్న కాంతివైపుకీ, చుట్టూరావున్న సువిశాల విశ్వచైతన్యం లోకీ దృష్టి సారించు. ఆ విశాలత్వంతోనూ, కాంతితోనూ ఏకీభవించు. అప్పుడు ఆ పరమ సత్యం పైనుంచి నీకు దర్శన మిచ్చి అన్ని వైపులనుంచీ నీలోకి ప్రసరిస్తుంది.

అయితే మనస్సు నిశ్శబ్దతతోబాటు అంతకుమించి స్వచ్ఛత ఉన్నప్పుడే అది సాధ్యమవుతుంది. మనసు అశుచిగా ఉన్నట్లైతే అందులోని నిశ్శబ్దంలో తప్పుడు సంకేతాలిచ్చే కాంతి ప్రసారాలు, అక్కర్లేని కంఠధ్వనులు వచ్చి చేరతాయి. అంతేకాకుండా తన స్వంత వ్యర్థమైన అభిప్రాయాలను, దర్పాలను ఘనతరం చేసుకోవాలనే ఆరాటం, తనలో దాగిఉన్న అతిశయం, ఆడంబరం, కాంక్ష, కామం, పేరాశ, అభిలాషల స్పందనలతో అది హోరెత్తుతుంది. ఇంకా అక్కడ దైవంమాట కంటే భూత పిశాచాల మాటలే ఎక్కువవుతాయి.

నిశ్శబ్దం అత్యావశ్యకమే కాని దానితోబాటు వైశాల్యం కూడా ఉండాలి. మనస్సు నిశ్శబ్దంగా లేనప్పుడు పరమసత్యపు కాంతులను, కంఠధ్వనులను గ్రహించుకోలేదు, ఒకవేళ అందుకుంటే వాటిని తన దుందుడుకు భాషతోను, టక్కుటమారాల తోనూ

కలగాపులగం చేసేస్తుంది. అది చలాకీతనంతో, దర్పంతో, రణగొణతో అక్కడ గ్రహించినదాన్ని వక్రీకరిస్తుంది. అది మంచి విశాలంగా లేకపోతే సత్యంతో వచ్చే ఎంతో ప్రభావవంతమైన శక్తినీ, దాని సృజనాత్మక సామర్థ్యాన్ని ఇముడ్చుకోలేదు. అక్కడ కొంతకాంతి పనిచేయవచ్చు. కాని అది అక్కడ సంకుచితమై, పరిమితమై, పనికిరాకుండాపోవచ్చు. లేదా క్రిందకు వస్తున్న శక్తి అక్కడే చిక్కుపడి, భంగపడి ఆ ప్రతికూల విదేశంనుంచి వెనక్కి తిరిగి తన సువిశాల మహోన్నత స్వస్థలానికి వెళ్ళిపోవచ్చు. ఒకవేళ ఏదైనా దిగివచ్చి ఇక్కడ ఉండిపోయినా అది బురదలో పడ్డ ముత్యం మాదిరి ఉండిపోతుంది తప్ప స్వభావంలో ఏ విధమైన మార్పూ రాదు. ఏదో కొద్ది తీవ్రత ఏర్పడి అది పరమ సత్యం దిశగా వెలుగు చిమ్మినా అది చాలా తక్కువ కాలమే నిలుస్తుంది. అతి తక్కువగా తన చుట్టు ఉన్న ప్రపంచంపై వెదజల్లుతుంది.

శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతీ, అమరవాది వెంకటరామశాస్త్రి

ప్రతి ఒక్కరు తమ మూల సత్యాన్ని తమలోనే కలిగి వుంటారు.

కొంతకాలం క్రిందట ఏదో నన్నడిగారు. దానికి నేను యిప్పటికీ జవాబు చెప్పలేదు. అది యిదే. నేను ఎక్కడో వ్రాసాను.

"ప్రతి మనిషి యొక్క శుద్ధాత్మ దైవంతో దానికి మాత్రమే ప్రత్యేకమైన నిరుపమాన సంబంధం కలిగి వుంటుంది. అది దైవాన్ని తన దైవశైలిలో అభివ్యక్తం చేయడంలో ప్రకటితమవుతుంది."

దానినే యిక్కడ భారతదేశంలో జీవియొక్క వాస్తవికత లేదా జీవియొక్క న్యాయం, జీవియొక్క ధర్మం, అంటారు. అదే వ్యక్తిత్వంయొక్క కేంద్ర బిందువు, దాని మూలకారణం.

ప్రతి ఒక్కరూ తమ మూలసత్యాన్ని తాము కలిగి వుంటారు. ఆసత్యమన్నది నిరుపమానమైనది. అది దానిని కలిగి వున్న వారి స్వంతం. దానిని వారు తమ జీవితంలో వ్యక్తం చేస్తారు.

ఇప్పుడు, ఆ సత్యం అనేది ఏమిటి? అన్నది ప్రశ్న. అదే నన్నడిగిన ప్రశ్న.

"జీవియొక్క ఈ సత్యం ఏమిటి? అది ఎలా భౌతికజీవితంలో బాహ్యంగా వ్యక్తమవుతుంది?"

అది ఈ పద్ధతిలో వ్యక్తమవుతుంది. ప్రతి ఒక్క జీవి ప్రత్యక్షంగా, ఆ సర్వేశ్వరుడితో లేదా ఆ మూలవిరాట్టుతో సర్వసృష్టికి అతీతమైనదేదో, దానితో ఒక అసాధారణ సంబంధాన్ని కలిగి వుంటుంది. ఈ అసాధారణ సంబంధం వ్యక్తి జీవితంలో అభివ్యక్త మవ్వాలి. అందువలన ప్రతి ఒక్కరు దైవంతో ఒక ప్రత్యక్ష ప్రత్యేక సంబంధం కలిగి వుంటారు. ఆ విధంగా మీరు దైవం నుండి స్వీకరించగలుగుతారు. ఎప్పుడైతే మీరు ఆ స్వీకరణ స్థితిలో వుంటారో అప్పుడు ఆ సంబంధం యావత్తూ మీరు పొందగలగడం సాధ్యమవుతుంది. ఇది ఒకరితో భాగం పంచుకోవడం గాని, ఒక పునరావృతం కాని కాదు. అది ఒక నిరుపమానమైన ప్రత్యేక సంబంధం. ప్రతి ఒక్కరు దైవంతో ఇలాంటి సంబంధం ఏర్పరచుకోవచ్చు. అందుచేత మనస్తత్వశాస్త్రి దృష్టిలో ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యక్ష సంబంధం కలిగివుండే విధానంలో ఎవరికి వారు ఏకాకులే అని చెప్పవచ్చు.

ఆ సర్వేశ్వరుడితో సంబంధం విషయంలో ప్రతి ఒక్కరూ ఒంటరివారే.

భగవంతుడితో వ్యక్తి సంబంధం ఒకేలా వుండదు. ఇంకొకరితో సరిసమానంగా అసలే వుండదు. ఏ ఇద్దరూ ఒక్కలా వుండరు. అందుచేత నీనుండి తీసుకుని యింకొకరికివ్వ గలిగేది, నీ నుండి విడిపించి ఇంకొకరి కప్పగించేది ఏదీ వుండదు. సృష్టినుండి ఈ సంబంధం గాని మాయమయితే, సృష్టే మాయం అయిపోతుంది. అది అసంభవం.

దీని భావం ఒక వ్యక్తి తన జీవియొక్క సత్యంలో జీవించగలిగితే, వాడు సృష్టిలో అత్యావశ్యకమయిన భాగమవుతాడు. సహజంగా వ్యక్తి దేనినైతే నమ్ముతాడో దానినను సరించే జీవించాలని నా భావం కాదు. తన జీవ సత్యంతో తాను జీవించగలిగినట్లయితే, ఒక అభివృద్ధి వలన అతడు ఆ సత్యంతో సంపర్కంలోకి ప్రవేశించగలిగిన శక్తివంతుడవుతాడు. తక్షణం అతడికి నిరుపమానమైన ప్రత్యేక సంబంధం దైవంతో ఏర్పడుతుంది. దానికి సమానమైనదేదీలేదు. అదీ విషయం.

సహజంగానే, అది మీ జీవసత్యం గనుక అదే జీవితంలో ప్రకటితం కావాలి.

*

ప్రశ్న: వస్తువులలో సత్యాన్ని ఎవరైనా కనిపెట్టినట్లయితే దానర్థం వారు దైవాన్ని కనుక్కున్నట్లేనా?

తప్పకుండా. ప్రతి దాంట్లోనూ, అదేదైనా సరే. అదొక్కటే మార్గం. శాశ్వత సత్యాన్ని తనలో భరించని వస్తువంటూ ఏదీ లేదీ సృష్టిలో. అలా కానట్టయితే మన సత్యాన్ని తనలో కలిగి వుండకపోతే యీ ప్రపంచం మొత్తం, క్షణంలో వెయ్యోవంతైనా మనలేదు.

ఒక అసాధారణ విషయమేమిటంటే. మీరు చిత్తశుద్ధి కలిగినవారయితే, విషయాలు అలా ఎందుకున్నాయో, తెలుసుకుంటారు. ఆ హేతువు, ఆ మూలం, ఆ విధాన క్రమం యివన్నీ అలా ఎలా వున్నాయో, తెలుసుకోగలరు. కారణం, అది అంతా ఒక్కటే కాబట్టి. సత్యం అని మనం అనేది ఒకటి ఉంది. ప్రతి వస్తువుకీ అదే మూలాధారం. ఎందుకంటే ఇది గానీ అక్కడ లేకపోతే, అక్కడ ఏమీ ఉండదు. ఒక్కసారి మీరీ సత్యాన్ని తెలుసుకుంటే మీరా మూలాధారాన్ని తెలుసుకుంటారు. కార్యకారణ సంబందాన్ని తెలుసుకోగలుగుతారు. అది అలా ఎలా వుంది, ఎందుకుంది, దాన్ని మార్చే మార్గం ఏది? యివన్నీ తెలుసుకుంటారు. మీరు దైవసంపర్కంలో వున్నట్లయితే, ప్రపంచంలో ప్రతివస్తువు యొక్క పరిజ్ఞానపు తాళంచెవి మీ దగ్గర ఉన్నట్లే. ఎలా, ఎందుకు, అది మారే విధాన క్రమం యివన్నీ తెలుసుకోగలుగుతారు.

చెయ్యవలసినపని ఏదో కొంతవుంది. అది చెయ్యడానికి చాలా ఆసక్తికరంగా వుంటుంది. ఒక చిన్న పదార్థపు ముద్ద (లావాలాంటిది) నీవుగా తయారవుతుంది. నీలాగే తయారయిన రూపాల ప్రతినిధివి నువ్వు. ఆంతర్యం లోకి ప్రవేశించు. ఆ రహస్యంయొక్క తాళంచెవి కనుక్కో. అలా ఆంతర్యంలోకి పోతేకాని నువ్వు చెప్పలేవు. "అది నాకతీతమైనది. అది నాకు చాలా పెద్దది." నీలో వున్న నీ సూక్ష్మ దేహంలోకి పో. నీలోవున్న అన్ని ద్వారాలు తెరిచే తాళంచేవి నువ్వు కనుక్కొంటావు.

*

నువ్వొక సామాన్యవ్యక్తివైతే సరే. నువ్వు అన్నీ సమకూర్చుకొని శ్రమపడి ఆ పద్ధతి తెలుసుకుంటావు. నీ ఎదగగలిగే సామర్థ్యం అపరిమితమైనది.

ప్రతీవారూ ఏదో వొక రకానికి చెందిన వారన్నది సాధారణ భావన. ఉదాహరణకు పైన్ వృక్షం ఒక ఓక్ చెట్టు కాలేదు. తాటి చెట్టు గోధుమ మొక్క కాలేదు. ఇది జగమెరిగిన సత్యం. అది వేరే విషయం. నీలో వున్న జీవసత్యం నీ పక్కన ఉన్నవాడిలో

వున్న జీవసత్యం ఒకటి కావు. కానీ నీ జీవసత్యంలో స్వయంగా నీ శరీరనిర్మాణానికి అణుగుణంగా నీ పురోగతి దాదాపు అపరిమితం. నీ స్వంత నిర్ణయాలు నమ్మకాలు నీ పురోగతి పరిమితమైనదని సూచించుట వలన అది పరిమితమైపోతుంది. అసలైన ప్రక్రియగురించి నీకు అవగాహన లేనంధువలన అది పరిమితమైపోతున్నదా, అలా కానట్లయితే....

ఏది ఎలా చెయ్యాలో తెలిసినట్లయితే, మనిషి చేయలేనిదంటూ ఏదీ ఉండదు.

శ్రీమాత

అనువాదం: ఎన్. విజయలక్ష్మి

మౌలిక సత్యం

ప్రపంచం పదార్థరూపం. దైవం యదార్థ సత్యం. పదార్థరూపంలో యదార్థరూపాన్ని చూడాలి.

అంతా భగవన్మయమే. అంతా ఆత్మ స్వరూపమే. అంతటా భగవంతుని ఉనికే. అంతా బ్రహ్మమే. ఏకమేవ ద్వితీయం — ఆ ఒక్కటీ తప్ప వేరొకటిలేదు. దానికి వ్యతిరేకమైనది మరొకటి లేదు. మరేదీ ఉండబోదు. ప్రకృతి దివ్య చైతన్యశక్తి తప్ప వేరుకాదు. సమస్త జీవకోటి ఆ దివ్యపురుషుడి లోపల, వెలుపల పరివ్యాపించి యున్నదే. అన్నీ అంతఃకరణ ప్రతిరూపాలే. ఆతని వాస్తవిక ఆత్మ స్వరూపాలే, ఆతని భౌతికాకృతులే. అవన్నీ ఆ దివ్యచైతన్యశక్తి లో అంతర్భాగాలే. ఆ శక్తినుండి ఆవిర్భవించినవే. దివ్యసత్తా ఎలాగైతే ఒక పరిమితికి కట్టుబడలేదో, ఈ సృష్టికూడా అంతే. మనం నివశిస్తున్న ఈ విశాల విశ్వంలో ఎటుచూసినా, ఎలా చూసినా ఆ అనంతత్వ స్థితి తప్ప వేరొకటి కానరాదు. దివ్యసత్తా ఒక ఆకృతిని ధరించలేదు. దానికి పదార్థరూపంతో గాని, మనోరూప కల్పనతోగాని సంబంధంలేదు.ఒక పరిమిత ప్రకృతినిగాని లేక భౌతికాకృతినిగాని ధరించుటకు మొగ్గు చూపదు. మన చుట్టూ వ్యాపించియున్న స్థితి అంతా అలాంటిదే తప్ప వేరుకాదు. ఈ ప్రపంచపు ఉనికి ఆ స్థితి గతులపైనే ఆధారపడి ఉంది. ప్రపంచం ఒక సూత్రబద్ధమైన యాంత్రిక వ్యవస్థ. దాని శక్తి చాలవలోగాని లేక దాని బౌద్ధిక మరియు భౌతిక పరివర్తనలో గాని జోక్యం చేసుకునేందు దానికి అంతరాత్మగాని, ఆత్మశక్తి గాని లేవు. ఒక నిరపేక్ష

వైఖరిగల మౌలిక దైవశక్తి దానికి వెలుపలనో లేక ఊర్ధ్వభాగంలోనో నిర్లిప్తంగా మాత్రమున్నది. అందుకు విరుద్ధంగా ఈ సమస్త సృష్టితోపాటు దాని యందలి ప్రతి అణువణువు ఆ దివ్యశక్తి యొక్క క్రియాశీల విన్యాసమే. సృష్టి లోని ప్రతి ఒక్క కదలికను నిర్ణయించేది, నియంత్రించేది, దాని ప్రతివ్యవస్థయందు పరిఢవిల్లేది, దానిలోని ప్రతిజీవియొక్క ఆంతరాత్మను మనస్సును తన ఆధీనమునందుంచుకునేది ఆ దివ్యశక్తియే. సర్వము దైవాధీనం. ఆతనిలోనే దాని పరిభ్రమణం. ఆతనిలోనే దాని అస్తిత్వం. ఆతడు సర్వాంతర్యామి. సర్వము ఆతని క్రీడాస్థలియే. సర్వత్రా ఆతని ఉనికి ప్రకటితమే. ప్రతి జీవి ఆ నారాయణుడి ప్రచ్ఛన్న ప్రతిరూపమే.

పుట్టుకయేలేని దానికి పుట్టుట ఉండదు. అలాగే జీవులంతా, విడివిడిగా పుట్టుకలేని జీవాత్మలు. వాటికి పుట్టుట గిట్టుట ఉండదు. శాశ్వతులు. అయితే, అస్తిత్వమూలం లోను, సార్వత్రికతలోను పుట్టుకలేని ఆత్మ స్వరూపులు. పుట్టుట గిట్టుట ఉన్నా, అది కేవలం రూపు రేఖల మార్పే. సమగ్రమైనది మాత్రమే అసమగ్రతను అంచనా వేయగలదు. అదే సృష్టిలోని అసాధారణ విషయం. అయితే, ఆ అసమగ్రత మనం ఊహించుకునే వస్తువు లేక విషయం యొక్క భౌతిక లేక మానసిక ఆకార ఆచరణలలో ప్రస్ఫుట మౌతుంది. ఎలాగైతే సర్వాన్ని ప్రకాశింపజేసే సూర్యుడి వెలుగులో గాని, ప్రసరణలోగాని దోషం ఉండదో అలాగే ఏది ఊహిస్తుందో దానిలో స్వతహాగా దోషం ఉండదు. ఉన్న దోషమంతా వీక్షించే ఆ ప్రత్యేక అవయవానిదే. భగవంతుడు ప్రపంచాన్ని ఒక సుదూర స్వర్గం నుండి పాలించడు. అతని సన్నిహిత సర్వజ్ఞత ఆ పని నెరవేరుస్తుంది. ఎంతటి అల్పకార్యమైనా అది అనంతమైన దివ్యశక్తి ప్రచోదితమే తప్ప తనకు తానుగా సమకూరిన పరిమితశక్తి నిర్వర్తించేది కాదు. సంకల్ప జనితమైన విషయ పరిజ్ఞానముతో కూడిన ప్రతిచర్యలో కూడ అనంతమైన సార్వత్రిక సంకల్ప పరిజ్ఞానాలను కనుగొనవచ్చు. దైవపాలన ప్రచ్ఛన్నంగా కొనసాగే చర్య కాదు. పరాయి సర్కారు పెత్తనంలాంటిది కాదు. అతడు సర్వాన్ని పరిపాలిస్తాడు. కారణం అతడు సర్వశ్రేష్టుడే కాక చరాచరసృష్టి కార్యకలాపాలలో, వాటి మూలాలలో ఆతని ఉనికి సుస్పష్టము గనుక, వాటి సమగ్ర శక్తికి ఆతడే ఆధారభూతుడు గనుక.

*

వేదాంతసారంలో ఆద్యసూత్రాలైన "ఓం తత్ సత్," "సర్వం ఖల్విదం బ్రహ్మ," నుండే ప్రారంభించాలి. ఆ విధంగా అన్నింటిలోకి మౌలిక సత్యమైన దానిని గమనించ

గలుగుతాము. మరికొంత విచారణతో మనకు తెలియవచ్చేది ఏమిటనగా ఆ మౌలిక సత్యం మనకు నిజంగా సవ్యంగా అర్థమైనప్పుడు తక్షణం మిగిలిన వన్నీ బహుశా తమకై తాము సక్రమంగా తేటతెల్లమౌతాయి. "తస్మిన్ విజ్ఞతే సర్వం విజ్ఞాతం"; అనగా అది తెలిసనప్పుడు సర్వం తెలిసినట్లే.

శ్రీ అరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి.

ఆలోచన సత్యం — జ్ఞానంయొక్క సాపేక్షత

చూడండి. ఆలోచన అనేది ఒక విషయాన్ని ఇలా వుంటుంది అని అంచనా వేస్తుంది. కాని అది సత్యానికి చాలా దూరం... అది కేవలం అస్పష్టమైనది. అసంపూర్ణమైనది. ఎటూ తేల్చుకోలేని భావ ప్రతిరూపం, తప్పులతడక. ఎంత బాగున్నా, సరే అదంతే. కాబట్టి నిజానికి అది క్రియాశీలకంగా నుండవలసిన ఘడియ. నీకు నువ్వు యిలా "నా పురోభివృద్ధికి తోడ్పడినట్లయితే ఈ ఆలోచను ఆచరణలో పెడతాను" అని నీకు నీవు చెప్పుకోవాలి.. కాని అది శుద్ధమైన సత్యంగా నీవు అనుకున్నట్లయితే, ఖచ్చితంగా నీవు తప్పుదారి పట్టినట్టే. శుద్ధవాస్తవికత అనేది ఏ ఒక్క ఆలోచనలోను వుండదు. శ్రీ అరవిందుల సూక్ష్మ భావరూపాలలో అత్యద్భుతమైనది, "ఆలోచన కాని, మాటకాని శాశ్వత సత్యాన్ని పట్టుకోలేవు", అన్నది. అందులో ఆయన చెప్తారు, ఏ ప్రబోధమైనా, అదెంత గొప్పదయినా, ఎంత స్వచ్ఛమయినదయినా, ఉత్తమమైన దైనా, సవ్య మైనదైనా అసలు సత్యంయొక్క ఒక కోణమేకాని అసలు సత్యం కాదు. అది సంపూర్ణ సత్యం కాదు. నీ ఆలోచన ఏదైనా కానీ, అది అత్యంత ఉత్తమమైనదైనా, అత్యంత వాస్తవమైనదైనా, అత్యంత స్వచ్ఛమైనదైనా, అత్యంత ఉన్నతమైనదైనా, ఎంత నిజమైనదైనా కేవలం అది అసలు సత్యంలో ఒక అత్యంత సూక్ష్మాతిసూక్ష్మ మైన భాగం. కాబట్టి అదే మాత్రం సత్యం కాదు. అందుచేత ఆ పరిజ్ఞాన క్షేత్రంలో మనిషి ఆచరణాత్మకంగా వుండాలి. నేను చెప్పినట్లు మీరు సత్యంగా భావించినది దానిని మీ పురోగతికి సహాయపడుతుందనుకున్నదానిని ఆ సమయానికి ఆ ఆలోచనను పాటించండి. కొన్ని సార్లు అది ప్రకాశమానంగా వస్తుంది. నీ ప్రగతికి సాయపడుతుంది. అది నీ ప్రగతికి ఎంతకాలం పనిచేస్తుందో, అంతకాలం వుంచుకో, అది ఎప్పుడు

మాసిపోవడం మొదలవుతుందో అది నీకేమాత్రం సహాయపడదో అప్పుడు దాన్ని విడిచిపెట్టు. నిన్ను కాస్త ముందుకు తీసుకుపోగలిగే మరి దేన్నయినా పొందడానికి ప్రయత్నించు. మనుషులు జ్ఞానం యొక్క సాపేక్షసంబంధాన్ని అర్థం చేసుకున్నట్లయితే చాలావరకు ఆపదలు, దురదృష్టాలు మాయమయిపోతాయి — విశ్వాసం యొక్క సాపేక్షసంబంధం, బోధనలయొక్క సాపేక్ష సంబంధం, పరిస్థితులయొక్క సాపేక్ష సంబంధం కూడా. ఎంతవరకు ఈ సాపేక్షసంబంధం ప్రధానమైనది? ప్రస్తుతానికి అది ప్రధానమైనదికావచ్చు. నీ జీవితాన్ని బ్రతికించవచ్చు, చంపవచ్చు. నేను భౌతిక జీవితం గురించి మాట్లాడటం లేదు. ఆత్మశక్తిని గురించి మాట్లాడుతున్నాను. కాని అది ఆ క్షణానికి మాత్రమే. నువ్వు ఒకానొక ప్రగతి సాధించావు. తరువాత కొంత పెద్దవాడివయిన తరువాత ఆధ్యాత్మిక దృక్పథంలో ఈ విషయం మీద వెనక్కి తిరిగి ఆలోచిస్తే ఈ పరిస్థితి లేక ఈ భావన బహుశా నీ జీవితాన్ని నిర్ణయించినది, ఎంతో సాపేక్షంగా కనిపిస్తుంది. అదేమాత్రం గుర్తించవలసిన విషయంగా నీ కనిపించదు. నువ్వు కొత్త ప్రగతి సాధించడానికి అంతకంటె ఉన్నతమైనదేదో అవసరమవుతుంది.

ఇది మనిషి యెల్లప్పుడూ గుర్తు పెట్టుకున్నట్లయితే, యీ మితిమీరిన వర్గ భేదాలు, మితిమీరిన అసహనం, ఈ తగవులు, కలహాలు అన్నీ ఆ క్షణంలో మానుకుంటారు. ఎందుచేతనంటే, ఒక కలహం అంటే యిదే. ఒక విషయాన్ని ఒకరు ఒకలా అనుకుంటే మరొకరు అదే విషయాన్ని మరొకలా అనుకుంటారు. అంటే ఒకరి దృక్పథం ఒక టయితే మరొకరిది మరొకటి. ఇద్దరూ ఒక అవగాహనకి రావడానికి ప్రయత్నించడం లేదా ఎలా సామరస్యాన్ని సాధించగలరో ఆలోచించడానికి బదులు ఒకరిమీదికి మరొకరు ఉసిగొల్పడం, ముష్టి యుద్ధాలకి దిగడం తప్ప వేరొకటి వుండదు.

కాని, మీకు సంపూర్ణ సాపేక్ష సంబంధం విషయంలో అవగాహన కలగాలి. మీ ఆలోచన ఏది మంచిదో దానిని గురించి నిశ్చితాభిప్రాయం, అది ప్రపంచ పోకడలలో ఎంతవరకు సాపేక్ష సంబంధం కలిగి వుందో అర్థం చేసుకోవాలి.అప్పుడు మీ ప్రతిస్పందనలో దుర్మార్గం తక్కువగా, సహనం ఎక్కువగా వున్నవారుగా వుంటారు. అదే కావలసినది.

శ్రీమాత

అనువాదం: నడిమింటి లక్ష్మి

ఇతరులను అర్థం చేసుకోవడం — అతీంద్రియచేతన

ప్రశ్న: ఒకరు ఇతరులతో మాట్లాడినపుడు పరస్పరాంగీకారానికి రావడం అరుదు,కారణం. అందరూ ఒకే కోణంలో విషయాన్ని గమనించరు గనుక. లేదా నేను ఇతరుల దృష్టి కోణాన్ని చూడగలిగినా, దానిని నేను అంగీకరించలేను.

దాని అర్థం నీలో మృదుత్వం లేదన్నమాట. ఒకవ్యక్తి విసుగు పుట్టిస్తున్నాడని నీవు నిర్ధారణకువస్తే, నీవు కూడా పరమ బోరువని అతను కూడా తప్పక అనుకుంటాడు. ఇతరుల స్థానంలో వుండి అర్థం చేసుకోవాలనే అభిప్రాయం నీకు కలుగనంతకాలం, నీవు దేనిని సరిగ్గా అర్థం చేసుకోలేవు. కాబట్టి ఇది తప్పనిసరి. నీకు అర్థంకాని విషయాన్ని పరులు నీకు చెబుతున్నప్పుడు అతనికే యివి తెలియదు. అని నీవు అనుకోకూడదు. అయితే అర్థం చేసుకోవడానికి నీవు ప్రయత్నించాలి. ఒక పిల్లవాడు సైతం వచ్చి, నీకు అర్థం కాని దానిని చెప్పినప్పుడు కూడా నీవు నిజాయితీగా వ్యవహరించాలితప్ప ఆ బిడ్డ మూర్ఖుడని అనుకోరాదు. అయితే, "నేను మందమతిని కనుక నాకది అర్థంకాలేదు", అని నీవు భావించాలి.

ఒక సమస్యను అర్థం చేసుకోవడానికి అనేక మార్గాలు ఉంటాయి. అయితే నీవు పరిష్కారం కనుగొనాలనుకున్నప్పుడు అన్ని విషయాల్ని ఒకదాని తరువాత ఒకదానిని పరిగణలోనికి తీసుకొని వాటన్నింటిని విహంగ వీక్షణంగా పరిశీలించి వాటిమధ్య ఉన్న పొందికను గమనించ గలగాలి.

అతీంద్రియమనే ఒక చేతనాస్థితి ఉంది. దాని ద్వారా ఉన్నత చైతన్యం కలిగిన వ్యక్తులు వ్యక్తీకరించిన ఆయా సిద్ధాంతాలు, ఆయా విశ్వాసాలు, ఆయా భావాలు, అలాగే పరస్పర వైరుధ్యంగల బౌద్ధ, వేదాంత, క్రైస్తవ సిద్ధాంతాలు, సమస్త తాత్విక సిద్ధాంతాలు, సత్యంయొక్క ఒక చిన్న మూలాన్ని అందుకోగలిగిన మానవనైజం యొక్క అన్ని భావాలు సైతం, ఒకే సమయంలో నీవు చూడగలగాలి. ఆ స్థితిలో ప్రతి విషయాన్ని దాని స్థానంలో దానిని నీవు ఉంచడమే కాకుండా అవన్నీ ఎంత అద్భుత వాస్తవాలో గమనించ గలుగుతావు. విషయం ఏదైనప్పటికీ దాన్ని అర్థం చేసుకోవడంలోని వాటి అవసరాన్ని నీవు తెలుసుకుంటావు. ఒక చైతన్యస్థితి ఉంది. ఓ! నీకు అర్థంకాని విషయాలను చెప్పడానికి నేను ప్రయత్నిస్తున్నాను. సరే, ఒక చిన్న ఉదాహరణ చెబుతాను.

"ప్రపంచాభివృద్ధికై జనం ప్రయత్నించనంతకాలం అంతా సాఫీగా సాగిపోయింది. అందరూ సంతృప్తిగా ఉన్నారు. తనని సరిచేసుకోవడం లేదా ప్రపంచాన్ని మార్చడం అనే చింతనే లేదు. అపుడు అంతా సాఫీగానే సాగిపోయింది. అయితే ఇతరులను అభివృద్ధి పరచాలని కోరడం ఒక తెలివి మాలిన పని. వారికి ఇష్టమైనట్లు ఉండనివ్వడం తప్ప దేనికీ వాళ్ళను ఇబ్బంది పెట్టకూడదు. ఇది అత్యంత తెలివైన పని", అని ఎనాటోల్ ఫ్రాన్స్ తన గ్రంథం ఒకదానిలో చెప్పాడు. దానికి విరుద్ధంగా కొందరు ఇలా అంటారు. "అందరూ తెల్సుకోవలసిన సత్యం ఒకటుంది. ప్రపంచం అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతుంది. ఎంతటి మూల్యం చెల్లించైనా, ఎన్ని కష్టాలకోర్చియైనా అజ్ఞానం నుండి బయటపడేసేందుకు మనిషిని చైతన్య వంతంచేయాలి." అయితే ఒక చేతనా స్థాయిలో, ఆ రెండు విధాలుగా చూడటం కూడా సరైనదేనని చెప్పగలను. సహజంగా రెండు పద్ధతులను మాత్రమే తీసుకున్న ప్పుడు విషయాన్ని అర్థం చేసుకోవడం నీకు కష్టమౌతుంది. మానవ మేధ దర్శించిన సత్యాన్ని అన్ని కోణాలనుండి ఏకకాలంలోనే చూడగలగాలి. అంతకు మించి కూడా పరిశీలించాలి. అప్పుడు ఆ స్థాయిలో ఏదీ పూర్తిగా అసత్యం కాదు, చెడ్డదికాదు. ఆ స్థాయిలో మాత్రమే సమస్యలనుండి, బాధలనుండి, కొట్లాటలనుండి మనిషి స్వేచ్ఛను పొందుతాడు. అప్పుడు ఆవిష్కరింపబడిన సమత నీకు అద్భుతమైనదిగా గోచరిస్తుంది.

అయితే ఈ స్థితిని నీవు మానసికంగా అనుకరించ ప్రయత్నించినపుడు — నీకు అర్థమౌతుందా! మానసిక అనుకరణ గావిస్తే నీవు తప్పకుండా తెలివిమాలిన పనులు చేస్తావు. మస్తిష్కం అల్లకల్లోలంగా నుండి, అత్యంత వైరుధ్య భావాలను తెలియకుండానే వ్యక్తపరిచేవారిలో నీవూ ఒకడివి అవుతావు.

ఆ స్థాయిలో ఏ వైరుధ్యం లేదు. విశ్వం ఎలా, ఎందుకు ఏర్పడిందనే విషయాలపై పూర్తి జ్ఞానంతో ఒకరు చెప్పిన అన్ని సంపూర్ణ సత్యాలను (పరిపూర్ణ సత్యావిష్కరణ చేయుటకు సరిపోని) అర్థం చేసుకోగలది మనిషి యొక్క పరిపూర్ణత మాత్రమే. అయితే నీకు చెప్పేదొకటే. స్వీయ సాధనతో మాత్రమే మనిషి ఈ స్థాయిని చేరలేడు. అందుకోవాలనే ప్రయత్నం చేసి అందుకోలేడు. మనః పూర్వకంగా నీవు నీకుగా ఎదగాలి. అది సంపూర్ణ మానసిక సద్భావనకు పరాకాష్ఠ. అప్పుడు నీకు ఏ పక్షపాతం ఉండదు. ఏ అభిమానం ఉండదు. ఒక ఆలోచనకు కట్టుబడుట ఉండదు.

సత్యాన్వేషణకై ప్రయత్నించాలనే ఉబలాట ఉండదు. దివ్యతేజోవలయంలో నిలుస్తావు. అంతే.

*

నీతి మరియు సత్యం:

అప్పుడప్పుడు నైతిక భావాలుసైతం మిశ్రితమై వివేచనాజ్ఞానాన్ని కలుషితం చేస్తాయి. ఆ నైతిక భావాలను మననుంచి దూరం చేయాలి. కారణము, నీతికి పరమసత్యానికి మధ్య చాలా దూరం ఉంది. (ఇలా అని నేను ఎవరినైనా భయపెడితే క్షమించాలి. కాని, విషయమలాగే వుంటుంది.) సమస్త ఆకర్షణవికర్షణలను జయించి నపుడే, నీకు సరైన వివేచనాశక్తి కలుగుతుంది. నిన్ను ఆకర్షించే విషయాలు, విముఖత కలిగించే విషయాలు ఉన్నంత వరకు, నీ జ్ఞానేంద్రియాలు పరిపూర్ణంగా నిశ్చయంగా వర్తించలేవు.

శ్రీమాత

అనువాదం: బాష

మనస్సు — సత్య దార్శనికత

"మనిషిలో పరస్పర సంబంధం గల రెండు సామ్య శక్తులు నెలవై ఉంటాయి. ఒకటి పరిజ్ఞానం.మరొకటి ప్రజ్ఞానం. పరిజ్ఞానం మానవ మేధకు సంబంధించినది. అది వక్రీభవించబడిన మాధ్యమంలో మనస్సు తడుముకుంటూ చూచినపుడు సత్యమెంత మేరకు గోచరిస్తుందో. అది పరిజ్ఞానం. ప్రజ్ఞానం ఆత్మ సంబంధమైనది. దైవీయదృష్టితో గోచరించేది ప్రజ్ఞానం."

థాట్స్ మరియు అఫోరిజమ్స్, శ్రీఅరవిందులు

శ్రీఅరవిందులు ఈ ఉభయశక్తుల గురించి అర్థం చేసుకో గలవారికి సుస్పష్టంగా వివరించారు. ఒకటి మేధా సంబంధి అని, మరొకటి ఆత్మ సంబంధి అని. ఈ మహా సత్యాన్నే వారు తమ మహితోక్తులద్వారా, సత్యసూక్తుల ద్వారా తేటతెల్లం చేయదల చారు. ఆత్మ గతమైన ఈ శక్తిని మానవమేధ పొందాలని ప్రయత్నిస్తే అది అసాధ్యమే అవుతుంది. కారణం ప్రజ్ఞాన శక్తి ఆత్మకు చెందినది. మానవ అస్తిత్వంలో నుండి

అది ఆధ్యాత్మిక చైతన్యంతోపాటు పైకి లేస్తుంది.

పరిజ్ఞానం మానసిక పార్శ్వానికి చెందినది కావడం వల్ల అది నిజమైన జ్ఞానం కాదు. దాన్ని ప్రయత్నించి ప్రయాసపడి పొందవచ్చును. ప్రజ్ఞానం మనసుకు సంబంధించినది ఎంతమాత్రం కానందువల్ల మనస్సు దానిని పొందజాలదు. నిజానికి ప్రజ్ఞానం గూర్చిన జ్ఞానం మేధస్సుకు ఏమాత్రం లేదు. అందుకే నేను పునరుక్తం చేస్తున్నాను. ప్రజ్ఞానం కేవలం ఒక ఆత్మిక శక్తి. అది ఆధ్యాత్మిక చైతన్యం చేతనే జాగృతం కాగలదు.

ఇంతకూ ఈ "వక్రీభవించబడిన మాధ్యమం" అంటే ఏమిటి? ఈ మాధ్యమంలో సత్యం ఏమవుతుంది?

ఎప్పటిలాగే శ్రీఅరవిందులు ప్రవచించే వాటిలోని అర్థం బహుళ స్థాయిలలో ఉంటుంది. ముఖ్యంగా ఒకటి విశేషార్థం మరొకటి సామాన్యార్థం. నిర్దుష్ట భావనలో ఈ "వక్రీభవించబడిన మాధ్యమం" అన్నది ఒక మానసిక మాధ్యమం. అది అజ్ఞానంలో ఉండి పనిచేస్తుంది. అందుకే అది సత్యాన్ని పరిశుద్ధంగా ప్రకటించజాలదు. మానవ జీవితం మొత్తం అజ్ఞానంలోనే సాగుతుంది కనుక, ఈ వక్రీభవించబడిన మాధ్యమం సర్వం భూసంబంధమైన భౌమిక వాతావరణమే కనుక అది సత్యాన్ని వక్రీకరించి స్వీయ ప్రతిపత్తిని ప్రకటించుకుంటుంది.

ఇక్కడే అత్యంత సూక్ష్మ మైన మార్మిక అంశం ఒకటి వారి సత్య సూక్తులలో ఇమిడి ఉంది. నిరంతరం తడబడుతూ తడుముకుంటూ దేవులాడే ఈ మనస్సు సాధించేదేమిటి? మనకు తెలుసు. మనసు ఎల్లవేళలా ఏదో తెలుసుకోవాలనే తపనలో తప్పిదాలు చేస్తూ, శత ప్రయత్నాల నేపథ్యంలో మళ్ళీ మళ్ళీ ప్రయత్నిస్తుంటుంది, కాని ఈ ప్రయత్నపూర్వక ప్రగతి అంతా ఒక కుంటి నడక. సత్యాన్ని గూర్చిన అవ గాహన దానికి ఎలా అబ్బుతుంది? పాక్షికంగా పట్టుబడినా అది నిజంగా సత్యమేనా? లేక అది ఒక సత్య శకలమా? అదొక అర్థసత్యమా? లేక అబద్ధమా? ఇది ఒక ఆసక్తిదాయకమై మన అంశం.

మనం విన్న, మనం పల్లిస్తున్న జ్ఞానం ఎప్పుడూ పాక్షికంగానే శకలాల రూపంలోనే అసంపూర్ణంగానే అంది వస్తుంది మనకు. కనుక అది నిజమైన జ్ఞానం కాజాలదు. నిజానికి ఈ విషయాంశం పాతదై పోయింది. దీనికి మరింత జీవితాధ్యయనం అవ సరం. ఐతే, శ్రీఅరవిందుల వారు ఉద్దేశించిన ఈ "వక్రీభవించబడిన మాధ్యమం"

లో దర్శించవలసిన సత్యం మరింత ఆసక్తిదాయకమైనది.

ఇక్కడ సత్యమే మరొక రూపం దాలుస్తుంది. ఈ మాధ్యమంలోని సత్యం ఎన్నటికీ సత్యం కాదు. ఆ కారణంగా అది సత్యంయొక్క వికృతికి లోనైన స్వరూపం మాత్రమే మనకు లభించనున్న ఈ సత్యభాగం, నిజానికి సత్యం యొక్క నిజమైన శకలం కాదు. అది సత్యంలా కనిపించే ఒక దృష్టి భేద అనృతస్వరూపం. అది కరిగి పోయిన సత్యం యొక్క అభాసాదర్శనం.

సరియైన అవగాహన సౌలభ్యం కొరకు (అక్షరాక్షరంగా అనువర్తించుకోవలసిన అవసరంలేని) ఒక దృశ్య దృష్టాంతాన్ని మీ ముందు ఉంచబోతున్నాను.

ఈ సందర్భంలో, మనం శుద్ధ సత్యాన్ని ఒక నిర్మలమైన ప్రకాశవంతమైన శ్వేత కాంతి గోళంగా భావిస్తే, మానసిక మాధ్యమంలో, మానస వాతావరణంలో ఈ సమగ్రమైన శ్వేతకిరణం వేలాది ఛాయలలోకి పరివర్తనం చెందుతుంది. ఒక్కొక్క విడివడిన ఛాయ, ఒక్కొక్క విశిష్టమైన రంగుగా భాసిస్తుంది. మాధ్యమంవలన శ్వేతకాంతి కిరణం వక్రీభవింపబడి, విభజింపబడి, నీల హరిత హరిద్ర అరుణాది వర్ణాలుగా ప్రకటితమౌతుంది. ఇప్పుడు మనకు గోచరించేది పునర్వ్యవస్థీకరింప వీలుపడని రకరకాల రంగులే, కాని తొలుతటి శ్వేతకాంతి కాదు. శ్వేతగోళ శకలం కూడా కాదు. అందుచేత అది సత్యాన్ని చేరుకొనజాలదు. అది సత్య శకలాలను కలిగి ఉండదు. అది ముక్కలుచెక్కలుగా విరిగిపోయిన సత్యం. ఒక చివికిన శిథిలావస్థ.

సత్యం అంటే సంపూర్ణత్వం. సర్వస్వం. అవసరమైనదే ఈ వక్రీభూత మాధ్యమంలో మనకు గోచరించే మానసిక వాతావరణం మనలను అన్ని అంశాలను పొంతంగా గ్రహించనీయదు. సింహభాగం నష్టపోయింది కనుక. ఇది ప్రకటనకు ఆవిష్కరణకు అనువైంది కాదు కనుక. అందుకే దీనిని మనం సత్యం అని అనలేము. సారభూత సత్యాంశ లేశమే అయినా, సత్యం ఎంతమాత్రం కాదు. ఇది నిజానికి మానసిక వాతావరణంలో అజ్ఞానం మాత్రమే.

అందుకే నేను చెప్పేదేమిటంటే మనిషి మనస్సు గ్రహించే జ్ఞానం అంతా కేవలం అజ్ఞానంలోని జ్ఞానమే లేక ఒక అవిద్యా జ్ఞానమే అనవచ్చు.

ఇక ప్రజ్ఞానం సారభూత సత్యదర్శనం. ప్రకటనా యోగ్యమైన ప్రకాశ ఆవిష్కరణం.

"చింతనాత్మక ఆలోచన సత్యం కేసి గురి చూసి వేసిన బాణం. అది ఒక

బిందువును తాకుతుందే కాని మొత్తం లక్ష్యాన్ని ఆవరించలేదు. కాని విలుకాడు మాత్రం ఆపాటి విజయంతో సంతృప్తి చెందుతాడే తప్ప అంతకు మించి అడుగడు"

థాట్స్ మరియు అపోరిజమ్స్,శ్రీఅరవిందులు

ఇదంతా మనకు సువిదితమైన విషయమే. నిజమే, కాని, మనం ఆ మొత్తం లక్ష్యాన్ని పరిపూర్ణంగా ఆవహించడానికి ఏమి చేయాలన్నిది ప్రశ్న. ఇక, నీవు చేయగలిగిందల్లా నీవు విలుకాడివిగా కాకుండా మిగిలిపోవడమే! అస్త్ర సన్యాసం చేయడమే! సత్యాన్ని కనుగొన్నామని భావించే స్థితిలో ఉన్నవారి పట్ల ఇదొక చక్కని సంగతే. వారు ఒక బిందువునైనా స్పర్శించ గలిగారు. కనుక వారు సర్వాన్ని దర్శించారనడం మంచి విషయమే.

మరొక ప్రశంసాపాత్రమైన అంశం — సంపూర్ణ మానసిక ప్రశాంత స్థితి. మనం సంపాదించుకున్న జ్ఞానాన్ని ప్రోగుచేసుకోవలసిన పనిగాని, గ్రహించిన భావా వేశాలను జ్ఞప్తికి ఉంచుకోవలసిన అవసరం గాని ఎంతమాత్రం లేదు. వేలాది విషయాలను మన మొదడులో కుక్కుకోవలసిన పనిలేదు. కార్యాచరణ సమయాలలో, ప్రబోధించే సందర్భాలలో, సమస్యలను పరిష్కరించే పరిస్థితులలో అంది వస్తుంది కదా అని మనం పొందిన జ్ఞానాన్ని మన అదుపాజ్ఞలలో అట్టి పెట్టుకొనే ప్రయత్నం అనవసరం. మనస్సు నిశ్శబ్దమైనది, మేధస్సు నిష్ఫలమైనది. సర్వం స్పష్టంగా, ప్రశాంతంగా నిర్మలంగా ఉన్న సరియైన క్షణంలో దైవకృపవలన ఒక కాంతిబిందువు మన చైతన్యంలోకి ప్రసరిస్తుంది. అప్పుడు తెలియవలసినదంతా తెలిసివస్తుంది. మరి దానిని జ్ఞాపకం ఉంచుకోవాల్సిందెందుకు? జ్ఞానాన్ని అట్టిపెట్టుకోవాల్సిన అవసరం ఏమి వచ్చింది? మనకు అవసరమైన రోజున అదే తనంతటతానే ఆ క్షణంలో మనకు అంది వస్తుంది. ప్రతి క్షణం మనం ఒక తెల్లకాగితంవంటి వాళ్ళము. మనకు తెలియవలసినదంతా దానిపై వ్రాయబడుతుంది. ప్రశాంతతలో, విశ్రాంతిలో, ఆమోదయోగ్యమైన పరిపూర్ణ నిశ్శబ్దంలో.

తెలుసుకోవలసినదంతా తెలిసి వస్తుంది. చూడవలసినదంతా చూడటం జరుగు తుంది. ఆ రెండూ సూటిగా భగవంతుని నుండే వస్తాయి గనుక అదే నిజమైన సత్యం. అన్ని హేతువాదాలను, అన్ని అవివేకాలను అధిగమించే సత్యం. సత్యం ఎప్పుడూ సత్యమే. అంతే. అది అవివేకమో, హేతుస్వభావమో తెలుసుకోవాలంటే ఇంకా లోతుల్లోకి వెళ్ళాలి.

కావలసింది నిశ్శబ్దం, నమ్రత, అణకువతో కూడిన శ్రద్ధాపూర్వక గ్రహణశక్తి. ఎలాంటి బాహ్యారూపాలనుగాని, వ్యాకులతలనుగాని పట్టించుచుకోకూడదు. తానేమో తనకే తెలియని తానేమీ కాని శాంతి నమ్రతలుగల శ్రద్ధాళువైన ఒక సరళ సాత్త్విక ఉపకరణంగా ఉండాలి. అది అన్నిటినీ పరిగ్రహించి, అన్నిటినీ ప్రసారం చేయడానికి ఎల్లవేళలా సర్వ సంసిద్ధంగా ఉంటుంది.

ఇందుకు కాలవలసిన మొట్టమొదటి నిబంధన స్వీయ విస్మృతి, సంపూర్ణ స్వీయార్పణం, అహంభావ రాహిత్యం.

అప్పుడు, సర్వశ్రేష్ఠుడైన ఆ ప్రభువు ముందు సాగిలబడి దేహం అంటుంది: "నేను ఏమి కావాలని నీవు కోరుకుంటున్నావో నేను అనే అవుతాను. నేను ఏది తెలుసుకోవాలని నీవు కోరుకుంటున్నావో నేను అదే తెలుసుకుంటాను. నేను ఏమి చేయాలని నీవు కోరుకుంటున్నావో నేను అదే చేస్తాను."

శ్రీమాత

అనువాదం: నాగరాజు రామస్వామి

పరమోన్నత సత్యాన్ని గురించి సైన్సు, యోగం ఏం చేప్తున్నాయి

ఎటువంటి పరమోన్నత సత్యానికైనా సైన్సు చేరుకున్నదా అని ఎవరైనా అడగవచ్చు. భౌతిక స్థాయిలో సత్యాన్నైనా చేరుకొనడానికి విరుద్ధంగా సైన్సు ముందుకు పోయిన కొద్దీ పరమోన్నత సత్యం దాని కందకుండా దూరంగా పోతున్నట్లు కనిపిస్తోంది. పరమోన్నత సత్యం భౌతికమైనది, విషయంగా అవగతమయ్యేదీ అనే భావంతో సైన్సు అచటినుండి ఆరంభించింది. మానసిక పరిధిలోనికి రాని వాస్తవిక పరమోన్నత సత్యం ఏదో అని వ్యక్తి ఆంతరిక విషయగతమైన దానినంతా వివరిస్తుందని భావించారు. పరమోన్నతసత్యం ఆధ్యాత్మికమైనదే, విషయగతమైనదే, ఆవెలుగులో మాత్రమే విషయ సంబంధమైన దృగ్గోచర జగత్తును చూడాలి అనే చోటనుండి యోగం ముందుకు పోతుంది. ఇవి రెండూ పరస్పర వ్యతిరేకక ధృవాలు. వాటి మధ్య అఘాతము ఎంత పెద్దదిగా వుండడానికి వీలుందో అంత పెద్దదిగానూ తయారైంది.

ఆంతరంగికంగా తనలో తాను ప్రయోగంచేసుకుంటూ యోగం కొనసాగుతుంది.

తానుకనుగొన్నవన్నీ కూడా అనుభవం ఆధారంగా కనుగొన్నవే. ఇంతవరకు యోగం ఒక సశాస్త్రీయ పద్ధతినే అనుసరిస్తుంది. మానసిక అంతః స్ఫురణలను తొలి మెట్టుగా స్వీకరిస్తుంది. వాటినది సంసిద్ధులుగా పరిగణించదు. అవి అనుభవంలోనికి వచ్చినప్పుడే వాటిని ధృవీకరించుకొంటుంది. అది విషయగతమైనదిగాక మానసికమైనది, వ్యక్తి అంతరంగానికి సంబంధించినది, బయటకు కన్పించేది కాదు. అందుచేత అనుభవానికి విలువ నివ్వడానికి భౌతిక మనస్సు శంకిస్తుంది. విషయగత మరియు మానసిక అనుభవాల మధ్య బేధానికి విలువ నివ్వలసిన విచక్షణ చూపవలసిన అవసరం వుందా? వీటిఅట్టడుగుకుపోయి చూస్తే సమస్త జ్ఞానం, అనుభవం వ్యక్తి అంతరంగానికి సంబంధించినవి. విషయగతమైనవి కావా? మనస్సు ఇంద్రియాల నిర్మాణాన్నిబట్టి విషయంగా బాహ్యభౌతికవస్తువులన్నీ మనుష్యులందరికీ చాలా వరకు ఒకే విధంగా కనుపిస్తాయి. ఇప్పుడునట్లు గాక మరోరకంగా మనస్సు, ఇంద్రియాల నిర్మాణం జరిగితే, భౌతిక ప్రపంచాన్ని గురించి అవి వేరే విధంగా తెలియజేస్తాయి. ఈ విషయాన్ని సైన్సే బాగా స్పష్టం చేసింది. యోగానుభవం వ్యక్తికి సంబంధించినది. చూచువాని వ్యక్తితర పురంగం దాని మీద పడుతుంది అనేగదా నీ స్నేహితుని వాదన. కొన్ని పరగణాల్లో అనుభవానికి ఆపాదించే రూపపు ఖచ్చితత్వానికి లేదా తాను అర్థం చేసుకొనే విధానానికి సంబంధించిన కొంతమేర వరకు అది యదార్థంకావచ్చు. కాని ఇక్కడ కూడా భేదం ఉపరితలానికి సంబంధించినదే. ఎక్కడైనా సరే యోగి అనుభవం ఒకే విధమైన విశాల దారుల్లో సాగుతుంది. అది ఒకే ఒక్క మార్గంకాదు. అనేక మార్గాలు న్నాయి అనేది నిజం. ఎందుకనంటే మనం బహుపార్శ్వాలుగల అనంతంతో వ్యవహరిస్తున్నాం అన్నది ఒప్పుకున్నాం గనుక దానికి చేరడానికి అనేక మార్గాలున్నాయి. ఉండి తీరాలి. అయినప్పటికీ మొత్తం మీద విశాల దృష్టితో చూస్తే ఒకే రకంగా కన్పిస్తాయి. అంటే యుగాలనుండీ ఒకదానినుండి మరొకటి దూరదూరంగా వున్నా, ఒకదానికొకటి సంబంధంలేకుండా అనుష్టించిన స్వతంత్ర యోగ విధానాలద్వారా పొందిన అంతస్ఫురణలు, గ్రహింపులు ఒకే విధంగా ఉన్నాయి. మధ్యయుగాలనాటి భారతీయ భక్తుడు లేక వేదాంతి పొందిన అనుభవాల రూపాలు, మతపరమైన వర్ణాలు వగైరాలలో ఎంతగా విభేదించి నప్పటికీ అవి మధ్యయుగాలనాటి ఐరోపా భక్తుడు, వేదాంతి అనుభవాలలాంటివే. వాటిలో భేదం లేదు. ఒకదానితో ఒకటి పోలి ఉన్న సార్వజనీన, యధార్థమూ అనిపించే మానసిక పరిభాషలో భేదం వున్నందున

వాటిపై పడే రంగులోనూ వాటిని మాటల్లోనికి మార్చి చెప్పడం లోనూ ఎంత భేదం వున్నప్పటికీ వాళ్ళ మధ్య సమాచార సంబంధాలు లేవు. ఒకరి అనుభవాలూ, ఫలితాలు మరొకరికి తెలియవు.

పరమోన్నత సత్యం విషయంలో, విక్టోరియా కాలంనాటి అజ్ఞాతవాది, భారతీయ వేదాంతి ఇద్దరూ "పరమోన్నత సత్యం వున్నది తెరమరుగై" అని అంగీకరిస్తారని భావిస్తున్నాను. ఇరువురూ దానిని మానవ మేధకందనివని అంటారు. భేదమల్లా యెక్కడంటే అది మనస్సుకు తెలియనిది, పలుకుచే వ్యక్తపరచలేనిది, కాని మానసిక విచారణ కన్న ప్రగాఢమైన లేక ఉన్నతమైన మరోదాని ద్వారా దానిని పొందవచ్చు అని భారతీయ వేదాంతి అంటాడు. అంతేగాక మనస్సుకు సంబంధించిన ఆంతర బాహ్య అనుభవానికి అది వ్యక్తం చేసే సహస్ర పార్శ్వాలను మనస్సు పరికించగలదు, వాక్కు వ్యక్త పరచగలదు అంటాడు. విక్టోరియాకాలంనాటి అజ్ఞాతవాది దానికీ యోగ్యతను కూడా అనుమతించడనే భావిస్తాడు. అతడు దాని అస్తిత్వమే అనుమానాస్పదమే అంటాడు. ఒకవేళ ఉండి ఉన్నా ఈ మానవమేధ కందనిది పూర్తిగా అగ్రాహ్యమని అభిప్రాయ పడతాడు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె.వి. రావు.

బౌద్ధిక సత్యాలు — ఆధ్యాత్మిక సత్యాలు

మతమౌఢ్యానికి భారతీయ మేధస్సు అతి తక్కువ ప్రాముఖ్యత నిస్తుంది. మతసూక్తులకుగాక, మతం ఉద్దేశ్యానికి విలువనిస్తుంది.దీనికి విరుద్ధంగా పాశ్చాత్యమనస్సుకు బుద్ధిగతమైన స్థిరనమ్మకం అత్యంత ముఖ్యం. అవే దాని మూలం అవే దానిని ఇతరమైన వాటి నుండి వేరుచేసి ప్రత్యేకతను కలిగిస్తుంది. ఏర్చి కూర్చబడిన నమ్మకాలే దాన్నొక యదార్థమైన లేక అసత్యమైన మతంగా చేస్తాయి. ఇవి కూడా దానిని విమర్శించేవాని సూక్తులతో ఏకీభవించడం, ఏ కీభవించకపోవడంమీద ఆధారపడి వుంటుంది. ఈ అభిప్రాయం ఎంత అర్థంలేనిదైనా, పసలేనిదైనా, బుద్ధి నిర్ధారించిన, రుజువుచేయబడిన మహోన్నత వాస్తవమనీ, కాకపోయినా మరొకటి లేదనీ పొరపాటుగా తలచే పాశ్చాత్య భావనకు ఆవశ్య పర్యవసానం. మహోన్నత శాశ్వత నిజాలన్నీ

ఆత్మ సత్యాలేననీ భారతీయ మత చింతనుడికి తెలుసు. సర్వోన్నత సత్యాలు తాత్కాలిక హేతువాదపు కఠిన తుది నిర్ణయాలుగాని, మతసూక్తుల ప్రకటనల ధృవీకరణలు గానీ కావు. అవి అంతరాత్మ ఆంతరనుభవాలు. దేవాలయపు బాహ్య ప్రాంగణంలోని కడుగుబెట్టడానికున్న ద్వారాలలో బౌద్ధిక సత్యం ఒక ద్వారం మాత్రమే. బౌద్ధిక సత్యంకూడా అనంతుని వైపు తిరిగింది గనుక దాని స్వభావంలోనే సంకుచితమైన ఒకే ఒక్కటి గాకుండా అనేక పార్శ్వాలుంటాయి. ఎంతో వ్యత్యాస మున్నట్లు కన్పించే బౌద్ధిక నమ్మకాలన్నీ గూడా సమంగా సత్యమే. ఎందుకనంటే అవి అనంతునికి సంబంధించిన వివిధ పార్శ్వాల ప్రతిబింబాలేకదా! విడిపోయి బౌద్ధికంగా యెంతో దూరంగా జరిగిపోయినా మహోజ్వల జ్యోతి నుండి వెలువడే కాంతి హీన కిరణాన్నైనా మనస్సు అనుమతించే ప్రక్కద్వారాలు అవుతాయి. అసత్యమతాలంటూ ఏవీ లేవు. అన్ని మతాలూ తమ తమ పంథాలో తమతమ స్థాయిలో యదార్థమైనవే. ప్రతీదీ ఒకే శాశ్వతునివైపు పోయే సహస్రపంథాల్లో ఒకటి.

*

జీవన పురోగతిలో పరస్పరం సంఘర్షించుకొంటుంటే, తరచుగా పూర్తిగా వ్యతిరేకంగా, వైరుధ్యాలుగా కన్పించే అసంఖ్యాక విషయాల అభివృద్ధి, పరస్పరబంధనాలు ఇమిడి వుంటాయి. ఒక విశాల మెరుగైన పురోభివృద్ధిని సంఘర్షణ పెనుగులాటలతో కూడినది గాక ఒక సామరస్యతా ప్రాతిపదిక మీద ఐకమత్యం కొనసాగే చోటును రాజీకుదుర్చి ఒక నిర్మాణాత్మక ఉపాయాన్నీ ఈ పరస్పర వ్యతిరేతిరేకతల మధ్య కనుగొనాలి. వైశ్వజీవన మనస్సు అజ్ఞానంతోనూ, వైశ్వపదార్థపు చేతనారాహిత్యంతోనూ, వైశ్వ ప్రకృతి కుదుర్చుకొన్న సంధిషరతుల నుండి, జీవితపు మరింత అయోమయ, బాధాకర, అజ్ఞానచలనం నుండి బయటపడడమే మానజాతి క్రియాశీల పరిణామమైతే అదే అంతకంతకు పెరుగుతున్న సర్వ సామాన్య లక్ష్యమై వుండాలి. తన అత్యున్నత, సంపూర్ణతకు ఆధ్యాత్మిక నిజతత్వంలో అంతరాత్మ తనను తాను ఆవిష్కరించుకొని పురోగమనాత్మకమై, తన జీవన విలువలను ఆత్మకు సంబంధించిన విలువల లోనికి రూపాంతరం చెందించు ఊర్థ్వ గమనం, యదార్థంగా సంతృప్తికరంగా జరుగుతుంది. ఎందుకనంటే ఆ స్థాయిలోనే అవి తమ ఆధ్యాత్మిక సత్యాన్ని కనుగొనుంటాయి. ఆ సత్యంలో అవి పరస్పరం తెలుసుకొని, సమాధానపడే తావు లభిస్తుంది. ఏకైక సత్యం ఆధ్యాత్మిక సత్యం ఒక్కటే, తక్కిన వన్నీ దాని మరుగుపడిన పార్శ్వాలు,

ప్రకాశవంతమైన మారువేషాలు, లేదా అంధకారయుతమైన వికృతరూపాలు. ఆధ్యాత్మిక సత్యంలోనే అవి తమ సరైన రూపాన్నీ ఒకదానితో మరొకదానికుండే యదార్థ బాంధవ్యాన్నీ కనుగొంటాయి. హేతుబుద్ధి ఈ పని చేయలేదు. హేతుబుద్ధి వ్యాపారమంతా మధ్యస్థమైనదే. అంటే అది పరిశీలించి, మేధస్సుతో ఈ జీవితాన్ని అర్థం చేసుకొని, అది ఏవైపు పయనిస్తున్నదో, ఆ దిశను తెలుసుకొనడం, మార్గంలో దాని అభివృద్ధికి సంబంధించిన ధర్మాలను బహిరంగపరచడం. అది తన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి వస్తువుల సమగ్రసత్యానికి సంబంధించిన అంతిమ వ్యక్తీకరణగా యేదీ నిలబడలేని దర్శన విధానాలను సృజించు వత్తిడికి లోనైంది. వస్తువుల సమగ్ర సత్యం హేతుబుద్ధికి సంబంధించినదిగాదు, అది ఆత్మకు సంబందించినది.

శ్రీఅరవిందులు

అనువాదం: కె.వి.రావు

సత్యం యొక్క ఉన్నత శ్రేణులు

జ్ఞాన సముపార్జనా సాధనలో ఉన్నత స్థాయికి ఎదిగిన మానవాళి మానసము, విషయ పరిజ్ఞానాన్ని కేవలం లౌకిక విషయాలకు ఉపయుక్తమైన విధంగా ఉపయోగించుకొనుటతో మాత్రమే తృప్తి చెందదు. దాని అంతిమ లక్ష్యం అదికాదు. మానవుని నైతిక జీవనానికి ఆవశ్యకమైన, ఉపయోగకరమైన దిశగా ఆ జ్ఞానాన్ని మలచుటలోనే అధికతృప్తిని పొందుతుంది. నైతిక విషయంలో మాదిరిగానే, మేధోపరమైన విషయాలలో కూడ మానవునికి లౌకిక జీవనానికి అవసరమైన జ్ఞానం కన్నా — అనగా ప్రాపంచిక విషయాలలో సవ్యంగా తెలివితేటలతో వ్యవహరించటానికి కావలసిన జ్ఞానంకన్నా — ఆత్మకు అవసరమైన జ్ఞానం, అంతఃసత్తా యొక్క ఆవశ్యక అభ్యర్థనను తీర్చే జ్ఞానం అవసరం. జ్ఞానాన్వేషణ కేవలం జ్ఞాన సముపార్జన కోసమే అనునది మేధకు నిజమైన సహజమైన ధర్మం, కాని, కార్యసిద్ధి కోసమో, లేక జీవితం సాఫీగా సాగటానికి అనువైన పథకాలను విస్తృతపరచటానికో చేపట్టే జ్ఞానాన్వేషణ మేధోపరంగా ధర్మం అనిపించుకోదు.

ఉన్నతతర మనసు ఒక దశలో స్వయంగా తన సంకల్ప వివేకాలను ఈ ప్రధాన ఉద్దేశము నుండి దూరం చేయడానికి సిద్ధమౌతున్నప్పుడు ప్రకృతి సహజమైన ముఖ్య అవసరం ఏదైతే మానవుని మనసులో జ్ఞాన సముపార్జనకై తపనను

రేకెత్తిస్తుందో, అది ఉధృతమౌతుంది. దూరమవటానికి బదులు అజ్ఞానపు పొరలనుండి వెలువడుతున్న అంతరాత్మకు ఆదర్శమైన విధాయకమౌతుంది. భగవంతుని పిలుపు మేరకు ఫలవంతమగుటకు షరతుగ సత్యంవైపుకు, వెలుగు వైపుకు నెట్టుతుంది. ఒక సుగుణానికి ప్రోత్సాహకంగా ప్రస్తుతం లభిస్తున్న లేక లభించబోతున్న ప్రతిఫలంయొక్క అవసరం ఏ విధంగానైతే మనసు ఉన్నతస్థాయికి ఎదిగినప్పుడు ముగుస్తుందో, అదే విధంగా జ్ఞానానికి ప్రోత్సాహకంగా ఒక బాహ్యప్రయోజనంయొక్క అవసరం కూడ ముగుస్తుంది. ఏవో రంగులు పులిమి ప్రాముఖ్యతనంటగట్టడంకూడ నిస్వార్థ గుణాన్ని నీరు గార్చినట్లుగాను, అంతరాత్మ ప్రేరణ యొక్క స్వచ్ఛతను దిగజార్చినట్టుగా భావించబడుతుంది. ఇప్పటికే బాహ్యంలో ప్రకటిత మౌతున్న జ్ఞానాన్వేషణ ప్రక్రియలో ఇలాంటి సాదృశ్యత కొంత పైచేయి అయిందనే భావన పొడచూపుట ప్రారంభమైంది.

ఒక శాస్త్రిజ్ఞుడు తాను కనిపెట్టిన విషయాల పరిశీలనను కొనసాగించుటలో అతని ధ్యేయం సృష్టి గమనంలోని ధర్మాన్ని, సత్యాన్ని తెలుసుకొనుట. వాటి క్రియాశీల ఫలితాలకు అతను ప్రాధాన్యత నీయడు. ఇక అత్యున్నత శాస్త్రి మేధకు ఫలితాలు అసలు ధ్యేయమే కాదు.

ఒక తత్త్వవేత్త యొక్క అంతరంగం విషయాల వాస్తవికతను వాటి సత్యదర్శనం కోసమే పరిశీలించుటకు పురిగొల్పుతుంది. ఆ దర్శనం తప్ప అతని బుద్ధికి మిగిలిన దంతా అప్రధానం. ఆ ఏకైక లక్ష్యసాధనలో ఏ విధమైన జోక్యాన్ని సహించడు. ఈ సమగ్ర సంపూర్ణ సత్యశోధనా ప్రక్రియ సజావుగా సాగుటకు అలాంటి ప్రత్యేక పోకడను అనుసరించుట అవసరము.

ఒక ఆలోచనాపరుడుకి సత్యాన్ని తాను కనుగొని దానిని తాను ఆచరించుటయే కాక మిగతా ప్రపంచమంతా ఆచరించునట్లు చేయుట అతని లక్ష్యం. జీవన విధానాన్ని మతపరమైన విషయాలను, నాతికవిలువలను సామాజిక విషయాలను ఆ సత్యాచరణ ఏవిధంగా ప్రభావితం చేసి వాటిని ఎలాంటి ఒడుదుడుకులకు గురిచేస్తుందో అతను పట్టించుకోడు. జీవితంపై ఆ ప్రభావ తీవ్రత ఎటువంటిదైనా కేవలం సత్యవాణిని వ్యక్తపరచటమే తన కర్తవ్యంగా భావిస్తాడు.

అంతరంగ క్రియాకలాపం ఎప్పుడైతే మేధోపరమైన అన్వేషణలోని నిరపేక్ష తత్త్వాన్ని అధిగమించి సత్యానుభూతి కోసం చేసే తీవ్రపోరాటంగా పరిణమిస్తుందో

అప్పుడు సంపూర్ణత సమగ్రమౌతుంది. ఆవశ్యకత అత్యావశ్యకమౌతుంది. ఒక స్ఫురద్దీప్యమైన అంతరంగ సత్యజీవనమౌతుంది. ఒక వినూత్న సత్య చైతన్యంలోకి ఆవిర్భావన అవుతుంది.

వెలుగుకై తపించే తపస్వి, జ్ఞాన సాధకుడైన యోగి, ఒక ప్రవక్త, ఒక ఋషి, జ్ఞానం కోసమే జీవిస్తారు. జ్ఞానం లోనే మనుగడ సాగిస్తారు. కారణం, వెలుగు యొక్క సమగ్ర సంపూర్ణతను, సత్యాన్నే వారు అనుసరించగోరేది. వారిపైన వాటిపట్టు ఏకాగ్రము, సంపూర్ణము.

ఆ పురోభివృద్ధి ఒక దివ్యజన్మ లేక ఆధ్యాత్మిక ఆత్మోన్నతి దానియొక్క మహోన్నత ప్రతిఫలం. ప్రాచ్యమనస్సుకు అది సదా ఉత్తమోన్నత ఫలం. అజ్ఞాన తిమిరం నుండి దివ్యమైన ఆత్మజ్ఞానావృత వెలుగులోకి వికసన.

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

పరమసత్యం ఈశావాశ్యోపనిషత్తు

హిరణ్యయేన పాత్రేణ సత్యస్యాపి హితం ముఖం!

తత్వం పూషణ్ణపామణు సత్యధర్మాయదృష్టయే

పరమసత్యపు మోమును మూసివేస్తూ తేజోవంతమైన ఒక బంగారు మూతవుంది. ఓ పోషకా! పరమసత్య ధర్మం కోసం, పరమసత్యదర్శనం కోసం దాన్ని నీవు తొలగించు.

శ్రీఅరవిందుల విశ్లేషణ:

ఈ పరమసత్యపు మోము తేజోవంతమై ఒక రక్షణ కవచం వంటి దానివల్ల, ఒక బంగారు మూతవల్ల మూయబడి వుంది. అంటే మానవ చేతన దృష్టికి కనుపించకుండా చేయబడింది. ఎందుకనంటే మనం మానసిక జీవులం. మన అత్యున్నత మనోదృష్టి, మనస్సుకు సంబంధించిన అభిప్రాయాలు, సూత్రీకరణలతో నిండి వుంటుంది. అవి జ్ఞానసాధనాలు పరమసత్యం నుండి ప్రసరించే కిరణాలు అనే మాట నిజమే. కాని స్వభావరీత్యా అది రూపానికి సంబంధించిన సత్యమేకాని అస్తిత్వపు సత్యంకాదు. వాటినాధారంచేసుకొని కన్పించే వస్తువుల ఆకారాలు జ్ఞానాన్ని క్రమబద్ధీకరించుకొని

వాటి వెనుక గల వాటి అసలు సత్యాన్ని నిర్ధారించుకొనడానికి యత్నిస్తాం. అంతః సత్త జ్ఞానమే యదార్థమైన జ్ఞానం, అంతేగాని కేవలం రూపానికి సంబంధించిన లేదా ఆకారానికి సంబంధించినది కాదు.

తేజోవంతమైన అభిప్రాయాలను సూత్రీకరణలను తొలగించి దాని స్థానంలో ఆత్మ సమస్తాన్ని చూడగల దృష్టిని నెలకొల్పడానికి మనలోని ఆధ్యాత్మిక సూర్యుడు పనిచేసినట్లైతే మన యదార్థమైన పరమసత్యానికి చేరుకుంటాం.

పరమసత్యపు ధర్మం, కర్మ, మనలో ఇందునిమిత్తం అభివ్యక్తమై తీరవలసిందే. వస్తువులను గురించి, మనలను గురించి ఉన్నదాన్ని ఉన్నట్లుగా చూడడం మనం తప్పక నేర్చుకోవాలి. మన ప్రస్తుత కర్మలో ఆత్మజ్ఞానం, సంకల్పం విడివడిగా వున్నాయి. ఇతరులనుండి విడివడిపోయిన ప్రత్యేక ఉనికి మనది. విడివడి వున్న జీవుల బాంధవ్యాలను వాటి ప్రత్యేకతలలోనే తెలుసుకొనడానికి ప్రయత్నిస్తాం. దానిని వ్యక్తిగత ప్రయోజనానికి ఉపయోగించుకొనడానికి అలా రూపొందించుకొన్న జ్ఞానాన్ననుసరించి మనం పనిచేస్తాం. ఇతరులనందరినీ తనలో కలిగివున్న మన అస్తిత్వాన్ని దర్శించినట్లైతేనే, పరమసత్యధర్మం మనలో పనిచేస్తుంది. అనృతమయం చేసే ప్రతివర్తన స్వభావం కల మాధ్యమిక సూత్రానికి విధేయమైగాక మన ఆంతర బాహ్యకర్మ అపుడు సహజంగా సరాసరి మన అస్తిత్వం నుండి వెలువడుతుంది.

అలా అయినప్పటికీ మన సామాన్య చర్యలో కూడా మనలను విముక్తం చేసే పరమసత్యపు కర్మ ప్రారంభదశ లేక కనీసం దాని బీజమైన వుంది. ప్రతిచర్యాస్ఫురణ వెనుక, ఒక అంతః స్ఫూర్తి వుంది, ఒక సత్యం ఉంది. రూపంలో అది నిరంతరం వికృతీకరణకు లోనైనా, సారతః తనను తాను సురక్షితంగా ఉంచుకుంటూ అభివ్యక్తిలో వెలుగు, వైశాల్యతలను పెంపొందిస్తూ మనలను ముందుకు తీసుకుపోవడానికి పనిచేస్తోంది. ఈ వైవిధ్యం, విభజనలవల్ల సంప్రాప్తించిన శ్రమతో కూడిన ప్రయత్నం వెనుక ఏకం చేయాలని వత్తిడి కలిగించే ధోరణి వుంది. అది గూడా ప్రత్యేక ఫలితంతో అనృతాకరణకు సదా లోనౌతూనే ఉంది. అలా అవుతున్నప్పటికీ కూడా జ్ఞానంలో అస్తిత్వంలో, సంకల్పంలో కాలక్రమేణా సమగ్రతను సాధించే వైపు పట్టుదలతో నడుపుతుంది.

సూర్యుడు, పూషణుడు అంటే పోషకుడు. వృద్ధికారకుడు. విభాజితమైన ఆత్మావలోకనం, సంకల్ప చర్యలను సమగ్ర సంకల్పం జ్ఞానంలోనికి విశాలమయ్యే విధంగా

ప్రభావం చూపగలిగేటట్లు అతని కర్మ సాగాలి. అతడే ఏకైక ద్రష్ట. ఇతర జ్ఞానరూపాలను ఆవలకు నెట్టి వాటి స్థానంలో తన ఏకీకృతం చేసే దృష్టిని నిలపడం ద్వారా చివరకు ఏకత్వంలోనికి మన మందరం చేరుకొనేటట్లు చేస్తాడు. సంపూర్ణతకు సంబంధించిన సమస్తం లోని ఒకే ఒక్కడు, ఒకే ఒక్కనిలో సమస్తంను చూడగల అంతఃస్ఫురిత దృష్టి మనలో సమ్యక్ ధర్మాన్ని పరమసత్యధర్మాన్ని విధించే శాసకునిగా అవుతుంది.

విశుద్ధ అంతఃస్ఫురిత లేక దివ్యభావన సత్తాలోనూ, సంభూతిలోనూ (దైవంలోనూ, సృష్టిలోనూ) తనను తానే దర్శిస్తుంది. తన ప్రతీకల విసృజం చేసుకొని అస్తిత్వంతో ఏకమై వుంటుందది. అందుచేత అది తనతోబాటు వెనుకగల పరమసత్యపు జ్ఞానాన్ని గూడా తీసుకు పోతుంటుంది.

శ్రీఅరవిందులు
అనువాదం: కె.వి.రావు

ఋగ్వేదంలో పరమసత్యభావన

అగ్ని — సత్యం: ఉపనిషత్తుల తొలినాళ్ళ వేదాంతబోధనలో సత్యం, ఋతం, బృహత్ అని ఉదహరించబడిన సూక్తుల ద్వారా వేద సూక్తుల్లో తరచుగా తెలుపబడిన పరమ సత్యాన్ని గురించిన భావన మనకెదురౌతుంది. ఇది ఆనంద స్థితికి అమృతత్వ స్థితికి తీసుకుపోయే మార్గమని ఈ పరమసత్యాన్ని గురించి వేదంలో వర్ణించబడింది. జీవిగాని, తపసిగాని, ఋషిగాని, కవిగాని పరమసత్యపథంవల్ల పరాన్ని వశం చేసుకుంటారు అని ఉపనిషత్తులు గూడా చెబుతున్నాయి. అవిద్యనుండి మర్త్యస్థితి నుండి బయటపడి అమృతత్వంలోనికి పయనిస్తాడు. అందుచేత వేదవేదాంతాల్లో అదే భావనకు సంబంధించిన సమస్య ఉన్నదని మనం భావించే హక్కు మనకుంది.

సత్యాన్ని గురించిన ఈ మానసికభావన, దైవకేంద్రపుసత్యమేగాని మర్త్య సంబంధమైన ఇంద్రియ సంవేదనగాని, మర్త్యత్వానికి సంబంధించినది గాని కాదు. అది సత్యం, అస్తిత్వపుసత్యం. క్రియాపరంగా ఋతం. మనస్సు, దేహాల యుక్తమైన కార్యకలాపాల రెండింటినీ సక్రమంగా నియంత్రించే దివ్యపురుషుని సత్యం. అది బృహత్. అనంతుని నుండి సరాసరిగా ఏమాత్రం వికారానికి లోనుగాకుండా దిగి వచ్చే విశ్వజనీన సత్యం. దానికి సంబంధించిన చేతనగూడా అనంతం. బృహత్తే

పరిమితీకరణనాధారంచేసుకొని ఇంద్రియ మనస్సు చేతనకు వ్యతిరేకమైన విశాల చేతన అది. ఒక దానిని భూమ, విశాలమైనదనీ మరొక దానిని అల్పమైనదనీ వర్ణిస్తారు. ఈ అతిమానస లేక సత్యచేతనకు గల మరొక పేరు మహస్సు. దాని అర్థం కూడా ఘనమైనది, విశాలమైనది. అవే అసత్యమయమైన దృశ్య జగత్తునకు సంబంధించిన విషయాన్నికొస్తే (మానసిక దైహిక కార్యకలాపంలో సత్యం కానిది, అపసవ్యంగా అన్వయించబడిందే అనృతం) వాటి కి ఉపకరణాలుగా ఇంద్రియాలు మనస్సువాటికి లభించిన సాక్ష్యం మీద ఆధారపడి పనిచేసే బుద్ధి ఉన్నాయి. అలాగే సత్యచేతనకు కూడా దాని కనుగుణమైన శక్తి సామర్థ్యాలున్నాయి. దృష్టి, శ్రుతి, వివేకం అంటే సత్యాన్ని సరాసరి చూడగల దృష్టి సరాసరి సత్యవాక్కును వినగల శ్రవణశక్తి, యుక్తాయుక్త వివేచన చేయగల శక్తి. ఈ సత్యచేతన ఎవరికి వశమై వుంటుందో లేదా యెవరైతే ఈ శక్తుల చర్యలకు ఉన్మీలమై ఉంటారో వారు ఋషులు, కవులు. సత్యం, ఋతం అనే ఈ అవగాహనను వేదంలో ఈ ఆరంభసూక్తులలో అన్వయించు కోవాలి.

ఈ విధంగా ఆర్జించుకున్న అమృతత్వస్థితిని పరిపూర్ణ సత్యం, ఋతంలను ఆధారంగా గల ఆనందస్థితిగా భావించారు. మొదటి సూక్తం తరువాత దాన్ని ఈ భావంతో అర్థం చేసుకోవాలని అనుకొంటున్నాను. తరువాతి సూక్తం. "ఓ అగ్నీ! నీ కర్పించుకొనువానికి నీవు కల్పించు శ్రేయస్సే నీ ఆ సత్యం." వేరుమాటలలో అగ్ని స్వభావమైన ఈ సత్యసారం, కీడునుండి స్వేచ్ఛ,ఋతమ్ తనలోనే కలిగియున్న తానే సతతం భరిస్తూండే పరిపూర్ణ శ్రేయస్సు ఆనందాల స్థితి. దివ్యపౌరోహితునిగా చేసే అగ్నికార్యంతో మానవుడు అర్పించే ఆహుతి వల్ల అది తప్పక అతనిలో ఉద్భవిస్తుంది.

ఆ విధంగా వేదసూక్తుల ప్రారంభంలో నున్న నాలుగు ఋక్కుల నుండి వేద ఋషులు భావనను ప్రధాన విషయాలకు సంబంధించిన సూచనలను గ్రహించగలుగుతాం. అతిమానస దివ్యచేతనను గురించిన అవగాహనను మానవ మనస్సుకు సంబంధించిన అసత్యాలనుండి మనిషిని ఉద్ధరించడానికి పరిపూర్ణ శ్రేయస్సు ఆనందాల అమృతస్థితికి ఈ పరమ సత్యంలో అభివ్యక్తి. సత్యం చేరడానికి దివ్యలక్ష్యప్రాప్తి సాధనోపాయాలుగా మానవుడు తనకున్న దానిని తావై ఉన్నదానినంతా అమరమగు దానికి, అంతరంగానికి సంబందించిన యజ్ఞంగా నివేదించడానికి, దైవశక్తులను పరమ

సత్యపు శక్తులను ఆవాహన చేయడం ఆ ఋషుల భావన. ఆధ్యాత్మిక దృక్పథాన్నను సరించి తక్కిన వైదిక చింతన అంతటినీ ఈ కేంద్రీయ అవగాహనల చుట్టూ చేర్చ వచ్చు.

సరస్వతి, ఆమె సహచరులు, సత్యం

ఈ ముగ్గురు దేవేరులు (భారతి, సరస్వతి, ఇళ) మానవునికి బ్రహ్మానందాన్ని అనుగ్రహిస్తారని అన్నారన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. వేద ఋషులు దర్శించి ప్రకకటించినట్లు పరమసత్యం, బ్రహ్మానందం మధ్య ఎడతెగని బాంధవ్యం ఉందని ఏనాడో నొక్కి వక్కాణించాను. యదార్థ లేక అనంత చేతన మనిషిలో ఉదయించడంవల్లనే అతడు ఈ బాధామయ దుస్వప్నంనుండి, వేదననుండి, విభాగితమైన ఈ సృష్టి నుండి బయటపడి బ్రహ్మానంద స్థితిలోనికి చేరుకుంటాడు. ఈ స్థితినే భద్రం, ఆనందం, స్వస్తి అనే పదాలలోనేగాక యెక్కువగా ఉపయోగించని పదాలైన వార్యం, రయిః, రాయః అనే పారిభాషిక పదాలతో గూడా అనేక సందర్భాల్లో విశదీకరించింది. వేదఋషికి పరమసత్యం ఒక మార్గం, గర్భాలయానికి ముందుగది లాంటిది మాత్రమే. అతనికి దివ్య జీవన విధానమే గమ్యం లేక మరోవిధంగా చెప్పాలంటే పరమసత్యం పునాది. దాని మహోన్నత ఫలితం బ్రహ్మానందం.

శ్రీఅరవిందులు

అనువాదం: కె.వి.రావు

ఉషస్సు - సత్యం

ఉన్నతతర లేక అవిభాజ్య దివ్యచేతనకు సంబంధించిన ప్రకాశమయం చేసే ఉదయం, సదా పరమసత్యపు ఉదయమే. ఉషస్సు అటువంటి ప్రకాశమయం చేసే ఉదయం అయినట్లైతే, ఋగ్వేదసూక్తాల్లో పరమసత్యం, ఋతమ్ భావంతో తరచుగా జంటగా కనిపించే ఆమె రాకను మనము విధిగా కనుగొనాలి. వీటి సహచరత్వం వేదంలో తిరిగి తిరిగి ఉషస్సు దర్శన మిస్తుంది. ఎందుకంటే తొలుదొల్త మరమసత్య మార్గాన్ని ప్రభావవంతంగా అనుసరిస్తుంది. "ఋతస్య పంథామ్ అన్వేతి సాధు" అని ఉషస్సును

వర్ణించాము. ఇచట కర్మ కాండలకు సంబంధించిన లేక ప్రాకృతిక సంబంధమైనదను అర్థం ఋతంనకు ఏ విధంగానూ అన్వయించదు. ఉషస్సు యజ్ఞవిధానాన్ని గాని లేదా జలపద్ధతిని గాని అనుసరిస్తుందని నిరంతరం గట్టిగా చెప్పుకోవడంలో అర్థమేమీ ఉండదు. పరమసత్యానిని గాక, దివ్యసూర్యుని పంథాను "పంథా ఋతస్య" కు అర్థం అని మనం చెప్పుకోగలిగితే, ఆ స్పష్టమైన విశిష్టార్థాన్నుంచి మనం తప్పించుకోగలం. కాని వేదం సూర్యుడు ఉషస్సు మార్గాన్ని అనుసరిస్తున్నట్లుగా చెప్తోంది. భౌతిక ఉదయాన్ని గమనించిన వానికిది సహజమైన ప్రతిరూపంగా తోస్తుంది. ఇతరచోట్ల పరమసత్యపు మార్గాన్ని అని స్పష్టమైన అర్థం ఇవ్వకపోయినప్పటికీ మనస్తత్వపరమైన విశిష్టత మధ్యలో ప్రవేశించకుండా ఉండదు. ఎందుకంటే ప్రకాశోదయం సత్యం లేక సత్యాన్ని పాలించేవాని అంటే సూర్యసవిత్రుని అనుసరిస్తుందనే అర్థాన్నిపుడది తెలియజేస్తుంది.

మనకు కూడ సరిగ్గా అదే భావన వుంది. కాని ఇంకా స్పష్టాతి స్పష్టమైన, నిశితమైన తాత్విక భావనం 1-124-3 లో తెలుపబడింది. "ఋతస్య పంథాం అన్వేతి సాధు, ప్రజానతీవన దిశీ మినాతి" పరమ సత్యపంథాననుసరిస్తూ, ఆమె చరిస్తుంది. అది జ్ఞాతగనుక దేశ పరిమితికి లోబడదు.

*

పరమసత్యభావన సదా ఈతోజోమయదేవత ఉషస్సుకు జతకూడే ఉంటుంది. ఆమె స్వర్లోక వెలుగులతో పరమసత్యాన్ని పూర్తిగా మేలుకొలుపుతుంది. ఆమె సత్యవాక్కులు ఉచ్ఛరిస్తూ అవతరిస్తుంది. ఆమె శుభోదయాలు ప్రకాశిస్తూనే ప్రవేశిస్తాయి. ఎందుకనంటే అవి పరమసత్యంనుండి ఉద్భవించాయి. పరమసత్యపీఠంనుండి ఉషస్సులు లేచి వస్తాయి. వైవిధ్య భరిత వెలుగుకు సంబంధించిన వస్తువులను దర్శించడంలో బయటపడే పరిపూర్ణ సత్యాల కధినాయకురాలు ఆమె. ఆమె సమస్త ద్వారాలను తెరచి వేస్తుంది. ప్రచండాగ్ని మన భూ, ఆకాశ మహావైశాల్యత లోనికి ప్రవేశిస్తాడు. పరమసత్యపునాది నుండి — అవే మహోదయాల పునాదికూడా — తనను నడిపించుశక్తిని స్వీకరిస్తూ ప్రవేశిస్తాడు. ఎందుకనంటే ఈ మహోదయపు అమిత ప్రకాశం మిత్ర వరుణుల బృహత్ జ్ఞానం ఆనందమే తానన్నట్లు, యెల్లడలా అనేక రూపాల్లో ఆనందాన్ని నింపుతుంది.

*

పరమసత్యం అతి నిరాడంబరమైనదిగా అప్రాముఖ్యంగా కన్పించేదైనప్పటికీ అత్యంత క్లిష్టమైనది. వైదికబోధనలో అత్యంత ప్రాధాన్యం కలపదం సత్యం — అంతరాత్మలో సత్యం, దృష్టిలో సత్యం, ఉద్దేశ్యంలో సత్యం, కర్మలో సత్యం, క్రియాశీలసత్యం, ఆంతర నిష్కపటత, దృఢమైన చిత్తశుద్ధి, ఆర్జవం పారదర్శకత, వాక్కులో, కర్మలో సౌశీల్యత అనేవి ప్రాచీన ఆర్యుని నీతిసూత్రాల సారం. అది పరిశుద్ధమైన అమలిన శక్తి రహస్యం, ప్రకృతిని విడిచి మనిషి ఎంతో దూరం పోలేదనడానికిదే గుర్తు.

శ్రీఅరవిందులు

అనువాదం: కె.వి.రావు

జీవితం సత్యమయం కావాలి

సత్యము సూత్రీకరించలేనిది. నిర్వచించలేనిది. అది జీవించబడాలి.

ఎవరైతే తమను సత్యానికి సంపూర్ణంగా సమర్పించుకుంటారో, సత్యాన్ని సేవిస్తూంటారో, వారికి తెలుస్తుంది ప్రతిక్షణం ఏం చేయాలో. అది ఒక విధమైన అంతర్బుద్ధి, దివ్యజ్ఞానోదయం (చాలావరకు మాటలకందనిది, అరుదుగా మాటల ద్వారా వ్యక్తమయ్యేది). ప్రతిక్షణం ఆక్షణంయొక్క సత్యాన్ని నీకు తెలియపరుస్తుంది. ఈ విషయమే చాలా ఆసక్తికరంగా ఉంటుంది. సూత్రీకరించబడిన, ప్రామాణికమైన, స్థిరమైన సత్యాన్ని నీవు తెలుసుకున్నప్పుడు నీకు ప్రశాంతత లభిస్తుంది. వేరొకదాని కొరకు వెతకవలసిన అవసరం ఉండదు. ఈ సత్యాన్ని నీవు "ఇది సత్యము" అని ధృవీకరించవచ్చు. అప్పుడు అది నిర్ధారించబడినట్టే. అన్ని మతాలు ఈ విధంగానే చేసాయి. వారు కనుగొన్న సత్యాన్ని వారి మత సిద్ధాంతంగా ప్రతిష్టించాయి. కాని ఆపైన అది ఎంతమాత్రము సత్యంగా నిలువలేదు.

సత్యము తాను జీవిస్తూ ప్రేరణ కలిగిస్తూ ప్రతిక్షణం ప్రకటనమవుతూ ఉంటుంది. పరమాత్మను చేరుటకు ఒక మార్గం అవుతుంది. ప్రతివ్యక్తికి పరమాత్మను చేరుటకు తనదైన ఒకమార్గం ఉంటుంది. కొందరు ప్రేమద్వారా, కొందరు శక్తిద్వారా, కొందరు చైతన్యం ద్వారా, మరికొందరు సత్యం ద్వారా పరమాత్మకు చేరువ కాగలుగుతారు. కాని కొంతమంది బహుశా వీటన్నింటితో కలిసి పరమాత్మను చేరుకోగలుగుతారు. పరమాత్మ అన్నీ తానై ఎలా ఉన్నాడో అలా ఈ ఒక్కొక్క దృక్పథం సర్వస్వతంత్రం,

అనిర్వచనీయం, ఆవశ్యకమైనది. పరమాత్మ సర్వస్వతంత్రుడు, ప్రభువు, అనిర్వచనీయుడు. అతని చర్యలు అంతుచిక్కనివి. ఆతని గుణగణాలు ఈ లక్షణాలనే కలిగి ఉంటాయి. ఏవ్యక్తి అయితే ఈ విషయాన్ని తెలుసుకుని తనను తాను ఈ దృక్పథాలలో ఒక దృక్పథాన్ని సేవించుకుంటాడో అది జీవితంలో కాలంలో, మారుతున్న కాలంతోపాటుగా ప్రకటన మవుతుంది. అతను ప్రతిక్షణం సత్యమంటే ఏమిటో తెలుసుకుంటాడు. దివ్యచైతన్యమంటే ఏమిటో తెలుసుకుంటాడు. దివ్యశక్తి అంటే ఏమిటో తెలుసుకుంటాడు. దివ్యప్రేమ అంటే ఏమిటో తెలుసుకుంటాడు. నానాత్వమైన దివ్యశక్తి దివ్యప్రేమ, దివ్యచైతన్యం పరమసత్యం, సృష్టిలో అనేక రూపాలుగా వ్యక్తమవుతూఉంటాయి — పరమాత్మ ఎలా అనంత రూపాలలో వ్యక్తమవుతూన్నారో అలా.

యదార్థ సత్యప్రకటనకు పరిపూర్ణత అవసరం:

ఈ దృశ్యమయ జగత్తులో సజీవంగా యదార్థసత్యం ప్రకటనమగుటకు ప్రయత్నిస్తున్నదని వ్యక్తి విశ్వసించి, ఆ సత్యాన్ని చేరుకొని, దానితో వీలైనంత సంపూర్ణంగా తాదాత్మ్యం చెంది, తాను దానిని వ్యక్తపరచే ఉపకరణంగాతప్ప మరేమి కానని నమ్మి దానిని సజీవంగా, స్పష్టంగా, సమగ్రంగా ప్రకటనమగుటకు తోడ్పడినప్పుడే, దానికి ఒక ప్రాధాన్యత, ఒక విలువ ఏర్పడతాయి. ఈ పరమసత్యాన్ని వెల్లడించే క్రమంలో అనేక సిద్ధాంతాలు, సూత్రాలు, పద్దతులు వాటిశక్తిమేరా కొద్దో గొప్పో మంచివే. అజ్ఞాన పరిధులను దాటి సత్యమార్గంలో ముందుకెళుతున్న కొలదీ ఈ సత్య ప్రకటనయొక్క సమగ్ర రూపాన్ని దాని పరిపూర్ణతను పరమసత్య ప్రకటనకు వాటియొక్క అవసరాన్ని తెలుసుకుంటాడు. ఒక్కటిమాత్రం అవసరమనిపిస్తుంది. ప్రతిఒక్కవిషయాన్ని దాని స్థానంలో ఉంచి, మిగిలినవాటితో సరైన సంబంధం ఉండే విధంగా అన్నింటిని సమన్వయపరచి, ఆ సమగ్ర ఐక్యత సామరస్యంగా ప్రకటితమగుటకు వీలు కల్పించాలి. ఈ ఏకత్వస్థాయి భావననుంచి వ్యక్తి దిగజారినట్లయితే అసలు సత్యాన్ని కనుమరుగుపరచే పరిమితులతో, సంకుచితత్వంతో, చర్చలతో అతను దేనినీ అర్థం చేసుకోలేదని నేననుకుంటాను.

శ్రీమాత

అనువాదం: సిద్ధులవారి త్రివేణి

సత్యానికి మాత్రమే మనం బద్ధులమైతే...

మనం మహోన్నతసత్యానికి మాత్రమే లోబడి వుండాలంటే మన మానస, నైతిక సూత్రాలు, నియమాలు అనందానికి అనువర్తించే వుండాలన్న భావనను వదులుకోవాలి. లేదా మనం అత్యున్నత ప్రవర్తనా ప్రమాణాలలో ఏదైనా పవిత్రమైనది, నిరపేక్షమైనది, శాశ్వతమైనది ఉందన్న భావనకు స్వస్తి చెప్పాలి.

అవసరమైనంత కాలం ఉన్నతమైన తాత్కాలికప్రమాణాలు రూపొందించడం ఈ ప్రపంచ ప్రస్థానంలో భగవంతునికి సేవచేయడమే. ఒక నిరపేక్షమైన ప్రమాణాన్ని కఠినంగా నెలకొల్పడం నిత్యప్రవాహాలకు అడ్డుకట్ట వేయడమే. ప్రకృతి బంధితమైన ఆత్మ ఈ సత్యాన్ని తెలుసుకుంటే, మంచి చెడుల ద్వంద్వ శృంఖలాల నుండి బయటపడినట్లే. వ్యక్తి ప్రపంచ దివ్యపూర్ణత్వం వైపు పురోగమించడంలో మంచి సహాయపడుతుంది. పెరుగుతున్న పూర్ణత్వాన్ని చెడు విచ్ఛిన్నం చేస్తుంది, లేదా వెనక్కి తిరోగమింప చేస్తుంది. పరిపూర్ణత్వం పురోగమన శీలమైనది, పరిణామశీలమైనది కాబట్టి మంచి చెడులు మారే రూపాలు, అవి కాలానుగుణంగా తమ అర్థాన్ని విలువలను మారుస్తుంటాయి. ప్రస్తుతం చెడుగా ఉన్నది, వదలి వేయవలసింది ఒక నాడు వ్యక్తి పురోగతికి అవసరం, తోడ్పడింది కూడా.

మనం చెడుగా పరిగణిస్తున్నది భవిష్యత్తులో పరిపూర్ణత్వ సాధనకు ఏదో రూపంలో ఉపకరించేదిగా మారుతుంది. ఆధ్యాత్మిక స్థాయిలో ఈ తేడాను కూడా మనం అధిగమిస్తాము. అప్పుడు మనం ఈ మంచిచెడుల దివ్యప్రయోజనం ఏమిటో కనుగొంటాము. మంచిలోనూ చెడులోనూ ఉన్నటువంటి అసత్యాన్ని, అజ్ఞానాన్ని, మసకగా వున్న దానిని, అపభ్రంశాన్ని మనం తిరస్కరించాలి. సత్యమైనది, దివ్యమైనది మాత్రమే మనం ఆమోదించాలి. శాశ్వతమైన ప్రక్రియ దశలలో ఎటువంటి తేడాను చూడకూడదు.

కఠినమైన ప్రమాణాలు అనుసరించేవారికి మానవీయ విలువలను గమనించి, దివ్యవిలువలను గుర్తించని వారికి ఈ సత్యం ప్రమాదకరమైన రాయితీ అవుతుంది. నైతిక వ్యవస్థ పునాదులే నాశనం చేస్తుంది. ప్రవర్తన సూత్రాలను గందరగోళపరుస్తుంది. అస్తవ్యస్తస్థితికి దారి తీస్తుంది. మార్పు లేని శాశ్వతమైన నైతిక నియమాలు కావాలా, నియమాలను త్రోసి పుచ్చాలా అనే విషయానికి వస్తే, అజ్ఞానంలోని మనిషికి అదే

ఫలితం సంప్రాప్తిస్తుంది. కాని మానవస్థాయిలో సైతం ప్రవర్తనా ప్రమాణం తాత్కాలిక మని, అవసరమని, మరో ఉత్తమమైన ప్రమాణం దాని స్థానంలో పొందుపరచేంతవరకు విశ్వాసంతో గమనించాల్సి వుంటుంది. ఇందుకు మనకు తగిన వెలుగు, మార్దవం ఉంటే అప్పుడు మనకు నష్టం ఉండదు. అపరిపూర్ణమైన సహించలేని సుగుణాల ఉన్మత్తతను కోల్పోతాం.

దాని స్థానంలో పోరాడుతూ, తప్పటడుగులు వేసే ఈ జీవుల పట్ల అవగాహన సానుభూతి వ్యక్తం చేయడానికి అవసరమైన అరమరికలు లేని మనస్సును ఎడతెగని నైతిక పురోగతికి అవసరమైన శక్తి ధాతృత్వాన్ని సంపాదించుకోగలుగుతాము. ఆ ధాతృత్వంతో మార్గంలో సహాయకారిగా వుండే మరింత ఉత్తమమైన హక్కును, శక్తిని పొందగలం. చివరికి, మానవ తీరాలు దాటి దివ్యశిఖరాలు చేరేచోట మానస స్మామ్రాజ్యం అతిమానస చేతనలో అంతరించే చోట, పరిమతత్వం అనంతంలోకి జారుకొనే చోట, చెడు అంతా విశ్వాతీతమైన దివ్యమైన 'మంచిలో' అదృశ్య మవుతుంది. అది స్పృశించిన ప్రతి చైతన్య భూమికపై విశ్వజనీనమవుతుంది.

విశ్వజనీన ఆత్మ జ్ఞాన స్థితిలో తప్పటడుగులు వేసే మానస పురోగతి మనకు తెలియచేయడానికి మన ప్రవర్తనకు సంబంధించిన ప్రమాణాలన్నీ తాత్కాలిక అపరిపూర్ణమైన, పరిణామ శీలమైన ప్రయత్నాలు మాత్రమే అటు వైపు ప్రకృతి కదులుతోంది. కాని మన అల్ప నియమాలతో సూక్ష్మపవిత్ర సూత్రాలతో దివ్య అభి వ్యక్తి బంధీకృతం కాదు. ఎందుకంటే వాటి వెనుకగల చైతన్యం వాటికి అతీతమైనది. అనంతమైనది.

శ్రీఅరవిందులు

అనువాదం: కె.యజ్ఞన్న

సత్యపాలనకు కావలసిన ప్రధాన నియమం

అతిమానసజీవితం అంటే మన ప్రాణిక, శారీరకమైన వాంఛలను హెచ్చు స్థాయిలో తీర్చుకోవవడం అన్న ఊహల్ని వదిలిపెట్టండి. అవరోహణ లో ఉన్న ఆ సత్యానికి, మనిషి లోని ఈ మృగతత్వాన్ని గొప్పదిగా భావించి దాన్ని తృప్తి పరచాలన్న ఆశతో ఉండడంకన్న పెద్ద అవరోధం మరొకటి లేదు. అతిమానస స్థితిని మనసు తనకి నచ్చిన భావాల, తన కిష్టమైన విషయాల ధృవీకరణగా భావిస్తుంది. ప్రాణికం ఆ స్థితిని తన స్వీయకోరికలను గొప్పగా చేయడాన్ని కోరుతుంది. భౌతికం తన సౌఖ్యాన్ని, తన సరదాలను అలవాట్లను సమృద్ధిగా సాగించాలని కోరుతుంది. ఆ మాదిరిగా జరిగితే అది నిజానికి మృగ-మానవతత్వాల విపరీతమైన కలయిక అవుతుంది. అంతేకాని అది మానవుడు క్రమంగా దైవంగా పరివర్తన చెందటం కాదు.

*

సామాన్యమైన మనసు ప్రాణికముల పరిమితులను కూలగొట్టినపుడు, వ్యక్తి మరింత విశాలమైన శక్తివంతమైన చైతన్యాన్ని అపరిమితమైన సంభావ్యతలను భావించగలడు. ఏ స్థితిలో ఉన్నవారైనా సరే అహాన్ని వీడనపుడు, స్వీయ అహంతో అన్నింటిని జోడించినపుడు సామాన్య మానవుని కంటె వేయిరెట్లు అహంకారాన్ని పెంచుకోగలరు. దైవంయొక్క వైభవం, ప్రాభవం తన స్వీయ గొప్పతనానికి విజృభించిన అహంకారానికి ఒక సాకుగా ఒక ఆలంబనగా ఉపయోగించుకుంటారు. అలాంటివారి అహంకార వ్యాప్తికి భూమే కాదు, స్వర్గం కూడా సరిపోదు. అందుకే అహం విజృంభించకుండా జాగ్రత్తగా ఓ కంటకనిపెడుతూ, మనలను మనం సావధానంగా ఉంచుకోవాలి.

*

అద్భుతమైనవి జరిగినపుడు, బలమైన అనుభవాలు కల్గినపుడు, కాస్తంత పరవశం, అస్తిత్వంలో ఓ దివ్యపులకింతని ఓ ఉన్నత స్థితిని అనుభూతి చెందవచ్చు. కాని ఆ రసపారవశ్యకతలో ఏ మాత్రం అహంకారం అన్నది ఉండకూడదు.

*

చాలామంది ఆకాంక్షాపరులు అహంతో కూడి ఉంటారు. కాని అహంకారంతో ఉన్నారని వారు గుర్తించరు. చివరికి వారి సాధనలో కూడా ఈ "నేను" అన్నది

ఎల్లప్పుడు ఉంటుంది. నా సాధన, నా అభివృద్ధి, నాది అంటూ ఉంటారు. దీనికి తరుణోపాయం నిరంతరం దైవాన్ని గురించి చింతన చేయడమే, దైవంకోసం పనిచేయడం, దైవం కోసమే సాధన చేయడం. అంతే కాని మనకి జరగబోయేదాని గురించి ఏ ప్రభావం ఏవిధంగా మనపై పడుతుందోనని చింతించకుండా, దేన్నీ నాది అనుకోకుండా, అన్నీ దైవానికి చెందినవిగా పరిగణించాలి. నిజాయితీతో సంపూర్ణంగా ఆవిధంగా ఆచరించడానికి కొంత సమయం పడుతుంది, కాని అదే సరైన మార్గం.

*

వాక్కులో సత్యపాలన:

(ఒక సాధకునికి) నీవు X దగ్గరనుంచి ఇంగ్లీషులో వ్రాసిన మూలం తీసుకుంటే, అది అత్యంత ఉన్నత స్థాయినించి వ్రాసినదని తెలుసుకోగలవు. నువ్వు సత్యంయొక్క ఉపకరణం కావాలంటె, నువ్వు ఎల్లప్పుడూ సత్యమే మాట్లాడాలి. ఎన్నడూ అసత్యం మాట్లాడకూడదు. కాని దీని అర్థం అందరికీ అన్ని విషయాలు చెప్పాలని కాదు. నిశ్శబ్దంగా ఉండి సత్యాన్ని ప్రకటించకపోవడం లేదా చెప్పడానికి తిరస్కరించడం చేయవచ్చు. ఎందుకంటే ఎవరైతే దాన్ని అంగీకరించడానికి తయారుగాలేరో, లేదా వ్యతిరేకులో వారికి చెప్తే ఆ సత్యం అపార్థం చేసుకోబడవచ్చు లేదా తప్పుగా పొరబడవచ్చు, వక్రీకరించడానికి లేదా పూర్తిగా అసత్యానికి దారితీయవచ్చు. లేదా కాని అసత్యం మాట్లాడ్డం అన్నది మరొక విషయం. సరదాలో కూడా దాన్ని త్యజించాలి. ఎందుకంటె అది మన చైతన్యాన్ని నిమ్న స్థాయికి తగ్గిస్తుంది. ఇంక నీ ఉత్తరంలోని చివరిపాయింటు, అత్యంత ప్రామాణికమైన ఉన్నతస్థాయి నించి చూసినపుడు మనకి మనసు ద్వారా తెలిసిన సత్యం సరిపోదు, ఎందుకంటె మనస్సు ఆలోచనలో అది పొరపాటు కావచ్చు. అల్పంగా ఉండొచ్చు. అందుకే సత్యచైతన్యంలోని సత్యజ్ఞానం కలిగివుండడం అవసరం.

అంతా అందరికి చెప్పాలన్న నియమంలేదు. అది చాలాసార్లు మంచికన్నచెడే ఎక్కువ చేస్తుంది.ఎంతవరకు అవసరమో అంతవరకే చెప్పాలి. అయితే మనం చెప్పినది సత్యం అయివుండాలి. అబద్ధం చెప్పకూడదు, దానితోపాటు ఎవరిని వంచించాలన్న ఉద్దేశం ఉండకూడదు.

*

మొట్టమొదట, మనకు అసత్యం అని తెలిసినాని నమ్మినా దాన్ని సత్యంగా చెప్పడానికి, మన మనస్సాక్షిలో సత్యం అని నమ్మినా, అది నిజానికి సత్యం కానప్పుడు దాన్ని సత్యంగా చెప్పడానికి చాలా తేడా ఉంది. అందులో మొదటిది సత్యస్ఫూర్తికి వ్యతిరేకమైన పోకడ, రెండవది సత్యమని నమ్మి, దాన్ని గౌరవించడం. మొదటిది ఉద్దేశపూర్వకంగా చెప్పిన అసత్యం, రెండవది కేవలం పొరపాటు లేదా అజ్ఞానం.

ఇదంతా సత్యంవచనం యొక్క క్రియాశీల దృష్టిని. ఉన్నత సత్యం యొక్క దృష్టిలో గమనిస్తే చైతన్యం యొక్క ప్రతిస్థాయికి ఒక నియమిత స్థితి ఉంటుందని మర్చిపోకూడదు. మనసుకు సత్యంగా తోచినది, ఉన్నత చైతన్యానికి పాక్షిక సత్యంగా వచ్చు. ఆ పాక్షికసత్యాన్ని ఆధారంగా చేసుకునే మనం దానికి ఆవలఉన్న విస్తృత సంపూర్ణ సత్యానికి చేరాలి. ఆ విధంగా ఉన్నత స్థాయి సత్యం ప్రస్ఫుటమైనప్పుడు, దాన్ని గుర్తించడానికి తగిన ఉన్మీల్యతను, మృదుత్వాన్ని పొందటం ఆవశ్యకం. ఆ నిమ్నస్థాయి సత్యాన్ని పట్టుకు వేళ్ళాడకుండా ప్రాణికంయొక్క కోరికలను, వాంఛలను దివ్యప్రకాశాన్ని అడ్డుకొనకుండా, విషయాన్ని వక్రించకుండా ఉండాలి. ఒక్కసారి ఆ ఉన్నతచైతన్యం పనిచేయడం ప్రారంభిస్తే, క్రమంగా ఆ కష్టం తగ్గుముఖం పట్టి సత్యంనించి మరింత ఉన్నత సత్యానికి స్పష్టమైన పురోగతి కన్పిస్తుంది.

శ్రీఅరవిందులు

అనువాదం: డి. సత్యవాణి

దైనందిన జీవితం గడపడానికి మార్గనిర్దేశం

మన నోటిద్వారా గాని, మన కలంద్వారా గాని, ఒక అసత్యాన్ని, అది ఎంతటి అల్పమైనదైనా కాని, వ్యక్తపరచినట్లయితే, పరమసత్య సందేశాన్ని అందించే మంచి దూతను కాగలమని ఎలా ఆశించగలము? పరమసత్య సేవకుడు ఎంతటి అల్పాతి అల్పమైన అప్రమాణికమును గాని, అతిశయమునుగాని, అపభ్రంశమునుగాని విసర్జించాలి.

*

అసత్యమును నిర్మూలించాలనే ఆతృత వున్న వారికి ఇది ఒక మార్గం.

నిన్ను నీవు సంతృప్తిపరచుకోవలని చూడకు. అలాగే ఇతరులను సంతృప్తి

పరచాలని కూడ అనుకోకు. భగవంతుని మాత్రమే సంతోషపెట్టాలని ప్రయత్నించు. ఎందుకంటే ఆ ఒక్కడే ఏకైక పరమసత్యము. భౌతిక శరీరంలో ఉన్న మానవ మాత్రులమందరమూ ప్రతిఒక్కరమూ, పరమాత్మ మీద అసత్యమనే ఆచ్ఛాదన వేసిన వారమే.

అతడొక్కడే తనకు తాను సత్యమై విలసిస్తాడు గనుక ,అసత్యముసుగుల మీద కాకుండా, ఆ భగవంతుని మీదనే ఏకాగ్రత వహించాలి.

*

అసత్యానికి ఒకే ఒక పరిష్కారం ఉంది.

మన చైతన్యంలో దైవము యొక్క ఉనికిని ఖండించే దానినంతా మనలో మనం సంస్కరించుకోవాలి.

*

అతిమానసశక్తి అనేది పరమసత్యమే కాదు, అసత్యమును పూర్తిగా తిరస్కరించుట కూడా అసత్యానికి ఆశ్రయంగానున్న చైతన్యంలోకి అతిమానసం ససేమిరా అవతరించదు.

అసత్యాన్ని జయించటానికి తొలి నియమమం, అది కేవలం ప్రాథమికమే అయినా, అబద్ధాలు చెప్పడం ఆపివేయుట.. అసలు లక్ష్యాన్ని సాధించాలనుకుంటే, ఒక సంపూర్ణ, సమగ్ర సద్భావన జీవిలోనే గాక దాని అన్ని కదలికల్లోకూడా ప్రతిష్టింపబడాలి. ఉచ్ఛరించబడిన ఒక్కో అబద్ధం అఖండత్వ విచ్ఛిన్నానికి దారితీసే ఒక్కో అడుగు అవుతుంది. జయమొందుటకన్నా సత్యం కోసమే ఎక్కువ ఆతృత ఉండాలి.

*

సత్యంపై ప్రేమ, వెలుగుకై తపన, మన జీవితాన్ని శాశించేవిగా నుండాలి.

*

దైవానికి చేరువ కావాలని కోరుకుంటే, సమగ్ర సత్యసంధత జీవితాన్ని శాసించేదిగా ఉండాలి.

*

ఎప్పుడైతే మనం లక్ష్యం పైన ఈ సమగ్ర పరిపక్వ స్థితిని చేరుకుంటామో అప్పుడు సత్యము నాలుగు ప్రధానమైన అవస్థలతో కూడుకున్నదని మనకు తెలిసివస్తుంది.

అది ప్రేమ, జ్ఞానం, శక్తి మరియు సౌందర్యము. పరమసత్యానికి చెందిన ఈ నాలుగు అంశాలు మన అస్తిత్వంలో వాటంతటఅవే ప్రతిబింబిస్తాయి.

1. నిజమైన మరియు స్వచ్ఛమైన ప్రేమకు చైత్యపురుషుడు వాహికగా నుంటాడు.
2. అమోఘమైన జ్ఞానానికి మనస్సు ఒక మాధ్యమంగా వుంటుంది.
3. ప్రాణికము అజేయమైనశక్తి సామర్థ్యాలను అభివ్యక్తం చేస్తుంది.
4. భౌతిక శరీరము పరిపూర్ణమైన సౌందర్యమును అవయవ పొందికను వెల్లడిచేస్తుంది.

*

పరమసత్యమంటే ఏమిటి? అని ఒక పదిహేనేళ్ళ బాలిక నన్ను అడిగినప్పుడు "అది పరమాత్మ యొక్క దివ్య సంకల్పము" అని నేను జవాబు యిచ్చాను.

అది ఆలోచనా గతమైన ధ్యానమునకు చెందిన విషయము.

మూలం: శ్రీమాత

అనువాదం: కవితారెడ్డి కె

సత్యానికి అంతిమ విజయం తథ్యం

దైవసంకల్పాన్ని ఎదిరించి మానవ సంకల్పం చివరకు నెగ్గగలదు. మన మందరము ప్రత్యేకించి ఉద్దేశపూర్వకంగా దైవం పక్షాన నిలుద్దాం. అంతిమ విజయం తథ్యం.

శ్రీమాత

*

అంతం సంభవించే ముందు అసత్యం పెల్లుబుకుతుంది.

మనుషులకు మహావిపత్తు సంభవించునని మాత్రం బాగా తెలుసు. అయితే పరమసత్యాన్ని వారు తెలుసుకునే ముందే ఆ విపత్తు సంభవించాలా? అలా జరగకుండా ఉండటానికై ప్రయత్నించాలని నేనందరిని కోరేది.

సత్యం ఒక్కటే మనకు రక్ష. మాటలో సత్యం, చేతలోసత్యం, సంకల్పంలో సత్యం, సంవేదనలోసత్యం. సత్యాన్ని సేవించాలా లేక నాశనం కావాలా? ఏది కావాలో ఎంపిక చేసుకునే అవకాశం మన ముందుంది.

*

పరమసత్యం అసత్యానికన్నా శక్తివంతమైనది. ప్రపంచాన్ని శాసించే శాశ్వత దివ్యశక్తి

ఒకటి ఉన్నది. దాని నిర్ణయాలు ఎల్లప్పుడు చలామణి అవుతాయి. దానితో అనుసంధానమైతే, నీకు అంతిమవిజయం తథ్యం

సత్యాన్ని నీ శక్తిగా గ్రహించు. సత్యాన్ని నీకు ఆశ్రయంగా చేసుకో.

ప్రశ్న: మధురమాతా, మంచితనము, నిజము సర్వదా జయిస్తాయి అని అంటారు. కాని జీవితంలో పలుమార్లు అందుకు విరుద్ధంగా జరుగుట చూస్తూంటాము. దుష్టులు జయించినట్లు, ఏదో విధంగా బాధలనుండి కాపాడబడినట్లు కనిపిస్తుంది.

జవాబు: (శ్రీమాత నవ్వి నిశ్శబ్దంగా ఉంటారు) మనుషులు చాలాసార్లు వారి ఆలోచనలను తారుమారు చేస్తుంటారు. సార్వత్రిక, ఆధ్యాత్మిక దృష్టి కోణంలో మనుషులు 'మంచి' అనే దానికన్నా వాస్తవమైన దానికి 'సత్యం' అనబడే దాని మాటే చెల్లుతుంది. అందులో సందేహం లేదు అలా అనడంలోని అంతరార్థం చిట్టచివరకు దైవపరమైనదే గెలుస్తుంది అని. అదే జనవాక్యం. అదే ఆధ్యాత్మిక మార్గంలో జీవితం గడిపిన వారంతా చెప్పింది. అది తిరుగులేని నిజం. కాని మనుషులు ఇదే విషయం యొక్క భావాన్ని ఈ విధంగా అన్వయించుకుంటారు. "నేను మంచి బాలుణ్ణి, నేను సత్యమనుకున్న దాని ప్రకారమే జీవిస్తాను. అందువలన స్థితిగతులన్నీ నాకు అనుకూలంగా ఉండాలి." (శ్రీమాత నవ్వుతారు.) మొదటగా ఎవరి గురించి వారు వేసుకొనే అంచనా ఎప్పుడూ సందేహాస్పదమే. అంతేగాక ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు అంతా కలగాపులగం, అంతా అస్పష్టం. సగం గ్రుడ్డిదైన మానవ చైతన్యానికి సత్యం యొక్క నియమనిబద్ధత దర్శనీయం కాదు. కనీసం అదేమిటో కూడ దానికి అర్థం కాదు. నిష్కర్షగా నేననుకున్నది చెప్పాలంటే పరమోత్తమమైన దివ్యదర్శనం తనకై తాను నిరంతరం అనుభవమౌతున్నది. అయితే అస్తవ్యస్తంగానున్న ఈ వస్తుప్రపంచంలో దాని దర్శనం అజ్ఞానాంధకారబంధురమైన మానవ దృష్టికి మంచితనం యొక్క గెలుపుగా (మనుషులు మంచిది, సత్యమైనది అనుకునేది) గోచరించదు. సరదాగా చెప్పాలంటే అది మనుషుల తప్పిదమే కాని దైవం తప్పుకాదు. అనగా తాను చేసే దేమిటో దైవానికి తెలుసు. కాని మనుషులకది అర్థం కాదు.

ప్రపంచం నిరంతరంగా మార్పు చెందుతుంటుంది ఎడతెగకుండా. క్షణమాత్రంకూడా తను తానుగా నుండదు. అయితే దానిలోని సామరస్యత స్వతహాగా పరిపూర్ణంగా వ్యక్తమౌతుంటుంది. అందువలన పైపైకి మార్పు చెందినట్లు కనుపించక

పోయినా, గతంలో మాదిరి ఉండలేదు. అఖండ సృష్టి అనవరతం పురోగమిస్తుంటుంది. సామరస్యత మరింత సామరస్యతను పుంజుకుంటున్నది. దృశ్యమాన జగత్తులో సత్యం మరింత దృఢంగా వ్యక్తమౌతుంటుంది. అయితే ఈ పరివర్తనను గమనించాలంటే జగత్తును అఖండమైనదిగా చూడాలి. కాని, మానవుడు తన దృష్టిని కేవలం అతి చిన్నదైన, సూక్ష్మాతి సూక్ష్మమైన, తన వ్యక్తిగత క్షేత్ర పరిధికి మాత్రమే పరిమితం చేసుకుంటాడు తప్ప కనీసం మానవ సముదాయక్షేత్ర పరిధిపై దృష్టి సారించడు. అంతకు మించి అతనికి అర్థంకాదు.

ఇది రెండంతలుగా పూర్తి అవుతున్న విషయం. పరస్పరం ప్రభావితం చేసుకుంటూ కొనసాగుతున్నది. ఈ దృశ్యమాన జగత్తు స్వయంగా తనను గురించిన ఎరుకను ఎంత ఎక్కువగా పెంచుకుంటుందో, తన అభివ్యక్తతను పూర్ణం గావించుకుంటుందో, దాని యదార్థత కూడా అంతగా దృఢపడుతుంది. ఈ రెండు ప్రక్రియలు జంటగా కొనసాగాలి.

ఇలాంటి సమస్యలన్నీ అన్ని వేళలా ప్రశ్నార్థకం అవుతూంటాయి. మానసిక సమస్యలు ఎదురవుతూంటాయి. అన్ని అజ్ఞానంనుండి వెలువడినవే. కదూ! ఉన్నత స్థాయికి ఎదిగిన వెంటనే అవన్నీ సమసిపోతాయి. వైరుద్యభావనలు పొడసూపవు. ఒక విషయాన్ని ఏకకాలంలో అనేక కోణాలలో తగిన విధంగా గమనించలేని అశక్తత వల్లనే వైరుధ్యాలు ఉత్పన్నమవుతుంటాయి.

ఏది ఏమైనా సమస్యను వాస్తవంగా పరిశీలించినట్లయితే, నేననుకునేది ఏ ఋషి అయినా "మంచిగా నుండు చాలు. నీకు బాహ్యంలో అంతా సవ్యంగా జరుగుతుంది." అని ఎప్పుడూ అనలేదు. కారణం అది తెలివిలేమి కాబట్టి. కల్లోల భరితప్రపంచంలో, అసత్యం రాజ్యమేలుతున్న ప్రపంచంలో అలాంటి ఆశ పెట్టుకోవడం యుక్తం కాదు. అయితే, నీవు తగినంత నిర్వ్యాజమైన, సంపూర్ణమైన, అవిఛ్ఛిన్నమైన జీవనం సాగిస్తున్నట్లయితే అంతరంగ ఆనందాన్ని అనుభవించ గలుగుతావు. పరిపూర్ణమైన సంతృప్తిని పొందగలుగుతావు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా వాటి జోలికి పోగలుగుట ఎవరితరము కాదు.

ప్రశ్న: "సత్యానికి అంతిమ విజయం తథ్యం." అనే నిశ్చయం వ్యక్తికి ఉండాలని మీరంటారు. కాని సాధారణ జీవితంలో ఇందుకు భిన్నంగా, వ్యతిరేకంగా జరుగుతుందని అనిపిస్తుంది కదా?

జవాబు: అవును. ప్రకృతిలో విషయాలు చిట్టచివరకు చెడుగా పరిణమిస్తాయని నమ్మడం సర్వసాధారణం. జీవితంలో గొప్ప విజయాన్ని చవి చూసిన వారి చరితలు చరమదశలో దుఃఖాంతమైన కథలు విన్నాము. అసాధారణ శక్తి సామర్థ్యాలు కలిగిన వారు, చివరకు నిర్వీర్యులుగా, నిస్సహాయులుగా అయిన కథలు విన్నాము. గతంలో దీర్ఘకాలం మహాద్భుతమైన నాగరికతకు అలవాలమైన దేశాలు, నాగరికత అంతరించి దౌర్భాగ్యపు స్థితికి దిగజారి, జ్ఞాపకాల నుండి తుడిచిపెట్టుకు పోయిన చరిత్రలు విన్నాము. పృథ్వీచరిత్ర విజయాలను వెంటాడిన ఓటమిల కథగా కనిపిస్తుందిగాని, ఓటమిలను అనుసరించిన విజయాలకథగా కాదు.

కాని వాస్తవానికి సార్వత్రికమైన, దైవపరమైన విషయాల్లో సత్యం ఎలా స్వయంగా అభివ్యక్తమౌతుందో తెలుసుకొనుటకు కావలసినది సార్వత్రిక దృష్టి, దైవాన్ని గురించిన అవగాహన. విషయాలు, ఎంత చక్కగా ప్రారంభమైనా చివరకు చెడుగా అంతమొందుతాయనే నిరాశావాద మొకటి ప్రాచుర్యంలో ఉంది. బలహీనత, వంచన, అసత్యము, దుర్మార్గాలకే ఎప్పుడూ పైచేయి అని నిస్పృహ చెందటం మామూలే. ఆ కారణంగానే ప్రపంచాన్ని వారి వ్యక్తిగత పరిధిలో గమనించే వారంతా ప్రపంచం చెడుతో నిండి ఉన్నదని, దానితో సంబంధం తెంచుకావాలని, వీలయినంత త్వరగా ప్రాపంచిక వలయం నుండి బయట పడాలని అంటారు. ఆచార్యులు బోధించింది కూడ ఇదే. అయితే, దీని వల్ల ధృవపడే దేమిటంటే అలా భావించేవారి దృష్టి చాలా సంకుచితమైనదని, అది వారి వ్యక్తిత్వ పరిధులకు మాత్రమే పరిమితమైనదని.

నిజానికి, ప్రకృతియొక్క చలనాలు సముద్రపు ఆటుపోట్లవంటివి. ముందుకు వస్తుంటాయి, మళ్ళీ వెనక్కు తగ్గుతుంటాయి. సార్వత్రిక జీవితంలోను అలాగే ఐహిక జీవితంలోను, జీవితగమనం చూడటానికి వెనుకంజలతో ముక్కలైనదిగా కనిపించినా నిజానికి యిది అభ్యుదయ సూచక అభివృద్ధిగా పేర్కొనవచ్చు. ఈ తిరోగమనాలు పైకి కనబడేవే కాని నిజానికి అవి ముందుకు దూకడంకోసం వేసే వెనుకడుగులు. నీవు వెనుకంజవేసినట్లు కనిపిస్తావు. కాని అది కేవలం మరింత దూరం ముందుకు వెళ్ళడానికే.

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి జానకి

6/2/2013.

క్రియాశీల విశ్వాసం

అఖిల

అఖిల భారత పత్రిక — ఫిబ్రవరి 2013

6/2/2013.

విషయసూచిక

శ్రీమాత వాక్కులు

శ్రీఅరవిందుల వాక్కులు



ఎవరికైతే దివ్యానుగ్రహం పట్ల అకుంఠిత విశ్వాసం ఉంటుందో, అది సదా కాపాడుతుందనే నమ్మక ముంటుందో, వారికి ఏమి జరిగినా సరే, ఆ ఆనుగ్రహం వారిని అంటిపెట్టుకుని ఉంటుందనే సంగతి జీవితమంతా చెక్కుచెదరకుండా అలాగే ఉంటుంది. ఎలాంటి విపత్కర పరిస్థితులలోనైనా అది వారిని విడిచిపెట్టదు అన్న విశ్వాసం సడలిపోదు. ఈ విశ్వాసంతో వారు అపాయాలను సునాయసంగా దాటగలరు.

శ్రీమాత

క్రియాశీల విశ్వాసం

నిశీథం తనలో దాచుకున్న మార్మికశక్తి ఆమె, ఆత్మకు చెందిన పరుశువేదశక్తి ఆమె, ఆమె సువర్ణ వారధి, మహాద్భుత వహ్ని. భగవంతుని ప్రజ్వల హృదయమామె. పరమేశ్వరాంతర్గత నిశ్శబ్ద శక్తి. ఆమె ఆద్యశకి, తిరుగులేని శబ్దబ్రహ్మ. మన కఠోర పురోగమనానికి ప్రబల ఆకర్షణ మామె, మనలో చిరుదీపాలను వెలిగించే మహాసూర్యతేజం. ఇతః పూర్వ మెరుగని సీమల వెలసిన పరంజ్యోతి, అనూహ్యా స్తరాల నుండి అందే ఆనందహేల, ఈ నాటికీ భువికి దిగని మహోన్నత మహాశక్తి.

మూలం: శ్రీఅరవిందులు (సావిత్రి పుట. 314)

*

నీవు క్రియాశీల విశ్వాసం గురించి మాట్లాడుతున్నావు. క్రియాశీల విశ్వాసం ఒక ప్రత్యేకమైనది. ఎవరికైతే దివ్యానుగ్రహం పట్ల అకుంఠిత విశ్వాసం ఉంటుందో, అది సదా కాపాడుతుందనే నమ్మకముంటుందో, వారికి ఏమి జరిగినా సరే ఆ అను గ్రహం వారిని అంటిపెట్టుకుని ఉంటుందనే సంగతి జీవితమంతా చెక్కుచెదరకుండా అలాగే ఉంటుంది. ఎలాంటి విపత్కర పరిస్థితులలోనైనా సరే, అది వారిని విడిచిపెట్టదు అన్న విశ్వాసం సడలిపోదు. ఈ విశ్వాసంతో వారు అపాయాలను సునాయాసంగా దాటగలరు. కష్టాలన్నింటిని ధైర్యంగా ఎదుర్కోగలరు, చలించరు. కారణం, వారికి విశ్వాసం ఉంది గనుక, దైవానుగ్రహం వారి వెన్నంటి ఉంటుంది గనుక. అది అఖం డమైనది, బలమైనది, సచేతనమైనది, ఎక్కువ కాలం నిలిచి వుండే శక్తి. శారీరక నిర్మాణ పరిస్థితులపై ఆధారపడనిది. దైనానుగ్రహం మీద తప్ప మరి దేని మీద ఆధారపడదు. అందుకే అది ఆ పరమ సత్యం మీదనే ఒదిగి ఉంటుంది. వేరే ఏ శక్తి దానిని కదిలించలేదు.

మూలం: శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కర రావు

శ్రద్ధ అంటే ఏమిటి?

శ్రద్ధ ఎలాంటి ఋజువు అవసరం లేని నిశ్చయత.

*

శ్రద్ధ అనుభవంపై, జ్ఞానంపై ఆధారపడనవసరం లేని నిశ్చయత.

*

శ్రద్ధ మానసిక పరిధి లోని సహజసిద్ధ జ్ఞానం.

*

శ్రద్ధ భౌతిక ఋజువులపై ఆధారపడినదైతే అది శ్రద్ద కానేరదు. బేరం అవుతుంది.

*

శ్రద్ధ అతి కష్టకాలంలో నిశ్చయంగా నమ్మదగిన మార్గదర్శి.

*

అనుక్షణం, అనిరీక్షిణమైనవి, అనూహ్యామైనవి, అగ్రాహ్యామైనవి మనకు ఎదురౌతుంటాయి. వాటి వలన కలిగే పరిణామాలు చాలా వరకు మన శ్రద్ధ యొక్క తీవ్రతపైన, స్వచ్ఛత పైన ఆధారపడి ఉంటాయి.

*

మన శ్రద్ధారాహిత్యమే, మనకు హద్దులను విధిస్తుంది.

*

దైవశక్తి అనంతమైనది — మన శ్రద్ద అత్యల్పమైనది.

*

వివేకంతో కూడిన విశ్లేషణ చివరకు తేల్చేదేమిటంటే దైవానుగ్రహంపై సంపూర్ణ శ్రద్ధ, గట్టి నమ్మిక కలిగి యుండుటయే పరమోత్కృష్టమైన దివ్యజ్ఞానం.

*

"ప్రతి విషయము విషమదశ నుండి అత్యంత విషమమైనదిగ పరిణమిస్తున్న తరుణంలో, దైవమే శరణ్యమన్న దృఢమైన శ్రద్ధతో పనిచేయాలి. దైవానుగ్రహం మనకు ఎన్నటికీ ఆశాభంగం కలగనీయదనే గట్టి నమ్మకం కలిగి ఉండాలి"

అలా నేను అనుటలో అర్థం, పర్యవసానాల పట్టింపు లేకుండా, మన అంతరంగ

శ్రద్ధ అంటే ఏమిటి?

శ్రద్ధ ఎలాంటి ఋజువు అవసరం లేని నిశ్చయత.

*

శ్రద్ధ అనుభవంపై, జ్ఞానంపై ఆధారపడనవసరం లేని నిశ్చయత.

*

శ్రద్ధ మానసిక పరిధి లోని సహజసిద్ధ జ్ఞానం.

*

శ్రద్ధ భౌతిక ఋజువులపై ఆధారపడినదైతే అది శ్రద్ధ కానేరదు. బేరం అవుతుంది.

*

శ్రద్ధ అతి కష్టకాలంలో నిశ్చయంగా నమ్మదగిన మార్గదర్శి.

*

అనుక్షణం, అనిరీక్షితమైనవి, అనూహ్యమైనవి, అగ్రాహ్యమైనవి మనకు ఎదురౌతుంటాయి. వాటి వలన కలిగే పరిణామాలు చాలా వరకు మన శ్రద్ధ యొక్క తీవ్రతపైన, స్వచ్ఛత పైన ఆధారపడి ఉంటాయి.

*

మన శ్రద్ధారాహిత్యమే, మనకు హద్దులను విధిస్తుంది.

*

దైవశక్తి అనంతమైనది — మన శ్రద్ద అత్యల్పమైనది.

*

వివేకంతో కూడిన విశ్లేషణ చివరకు తేల్చేదేమిటంటే దైవానుగ్రహంపై సంపూర్ణ శ్రద్ధ, గట్టి నమ్మిక కలిగి యుండుటయే పరమోత్కృష్టమైన దివ్యజ్ఞానం.

*

"ప్రతి విషయము విషమదశ నుండి అత్యంత విషమమైనదిగ పరిణమిస్తున్న తరుణంలో, దైవమే శరణ్యమన్న దృఢమైన శ్రద్ధతో పనిచేయాలి. దైవానుగ్రహం మనకు ఎన్నటికీ ఆశాభంగం కలగనీయదనే గట్టి నమ్మకం కలగి ఉండాలి"

అలా నేను అనుటలో అర్థం, పర్యవసానాల పట్టింపు లేకుండా, మన అంతరంగ

ప్రధానమైన మొదటి నియమం

పసిబిడ్డకుండే విశ్వాసం

అత్యంత ముఖ్యమైన నియమం, పసిబిడ్డల కుండే విశ్వాసం. తనకు అవసరమైనది ఏదైనా కావలసినపుడు తాను అడగకుండానే అది తప్పక వచ్చి తీరుతుందనే ప్రగాఢ విశ్వాసం. ఇటువంటి విశ్వాసం నిజానికి అత్యంత ప్రధానమైనది.

ఆకాంక్షించడం తప్పనిసరి. కాని కొందరిలో ఆకాంక్ష ఘర్షణతో కూడుకొని ఉంటుంది. అది విశ్వాసం అవిశ్వాసం మధ్య, నమ్మకం అపనమ్మకం మధ్య, జయం తథ్యమనే ఆశావాదం, అపజయం సంభవిస్తుందేమోననే నిరాశావాదానికి మధ్య జరిగే ఘర్షణ. అస్తిత్వంలో ఇటువంటి వైఖరిని కలిగి ఉంటే, ఆకాంక్షించినా ఏదీ దక్కదు. "నేను ఆకాంక్షించాను. కాని నాకు ఏదీ దక్కలేదు" అని అనుకుంటావు. దానికి కారణం, నమ్మకం లేమితో ఎప్పుడో ఆకాంక్షను నాశనం చేసుకున్నావు. పెద్దలచే వక్రీకరించబడనీయక బిడ్డలను వారి మటుకు వారిని వదిలేస్తే, అంతా సవ్యంగానే ఉంటుందనే దృఢవిశ్వాసం కలిగి వుంటారు. వారి వలె నీవు కూడా నిజంగా విశ్వాసంతో ఉన్నట్లైతే అంతా సవ్యంగా ఉంటుంది. ఉదాహరణకు, పిల్లలకు ఏదేని చిన్న ప్రమాదం జరిగితే అది ఏదో తీవ్రమైనదవుతుందని ఆలోచించరు. అది త్వరలో తొలగిపోతుందని మనఃపూర్వకంగా నమ్ముతారు. ఈ నమ్మకం శక్తివంతంగా పనిచేసి ఆపదను తొలగిస్తుంది.

సంభవించి తీరుతుందని, సంభవిచకపోవడం అసాధ్యమని అచంచలమైన దృఢ విశ్వాసంతో మనిషి దైవశక్తి కోసం ఆకాంక్షించినా, దైవసహాయం అర్థించినా అది తప్పక జరిగి తీరుతుంది. ఈ విధమైన విశ్వాసం, స్ఫూర్తి ఒక ఆంతరంగిక ఉన్మీలన మవుతుంది. కొందరు నిరంతరం ఈ స్థితిలోనే ఉంటారు. ఏదేని శక్తి, ఆదేశం దైవం నుంచి స్వీకరించవలసి వస్తే అందుకొనుటకు ఎల్లవేళలా వారు అప్రమత్తులై ఉంటారు. మరి కొందరు దైవశక్తి క్రిందకు దిగివచ్చినపుడు, ఆ క్షణాన అభావంతో తమను తాము మూసుకొని వుంటారు. కాని పసిబిడ్డ కున్న విశ్వాసం కలవారు సమయానికి సన్నద్ధంగా ఉంటారు.

విచిత్రంగా, వారికి వీరికి బాహ్యంగా ఏ బేధం ఉండదు. వారికి ఆదరాభిమానాలు,

ఆకాంక్ష, ఔదార్యం సమానంగా వుంటాయి. కాని చిరునవ్వుతో కూడిన విశ్వాసంతో ఉన్నవారు అది కావాలా, వద్దా అని, దైవం సమాధానం ఇస్తాడా ఇవ్వడా అని, వారిని వారు ప్రశ్నించుకోరు. ఆ ప్రశ్న ఉత్పన్నం కాదు. అది నిర్వివాదంగా తెలియబడినది. “నాకు అవసరమైనది నాకు ఇవ్వబడుతుంది. ప్రార్థిస్తే సమాధానం వస్తుంది. కష్టంలో ఉండి సహాయాన్ని అర్థిస్తే అది అందుతుంది. పైగా పరిస్థితిని చక్కదిద్దుతుంది.” స్వచ్ఛందమైన, నిష్కపటమైన, నిర్వివాదమైన విశ్వాసముంటే, అన్నింటినీ మించి అదే చక్కగా పనిచేస్తుంది. దాని ఫలితం అద్భుతంగా ఉంటుంది.

వైరుధ్యాలు, సందేహాలు మదిలో ఉంటే అవి అన్నింటినీ చెడగొడతాయి. ఇటువంటి ఊహలు కష్టాలలో ఉన్నప్పుడే కలుగుతాయి. “ఓహ్! ఇది అసాధ్యం. నేను ఎప్పటికీ దీనిని నిర్వహించలేను. ఇది ఇంకా తీవ్రతరమైతే, నాకు యిష్టం లేని ఈ పరిస్థితి ఇంకా అధ్వాన్న మైతే, నేను ఇంకా దిగజారిపోతే, ఇలా అయితే, అయితే”.... ఈ విధంగా భావిస్తే, ఆ వ్యక్తి తనకు, తాను అందుకోగోరే దైవశక్తికి మధ్య ఒక గోడను నిర్మిస్తాడు. చైత్యపురుషునికి ఈ విధమైన విశ్వాసం వుంటుంది. ఆ విశ్వాసం అత్యద్భుతమైనది, మసకబారనిది, వివాదాస్పదం కానిది, వైరుధ్యం లేనిది. ఆ స్థితిలో ప్రతిస్పందన లేని ప్రార్థన ఉండదు, ఫలించని ఆకాంక్ష ఉండదు. నీ నమ్మకం నిన్ను సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుని అండలో ఉంచుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: త్రివేణి

రెండవ నియమం — సంపూర్ణ విశ్వాసం

మానసిక సంకల్పం సరిపోదు

ప్రశ్న: అమ్మా! మానసిక ప్రయత్నంతో... ఉదాహరణకి జబ్బు చేసినప్పుడు మందు వాడకూడదు అని నిశ్చయించుకుంటే, ఆ సంకల్పాన్ని శరీరం అర్థం చేసుకొనేలా చేయడంలో విజయం సాధించగలమా?

చాలదు. మానసికంగా చేసుకొనే సంకల్పం సరిపోదు. నీ శరీరంలో సూక్ష్మ మైన ప్రతిక్రియలుంటాయి. అవి మనో సంకల్పానికి విధేయంగా ఉండవు. అందుకే అది సరిపోదు. ఇంకొకటి ఏదో అవసరమౌతుంది.

మనలోని ఇతర స్తరాలను కలవాలి. మనస్సు కంటే ఉన్నతమైన 'శక్తి' అవసరం.

ఈ దృక్కోణం నుండి చూచినట్లైతే మనస్సులో ఉన్నదల్లా ఎల్లప్పుడు అంతరంగంలో ప్రశ్నార్థకమవుతుంది. నీవేదైనా సంకల్పించినప్పుడు చూడు! కచ్చితంగా ఏదో ఆ సంకల్పంతో బహిరంగంగా తలపడకపోయినా ఆ నిశ్చయం యొక్క ప్రభావాన్ని మాత్రం ప్రశ్నించుతూనే వుంటుంది. అది చాలు.... ఒక చిన్న సంశయంతో 'ఆ' చేసుకొన్న సంకల్పం తన ప్రభావాన్ని సగం కోల్పోతుంది. అదే సమయంలో 'ఇది నాక్కావాలి' అంటావు. అంతే... నీ మనసు వెనుకగా సవ్వడి లేకుండా నక్కి చూస్తున్నదేదో తనను తాను ప్రశ్నించుకుంటుంది — "దీని వల్ల కలిగే ఫలితం ఏమిటి?" అని — ఇది చాలు మొత్తాన్ని పాడుచేయడానికి.

మనసు పనిచేసే తీరు, చాలా సూక్ష్మంగా వుంటుంది. ఏ సామాన్య మానవీయ సాధనాలు దీనిని పూర్తిగా నియంత్రించడంలో సఫలం కావు. ఉదాహరణకు తమ శరీరాన్ని నియంత్రించుకోవడానికి యోగాభ్యాసం చేసేవారిలో ఇది సర్వ సాధారణంగా కనిపిస్తుంది. ఎంతో శ్రద్ధగా యౌగిక ప్రయత్నంతో వారిలోని దేనినో నియంత్రించుకోవడంలో కృతకృత్యులు కావచ్చు. అది ఒక శారీరక బలహీనత లేదా ఆంతరిక అస్థిరత కావచ్చు. అలా ఒక అంశంపై పనిచేసి కొంతమేరకు ఫలితాన్ని పొందవచ్చు. ఉదా: చాలాకాలం పాటు, కొన్ని సంవత్సరాల పర్యంతం ఆ అస్థిరతను మటుమాయం చేసేయవచ్చు. అది మంచిదే.... కానీ ఏదో ఒక రోజు ఒకానొక క్షణంలో, హఠాత్తుగా, మెరుపులా ఒక తలంపు దూసుకొస్తుంది. — 'ఆ. ఇప్పటికి ఇది అయిపోయింది' మరుక్షణం అది పునః ప్రత్యక్షమవుతుంది. అది చాలు. కారణం, దాని వలన రుజా

వయ్యేదేమిటంటే, ఏది నిరాకరిచబడిందో దాని ప్రకంపనాల తీవ్రత సన్నగిల్లిన స్థాయిలో వారికి వాటితో పునః సంధాన మేర్పడినప్పుడు, కారాణాంతరాల వల్ల కొన్ని శక్తుల ప్రమేయంతో అవి ఉన్మీలన మవుతాయి. అందువలన నిరాకరింపబడినది పునరావృత మవుతుంది. యోగంలో ప్రాచుర్యమందిన విషయం — సాధించిన ఒక విజయాన్ని తలపోస్తూ వుండటం, దానినే అదే పనిగా చింతన చేస్తూ దానిపైనే ధ్యాస పెట్టడం ఉన్నదే... అది చాలు... ఏళ్ళ తరబడి సాధించుకొన్న యోగసాధనా ఫలితాన్ని నాశనం చేయడానికి.

లేదు... మానసిక ఆవరణలో విజయలు సాధించడం అనేది వుండదు. అది అసాధ్యం. ఇక్కడ అన్ని రకాల ప్రభావాలకూ, అన్ని వ్యతిరేక ప్రవాహాలకు లోనుకావడం వుంటుంది. మనుషులు కల్పన చేసే మానసిక కల్పనలన్నీ వాటికవిగా పరస్పర వైరుధ్యాన్ని మోసుకొస్తాయి. దానిని అధిగమించడానికి యత్నించవచ్చు. ఎంత మేరకైతే అంత మేరకు హాని కల్గించనిదానిగా చేయవచ్చు. కానీ అది అట్లాగే వుంటుంది. అక్కడే వుంటుంది. ఏ కొద్దిపాటి బలహీనతో, జాగరూకత లేకపోవడం లేదా పరాకుగా వున్న క్షణంలోనో అది చటుక్కున ప్రవేశిస్తుంది. మొత్తం చేసినదంతా పాడుచేస్తుంది. మానసికంగా కొద్దిపాటి ఫలితాలు మాత్రమే పొందవచ్చు. అవన్నీ సదా కలగాపులగమైనవే... ఇక్కడ... ఇంక మరే దాని అవసరమో వున్నది. సురక్షితంగా పనిచేయగలగడం కోసం మనస్సును దాటి 'విశ్వాస' తీరాలకో, లేక ఉన్నతతర చైతన్యంలోకో పయనమై తీరాలి.

శరీరంపై పనిచేయగల అతి శక్తివంతమైన సాధనం 'విశ్వాసం' అన్నది సుస్పష్టం. గందరగోళమైన మనస్సుతో కాక ఎంతో సహజంగా, మామూలు హృదయంతో వుండే కొద్దిమంది మనుషులు, సామాన్యులు... వీళ్ళల్లో గొప్ప మేధస్సు, సంక్లిష్టమైన మనోవికాసం లేకపోయినా... ప్రగాఢమైన విశ్వాసం వుంటుంది. ఇట్లాంటి వాళ్ళు, వాళ్ళ శరీరంపై పనిచేయగల గొప్ప శక్తిని — చాలా గొప్ప శక్తిని కల్గి వుంటారు. అందుకే కొన్ని సమయాలలో ఆశ్చర్యం కల్గుతుంది. "ఇక్కడొక మనిషి గొప్ప ఆధ్యాత్మికానుభవం పొందినవాడు వున్నాడు. అతడొక అరుదైన వ్యక్తి. కానీ చూస్తే అతడు చాలా అల్పమైన భౌతిక విషయాలకు బానిస, అదే మనిషి చాలా సాదాగా, మోటుగా కనిపిస్తాడు. కానీ అతడిలో గొప్ప విశ్వాసం వుంది. ఒక విజేతకు మల్లే కష్టాలను, అవరోధాలను అధిగమించుకొంటూ పోతాడు!"

అయితే ఉన్నత సంస్కృతి గలిగిన మనిషిలో 'విశ్వాస' మనేది వుండదని నేను చెప్పడం లేదు. కానీ అలా ఉండటం చాలా కష్టం. కానీ వ్యక్తిలో మానసిక అంశం ఒకటి ఉండి ఎప్పుడూ విభేదిస్తూ, చర్చిస్తూ అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ సమ్మతించడానికి ఒప్పుకోక, సాక్ష్యాలు అడుగుతూ వుంటుంది. అతని విశ్వాసంలో స్వచ్ఛత లోపించింది. ఇంకా పరిణామం ఊర్ధ్వగమనంలో, ఉన్నతంగా పోవలసిన అవసరం ఉంది. మానసిక స్తరాన్ని దాటి ఆధ్యాత్మిక స్తరం లోనికి పోవాలి. అప్పుడిక సహజంగానే విశ్వాసం శ్రేష్టమైనదిగా ఉత్తమ తరహాలో రూపొందుతుంది. నా అభిప్రాయంలో నిత్య సామాన్య జీవితంలో ఒక మామూలు మనిషి గనుక ఒక తీవ్రమైన విశ్వాసాన్ని గలిగి వుంటే, అతనికి అతని శరీరం వశమై వుంటుంది. అది ఒక బలవంతపు 'ఆధిపత్యం' కాదు. సహజంగా దానికదిగానే జరిగే చర్య. అలా శరీరాన్ని అదుపులో వుంచుకోవడం అన్నది చాలా చాలా ఉన్నత అభివృద్ధి శిఖరాలు చేరుకొన్న వ్యక్తి చేయగలగినదాని కంటే గొప్పది.

ప్రశ్న: కేవల విశ్వాసమన్నది సర్వాన్ని, సృష్టించగలదా? గెలుచుకొని రాగలదా?

అవును. అయితే అది సమగ్రమైన విశ్వాసం అయ్యుండాలి. అది పరిపూర్ణమైనదీ, నిర్దిష్టమైనదీ కావాలి. ఏదో మామూలు మానసికశక్తితో కూడుకొన్న తలంపు లేదా సంకల్పమో కాకూడదు. లోతైనదై ఉండాలి. మనస్సులో ఉదయించే సంకల్పం వ్యతిరేకమైన ప్రతిచర్యలను, ప్రతిఘటనను కలుగజేస్తూ వుంటుంది. రోగాలను నయం చేయడంలో 'కోయే' చికిత్సా విధానాన్ని గూర్చి మీరంతా వినే వుంటారు. ఆవ్యక్తి ఆ శక్తిలోని రహస్యాన్ని ఒకదానిని తెలుసుకొని ఒక నిర్దిష్టమైన ప్రభావంతో వినియోగించాడు. కానీ దానిని మనసుకు చెందిన కల్పనా శక్తిగా పిలిచాడు. అతడి చికిత్సా విధానం అందించిన విశ్వాసాన్ని మానసికమైనదిగా పిలిచాడు. ఈ మానసిక విశ్వాసం సరిపోదు. ఈ విశ్వాసం భౌతికమైన, ప్రాణికమైన విశ్వాసం చేత బలపరచబడి పరిపూర్ణత నొందాలి. మీరు గనుక ఈ విధమైన సమగ్రమైన 'శక్తి' ని మీలోని అన్ని స్థాయిల్లోనూ నిలుపుగో గలిగితే, ఇక దానిని ఏదీ ఆపలేదు. కానీ దీని కోసం చాలా లోతుగా అధోచేతనా స్థాయి వరకూ పోగలగాలి. శరీరంలోని ప్రతి కణంలోనూ ఈ విశ్వాసాన్ని నెలకొల్పాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

మూడవ నియమమం — పరిశుద్ధ విశ్వాసము

"మానసిక, ప్రాణిక జీవిలో అత్యాశ, గర్వం, ఆడంబరం, మానసిక తృష్ణ, ప్రాణిక స్వాభిలాష, స్వార్థపూరిత అపేక్ష, నిమ్న స్వభావసిద్ధమైన అల్ప వాంఛా సంతృప్తి మొదలగువాటితో కలుషితమైన, అహంకారపూరితమైన విశ్వాసం పొగతో కప్పబడి మసకబారిన జ్వాలగా పైకెగసి దివ్యసన్నిధి నందుకోలేదు."

— శ్రీఅరవిందులు

ప్రశ్న: మానసికజీవిలో అహంకారపూరిత విశ్వాసం ఎలా వుండగలదు?

శ్రీమాత: ఆయన చాలా చక్కగా వర్ణించారు. 'కలుషితమైన అత్యాశ' లాంటి పదాలతో. మరో విధంగా ఆలోచించి చూస్తే, అది మరింత వాస్తవమనిపిస్తుంది. వీటిలో ఏ మాత్రమైన అంటని విశ్వాసమంటూ ఉంటుందా? అదిలా చెప్పబడుతున్నది. విశ్వాసం శుద్ధమైనదైతే అది చాలా శక్తివంతమౌతుంది. దేనిచేత ఆటంకపరచబడలేని సామర్థ్యం కలదవుతుంది. దీనర్థం మనిషికి పరిశుద్ధమైన విశ్వాసం వుంటే, వీటన్నిటివల్ల కలుషితం కాకుండా వుంటె ఒక విధమైన వాస్తవమైన విశ్వాసం, ఒక యదార్థమైన విశ్వాసం ఉంటే, సాధ్యపడనిదంటూ ఏమీ ఉండదు. తెల్లవారే లోపల వ్యక్తి పరివర్తన చెందగలడు. అతిమానసాన్ని క్షణంలో క్రిందికి తేగలడు, ఏదైనా చేయగలడు. అయితే అది పరిశుద్ధమైన విశ్వాసం కావాలి. అది వ్యక్తిగతమైన ప్రతీకారాలతో గాని, సంకల్పంతో గాని కలిసి వుండకూడదు.

పరిశుద్ధమైన విశ్వాసం ఎవ్వరూ నిరోధించలేని అన్ని శక్తులతో నిండివున్న ఒక మహాశక్తి. అంత పరిశుద్ధమైన విశ్వాసాన్ని పొందడం చాలా అరుదు. సులువుగా పొందగలిగినదైతే పరిశుద్ధమైనది కాదన్న మాట. మనలో ప్రతి ఒక్కరూ ఒక విశ్వాసం కలిగి వున్నాం. ఉదాహరణకి, ఏదో ఒక దాంట్లో నమ్మకం, మనలో వున్న దేవుడి మీద నమ్మకం అనుకో. మనలో విశ్వాసం కనుక అతి శుద్ధమైనదయితే వెంటనే మనం మనలో వున్న దైవసాన్నిధ్యాన్ని తెలుసుకోగలం. ఈ ఉదాహరణను అర్థం చేసుకోవడం చాలా సులభం. నీకు నమ్మకం అన్నది ఖచ్చితంగా వున్నది. కాని అది వున్న అనుభవం నీకు కావడం లేదు. ఎందుచేత? ఎందుచేతనంటే ఆ విశ్వాసం పరిశుద్ధమైనది కాదు. నీ విశ్వాసం గనుక పరిశుద్ధమైనదైతే వెంటనే ప్రయోజనం సిద్ధిస్తుంది. ఇది ఎంతో సత్యం. అందుచేత, సాధించబడలేదని తెలిసిన క్షణాన,

అందుకు కారణం ఏమిటని చూడాలి. "ఎందుకు సాధ్యపడలేదు? నా విశ్వాసంలో ఏ లోపం ఉంది?" అని సరైన విధంగా చూడడం ప్రారంభించగలగాలి. ఇలా చిత్తశుద్ధితో చూడ్డం మీరు కొనసాగించినట్టయితే దానిలో ఎన్నో సూక్ష్మవిషయాల్ని గమనించ గలరు. అవి చిన్న విషయాలే. పెద్దవేం కాదు. కాని ఏవగించుకొనే విషయాలు. చిన్న విషయాలే. చాలాసార్లు కొంత స్వాతిశయం తలెత్తుతుంది. తరువాత ఒక చిన్న కోరిక, మరీ దారుణమైనదేం కాదు. అది తనని తాను పెద్దగా ప్రదర్శించుకోదు. అది నీ కిచ్చే శక్తి, నీకిచ్చే సంతృప్తి చెప్ప వీలుకానిది.

శ్రీమాత

మన ఆలోచనలో నిరంతరం సందేహించే, తర్కించే తత్వం ఏ మూలో కొద్దిగానైనా వుంటుంది. అది ప్రతి విషయాన్ని పాడుచేస్తుంది. అది మనిషి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు, తనేమీ చెయ్యలేనని మనసు గుర్తించినప్పుడు, అది శుద్ధ వాజమ్మగా, అసమర్ధంగా నిలబడిపోయినప్పుడు, అటువంటి సమయాల్లో మనిషి ఒక ఉన్నతమైన సహాయం ఆకాంక్షించినట్టయితే, ఆ ఆకాంక్ష సరిగ్గా నిరాశ లోంచి పుట్టుకొచ్చిన తీవ్రత గలదైతే, అది ఫలిస్తుంది. కానీ, నీ ఆలోచన వాదనను కొనసాగించినట్టయితే "అవునవును. నేను ఆకాంక్షించేను. నేను ప్రార్థించేను. కాని భగవంతుడికి తెలుసు. అది ఈ క్షణమేనా అని, అది ఎలా వస్తుందో? ఎలా సాధ్యమవుతుందో?" అని. సరే. అప్పుడు అంతా అయిపోయినట్లే. ఇక అది పని చెయ్యదు. అత్యంత సాధారణంగా జరిగే విషయాల్లో ఇది ఒకటి. ప్రయత్నాన్ని మొత్తం కూకటి వేళ్ళతో సహా నరికి పారేస్తున్నామని, వాళ్ళకు తెలీదు. వారికి విశ్వాసం లేదు, "నాకిది కావాలి..."

శ్రీమాత

అనువాదం నడిమింటి విజయలక్ష్మి

పర్వతాలను సైతం కదిలించే విశ్వాసం

చైత్యస్ఫూర్తిని, బాహ్య చైతన్యస్ఫూర్తి తిరస్కరించవచ్చు. కాని చైత్యజ్ఞానం సత్యమైనది. అంతఃస్ఫురణతో సహజసిద్ధమైనది. చైత్యస్ఫూర్తి అంటుంది "నాకు తెలుసు. నేను ఋజువు చెయ్యలేను. కానీ నాకు తెలుసు". కారణం, దాని జ్ఞానం మానసికమైనది కాదు. అనుభవం మీద, సత్యనిరూపణ మీద ఆధారపడినది కాదు. ఋజువు చేసిన తరవాత గాని నమ్మను అని అనదు. విశ్వాసమనేది ఆత్మస్పందన. అది హఠాత్తుగా, నేరుగా కలిగే జ్ఞానం. ప్రపంచం మొత్తం అంగీకరించకుండా, దానికి విరుద్ధంగా ఒక వెయ్యి నిదర్శనాలు చూపినా సరే అది తన అంతర జ్ఞానంతో, దేనినైనా ఎదిరించి నిలువగల ప్రత్యక్ష స్ఫూర్తితో, తాదాత్మ్య స్ఫూర్తితో అది నమ్మగలదు. చైత్యజ్ఞానం సుస్పష్టమైనది, పరిపూర్ణమైనది, ఒక దృఢ జ్ఞానరాశి. నువ్వు దానిని నీ మానసిక, ప్రాణిక, భౌతిక స్థాయిల్లోకి కూడా తెచ్చుకోగలవు. అప్పుడు నీది పరిపూర్ణ విశ్వాసమవుతుంది. అది పర్వతాలను సైతం కదిలించగల విశ్వాసం. అయితే అస్తిత్వంలో "అది అలాంటిది కాదు" అని అనకూడదు. పరిగణించ మని అడగకూడదు. అల్పమైన అర్థ విశ్వాసమే విషయాన్ని పాడుచేస్తుంది. పరిపూర్ణమైన అచంచల విశ్వాసమే లేకపోతే సర్వేశ్వరుడి అభివ్యక్తి ఎలా జరుగుతుంది? విశ్వాసం ఎప్పుడూ దానికదే అచంచలమైనది. అది దాని అసలు స్వభావం. అలా లేకపోతే, ఏ రకంగా చూసినాసరే విశ్వాసమే కాదు. ఒక్కొక్కసారి ఇలా కూడా జరగవచ్చు. అదేమిటంటే మనస్సు లేక ప్రాణికం లేదా భౌతికం చైత్యస్పందన ననుసరించక పోవచ్చు. ఒక మనిషి ఒక యోగి దగ్గరకు వెళ్తాడు. ఆ యోగి తనను గమ్యం చేరు స్తాడని హఠాత్తుగా ఆ మనిషి అతనిని వెంటనే నమ్మి అనుసరించడం ప్రారంభిస్తాడు. అతడు గమ్యం చేర్చగల సమర్థుడో కాదో కూడా తెలుసుకోడు. ఒక చైత్యదిగ్భ్రమలో అతడలా అనుకుంటాడు. తన అసలైన గురువునే కలుసుకున్నానని భ్రమ పడతాడు. సావధానంగా ఆలోచించిన తరవాతగాని, ఆశ్చర్యకరమైన సంఘటనలను చూచిన తరువాత గాని అతడు విశ్వసించలేడు. ఈ రకమైన విశ్వాసం మాత్రమే విశిష్టమైనది. తర్కవితర్కాలు ప్రారంభించినట్టయితే ఎప్పటికీ గమ్యాన్ని చేరలేరు. కొందరు తీరిగ్గా కూర్చుని చైత్యశక్తి అనేది హేతుబద్ధమా కాదా అని తర్కిస్తూ వుంటారు.

నిజానికి గుడ్డినమ్మకమని అనేదాని వల్ల మనుషులు తప్పుదారి పట్టరు. అలాంటి

వాళ్ళంటారు, "ఆహా! నేను దానిని నమ్మాను, ఆ మనిషిని నమ్మాను, అతను నన్ను వంచించాడు" అని. నిజానికి తప్పు అవతలి వ్యక్తిది కాదు. అలా నమ్మినవాళ్ళదే. అది వారిలోని బలహీనత. తన విశ్వాసాన్ని దృఢంగా నిలుపుకున్నట్లయితే, అవతల వ్యక్తిని మార్చగలిగేవాడు. ఆ విశ్వాసం చేతనలో ఉండకపోయి నందువలన మోసపోయాడు. ఆ వ్యక్తిని తనకు అనుకూలంగా మార్చలేకపోయాడు. అతడికే గాని సంపూర్ణ విశ్వాసం వుంటే ఆ మనిషిని మార్చగలిగేవాడు. పరిపూర్ణ విశ్వాసం వల్ల అద్భుతాలు జరుగుతాయి. ఒక మనిషికి మరో మనిషితో అనుబంధం ఏర్పడినప్పుడు భగవత్ సామీప్యాన్ని అనుభూతి చెందుతాడు. ఈ అనుబంధాన్ని నిర్మలంగా కొనసాగించగలిగితే, అది చాలా వరకు పదార్థంలో దివ్య చైతన్యం అభివ్యక్తం కావడానికి తోడ్పడుతుంది. కాని ఇదంతా మీ మీ స్వీయ స్థాయి మీద మీ చిత్తశుద్ధి మీద ఆధారపడి వుంటుంది. ఎంతగా చైత్యపరంగా మీరు సంసిద్ధులై వుంటే అంతగా సరైన మార్గం వైపు, సరైన గురువు వైపు నడుపబడతారు. చైత్యసత్తగాని, దాని పట్ల విశ్వాసం గాని ఎల్లప్పుడూ చిత్తశుద్ధికి మరో పేరు. కాని మీ బాహ్యసత్తలో మాత్రం కుటిలత్వం దాగి వుంటే, మీరు ఆధ్యాత్మిక జీవితం కాక వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రయత్నించినట్లయితే, అది మిమ్మల్ని తప్పుదారి పట్టిస్తుంది. అంటే విశ్వాసం కాదు, కుటిలత్వం తప్పుదారి పట్టిస్తుంది. విశ్వాసమన్నది దానికది ఎప్పుడూ నిష్కపటమైనదే. కాని అది మనిషిలోని నిమ్నచర్యల వల్ల కలుషితమైతే, అప్పుడు మీరు దారి తప్పుతారు.

*

ఎప్పుడూ మనకి మనమే పరిమితులను విధించుకుంటూ వుంటాం. ఎప్పుడూ మనం చెప్పేది. "అది సాధ్యమవుతుంది. ఇది సాధ్యం కాదు. ఇది సరైనది. చెయ్యగలం, అది చెయ్యలేం. ఇది సత్యం. ఇది సాధ్యమౌతుంది. అసలు ఈ పని అయిపోయినట్లే. కాని అది మాత్రం అసాధ్యం". మనకి మనమే ఎల్లప్పుడూ జైల్లో బానిసల్లా మన పరిమితుల మధ్య, జీవన సూత్రాలు తెలియని మూర్ఖ, సంకుచిత, అజ్ఞాన స్వభావాల మధ్య జీవిస్తుంటాం. జీవన సూత్రాలు మీరనుకున్నట్టు వుండవు. అంతే కాదు. అత్యంత మేధావులము అనుకునేవాళ్ళు అనుకున్నట్టు కూడా వుండవు.

అవి పూర్తిగా వేరు. ఒక్క అడుగు వేయడం ఆరంభిస్తే, ప్రత్యేకంగా ఆ మార్గంలో మొదటడుగు, — మనిషికి అవగాహన ఆరంభమవుతుంది.

శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

విశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోగలం?

'విశ్వాసం' ఖచ్చితంగా మనకి ఆ దివ్యకృప ఇచ్చిన వరమే. అది ఆ శాశ్వత సత్యానికున్న తలుపు హఠాత్తుగా తెరుచుకోడం లాంటిది. దాని ద్వారా మనం దాన్ని చూడగలం, స్పర్శించగలం.

అన్ని విషయాల్లోలాగే మానవాళి యొక్క ఆరోహణా క్రమంలో, విశ్వాసానికి కూడా ప్రారంభంలో స్వయంకృషి యొక్క ఆవశ్యకత ఉంది. అయితే కొన్ని ప్రత్యేక సందర్భాలలో మానవుల తెలివికి పూర్తిగా అంతుపట్టని కారణాలు ఉండడం సంభవమే. అలాంటి సందర్భాల్లో విశ్వాసం అకస్మాత్తుగా ఏర్పడవచ్చు. అది మనం ఏ మాత్రం అడక్కుండా కూడా ఏర్పడవచ్చు. కాని చాలాసార్లు ఒక లోపలి తపనకో, లేదా ఒక అవసరానికో లేదా ఒక ఆకాంక్షకు జవాబుగానో ఏర్పడుతుంది. అయితే అది ఎరుకతో ఒక క్రమబద్ధంగా చేసిన ప్రయత్నం కాకపోయినా, అది అస్తిత్వంలోనె ఉన్న ఒక ఆరాటం, ఒక వెతుకులాట. ఏది ఏదైనా, విశ్వాసం ఒక వరంగా ఇవ్వబడిందంటే, ఒక్కసారిగా ఈ అంతరంగ ప్రకాశం కలగిందంటే, ఆ ప్రకాశాన్ని నిరంతరం జ్వలింపచేస్తూ మన క్రియాశీల చైతన్యంలో నిలుపుకోవడానికి వ్యక్తిగతమైన కృషి చేయడం తప్పనిసరి. ఎవరైనా సరే, వారి విశ్వాసాన్ని గట్టిగా పట్టుకుని ఉండాలి, విశ్వాసాన్ని సంకల్పించాలి, దానిని అపేక్షించాలి, వెతకాలి, అభ్యసించాలి, రక్షించుకోవాలి

మానవ మనస్సులో కఠినమైన, నిరసించదగిన అలవాట్లుంటాయి — సందేహం, వాగ్వాదం, అనుమానం. సరిగ్గా ఇక్కడే మానవకృషి అవసరం — వాటిని దరిచేరనివ్వకుండా తిరస్కరించడానికి, వాటిని వినకుండా తిరస్కరించడానికి, అన్నింటి కన్న ముఖ్యంగా వాటి అనుసరణను తిరస్కరిచడానికి. మనస్సులో సందేహ సంశయములతో

ఆడుకోవడమంత అపాయకరమైన ఆట మరొకటి లేదు. అవి శత్రువులు మాత్రమే కాదు, అవి భయంకరమైన అగాధాలు. ఒక్కసారి వాటి లోతుల్లో పడితే బయటకు లాగబడటం అత్యంత కష్టమైనది.

కొందరు ఈ భావాలతో ఆడుకోడం, వాటిని చర్చించడం, వాటి విశ్వాసాలను వ్యతిరేకించడం మానసికంగా ఒక అందమైన అభిరుచి అనుకుంటారు. ఈ విధంగా ఉంటే వారు ఇతరుల కన్న గొప్ప దృక్పథంతో ఉన్నట్టు భావిస్తారు, మూఢనమ్మకాలు, 'అజ్ఞానం' లాంటి వాటిని అధిగమించామని అనుకుంటారు. కాని సందేహాస్పదము, అనుమానస్పదమైన సూచనలు వింటే గనుక భయంకరమైన అజ్ఞానంలోకి జారడమే కాదు, సరైన మార్గాన్నించి దారి తప్పుతావు. అయోమయంలో, పొరపాటులో, పరస్పర విరుద్ధమైన, అగమ్యమైన చిక్కుదారిలో ప్రవేశిస్తావు.... దాన్నించి బయటపడ గలనన్న భరోసా ఉండదు. నీవు నీ అంతరంగ సత్యం నించి ఎంత దూరం పోతావంటే, నువ్వు దాన్ని చూడలేవు, కొన్నిసార్లు నీ ఆత్మతో ఉన్న సంబంధాన్ని కోల్పోవడం కూడా సంభవమే.

విశ్వాసాన్ని కాపాడుకుందుకు, దాన్ని అంతరంగంలో పెంచుకుందుకు వ్యక్తిగతమైన కృషి తప్పనిసరిగా అవసరం. ఆ తరువాత – చాలా కాలం తరువాత – ఒక రోజు వెనక్కి తిరిగి చూసుకుంటె, అప్పటిదాకా జరిగినదంతా, చెడ్డవిగా అనిపించినవి కూడా మనలను సరైన మార్గంలో ముందుకు నడిపించడానికి ఆ దివ్యకృప వల్లే సంభవించాయని తెలుసుకుంటాం. అప్పుడు మన వ్యక్తిగత కృషి కూడ దైవప్రచోదితమే అని తెలియవస్తుంది. అయితే ఆ బిందువు దగ్గిరికి చేరడానికి ప్రతి ఒక్కరూ చాలా అభివృద్ధి చెందాలి, చాలా సంఘర్షించాలి, కొన్నిసార్లు చాలా దుఃఖాన్ని భరించాలి.

ఏం చేయకుండా జడమైన ఉదాసీనతతో ఉండి, "నాకు విశ్వాసం ఉండాలి. అది ఉంటే నాకదే వస్తుంది, దాన్ని దైవమే నాకిస్తాడు" అని అనుకోడం ఒక తామసికమైన దృక్పథం. అది ఎరుక లేకపోవడం వల్ల, నిజానికి చెడుసంకల్పం ఏర్పడుతుంది.

ఆ అంతరంగ జ్వాల ఆరకుండా జ్వలించాలంటే దానిలో ఆజ్యం పోయాలి, దానిని కాపాడాలి. మన పొరపాట్లను, మనం వదులుకోవలసినవాటిని, మన అభివృద్ధిని ఆపేవాటిని, మన మార్గాన్ని చీకటిమయం చేసేవాటిని ఆ అగ్నికి ఆహుతి చేయాలి. ఆ అగ్నిలో ఆజ్యం పోయకపోతే అది నెమ్మది నెమ్మదిగా అచేతన, జడత్వాల

బూడిద క్రింద రగులుతుంటుంది. అప్పుడు సంవత్సరాలు గాదు, అనేక జీవితాలు, అంటే, శతాబ్దాలు గడిచిపోతాయి లక్ష్యాన్ని చేరడానికి.

అందుకే ఎవరైనా వారి విశ్వాసాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలి. దానిని అత్యంత అపరిమితమైన, అమూల్యమైనదాని యొక్క పుట్టుకను గమనించినట్టు గమనించాలి, దాన్ని పాడుచేసే ప్రతిదాన్నించి అతి భద్రంగా కాపాడుకోవాలి. ప్రారంభాల్లోని అజ్ఞానాంధకారాలలో విజయం సాధించడానికి వచ్చిన దైవశక్తి యొక్క ప్రత్యక్ష అభివ్యక్తి — 'విశ్వాసం'

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

విశ్వాసానికి నమ్మకానికి మధ్య గల తేడా

ప్రశ్న: ఎవరికైనా దైవంపై విశ్వాసంతో పాటు నమ్మకం కూడా ఉన్నప్పుడు — ఆ రెండింటికి మధ్య తేడా ఏమిటి?

విశ్వాసం మరింత సమగ్రమైనదని శ్రీఅరవిందులు వ్రాశారు — నమ్మకం కన్నా విశ్వాసం మరింత సమగ్రమైనది. నీకు దైవం మీద నమ్మకం ఉంది అంటే దైవం నీకేదిచ్చినా అది ఎప్పుడూ నీకు అత్యంత యోగ్యమైనదే అని నీవు అంగీకరిస్తావు. ఆతడి నిర్ణయం ఏదైనా, ఆతడు నీకిచ్చే అనుభవం ఏదైనా, లేదా అతడు నిన్ను ఏ పరిస్థితుల్లో ఉంచినా, అది నీకు మంచిదని భావిస్తావు. అది నమ్మకం. కాని విశ్వాసం — అది దైవం యొక్క ఉనికి మీద అచంచలమైన ధృడవిశ్వాసం — విశ్వాసం మనిషి మొత్తం అస్తిత్వాన్నే పట్టుకుంటుంది, ప్రభావితం చేస్తుంది. అది మానసికం, చైతన్యం, ప్రాణికాలలోనే కాదు: అది మొత్తం అస్తిత్వం అంతటా నిండి ఉంటుంది. అక్కడ ఒక్క విశ్వాసం తప్ప ఏదీ ఉండదు. విశ్వాసం సూటిగా అనుభవానికి దారి తీస్తుంది.

ప్రశ్న: నమ్మకం పూర్తిగా, సంపూర్ణంగా ఉండదా?

ఉండకపోవచ్చు. ఉండాల్సిన అవసరం లేదు. అయితే చిన్న బేధం ఉంది. — అది ఎలాగో నాకు తెలియదు — కాని అవి రెండు ఒకటి కాదు.

ఒకరు తనను తాను సంపూర్ణంగా దైవకార్యానికి అంకితం చేసుకుని, అందులో పూర్తి విశ్వాసం ఉండి, దాని సంభావ్యతలోనే కాదు, అదే నిజమైనదన్న విశ్వాసంతో ఏం జరుగుతుందని ప్రశ్నించకుండా, సంపూర్ణంగా ఆ కార్యానికి అర్పించుకుంటాడు. అందువల్ల అప్పుడే అక్కడే ఓ ధృఢవిశ్వాసాన్ని అంటు కట్టడమౌతుంది. సాధించగలనన్న నమ్మిక కుదురుతుంది. అందులో భాగస్వామినౌతానని, దానికి అంకితమైనందు వలన అది చేయగలనన్న నమ్మిక కుదురుతుంది. ఎందుకంటె అందులో సంపూర్ణంగా నిమగ్నమై ఉండడం వలన — తను చేయబోయేదాని మీద నమ్మకం, ఏం చేయాలనుందో అది చేయగలనన్న నమ్మకం, తను పొందబోయే అనుభూతి తప్పక సాధిస్తానన్న నమ్మకం. ఆ మొదటిది అసలు ప్రశ్నలు వేయదు, ఫలితం గురించి ఆలోచించదు. తనని తాను సంపూర్ణంగా అర్పణ చేసుకోడమె దానికి తెలిసినది. — ఆ సమర్పణే అంతా, అంతకు మించినదేదీ లేదు. అది మన లను సంపూర్ణంగా తనలోకి లాక్కుంటుంది. ఆ రెండవదాంట్లో నమ్మకం ఉన్నపుడు, దానికి విశ్వాసం అంటకట్టవచ్చు. నమ్మకం అంటుంది: "అవును, నేను అందులో పాల్గొనాలి, నేను పొందాలనుకున్నది పొందాలి, ఈ పనిలో నేను తప్పనిసరిగా భాగం పంచుకోవాలి". అయితే, ఆ మరో స్థితికి దైవం మీదే విశ్వాసం ఉంది. అతడే అక్కడ ఉన్నదంతా, అతడే అంతా చేసేది, అంతా చేయగల సమర్ధుడతడే. అతడే అన్నీ చేయగలడు, అంతా చేయగలడు. అతడొక్కడే నిజమైన అస్తిత్వం అని, సర్వం ఆ దైవానికి సంపూర్ణ విశ్వాసంతో తనను తాను ఆ విశ్వాసానికి సమ ర్పించుకుంటాడు. దాని మీద మరింత నమ్మకం ఏర్పడి ఆ దైవంతో అతడికున్న సంబంధం వల్ల, ఆ దైవంపై అతనికున్న విశ్వాసం ఎంతగా పనిచేస్తుంటే — ఏది ఏమైనా, అతడికేం జరిగినా — అది పూర్తిగా దైవసంకల్పం యొక్క అభివ్యక్తి మాత్రమె కాదు, అదే అతడికి జరగవలసిన అత్యంత మంచి, అంతకన్న మంచి అతడికి జరగడం కుదరదని అర్థం. ఎందుకంటె, అది సంపూర్ణంగా దైవమే చేయడంవల్ల. ఈ వైఖరి విశ్వాసంలో భాగం కానవసరం లేదు. ఎందుకంటె అసలైన విశ్వాసం ప్రశ్నించదు — అది తన స్వీయ అర్పణకు వచ్చే ఫలితాలేమిటని అడగదు, ఆశిం చదు, కేవలం తన్ని తాను అర్పించుకుంటుంది.... అంతే! అదే నమ్మకం అయితే 'ఫలితం ఇలా ఉంటుంది' అని చెప్పవచ్చు. ఇది సంపూర్ణ సత్యం. ఏ బేరసారాలు, ఏ లెఖ్ఖలు లేకుండా సంపూర్ణ విశ్వాసంతో మన్ని మనం దైవానికి అర్పించుకున్నపుడు

— ఏది జరిగితే అదే జరగని! అది నన్నేం బాధించదు. 'నన్ను నేను సమర్పించుకోవడమే నాకు కావలసినది' — అన్న దృక్పథంతో, ఆలాంటి విశ్వాసంతో నీవున్నపుడు, అన్ని పరిస్థితుల్లోను, అన్ని సమయాల్లోను నీకు అత్యంత మంచే జరుగుతుంది — అది బహుశ నీవు ఊహించినట్టు జరగకపోవచ్చు. కాని వాస్తవంగా జరుగుతుంది. అస్థిత్వంలోని ఒక భాగానికి ఇది తెలిసి నమ్మకంతో ఉండవచ్చు. అది విశ్వాసానికి మరింత బలం చేకూరుస్తుంది — ఎలా చెప్పాలి? సంపూర్ణ ప్రసాద మనస్తత్వం, జరిగినదాన్నించి అత్యంత మేలైన ప్రయోజనం పొందడం.

*

నీకు విశ్వాసం ఆ దైవం మీద పూర్తి నమ్మకంతో ఏర్పడి ఉండనపుడు, నీలో విశ్వాసం ఉన్నదని భావించినా కూడా, ఆ దైవశక్తి మీద, ఆ దైవం యొక్క మంచితనం మీద నమ్మకం పూర్తిగా పోగొట్టుకునే స్థితిలో పడగలవు, లేదా ఆ దైవానికి నీ మీద ఉన్న నమ్మకం కూడా పోగొట్టుకోగలవు. ఇవే మూడు అవరోధాలు.

ఎవరికైతే దైవం మీద వారికి చెక్కుచెదరని విశ్వాసం ఉందనుకుంటారో వారు చెప్పేది, "సర్వం చేస్తున్నది దైవమే, అతడే అన్నీ చేయగల సమర్థుడు, నాతో జరిగేదే కాదు, నాలోను, ఇతరులలోను అన్ని చోట్ల జరుపుతున్నది దైవమే, దైవం మాత్రమే" అని. దీన్నే వాళ్ళు ఏదో ఒక తర్కంతో అనుసరించినపుడు, కొంతకాలం తరువాత వాళ్ళు ఈ ప్రపంచంలో జరుగుతున్న అతి భయంకరమైన పొరపాట్లకు అతడినే తప్పుపట్టి, అతడిని ఒక క్రూరమైన, భయంకరమైన, నిజమైన రాక్షసుడిలా చిత్రిస్తారు — అది వాళ్ళకి నమ్మకం లేనపుడు.

లేదా, వాళ్ళకి విశ్వాసం ఉంది, కాని వాళ్ళీ విధంగా తలపోస్తారు, "సరే, నాకు దైవం మీద విశ్వాసం ఉంది, కాని ఈ ప్రపంచం ఎలా ఉందో నేను బాగా చూస్తున్నాను! పైగా ముందు నేను చాలా బాధలు పడుతున్నాను. పడటంలేదా? నేనస్సలు ఆనందంగా లేను, ఇరుగుపొరుగు వాళ్ళందరి కన్నా నేనే సంతృప్తిగా లేను" — ఎందుకంటే ప్రతివారు వాళ్ళ పొరుగువారి కంటే చాలా బాధల్లో, ఏ మాత్రం ఆనందం లేకుండా ఉన్నామని భావిస్తారు — "నేను చాలా విచారంగా ఉన్నాను, నిజంగా జీవితం నా పట్ల నిర్దయగా ఉంది. కాని అప్పుడు కూడా దైవం దైవమే కదా, అతడు మూర్తీభవించిన మంచితనం, దయగలవాడు, అతడు సర్వ సమగ్రత కల్గినవాడు, అలాంటపుడు నేనింత విచారంతో ఎలా ఉన్నాను? అతడు

కూడా అశక్తుడేమో. లేనట్లయితే అతడు అంత మంచివాడై ఉండి నన్నిలా బాధలకి ఎలా గురిచేస్తాడు?" ఇది రెండవ అవరోధం.

ఇంక మూడవ రకం: కొందరుంటారు, వాళ్ళు అతి వినయం నటిస్తూ వాళ్ళకి వాళ్లు చెప్పుకుంటారు, "తప్పకుండా దైవం నన్ను వదిలేశాడు. నేనెందుకూ పనికి రాను, అతడు నాతో ఏమీ చేయలేడు, నాకున్నదల్లా ఇంక ఈ ఆటను వదిలి వేయ డమే. అతడు నన్ను అప్రయోజకుడుగా భావించాడు!"

అందువల్ల, ఎవరైనా సరే వారి విశ్వాసానికి దైవానుగ్రహం మీద సంపూర్ణ నమ్మకాన్ని జోడించనపుడు, కష్టాలు తప్పవు. అందువల్ల రెండూ అవసరమే....

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

శ్రీఅరవిందుల వాక్కులు

శ్రద్ధ

ఆంగ్లంలో 'Faith' అనబడే ఈ పదం దాని నిజభావాన్ని సంపూర్ణంగా వ్యక్తపరచడానికి సరిపోదు. వాస్తవానికి శ్రద్ధ పరమాత్మ నుండి ప్రభవించిన ఒక మహా ప్రభావం. దాని తేజస్సు మన దివ్య చైతన్య అస్తిత్వము నుండి ఒక పిలుపుగా వెలువడిన సందేశ చిహ్నం. మన నిమ్నప్రకృతిని దాని ప్రస్తుత అల్పత్వము నుండి ఒక మహోన్నతమైన ఆత్మస్థాయికి ఎదగమని. ఆ సందేశానికి ప్రభావితమై, ఆ పిలుపుకు ఎక్కువగ స్పందించేది మేధగాని, హృదయంగాని, మనస్సుగాని కావు. ప్రభావితమై స్పందించేది తన గమ్యం యొక్క, తన నిర్దేశిత కార్యం యొక్క యదార్థతను కూలంకషంగ తెలిసిన అంతరాత్మ.

*

ఈ శ్రద్ధ పై నుండి లభించిన ఒక ఆలంబన. అది మేధను, దాని సంబంధిత వివరాలను, అధిగమించి ప్రసరితమైన ఒక నిగూఢ తేజస్సు యొక్క కాంతివంతమైన ఛాయ; ఆకస్మిక దర్శనాలతో ప్రభావితంగాని గుప్తజ్ఞానం యొక్క గుండెకాయ.

*

శ్రద్ధ అనేది ఇంతవరకు ప్రకటితం కానిది, సాధించబడనిది, అనుభవంలోకి రానిది

అయినా ఒకానొకదానికి ఆత్మగత సాక్షి. అది మన అంతరంగంలోని సర్వజ్ఞుడికి సూచనామాత్ర అవగాహన లేకపోయినా, యదార్థమైనదని, అనుసరణీయమైనదని, పొందదగినదని, అత్యున్నత విలువగలదని, తెలిసినది. ఈ అంతరంగ అవగాహనపై మన మనసులో ధృఢమైన నమ్మకము కలుగకపోయినా, దానితో ప్రాణికము పెనుగులాడి ఎదురుతిరిగి నిరాకరించినా, అది చిరకాలము నిలుస్తుంది.

*

శ్రద్ధ, నిమ్న చైతన్యమందు ఒక పరమ సత్యము యొక్క లేక, ఇప్పటి వరకు ప్రత్యక్షంగా అనుభవసిద్ధంగాని దివ్యభావన యొక్క ప్రతిబింబము.

*


శ్రద్ధ, మనస్సుయొక్క అజ్ఞానం, అనుమానం, అశక్తత, అనిశ్చయాల మధ్యన అంతరాత్మ నుండి వెలువడే ఒక నిగూఢ తేజం, ఒక అతీంద్రియ శక్తి. మనిషికి శ్రద్ధ పరిత్యజింపరానిది.. కారణం, అది లేకుండ అగ్రాహ్యము. అనూహ్యమైన మార్గంగుండా సాగే ప్రయాణంలో మనిషి పురోగమించలేడు. అయితే అది అతనిపై బలవంతంగ విధించబడకూడదు. అతను స్వతంత్రంగ గ్రహించిన జ్ఞానంగానో లేక విధాయకమైన అంతరాత్మ ప్రబోధంగానో రావాలి.

*

అలా అనటంలో నా ఉద్దేశ్యం, అత్యంత సున్నితమైన విషయాలు ఏవైతే భౌతికంగా నిరూపింపబడలేవో, కాని అనుభవైకవేద్యములో, వాటి యొక్క యదార్థతపై అంతఃకరణలో ఒక క్రియాశీల ధృఢ విశ్వాసం ఉండాలి అని.

*

ఆధ్యాత్మిక విషయాలపై సాధకుడికి ఉండవలసిన శ్రద్ధ అవివేకమైనది కాకూడదు. ఒక స్పష్టమైన అవగాహనతో కూడిన శ్రద్ధ కావాలి. మసకబారినది కాక వెలుగులతో నిండిన శ్రద్ధ కావాలి. సందేహాత్మకమైన మేధ దానిని గ్రుడ్డి నమ్మకం అంటుంది. కారణం, పై పై పోకడలను గాని, బూటకపు సలహాలను గాని, మేధ తిరస్కరిస్తుంది. అది విషయాల వెనుకనున్న సత్యాన్ని దర్శించగోరుతుంది. సాక్ష్యం, ఋజువులనే ఊతకర్రల సాయంతో అడుగులు వేయదు. అది ఒక అంతర్ దృష్టి. తాను సరైనదని నిరూపించుకొనుటకు అనుభవంలోకి రావటానికై ఎదురుచూసేది కాదు. అది అనుభవాన్ని సిద్ధింపజేస్తుంది. నాకు స్వయంగా రోగనివారణ చేసుకోగలననే నమ్మకం



ఉన్నట్లయితే, నన్ను నేను నయం చేసుకొనే మార్గాన్ని స్వయంగా వెతుక్కునేవాడిని. పరివర్తనచెందుటలో నాకు నమ్మకం ఉన్నట్లయితే, ఆ ప్రక్రియ యొక్క పూర్వాపరాలు తెలుసుకొని దానిని అనుసరించేవాడిని.

*

'గ్రుడ్డినమ్మకం' అనే మాటకు అసలు అర్థం లేదు. బహుశ దాని అర్థం ఋజువు లేకుండ నమ్మలేము అని అయ్యుండవచ్చు. కాని ఋజువు చేయబడిన తదుపరి తీసుకున్న నిర్ణయం శ్రద్ధ కానేరదు. అది ఒక ఎరుక, లేక మనసులో ఏర్పడిన అభిప్రాయమౌతుంది. శ్రద్ధ, ఋజువు చేయబడక పూర్వమో లేక విషయం తెలియక పూర్వమో ఏర్పడుతుంది. ఆ విధంగా ఏర్పడిన శ్రద్ధ విషయం తెలుసుకొనుటకో లేక దానిని అనుభవించుటకో దోహదపడుతుంది. భగవంతుడున్నాడనుటకు ఋజువు లేదు. కాని భగవంతుని పట్ల శ్రద్ధ ఉన్నది. అందువలన నేను దివ్యానుభవాన్ని పొందగలను.

*

ఈ విషయంలో శ్రీరామకృష్ణులు మరింత ముందుకు వెళ్ళారు. గ్రుడ్డినమ్మకం తప్పు కాదా అని అడిగినప్పుడు, వారన్నారు, అసలు ఉండవలసినది కేవలం గ్రుడ్డి నమ్మకం మాత్రమే అని. కారణం, విశ్వాసమనేది గ్రుడ్డిది. లేనట్లయితే అది విశ్వాసం కాదు. మరేమిటో అవుతుంది — హేతుబద్ధ నిర్ణయం, రూఢిపరచబడిన విశ్వాసం లేక స్పష్టంగా తెలియవచ్చిన సమాచారం.

*

అపనమ్మకం గ్రుడ్డిది. దానికి ముందుచూపు లేదు, శక్తిని ప్రేరేపించ లేదు. కార్యాచరణను ప్రోత్సహించలేదు.

*

యదార్థమేమిటో తెలిసినప్పుడు, దైవానుగ్రహంతో ఫలించిన శ్రద్ధ ఒక శాశ్వత జ్ఞానజ్యోతిగ పరిణమిస్తుంది.

*

యదార్థ నిరూపణకు శ్రద్ధ ఒక అత్యవసర సాధనం. ఎందుకనగా మనం అజ్ఞానులం. దేనిని తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నామో అది మన కింతవరకు తెలియనే తెలియదు. శ్రద్ధ నిజానికి ఒక జ్ఞానం. ప్రకటితమవ్వక పూర్వం అజ్ఞానానికి దాని పూర్వా

పరాల సమాచారం అందిస్తుంది. సూర్యోదయానికి పూర్వం వెలువడే కాంతికిరణం లాంటిది. సూర్యోదయానంతరం ఆ కాంతికిరణం యొక్క అవసరం ఉండదు. అతిమానస విజ్ఞానం తనను తాను ఊన్చుకోగలదు. దానికి శ్రద్ధ యొక్క ఆధారం అవసరం లేదు. దాని వాస్తవికతపై అది మనగలదు. భవిష్య పురోగమనానికి, పురోభివృద్ధికి శ్రద్ధ అవసరమని నీవు అనవచ్చు. కాదు. భవిష్య పురోభివృద్ధి దివ్యజ్ఞాన మూలాలపై కొనసాగుతుంది. అజ్ఞానపు పునాదులపై కాదు. మనం దివ్యజ్ఞాన వెలుగులో దాని విస్తృతమైన స్వయం సాఫల్యతా స్తరాల దిశగా పయనించాలి.

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ఇది మీకు తెలుసా?

(శ్రద్ధ — అన్ని ప్రయత్నాలకు, అన్ని చర్యలకు పరోక్షంగాను, ప్రత్యక్షంగాను కీలకమైనది — చక్రానికి ఇరుసు లాంటింది.)

ప్రపంచం తను హేతువాత వెలుగులో చరించేది అని అనుకుంటుంది. కాని నిజానికి అది దాని శ్రద్ధతోను, అంతర్బుద్ధితోను ప్రచోదితమవుతుంది.

*

హేతువు, తనను తాను తన శ్రద్ధకు అనుగుణంగా మలచుకుంటుంది. లేదా అంతర్బుద్ధి యొక్క ఆలోచనలు సరైనవని నిరూపణ చేస్తుంది. అందుచేత, మనుషులు తాము తార్కికంగా ఆలోచించి ఆచరిస్తామని అనుకుంటారు.

*

మనిషిలో శ్రద్ధను అంటిపెట్టుకొని ఉండేది ఏదో ఉంది. అలా కాకపోయినట్లయితే మనిషి చంచల మనసు యొక్క కీలుబొమ్మ అవుతాడు. లేదా పరిస్థితులు అతనితో చెలగాటమాడుతాయి.

*

ఈ ఆత్మవిశ్వాసం ఏదో ఒక రూపంలో జీవుడి కార్యాచరణకు తప్పనిసరి. అది లేకుండా మనిషి జీవితంలో ఒక్క అడుగైనా వేయలేడు, సరికదా ఇప్పటివరకు సిద్ధించని సమగ్రతను సాధించుటకు ముందంజ వేయలేడు. అది ఎంత ప్రధానమైనది,

ఆవశ్యకమైనదంటే, గీత ప్రవచించిన విధంగా, మనిషి శ్రద్ధ ఎలాంటిదో అతను అలానే ఉంటాడు — "యో యా శ్రద్ధా స యేవ సహ". అంతే గాక, ఎంత తన నుండి తాను పొందగలననే విశ్వాసం తనకుంటుందో, దానికై ఎంత కృషి చేయగలడో, అంత మేరకు అతను సాధించి ఎదగగలడు.

*

గీతలోని ఒక ప్రధాన పంక్తి యొక్క సారాంశమిది. ఈ పురుషుడు, మనిషిలోని ఈ ఆత్మ, యదాతథంగా శ్రద్ధా జనితాలు. ఒక శ్రద్ధతో, ఒక సంకల్పంతో, తనలో తన కున్న నమ్మకంతో, తన ఉనికిపై తనకున్న నమ్మకంతో కూడుకున్నది. ఆ సంకల్పం, ఆ శ్రద్ధ లేక తనపై తనకున్న ఆ నమ్మకం ఏదైనాగాని, అతను కూడ అదే, అదే అతను — 'శ్రద్ధా మయో యం పురుషో యో యా శ్రద్ధా, స యేవ సహ.' ఈ భావగర్భిత వాక్కును మరికొంత నిశితంగా పరిశీలించినట్లయితే, దీనిలోని శక్తివంతమైన బహు కొద్ది పదాలలో మొత్తం ఆధునిక ఉపయోగవాద సిద్ధాంత తత్వం ఇమిడి ఉందని గ్రహించంగలుగుతాము.

(గీత ప్రకారం)

మన జీవితంలో కోరికల కనుగుణంగా కార్యాచరణ గావిస్తుంటే, అది పట్టుసడలని శ్రద్ధ యొక్క చర్య అవుతుంది. చాలా వరకు అది మన ప్రాణికానికి, శరీరానికి చెందినది. తామసిక, రాజసిక స్వభావాలకు సంబంధించినది.

ఇక శాస్త్రానుగుణంగా జీవితం కొనసాగించ ప్రయత్నిస్తే, అది మన రాజసిక, తామసిక పార్శ్వాలపై అధికారం కోసం నిరంతరం కృషి సల్పుతున్న సాత్వికభావ పోకడకు చెందిన పట్టు సడలని శ్రద్ధ యొక్క చర్య అవుతుంది.

ఈ రెంటిని కాదని, ఒక ఆదర్శానికి గాని, ఒక వ్యక్తిగత నమ్మకానికి గాని, లేక స్వయంగా దర్శించిన ఒక వినూత్న సత్యతత్వానికి అనుగుణంగా జీవిస్తూ కార్యాచరణ గావించ ప్రయత్నిస్తే, అది కూడ పట్టు సడలని శ్రద్ధ యొక్క చర్య అవుతుంది. అయితే ఆ చర్య సత్వ రజస్తమో గుణాలలో ఏదో ఒక దానికి లోబడవచ్చు. మన ప్రతి ఆలోచన, సంకల్పం, భావన, చర్య ఈ త్రిగుణాలకు లోబడి ఉంటుంది. మరో విధంగా, జీవితాన్ని, చర్యలను దైవ ప్రకృతి కనుగుణంగా కొనసాగించాలని ప్రయత్నిస్తే, అప్పుడు కూడ పట్టుసడలని శ్రద్ధ ద్వారానే అది జరగాలి. గీత ప్రకారం ఈ చర్య కూడ సాత్విక స్వభావం ఉచ్ఛస్థితిలో నున్నప్పుడు, దాని నిర్దిష్ట అవధులను

అధిగమించుటకు ప్రయత్నిస్తున్నప్పుడు దానికున్నటువంటి శ్రద్ధ.

*

నేను శ్రద్ధ కనబరచే మతము, తత్వము, నైతిక ధర్మము, సామాజిక స్పృహ, సాంస్కృతిక స్పృహ నా స్వభావానికి, నా చర్యలకు సాపేక్షంగాను, నిశ్చయాత్మకం గాను, ఏది యుక్తమైనది, ఏది సంపూర్ణమైనది అనేదానిని గురించిన నా అభిప్రాయానికి, ఒక నియమ నిబద్ధతను రూపొందిస్తుంది. దానిపై నాకు ఎంత మేరకు శ్రద్ధ ఉన్నదో, దాని ప్రకారం జీవించాలనే నా సంకల్ప బలానికి ఎంత తీవ్రత ఉన్నదో, దాని కను గుణంగా, అందుకు యుక్తమైన రీతిగా, అలాంటి సంపూర్ణతకు దీటుగా, నన్ను నేను మలచుకోగలను.

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

మన విశ్వాసం ఏ విధంగా ఉండాలి?

(ప్రధానంగా మనకు తప్పక ఉండవలసిన విశ్వాసం)

దైవం ఉన్నాడనీ, ఆ దైవాన్ని చేరుకోవడం ఒక్కటే ముఖ్యమైన విషయమనీ అనేది యోగంలో ప్రధానంగా ఉండవలసిన విశ్వాసం. అది ఆత్మలో అంతర్గతం — దానితో పోలిస్తే జీవితంలో పొందదగినది మరేదీ దానికి సాటి లేదు. మనిషికి ఆ విశ్వాసం ఉండే పర్యంతమూ, అతడు ఆధ్యాత్మిక జీవితానికి యోగ్యతాముద్రను పొందుతాడు, నేనింకా ఏమని చెప్తానంటే, అతడి ప్రకృతి అంతా పూర్తిగా అడ్డంకులతో, వైముఖ్యాలతో, కష్టాలతో కూరుకుపోయి ఉక్కిరిబిక్కిరి అవుతున్నప్పటికీ, అతడు ఎన్నో సంవత్సరాలు సంఘర్షించవలసి ఉన్నప్పటికీ, అతడు ఆధ్యాత్మిక జీవితంలో యోగ్యతా ముద్రను పొందుతాడు.

ఈ విశ్వాసమును నీవు వృద్ధి చేసుకోవాలి — అది హేతువూ, సర్వసాధారణ లోకపరిజ్ఞానముల ఆమోదంతో కూడిన విశ్వాసం — అది ఈ విధంగా ఉంటుంది, దైవం గనక ఉంటే, నిన్ను అతడు ఆ మహాపథంలోకి పిలిచినట్లయితే, (అది సుస్పష్టమే), అప్పుడు తప్పనిసరిగా అన్నింటి వెనుకనూ, మార్గమంతటనూ, దైవమార్గదర్శకత్వం ఉంటుందనీ, ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ నీవు దానిని చేరుకుంటాననే విశ్వాసం

ఉంటుంది. వైఫల్యాల నందించే వాణులను లేదా ఓరిమిని పరిహరించే వాణులను, ప్రాణిక ఆవేగంతో కూడిన వాటి ప్రతిధ్వనులను వినకూడదు. ఎన్నో విపరీతమైన మహావిపత్తులున్నాయనే నెపంతో వాటిని విశ్వసించవద్దు. ఆ దారిలో సఫలత పొందలే మనో లేక ఇప్పటిదాకా దైవం తన సాక్షాత్కారాన్నివ్వలేదు కనుక అతడెప్పటికీ సాక్షాత్కారమివ్వడనే ధోరణులను విశ్వసించవద్దు. కాని, ఒక మహత్తరమైన, కఠినమైన లక్ష్యం మీద మనస్సును ధృఢంగా లగ్నపరచిన ప్రతివారూ, "నేను విజయం సాధించేవరకు నా ప్రయత్నం విరమించను — ఎన్ని కష్టాలు వచ్చినా" అని తీర్మానం జేయాలి. అటువంటి పూనికను వహించాలి. అటువంటి విశ్వాసమును దైవంపై కలిగినవారు దీనికి తోడు, "దైవం ఉన్నాడు, నేను దైవాన్వేషణలో ఎన్నటికీ అపజయం పొందను. నేను ఆయనను చేరుకునేదాకా నిరంతరం సాగిపోతూనే ఉంటాను" అనే భావాన్ని జతపరుస్తారు.

*

పూర్ణయోగం ఒక విధమైన విశ్వాసం ఉండాలని కచ్చితంగా కోరుతున్నది. అది ఈ విధంగా చెప్పవచ్చు, భగవంతుడి మీద, దివ్యశక్తి మీద విశ్వాసం, మనలోనూ, ప్రపంచంలోనూ దైవం ఉనికి మీదా, ఆధిపత్యశక్తి మీదా విశ్వాసం, ప్రపంచంలోని సమస్తమూ ఒక్క దివ్యమహాశక్తి క్రియాకలాపాలేననీ, యోగంలోని అన్ని అంచెలూ, దాని పెనుగులాటలూ, కష్టాలు వైఫల్యాలే కాక విజయాలూ, సంతృప్తులూ, గెలుపులూ అన్నీ ఆమె క్రియకలాపాల ప్రయోజనాలూ, అవసరాలేననీ, దైవానికీ ఆయన మహాశక్తికీ అచలమై, నిశ్చితమైన పరాధీనతతో, సంపూర్ణ ఆత్మ-సమర్పణతో మనం ఏకత్వాన్నీ, స్వతంత్రతనూ, గెలుపునూ, పరిపూర్ణతనూ అందుకోగలమనే విశ్వాసం.

*

విశ్వాసం రెండు విధాలు:

పైనుంచి సమత్వమును కిందికి పిలిచే విశ్వాసం, పైనుంచి సాక్షాత్కారమును కిందికి పిలిచే విశ్వాసం. ఈ రెండు విశ్వాసములు దైవం యొక్క రెండు స్థితులకు సంబంధించినవి. ఒకటి అతీత దైవం, మరొకటి విశ్వదైవం. సాక్షాత్కారతా, మహదేచ్ఛ అతీత దైవానిది.

వర్తమాన పరిస్థితులలో విషయాలతో జరిగే క్రియాకలాపాల వాస్తవ ఫలితాలతో సంబంధాన్ని కలిగి ఉండేటటువంటిది విశ్వదైవం. ఈ ప్రపంచంలోని ప్రతి సంఘటన

లోనూ, ప్రతి గమనంలోనూ విశ్వదైవం మహదేచ్ఛ అభివ్యక్తమవుతూ ఉంటుంది.

మన సాధారణ చైతన్యానికి విశ్వం మహాదేచ్ఛ స్వతంత్రమైన ఆధిపత్యంతో తన ఇచ్ఛవచ్చిన రీతిలో ఎంపిక చేసుకుని వ్యవహరించగలిగేదిగా ఉండదు; అది అన్ని అస్తిత్వాల ద్వారా, ప్రపంచంలో క్రీడించే శక్తుల ద్వారా, ఈ శక్తుల ధర్మాల ద్వారా, వాటి ఫలితాల ద్వారా పనిచేస్తుంది — మనకుగా మనం దానికి ఉన్మీనులమై, సాధారణ చైతన్యం నుంచి బయటకు వచ్చినప్పుడు మాత్రమే, అది స్వతంత్ర ఆధిపత్యశక్తితో తాను విషయాలలో జోక్యం చేసుకుంటూ శక్తుల సాధారణ క్రీడను తొక్కిపెట్టి అధిగమించుతున్నదనే అనుభూతి కలుగుతుంది.

అప్పుడు కూడా ఆ శక్తుల క్రీడలలో సైతం, అవి ఎంతగా కృతకమై వక్రీకరణకు లోనయినప్పటికీ విశ్వం మహదేచ్ఛ అతీత దైవం మహదేచ్ఛకు అంతిమ సాక్షాత్కారాన్నివ్వటానికై పనిచేస్తూ ఉంటుందనే విషయం మనం చూడగలుగుతాము.

అతీత దైవం మహదేచ్ఛ అతిమానస దివ్యసాక్షాత్కారత. దానినే మనం ప్రయత్నపూర్వకంగా సాధించవలసి ఉంటుంది. మన కృషితో సాధించదలచుకున్న దాని పరిస్థితులన్నీ అధమ చైతన్యానికి సంబంధించినవి, అవన్నీ మన అజ్ఞానం, బలహీనతలు, తప్పులతోనూ, పరస్పరం సంఘర్షించే శక్తులతోనూ వక్రీకరణ చెందగలగినవై ఉంటాయి. అందువలననే విశ్వాసం, సమత్వం అత్యావశ్యకమైన ఉన్నాయి.

మన అజ్ఞానం, తప్పులు, బలహీనతలు ఎన్ని ఉన్నా, ప్రతికూలశక్తులు దాడులను చేస్తున్నా, తక్షణం అపజయం తటస్థపడుతున్నా, దివ్యేచ్ఛ ప్రతి పరిస్థితి ద్వారా, అంతిమంగా పొందే దివ్యసాక్షాత్కార దిశగా మనను ముందుకు నడిపిస్తున్నదనే విశ్వాసాన్ని తప్పక కలిగి ఉండాలి. ఈ విశ్వాసం మనకు సమత్వాన్నిస్తుంది. అది, ఏమి సంభవించినా అంగీకరిస్తూ, జరగవలసినది నిశ్చితంగా అదే కాకపోయినప్పటికీ అది సాధనాపథంలో పొందవలసినదేదో అయ్యుంటుందనే విశ్వాసం. ఒక పరి సమత్వం స్థిరపడినప్పుడు, తాను దన్నుగ ఉండే మరియొక విశ్వాసం కూడా స్థిరపడే అవకాశం ఉంది. అది అతిమానసిక చైతన్యం నుంచి ఏదో ఒకదానితో క్రియాశీలమవ గలగటమే కాక, వర్తమాన పరిస్థితులను అధిగమించగలిగి ఏమి జరగాలో నిర్ణయించి, అతీత దైవం దివ్యేచ్ఛ మహత్వ సాక్షాత్కారమును కిందికి తీసుకువచ్చేందుకై సహాయ పడుతుంది.

విశ్వదైవం చెంతకు వెళ్ళే విశ్వాసం, క్రీడ అవసరాల పరంగా, దాని క్రియాత్మక లక్షణశక్తిలో పరిమితం అయినది.

ఇటువంటి పరిమితులన్నింటి నుంచీ పూర్తిగా స్వతంత్రతను పొందాలంటే సాధకుడెవరైనా అతీత దైవాన్ని తప్పక చేరవలసినదే.

*

విశ్వశక్తుల క్రీడకూ, ఇచ్ఛకూ వెనుకగా మహోన్నతమైన రహస్యమైన దివ్యేచ్ఛ ఉన్నది — ఆ క్రీడ ఎల్లప్పుడు అనుకూలమైన విషయాలతోనూ, హానికారకమైన విషయాలతోను కలగలసినది — ఆ దివ్యేచ్ఛ కోసం ఒకరు అవశ్యం నిరీక్షించాలి, విశ్వాసం ఉంచాలి.

శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఆత్మవిశ్వాసం

ఒక విశాలతరమైన, నిత్య పరిశుద్ధమైన, సంపూర్ణ బలవత్తరమైన భగవంతుని సాన్నిధ్య, మార్గదర్శకాలకు అనుమతి సర్వ సామాన్యంగానూ, ప్రత్యేక సందర్భాలకు అనువర్తింప చేయడంలోనూ మనకు తప్పక విశ్వాసముండాలి. మనకు ఆమె సాన్నిధ్యపు యెరుక లేనంతకాలం, ఆమె సన్నిధానం మనలో నిండుగా లేనంత కాలం, మహాశక్తి యందు విశ్వాసం కుదురుకొనదు. దాని కంటె ముందుగా, లేదా దానితో పాటు ఏకత్వం వైపు, స్వేచ్ఛ వైపు, పరిపూర్ణత వైపు విజయవంతంగా ఉద్యమించే శక్తిగల మన స్వీయ ఆధ్యాత్మిక సంకల్పంలో, శక్తిలో ఒక స్థిరమైన వీర్యవంతమైన విశ్వాసం ఉండాలి. మనిషికి తన యందు తనకు విశ్వాసం ప్రసాదించబడింది. చివరకు పర మాత్మ యజ్ఞవేదికపై ఆతని శక్తిని నివేదన కర్తృ మైయ్యేటట్లు మనిషి కార్యరూపంలో పెట్టే, సృజించే, చివరకు ఉన్నతస్థాయిల కుద్ధరించే అతని భావాలు, అతని శక్తులు, అతనికి అతనియందు స్వతహాగా విశ్వాసాన్ని కలిగిస్తాయి. 'నాయమాత్మా బలహీనేన లభ్యతే' అని శాస్త్రం చెబుతోంది. వైకల్యం కలిగించే సమస్త స్వవిషయిక అవిశ్వాసాన్ని దేన్నైనా సాధించు మనం బలంపై సమస్త సంశయాన్ని రూపుమాపాలి. ఎందుకనంటే అశక్తతకు అసత్య అనుమతి నివ్వడం, బలహీనత నూహించుకోవడమే, ఆత్మకుగల

సర్వశక్తిమంతత్వాన్ని నిరాకరించడమే అవుతుంది. ప్రస్తుత అసమర్థత వత్తిడి యెంత భారంగా ఉన్నప్పటికీ అది విశ్వాసాన్ని పరీక్షించేది మాత్రమే, తాత్కాలిక యిబ్బంది మాత్రమే. అశక్తుడిననే భావం పూర్ణయోగాకాంక్షికి అర్థరహితమైనదే. కారణం, అదివరకే అంతర్నిహితంగా అతని అస్తిత్వంలో ఉన్న పరిపూర్ణతను అభివృద్ధి చేయడం అతని తక్షణ లక్ష్యం. ఎందుకనంటే మనిషిలోనే, అతని ఆత్మలోనే దివ్యజీవన బీజం వుంది. విజయం సంభవమే అనేది, చేసే కృషిలో అంతర్గతంగా, అంతర్లీనమై వుంది, కనుక విజయం తథ్యం. ఎందుకనంటే ఆ కృషి వెనుక సర్వశక్తివంతమైన శక్తి పిలుపు, మార్గదర్శకత్వం వున్నాయి. అదే సమయంలో తన యందున్న తన విశ్వాసాన్ని, సమస్త రాజసిక అహంకార స్పర్శ లేకుండా ఆధ్యాత్మిక గర్వం లేకుండా తప్పక పరిశుద్ధం చేయాలి. అతని బలం అతనిది కాదని; అహంకారిక అర్థంలో అతనిది కాదని, అది విశ్వజనీనమైన దివ్యమహాశక్తిదనీ, దానిని అతడుపయోగించడంలో అహంకారానికి సంబంధించినదేదైనా వుంటే అది అతని పరిమితత్వానికి కారణమౌతుం దనీ, చివరికొక అడ్డంకిగా తయారవుతుందనీ అతడు గ్రహించాలి. మన ఆకాంక్ష వెనుకగల విశ్వజనీనమైన దివ్యమహాశక్తి అపరిమితమైనది. దానిని గనుక మనం సరిగా ఆవాహన చేసినపుడు, మనలో అది గ్రుమ్మరిల్లకుండా వుండదు. గ్రుమ్మరిల్లి ఏ విధమైన అశక్తతనైన, ఆటంకాన్నైనా, ఇప్పుడుగానీ, తర్వాతగానీ తొలగించకుండా వుండదు. ఎందుకనంటే మొదట్లో మన పెనగులాట సమయాలు కొనసాగే కాల పరి మాణాలు, మన విశ్వాసం, మన కృషి సంబంధించిన బలం మీద ఉపకరణాలు పాలు పంచుకోవడం మీద ఆధారపడి వుంటుంది. మన విశ్వాసం, మన కృషి, కాలక్రమేణా అయినప్పటికీ, వివేకంతో నిర్దేశించే రహస్య పరమాత్మ, యోగేశ్వరుని హస్తాల్లో ఉంటాయి.

శ్రీఅరవిందులు

అనువాదం కె. వి. రావు

ఈశ్వరుని యందు, దివ్యశక్తి యందు విశ్వాసం

మన బలానికి దన్నుగా వెనుక ఉన్న దివ్యశక్తి యందు విశ్వాసం ఉండాలి. ఆమె అభివ్యక్తమైనపుడు అది ప్రగాఢం, సంపూర్ణం అవుతుంది లేదా అభివృద్ధి చెందుతుంది. అనాది నుండి పరమాత్మ సర్వశక్తిమంతంతో బలోపేతమై, సాయుధయై సమస్తాన్నీ సృజించు విశ్వజనీన భగవతి, సచేతన మహాశక్తి అయిన ఆమెకు అసాధ్యమైనదేదీ లేదు. సమస్త జ్ఞానాలు, సమస్త బలాలు, సమస్త జయవిజయాలు, సమస్త కౌశల్యాలు, కార్యాలు, ఆమె హస్తాల్లో ఉన్నాయి. పరమాత్మ సంపదలన్నింటితో, సమస్త పరిపూర్ణతలతో, సిద్ధులతో అవి నిండి ఉన్నాయి. ఆమె మహేశ్వరి, సర్వోన్నత జ్ఞానాధిదేవత. సత్యానికి సంబంధించిన సమస్త తరగతులను, వైశాల్యతలను దర్శించగల ఆమె దృష్టిని ఆమె మన కిస్తుంది. ఆధ్యాత్మిక సత్యానికి సంబంధించిన ఆమె ఆర్జవాన్ని ప్రశాంతమైన, ఆవేగపూరితమైన ఆమె అతిమానస విస్తృతిని, ప్రకాశాన్ని, ఆనందాన్ని ఆమె మన కందిస్తుంది. ఆమె మహాకాళి, ప్రచండ బలాధిదేవత. సమస్త బలాలు, ఆధ్యాత్మిక క్రియాశక్తి కఠోర తపస్సు, కదన కుతూహలం, విజయోత్సాహంతో కూడిన అట్టహాసంతో ఓటమిని, మరణాన్ని, అజ్ఞానశక్తులను అవలీలగా జయించగలదు. ఆమె మహాలక్ష్మి, మహోత్తమ ప్రేమ ఆనందాల అధిదేవత. ఆత్మానందం దివ్యానందపు సమ్మోహక శక్తి, సౌందర్యం, రక్షణ, దివ్యమైన, మానవ సంబంధమైన వరప్రదాయిని. ఆమె మహాసరస్వతి, దివ్య నైపుణ్యతకు, భగవత్ కార్యాలకూ అధిదేవత, సుకౌశల కర్మయోగం 'యోగః కర్మ సుకౌశలమ్' ఆమెదే. దివ్యజ్ఞాన ప్రయోజనాలను సమకూర్చునది ఆమెయే. ఆత్మను, జీవితానికి, దాని సామరస్యతల సుఖసంతోషాలకు అనువర్తింపజేసేది ఆమెయే. తన సర్వ శక్తులలోనూ, రూపాలలోనూ ఆమె తన అనంత ఈశ్వరీ అధికారాల మహోన్నత భావాన్ని సర్వవిధ కర్మల కొరకు వేగవంతమైన దివ్యసామర్థ్యాన్ని, సమస్త జీవులందరి ఏకత్వాల యందు, సమస్త శక్తులయందూ అన్నింటియందూ పాలుపంచుకొను సహానుభూతినీ, స్వేచ్ఛామయ అభిన్నత్వాన్ని కలిగి వుంటుంది. అందువల్ల జగత్తులోని సమస్త దివ్యసంకల్పంతో ఒక స్వచ్ఛంధమైన, ఫలవంతమైన సామరస్యత కలిగి వుంటుంది. ఆమె సాన్నిధ్యపు శక్తుల అత్యంత సన్నిహితత్వ స్పృహ, తనలోనూ, పరిసరాల్లోనూ ఆమె చేసే పనికి మన సమస్త

అస్తిత్వం సంతృప్తితో అనుమతించడం, ఆ మహాశక్తి యందు మన కుండే విశ్వాసపు చరమసిద్ధి.

ఆమె వెనుక ఈశ్వరుడున్నాడు. పూర్ణయోగపు శ్రద్ధకు హృదయం లాంటిది ఆయన యందు విశ్వాసం. ఈ విశ్వాసం మనకు తప్పక వుండాలి. మహోత్కృష్ట ఆత్మ-జ్ఞానం, వివేకం కల విశ్వజనీన పరిస్థితులకు లోబడి సమస్త కార్య విధానాలు ఉండాలి. మనలో లేదా మన పరిసరాల్లో జరిగేవి నిరర్థకంగా జరుగుతున్నది కాదు. లేదా దానికి తగిన స్థలం, తగిన విశిష్టత లేకుండా జరగడం లేదని తెలుసుకోగలగాలి. పరమాత్ముడు మన జీవాత్మల అధినాయకుడుగా కర్మను చేస్తున్నపుడు సమస్తం సాధ్యమే అని గ్రహించ గలగాలి. ఇంతకు ముందు జరిగినదంతా, ఇక ముందు జరుగబోయేదంతా, ఆతని నిర్దుష్టమైన భవిష్యత్తు నెరిగిన మార్గదర్శకత్వం క్రింద మన యోగం, మన సంసిద్ధి మన జీవనకార్యం సఫలమయ్యేందుకు జరిగేదంతా అందులో భాగమే అని గ్రహించగలిగేంతగా మన విశ్వాసం దృఢం కావాలి, అది పరిపూర్ణంగా అభివృద్ధి చెందాలి. ఉన్నతతర జ్ఞానం తెరుచుకున్న కొద్దీ విశ్వాసం దృఢమైనదని నిరూపణ జరుగుతుంది. అప్పుడు సమస్తం ఒకే ఒక్క మహాసంకల్పపు కార్యనిర్వహణకు లోబడినదే అని, ఆ సంకల్పం దివ్యప్రజ్ఞానం కూడా అనీ, ఎందుకనంటే అది యెల్లప్పుడూ తన ప్రకృతికి సంబంధించిన, జీవితంలో జరుగుతున్న యధార్థ కార్యనిర్వహణలను అభివృద్ధి చేస్తుందనీ మనం నిస్సందేహంగా చూడగలుగుతాం. మనం సర్వంలోనూ ఈశ్వరుని సాన్నిధ్యాన్ని సంవేదిస్తూ, మన సమస్త అస్తిత్వం, చేతన, ఆలోచన, సంకల్పం, కర్మ, ఆతని హస్తమందున్నదని ఎప్పుడు అనుభూతి పొందుతామో, మన ఆత్మ, ప్రకృతికి సంబంధించిన ప్రత్యంగమునందూ పరమాత్మ ప్రత్యక్షంగా, అంతర్యామిగా వ్యాపించి ఉన్నట్లు యెప్పుడు సంవేదిస్తామో, అప్పుడు అది అస్తిత్వపు అంగీకారం, శ్రద్ధకు సంబంధించిన అత్యున్నత స్థాయి అవుతుంది. శ్రద్ధకు సంబంధించిన అత్యున్నత సంసిద్ధి ఒక దివ్యబలానికి పరిపూర్ణమైన పునాది, ఒక అవకాశం అవుతుంది. అది పూర్తైనపుడు ప్రకాశమయమైన అతిమానస మహాశక్తి అభివృద్ధికి, అభివ్యక్తికి, కార్యనిర్వహణలకు ఆధారం అవుతుంది.

*

దాగిపోయివున్న జ్ఞానానికి సంబంధించిన అస్పష్ట లేక వికృత ప్రతిబింబం హృదయ మందలి విశ్వాసం. కరడుగట్టిన సంశయవాది కన్న మరింతగా సంశయంతో ఆస్తికుడు

బాధపడ్తాడు. అయినా అతడు ఆస్తికునిగానే వుంటాడు. కారణం అసలు విషయం తెలిసికొని వున్నదేదో అతని ఉపచేతనలో వుంది. అదే అతని గ్రుడ్డి విశ్వాసాన్ని, మసక సంశయాలను భరిస్తుంది. దానికి తెలిసినదాని వైపు, తెలుసుకొనేందుకు అతన్ని నడుపుకుపోతుంది.

శ్రీ అరవిందులు

అనువాదం: కె. వి. రావు

అపరిపక్వ నిశ్చితత్వాలు, అసత్య అంత్యాలు

అపరిపూర్ణత నుండి, అజ్ఞానం నుండి వెలుగు, పరిపూర్ణతల వైపు గమనిస్తున్నామనే విషయాన్ని మనం యెల్లవేళలా గుర్తుంచుకోవాలి. మన కృషియొక్క వివిధ రూపాల యందు, మన సిద్ధికి సంబంధించిన దశల పరంపర యెడల మనకుండే విశ్వాసంలో యెటువంటి రాగం ఉండకూడదు, స్వేచ్ఛ ఉండాలి. మనం వదిలించుకొని, తిరస్కరిం చవలసినది మనలో బలంగా పైకి లేచేదెంతో యెక్కువగా ఉండడమే గాకుండా అజ్ఞానశక్తులను నిమ్న ప్రకృతికి, వాటిని తొలగించి వాటి స్థానాన్నాక్రమించవలసిన ఉన్నతతర శక్తులకు మధ్య ఒక సమరం కూడా మనలో వుంది. అదే గాకుండా, అనుభవాలు, ఆలోచనలు, అనుభూతుల స్థితులు తరువాత ఒక స్థితి నుండి మరో స్థితికి మారడానికి ఉపయోగపడే మెట్టుగా కన్పించేవి ఏవైతే ప్రస్తుతానికి ఆధ్యాత్మిక, అంతిమ దశలుగా దారిలో కన్పించేవి, తరువాత సహాయపడే సంసిద్ధి రూపాలుగా గోచరించే వాటిని అధిగమించిపోవాలి. వాటి నప్పటి వరకూ బలపరచిన కార్యనిర్వ హణా విశ్వాసం ఇతర గొప్ప విషయాలకు చోటిస్తూ ఉపసంహృతం కావాలి. వాటిని తొలగించి వాటి స్థానాన్నాక్రమించే లేదా వాటిని స్వీకరించి, వాటి రూపాంతరీకరణం పూర్తి గావించేటట్లు చేసే లేదా మరింత నిండైన, సమగ్ర సంసిద్ధులకు, అనుభవాలకు చోటిస్తూ ఉపసంహృతం గావాలి. మార్గంలో తటస్థపడే విశ్రాంతి నిచ్చే ప్రదేశాలపైగాని, వసతి కల్పించే గృహాలపైగాని పూర్ణయోగి కెటువంటి రాగబంధం వుండగూడదు. తన సంసిద్ధికి గొప్పవైన గట్టి ఆధారాల నన్నింటినీ యేర్పాటు చేసుకునేంతవరకూ, సంసిద్ధికి సంబంధించిన విశాల, స్వేచ్ఛామయ అనంతతల లోనికి ప్రవేశించేంత వరకు అక్కడ కూడా అనంతునికి సంబందించిన అనేక అనుభవాలతో తనను తాను

నింపివేసుకొనేంత వరకూ పూర్ణయోగాకాంక్షి సంతృప్తి చెందలేడు. అతని పురోగతి అర్థం ఒక స్థాయి నుండి మరింత ఉన్నతస్థాయికి ఆరోహణ. దివ్యమహాశక్తి చివరకు అతని కృషినంతా స్వీకరించేంతవరకూ, ఆమె ప్రకాశమయ కార్యనిర్వాహణలలో అంగీకారం తెలిపే ఏకత్వం ద్వారా ఆనందంగా అంగీకరించి పాలు పంచుకొనడం మాత్రమే అతడు చేయాలి. ప్రతి నూతన శిఖరం, చేయవలసి వున్న బృహత్ కార్యాన్ని, 'భూరి కర్తవ్యమ్' కి సంబంధించిన ఇతర సీమల దర్శనాలను నూతన దివ్యజ్ఞానాలను దర్శింపజేస్తుంది. ఈ మార్పులు. సంఘర్షణలు, రూపాంతరీకరణలు, ఇప్పుడు పనిచేస్తున్న మహాశక్తి యందు ఒక దృఢమైన విశ్వాసం లేకపోతే, నిన్ను నిరాశోపహతుని చేసి, విభ్రాంతికి గురిచేస్తాయి. అందుచేత నీవు యోగేశ్వరుని మార్గదర్శకత్వం మీద ఆధారపడాలి. ఆ యోగేశ్వరుని దివ్యజ్ఞానం తొందరపడదు. మనస్సుకు సంబంధించిన సమస్త సంక్లిష్టతలలో నుండి నిన్ను నడిపించు నడకలు నీకు తప్పక లభిస్తాయి. అవి సరియైనవి, దృఢమైనవి ఎందుచేతనంటే అవి మన స్వభావపు అవసరాలతో జరిపే పరిపూర్ణ సమగ్ర ఆదానప్రదానాలపై ప్రతిష్ఠించబడ్డాయి.

*

మానవబుద్ధి పొరపాటుకు చాలా భయపడ్తుంది. ఒక భావానికి నిశ్చితత్వాన్నాపాదించుకొని, అదే భావానికి కట్టుబడి వుండిపోతుంది. జ్ఞానాన్ని చిక్కించుకోవడంలో సరైన అంతిమ నిర్ణయం అదే అని తొందరపాటుతో ఆరాటపడి నిర్ణయించుకొంటుంది.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి.రావు

కొన్ని పదాల నిర్వచనం

విశ్వాసం: క్రియాశీలమైన సంపూర్ణ నమ్మకం, అంగీకారం.

నమ్మకం: బౌద్ధిక అంగీకారం మాత్రమే.

దృఢ నమ్మకం: తగిన కారణాలుగా కన్పించేవాటి నాధారం చేసుకొన్న బౌద్ధిక నమ్మకం.

ఆధారపడే నమ్మకం: పరిపూర్ణ విశ్వాసం మీద ఆధారపడి దేనికోసమో మరోదాని మీద ఆధారపడడం.

దృఢవిశ్వాసం: ఇతరుల నుండి సహాయం తప్పక లభిస్తుందని ఆశించడానికి

సంబంధించిన సంవేదన; వారి మాట మీద, స్వభావం మీద నమ్మకం. ధైర్యంతో కూడిన విశ్వాసం: దృఢవిశ్వాసం వల్ల యేర్పడే భద్రతా భావం.

సంశయము — దాని ఆవశ్యకత, ఉపయోగము

నమ్మకానికి శత్రువు సంశయము అయినప్పటికీ దానికొక ప్రయోజనము అవసరమూ కూడా ఉంది. మానవుడు అజ్ఞానంలోగానీ, జ్ఞానం పొందటం కోసం సలిపే అవిరళ కృషిలో గానీ సంశయాలు కలగవలసిన అవసరం ఎంతైనా ఉంది. అలా కలగకపోతే పరిమిత జ్ఞానంతోనూ, అమాయక నమ్మకంతోనూ మొండితేలి తన దోషాల నుంచి బయటపడ లేడు. యోగమార్గం అవలంభించినప్పుడు కూడా సంశయపు అవశ్యకత, ప్రయోజనం లేకుండా జరగదు. ఈ పూర్ణయోగం ఏదో ఒక ప్రాథమిక సిద్ధాంతాన్ని అనుసరించి పొందే జ్ఞానం కాదు. అది మొత్తం జీవితానికీ, ప్రాపంచిక చర్యలన్నిటికీ సంబంధించిన పరిజ్ఞానాన్ని పొందటమే ధ్యేయంగా కలది. ఈ జ్ఞానాన్ని పొందే అన్వేషణలో మనం జ్ఞానవిహీనమైన మనస్సు దాని చర్యలతో కూడి ఎంతో దూరం వెళ్ళవలసి వస్తుంది. ఏదో ఒక గొప్ప వెలుగులో అది పరిష్కృతమై, రూపాంతరం చెందే లోపల దానితోపాటు మనలో తప్పొప్పులతో కూడిన ఎన్నో గొప్ప నమ్మకాలు, భావాలు కూడా ఏర్పడి ఉంటాయి. ఇంకా ఆ తర్వాత పరిపక్వత పొందని కొత్త ఆలోచనలు, స్ఫూర్తులు, తప్పనిసరిగా నమ్మవలసిన ఎన్నో కొత్త భావనలు, ఊహలు కలుగుతూ ఉంటాయి. మనం వాటి దోషాలను, పరిమితులను, అపరిపూర్ణతను పట్టించుకోకుండా కలిగినవి కలిగినట్లు నమ్మి వాటిని పట్టుకుని వేలాడితే ఎంతో ప్రమాదం. నిజానికి యోగమార్గంలోని ఒకానొక దశలో ప్రజ్ఞావంతమైన భావాలను, అభిప్రాయాలను ఏ రూపంలో ఉన్నప్పటికీ అవే నిర్దుష్ట వేదమని ఒప్పుకోకుండా ఉండటం చాలా అవసరమవుతుంది. అవి ఏ రూపకంగా ఉన్నప్పటికీ అతిమానస విజ్ఞానంలో ఉద్దీప్త ఆధ్యాత్మకానుభవంతో వాటికొక ప్రకాశవంతమైన ఆకృతినీ, సముచిత స్థానాన్ని ఇవ్వగలిగే వరకూ వాటి స్థానాన్ని ప్రశ్నార్థకంగానే నిలిపి ఉంచాలి. హృదయంలో విశ్వాసం, ఉద్వేగాత్మకమైన నమ్మకాలు, సమ్మతులు ఈ మార్గంలో అవసరమే. కానీ అవి ఎల్లకాలం సరైన మార్గదర్శకత్వం వహించలేవు. వాటిని తీసి దివ్యజ్ఞానం, దివ్యసంకల్పంగా ఉండే దివ్యానందపు ప్రకాశవంతమైన సమ్మతితో

శుద్ధిచేసి పరివర్తన చేసి యథాప్రకారం వాటి స్థానంలో ఉంచవచ్చు. వివేచన దగ్గర్నుంచీ, ప్రాణికసంకల్పం దాకా నిమ్న ప్రకృతిలో దేనిపైనా యోగసాధకుడు పూర్తిగా శాశ్వత మైన విశ్వాసాన్ని పెట్టుకోలేడు. చివరకు ఆధ్యాత్మికత తర్కంతో మాత్రమే ఆధ్యాత్మిక సత్యం, శక్తి, పరమానందాలు అతనికి ఏకైక మార్గదర్శకులుగా, వెలుగుతారలుగా, కార్యనిర్వహణా దురంధరులుగా అవుతాయి.

అయినప్పటికీ విశ్వాసమనేది కడదాకా ఉండాల్సిందే, అది ఆత్మ తెలిపే సమ్మతి. ఆ సమ్మతే లేకుంటే ప్రగతి అనేది ఉండదు. యోగానుష్ఠానంలో మన నమ్మకమంతా ముఖ్యంగా సత్యము, నీతిసూత్రాలకు కట్టుబడి ఉండాలి. బుద్ధి కొంచెం మసగబారినప్పటికీ, హృదయంలో నిరాశ ఏర్పడినప్పటికీ, ప్రాణిక మనస్సు తన కోరికలకు నిరవధికమైన తిరస్కారము, ఓటమి కలిగి అలిసి సొలిసినప్పటికీ, మనస్సు అంతరాళంలో ఏదో ఒకటి ఉండి నిలదొక్కుకుని తిరిగి యథాస్థితికి చేర్చేదిగా ఉండాలి.

జ్ఞానం అల్పదశలో ఉన్నప్పుడు సందేహము, సంశయవాదము కూడా తాత్కాలికంగా పనికివస్తాయి. కాని ఉన్నతస్థాయి జ్ఞానం పొందితే అవి అడ్డంకులుగా ఉంటాయి. కారణం, అక్కడ రహస్యం సత్యాన్నీ, అసత్యాన్నీ సరిసమానం చేయ డంలో లేదు. అక్కడ జరిగే ఆవిష్కృత సత్యాన్ని నిర్విరామంగా సాధిస్తూండటమే. సర్వసాధారణంగా మేధస్సుతో కూడిన జ్ఞానంలో కొంత కపటత్వం గానీ, అసంపూర్ణత కానీ కలిసిపోయి ఉంటుంది. అందువల్ల ఆ సత్యాన్ని విమర్శనాత్మక విచారణకు గురిచేసి కలిసిన మిశ్రమాన్ని తొలిగించుకోవాలి. ఉన్నత శ్రేణి జ్ఞానంలో అసత్యమనేది ప్రవేశించలేదు. కానీ మేధస్సు ఏదైనా ఒక అభిప్రాయంతో ముడివడి ఉంటే దాన్ని మాత్రం విమర్శనాత్మక విచారణతో తొలిగించటం వీలు కాదు. సిద్ధిలో నిలదొక్కుకున్న ప్పుడు దానంతట అదే వదిలిపోతుంది. సాధించిన జ్ఞానంలో అసంపూర్ణత ఉంటే మాత్రం దాన్ని వదిలించుకోవాలి. అది సిద్ధిని దాని మూలాలను పట్టి ప్రశ్నించుడం ద్వారా కాకుండా ఇంకా ముందుకు సాగి సంపూర్ణ సిద్ధిని పొంది, ప్రగాఢము, ఉన్నతము, విస్తారము అయిన పరమాత్మునిలో వశించడం ద్వారా దాన్ని తొలగిం

చాలి. ఇంతవరకూ సిద్ధించనిదాన్ని విమర్శనాత్మక పరిప్రశ్నలతో కాకుండా కేవలం విశ్వాసంతో సిద్ధింపచేసుకోవాలి.

శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతి; అమరవాది వేంకటరామ శాస్త్రి)

సంశయాత్మక మనస్సు

కేవలం సంశయాత్మకమైన మనస్సు తనకు తానే నిరర్థకమైపోతుంది.

*

నిజజీవితంలో మాదిరిగానే యోగమార్గంలో కూడా మానవుడే ప్రతి ఓటమి నుంచి, భ్రమల నుంచీ చెక్కుచెదరకుండా నిలవగలడు. ఇంకా అనేక వైరుధ్య, ప్రతికూల శక్తులు, సంఘటనలు ఎదురైనప్పటికీ విజయుడై తిరిగి రాగలడు. ఆ విధంగా తన విశ్వాసాన్ని సమర్థించుకుంటాడు. మానవుని ఆత్మకు, అతనిలోని మహాశక్తికి ఏదీ అసాధ్యం కాదు. అంధవిశ్వాసమైనా, అజ్ఞానంతో కూడినదైనా కూడా సంశయాత్మక సందేహం కంటే నయమే. ఎందుకంటే అది మన ఆధ్యాత్మిక సాధ్యతలను పట్టించుకోదు. అల్పము, విమర్శనాత్మకము అయి నిరంతరం వేధిస్తూండే సృజనాత్మక హీనమైన మేధస్సు (అసూయ) మన సాధనను దుర్బలపరిచే అనిశ్చితతో అనుసరిస్తుంది. అందువల్ల పూర్ణయోగ సాధకుడు ఆ రెండు లోపాలను అధిగమించాలి.

*

భగవంతుని సత్యాలను, అసుర అబద్ధాలను గుర్తించగల శక్తి యోగజీవితానికి ప్రధానమైన ఆవశ్యకత. దానికిగాను సంశయమనే వ్యతిరిక్త, వినాశకర పద్ధతి ననుసరిస్తే మాత్రం సాధారణంగా అది అసత్యాన్ని నిర్మూలిస్తూ అదే నిష్పక్షపాత విసురుతో సత్యాన్ని కూడా తిరస్కరిస్తుంది. అలా కాకపోతే నమ్మకంగా, సహాయకారిగా ఉండి, మంచి వెలుగుతో వెతకగల శక్తిని తీసుకోవచ్చు. అది తన సహజ అజ్ఞానం వల్ల సంశయమనే పదునైన కత్తితో గానీ, తిరస్కారమనే దుడ్డుకర్రతో గానీ సత్యాన్నీ, అసత్యాన్నీ సంధించదు. మనస్సులో విచక్షణారహిత విశ్వాసం పెట్టుకోమని ఏ ఆధ్యాత్మికతగానీ, యోగముగానీ బోధించదు. అది ఇక్కడ చెపుతున్న విశ్వాసం మోటైన మానసిక

నమ్మకం గాదు. తనలో ఉండే నిర్దేశన జ్యోతి పట్ల ఆత్మకుండే ప్రగాఢ విశ్వాసము; ఆ జ్యోతి జ్ఞానం వైపు దారి తీసేదాకా విశ్వాసం అలాగే ఉండాలి.

*

విశ్వాసము, దానితో పాటు మిగిలినవాటినీ పొందాలనుకుంటే అవి కావాలని గట్టిగా హఠము చేయాలి. అవి కలిగేదాకా వెనుతిరగటం గానీ, నిరాశచెందటంగానీ, పట్టు వదలటం గానీ చేయకూడదు. ఆలోచించి, ఆకాంక్షించగల జీవులు ఈ భూమి పైకి వచ్చినప్పటినుంచీ ఏది పొందాలనుకున్నా ఇదే పద్ధతి జరుగుతోంది. వెలుతురు వైపు తెరుచుకోవడం అంధకారానికి వెన్నుచూపటమే అది. బయటి నుంచి ఏవో గొంతులు "నీవేమీ చేయలేవు, చేయకూడదు, నీకేమీ చేత గాదు, ఒక స్వప్నం చేతిలో నీవు కీలుబొమ్మవి" ఎడతెగకుండా అంటున్నట్లు వినబడితే, నీ వసలు విని పించుకోకూడదు, — ఎందుకంటే అవన్నీ విరోధ స్వరాలు. నీ కోస్తున్న ఫలితాలను తమ కర్కశ ధ్వనులతో అడ్డుకొని ఆ ఫలితాల నిష్ప్రయోజత్వాన్ని తమ వాదానికి ఋజువుగా సూచిస్తాయి.

శ్రీఅరవిందులు

హేతువుకూ, విశ్వాసానికీ, అంతర్బుద్ధిగల హృదయానికీ తార్కిక మనస్సుకీ మధ్య నుండే సంబంధాన్ని విడగొట్టి చూడడమే ఈ కాలాని కుండే ప్రత్యేకత. మొదట్లో వీటి మధ్యన యుద్ధప్రకటన వల్ల చాలా బాధాకరమైన సంఘర్షణే జరిగింది. విశ్వాసం సడలిపోవడం, సంశయా త్మకవాదం, అసంతృప్తిపడటం జరిగింది. కానీ ఇప్పుడా విచ్ఛేదం తమ పరస్పర అనన్యతా భావంతో మానవజీవితాన్ని క్షయింపజేసే విపరీత ధోరణులను కల్పించింది. ఒక ప్రక్క ప్రతికూల వినాశకర కీలక వైఖరి, మరో ప్రక్క శుద్ధమైన సహజ స్ఫురణనూ స్వప్న దర్శనాలు ఏర్పరచుకొన్న విశ్వాసాన్నీ వ్యతిరేకించే కల్పనాత్మక భావాలు కలిసి బుద్ధిని వ్యర్థ ఉన్మాదాల వైపు తిప్పుతున్నాయి.

శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతి; అమరవాది వేంకటరామ శాస్త్రి

గురునానక్ శిష్యుని అకుంఠిత విశ్వాసం

లోకప్రసిద్ధ ఆధ్యాత్మికవేత్త గురునానక్ దేహపరిత్యాగ సమయంలో "మీ గురుపీఠానికి వారసుడెవరో చెప్పండి" అని శిష్యులు అడిగారు. ఆ సమయంలో పెద్ద తుఫాను వస్తున్నది. ఒక గొప్ప ఆత్మ ప్రపంచం నుండి నిష్క్రమిస్తున్న వేళ ప్రకృతిలో అలజడి అది. నానక్ ఒక చెట్టు క్రింద కూర్చున్నారు. చుట్టూ శిష్యులు ఉన్నారు. అది సాయం సంధ్యాసమయం. శిష్యులకు ఆహారం, మంచినీరు చాలా అవసరమని నానక్ గ్రహించారు. ఆహారం తీసుకురమ్మని తన కుమారులయిన శ్రీచంద్ ను, లక్ష్మీచంద్ ను నానక్ ఆదేశించారు. కాని తండ్రికి వున్న ఆధ్యాత్మిక వారసత్వ గుణాలు వారికి సంక్రమించలేదు. ఆయన ఒక పిచ్చివాడని వారు భావించి ఆయన కోరికను పెద్దగా పట్టించుకోలేదు. బయట పెద్ద తుఫాను వస్తున్న వేళ ఆహారం కోసం ఎవరైనా వెళ్తారా అని వారు పరిహాసం చేశారు. నానక్ అప్పుడు ఒక శిష్యుని వైపు తిరిగి కొడుకుల్ని అడిగినట్లే అడిగారు. ఆహారం కోసం ఎక్కడికి వెళ్ళాలి అని ఆ శిష్యుడు అడిగాడు. తాము కూర్చుని వున్న చెట్టును అడుగు అని నానక్ అన్నారు. ఆహారం అది ఇస్తుందని ఆయన అన్నారు. నానక్ చెప్పినట్లే శిష్యుడు చెట్టును ప్రార్థించాడు. చెట్టు చాలినన్ని మిఠాయిలు కురిపించినట్లు కథలో వుంది.

నానక్ తరువాత శిష్యులతో పాటు నదీ తీరానికి వెళ్ళారు. దారిలో ఒక శవం కనిపించింది. ఈ శవాన్ని తినాలని నానక్ కొడుకుల్ని ఆదేశించారు. తన తండ్రి నిజంగా పిచ్చివాడేనని, అందుకు ఋజువు ఇదేనని కొడుకులు భావించారు. కాని శిష్యుడు ఎదురు చెప్పకుండా శవాన్ని తినడానికి అంగీకరించి, ఎటువైపు నుండి — తలనుండా, కాళ్ళనుండా — తినడం ప్రారంభించాలని అడిగాడు. నానక్ పూర్తిగా తృప్తి చెంది, శిష్యుని విశ్వాసానికి ఆనందపడి, అతడే తన గురపీఠానికి వారసుడని ప్రకటించారు. తన కొడుకులకు ఆ ఉన్నతస్థానం ఇవ్వలేదు.

కష్టతరమైన సాధనలో ప్రాథమికంగా కావలసింది ఈ వీరోచిత ఆధ్యాత్మిక విశ్వాసం అని మతాచార్యులంతా గట్టిగా నొక్కి చెప్పారు. ఆ విశ్వాసం అందరికి లభించదు. ఇందులోని నీతి అనుభవం ద్వారా న్యాయమేనని గ్రహించవచ్చును. ఏ సాహసంలోనైనా విజయానికి తొలి మెట్టు విశ్వాసం. విశ్వాసం పర్వతాలనే

కదిలించి వేస్తుంది అనడం అతిశయోక్తి కాదు. దాటలేని కష్టాలు వచ్చినా సంకల్పశక్తి, భావశక్తి ఉన్నవారు సహనంతో ఉండేటట్లు చేసేది ఈ విశ్వాసమే. ఉదాత్తమైన తమ లక్ష్యం చివరికి విజయవంతంగా సాధించబడుతుందన్న వజ్రసంకల్పం, విశ్వాసం వారికి ఉన్నాయి. కష్టాలు ఎంతటి దారుణమైనవైనా వారిని ఏమీ చేయలేవు. మహనీయు లందరిలోనూ గల మహోదాత్త గుణం విశ్వాసమే. విశ్వాసం భవిష్యత్తులోకి తొంగిచూస్తుంది. అసంభవాన్ని సంభవం చేయగలరు.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

కర్మయోగి బాధను ఆనందంగా స్వీకరించడానికి సంసిద్ధమవుతాడు. ద్వేషం, అవమానం, చెడు, అన్యాయాలను అతి నిశ్చలంగా ప్రేమ, గౌరవం, దయగా స్వీకరిస్తాడు. మృత్యువును జీవితంగా ధైర్యంగా ఎదుర్కొంటాడు. ఈ విశ్వాన్ని అధిష్టించి పాలించే మహాసంకల్పం ఏమిటో అతనికి తెలుసు. అన్ని వస్తువులలోనూ దైవసంకల్పం చూస్తాడు. దురదృష్టం వరించినా, మనిషి, ప్రకృతి కలిగించే ఆఘూతా లకు, తన పాపాలు, వైఫల్యాలు కలిగించే విఘూతాలకు అతను భయపడడు. భగవంతుని సంకల్పం తనను సక్రమంగా నడుపుతున్నదన్న నిర్మల విశ్వాసంతో కర్మయోగి ముందడుగు వేస్తాడు. గమ్యం చేరడంలో తడబాట్లు కూడా అవసరమేనని నమ్ముతాడు. అతని యోగసాధన పరిపూర్ణమైతే, అతని విశ్వాసం, సహనం కూడా పూర్ణప్రశాంతితో, శక్తితో భాసిస్తాయి. కాని ఆ విశ్వాస, సహనాలు నిష్క్రియాత్మకంగావు, బలహీనమైనవి కావు. తన పతనంలో, తన బాధలలో భగవంతుడ్ని చూస్తాడు. అన్యాయానికి, దుష్టశక్తి ప్రతిఘటనలో కూడా భగవంతుడ్ని చూస్తాడు. అది స్వార్థం, కాంక్ష అజ్ఞానుసారం కలిగే ప్రతిఘటన కాదు. కాని సత్య, ధర్మాల కోసం, నైతిక వ్యవస్థ కోసం అతను ఆ మార్గాలలో పయనిస్తాడు. వాటి పైన ప్రజల ఆనందం, జీవన స్థిరత్వం ఆధారపడతాయి. అవి అతని చర్యల వలెనే ఈ ప్రతిఘటనలో గూడా. నిర్భయత్వం, దేవత కుండవలసిన ధైర్యం ఉంటాయి.

శ్రీఅరవిందులు

అనువాదం కె. యజ్ఞన్న

జగన్మాత కృప

శ్రీఅరవిందుని మంత్రవాక్కులు

ఏ విధమైన భయం, ఆపద, మహోపద్రవం ఎదురైనప్పుడు క్షేమంగా జీవితం కొనసాగించడానికి శ్రీ దివ్యజనని కృప, నీ పక్షంలో శ్రద్ధ, చిత్తశుద్ధి, సమర్పణలతో కూడిన ఆంతరిక స్థితి — ఈ రెండు మాత్రమే ఆవశ్యకమైనవి. నీలోని శ్రద్ధ, నిర్మలమై, నిష్కపటమై, పరిపూర్ణమై ఉండనివ్వాలి. అత్యాశ, గర్వం, దంభం, మానసిక దురహంకారం, ప్రాణకోశ మూర్ఖత్వం, స్వార్థపూరిత కాంక్షా ప్రవృత్తి, అధోప్రకృతిలోని తుచ్ఛవాంఛలతో కళంకితమైన మానసిక ప్రాణిక సత్తల యందలి అహంకారపూరితమైన శ్రద్ధ పొగ క్రమ్మిన అగ్నిశిఖయై స్వర్గోన్ముఖంగా పైకి జ్వలింపదు. దివ్య కార్యనిర్వాహణలో, దివ్య అభివ్యక్తిలో సహకరించడానికి మాత్రమే జీవితం నీకు ప్రసాదించబడిందని గ్రహించాలి. దివ్యచైతన్య పవిత్రత, శక్తి, తేజస్సు, విశాలత, ప్రసన్నత, ఆనందాలను కోరుకోవాలి. ఆ చైతన్యం, నీ మనస్సును, జీవితాన్ని, శరీరాన్ని తప్పక రూపాంతర మొందించి పరిపూర్ణత్వం పొందునట్లు చేయడాన్ని మాత్రమే కోరుకోవాలి. దివ్యము, ఆధ్యాత్మికము, అతిమానసము అయ్యి మహాసత్యము కొరకు, భూమి పైననూ, నీలోన, దైవం పిలుపు అందుకున్న, దైవం చేత ఎంపిక చేయబడినవారి యందు, కృపకు పాత్రులైనవారిలోన, ఆ దివ్యసత్యం సాక్షాత్కరించడానికి, అట్టి సత్య సృష్టికి అవసరమైన పరిస్థితుల కొరకు దానిని ప్రతిఘటించి సర్వ శత్రు శక్తులపై అది సాధించు పోరాటం కొరకు అర్థించు.

నీ శ్రద్ధ, నీ సమర్పణ, చిత్తశుద్ధి, స్వచ్ఛమై, సమగ్రమై ఉండనిమ్ము. నిన్ను నీవే ఇచ్చుకున్నప్పుడు ఆత్మనివేదన సమయంలో దేనినీ ఆధికారపూర్వకంగా అడుగక ఎట్టి నిబంధన విధింపక, సొంతం కొరకు దేనినీ ఉంచుకొనక సంపూర్ణంగా ఇచ్చుకొనాలి. అందుచేత నీ యందలి సమస్తం, నీ సర్వస్వం శ్రీదివ్యజననికి చెందాలి. అహంకారానికి గాని, అన్యశక్తికిగాని ఏమియు మిగలకూడదు.

నీ శ్రద్ధ, చిత్తశుద్ధి, సమర్పణ ఎంత పూర్ణంగా ఉంటుందో, అంతగా కృప, రక్షణ నీకు ఉంటాయి. శ్రీదివ్యజనని కృపారక్షణలు నీతో ఉండగా నిన్ను ఏది స్పృశించగలదు? నీవు ఎవరిని చూసి భయపడాలి? కృపారక్షణలలో ఏ కొంచెమైనను అన్ని కష్టాలు, ఆటంకాలు, ప్రమాదాల నుండి నిన్ను రక్షించి దరిచేర్చుతుంది.

కృపా రక్షణలు నీ పైన పూర్తిగా ఉన్నప్పుడు, నీ మార్గంలో నువ్వు నిర్భయంగా ప్రయాణించగలవు. ఎందుకంటే ఆ కృపా రక్షణలు ఆమెవి. ఎంతటి ప్రమాదాన్నైనా లెక్కించక ఈ లోకంలో నుండి గాని, కనిపించని ఇతర లోకాల నుండి కాని కలిగే ఎంతటి ప్రబల దుష్టశక్తుల దాడికైనా చలింపక ఉండగలవు. ఆమె కృపా కటాక్ష ప్రభావం కష్టాలను సదవకాశంగా, వైఫల్యాన్ని విజయంగా, దుర్బలత్వాన్ని స్థైర్యంగా మారుస్తుంది. ఎందుకంటే పరమేశ్వరుని అనుజ్ఞయే శ్రీదివ్యజనని అనుగ్రహం. నేడో రేపో దాని ఫలితం నిశ్చయం. అది భగవత్సంకల్పం. అది విధాయకమైనది, అప్రహతిమైనది.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

నీ శ్రద్ధ, నీ సమర్పణ, చిత్తశుద్ధి ఎంత పూర్ణంగా ఉంటుందో, అంతగా కృప, రక్షణ నీపై ఉంటాయి. శ్రీ దివ్యజనని కృపారక్షణలు నీతో ఉండగా నిన్ను ఏది స్పృశించగలదు?

శ్రీఅరవిందులు

29 మార్చి 1914

విశిష్ట చారిత్రిక సంఘటన – జగన్మాత ఆగమనం

ప్రత్యేక సంచిక



అఖిల

అఖిల భారత పత్రిక

మార్చి 2013

9/3/2012

విషయసూచిక

1914 మార్చి, 29 నాటి చారిత్రాత్మక సంఘటనపై ప్రత్యేకసంచిక

వారు లేక నా ఉనికి లేదు.
నేను లేక వారికి అభివ్యక్తి లేదు

శ్రీమాత

ఎప్పుడు, ఎలా శ్రీమాత శ్రీఅరవిందులను కలుసుకొన్నారు

ప్రశ్న: ఎప్పుడు ఎలా నేనీ భూమిపై నెరవేర్చవలసిన జీవితకార్యం పట్ల సచేతను రాలినయ్యాను? ఎప్పుడు ఏ విధంగా శ్రీఅరవిందులను కలుసుకొన్నాను?

జ: మీరడిగిన ఈ రెండు ప్రశ్నలకు క్లుప్తంగా జవాబిస్తానని అన్నాను. ఈ కార్యానికి చెందిన జ్ఞానం ఎప్పుడు కలిగిందో చెప్పడం కష్టం. దానితోపాటే నేను పుట్టానా అన్నట్లు, నా మెదడు, నా మనస్సూ వికసించేకొద్దీ ఈ చైతన్యానికి చెందిన పరిపూర్ణత, స్పష్టతలు పెరుగుతూ వచ్చాయి.

నాకు 11 నుండి 13 సం.ల మధ్య వయస్సులో అంతరాత్మిక, ఆధ్యాత్మిక అనుభవాల స్రవంతి, దేవుడున్నాడనే కాక, దైవంతో ఏకమై జీవించడం మనందరికీ సాధ్యం అని నాలో వ్యక్తమయింది. భగవంతుడిని సమగ్రంగా మన చైతన్యంలోనూ, మన చర్యలలోనూ గ్రహించడం, ఒక దివ్యమయ జీవనంలో ఈ భువి పైన ఆతనిని సాక్షాత్కరింపచేయడం కూడా సాధ్యమే అని తెలిసింది. దానితోపాటు, అవసరమైన ఒక ఆచరణాత్మక శిక్షణ నా శరీరం నిద్రించే సమయంలో ఎంతోమంది గురువుల ద్వారా స్వాప్నికంగా నా కివ్వబడింది. వారిలో కొందరిని నేను తరువాత కాలంలో కలిసాను కూడా.

పిదప, బాహ్య, ఆంతరిక అభివృద్ధి కొనసాగుతున్న కొద్దీ వీరిలోని ఒక వ్యక్తి పట్ల ఆధ్యాత్మిక అంతరాత్మిక అనుబంధం ప్రగాఢంగా, సుస్పష్టంగా తరచూ ఏర్పడుతూ వుండేది. అప్పుడు భారతీయ వేదాంతాల గురించి, మతాల గురించి నాకేమీ తెలియకపోయినా, అతడిని శ్రీకృష్ణుడిగా పిలిచేదాన్ని. అప్పటి నుండి ఏదో ఒక రోజున అతడిని ఈ భూమి మీద దర్శిస్తానని, అతనితోబాటే భగవత్ కార్యం నెరవేర్చబడాలని నాకు తెలిసింది.

1910 లో నా భర్త ఒక్కరే పాండిచ్చేరికి వచ్చారు. వారికి ఎంతో ఉత్సాహకర మైన, విచిత్రమైన పరిస్థితులలో శ్రీఅరవిందులతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుండీ ఇరువురమూ నా మాతృభూమిగా తలంచి పులకించే భారతదేశానికి వచ్చి వేయాలని గట్టిగా కాంక్షించాం. అట్లా1914 లో ఈ 'ఆనందం' మాకు అనుగ్రహించ బడింది.

శ్రీఅరవిందులను చూడటంతోనే నాకు బాగా తెలిసిన, నేను కృష్ణుడిగా పిలిచే వ్యక్తి అయనేనని గ్రహించాను. ఇది చాలు... నేనుండవలసిన ప్రదేశం, నా పని ఆయన దగ్గరేనని ఈ భారతదేశంలోనే అని, ఎందుకు పూర్తిగా ఒప్పుకున్నానో.

శ్రీమాత

(పుదుచ్చేరి, 1920)

ఆమె తొంభైయ్యవ జన్మదినం నాటి స్మృతులు

నేను శ్రీఅరవిందులను కలుసుకొనేందుకు భారతదేశానికి వచ్చాను. వారితో జీవించడానికే భారతదేశంలో ఉండిపోయాను. ఆయన తమ దేహాన్ని విడిచిన తరువాత కూడా, పరమ సత్యాన్ని సేవించుట ద్వారా, మానవజాతిని ఉద్దీపింప చేయుట ద్వారా, ఈ భువిపై దివ్యప్రేమ యేలుబడిని వేగవంతం చేయాలనే ఆయన కార్యాన్ని, కొనసాగించే నిమిత్తమే, నేనిక్కడ ఉండిపోయాను.

శ్రీమాత

(21 ఫిబ్రవరి, 1968)

అనువాదం: హర్షవర్ధన్

మీరు నన్ను ఏ విధంగా నుండాలని కోరుతారో, నేను అలాగే వుందును. మీరు నేను ఏమి తెలుసుకోవాలని కోరుతారో, నేను అదే తెలుసుకుందును. మీరు నేను ఏమి చేయాలని కోరుతారో, నేను అదే చేస్తాను.

శ్రీమాత



శ్రీమాతారవిందుల చరణకమలాలతో పవిత్రీకరించబడిన మెట్ల వరుస

1914 మార్చి, 29 నాటి సమావేశ పరమార్థం

"నూతన శకావిర్భావ ఘడియ ఆరంభం"

1913 వ సంవత్సర చివరిలో పాల్ రిచర్డ్ ఫ్రెంచి ఇండియా నుంచి పారిస్‌లోని సెనేట్ మరియు చాంబర్ ఆఫ్ డిప్యుటీస్‌లో సీటు కోసం పోటీ చేయాలని నిర్ణయించారు. మిర్రా మరియి పాల్ 1914 మార్చి 5 న పారిస్ నుంచి బయలుదేరి జెనీవాలో 'కగమారు' అనే జపనీస్ స్టీమర్ లో ఆ మర్నాడు బయలుదేరారు. కొలంబోలో 'కగమారు' ని వదిలి తలైమున్నార్ మీదుగా ధనుష్కోటిలో దిగారు. అక్కడి నుంచి రైల్లో ప్రయాణించి 1914, 29 మార్చిన పాండిచ్చేరి చేరారు. అదే రోజు మధ్యాహ్నం 3.30 గం.లకి శ్రీఅరవిందులను 41, ఫ్రాంశ్ వా మార్తా వీధిలో ఉన్న వారి నివాసంలో కలుసుకున్నారు. వారిని మేడ మీద వరండాలోకి వెళ్ళే మెట్ల దగ్గర నించి స్వాగతించి పైకి వరండాలోకి తీసుకువెళ్ళారు. అక్కడ పరస్పర పలకరింపులయ్యాక శ్రీఅరవిందుల ఎదురుగా కూర్చున్నారు. మిర్రా వారిని తనకు తాంత్రికజీవనంలో జ్ఞానబోధ చేసిన, తాను కృష్ణుడని పిలిచే మాస్టారుగా వెంటనే గుర్తించారు.

ఎవరి కోసం ఆమె హృదయం ఈ సుదూర తీరాలకు వచ్చిందో...
ఇక్కడే ఈ అస్పష్ట పృథ్విపై అతడిని మొదట కలిసింది.
రెండు జీవితాల మధ్యనున్న తెర చీల్చబడి,
హృదయాల పరస్పర కలియికలో,
నింగిలోని తారల వలె ఆకర్షితులై,
ఆనందాశ్చర్యాలతో ఒకరి నొకరు తిలకించారు.
ఆ నిశ్శబ్ద వీక్షణంలో ఓ బాంధవ్యం అల్లుకున్నారు.
ఆ క్షణం కాలంలో శాశ్వతం యొక్క కాంతి కిరణమై నిలిచింది.
అది నూతన శకావిర్భావ ఘడియ ఆరంభం.

(సావిత్రి పు. 393, 399)

"శ్రీఅరవిందులు — వారి అసాధారణ జీవితం" లో
శ్రీ రిషాబ్ చంద్‌గారి వివరణ

"మాస్టర్‌తో శ్రీమాత సమావేశం అపారమైన ఆధ్యాత్మిక ప్రయోజనంతో కూడినది. అది మానవుల ఆధ్యాత్మిక సంస్కృతిలో ఓ మైలురాయి. ఓ చరిత్రాత్మక నూతన దశకు సంకేతమైన అద్భుత ఘటన. అది ఒక చైతన్యవంతమైన ఆధ్యాత్మిక నూతన యుగానికి ప్రారంభోత్సవం. అది చరిత్రకు, మానవజాతికి తెలియని వుద్యమానికి నాంది. అది మానవుని, అతని మానసిక అస్పష్టతల మసకతనం నించి, అనంతమైన అతిమానస ప్రకాశాల అద్భుతశక్తులకు ఉద్ధరించాలన్న అంకురిత దీక్ష, పట్టువదలని సాహచర్యానికి దారితీసింది. అనాదిగా ఈ పృథ్వీపై, ఈ ప్రపంచ విషయాలపై విముఖతతో, సన్యసించడమే పరిష్కారంగా దానిపై ఆసక్తి చూపే సాంప్రదాయక ముసుగును తొలగించి, దానిని ఆ గత అజ్ఞాతకూపంలోకి విసిరివేసి, సమగ్ర ఆధ్యాత్మిక ప్రకాశ ప్రభావాన్ని దర్శింపజేసింది. పృథ్వీపై జీవితం దివ్యాభివ్యక్తికి సాధనంగా, అంగీకరించి ధృవపరిచింది. అంతేకాక పాతుకుపోయిన అజ్ఞానం, అచేతనల శక్తులతో తలపడడానికి, విధి నిర్దేశించిన మృత్యుభయంకరమైన పోరాటం సాగించడానికి సిద్ధపడింది. అంధకారం, దుఃఖం, మృత్యువుతో, శాపగ్రస్తమైన పృథ్వీపై జీవితాన్ని ఏలుతున్న ఆ చీకటి సామ్రాజ్యాన్ని కూలదోయగల శక్తి ఉన్న ఆ విశిష్ట అతిమానస ప్రకాశ శక్తులను ఈ భువి పైకి తీసుకువచ్చి, భవిష్యత్తును తీర్చిదిద్ది మానవుల యొక్క అసలైన విధి విధానాన్ని సాక్షాత్కరింప చేసింది. భూలోకం స్వర్గలోకానికి ఆహ్వానం పలకడానికి సంసిద్ధమైంది. ఆత్మ అవరోహణ చేసి పదార్థాన్ని తన పరిష్వంగంలో చేర్చుకుంది."

వారు ఇంకా ఈ విధంగా వ్యక్తం చేస్తారు:

"అది ఇద్దరు ప్రవక్త-ఆత్మల, ఇద్దరు దైవవిభూతులైన అగ్రగాముల సమావేశం. ఆ సమావేశ నిజప్రయోజనం — వారు ఒకే దివ్యచైతన్యంగా విలీనమై — ఆ ఐక్య చైతన్యాన్ని పరిణామంలో సమగ్ర యోగం యొక్క పరిపూర్ణతకు, సర్వజనీన ఆధ్యాత్మికతకు నాంది పలికి ఈ పృథ్విపై దివ్యజీవనాన్ని స్థాపించి, పృథ్విని పరివర్తన చేయడం. వారి ఈ ఐక్యచైతన్యం గురించి ప్రస్తావిస్తూ శ్రీమాత ఒకసారి చెప్పారు...."

"వారు లేక నా ఉనికి లేదు, నేను లేక వారికి అభివ్యక్తి లేదు". సూటిగా ఉన్న ఈ ఉద్ఘాటన ఈ ఆధునిక యుగంలోని పరిణామ సంక్లిష్టతలో వారు విధిగా నిర్వహించే ద్విపాత్రను విజయవంతంగా ఆవిష్కరిస్తుంది".

అమల్ కిరణ్ (కె. డి. సెత్నా) మాటల్లో:

"శ్రీఅరవిందులను కలవబోయే ముందర... ఆమెలో ఎన్నో బలమైన ఆలోచనలు చోటుచేసుకున్నాయి — ప్రపంచ ఉన్నతికి — మతపరమైన, సాంఘికమైన, కళాత్మకమైన ఆలోచనలు ఎన్నో. కాని శ్రీఅరవిందులను చూడగానే, ఆమె తన మానసిక ప్రభావాల మూసలో ఉన్న యోచనల ఆకృతులన్నీ ఆగిపోవాలని ఆకాంక్షించారు. ఆమె కాని, వారు కాని ఒక్క మాట పలకలేదు. మౌనమే వారి మధ్య సంభాషణ. ఆమె వారి పాదాల దగ్గర కూర్చుని కళ్ళు మూసుకున్నారు. తన మనస్సును వారికి తెరిచి ఉంచారు. కొంచెం సేపు తరువాత పైనుంచి ఒక అనంత నిశ్శబ్దం ఆమె మనస్సులో స్థిరపడింది. గతమంతా కరిగిపోయింది. గొప్పవి అనుకున్న సున్నిత ఆలోచనలన్నీ మాయమయ్యాయి. అక్కడ ఒక శూన్యమైన చెదరని ప్రతీక్ష మాత్రమే ఉంది."

"వారిద్దరి కలయిక నూతన యుగారంభానికి కావలసిన సృజనాత్మక శక్తుల సంగమానికి ప్రతీకగా నిలుస్తుంది. మనం ఇక్కడ తెలుసుకోవలసిన మరో విషయం, శ్రీఅరవిందులు, శ్రీమాత వారిద్దరి యొక్క ఆధ్యాత్మిక ఆంతరంగిక సాధన ఒకే మార్గంలో సాగింది. అది పదార్థాన్ని, ఆత్మను ఒక్కటి చేయాలన్న లక్ష్యంతో కొన సాగింది. అందువల్ల వారిద్దరి శక్తుల కలయిక ఒక సహజమైన విషయం. అది శక్తుల్ని రెట్టింపు చేయడమే కాదు, పరస్పర పూరకమైన అనుసంధానం. శ్రీఅరవిందుల యొక్క ప్రధాన చైతన్య ప్రస్థానాలు మనసు పైనున్న విస్తృత దివ్యజ్ఞాన-దివ్యశక్తికి సంబంధించినవే అయినా, సమగ్ర ఆధ్యాత్మిక ఆవశ్యకతలకు కావలసినవన్నీ ఏదో రూపంలో అక్కడ లభ్యమైనాయి. శ్రీమాత యొక్క ఆధ్యాత్మిక పయనంలో ముఖ్య మైనది హృదయం వెనకగల గాఢమైన దివ్యప్రేమ- దివ్యశక్తి అని చెప్పుకోవచ్చు. సమగ్ర యోగాన్నంతటిని చేపట్టడానికి కావలసిన విశేషణాలతో సహా. శ్రీఅరవిందులు, శ్రీమాత యొక్క ఈ కలయిక పరస్పరానుకూలమైనది. అది ఆ ఇద్దరి ఆధ్యాత్మిక శక్తుల్ని పరస్పర పూరకంగా ఒక చోటికి చేర్చి, ఆ ఇరువురి ఆధ్యాత్మిక శక్తుల్ని

ఒకే క్రియాశీలం చేసి — పృథ్వి యొక్క సంపూర్ణ రూపాంతర కార్యాన్ని ఉన్నత స్థరాల నుండి, గాఢ లోతుల నుండి ప్రారంభించారు".

నళినిదా (నళినికాంత గుప్తా) వారి జ్ఞాపకాల్లో ఈ క్రింది విధంగా వెల్లడిస్తారు:

మొదటిసారి శ్రీఅరవిందులు మిర్రా గుణాలను వర్ణించినపుడు, ఆమె వలె ఏ విధమైన దాపరికంలేని సర్వసమగ్రమైన ఆత్మసమర్పణ అంతకు ముందెన్నడూ చూడలేదని అన్నారు. మరో వ్యాఖ్యానం చేస్తూ, బహుశ స్త్రీలు మాత్రమే ఆ విధ మైన సంపూర్ణ సమర్పణ గావించగలరేమో, అంత సంపూర్ణంగా, అంత ఉత్కృష్ట సౌలభ్యతతో, అని అన్నారు. అనగా గతంతో పాటు వారి ఒప్పు తప్పులన్నీ తుడిచివేయబడ్డాయి అని దీని అంతరార్థం.... ఆమె ఇక్కడకు వచ్చినపుడు ఆమె శ్రీఅరవిందులకు సంపూర్ణంగా, ఒక పసిబిడ్డ వలె, దాపరికం లేకుండా సమర్పణ చేశారు. అంతకు ముందు ఆమె సాధించిన ఆధ్యాత్మిక యోగ్యతలను, చైతన్య వైభవాలను, తన గతం అంతటినీ, అప్పుడే పుట్టిన బిడ్డకు ఏమీ లేనట్లుగా సమర్పించి శూన్యంగా మిగిలారు. అన్ని విషయాలను ప్రారంభం నుండీ అధ్యయనం చేయడానికి ఉన్ముఖులయ్యారు."

అనువాదం: డి. సత్యవాణి

దైవప్రార్థన, దైవానికి మనఃపూర్వక సంపూర్ణ సమర్పణ ఆవశ్యకమైన ప్రాథమిగ నిబంధనలు.

శ్రీమాత

శ్రీమాత డైరీలోని విషయాలు:
(శ్రీఅరవిందులతో ఆమె సమావేశానంతరం)

మార్చి 30, 1914

సర్వాత్మనా నీ సేవకులై, నీ దివ్యసాన్నిధ్యజ్ఞానము సంపూర్ణముగా పొందియున్న వారి సన్నిధిలో, నేను పొందవలసియున్నదాని కింకను కడుంగడు దూరముగ నున్నట్లే నాకు తెలియనగుచున్నది. ఏది అత్యున్నతము, అత్యుదాత్తము, అతి విశుద్ధము అని నేను భావించుచున్నానో అయ్యది, ఇటుపైన నేను భావించవలసియున్న దానితో పోల్చి చూచినచో, అజ్ఞాన కలితమగు అంధకారప్రాయమనియే చెప్పనగును. కాని, ఇట్లు నేను తెలిసికొనుట, నన్ను క్రుంగదీయుటకు బదులు, నా యాకాంక్షకు, నా శక్తిసంపదకు, సకలావరోధములను జయించి పర్యవసానమున నీ దివ్యనియతితోడను, దివ్యకార్యముతోడను సంపూర్ణైక్యమున మనవలె నన్న నా సంకల్పమునకు, మరింత యుత్తేజమును, బలమును కల్పించుచున్నది.

నా చుట్టునుగల సీమాంతరేఖ కొంచెము కొంచెముగా అంతకంతకు విస్తరిల్లి విస్పష్టమగుచు, మార్గము విశదమగుచున్నది. అంతకంత కధికతరమై విస్తరిల్లు సునిశ్చిత గమ్యము వైపుగా పురోగమించుచున్నాము.

వేలకొలది మానవులు అజ్ఞానంధకారములో మునిగియున్నను ఆందోళన చెంద వలసిన పనిలేదు. నిన్న మేము పొడగాంచిన మహనీయుడు భూమిపై నున్నాడు. అంధకారము ప్రకాశముగా పరివర్తనము చెంది, పృథ్విపై నీ రాజ్యము ప్రతిష్ఠింపబడు దినము రాగలదని నిరూపించుటకు ఆయన సన్నిధియే చాలును.

ప్రభూ, ఈ అద్భుతమును నిర్మించుచున్న దివ్యస్థపతివి నీవు. దీనిని గురించి తలపోసినపుడు, మహదానందభరితమై కృతజ్ఞతా భావమున నా హృదయము పొంగి పొరలుచున్నది.

మాటల కందని భక్తిభావము నాలో పెల్లుబుకుచున్నది. నిశ్చల నీరవ మౌనస్థితిలో వినయవినమ్రురాల నగుచున్నాను.

*

ఏప్రిల్ 1, 1914

పరమ పవిత్రమైన నీ యాలయగర్భములోనికి ప్రవేశించి యచట మేము నీ యిచ్ఛనే సాక్షాత్తుగా తెలిసికొన్నట్లుగా నాకు దోచుచున్నది. నాలో ఒకానొక మహదానందము, ఒకానొక గభీరశాంతి రాజ్యమేలుచున్నది. అర్థరహితమైన స్వప్నము వోలె, నా అంతరమున నేను చేసికొన్న కల్పన లన్నియు అంతర్ధానమైపోయినవి. వ్యక్తిత్వమింకను పొందని జీవివోలె, ఏ చట్రముగాని, వ్యవస్థగాని లేక నీ యనంతత్వ సమ్ముఖమున నే నిపుడు నిలువబడియున్నాను. గతించి పోయినదంతయు, ముఖ్య ముగ దాని బాహ్యస్వరూపము, పరిహాసాస్పదమై, నిరుపపత్తికమై కనుపట్టుచున్నది అయినను, ఆ కాలమును అప్పటికది ఉపయోగకరమేయైనదని నాకు తెలియదు.

కాని, ఇప్పుడు మాత్ర మంతయును మారిపోయినది. ఒక వినూత్న మైన దశ యారంభమైనది.

*

ఏప్రిల్ 2, 1914

ప్రతి దినము, నేను వ్రాయునప్పుడు మా ముందున్న నూతన దశ విస్తరణదశగాని కేంద్రీకరణదశ కాదన్నటుల ఒక రకమగు అంతరాయమేర్పడుచున్నది. ప్రగాఢమైన నీరవ నిదిధ్యాసనమునగాని, లిఖితమో, అలిఖితమోయైన ధ్యానరూపమునగాని గాక, అనుక్షణ కార్యాచరణమున నిన్ను సేవించుచు, నీతోడి యైక్యమును మేము సాధించవలసి యున్నది.

కాని, నా హృదయ మెన్నడును నిన్ను కీర్తించుటయందు విసువుచెందదు. నా చిత్తవృత్తియందు సంతతము నిండియున్నది నీవే.

*

ఏప్రిల్ 3, 1914

ఇపుడు నేనొక నూతనజన్మ యెత్తుచున్నట్లుగా నున్నది. గతకాలపు పద్ధతులు, అలవాటులు ఇప్పుడెంతమాత్రము పనికిరావు. ఒకప్పుడు ఫలప్రాయముగా చూపట్టిన దంతయు ఇప్పుడు నాకు సన్నాహమాత్రముగా గోచరించుచున్నది. ఇంతవరకు నేను సాధించినదేమియు లేనట్లుగా, ఆధ్యాత్మిక జీవనమే నాకు తెలియనట్లుగా ఆ మార్గములోనికి ఇపుడే క్రొత్తగా ప్రవేశించుచున్నట్లుగా నాకు తోచుచున్నది. నాకే మియు తెలియదనియు, దేనిని రూపొందించుటకును నాకు సమర్థత లేదనియు, అనుభవమనునది యిక మీద క్రొత్తగా ప్రారంభము కావలసియున్నదనియు యని పించుచున్నది. నా గతజీవితమంతయు — నేను చేసిన పొరపాటులు, సాధించిన విజయములు, అన్నియు — నా నుండి గళితమైపోగా అది యెల్ల అంతర్ధానమై క్రొత్తదేదియో జన్మించినట్లుగా నున్నది. దాని రూపురేఖ లింకనూ ఏర్పడలేదు. గతకర్మ యనునది దానికి మృగ్యము. ఉపయోగపడదగిన అనుభవము లేదు. దిద్దుకోవలసిన తప్పులును లేవు. ఏ విధమైన జ్ఞానము, ఏ విధమైన నిశ్చయము లేక నా మెదడు ఖాళీగా నున్నది. వ్యర్థభావనలు సైతము అచట లేవు. ప్రతిఘటన మేమియు చూపక ఈ స్థితికి నేను అర్పణ మొనర్చుకొందునేని, తెలుసుకోవలెననెడి ప్రయత్నము సైతము చేయక కేవలము శిశువువలె అజ్ఞముగా అమాయకముగా నుండ నిచ్చగింతునేని, ఒకానొక నూతనావిర్భూతి ఏదియో నా యెదుట విచ్చుకొన గలదని తోచుచున్నది. ఇప్పుడు నేను సునిశ్చితముగ ఆత్మార్పణము గావించుకొని వట్టి ఖాళీపుట వలె నుండవలసిన తరుణము వచ్చినది. ఈ ఖాళీపుటపై, పరమేశ్వరా, నీ సంకల్పము, నీ భావనయే, ఎట్టి వికృతులను బొందక యథేచ్ఛగా తమ్ము దాము ఉల్లేఖించుకోవలసి యున్నది.

అపారమైన కృతజ్ఞతాభావము నా నుండి పెల్లుబుకుచున్నది. నే నింత కాలముగా అన్వేషించుచు ప్రయాణించిన ద్వారదేశము నెట్టకేలకు చేరుకొన్నట్లనిపించుచున్నది.

ఈ ద్వారదేశమును అసందిగ్ధముగ దాటగలుగుటకై వలయు విశుద్ధిని నిర్వ్యక్తిక స్థితిని, నీ దివ్యప్రేమచే నుదీప్తమగు యోగ్యతా సంపత్తిని, ఓ ఆత్మేశ్వరా నా కను గ్రహింపుము.

ఏ విధమైన తమస్సు, పరిమితి లేకుండ, నీ దాననై మెలగుటే నేను కాంక్షించు చున్నది.

*

ధ్యానములు

ఏప్రిల్ 4, 1914

ఓ పరమేశ్వరా, అత్యంత భక్తి భావముతో నీ పూజనము నాలో నుండి ఊర్ధ్వ ముఖమై యుద్గమించుచున్నది. నా యావత్సత్తయు నీకు నివేదితమైన యొక దీపజ్వాలగా, ఎడతెగని యాకాంక్షగా, రూపుగైకొనియున్నది.

ఓ ప్రభూ, ప్రభూ, నా ప్రియగురూ, నాలో నివసించుచున్నది, సంకల్పించు చున్నది నీవే.

ఈ శరీరము నీ చేతి సాధనము, ఈ సంకల్పము నీకు దాసభూతము; ఈ బుద్ధి నీ యుపకరణము, ఈ సమస్తమూ కేవలము నీవే.

*

ఏప్రిల్ 7, 1914

పోరాటము నుండి తప్పించుకొనుటకే నేను సదా ప్రయత్నింతునేని, ఇక నా ధైర్య మేపాటిది? చేయవలసియున్న నూతన ప్రయత్నమునకు సహజముగ వెనుకాడుచు, పూర్వము చేసిన ప్రయత్న ఫలితములపైననే ఆధారపడి తటస్థభావమున నాకు తెలియకుండగనే నిద్దురకు దొరకొందునేని, నా శక్తిసామర్థ్యములును గణు తింపదగినవి కానేరవు. బలాత్కారమునగాని కార్యాచరణకు నేను పూనుకొనలేకు న్నాను. నేను చేయు మౌనధ్యానము కొంతవరకు బద్ధకముతో గూడినదే... ఇదంతయు నా కంతకంతకు స్పష్టముగా కనిపించుచున్నది. ఇప్పటి వరకు నేను చేసినదంతయు వట్టి శూన్యప్రాయముగనే నాకు దోచుచున్నది. ప్రభూ, నీ సేవకై నేను వినియోగించెడి యీ యుపకరణ మెంత దుర్బలమో, లోపభూయిష్టమో నేను గుర్తించుచునే యున్నాను. నన్ను గురించియు, నేను చేయు ప్రయత్నముల గురించియు, వాని ఫలితముల గురించియు తలపోసికొని అప్పుడప్పుడు నన్ను నేను ప్రశంసించు

కొనుటకు సిద్ధపడుటను జూచి నాలో నాకే విచారముతో గూడిన నవ్వు వచ్చుచున్నది. సత్యజీవనపు ద్వారదేశమును నేను చేరుకోగలిగితి నన్నట్లుగా నిత్యము నాకు కలుగుచున్న భావన ఆశామాత్రజనితమేగాని, సుస్పష్టానుభవజన్యము కాదు. అది పిల్లవాని కాశపెట్టిన ఆటబొమ్మ వంటిది; దుర్బలులకు ఇవ్వజూపిన పారితోషికము.

మరి నేను సంపూర్ణముగా ధైర్య, బల, శౌర్య గుణములతో కూడిన, ప్రశాంత నిశ్చలమైన పట్టుదలగల నిక్కమైన సత్యసంపత్తిని చేకూర్చుకోగలుగు టెప్పటికి? ఎప్పటికి నేను పూర్తిగా నా వ్యక్తిత్వమును విస్మరించి, కేవల మొక ఉపకరణముగా మారి, అది అభివ్యక్తము గావింపవలసియున్న శక్తులకు నిధానము కాగలుగుట? నీతోడి నా ఏకత్వజ్ఞానములో జడత్వ మిశ్రణము లేకుండబోవు టెన్నడు? ఎన్నడు నా దివ్యప్రేమానుభూతిలో దౌర్బల్యమనునది ఏ మాత్రమును కలగాపులగము గాకుండుట?

ప్రభూ, ఈ ప్రశ్నలు నేను వేయుటతో, చిత్తవృత్తి యెల్ల నాలో సమసిపోయినట్లు న్నది. ఎరుకగల మనస్సు కొరకు నే నన్వేషించినను అది కానవచ్చుట లేదు. నా వ్యక్తిత్వము కొర కన్వేషించినను దాని జాడ ఎచ్చటను లేదు. నా వైయక్తిక సంకల్పము కొర కన్వేషించగా అదియు అదృశ్యమే యైనది. నీకొర కన్వేషించుచుంటిని గాని, ఏ వాక్కు నీ నుండి వినవచ్చుట లేదు. నిశ్చల నీరవత మాత్రమే యున్నది, కేవలము నిశ్చల నీరవత.

ఇదిగో, ఇప్పుడు నీ వాణి యిట్లు వినవచ్చుచున్నట్లున్నది: "సర్వసమగ్రముగా ఇంతవర కెన్నడును నీవు సమసిపోవుట జరిగి యుండలేదు. సర్వదా నీలో ఏదియో, తెలియవలెనని, చూడవలెనని, అవగాహన మొనర్చుకోవలెనని, కోరుచునే వచ్చినది. సంపూర్ణముగా ఆత్మసమర్పణము గావించుకొనుము; నీ వనునది లేకుండ జేసికొను టెట్లో నేర్చుకొనుము; నిన్ను నా నుండి వేరుచేయుచున్న అడ్డుకట్టను భేదించుము; ఎట్టి మినహాయింపులులేక నీ సర్వసమర్పణ కార్యమును సాధింపుము."

ప్రభూ, ఏమి చెప్పుదును? అది సాధించవలెననియే ఎంతకాలము నుండియో కోరి ప్రయత్నించుచుంటిని. కాని, నా చేతగాలేదు, ఇప్పుడైనను నీవు నాకీ శక్తి ననుగ్రహింతువా?

ఓ పరమేశ్వరా, ప్రియతమ సనాతన గురుదేవా, నన్ను వేదనపాలు గావించు చున్న నాలోని యీ యవరోధమును విచ్ఛిన్నమొనర్చుము... నా యహంత నుండి నాకు ముక్తి ననుగ్రహింపుము.

*

ఏప్రిల్ 10. 1914

ఉన్నట్లుండి యవనిక చీలిపోయినది; నింగియు నేలయు గలియుచోటు దృగ్గోచర మైనది. ఈ నిర్మల దృశ్యము ముందర నా సత్త అంతయు అధిక కృతజ్ఞతాపూర్వక విజృంభణమున భవదీయ పాదాక్రాంతమైనది. ఈ యానందము గాఢము, పూర్ణము నైయుండినను, శాశ్వతికమైన శాంతితో సకలము శాంతిమయమై విరాజిల్లినది.

పరిమితులన్నియు తొలగిపోయినట్లయినది; ఇంద్రియ సంవేదనము, రసభావా నుభవములు, దేహస్ఫూర్తి, — ఇవన్నియు దూరములైనవి. అనిర్వచనీయమగు దివ్యానందముతో నిండి, ప్రేమతోడను, తేజస్సుతోడను సంవిద్ధమై, స్పష్టము, శుద్ధము, ప్రసన్నమునైన ఒకానొక అనంతత్వము నా యందుభాసించుచున్నట్లయినది. అదియే ఇప్పుడు 'నేను' గా నాకు దోచుచున్నది. ఈ 'నేను' స్వార్థపరత గలిగి, యావరణపరీతమైన మునుపటి 'నేను' కంటె కడు విలక్షణమైనది. ప్రభూ, మా సౌభాగ్యముల కెల్ల ఏడుగడవైన ఓ దేవా, ఇప్పుడా 'నేను' నేనో నీవో నుడువజాలను. అంతయు నొకానొక శక్తివలె, ధీరతవలె, సత్యసంకల్పమువలె, అఖండ మాధుర్యమువలె, నిరుపమాన కారుణ్యమువలె గనుపట్టుచున్నది.

ఈ కడపటి దినముల కంటె కడు బలవత్తరముగా, గతమంతయు నవ్య జీవితపు కిరణజాలము క్రింద పూడుకొనిపోయి మ్రగ్గినట్లుగా గోచరించుచున్నది. ఈ పుస్తకము లోని వెనుకటి పుటల గొన్నిటిని జదువుచు నా దృష్టిని నేను వెనుకకు బారనిచ్చినప్పుడు, తన్నాశము నిశ్చయముగా జరిగినట్లు రుజువగుచున్నది.అంత నేను, నా తలమీది భారము దిగిపోయినట్లు కాగా, నగ్నశిశువు వోలె నిష్కాపట్యముతో నన్ను నేను నీకు సమర్పణము గావించుకొనుచున్నాను... ఇప్పటికిని నేను కనుగొనుచున్నది ఆ శాంతియుతమగు శుద్ధ అనంత్యమునే. ఓ పరమేశ్వరా, నా ప్రార్థనమును నీవు మన్నించినావు; నే నేమి నిన్ను వేడితినో దానిని ప్రసాదించినావు. 'నే' ననెడి యహంత తిరోధానమైనది; నీ కైంకర్యము కొరకై, అనంతము, నిత్యమునగు

విజ్ఞానదీధితుల గేంద్రీకరించి యావిష్కరించునట్టి యీ వినయ విన్రమ పరికరము మాత్రము నిలిచియున్నది. దేవా, నా జీవితమును నీ జీవితముగా మార్చినావు; నా సంకల్పమును స్వీకరించి, దానికి నీ యిచ్ఛ పొత్తు గూర్చినావు; నా ప్రేమను గైకొని నీ ప్రేమతో సమీకరణ మొనర్చినావు; తలపుల నందుకొని, వాని స్థానమున నీ యవిచ్ఛిన్న చేతనను నెలకొల్పినావు.

ఇందుల కెంతేని అచ్చెరువొందుచు ఓ దేవా, ఈ శరీరము, తన శీర్షము నేలకు వంచి, మౌనమున సవినయముగా నిన్ను పూజించుచున్నది.

వికార రహితమైన నీ సముజ్జ్వల శాంతి వైభవమున విలసిల్లుచు ఉనికి కలిగి యున్నది నీ వొకడవే; నీకు దక్క మరి దేనికిని ఉనికి లేదు.

*

కరైకాల్, ఏప్రిల్ 13, 1914

నేను కేవలము అలవాటులతోనే జీవించే జీవిని కాకుండ జేయుటకు సకల పరిస్థితులు పన్నాగము పన్నినట్లున్నది. ఈ వినూత్న దశలో, అస్థిరమైన యీ సంకీర్ణ పరిస్థితుల నడుమ, నీ అవ్యయశాంతిని ఇంత సమగ్రముగా ఎన్నడును అనుభవించి యుండలేదు; నీ దివ్యశాంతిని నిరాటంకముగ కొనసాగింపజేయుచు, 'నేను' అనునది కూడ ఇంత సమగ్రముగా ఎన్నడును అదృశ్యమై యుండలేదు. సమస్తము ఇపుడు సుందరము, సామరస్యోపేతము, సుస్థిర శాంతి సమన్వితమునై యున్నది. అంతటను నీవే నిండియున్నావు. ధగద్ధగాయమానమై వెలుగు సూర్యునిలో ప్రకాశించుచున్నది నీవే; కమ్మనై వీచు పిల్లగాలిలో అనుభవించబడు చున్నదియు నీవే; ఎల్లరి హృదయములలో నీవే అభివ్యక్త మగుచున్నావు; ఎల్ల జీవులలో నీవో జీవించుచున్నావు. నిన్ను గురించి నాతో మాట్లాడని జంతువు లేదు, మొక్క లేదు. నాచే చూడబడు సమస్తము పైనను నీ నామమే లిఖించబడి యున్నది.

ఓ నా ప్రియతమ ప్రభూ, నన్ను పూర్తిగా నీ దానిని జేసికొనుటకు తుద కనుగ్రహించినావు; నా చేతనను సునిశ్చితముగ నీతో ఏకము గావించుకొన్నావు; ఇట్టి మహదానందమును బొందు యోగ్యతకు నే నేమి యొనర్చితిని? అనవరతము దానిని కోరుటయు, దానికై సంకల్పించుటయు దక్క ఇంకేమియు చేయలేదు; అది చాల కొద్దిపాటిదే.

కాని, ప్రభూ, ఇపుడు నాలో నివసించుచున్నది నీ యిచ్ఛయేగాని నా యిచ్ఛ కాదు గావున. ఈ యానందమును నీవు ఎల్లరకును ప్రయోజనకారి యగునట్లు చేయగలవు. అత్యధిక సంఖ్యాకులకు నిన్ను చూడనేర్చు భాగ్య మలవరించుటే ఈ యానంద ప్రయోజనము.

ఎల్లరును నిన్నెరిగి, నిన్నే ప్రేమించి, నిన్నే సేవింతురు గాక; పరమమైన, ఆత్మనివేదనము ఎల్లరకును అలవడును గాక.

దివ్యమైన ఓ ప్రేమరసమా, జగత్తునందంతటను వెల్లివిరిసి వ్యాపించుము; సకల ప్రాణులను పునరుజ్జీవింపజేయుము; సకల బుద్ధులకు దీప్తిని ప్రసాదించుము; అహంకారపు అడ్డుకట్టల నెల్ల భేదించి, అజ్ఞానావరోధమును పటాపంచలొనర్చి, సకల ప్రపంచమునకు దివ్యాధినేతవై దీపింపుము.

అనువాదం: కమలాకర వెంకటరావు (ప్రార్థనలు — ధ్యానముల నుంచి)

స్వర్గాన్ని మనం వశం చేసుకున్నాం, కాని భూమిని మాత్రం కాదు

(శ్రీఅరవిందులు, శ్రీమాత, పాల్ రిచర్డ్‌కు తన సాధనను గురించి 1915 వ సంవత్సరంలో వ్రాసిన లేఖలు)

(1)

అంతా ఎల్లప్పుడూ మంచికే నంటాం, కాని అప్పుడప్పుడు బాహ్యదృక్పథం ప్రకారం అది విపత్కరమైన మంచి.

*

నేను భావస్ఫూర్తితో వ్రాసిన వాటిలో ఇది ఒకటి, "నాశనమైపోయిన ఐరోపాను దైవ నగరంగా నిర్మించండి". నేను దానిని నీకు ఇస్తాను. దాని ఉపయోగం ఎటువంటి దైనప్పటికీ. బహుశా ఆధిపత్య శక్తుల ఆకాంక్ష ఈ పునః స్మరణను నీ చేత చేయించి ఉంటాయి. కాని, కేవలం ఐరోపా మాత్రమేనా కుళ్ళిపోయింది. ప్రపంచం మొత్తం కుళ్ళిపోయిన స్థితిలో లేదా? ఆసియాలో ఎక్కడో ఒక చోట ఒక ప్రశాంతమైన

ప్రదేశం కోసం ఆలోచిస్తే, అది ఎక్కడుంది? భూమండలమంతా ఇప్పుడు ఒకే న్యాయసూత్రానికి లోబడి ఉంది, ఆ ప్రకంపనలకే సమాధానం ఇస్తోంది. ఘర్షణతో కూడిన పోరాటంలోకి మనల్ని దిగలాగని ప్రదేశాన్ని మనం కనుగొనగలమా అని నేను శంకిస్తున్నాను. ఏది ఏమయినా కాని, వాస్తవిక రీతిలో విశ్రాంతి అనేది నా విధివ్రాతలో లేదనే అనిపిస్తున్నది. హానికారక పరిస్థితుల మీద ప్రభుతను సంపాదించేవరకో లేక వాటికి లొంగిపోవటమో లేక నా విధిలిఖితంలో కొనసాగించమని ఉన్నంతవరకూ ఆధ్యాత్మికతకూ భౌతికతకూ మధ్య పోరాటాన్ని కొనసాగించటానికో నేను అవశ్యం ప్రపంచంతో సంబంధాన్ని కలిగి ఉండాలి. విషయాలను నేను ఎల్లప్పుడూ ఈ విధంగానే చూస్తాను, ఇంకా అదే విధంగా చూస్తున్నాను. వైఫల్యం విషయంలో క్లిష్టత, అసాధ్యమని స్పష్టంగా కనపడేవాటికి నేను అత్యంతమూ అలవాటు పడిపోయి ఉన్నాను గనుక మధ్యలో అప్పుడప్పుడు కొన్ని సమయాలలో తప్ప, నిరంతరం, అవి తమకు తాము ఉనికిని ప్రదర్శిస్తున్నా, నేను ఎక్కువగా ప్రభావితుడను కాను.

*

నిజానికి సార్వజనీన స్థాయిలో కుళ్ళిపోయి ఎందుకూ పనికిరాకుండా పోయే ఇటువంటి కాలపరిస్థితులల్లో ఏ వ్యక్తికైనా ప్రశాంతమైన మనస్సు, నిశ్చలమైన ఇచ్ఛ, పూర్తి ఆత్మ-త్యాగ నిరతి, కనులు అతీతం మీద స్థిరంగా నిరంతరం నిలిపి అధైర్యపడకుండా జీవించడం అనేది అవసరం. నా విషయంలో, నేను దివ్యవాణిని అనుసరిస్తాను, ఆ విషయంలో నేను నా దృష్టిని అటుగాని ఇటుగాని మరల్చను. ఫలితం నాది కాదు, ఇప్పుడు శ్రమ కూడా ఏ మాత్రం నాది కాదు.

6 మే 1915

(2)

స్వర్గాన్ని మనం స్వాధీనం చేసుకున్నాం, కాని భూమిని మాత్రం కాదు; కాని యోగం పూర్ణోద్దేశం, వేదాలు సూత్రీకరించినట్లుగా, "స్వర్గమూ, భూమీ సమానం, ఒక్కటే".

20 మే 1915

*

శ్రీఅరవిందులు

(ఈ విషయానికి సంబంధించినదే శ్రీమాత డైరీలో 31 జూలై 1915 న వ్రాయబడినదానిని ఈ క్రింద తిరిగి ప్రచురించడం జరిగింది)

నేను సేవక పాత్రలో ఇమిడిపోతూ, ఒక పనిముట్టులా, నీ వైపు తిరిగి, ఓ ప్రభూ, నిన్ను ఒక స్తోత్రంతో స్తుతించనా? నేను నీలోని శాశ్వతమగు పరమ సత్యం, అనంతమైన పరమానందంతో తాదాత్మ్యత నొంది ఈ మనుషులతో వారికి తెలియని ప్రశాంతత, ఆనందాల గురించి మాట్లాడనా?... ఆ రెండు వైఖరులు ఏక కాలంలో జరిగేవి, ఆ రెండు చైతన్యాలు సమాంతరం. ఈ విధమైన చిక్కనైన, ఆత్మీయమై, కరిగి అదృశ్యమైపోని ఐక్యతలో మహాసమృద్ధి ఉంటుంది.

దివ్యలోకాలు తప్పక జయించబడ్డాయి. వానిని నా నుంచి తారుమారుచేసి లేకుండా చేయగలిగిన శక్తి, దేనికీ, ఎవరికీ ఉండబోదు. కాని అవనిని ఇంకా జయించ వలసి ఉంది; దానిని సంక్షోభసంద్రం మధ్యలో కొనసాగించబడుతున్నది; ఒక వేళ అది సిద్ధింపజేసుకున్నప్పటికీ, అది ఇంకా కేవలం సారూప్యతలో పరిమితమైనదే అవుతుంది. ఈ ప్రపంచంలో విజయాలన్నీ అంచెలంచెలుగా జరిగేవే, అవి ఇంకా క్రమక్రమంగా మరింత వైభవోపేతమైన విజయాలకు దారి తీసేవే. నీ మహదేచ్ఛ నా మనస్సులో ఏ లక్ష్యాన్ని అందుకోవాలని, ఏ విజయాన్ని అనుభవసిద్ధం చేయడానికి సంకల్పాన్ని జనింపజేస్తుందో అది నీ శాశ్వత ప్రణాళికలో కేవలం ఒక అణుమాత్రం. కాని ఈ పరిపూర్ణ ఐక్యతలో, ఈ ప్రణాళికనూ, ఈ మహదేచ్ఛనూ, ఈ భిన్న మైన ప్రపంచంలో నీవు నా కప్పగించిన ప్రత్యేకమైన పాత్రనూ ఎంతో ఉత్సాహంగా ఉరకలేస్తూ, కచ్చితంగా, శక్తివంతంగా పోషిస్తూ అనంతంలోని పరమానందాన్ని నేను చవి చూస్తున్నాను.

నీ శక్తి నాలో ప్రబలమై, సుసంపన్న మై, కఠినశిలల వెనుక నుంచి శబ్దం చేస్తూ, అడ్డం వచ్చినవాటిని పగులగొట్టడానికి శక్తిని కూడగట్టుకుంటూ, విశాల ప్రదేశంలో వేగంగా యథేచ్ఛగా నిరాటంకంగా పారుతూ, మైదాన క్షేత్రాలను తన సుజలాలతో సారవంతం చేయ పైకి ఉబికే సజీవ జలధార లాంటిది. ఆ విధంగా బయటపడే శుభఘడియ ఎప్పుడు సంప్రాప్తమౌతుంది? ఆ క్షణ మేతెంచినప్పుడు, అది బద్ధలై పరవళ్ళతో ముందుకు దూకుతుంది. శాశ్వతత్వంలో కాలానికి ఏ ప్రాముఖ్యం లేదు. కాని, అంతరంగంలో పేరుకుపోయినదాని వలన పొందుతున్న అపారమైన

ఆనందమునూ, ఈ ప్రగాఢమైన ఏకాగ్రతనూ, మునుపటి నీ ఇచ్ఛను వ్యక్తం చేయడానికి తంటాలు పడుతూ, దానికే ఇప్పటికీ అంటిపెట్టుకుని ఉన్నదాని నంతా నీ సర్వోత్కృష్టమైన ప్రవాహపు వెల్లువలో ముంచివేయడానికి, నీ మహదేచ్ఛకు విధేయమై భవిష్యత్తులో అభివ్యక్తమయేటటువంటి శక్తులన్నీ ఈ ప్రపంచం మీద విరుచుకుపడటానికి సమాయత్తమౌతూ, ఆ విధంగా అవనినంతా నీ దివ్యమైన పేరున స్వాధీనం లోనికి తెచ్చుకోవడానికీ, నీ సమగ్రమైన ప్రతిబింబంగా నీకు నివేదించబోవడానికీ ఏ మాటలు వర్ణించగలవు?

నీవు భూమి మరణిస్తుందని, అది తన పూర్వపు అజ్ఞానానికి మరణించగలదని కదా చెప్పావు.

నీవు భూమి జీవిస్తుందని, అది నీ పరమాధిపత్య శక్తిలో తిరిగి కొత్తదనం పొందగలదని గదా చెప్పావు.

ఏ మాటలు నీ మహత్తరమైన, ఉజ్జ్వల ధర్మాన్ని, వైభవోపేతమైన నీ మహదైశ్వర్యాన్ని ఎప్పటికి చెప్పగలవు?

ఏ మాటలు నీ సమగ్ర మహా చైతన్యాన్ని, నీ దివ్యప్రేమ ఒసగే అనంతానందాన్ని వ్యక్తపరచగలవు?

ఏ మాటలు నీ అనిర్వచనీయమైన మహాప్రశాంతతను, గాంభీర్యమైన నీ మహా నిశ్శబ్దమును, నీ సర్వ శక్తివంతమైన మహా సత్య మహత్వమును ప్రస్తుతించి పాడ గలవు?

ఈ అభివ్యక్తమైన విశ్వము సమస్తమూ నీ వైభవాన్ని చెప్పను సరిపోదు, నీ అద్భుతాలను చెప్పలేదు; ఈ అనంతకాలంలో ఇది ఇంకా ఇంకా, బాగా బాగా చేయాలని శాశ్వతంగా ప్రయత్నిస్తూనే ఉన్నది.

శ్రీమాత

(3)

అంతరంగంలో ప్రతిదీ పరిణితి చెందింది లేక పరిణితి చెందుతున్నది, కాని అది ఒక విధమైన నిర్బంధ ఘర్షణ. అందులో ఏ పక్షానికీ చెప్పుకోదగినంత పురోగమనం లేదు. (ఒక విధంగా అది ఐరోపాలోని కందకాలలో చేసే యుద్ధం); ఆధ్యాత్మిక శక్తి భౌతిక ప్రపంచపు ప్రతిఘటనకు వ్యతిరేకంగా ఒత్తిడి చేస్తున్నది, ఆ ప్రతిఘటన

ప్రతి అంగుళం వద్ద వివాదానికి దిగుతున్నది, ఎంతో కొంతమేరకు సమర్ధవంతంగా ఎదురుదాడులు చేస్తున్నది.... అంతరంగంలో దృఢత్వమూ, ఆనందమూ లేకపోయి నట్లైతే, అది ప్రాణం విసిగిపోయేటట్లు చేసి, ఏవగింపు కలిగించేపని; కాని జ్ఞానదృష్టి ఆవలకు చూస్తుంది, అది దానిని కేవలం మరి కాస్త సాగతీసి జాగుచేసే ఉపాఖ్యానంగా చూస్తుంది.

28 జూలై 1915

(4)

నేను ఇప్పుడే వెడలిన ఆర్య సంచికలో మానవైక్యతాదర్శం మీద వరుసగా కొన్ని శీర్షికలు వ్రాయ మొదలుపెట్టాను. నేను చాలా జాగ్రత్తగా వీటిని ఒకదాని తర్వాత ఒకటి వ్రాయాలని అనుకుంటున్నాను; మొదట్లోనే లోతులలోకి పోకుండా, ఐక్యతకు లోతైన అర్థానికి చదువరుల మేధస్సును క్రమేణా నేను తీసుకుపోతున్నానా అని అనిపించేవిధంగా — ప్రత్యేకించి ఏకరూపతనూ, యాంత్రికమైన సాంగత్యతనూ ఐక్యతగా పొరపాటుపడే ఆలోచనను ప్రోత్సహించదల్చుకోలేదు....

*

కదలకుండా స్థిరంగా ఉన్నవాటిని ఏదీ అస్థిరపరచగలదని అనిపించడం లేదు. మన స్వీయ అస్తిత్వానికి బాహ్యంలో మాత్రం క్రియాశీలమైన ఒక విధమైన అల్లకల్లోలంతో కూడిన గాడాంధకారం, మసకబారిన గందరగోళం ఉంటున్నాయి. అటువంటిదాని నుంచి ఏదీ రూపుదిద్దుకోదు, లేదా ప్రకాశవంతమైనదేదీ బయల్పడదు. అది ఏ విధంగానూ పోల్చలేనటువంటి ప్రపంచ పరిస్థితి, అది గందరగోళపు పరాకాష్ట. దాని మీద పాత ప్రపంచపు పై పై రూపం సుస్పష్టంగా చెక్కుచెదరకుండా తిష్ట వేసుకుని ఉన్నది. కాని ఆ గందరగోళమంతా దీర్ఘకాలం పట్టే ఛిన్నా భిన్నతకా లేదా ఒక విధంగా కాలానికి ముందుగానే జరిగే నూతన జననానికా? దాని కోసమే నిత్యం యుద్ధం చేయబడుతున్నది, కాని ఇప్పటికీ ఏ విధమైన పరిష్కారం దరిదాపుల్లో లేదు.

*

ఈ స్తబ్దతావధులు ఎల్లప్పుడూ ఉపరితలం మీద జరిగే పనిని దాచి ఉంచుతాయి, దాని తరువాత అవి ముందుకు సాగుతాయి.

16 సెప్టెంబరు 1915

(5)

దిశానిర్దేశం చేసే ఏ వాణి, ఆలోచన లేదా అంతఃప్రేరణ లేనప్పుడు, సహజమైన ప్రతిక్రియా స్పందనలు ఎవరినీ ఎక్కువ దూరం తీసుకువెళ్ళలేవు. అది మనస్సును కేవలం (నిశ్చయంగా జరుగుతాయని తెలియని) సంభావ్యతల చుట్టూ తిరిగేటట్టు చేస్తుంది.

—

ఈ విషయాలన్నీ బాహ్యలక్షణాల మీద కంటే చాలా ఎక్కువగా మన మీదనే ఆధారపడి ఉన్నాయి. మనం మన ఆలోచనలతో మానసిక నిరూపణలతో వాటిని పైకి లేవనెత్తక పోయినా లేక అవి పైకి లేచినప్పుడు బలపరచకపోయినా మనకు అంతరంగంలో నిశ్చలత, ప్రశాంతత ఉండి, శత్రువును తనకు తానుగా దండయాత్రకు మన మీదకు ఉసిగొల్పేదేదీ మనలో లేనప్పుడు, బాహ్యంలోని సంభావ్యతలు, సర్వ సాధారణంగా తమకు తాముగా వాస్తవరూపం దాల్చబోవు.

—

ప్రస్తుత పరిస్థితులలో మన ముందున్న కర్తవ్యం, హానికారక శక్తులను మన చుట్టూ జరిగే సంఘటనలనూ లెక్కచేయకుండా, ఆధ్యాత్మిక శక్తినీ, నిశ్చలతనూ, జ్ఞానాన్నీ, సంతోషాలనూ కూడగట్టుకోవడం; దాని వలన మన పని నిజంగా మొదలైనప్పుడు మన పని జరిగే భౌతిక ప్రపంచం మీద మనకుగా మనం గట్టిగా మన ప్రభావాన్ని పెట్టి ఉంచగలుగుతాం. (ఇది (నేను) నెమ్మదిగా చేస్తున్నాను: నా ఉద్దేశంలో నీవు చాలా త్వరితగతిన చేస్తున్నావు.)

—

నేను ఎల్లప్పుడూ ఒకటే అభిప్రాయంలో ఉన్నాను, బాహ్యం కంటె అంతరంగం ముందుకు పోవాలి, లేకపోతే మనం ఏ పనినైనా మన అంతరంగ శక్తులకు, జ్ఞానానికి మించి చేయాలని ప్రయత్నించితే, అది ఫలించకపోవటానికో లేక భగ్నమైపోవటానికో అవకాశం ఉంది.

—

కచ్చితంగా నా ప్రస్తుత పోరాటం, అది శక్తుల సంభావ్యతల వలయాన్ని దాటి బయటకు మహాసత్య ప్రకాశం, విజ్ఞానంలోకి పోవటం.

అబ్దుల్ బాహా సంభావ్యతల ననుసరించి చెప్పిన భవిష్యవాణి బహుశా నిజమే కావచ్చు, కాని ప్రస్తుతం నా ఉద్దేశంలో దానికి చాలా ఎక్కువగా కఠిన రూపాన్నివ్వట మౌతున్నది. వెలుగు కోసం పెనుగులాడుతున్న సంజవెలుగు ప్రపంచానికి ఆవల, ఒక ప్రకాశాన్నిచ్చే కేంద్రం, భౌతికంగా వర్గీకరించవలసిన ఆవశ్యకత ఏమీ లేదు, కాని కొంతమంది మటుకు నిలబడగలిగి, ఎక్కువెక్కువగా చాలామంది చేరగలగటానికి వృద్ధిపొందుతూ ఉండే ప్రకాశవంతమైన వలయం ఏర్పడాలి. ఇదే తప్పనిసరైన మార్గంగా తోస్తున్నది.

మనం ఇప్పటికీ ఇంకా ఎక్కువగా ఆ ప్రకాశం నుంచి ప్రతిఫలించిన కాంతిలో జీవిస్తున్నామే కాని ఆ ప్రకాశంలో మాత్రం కాదు. మనం ఆ కాంతి కేంద్రం సమీపానికి వెళ్ళగలిగినప్పుడు కాని మనం తెలుసుకోలేము.

నాకు పంపించబడిన యోజన చాల వరకు పరిసరాల ప్రభావంతో రూపుదిద్దుకున్న మానసిక నిర్మాణంలాగ నా కనిపిస్తున్నది. అది ఆచరణాత్మకమైనదానినిగా నేను అనుకోవడం లేదు. ఎందువల్లనంటే ప్రపంచం తయారుగా లేదు. ఒక వేళ అటువంటిదేదైనా ఆచరణలోకి తేవటానికి ప్రయత్నిస్తే, దానిని శ్రద్ధాసక్తులతో ప్రారంభించలేరు లేదా శ్రద్ధాసక్తులతో అమలుపరచలేరు... అటువంటి యోజన ఏదైనా మనం ఉద్దేశించిన గొప్ప లక్ష్యాలను పూర్తి చేయగలగాలంటే మానవజాతి హృదయంలో మార్పు రావాలి. ఒక నూతన హృదయం ఆవశ్యకమౌతుంది. తొందరపాటుతో తగిన కాలానికి ముందే రూపుదిద్దుట కన్నా విడిగా నుంచుటకే నేను మొగ్గు చూపుతాను, ఆ విడిపోవుట ఎంత అపాయంతో కూడినదైనప్పటికీ.

18 నవంబరు 1915

(6)

నీవు వర్ణించిన అనుభవం వాస్తవిక పద్ధతిలో వేదప్రోక్తమే అయినప్పటికీ వేద సాంప్రదాయాలకు అనుగుణమైనవని, చెప్పుకునే ఆధునికి యోగవిధానాలు అంత తేలికగా గుర్తించగలిగేది కాదు. అది వేదాలలోను, పురాణాలలోను చెప్పబడిన దివ్యసూత్రంతో

'భూమి' ఐక్యత, అందులో చెప్పబడిన భూమి మన భూమికి ఎగువగా ఉన్నది. వివరించి చెప్పాలంటే, భౌతిక అస్తిత్వం, చైతన్యం అనే వాటికి ఈ ప్రపంచం, శరీరం కేవలం ప్రతిబింబాలు మాత్రమే. కాని ఆధునిక యోగాలు దైవంతో భౌతిక ఐక్యతా సంభావ్యతను ఏ మాత్రం గుర్తించలేవు.

శ్రీఅరవిందులు

(శ్రీఅరవిందుల మరియొక సుదీర్ఘ లేక 'ఆధ్యాత్మిక పురోభివృద్ధిలో అడ్డంకులు' 23 జూన్ 1916 న వ్రాసినది, స్థలాభావం వలన ఇక్కడ ప్రచురించడం లేదు. పాఠకులు Difficulties in the spiritual Progress, *CWSA* Vol 36, pp. 28891 లో చూడగలరు

అనువాదం డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఇరువురిలోని దివ్యచైతన్యము ఒక్కటే

శ్రీమాతలోని చైతన్యము, నాలోని చైతన్యము ఒక్కటే. ఇరువురిలోని దివ్యచైతన్యము ఒక్కటే. కారణం మేము నిర్వహించవలసిన పాత్రలకు అది అవసరం. ఆమె తెలివి తేటలు, ఆమె శక్తిచైతన్యాలు లేనిదే ఏదీ సాధ్యపడదు. ఎవరికైనా ఆమె చైతన్యానుభూతి, నిజంగా కలిగిందంటే, దాని వెనుక నేనున్నానని అతనికి తెలియాలి. అలాగే అతనికి నా చైతన్యానుభూతి కలిగిందంటే దాని వెనుక ఆమె ఉన్నదని తెలియాలి.

*

శ్రీమాత మార్గానికి, నా మార్గానికి మధ్య భేదం లేదు. ఇప్పుడు, ఎల్లప్పుడు, మా ఇద్దరి మార్గం ఒక్కటే. ఆ మార్గం అతిమానస పరివర్తనకు, దైవసాక్షాత్కారానికి దారితీసేది. తుదిలోనే కాదు, మొదటి నుండి కూడ అవి ఒక్కటే.

*

(ఈ ఉత్తరంలో శ్రీఅరవిందులు తమను తాము ఉత్తమపురుషలో సంబోధించు కున్నారు.)

శ్రీఅరవిందులను గురించి తెలియకపూర్వం నుండే లేక వారిని కలవక ముందు నుండే శ్రీమాత యోగాభ్యాసం చేస్తుండేవారు. అయితే, వారిద్దరి సాధన వ్యక్తిగతంగా సాగినా, అది ఒకే దిశగా కొనసాగింది. వారి కలయిక తరువాత, ఆ సాధనను పరి పూర్ణమొందించుటలో ఒకరి కొకరు సహాయపడ్డారు. శ్రీఅరవిందుల యోగంగా తెలియబడినది, శ్రీఅరవిందులు, శ్రీమాతల సంయుక్త కల్పన. ఈ సందర్భంలో వారి పాత్రలు ఈ ప్రకారం నిర్ధారించబడ్డాయి. ఆశ్రమంలో కొనసాగే సాధన, దానికి తగిన ఏర్పాట్లు శ్రీమాత వంతు. దీనికి శ్రీఅరవిందులు ప్రచ్ఛన్న సహకారం అందిస్తారు. యోగాభ్యాసానికై ఆశ్రమానికి విచ్చేసేవారందరు శ్రీమాత ప్రాపులో ఉండాలి. ఆమె వారి ఆధ్యాత్మిక జీవన పురోభివృద్ధికి తోడ్పడతారు.

*

శ్రీమాత శ్రీఅరవిందుల అనుయాయి కాదు. నాకు కలిగిన సాక్షాత్కారం, అనుభవాలు ఆమెకు కూడ కలిగాయి.

శ్రీమాత సాధన అతి చిన్నతనంలోనే ఆరంభమైంది. ఆమెకు 13, 14 యేండ్ల ప్రాయంలో ప్రతి సాయంకాలం ఎందరో టీచర్లు ఆమె వద్దకు వచ్చి వివిధ ఆధ్యాత్మిక శిక్షణలను గరిపేవారు. వారిలో ఒకరు ఆసియా దేశస్థుడు. మేము మొదటిసారి కలుసుకొన్నప్పుడు, ఆమె చాలా కాలం క్రితం తరుచుగ దర్శించిన ఆసియా దేశస్థుడిగా నన్ను గుర్తించారు. ఆమె ఇక్కడికి వచ్చి నాతో కలిసి ఒక సమిష్టి ప్రయోజనార్థం పనిచేయడమనేది నిజంగా ఒక దైవనిర్ణయం.

భారతదేశానికి రాకపూర్వమే శ్రీమాత బౌద్ధయోగ సాంప్రదాయంలోను, గీతా యోగ సాంప్రదాయంలోను ప్రావీణ్యత సంపాదించారు. ఆమె యోగసాధన ఒక ఉదాత్తమైన సంయోజనం దిశగా సాగుతుండింది. పర్యవసానంగ ఆమె ఇక్కడకు రావడం సహజమే. నా యోగానికి ఒక వాస్తవ రూపకల్పన గావించుటలో ఆమె సాయపడింది, ఇంకా సాయపడుతూనే ఉంది. ఆమె సహకారం వినా ఇది సాధ్యపడేది కాదు.

ఈ యోగం యొక్క రెండు ప్రధాన చర్యలలో శ్రీమాత ఆశ్రయం పొందుట ఒకటి.

(ఆ తరువాత ఒకానొక సందర్భంలో, ఆ రెండవ ప్రధాన చర్య ఏమిటని శ్రీఅరవిందులను అడిగినప్పుడు వారి సమాధానం "దివ్యజీవనం కొరకు సాధకుడు ఆకాంక్షించుట.")

*

నేను కేవలం శ్రీఅరవిందుల శక్తిని మాత్రమే కాదు. నా బిడ్డలందరికి అమ్మను.

నా బిడ్డలందరు సమానంగా, నా చైతన్యం, నా అస్తిత్వంలో భాగాలే. పరివర్తన చెంది, సత్యాన్ని దర్శించగలిగినప్పుడు అందరికి నా యొక్క, శ్రీఅరవిందుల యొక్క ఒక అంశను వ్యక్తపరచుటకు సమాన హక్కు ఉంటుంది.

ఒక సమిష్టి ప్రయత్నంతో ప్రత్యక్షపరచుటలో గల అందరి ఐకమత్యత ఒక వినూత్న దివ్యలోకాన్ని ఈ పృథ్విపై సృష్టించుటకు వీలు కలిగిస్తుంది. ఇందులో ప్రతి ఒక్కరు తమ పాత్రను పోషిస్తారు. కాని అందరి ఐకమత్యత యొక్క సమిష్టి శక్తి తప్ప ఏ ఒక్క పాత్ర కూడ సంపూర్ణమైనది కాదు.

(ఇది 1927 ప్రాంతంలో శ్రీఅరవిందులు వ్రాసినది)

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి జానకి

శ్రీమాతారవిందుల ఉపదేశం

ప్రపంచపు ఉనికి ఒక హఠాత్ పరిణామం కాదు, అది అనాలోచితంగ, సృష్టింపబడలేదు, అకారణంగ ప్రభవించినది కాదు. అది స్వయంగ తనలో బ్రహ్మవాక్కును భరించి ఉంది. నిగూఢ దివ్యసాక్షాత్కారంతో నిబిడీకృతమై ఉంది.

ప్రపంచపు ఉనికి అనాలోచితమైన, అర్థరహితమైన, లక్ష్యరహితమైన, అల్పమైన, నిర్దిష్ట చలనాలను సృష్టించే గ్రుడ్డి యాంత్రిక వ్యవస్థ కాదు. క్రమక్రమంగా అభివ్యక్త ప్రక్రియ ద్వారా ఆవిష్కరింపబడుచుండే పరమ సత్య విషయపరంపర. తనలోనే ఇమిడియున్న తన స్వీయ వాస్తవ పరిణామం.

ప్రపంచపు ఉనికి అ ఒక భ్రాంతి కాదు. అది కారణంలేని, లక్ష్యంలేని, ఉనికికి ప్రమేయంలేని, ఉనికి వీలుగాని, అసలు ఉనికే లేనిదయినా పైకి ఉన్నట్లుగా కనిపించే, ఒక మహామాయ కాదు. ఒక మహోన్నత పరమ సత్యం స్వయంగా తనలో ఈ మహాద్భుత ప్రపంచాన్ని సాక్షాత్కరించుకున్నటు వంటిది.

శ్రీఅరవిందుల ఉపదేశాలు ప్రాచీన భారతీయ ఋషుల ప్రవచనాల నుండి ప్రభవిస్తాయి. ఈ లోకపు పై పోకడల వెనుక ఒక దివ్యచైతన్యము యొక్క, దివ్య అస్తిత్వము యొక్క పరమ సత్యము ఉన్నదని, అది సర్వ వస్తు సముదాయమునకు ఏకైకము, శాశ్వతము అయిన ఆత్మవంటిదని ఆ ప్రవచనాల సారాంశము. సర్వజీవులు ఆ ఏకాత్మలో, ఆ పరమాత్మలో జతగూడి వున్నవే అయినా చేతన యొక్క, ఒక విధమైన విభాజిత లక్షణం వలన, వాటిని గురించి, వాటి వాస్తవికతను గురించి శారీరక, మానసిక, ప్రాణికాలలో సమగ్ర అవగాహనలేని కారణంగా, పరస్పరం వేరు కాబడ్డాయి. అయినప్పటికి, ఒక మానసిక అభ్యాసము ద్వారా చైతన్యము యొక్క విభాజిత లక్షణాల తెరను తొలగించి, నిజమైన ఆత్మజ్ఞానమును మనలోను, అందరిలోను ఉన్న దివ్యత్వాన్ని గురించిన అవగాహనను పొందవచ్చును.

శ్రీఅరవిందుల ఉపదేశానుసారం, ఈ ఏకాత్మ, ఈ దివ్యచైతన్యము ఇక్కడి భూతత్వంలో ఇమిడి ఉన్నాయి. పరిణామ ప్రక్రియ ద్వారా భూతత్వం స్వయంగా తన నుండి వీటిని విడుదల చేసుకుంటుంది. చైతన్యం, అచేతనగా కనిపించే దానిలో ప్రత్యక్షమౌతుంది.అలా ఒక్కమారు కనిపించిన తరువాత, అది స్వయం ప్రేరితమై, ఉన్నతంగ ఎదుగుటతో పాటు సంపూర్ణంగ, సమగ్రంగ విస్తరించి వృద్ధిచెందుతుంది. ఈ చైతన్యపు విడుదల యొక్క తొలి మెట్టు జీవితం. మనస్సు రెండవ మెట్టు. అయితే పరిణామం మనస్సుతో అంతం కాదు. అది మరో గొప్పదానిలో, ఆధ్యాత్మిక పరమైన దివ్యచైతన్యపరమైన దానిలో విలీనానికై నిరీక్షిస్తుంది. పరిణామ ప్రక్రియలోని తదుపరి మెట్టు అతిమానసము, ఆత్మ చైత్యపురుష సత్తాలో ప్రబలమైన శక్తులుగా ఎదుగుట. ఎందుకనగా, అలా జరిగినప్పుడు మాత్రమే విషయాలలో ఇమిడి ఉన్న దివ్యత్వం పూర్తిగా విడుదల అయ్యి జీవిత పరిపక్వత ప్రకటితమగుట సాధ్యపడుతుంది.

అయితే వృక్ష జంతు జాతుల పరిణామక్రమంలో, ప్రకృతి ఈ ప్రక్రియలను వాటి చేతనాపూరిత సంకల్పంతో నిర్వర్తించకపోయినా, మనుషుల విషయంలో మాత్రం ప్రకృతి వారి చైతన్యపూరిత సంకల్పంతోనే నిర్వర్తించగలదు. అయినా కూడ కావలం మనిషి యొక్క మానసిక సంకల్పంతో మాత్రమే ఇది పూర్తిగ నేరవేరదు. కారణం, ఒక మధ్యంతర స్థానం వరకే మనసు పోగలదు. అటుపైన ఒక వలయాకారం లోనే పరిభ్రమించుట తప్ప ముందుకు సాగలేదు. అందుకుగాను ఒక మార్పు

ఏర్పడవలసి ఉంటుంది. మనసు ఒక మహోన్నత ఆదర్శం వైపు మళ్ళే విధంగా ఒక మలుపు తిరగవలసి ఉంటుంది.

ఆయన లక్ష్యం ఏదో మతాన్ని విస్తృతపరచాలనిగాని లేక పూర్వపు మతాలను ఒకే త్రాటిపై తేవాలనిగాని లేక ఒక క్రొత్త మతాన్ని స్థాపించాలనిగాని కాదు. వీటిలో ఏ వొక్కటైనా ఆయన ముఖ్యోద్దేశం నుండి దూరం చేసేదే. ఆయన యోగం యొక్క ఏకైక లక్ష్యం, అంతరంగ స్వయం వృద్ధిని సాధించుట. దానిని అనుసరించే ప్రతి ఒక్కరు కాలక్రమేణ పరమాత్మను అందరిలోను కనుగొనగలిగి, మానవ ప్రకృతిలో పరివర్తన తేగలిగి, దానిని దైవికమైనదిగా తీర్చిదిద్దగలిగే ఆధ్యాత్మికపరమైన అతిమానస చైతన్యాన్ని వికసింపచేయుట.

*

నేను కొందరు సాధకులకు వ్రాసిన ఉత్తరాలలో, పూర్ణయోగం ఒక వినూతనమైనదని నొక్కి చెప్పాను. నా దృష్టిలో ప్రాచీన యోగసాంప్రదాయం యొక్క లక్ష్యాన్ని, ఉద్దేశాన్ని పునఃశ్చరణ చేయుట సరిపోదు అని వారికి విశదీకరించడానికి, ఆ కారణంగ ఇప్పటి వరకు సాధించబడనిదాన్ని, స్పష్టంగ దర్శించబడనిదాన్ని, అది గత ఆధ్యాత్మిక సాధనల సహజ ఫలితమైనప్పటికి రహస్యమైనది గావున దానిని వారికి విపులంగ విశదీకరించటానికి, ఆ విధంగ వ్రాశాను.

ప్రాచీన యోగాలతో పోలిస్తే అది ఆధునికమైనది. అందుకు కారణాలు —

(1) దాని లక్ష్యం ప్రపంచం నుండి, జీవితం నుండి నిష్క్రమించి స్వర్గానికో లేక నిర్వాణ దిశగానో పయనించుటగాక జీవితాన్ని, స్థితిగతులను మార్చుట. ఆ మార్పు ఏదో ఒకదానికి లోబడి చేసేదో లేక సందర్భానుసారంగ సంభవించేదో కాదు. ఒక ప్రత్యేకమైన ప్రధాన లక్ష్యంగా చోటు చేసుకునేది. ఇతర యోగాలలో అవరోహణ చోటు చేసుకున్నట్లయితే అది ఆ యోగమార్గంలో సంభవించే ఒక సాధారణ సంఘటనగానో లేక ఆరోహణాక్రమంలో కలిగే ఒక అనుభవంగానో పరి గణింపబడుతుంది. కాని అసలైనది ఆరోహణ మాత్రమే. ఈ మార్గంలో, ఆరోహణ ఒక మొదటి మెట్టు. కాని అది అవరోహణకు ఒక సాధనం. అది ఆరోహణాక్రమంలో సాధించబడే నూతన చైతన్య అవరోహణ; సాధన యొక్క సాధికారిక ముద్ర. తాంత్రిక వైష్ణవ తత్వాలు కూడ జీవితం నుండి నిష్క్రమణయే చరమస్థాయి అంటాయి. అయితే పూర్ణయోగ లక్ష్యం జీవితం దివ్యజీవనంగా సాఫల్యత నొందుటయే.

(2) ఆశించిన లక్ష్యం ఒక వ్యక్తి ప్రయోజనార్థం, వ్యక్తిగత దైవానుభవం సాధించుట కాదు. ఇందులో లక్ష్యం పృథ్వీ చైతన్యం కోసం దేనినైనా సమకూర్చుట — అది విశ్వగతమైనది కావాలి. కేవలం పరలోకానికి సంబంధించినదే కాదు. దీనితో పాటు ఇప్పటి వరకు పృథ్వీతత్వంలోనే కాక ఆధ్యాత్మిక జీవనంలో కూడ వ్యవస్థీకరించబడని లేక క్రియాశీలంకాని, ఇక పైన వ్యవస్థీకృతం చేయబడి ప్రత్యక్ష కార్యాచరణ గావించ వలసిన దివ్యచైతన్య మహాశక్తిని (అతిమానసం), అందుబాటులోకి తెచ్చుట కూడ సమకూరుతుంది.

(3) ఈ కార్యసాధన కోసం ఒక విధానం గతంలోనే రూపొందించబడింది. ఆ విధానం ఎంత సమగ్రమైనదంటే, దాని ముందున్న లక్ష్యానికి దీటైనది. ఆ లక్ష్యం, పాత పద్ధతుల ద్వార చైతన్యాన్ని, స్వభావాన్ని సమూలంగ, సమగ్రంగ మార్చుట. అయితే ఇది పాక్షికచర్య మాత్రమే. అయినా కొన్ని ప్రత్యేక విషయాలలో ప్రత్యక్ష సహకారం అందిస్తుంది. ఈ పద్ధతినిగాని, దానికి సమానమైన మరోదానినిగాని, పురాతన యోగమార్గాలలో ప్రతిపాదించబడినట్లుగాని లేక ఉపయోగించినట్లుగాని నాకు కనిపించదు. నేను గమనించి ఉన్నట్లయితే క్రొత్త బాటను వేయుటకు సమయాన్ని వృధాపరచేవాడిని కాదు. ముప్ఫై సంవత్సరాల అన్వేషణ, అంతర్ కృషి అవస రమయ్యేవి కావు. గతంలోనే వెలుగులోకి వచ్చిన, నిర్దేశించబడిన, సవివరంగా ప్రకటించబడిన, సురక్షితమైన, జనాదరణ పొందిన బాటలపై సునాయసంగ పయనించి గమ్యం చేరేవాడిని. మన యోగం పాతదారుల వెంట సాగే పునఃప్రయాణం కాదు. అది ఒక ఆధ్యాత్మిక సాహసోపేత పూనిక.

*

నేను "అతిమానసము" అనే పదాన్ని రూపొందించినట్లుగానే "రూపాంతరీకరణ" అనే పదాన్ని కూడ, పూర్ణయోగంలోని ఆధ్యాత్మిక సత్యాలను ఇతర సంబంధిత విషయాలను వ్యక్తపరచుటకు స్వయంగా రూపొందించాను. అయితే జనం ఆ పదాలను, నేను ఆ పదాలలో స్ఫురింపచేయదలచిన భావాలను విస్మరించి, వికట భావాలను వ్యక్తపరచుటకు ఉపయోగిస్తున్నారు. "రూపాంతరీకరణ" అనగా స్వభా వాన్ని దైవిక ప్రభావంతో పవిత్రీకరించాలి అని కాదు నా భావన. పవిత్రీకరణ అనగా మానసికమార్పులో, లేక ఆధ్యాత్మికపరమైన మానసికమార్పులో, ఒక భాగం మాత్రమే. అదీగాక, ఈ పదానికి అనేకమైన అర్థాలున్నాయి. తరచుగా నీతిపరమైన లేక

సత్ప్రవర్తనను సూచించే భావనలో వాడుతుంటారు. కాని ఈ రెండు భావనలు నేను తలపెట్టిన ప్రయోజనానికి బహుదూరం. 'ఆధ్యాత్మిక రూపాంతరీకరణ' అనుటలో నా భావన అది ఒక క్రియాశీల ప్రక్రియ అని. కేవలం ఆత్మ విమోచనో, దైవసాక్షాత్కారం పొందటమో కాదు. (వీటిని దివ్య చైతన్య అవరోహణ లేకుండానే సాధించవచ్చు) అది క్రియాశీలమైనదే కాదు. అచలమైన, స్థిరమైన, ఆధ్యాత్మిక చైతన్యాన్ని అస్తిత్వపు అణువణువులో అవచేతనాస్థాయి వరకు ఆపాదిస్తుంది. అది చైతన్యాన్ని యథాతథంగ, మనస్సును, హృదయాన్ని పవిత్రీకరించుటకు, తేజోమయం కావించుటకు ప్రాణికాన్ని అదుపులో వుంచుటకు బదులు, కేవలం ఆత్మప్రభావంతో సాధ్యపడేది కాదు. ఒక అచలమైన క్రీయశీలమైన దివ్యచైతన్యాన్ని ఈ భాగాలన్నింటి లోనికి కొనితెచ్చి ప్రస్తుత చైతన్యం స్థానే వాటిని పునః ప్రతిష్టించినప్పుడే అది సాధ్యపడుతుంది. ఇది మనోప్రాణ శరీరాలకు పైగా అనాచ్ఛాదితంగ, అకల్మషమైనదిగ కనిపిస్తుంది. ఈ అవరోహణ తథ్యమని ఎందరికో అంగీకరించక తప్పని అనుభవం. ఇక నా అనుభవం ఏమిటంటే, ఏ మాత్రం మినహాయింపులేని దివ్య చైతన్యము యొక్క సంపూర్ణ అవరోహణ మాత్రమే ఈ ముసుగును, ఈ కల్తీని తొలగించి, ఆధ్యాత్మిక రూపాంతరీకరణను సంపూర్ణంగ సార్థకం చేయగలదు అని.

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగుపాటి కైలాసపతి, జానకి

> **భావితరం ఎంత సుందరమైనదో ఈ లోకంలో చాటడానికే శ్రీఅరవిందులు విచ్చేసారు. వారి చైతన్యాన్ని స్వీకరించుటకు తెరుచుకొని వుండు. అది నీ జీవితంలో పరివర్తన కొనితెస్తుంది.**
>
> **శ్రీమాత**

మానవజాతి పుట్టినదాది, అహం అనేది అందరిలో సర్వసాధారణంగా ఉండే అంశం. జీవి యొక్క విభిన్న స్థితులు ఈ అహం చుట్టూ గుంపులుగా ఏర్పడ్డాయి. కాని ఇప్పుడు అతిమానవ తత్వ సృష్టికి ప్రయత్నం జరుగుతున్నది కనుక అహం అంతరించక తప్పదు. అప్పుడే చైత్యపురుష మార్గం సుగమం అవుతుంది. అది మానవజీవిలో భగవదభివ్యక్తి దైవజోక్యంతో క్రమంగా నెమ్మదిగా తయారవుతుంది.

చైత్యప్రభావంతో మనిషిలో భగవదభివ్యక్తి జరుగుతుంది. ఆ విధంగా అతిమానవత ఆగమనాన్ని ఆయత్తపరుస్తుంది.

*

"ఈ క్షణంలో నువ్విక్కడున్నావు". అనగా భూమి మీద వున్నావు. కారణం, అందుకు గతంలో వొక సమయం ఎన్నుకున్నావు — అది నీకు కొంచెమైనా జ్ఞాపకం లేదు. కాని ఆ సంగతి నాకు తెలుసు — అందుకే నువ్విక్కడున్నావు. సరే, కర్తవ్యనిర్వహణ స్థాయికి నువ్వు ఎదగాలి. నువ్వు పెనుగులాడాలి. అన్ని బలహీనతలను, పరిమితులను అధిగమించాలి. పై పెచ్చు నీ అహానికి చెప్పాలి: "నీ వేళ అయిపోయింది" అని. అహంలేని జాతిని మేము కోరుకుంటున్నాము. అహం స్థానంలో దివ్యచైతన్యం నిండిపోవాలి. అదే మా కోరిక. జాతిని తనకు తానుగా ఎదగనిచ్చి, అతిమానసజీవికి జన్మ నిచ్చే దివ్యచైతన్యాన్ని మేము కోరేది

1956 ఫిబ్రవరి 29

బుధవారం నాటి సామూహిక ధ్యాన సమయమప్పుడు —

ఈ సాయంత్రం దైవ ఉనికి స్పష్టంగా, భౌతికంగా మీ మధ్య ఉండింది. నేను యీ ప్రపంచం కంటె పెద్దగా, జీవం పోసుకున్న బంగారంలా వున్నాను. ఒక పెద్ద బరువైన బంగారు తలుపులుగల ద్వారానికి ఎదురుగా నిలబడి వున్నాను. అది దైవానికి, ప్రపంచానికి మధ్య వుండి రెండింటిని వేరుచేస్తున్నది.

నేను ద్వారం వైపు చూస్తున్నప్పుడు, ఒక దివ్యచైతన్య స్పందనలో నాకు తెలిసింది. నేను సంకల్పించాను. అదేమిటంటే "సమయ మాసన్నమైంది" అని. రెండు చేతుల్తో ఒక పెద్ద బంగారు సుత్తిని ఎత్తి ఆ తలుపు మీద బలంగా ఒక్క

దెబ్బ, ఒకే ఒక దెబ్బ కొట్టాను. ఆ తలుపు బద్దలయి తునాతునక లయింది.

అప్పుడు అధిమానస దివ్యతేజస్సు, దివ్యచైతన్యం అత్యంత తీవ్రవేగంతో భూమిపై ఒక ధారాపాతంగా వెల్లువలా పడ్డాయి.

*

సర్వోన్నత దివ్యచైతన్య గాంభీర్యతకు భూవాతావరణం పూర్తి వ్యతిరేకంగా వుంది. అంతేకాక చాలా వరకు ఎప్పుడూ దానిని ముసుగులా మూసి వుంచుతుంది. కాలక్రమంలో అది తనని తాను ప్రదర్శించుకొని వ్యక్తపరుచుకుంటుంది. అయినప్పటికీ మళ్ళీ ఈ నిశ్చైతన్య వాతావరణం దానిని ముసుగులో కప్పేస్తుంది.

1956 లో అతిమానసశక్తి భూమి మీదకు దిగివచ్చినప్పుడు అలాగే జరిగింది. అది ఎలా వచ్చిందంటే దివ్యకాంతి, మహాద్భుతమైన కాంతి, దివ్యశక్తి బలంతో ఉరవడితో గూడిన ప్రవాహంలో వచ్చింది. అయితే, భూమి నుంచి నీల నిశ్చైతన్య గంభీర బృహత్తరంగాలు ఆ మహోజ్వల కాంతి ప్రవాహాన్ని కబళించివేసాయి. భూమి మీదకి దిగివస్తున్న అతిమానస శక్తి ఆ విధంగా హరించబడింది. కాని, ఆ నిశ్చైతన్యం లోపలి నుంచే తనకు తానుగా, అటు పైకి రావలసి వచ్చింది. అందుచేతనే ఇక్కడ విషయాలకు ఇంత సమయం పడుతున్నది. స్పందనలోని తీవ్ర అచేతనా స్థితి, భూమి గ్రహించి దాని నంతటినీ మరుగుపరచింది. లేనట్లయితే, దివ్య ప్రకాశం దిగివచ్చిన చాలా కాలం క్రితమే విషయాలు మార్పు చెంది వుండేవి.

శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

అన్నిటి వెనుక ఆ జగన్నాథుడున్నాడని, ఆతడే మన భవితవ్యానికి అధినాయకుడని మరువకుందుము గాక.

శ్రీమాత

జగన్మాత ఆగమనం: నూతన యుగావిష్కరణ

విశిష్ట చారిత్రక సంఘటన, 29 మార్చి 1914

అతిమానస సృష్టి

(1)

భూమి పైన అతిమానస సృష్టి జరగవలసి యున్నది కనుక, అది అంతర్గత మార్పు మాత్రమే కాదు. భౌతిక, బాహ్య అభివ్యక్తి కూడా. అత్యంత కష్టతరమైన ఈ పనికి సమర్పణ అత్యంత అవసరం. ఈ కారణంగా అతిమానస దైవత్వం పదార్థంలోకి అవరోహించడం వల్ల, దైవసాన్నిధ్యం శక్తి వల్ల భౌతిక, బాహ్య పరివర్తన సాధ్యమవుతుంది. తనను తాను సమర్పించుకొనే శక్తిప్రదమైన మానవ సంకల్పం కాని, ప్రయత్నం కాని ఈ మార్పు తీసుకొని రాలేదు. అహంకారం, ప్రాణిక తిరుగుబాటు దైవత్వ అధిరోహణకు బలమైన అవరోధాలు .ప్రశాంతమైన, నిర్మలమైన, సమర్పణ కావించబడిన భౌతిక చైతన్యం, చైత్యపురుష ఆకాంక్షతో నిండిపోవాలి. అదే దాని ముఖ్య క్షేత్రం. ఇది మాత్రమే భౌతిక అస్తిత్వ ద్వారాలను శక్తివంతంగా 'వెలుగు' వైపు, 'శక్తి' వైపు తెరువగలదు. అప్పుడు అతిమానస పరివర్తన నిజం కాగలదు. ఆచరణ యోగ్యం కాగలదు. దీని కోసమే మనం ఇక్కడ శరీరధారులమై ఉన్నాం. దీని కోసమే ఆశ్రమ మందలి సాధకులు మన సమీపంలో ఉన్నారు.

బాహ్యరంగంలో అల్ప కోరికలు తీర్చాలని పట్టుపట్టడంవల్ల, సంతుష్టుల పాలవడం వల్లకాని, ప్రాణిక ప్రకృతి, గర్వం, కోరికలకు ఇష్టమైన బాహ్య సామీప్యతల వల్లకాని భగవంతునితో నిజమైన సంబంధం ఏర్పడదు. నీకు ఆత్మసిద్ధి కావాలని కోరుకొంటే, నిజమైన సామీప్యతను కోరాలి. నీ భౌతికచేతనలోకి జగన్మాత అవరోహణ, సాన్నిధ్యం కోరాలి. భౌతిక అస్తిత్వంలో ఆమె నిరంతర అంతర్గత దివ్యస్పర్శ కోరాలి. భౌతిక అస్తిత్వ కార్యకలాపాలలో ఆమె మాధురీ స్పర్శ కోరాలి. అస్తిత్వ కార్యాలలో, కదలికలలో, ఆలోచనలో ఆమె సంకల్పం, జ్ఞానం కోరాలి. ప్రాణిక, భౌతిక వేర్పాటు, కోరికలు, వాంఛలను త్రోసిపుచ్చి జగన్మాత సాన్నిధ్యపు నిరంతర ఆనంద అమృత స్రవంతులను ఆకాంక్షించాలి.

(2)

భగవంతుని అమృత క్షణాలు

పరాత్పరుడు మానవుల మధ్య తిరుగాడే క్షణాలు, మన అస్తిత్వ జల ప్రవాహాలపై భగవానుని ఉచ్ఛ్వాసం పరిమళించే అమృత క్షణాలు ఉన్నాయి.

పరాత్పరుడు నిర్గమించిన పిమ్మట తమ బలాబలాలతో పనిచేయడానికి, తన అహంకారపు బలహీనతలలో మునిగిపోవడానికి కారణమైన క్షణాలు మరి కొన్ని. మొదటి క్షణాలు — కొద్దిగా ప్రయత్నిస్తే చాలు, ఘన ఫలితాలు వస్తాయి. మానవ భవితవ్యమే మారిపోతుంది. తరువాతి క్షణాలు — కొద్దిపాటి ఫలితాలు కావాలంటే అధిక శ్రమ పడే కాలాంతరాలు. అయితే తరువాతి క్షణాలే మొదటి క్షణాలను సన్నద్ధం చేస్తాయి. అది నిజం. కొద్దిపాటి ఆత్మ పరిత్యాగ యజ్ఞధూమం స్వర్గానికి ఎగసి భగవంతుని కారుణ్య సమృద్ధి వర్షధారలు తెస్తుంది. భగవంతుని అమృత క్షణం మెరిసినప్పుడు మానవులుకాని, జాతికాని నిద్రలోకి జారుకోవడం, దానిని ఉపయోగించుకోడానికి సన్నద్ధంగా లేకపోవడం కాని మిక్కిలి విషాదభరితం. ఎందుకంటే అమృత క్షణాన్ని స్వాగతించడానికి దీపం గుడ్డిగా వెలగడం, ఆ తీయని పిలుపుకు చెవులు మూసుకొనిపోవడం గాని జరుగుతుంది. కాని బలమైనవారు, సన్నద్ధంగా వున్నవారు ఆ క్షణాన్ని దుర్వినియోగం చేసుకోవడం, శక్తిని వృధా చేసుకోవడం మరింత విషాదకరం. వారికి పూరించుకోలేని నష్టం, ఒక పెద్ద విధ్వంసం ఎదురవక తప్పదు.

భగవంతుని అమృత ఘడియలలో ఆత్మవంచన, ద్రోహచింతన, నిరర్థకమైన ఆత్మ పొగడ్తలు మానుకో. నీ ఆత్మలోకి తిన్నగా చూడు. ఆత్మను పిలిచే మంత్ర ధ్యానాన్ని ఆలకించు. ఆదర్శ కాంతికి, భగవంతునికి కనిపించకుండా నీకు నువ్వు రక్షణగా వాడుకొన్న చిత్తశుద్ధి రాహిత్యం ఇప్పుడు నీ కవచంలో రంధ్రంగా మారి, ఆఘాతాన్ని ఆహ్వానిస్తుంది. ఈ క్షణంలో నువ్వు గెలిచినా, అది మరింత అధ్వాన్నం. ఎందుకంటే తరువాత నీకు దెబ్బ తగులుతుంది. నీ విజయపరంపరలో నిన్ను అధః పాతాళానికి అణచివేస్తుంది. నిర్మలంగా ఉంటే, నీ భయాన్ని తుడిచిపెట్టుకోగలవు. ఒక్కొక్కసారి భగవంతుని ఘడియ తరుచు అతి భయంకరంగా విరుచుకు పడు తుంది. అదొక ప్రళయ జ్వాలాగ్ని. ప్రచండ పవనం, పెనుతుఫాను. భగవంతుని

కోపాగ్ని యంత్రకోరల మధ్య దగ్ధమై పోవడమే. తన ప్రయోజనంలోని మహా సత్యం కొరకు నిలబడగలిగినవాడు చివరికి నిలద్రొక్కుకొని గెలుపొందగలడు. ఒక వేళ పతనమైనా మళ్లీలేచి నిలబడతాడు. గాలిరెక్కలపై ఎగిరిపోయినా తిరిగి వస్తాడు. ప్రాపంచిక వివేకం చెవిలో గుసగుస లాడనివ్వకు! ఎందుకంటే అది ముందుగా ఊహించలేని హఠాత్పరిణామ ఘడియ. మానవ పరిజ్ఞానానికి అందని విచిత్ర భయానక ఘడియ. మనిషి మనస్సు కొలవలేని అనంత మహత్వం! ఈ అల్పమనస్సుతో భగవదుచ్ఛ్వాస మహాశక్తిని ఎదుర్కోవద్దు. నమ్మి ముందుకు అడుగు వెయ్యి.

కొద్ది కాలం పాటైన అహంకారపు రొద నుండి విడివడి నీ ఆత్మను వినిర్మలం చేసుకో. చీకటి తెరలలో నీ ముందు ఒక అగ్నిశిఖ నడిచి వెళ్తోంది. పెనుతుఫాను నీకు చేదోడుగా వుంటుంది. నీవు జయించవలసిన మహోన్నత ఔన్నత్యాలపై నీ కేతనం రెప రెప లాడుతుంది.

భగవంతుని దివ్య ప్రభావం

భగవంతుని దివ్యప్రభావం వైపు తెరుచుకోవడమే ఈ యోగంలో ప్రధాన సమగ్ర సూత్రం. అది నీ శిరస్సు పైభాగాన వుంది. దాని పట్ల నీకు గట్టి స్పృహ ఏర్పడితే, దానిని నీలో అవరోహించాలని పిలవవచ్చు. శాంతి, వెలుగు, శక్తి రూపంలో అది మనశ్శరీరాలలోకి అవరోహిస్తుంది. ఆనంద రూపంగా భగవంతుని సాన్నిధ్యం నిన్ను ఆవహిస్తుంది. దానికి రూపం వుండవచ్చు, లేకపోవచ్చు. ఈ చైతన్యం మనలో ప్రభవించడానికి ముందు మన మనో ఉన్మీలనానికి విశ్వాసం, ఆకాంక్ష ఉండాలి. ఆకాంక్ష, పిలుపు, ప్రార్థన అన్నీ ఒక్కటే. అన్నీ శక్తివంతమైనవే. నీకు లభించిన రూపంలో, నీకు సులభమైన రూపంలో నువ్వు సాధన చేయవచ్చును. మరొక మార్గం ఏకాగ్రత. హృదయంలో చైతన్యాన్ని కేంద్రీకరింపచేయాలి. కొందరు శిరస్సులో, శిరస్సుకు పైభాగాన కేంద్రీకరిస్తారు. హృదయంలో ఉన్న జగన్మాతపై ధ్యానం చేయాలి. అక్కడికి ఆమెను పిలవాలి.

ఏదో ఒకదానిని, లేదా రెండింటిని భిన్న కాలాలలో సాధన చేయవచ్చును. నీకు సహజంగా అందుబాటులోకి వచ్చే రూపాన్ని ఎంచుకోవచ్చును. ఏ క్షణంలో నీకు ఎలా సాధన చేయాలనిపిస్తే అలానే చేయవచ్చును. మొదట మనస్సును

ప్రశాంతపరచాలి. అది చాలా ముఖ్యం. సాధనకు వ్యతిరేకమైన ఆలోచనలను, కదలికలను ధ్యానం సహాయంతో త్రోసిపుచ్చాలి.

శ్రీమాత ఇచ్చిన ప్రార్థనా మంత్రం:

"ఓం శ్రీఅరవింద మీరా"

నా మనస్సును, నా హృదయాన్ని, నా జీవితాన్ని నీ కాంతికి, నీ ప్రేమకు, నీ శక్తికి ఉన్మీలనం చెయ్యి. సమస్త సృష్టి రాశిలో దైవాన్ని దర్శించేటట్లు నన్ను దీవించు.

శ్రీఅరవిందులు

అనువాదం: యజ్ఞన్న

శ్రీమాతారవిందుల సశరీర చివరి దర్శనం

(మదర్ ఇండియా, 1951 నవంబర్ సంచికలో శ్రీ అమల్ కిరణ్‌గారి సంపాద కీయము)

నవంబరు, 24 మళ్ళీ వచ్చింది. శ్రీఅరవిందుల ప్రశాంత వాడి చూడ్కులందించే దీవెనలను అందుకొనుటకు బారులు తీరి సాగిపోయే వందలమంది జనులకు, వారు దర్శనమిచ్చే రోజు అది. గత సంవత్సరం శ్రీమాతతో పాటు వారు ప్రత్యక్షంగా దర్శన మిచ్చారు. పదకొండు రోజుల అనంతరం, జనం చూసింది మానవాళిని యుగాల తరబడి పీడిస్తున్న సంకటాలను అధిగమించి ఒక క్రొత్త జీవన సరళిని ఈ లోకాని కందించిన ఆ మహానుభావుడు మూసిన కనులతో రాచరిక ముట్టిపడు గాంబీర్యముతో ఉన్న వారి నిర్జీవ శరీరాన్ని.

వారి చివరి సశరీర దర్శనం అనుయాయులందరి మనసులలో మరపురానిదిగ ముద్రించినట్టుగ చెక్కబడింది. ఎందుకనగా, అది మహోత్కృష్టమైన అనుగ్రహ దర్శనం. శ్రీఅరవిందులకు హఠాత్తుగ ఒక శారీరక రుగ్మత సోకిందని చాలామందికి తెలుసు. భౌతిక శరీరాన్ని అణచి తమ అధీనమందుంచుకో చూచే అసురశక్తులపై శ్రీఅరవిందులు చేసిన ఆధ్యాత్మిక పోరాటానికి చిహ్నంగ, వారి సమ్మతితోనే

వారికి ఈ రుగ్మత సంక్రమించింది. అయితే అది దివ్యశక్తి ప్రకటనా క్రమంలో వారు తమపై తాము ఆరోపించుకున్న ఒక కృత్రిమ సంఘటన కాదు. ఒక ఆధ్యాత్మిక ప్రతిభాశాలి ఈ భువి పైన మానవుని స్థితిని సమూలంగ పరివర్తన గావించాలని హృదయపూర్వకంగా కృషి చేస్తున్నప్పుడు నాటకీయతకు చోటుండదు. అతడు నిండు మనసుతో, ఒక ధృడసంకల్పంతో, మనో, ప్రాణ, శారీరక మానవ సమస్య లన్నింటితో తలపడతాడు. శ్రీఅరవిందులు సమ్మతించి అనుభవించిన మూత్రపిండాల రుగ్మత తీవ్రమైనదే కాక ప్రమాదకర పరిణామాలతో కూడినది. వాటిని ఎదుర్కొనుటకు వారికి పూర్తి విశ్రాంతి అవసరం. కాని శ్రీఅరవిందులు తన అనుయాయుల అవస రాలను తీర్చుటకు, తెర వెనుక విషయాలు తెలియనివారు నైరాశ్యతా భావానికి లోనుకాకుండా ఉండుటకుగాను, మామూలుగ దర్శన సమయంలో గంభీరంగ, ఠీవిగ, ప్రశాంతంగ, వెలుగులు జిమ్మే చిరునవ్వులు చిందిస్తున్న శ్రీమాత ప్రక్కన ఎలా కూర్చొని ఉంటారో, ఆనాడు కూడ అలాగే కూర్చున్నారు.

ఆ రుగ్మత వారికి ఎంత బాధ కలిగిస్తున్నదో వారు చూచాయగానైనా కనబరచ లేదు. అయితే మామూలు దర్శనానికి, ఆనాటి దర్శనానికి, ఒక తేడా మాత్రం ఉండింది. సమయం గడుస్తున్నకొద్దీ దర్శనం వేగవంతం చేయాలనే మాట అందరిలో ప్రాకింది. శ్రీఅరవిందుల ముందు ఏమాత్రం ఆలస్యం చేయకుండా, వారి అనుగ్రహ వీక్షణాన్ని లిప్తమాత్రం అనుభవించి, జరిగిపోవాలని విజ్ఞప్తి చేయబడింది. వారు ఒకే రీతిలో ఎక్కువసేపు కూర్చొని ఇబ్బంది పడకుండ ఈ ఏర్పాటు గావించారు. దర్శనగది ద్వారాలు రెండు మూడు సార్లు కొంతసేపు మూసి ఉంచారు. అయినప్పటికి దర్శనానికై వచ్చిన ప్రతి ఒక్కరికి కరుణాకటాక్షాలు కురిపించే ఆ దివ్యచక్షువులను దర్శించే భాగ్యాన్ని కలిగించారు.

ముందుగా దర్శనానికి వెళ్ళినవారికి మాత్రం ఎప్పటిలాగే మాములుగా నిలుచుని దర్శించే అదృష్టం దక్కింది. ఇది వ్రాస్తున్న నాకు ఆ మహద్భాగ్యం కలిగినందుకు ఎంతో కృతజ్ఞుణ్ణి. ముఖ్యంగా దర్శన దినాల్లో ద్విగుణీకృతమయ్యే ఆ పవిత్ర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ, ఎక్కుతున్న ప్రతి మెట్టుకీ శ్రీమాతారవిందుల తేజోమయ విశ్వమానవ సార్వత్రిక అనుభూతిని, ఒక అనంత ఆధ్యాత్మిక జీవి నుండి ద్విముఖంగా వెలువడే విశ్వవ్యాప్త శక్తిని, ప్రేమను, శాశ్వత సత్య చైతన్యా నుభూతిని పొందుతున్నప్పుడు, శ్రీఅరవిందులు గత వారం రోజుల నుండి ఒక

తీవ్రమైన శారీరక సంకటావస్థలో ఉన్నారనే వార్త జ్ఞప్తికి రాలేదు. పై మెట్టుకు చేరి, దర్శన గదిలో ఒక నిశ్చలమైన, నిర్మలమైన దృక్కులతో కరుణాకటాక్షాల వెల్లువ కురిపిస్తూ శిలాప్రతిమల్లా కూర్చుని ఉన్న శ్రీమాతారవిందులను చూశాను. వెంటనే గతంలో నాకు నా ఆధ్యాత్మిక మాతాపితరుల ముందు నిలుచున్న లేక మోకరిల్లిన ఆ అద్భుతమైన రోజులు మనసులో మెదిలాయి. ఇరవై మూడు సంవత్సరాల క్రితం నేను ఆశ్రమంలోకి అనుమతించబడినప్పుడు, నాకు వారు ఇచ్చిన పునర్జన్మతో నేను పొందిన సాంద్రీకృత భాగ్యానుభూతి పునరావృతమైంది. ఒక విధంగా చెప్పాలంటే, పూర్వపు రోజుల అతి సాధారణ వాతావరణం యథాతథంగా నెలకొని ఉన్నట్లనిపించింది.

శ్రీఅరవిందులు లేత బంగారుఛాయ కమ్మిన గంభీర వదనంతో, పలుచని తెల్లగడ్డంతో, జాలువారిన పొడుగాటి తెల్లని తలవెంట్రుకలతో ఎప్పటిలాగే కూర్చుని ఉన్నారు. ఒక మోచేతిని కుర్చీ చేతిపైన, మరో చేతిని తన తొడపైన ఆనించి, హిమాలయాలంత ఉన్నతంగ ఎదిగిన వారి పాదాల వద్ద దేవులాడుతున్న మానవాళి దర్శించలేనట్టి దివ్యమైన దిఙ్మండలాల దిశగా తన దృష్టిని సారించి, ప్రశాంతంగ కూర్చొని ఉన్నారు. వారిలో ఏమాత్రం తొణుకు బెణుకు లేదు. శ్రీమాత అపారమైన అనుగ్రహంతో, అత్యంత శ్రద్ధతో, ప్రతి విషయాన్ని గమనిస్తున్నారు. వారి మధురాతి మధురమైన సన్నిహిత వైఖరితో, దర్శించవచ్చిన వారు శ్రీఅరవిందుల దరి చేరి నప్పుడు వారికి కలిగే అనుభూతిలోని వత్తిడిని తొలగిస్తున్నారు.


నేను వారికి చేరువవుతున్నకొద్దీ రాబోవు పదిహేను రోజుల్లో చోటు చేసుకోబోయే అసాధారణ సంఘటన గురించిన సూచన లాంటిదేదీ కానరాలేదు. కాని ఈ ఆఖరి దర్శనాన్ని ప్రత్యేకంగా పరమానందభరితం గావించిన ఒక అసామాన్యస్థితి మాత్రం నెలకొని ఉండింది. శ్రీమాత శ్రీఅరవిందుల వైపు తిరిగి ప్రణామమాచరించినవారి పేరు నెమ్మదిగ చెప్పారు. వెంటనే శ్రీఅరవిందుల ముఖంలో ఒక చిరునవ్వు పొడచూపింది. మహోత్కృష్టమైన కారుణ్యం ఆ చిరునవ్వులో నిండి ఉండింది. అందులోని నిగూఢార్థం, వారి శరీర పరిత్యాగం తదుపరి మాత్రమే తెలియవచ్చింది. వెనుకకు తిరిగి చూస్తే, వారి పేరున నేను కలంతో చేసిన చిన్న చిన్న పనులపై, వారు రాజఠీవితో కనబరచిన మెప్పు ఆ చిరునవ్వులో దాగివున్నట్లుగ తోచింది.

అంతేగాక, ప్రేరణ కోసం ఇంచుమించు నిస్సహాయుడిగ వారిపై ఆధారపడుటకు అలవాటుపడిన నాకు అపారమైన సహాయ సహకారాలు ఇకపై కూడ అందిస్తామని అభయప్రదానం చేసినట్లుగా కూడా తోచింది.

అంతరంగంలో అంతవరకు అందుతున్న సహాయత ఆగిపోయినట్లనిపించలేదు. అన్ని వేళల లోనుండి వెడలే స్పందన, గతంలో మాదిరిగానే సంసిద్ధమై ఉంది. భావభాండాగారంలో నిలువ వుంచబడినట్లుగ ఆలోచనలు, పదాలు, మనస్సుకు అతీతంగ, శ్రీఅరవిందుల సిద్ధహస్తాల నుండి, ఇదివరలో లాగే నా పిలుపుకు ఆశ్రమంలో ఒక గదిలోని పరంజ్యోతి నుండి అందినట్లుగ, ఇప్పుడు కూడ సిద్ధంగా ఉన్నట్లు అనిపిస్తుంది. అదే దరహాసం మరణమని పిలువబడే తెరగుండ వెలువడుతున్నది. అదే మాదిరిగ, శ్రీఅరవిందుల శక్తి యావత్తు పని చేస్తున్నది. శ్రీమాత ప్రక్కన వారిని దర్శించిన నాడు వారి శక్తి ఆశ్రమాన్ని ఏ విధంగ ఉత్తేజపరిచిందో, అదే ఉత్తేజం నేడు కూడ ఆశ్రమంలో తాండవిస్తున్నది.

నవంబరు 24, విజయదినంగ పిలుస్తారు. కారణం, ఆ రోజున శ్రీఅరవిందులకు వారి దూరదృష్టి దర్శించిన లక్ష్యం సంపూర్ణంగ నెరవేరుతుందనే అనుభవం సిద్ధించింది. వారు చివరిసారిగ ప్రసాదించిన సశరీర దర్శనం, ఎన్ని తీవ్ర ఆటంకాలెదురైనా, సరిగ్గా అదే రోజున సంభవించటం గమనార్హం. ఏ విధంగా చూసినా, చివరకు వారి జీవితం విజయవంతమైనదని ఈ సంఘటన ద్వారా వారు ప్రకటించారు. ఆ ప్రకటన కేవలం మౌఖికమైనదే గాక నిశ్చితమైనది కూడ. ఎందుకనగా, అది వారి రచనలలో నుండి ఎంపిక చేయబడిన ఒక సందేశంగ ఆనాడు ఈ విధంగ ప్రచురించబడింది: "అతిమానస ఆగమనం ఒక సత్యం, దాని ఆగమనం అతి సహజంగ అనివార్యం".

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి



8/4/2013

Rs. 20

దుఃఖం

కారణము - నివారణ

అఖిల

అఖిల భారత పత్రిక

ఏప్రిల్ 2013

బాధ — కారణము, నివారణ

విషయసూచిక

పాఠకులకు విజ్ఞప్తి

మార్చి, 2013 సంచిక కవరు పేజీలో 'విశిష్ట' చారిత్రక సంఘటనకు బదులు 'శిష్ట చారిత్రక సంఘటన' అని ముద్రించబడింది. ఈ పొరపాటుకు చింతిస్తున్నాము. మన్నించగలరు.

సంపాదకులు

సమస్యకు మూలం — పరిష్కారం

మనిషికి తన జీవనగమనాన్ని తాను మానసికంగా గమనించగల శక్తి అతనికి విశిష్టతను ఆపాదిస్తుందనుట సుస్పష్టం. జంతువు యొక్క జీవనగమనం స్వయంచాలకం. తన జీవనగమనాన్ని తాను గమనించగలిగితే అది క్షణకాలమో లేక లెక్కించలేనంత స్వల్ప సమయం వరకు మాత్రమే అయి వుంటుంది. అందుకే అది ప్రశాంతంగా ఉండగలదు, వ్యధకు లోను గాదు. అనారోగ్యంతోనో లేక ఆకస్మికంగానో బాధకు గురి అయితే ఆ బాధను అనుభవించేది స్వల్పంగా మాత్రమే. ఆ బాధ కనీస స్థాయికి తగ్గిపోతుంది, కారణం, ఆ బాధ తీవ్రతను అది గమనించలేదు, పైపెచ్చు దానిని జ్ఞాపకం పెట్టుకోదు కూడా. అంతేగాక భవిష్యత్తులోకి ప్రాకనియ్యదు. తన రుగ్మతను గాని, ఆ అకస్మాత్ సంఘటననుగాని అసలు తలచుకోదు.

మనిషి విషయంలో తనకు ఏమి జరగబోతుందో అనే దాని గురించి ఒక నిరంతర ఆరాటం మొదలవుతుంది. అతనిని పీడించే కారణానికన్నా ఆ ఆరాటమే ప్రధానమై కూర్చుంటుంది. ఈ ఊహాస్పద చేతనతో ఆందోళన, బాధాకరమైన ఆలోచనలు, విచారం, క్లేశం, భవిష్యత్తులో పొంచివున్న ఆపదల గురించి ఊహాగానం మొదలవుతుంది. పర్యవసానంగ, చాలామంది — అల్పచేతస్కులే కాదు, అత్యధిక చేతస్కులు కూడ — నిరంతర క్లేశపీడితులుగ జీవితం గడుపుతారు. మనిషిలో చైతన్య తీవ్రత ఎంతగా నుంటుందంటే అతనిని ఏమాత్రం ఉదాసీనంగ వుండనీయదు; అయితే జరగబోయేదేమిటో తెలుసుకొనుటకు అది సరిపోదు. భూమిపై నున్న జీవరాశి అంతటిలోకి నిజానికి మనిషి అతి నికృష్ట జీవి అనుటలో తప్పు లేదు. ఆ విధమైన జీవితం గడుపుటకు అతను అలవాటు పడ్డాడు. అందుకు కారణం అతను తన పూర్వీకుల నుండి వారసత్వంగ పొందిన అనువంశిక స్థితి. కాని నిజానికి అది ఒక నికృష్టమైన స్థితి. ఆధ్యాత్మిక శక్తితో ఉన్నతస్థాయికి ఎదిగి తనలోని మృగచేతనాస్థితి స్థానే ఆధ్యాత్మిక అతిచేతనను పునః స్థాపించుకోగలిగినప్పుడే జీవుడిలో సృష్టి యొక్క గమ్యమేమిటో గ్రహించగల సామర్థ్యం ఏర్పడుతుంది. దానితో పాటు ఆ ప్రయత్నం అతనిని ఎంతటి ఉచ్ఛస్థాయికి చేర్చగలదో గమనించగల ముందుచూపు కూడ లభిస్తుంది. అంతేగాక వ్యక్తి తాను తన జీవిత సర్వస్వాన్ని అర్పించుకొని, జీవిత బాధ్యతలను, భవితను అప్పజెప్పి అన్ని వ్యాకులతలను తొలగించుకోగలిగే

ఉన్నత ఆధ్యాత్మిక శక్తిపై గట్టి విశ్వాసం కూడ ఏర్పడుతుంది.

మనిషికి తిరిగి మృగజీవన స్థాయికి దిగజారి, తాను ఆర్జించుకున్న చైతన్యాన్ని పోగొట్టుకొనుట సాధ్యపడదు. అందువలన అతనికి ఒకే ఒక మార్గం వుంది — అది తాను ఉన్న ఈ స్థితి నుండి, (నేను దీనిని అతి నికృష్ట స్థితి అంటాను) బయటపడి, ఎక్కడ వ్యాకులతకు బదులు విశ్వాసంతో కూడిన సమర్పణాభావం, తేజోభరితమైన పరాకాష్టకు చేరగలననే గట్టి విశ్వాసం చోటు చేసుకుంటాయో, అట్టి ఉచ్ఛస్థాయికి ఎదగగల మార్గం. ఆ విధంగా చైతన్యంలో మార్పు తేవచ్చు.

నిజానికి మనిషికి తానున్న స్థితికి కారణభూతమైనదేదో తెలియని, అనగా సమస్యలకు పరిష్కారం సూచించలేని స్థితి కన్న అధ్వాన్నస్థితి మరొకటుండదు. జంతువు తనకు తాను సమస్యలను సృష్టించుకోదు. అది కేవలం జీవిస్తుంది. దాని సహజ ప్రవృత్తి దానిని నడిపిస్తుంది. తన స్వంత తెలివితేటలకన్న శ్రేష్ఠతరమైన, సహజసిద్ధమైన జ్ఞానంగల సమిష్టి చైతన్యంపై ఆధారపడుతుంది. ఐతే అది యాంత్రికంగా, అతి సహజంగా, సంకల్పరహితంగా, అప్రయత్నంగా జరిగేది. దానికి తన జీవన గమనానికి బాధ్యత అంటూ లేదు, అందువలన అది విచారపడదు. మనిషి విషయంలో యిది మరోలా వుంటుంది. మనిషితోపాటే అతను తనపై తాను ఆధారపడాలనే జ్ఞానం జనిస్తుంది. కాని అందుకవసరమైన తెలివితేటలు అతని కుండనందున యెడతెగని వ్యాకులతకు లోనౌతాడు. తన స్వంత చైతన్యానికన్నా ఉన్నతతరమైన చైతన్యానికి తనను తాను పూర్తిగా, తన వ్యాకులతలతో సహా, తన జీవిత గమనాన్ని పరిరక్షించి అన్ని పనులను సక్రమంగా నడిపించే సామర్థ్యంగల చైతన్యానికి పూర్తిగ సమర్పించుకో గలిగినప్పుడే, ఆ వ్యాకులతలన్నీ అంతమొందుతాయి.

అవసరమైన తెలివితేటలు కరువైనప్పుడు ఏ సమస్యనైనా ఎలా పరిష్కరించ గలము? దురదృష్టకరమైన విషయ మేమిటంటే, మనిషికి తన జీవితంలో తలెత్తే సమస్య లన్నింటిని తానే పరిష్కరించుకోగలనని నమ్ముతాడు, కాని అందుకు అవసరమైన జ్ఞానం లేదని అనుకుంటాడు. అతని కష్టాలకు ఆ భావనే మూలకారణం — నిరంతరం ఎదురయ్యే ప్రశ్న, "నేనేం చెయ్యాలి...". దీనికి తోడు మరొక తీవ్రమైన ప్రశ్న ఉదయిస్తుంది. "ఏం జరగబోతోంది"? దీనితో పాటు ఈ ప్రశ్నలకు సమాధానం కనుగొనే అశక్తత కూడ ఏర్పడుతుంది.

ఆ కారణంగానే ఆధ్యాత్మిక అభ్యాసాలను బాధ్యతలను అన్నింటిని అప్పగించి

ఒక ఉన్నతతర సూత్రంపై ఆధారపడి ప్రారంభించాలి. లేనట్లయితే ప్రశాంతత అసాధ్యం.

అయినప్పటికి, మనిషి పురోభివృద్ధి సాధించడానికి, తెలియని విషయం తెలుసుకొనటానికి, తాను ఎదగనటువంటి స్థాయికి ఎదగటానికి, అతనికి చైతన్యం యివ్వబడింది. అందువలన ఒక చలనరహితమైన, స్థితమైన ప్రశాంతతకన్న ఉత్కృష్టమైన స్థితి ఒకటి ఉన్నదని చెప్పవచ్చు. అది ఎటువంటి స్థితి అంటే తాను పురోగమించాలనే ఇచ్ఛను నిలుపుకోగలిగి, పురోభివృద్ధి సాధనకై చేసే కృషిలో పట్టును కాపాడుకోగలిగి, ఫలితాల కోసం, పర్యవసానాల కోసం ఆరాటాన్ని, ఆతృతను వదలి, తగినంత సమగ్ర విశ్వాసాన్ని పొందగలిగే స్థితి. ఈ స్థితిని కలతలేని అత్యంత ప్రశాంతమైన పద్ధతు లన్నింటిలోకి ఒక మెట్టు పైనుండే స్థితి అని చెప్పవచ్చు. ఈ పద్ధతు లన్నింటికి ఒక క్రియారహిత స్థితి, ఒక అంతరంగ నిశ్శబ్దత, ఒక నిశ్చల నీరవ స్థితి, పునాదులు. అవి జీనవగతిని పూర్తిగ నిరాకరిస్తాయి. అందుకు కారణం ప్రశాంతత లేకుండ వ్యక్తికి ఆంతరిక అనుభూతి సిద్ధించదనే భావన ఉదయించుట. అందువలన మనిషి తాను బాహ్యపరిస్థితులలో, అపరిష్కృత సమస్యల వలయాలలో వాటిని ఛేదించగల పరిజ్ఞానం లేకుండ ఉన్నంత కాలం తనకు ప్రశాంతత లభించదని భావించుట సహజం.

రెండవ మెట్టు సమస్యల నెదిరించుట — సర్వం తెలిసిన, కార్యాచరణకు పురిగొల్పగలిగిన ఒక మహోన్నత దివ్యశక్తిపై అచంచలమైన సంపూర్ణ విశ్వాసంతో. అప్పుడు కర్మను త్యజించడానికి బదులు ఒక ఉన్నతతర శక్తివంతమైన క్రియాశీల ప్రశాంత వాతావరణంలో కర్మాచరణ గావించవచ్చు.

దీనినే జీవితంలో దైవానుగ్రహ జోక్యంతో సిద్ధించే నూతన దశ అని, ఉనికిలో దివ్యశక్తుల ప్రమేయం యొక్క వినూత్న పద్ధతి అని, ఆధ్యాత్మిక అనుభూతి యొక్క క్రొత్త రూపమని అనవచ్చు.

శ్రీమాత

అనువాదం: అందుగులవాటి జానకి

బాధ ఎందుకుంటుంది?

ఈ మధ్య కాలంలో... చెప్పాలంటే... ఇటీవల ఎన్నో రోజులుగా ఒక సూక్ష్మ మైన, విశేషమైన, సుస్పష్టమైన గ్రహింపు కల్గింది. అది 'దివ్యశక్తి' యొక్క చర్య దానికదిగా బాహ్యంగా మనం చెప్పే "బాధ" గా రూపాంతరం చెందింది. ఈ రకపు ప్రకంపనయే ఈ పదార్థాన్ని జడస్థితి నుండీ బయటకు లాక్కు రాగలదు.

పరమ ప్రశాంతత, పరమ నిశ్చల నీరవత అనేవి వికృతి నొంది, వికలమై జడంగాను, తమస్సుగాను రూపాంతరం చెందాయి. కచ్చితంగా ఇది విశుద్ధ శాంతి, స్థిరత్వాల వైకల్యం గనుక, ఇలా మారడానికి కారణం లేదు. ఈ తమస్సు నుండి మేల్కొనేందుకు ఒక విధమైన ప్రకంపనం — పునర్ జాగరణం — బయటకు వచ్చి పరమ ప్రశాంతిగా రూపొందుట అవసరం. నిజానికి అది నేరుగా తమస్సు నుండి శాంతిగా మార్పు చెందలేదు. ఈ తమస్సును కదల్చడానికి ఏదో ఒకటి కావాలి. అది బాహ్యంగా 'బాధ' అనే రూపంలో వ్యక్తమవుతుంది.

నేనిక్కడ భౌతికంగా ఏర్పడే బాధను గురించి మాట్లాడుతున్నాను. తక్కిన ప్రాణిక, మానసిక, ఉద్రేకపూరితమైన బాధలన్నీ, మనస్సు తప్పు మార్గంలో పని చేయడం వల్ల కలుగుతాయి. వీటిని సునాయసంగా అసత్యపూర్వకమైనవిగా వర్గీకరించవచ్చు. కానీ భౌతికంగా ఏర్పడే బాధ అనేది నాకు ఒక పసివాడు దెబ్బలు తింటూండటం లాంటి తలంపును కలుగజేస్తూ వుంటుంది. ఎందుకంటే ఈ పదార్థంలో 'అసత్యం' అజ్ఞానంగా మార్పుచెందింది. అనగా, ఇక్కడ దుష్టసంకల్పం లేదు. పదార్థంలో ఎలాంటి చెడుసంకల్పం లేదు. ఉన్నదంతా జడత్వం, అజ్ఞానమే. పరమ సత్యాన్ని గూర్చిన పూర్తి అజ్ఞానం, దాని మూలం గురంచి, సాధ్యాసాధ్యాల గురించిన అజ్ఞానం, ఏది చేస్తే భౌతికంగా బాధపడటం వుండదో అది చేసుకోలేనంతటి అజ్ఞానం. ఈ రకమైన అజ్ఞానం మనలోని ప్రతికణం లోనూ వున్నది. ఇదే అనుభవం ప్రాథమిక చేతన స్థాయిలో 'బాధ' గా ద్యోతకమయ్యే అనుభవంతోనే రూపాంతరం చెందగల ఆకాంక్షను, దానిని తెల్సుకొని నివారించుకొనే అవసరాన్ని మేల్కొల్పగలదు.

ఇది నిజం... ఎందుకంటే అన్ని కణాలలో ఆకాంక్ష పుట్టింది, తీవ్రమౌతుంది. దానిపై జరిగే ప్రతిఘటనకు అబ్బురపడుతుంది. పనిలో ఏదైనా తప్పు జరిగేటప్పుడు (అనగా మృదువుగా, సహజసిద్ధంగా ఉండటానికి బదులుగా, పని జరగడంలో చాలా

బాధాకరమైన ప్రయాస, దుష్టసంకల్పంగా మారేదానికి వ్యతిరేకంగా పోరాడటం, ఇది ఒక అర్థం లేని మౌనం) ఆ క్షణంలో ఆకాంక్ష యొక్క పిలుపు యొక్క తీవ్రత, పదింతలుగా మారి దృఢతరమౌతుంది. కానీ అదే స్థితిలో, అదే తీవ్రతలో ఆకాంక్షను కల్గివుండటమనేది కష్టం. సాధారణంగా యథాస్థాయికి పడిపోవటమే జరుగుతుంది. అది నిద్రలోకి జారడం అని నే చెప్పలేనుగానీ ఒక రకమైన విశ్రాంతిలోకి సడలిపోతుంది; విషయాలను చాలా తేలిగ్గా తీసుకొనే స్థితి ఎప్పుడైతే అంతర్గతంగా అసంతులనం బాధాకరంగా తయారవుతుందో ఆకాంక్షలోని తీవ్రత పెరిగి పెరిగి సుస్థిరమౌతుంది. అలసత్వంలేని, నిరంతర ఆకాంక్ష, పిలుపూ, దైవంతో ఏకమయ్యే సంకల్పం, దైవంగా అయిపోవడమనే ఆరాటం, అత్యధిక స్థాయికి చేరుకుంటుంది. ఎందుకు? ఎందుకంటే బాహ్యంగా, భౌతికంగా, అస్తవ్యస్తమైనదిగా, ఒక బాధగా పిలువబడేది చోటు చేసుకుంటుంది. ఈ 'బాధ' పడటమే లేకపోతే పైకి లేచిన ప్రతిసారి మళ్ళీ మాంద్యంలో పడిపోవడమే జరుగుతుంది. మళ్ళీ పైకి లేవడం, మళ్ళీ పడిపోవడం, అంతు వుండదు. అవిశ్రాంతంగా సాగిపోతుంది. జరుగాల్సింది వేగవంతంగా జరగాలని కోరుకొంటే (మన జీవనశైలి లయబద్ధతకు అనుగుణంగా) కొరడా చరుపు అవసరం. దీనిని నేను గట్టిగా నమ్ముతాను. ఎందుకంటే మీరు మీ అంతరంగంలో స్థిరపడినప్పుడు దానిని తిరస్కార ధోరణితో చూస్తారు.

కానీ అప్పుడే ఉన్నట్లుండి ఎప్పుడైతే దివ్యప్రేమలోని ఈ అసలు కారుణ్యం కదిలివస్తుందో, ఎప్పుడైతే మనిషి చూసేవన్నీ భయంకరంగా, అసంబద్ధంగా, అస్తవ్య స్తంగా కనిపించి, మనం అనుకొనే ఈ మహావేదన అన్ని జీవులపై, ఆఖరికి సమస్త వస్తుజాలంపై ఆవరిస్తుందో, అప్పుడు ఈ భౌతిక జీవిలోని వేదనను నివారించే, తొలగించే, ఓదార్చే ఆకాంక్ష పుట్టుకొస్తుంది. దైవికమైన ప్రేమలో.... దాని మూలంలో, ఏదో దివ్యకృపను జోక్యం చేసుకొనేలా జరుగుతుంది. అది ఒక శక్తి, ఒక తీయదనం, ఓదార్పుకు చెందిన అనుకంపనగా అంతటా వ్యాపించినది. కానీ అది ఒక ఉజ్జ్వల చైతన్యంలో నేరుగా కొన్ని అంశాలపై కేంద్రీకృతం కాగలిగేది. అక్కడి కక్కడే యోచనను నిజంగా ఉపయోగించగల్గడం నేను చూచాను. ఆ యోచనే ఎక్కడ అవసరమైతే అక్కడకు ఈ కంపనాన్ని చేరవేయగల ఒక రకమైన మాధ్యమంగా ఉపయోగపడగలదు. ఈ శక్తే, ఈ మాధుర్యమయ ప్రకంపనమే చాలా స్థిరంగా ఈ ప్రపంచమంతటిలోనూ వున్నది. దానిని స్వీకరించేందుకుగాను ఒత్తిడిని కలుగ జేస్తుం

టుంది. కానీ అదంతా అవ్యక్తంగా జరిగే ప్రక్రియ. ఈ ఆలోచన, ఈ ఉజ్వలమైన ఆలోచన, ఈ అర్పిత భావన, అనన్య ఉపకరణం, — ఉన్నత చైతన్యంచే నడుప బడటంలో తృప్తినొందే తలంపు, ఈ అకర్తృక శక్తి ఎక్కడ అవసరమైతే అక్కడ కొన్ని నిర్దిష్టమైన అంశాలలో పనిచేయగలిగేందుకు ఒక బంధాన్ని అనుబంధాన్ని ఏర్పాటు చేయగల మాధ్యమంగా ఉపకరిస్తుంది.

శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

బాధను ఎలా నివారించాలి?

బాధ అనేది దానితో పాటు దాని నివారణా మార్గాన్ని కూడా కలిగి వుంటుందని కచ్చితంగా చెప్పవచ్చు. ప్రతి బాధ యొక్క నివారణా మార్గం, ఆ బాధతో పాటు ఉంటుందని కూడా చెప్పవచ్చు. అందువలన, బాధను పనికిరానిది, అనవసరమైనది అని మామూలుగా అనుకునే బదులు, దానిని కలిగించిన ఆవశ్యకతకు కారణమైన పరిణామ ప్రక్రియను గమనించాలి, బాధ కలగటానికి కారణమేమిటో విశ్లేషించాలి. అప్పుడు, ఎవరైతే ఉన్మీలనమై వుంటారో, స్వీకరించడానికి సిద్ధంగా వుంటారో, వారికి ఆ బాధ తొలుగుతుంది. మూడు విషయాలు — బాధ ఒక పురోభివృద్ధికి మార్గంగా, పురోభివృద్ధిగా, దాని నివారణగా — సమాంతరంగా జతగూడి వుంటాయి. అనగా, అవి ఒకదాని నొకటి అనుసరించవు, ఒకే సమయాన కలిసి వుంటాయి.

ఒక వేళ పరిణామ ప్రక్రియ బాధను కలిగించినట్లయితే, దానిలోనే ఉన్మీలనము, అవసరమైన ఆకాంక్ష, నివారణ కూడా వుంటాయి. వాటి ప్రభావం సమగ్రంగా ఉంటుంది. అనగా, పరిణామం, దానతో పాటు దానిని సాధించే కర్మాచరణ, దానిని నిరోధించుటలో కలిగే అపశృతిని తొలగించే విధానం అన్నీ వుంటాయి. ఆ బాధకు ప్రత్యామ్నాయంగా, ఇంతవరకు లోకంలో తెలియబడనిదేదో, అనందానికి, సంక్షేమానికి, నమ్మకానికి, భద్రతకు సమానమైనది ఒకటి సిద్ధిస్తుంది. అది ఒక అత్యంత ప్రశాంతతలో కలిగే అతీంద్రియ స్థితి. నిజానికి, అది ఒక్కటే శాశ్వతమైనదిగా నుండగలదు.

దివ్యానందంలో నుండే సమగ్ర విషయ తత్వాన్ని పై విశ్లేషణ దాదాపుగా

వ్యక్తపరుస్తుంది. చిరకాలం నుండి దీనిని భౌతిక చేతనలో అనుభవించడం, పాక్షికంగా అనుభూతి చెందడం జరుగుతున్నా ఇటీవలి కాలంలో ఈ స్థితిని సరైన దృక్పథంలో స్వీకరించడం ప్రారంభమైనదని నా విశ్వాసం. అయితే భౌతిక పదార్థం దాని కణకణాలలో — భయమో లేక ఆరాటమో అనలేము గాని, కొత్త ప్రకంపనాలు కలుగుతాయేమోననే శంకాభావానికి చోటిస్తుంది. ఈ శంకాభావం కణాల నుండి వాటి గ్రహణశక్తిని కబళించివేసే ఒక వ్యాకులతకు తావిస్తుంది. ఏది ఏమైన శంకను ఆకాంక్ష, మరియు ధృడసంకల్పం తోను, సమర్పణా భావంతోను అధిగమించినప్పుడు వ్యాకులత తొలగిపోయి చివరికి ఒక శ్రేయోదాయకస్థితి సిద్ధిస్తుంది.

ఇప్పటివరకు మనం చెప్పుకుంటున్న విషయానికి వస్తే ఈ దివ్యశక్తిని గురించిన ఎరుక వున్నప్పుడు, దాని సారతత్వంలోని శక్తిని, కృపాకటాక్షాన్ని గ్రహించినప్పుడు, అది సచేతనంగా వున్న వ్యక్తి ద్వారా ఎలా పనిచేస్తున్నదో చూడగలిగినప్పుడు, ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

శ్రీమాత

అనువాదం: కవితా శ్రీధర్ రెడ్డి. కె

మనస్సు నిర్మలంగాను, మనోభిలాష పరిపూర్ణమైనది, యదార్థమైనదిగా నున్నట్లయితే ప్రాణికంలో మార్పు ఎప్పుడైనా సంభవమే.

శ్రీమాత

బాధ సూచించే రహస్యం

సహజంగానే మనల్ని మనం ప్రశ్నించుకుంటాం ఈ రహస్యం ఏమిటని? ఈ బాధలు చెప్పే రహస్యమేమిటని? అపరిపక్వంగా, బాహ్యంగా, మన కర్థమౌతుంది, ఆత్మ అన్వేషిస్తున్నది బాధనేనని. కాని అటువంటిదేమీ కాదు. ఆత్మ నైజము స్థిరమైన, మార్పులేని, నిబంధనలు లేని, పరవశింపజేసే దివ్యానందం, కాని ఇది సత్యం; ఎవ్వరైనా, బాధలను సూటిగా, ధైర్యంగా ఎదుర్కొని, దైవకృపపై స్థిరమైన విశ్వాసంతో సహించగలిగితే బాధలు వచ్చినపుడు ముఖం చాటేయకుండా, సత్యదర్శన ఆకాంక్షతో, భరించగలననే విశ్వాసంతో కాంతివంతమైన సత్యాన్ని, హెచ్చుతగ్గులు లేని అన్ని వస్తువుల మూలాల్లో ఉండే ఆనందాన్ని కనుక్కోగలననే నమ్మికతో వుంటే సంతృప్తి పొందుటకన్నా బాధ సూటిగా, వెంటనే అనుభవించవచ్చు.

సుఖం గురించి నేను మాట్లాడటం లేదు. ఎందుకంటే, సుఖం ఎప్పుడూ ఇంచు మించు సంపూర్ణంగా, ఈ అఖండ దివ్యానందంపై తన వెన్ను చూపుతుంటుంది.

సుఖం తప్పుదారి పట్టించే ఒక కుటిలమైన ముసుగు. మన లక్ష్యం నుండి మనల్ని అది దూరంగా మళ్ళిస్తుంది. తొందరగా సత్యాన్ని కనుక్కోవాలంటే సుఖాన్ని మనం అన్వేషించకూడదు. సుఖం మనల్ని ఉప్పొంగిస్తుంది, మోసగిస్తుంది, ప్రక్కదారి పట్టిస్తుంది.; బాధ మనల్ని — ఇంకా లోతైన సత్యం దగ్గరకు వెనక్కి తెస్తుంది. ఎందుకంటె, బాధను భరించగల్గడానికి, మనల్ని ముక్కలు చేసే బాధను ఎదు ర్కోగల్గడానికి, తప్పనిసరిగా మనం సత్యంపై దృష్టి నేకాగ్రం చేయాల్సివస్తుంది. మనం బలంగా ఉన్నప్పుడే నిజమైన బలాన్ని బాధలో అత్యంత సులభంగా కనుగొనేది. మనం బాధలో ఉన్నప్పుడే బాధకు అతీతమైనదానిపై నిజమైన విశ్వాసాన్ని సులభంగా పొందగలం.

ఎప్పుడైతే, తనని తాను ఆనందిస్తూ మైమర్చి ఉంటాడో; ఎప్పుడైతే తనకు ఎదురయ్యే విషయాలను యథాతథంగా తీసుకుంటాడో, వాటిని గూర్చి పట్టించు కోకుండా జీవితాన్ని తేలికగా చూస్తుంటాడో. తను పరిష్కరించవల్సిన సమస్య ఒకటున్నదని, తను కనుక్కోవల్సినదొకటి ఉన్నదని, తను జీవించటానికి, తన అస్థిత్వానికి కారణమొకటి ఉన్నదని, ఏమీ చేయకుండా, ఏమీ నేర్చుకోకుండా కాలం వెళ్లబుచ్చ డానికి ఇక్కడ లేమని గ్రహించకుండా, అన్నీ మరిచిపోడానికి అన్వేషిస్తుంటాడో,

అప్పుడు అతడు నిజంగా తన కివ్వబడిన కాలాన్ని వృథా చేస్తున్నాడు, తనకు ఇవ్వబడిన గొప్ప అవకాశాన్ని వదులుకుంటున్నాడు.

ఇది ఒక గొప్ప మహత్తర అవకాశం, అనంతకాలంలో ఆధ్యాత్మిక పురోగతికి క్షేత్రమైన అస్తిత్వంలో ఒక క్షణం ఉండడం. ఎందుకంటె ఈ శరీరకమైన భౌతికమైన అస్థిత్వం, ఒక అద్భుత అవకాశం; జీవిత ధ్యేయం, జీవిత రహస్యం తెలుసుకోగలిగే ఒక గొప్ప అవకాశం — నీకు ఇక్కడ ఈ లోతైన సత్యం వైపు ఒక అడుగు ముందుకు వేయుటకు, నిన్ను దివ్యజీవనపు అఖండ పారవశ్య స్పర్శలోని రహస్యాన్ని కనుగొనుటకు....

(నిశ్శబ్దం)

నేను మీతో ఎన్నోసార్లు చెప్పాను. బాధను, బాధపడడాన్ని అన్వేషించడం వ్యాకులతతో కూడిన దృక్పథమని, దానిని ఉపేక్షించాలని; మతిమరుపువల్లో లేదా అల్ప కారణాల సాకుతో దాని నుండి దూరంగా పారిపోవడం పిరికితనమౌతుందని. బాధ రావడం, ఏదో బోధించడానికే వస్తుంది. ఎంత త్వరగా దానిని మనం నేర్చుకుంటే, అంత ఎక్కువగా బాధ అవసరం తగ్గుతుంది. ఎప్పుడైతే ఈ రహస్యం తెల్సుకుంటామో, అప్పడు మనకెంత మాత్రం బాధపడే అవకాశం ఉండదు. ఎందుకంటె, ఆ రహస్యం మన బాధకు కారణం, దాని మూలం, దాని నధిగమించే మార్గం తెలుపుతుంది.

ఆ రహస్యమేమంటే, మన 'అహంకారం' నుండి మనం బయట పడాలి; దాని చెర నుండి బైటపడి దైవంతో కలవాలి, ఐక్యమవాలి; దేనినీ ఆతని నుండి మనలను వేరుచేయడానికి అనుమతించ కూడదు. ఒక మారు ఈ రహస్యం కనుగొని, దానిని సత్తాలో అనుభూతి పొందితే, ఆ బాధ యొక్క ఔచిత్యం, బాధపడడం, అదృశ్యమౌతాయి. ఇది అన్నిటి కంటె శక్తివంతమైన పరిష్కారం — సత్తా యొక్క లోపలి భాగాలైన ఆధ్యాత్మిక చైతన్యం, జీవాత్మలలోనే గాక బాహ్యజీవితం, శరీరంలో కూడ.

శ్రీమాత

అనువాదం: యస్. వై. సోమయాజులు

విశ్వం యొక్క నైజం దివ్యానందం

"దైవం తన ఇచ్ఛాశక్తిని లోకం వైపు ప్రసరించకుండా ఆపలేదు. మనిషి కూడా తన ఆపేక్షను దైవం వైపు పోనీయకుండా ఆపలేడు. ఇదే అనంతమైనదానికి, పరిమితమైన దానికి గల శాశ్వత అనుబంధం. వీరు పరస్పరం ఎడముఖం పెడముఖంగా నున్నట్లు కనిపిస్తే అది వారిరువురు మరింత సన్నిహిత సమావేశానికై సన్నద్ధులౌతున్నారన్న మాట.

"మనిషిలో లోకం పోకడ, దానిని చూసి ఆనందించే దైవం వైపు మొగ్గుచూపడానికై, మరో మారు స్వయంగా చైతన్యవంతమౌతుంది. తనకు తెలియకుండానే తనను చూసి ఆనందించే దైవంయొక్క పొందును తనలో కలిగి వుంటుంది. ప్రాణము, ఇంద్రియజ్ఞానము ఆ పొందును అనుభవించి కూడ దైవం ఉనికిని నిరాకరిస్తూంటాయి. కాని, అలా నిరాకరిస్తూనే ఆతనికై అన్వేషణను కొనసాగిస్తూంటాయి. లోకం పోకడకు దైవం గురించిన ఎరుక లేదు. అందుకు కారణం దానికి తనను గురించి తనకే తెలియదు గనుక. తనను తాను తెలుసుకోగలిగినప్పుడే అది అస్తిత్వము యొక్క నిష్కల్మష ఆనందాన్ని అనుభవించగలదు.

"అసలు రహస్యమేమిటంటే ఐక్యతకు కావలసింది కోల్పోవుట కాదు, పొంది వుండుట. దైవము, మనిషి, ఇహలోకము, పరలోకము ఒకరితో నొకరు సఖ్యతగా నుండగలిగినప్పుడు మాత్రమే ఏకం కాగలరు. అజ్ఞానం బాధకు ఎలా కారణమౌతుందో, ఆ రెండింటి మధ్యన దూరం అజ్ఞానానికి కారణమౌతుంది."

Thoughts and Glimpses, SABCL Vol. 16, p. 382

శ్రీఅరవిందులు ఇక్కడ ప్రవచించినట్లుగ దైవం లేక దివ్యత్వం అనేది విశ్వం యొక్క వాస్తవికత. కాని నిజానికది దివ్యానందం. దివ్యానందంలోనే విశ్వం సృష్టించబడింది, దివ్యానందం కోసమే సృష్టించబడింది. అయితే సృష్టి తన సృష్టికర్తతో పూర్తిగ మమేకమైనప్పుడే దివ్యానందం సిద్ధించగలదు. శ్రీఅరవిందులు ఈ ఐక్యతను కర్త అని — అనగా సృష్టికర్త — అభివర్ణించారు; కర్త తన సృష్టికి తాను ఆధీనుడై యుండుట ఏకత్వములోని సారాంశము, సమస్త ఆనందానికి మూలం. అది ఒక రకమైన పరస్పరాధీనత.

సృష్టికర్త సృష్టిని తన అధీనమందుంచుకొనకపోవుట వలన, సృష్టి తన కర్తను తన వశమందుంచుకోలేక పోవుట వలన, విభజన ఏర్పడింది. ఆ కారణంగ ప్రధానమైన దివ్యానందం అజ్ఞానంగా మారింది. ఈ అజ్ఞానమే బాధకు కారణభూతమైంది. ఇక్కడ 'అజ్ఞానం' సర్వసాధారణంగ అర్థం చేసుకోబడే రీతిలోది కాదు. దానిని శ్రీఅరవిందులు 'అవిద్య' అని అన్నారు. ఆ అజ్ఞానం మరొకదాని పర్యవసానంగ యేర్పడింది. నిజమైన అజ్ఞానం ఏకత్వం గురించి, ఐక్యతను గురించి, తాదాత్మ్యం గురించి అవగాహన లేనిది. అదే అన్ని బాధలకు మూలకారణం.

విభజన ఆరంభమై, సృష్టి సృష్టికర్తతో ప్రత్యక్ష సంబంధం కోల్పోయినప్పటి నుండి అజ్ఞానం రాజ్యమేలింది. సర్వబాధలకు అదే కారణం.

ఆంతరిక అనుభవం పొందిన వారందరి అనుభవం యిది — దైవశక్తి మూలంతో ఐక్యత పునః స్థాపించబడిన క్షణాన బాధలన్నీ అంతమొందుతాయి. అయితే, ఒక నిరంతర కదలిక కొనసాగింది. గతవారం దీనిని గురించి నేను మీతో మాట్లాడాను. ఆ కదలిక సృష్టి మూలమందు దివ్యానందానికి బదులు కోరికను ప్రతిష్ఠించింది. ఈ సృష్టిలోని ఆనందం స్వయం అభివ్యక్తిలోని, స్వీయ భావప్రకటనలోని ఆనందం — దీనిని ఆనందంగ కాక ఒక కోరికగ పరిగణించిన తాపసులు, ఋషులు కోకొల్లలు. బౌద్ధ సాంప్రదాయ పరంపర అంతా యీ రకానికి చెందినదే. పరిష్కారాన్ని అభివ్యక్తిలోను, సాక్షాత్కారంలో నున్న ప్రధానమైన దివ్యానందాన్ని మనకు పునః ప్రసాదించే ఐక్యతలో చూడకుండ, వారు దాని లక్ష్యాన్ని, దానిని సాధించే మార్గాన్ని కోరికలను చంపడంలోను, సర్వాన్ని నిర్మూలించడంలోను ఉన్నదని అభిప్రాయపడ్డారు.

ఈ భావన పూర్తిగ ఒక అపార్థానికి దారితీస్తుంది. ఆత్మ విముక్తికి ప్రతిపాదించబడిన విధానాలన్నీ అభివృద్ధి సూచకాలు, చాలా ఉపయోగకరమైనవి. అయితే, ప్రపంచం కోరికల వలన ఏర్పడినందున, అది చెడుతో నిండినదని, అందువలన ఎంతటి ప్రయాసకైనా ఓర్చి దానినుండి వీలయినంత త్వరగా తప్పించుకోవాలి అనే వాదన మానవజాతి చరిత్రలో ఆధ్యాత్మిక జీవనానికి తీవ్రమైన అపార్థం కల్పించింది. ప్రపంచ చరిత్రలో ప్రతి విషయము పనికివచ్చేదే కావున, ఏదో ఒక ప్రత్యేక దశలో ఆ వాదన బహుశః ఉపయుక్తమయ్యేదేమో, కాని ఆ ప్రయోజనం యొక్క అవసరం యిక లేదు. దాని కాలం చెల్లిపోయింది. ఆ భావనను దాటి మరింత అవసరమైన, శ్రేష్ఠమైన పరమ సత్యానికి తిరిగి చేరవలసిన, సృష్టి యొక్క దివ్యానంద హేలకు మరలవలసిన,

దైవసంయోగం, దైవసాక్షాత్కారాల ఆనందోత్సాహల వైపు మళ్లవలసిన సమయం ఆసన్నమైంది.

ఈ నూతన ఆవిష్కారం — ఇహలోకంలో కలిగిన క్రొత్త అనుభవం అని నా భావన — గతంలోని ఆధ్యాత్మిక అనుభూతు లన్నింటికి ప్రత్యామ్నాయంగ చోటు చేసుకోవాలి. అతిమానస ఆవిర్భావమనే నూతన అనుభవానికి దారి చూపాలి. అందుకోసమే, గతవారం నేను దివ్యానంద మొక్కటే, నిజమైన దివ్యమైన మహదానందం మాత్రమే, విజయాన్ని చేకూర్చగలదని చెప్పాను.

ఈ దివ్యానందం ఏమిటి అనేదానిపై సందిగ్ధత వుండకూడదు. అందుకనే మొదటి నుండి శ్రీఅరవిందులు మనలను జాగృతపరచారు. మనిషి భోగలాలసతను అధిగమించినప్పుడే బ్రహ్మానందంలోకి ప్రవేశించగలడని చెప్పారు. దివ్యానందం ప్రకటితమైనప్పుడు యేర్పడు స్థితినే బ్రహ్మానందమయ స్థితి అని కచ్చితంగా చెప్పవచ్చు. కాని మనం మామూలుగ ఆనందోత్సాహాలు, సుఖసంతోషాలు అని పిలిచేవాటికి యిది పూర్తిగ భిన్నమైనది. బ్రహ్మానంద స్థితిని పొందాలంటే వీటిని పూర్తిగ విసర్జించాలి.

నేను సూచించిన యీ శిక్షణను ప్రతి ఒక్కరు దివ్యానందాన్ని పొందాలనే లక్ష్యంతో అభ్యసించినట్లయితే ఫలితం అందటం ఆలస్యమౌతుంది. అందుకు కారణం ఒక అహంకారపూరిత అంశం అందులో చోటు చేసుకుంటుంది గనుక. అది ఒక లక్ష్యసిద్ధికై చేసే చర్య అవుతుంది గాని సమర్పణాభావంతో చేసేది కాదు, ఒక అపేక్ష మాత్రమే అవుతుంది — అది సిద్ధిస్తుంది, సిద్ధించి తీరుతుంది, ఎక్కువ సమయం పట్టినా కూడ. వ్యక్తి దేనిని అర్థించనప్పుడు, దేని కొరకు నిరీక్షించనప్పుడు, దేనిని ఆశించనప్పుడు అలాంటి నిర్వ్యామోహస్థితిలో నున్నప్పుడు అది ఆత్మార్పణం, అభిలాష, బేరసారంలేని అయత్నకృత అవసరం అవుతుంది. దైవికంగా నుండగలగాలి, అంతే.

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

కష్టాల నుండి గ్రహించ వలసిందేమిటి

ఇది ప్రతి ఒక్కరు పొందగలిగే అనుభవం. ఏమీ తెలియనివారు కూడా క్లిష్టపరిస్థితులలో యిరుక్కున్నప్పుడు లేక ఒక సమస్యను పరిష్కరించవలసి వచ్చినప్పుడు లేక మీకు చెప్పినట్లుగ ఒక మనో ప్రేరణను లేక దాని అలజడికి గురిచేసినదానిని అధిగ మించవలసి వచ్చినప్పుడు, వారికి మనస్సు శూన్యమైనట్లనిపిస్తుంది, ఏమి చేయాలో తోచదు. వారి మనస్సుగాని, చిత్తముగాని, ఆలోచనలుగాని తోడ్పడవు. చేయవలసిం దేమో తెలియక తికమక పడుతున్నప్పుడు, ఒక పిలుపులాంటిదేదో వారిలో ఉద యిస్తుంది — నెరవేర్చలేని కార్యాన్ని నెరవేర్చగలదాని కోసం పిలుపు. మనిషి తాను చేయలేని పనిని చేయగల సమర్ధతగలదానిని గాఢంగ వాంఛిస్తాడు.

ఇది ప్రాథమిక అవసరం. అటు పిమ్మట దైవానుగ్రహం మాత్రమే ఆ పనిని సఫ లీకృతం చేయగలదనే అవగాహన కలిగినప్పుడు, నీ ప్రస్తుత పరిస్థితుల నుండి దైవానుగ్రహ మొక్కటే వెలికితీయగలదని, అందుకు తగిన పరిష్కారాన్ని, శక్తిని యివ్వగలదని తెలుసుకో గలిగినప్పుడు, సహజంగానే ఒక ప్రగాఢమైన అభిలాష నీలో ఉదయిస్తుంది — ఉన్మీలనముగ రూపాంతరం చెందిన ఒక చైతన్యం. నీ పిలుపుకు, నీ వాంఛకు సమాధాన మందుతుందనే ఆశ నీకున్నట్లయితే, అతి సహ జంగ నిన్ను నీవు ఆ దైవానుగ్రహానికి తెరుచుకుంటావు.

ఆ తరువాత — దీనిని అత్యంత శ్రద్ధతో గమనించు: (శ్రీమాత వ్రేలును తన పెదవులపై నుంచుతారు) దైవానుగ్రహం నీకు సమాధామిస్తుంది, నిన్ను విషమ పరిస్థితుల వలయం నుండి బయటకు లాగుతుంది, నీ సమస్యకు పరిష్కారమందిస్తుంది, నీ కష్టం నుండి బయట పడటానికి సహాయ పడుతుంది. కాని కష్టం నుండి విముక్తుడవై, కష్టాలు కడతేరినప్పుడు దైవానుగ్రహం వలన నీకు ఆ విమోచన లభించిందని మరువకూడదు. నీ స్వయంకృషి వలన విముక్తి లభించిందని తలచరాదు. నిజానికి యిదే ప్రధానమైన విషయం. చాలామంది కష్టం తొలగిపోయిన వెంటనే, "ఎట్టకేలకు నా అంతట నేను యీ కష్టం నుండి బాగానే గట్టెక్కాను" అంటారు.

అదీ విషయం. ఆ విధంగ నీవు ద్వారాన్ని మూసి గడియపెట్టి తాళం వేస్తావు. ఆ పైన నీవు యింకేదీ స్వీకరించలేవు. ఈ అంతరంగ బుద్ధిమాంద్యం తొలగి యేమి చేయుటకైన అశక్తుడవని నీకు మరోమారు తెలియడానికి, ఒక తీవ్రమైన

మనస్తాపానికి నీవు తిరిగి గురికావాలి. ఒక దుర్భర కష్టం మరోసారి కలగాలి. ఎందుకనగా నీవు అశక్తుడవనే అవగాహన యేర్పడినప్పుడే కొంతమేరకు తెరుచుకొని మెత్తబడతావు. కాని యెంత కాలం వరకు నీవు చేసేదంతా నీ స్వంత నైపుణ్యం, నీ స్వయం శక్తిసామర్థ్యాలపై ఆధారితమైనదని అనుకుంటావో, నిజానికి నీవు మూసింది ఒక్క ద్వారమే కాదు, అసంఖ్యాకమైన ద్వారాలు. ఒకదాని తరువాత ఒకటి మూసి గడియ వేసుకున్నావన్న మాట. ఏదీ ప్రవేశించ వీలులేని ఒక కోటలో నిన్ను నీవు బందీని చేసుకున్నావన్న మాట. అది ఒక పెద్ద వెనుకంజ. మనిషిది అతి త్వరగా మరిచిపోయే తత్వం. అతి సహజంగ స్వయంశక్తితో సంతృప్తి చెందుతాడు.

ప్రశ్న: అయితే శ్రీమాతా! మనిషి తాను అశక్తుడనని అనుకున్నప్పటికీ, అతను శక్తిమంతుడే అని నమ్మేది ఏదో ఉన్నది. ఏమిటది?

జవాబు: అవునవును! చిత్తశుద్ధితో నుండుట చాలా కష్టం.... అందుకే ఆపదలు పెరుగుతాయి. కొన్నిసార్లు తీవ్రరూపం దాలుస్తాయి. కారణం, నీ బుద్ధిమాంద్యం తొలగాలంటే అదొక్కటే మార్గం. కష్టాలు కలుగుట సబబే అని యిది నిరూపిస్తుంది. తీవ్రమైన దుర్భర పరిస్థితులు నిన్ను చుట్టుముట్టినప్పుడు, నిన్ను తీవ్రంగ బాధించేది యెదురైనప్పుడు మాత్రమే నీ బుద్ధిమాంద్యం కొంతమేర కరుగుతుంది. అయినప్పటికి యెంతో కొంత మాంద్యం అంతరంగంలో మిగిలిపోతుంది. అందుకే బాధ దీర్ఘకాలం కొనసాగేది.

మనిషి ఏమీ కాడు, ఏమీ చేయలేడు. అతనికి ఒక ఉనికి అంటూ లేదు, మనిషి అనేవాడొక శూన్యం, దైవదత్తమైన దివ్యచైతన్యం, దైవానుగ్రహం లేనప్పుడు అసలు అస్తిత్వమే లేదు అని అంతఃకరణ లోతుల్లో నమ్మకం కుదరడానికి యెన్ని ఆపదలు కలగాలి! అది తెలుసుకున్న క్షణం అంతా అయిపోతుంది. కష్టాలన్నీ కడతేరుతాయి. ఆ సమగ్ర అవగాహన యేర్పడినప్పుడు ప్రతిఘటించగలిగేదేదీ వుండదు. కాని, ఆ క్షణం వరకూ... అందుకు చాలా సమయం పడుతుంది.

ప్రశ్న: ఎందుకని కష్టం అమాంతంగ సంభవించదు?

జవాబు: ఎందుకనగా, అలా జరిగితే అది నిన్ను చంపుతుంది. ఆ ఆపద నిన్ను సరి చేయగలిగేటంత శక్తి కలిగినదైతే, నిన్ను అణగద్రొక్కి చిత్తు చేస్తుంది. కొద్ది కొద్దిగ, కొద్ది కొద్దిగ, క్రమక్రమంగ వాటిల్లినప్పుడే నీవు తట్టుకుని నిలువగలుగుతావు. సహజంగ అది నీ అంతరంగ శక్తిపైన, శ్రద్ధాసక్తుల పైన, నీ పురోగమన సామర్థ్యం పైన, అను

భవంతో లాభం పొందగలిగే సత్తాపైన, మరచిపోకుండ వుండగలిగే శక్తి పైన ఆధారపడి ఉంటుంది. మరుపుకు గురి కాకుండ వుండగలిగే అదృష్టం వుంటే అభివృద్ధి వేగవంత మౌతుంది. ఆ వ్యక్తి అత్యంత వేగంగా సాగిపోగలడు. అదే సమయాన అతనికి అంతరంగ నైతికశక్తి వున్నట్లయితే పనులు కూడ వేగంగ కొనసాగుతాయి. అందరికీ ఆ శక్తి వుండదు. అందుకు విరుద్ధంగా యీ విధంగ చేస్తారు, యిలా... యిలా... (శ్రీమాత అభినయించి చూపిస్తారు) తమ నుండి తాము చేసిన అవివేకపు పను లన్నింటిని దాచే ప్రయత్నం చేస్తారు. అందుకోసం యెన్ని అల్పమైన వివరణలు యిచ్చుకుంటారో, యెన్ని సాకులు ఒకదానిని మించి మరొకటి కల్పించుకుంటారో!

ప్రశ్న: శ్రీమాతా, కష్టాల సంఖ్య మనుషులను బట్టి వుంటుందా?

జవాబు: అవును. అది మనుషులను బట్టి వుంటుంది. నేను చెప్పినట్టుగా, అభివృద్ధి చెందటానికి వారికిగల శక్తిసామర్థ్యాల పైన, వారి స్వయంశక్తి పైన, వారి నిరోధకశక్తి పైన ఆధారపడి వుంటుంది. కాని కష్టాల తాకిడి అవసరం కలగనివారు కొందరు నాకు తెలుసు.

ప్రశ్న: శ్రీమాతా, కష్టం మహాకాళి కల్పితమా?

జవాబు: కష్టమా? కానవసరం లేదు.

నీవు విషం మ్రింగితే, విషపూరితుడవైతే, అది మహాకాళి నేరం కాదు. విషం మ్రింగిన నీది. ఎవరైనా తమను తాము పూర్తిగ అసంగతమైన పరిస్థితుల లోనికి దిగజార్చుకుంటే, వారు వారి తలనో, చేతినో లేక వెన్నునో విరగగొట్టుకొనుట తథ్యం. కారణం, వారు నిజమైన సమతుల్యస్థితిలో లేనందువలన. అందులకై దివ్యశక్తులను నిందించకూడదు. అది నీ మూఢత్వం వలన, నీ అంతరంగస్థితి వలన అతి సహజంగ, యాంత్రికంగ కలిగే పర్యవసానం.

ప్రశ్న: మహాకాళి కలిగించే కష్టం యొక్క లక్షణం ఎలా వుంటుంది?

జవాబు: అది నీకు మహదానందాన్ని కలుగజేస్తుంది. నీ హృదయంలో మధురిమతో కూడిన వెచ్చదనాన్ని కలిగిస్తుంది. అపారమైన సంతృప్తిని పొందుతావు.

ప్రశ్న: ఎవరైనా దానిని గాఢంగా కోరాలా లేక అది సహజంగానే సంభవిస్తుందా?

జవాబు: అవును. గాఢంగా కోరటంలో కూడా చిత్తశుద్ధి వుండాలి. నిజమైన అభివృద్ధి చెందాలనే అభిలాష వుండాలి. "అవును. నేను అభివృద్ధి చెందాలని కోరుతున్నాను"

అని మనఃపూర్వకంగా అనాలి. "ఏది ఏమైనా సరే, నేను అభివృద్ధి చెందాలి". అప్పుడది సంభవించి తీరుతుంది.

అయితే నేను చెప్పినట్లుగా, అది అపరిమిత ఆనందానికి మూలమైన సమగ్రశక్తితో సమృద్ధిగా సిద్ధిస్తుంది. మనిషి ఒక నిర్ణయం తీసుకుని తాను ఒక మారు చేసిన తెలివిమాలిన పనిని మరోమారు చేయకుండుటకు నిశ్చయించుకున్నప్పుడు లేక ఆ పని సవ్యమైనదని తెలిసినా నెరవేర్చుట కష్టమని లేక అసాధ్యమని భావించినప్పుడు, చిత్తశుద్ధితో కూడిన గట్టి సంకల్పంతో ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు, ఒక దుర్భరమైన కష్టం యెదురై, నీవు చేయదలచిన చర్యను చేయుటకు ఉసిగొల్పితే, అది కష్టమే అయినప్పటికి నీవు సంతోషంతో ఉప్పొంగిపోతావు. అమితానందం పొందుతావు. అది యెంతో దివ్యమైనదిగ తోస్తుంది. చూశావూ, ఇచ్చట (శ్రీమాత తమ హృదయాన్ని చూపిస్తారు) యేదో ఒక అత్యద్భుతమైన అనుభూతి కలుగుతుంది.

పూర్తిగ బాహ్యమైన, యాంత్రికమైన భౌతిక చేతనలో ఒక అజ్ఞానస్థితిలో నుండి చెడు పరిణామాలకు దారితీసే అవివేకపు పనులను నీతో చేయించిన కారణంగ కష్టాలు కలగటం తప్పదు. ఈ కష్టాలకు నీవు ఒక ఉన్నతస్థాయికి యెదిగి, యెట్టి పరిస్థితులలోనైనా నీపై ప్రభుతను సంపాదించుకోవాలని, పరమ సత్య చైతన్యమునందే జీవించాలని, యెంతటి ప్రయాసకైనా ఓర్చి, యెంతటి కష్టనష్టాలనైనా సహించి అభివృద్ధి చెందాలని నిశ్చయించుకున్న తరువాతి కష్టాలకు మధ్య వ్యత్యాసం వుంది. అవి అర్థవంతమైనవిగ వుంటాయి. వాటిలో సత్యం యొక్క కాంతి ప్రస్ఫుటిస్తుంది. నీకు మార్గదర్శనం చేస్తుంది. నీవు పయనించే బాటను తేజోమయం గావించే ఆ దివ్యకాంతిని స్పష్టంగా గమనించ గలుగుతావు. ఓ బండరాయి నీ పైబడి నిన్ను అణగద్రొక్కేదిగ నుండదు. అది ఒక జయసూచికమైన, దేదీప్యమానమైన వెలుగుగా నుంటుంది.

అందుకనే యిలా అనటం కద్దు: మొదటి అడుగు వేయటానికే ప్రయత్నం అవసరం. మొదటి అడుగు అనగా ఆ స్థాయి నుండి బయటపడి యీ స్థాయికి యెదుగుట. అటు పిమ్మట అంతా మారిపోతుంది.

అయితే మనిషి ఆ స్థాయి నుండి పూర్తిగ బయటకు రావాలి. అక్కడే నిలచిపోకూడదు. ఒక అడుగు ఇక్కడ ఒక అడుగు అక్కడ వేయకూడదు. అది కూడదు. అదీ విషయం.

ప్రశ్న: మధుర మాతా, ఒక కష్టం వాటిల్లిందంటే దాని అర్థం, దైవం మన స్వభావ లోపాలపై మనకు ఎరుక యేర్పడుట కోసం చేసే ప్రయత్నమా?

జవాబు: నీవు దానిని ధైర్యంగ ఎదుర్కొంటే, అవును. అనగా కష్టం నీకు యెదురైన వెంటనే పిరికిపంద వలె దానికి తలొగ్గుటకు బదులు దానిని అధిగమించే ప్రయత్నం చేసినట్లయితే, భగవంతుడు నీకు అండగ వున్నాడని రూఢి అవుతుంది. కాని నీవు పిరికితనంతో వుంటే భగవంతుడు నీ చెంత నిలువడు, అనగా, నీ పిరికితనం నిన్ను భగవంతుని నుండి వేరు చేస్తుందన్న మాట. కాని నీవు ప్రతిఘటించి నిలబడి విజయం పొందాలని కోరితే, భగవంతుడు నీకు సాయపడుటకు నీ చెంత ప్రత్యక్షమౌతాడనుట తథ్యం. అందుకు ఛాయామాత్ర సందేహమైనా లేదు.

ప్రశ్న: కాని, నేను తెలుసుకోగోరేది — కష్టం వాటిల్లితే, — దైవం మనలో లోపాలున్నాయని తెలియచేయుటకు ప్రయత్నిస్తున్నట్లా?

జవాబు: ఆతడు ఉద్దేశపూర్వకంగా నీ దారిలో కష్టాలను సృష్టిస్తున్నాడనా? కాదు. అది ఆతని విధానం కాదు.

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(CWM Vol. 6, pp. 322-26, 461)

దైవం మనకు ఎంతో దూరంగా లేడు. మనలోనే ఉన్నాడు — మన అస్తిత్వపు లోతుల్లో, మన అనుభూతులకు, ఆలోచనలకు పైగా.

శ్రీమాత

భగవంతుడు బాధించేవాడా? — మన దృష్టి పరిమితం

దైవం ప్రేమించేవాడు కనుకనే ఘోరంగా, క్రూరంగా బాధలు పెడుతున్నాడు. కృష్ణుని నీవు కాంచలేదు, ఆయనతో ఆడుకోలేదు కాబట్టి, ఇది నీకు అర్థం కాదు.

సర్వత్రా వ్యాపించివున్న దైవం కృష్ణుడు. అందరిలోనూ, అన్నింటా వున్న దివ్యసన్నిధి ఆయనే. అంతేకాక ఆయన పరమానందానికి ప్రతిరూపం. సర్వేశ్వరుని ప్రేమకు సాకారం. అయన లేలేత చిరునగవుల దయారూపుడు, వినోదభరిత క్రీడా లోలుడు. అతనే ఆట, అతనే ఆడించేవాడు, అతనే ఆడేవాడు, ఏకకాలంలో అన్నీ ఆతనే. ఆట, దాని ఫలితాలు పూర్తిగా తెలిసినవి, ఊహించినవి, సంకల్పించినవి, ఎరుకతో ఆడినవి గనుక ఆటలోని ఆనందానికి తప్ప వేరేదానికి ఆస్కారము లేదు. ఆ విధంగా కృష్ణుని కాంచడమంటే మనలోని దివ్యత్వాన్ని దర్శించడమే. కృష్ణునితో క్రీడించడమంటే మన అంతరంగంలోని దివ్యసన్నిధితో తాదాత్మ్యత చెంది ఆతని చేతనలో భాగస్వామి కావటమే. నీవు ఎప్పుడైతే ఈ స్థితిని పొందుతావో అప్పుడే ఆ దివ్య కేళిలోని పరమానందంలోకి ప్రవేశిస్తావు. తాదాత్మ్యత పరిపూర్ణమయ్యే కొద్దీ, ఆ స్థితి పరిపూర్ణతను సంతరించుకుంటుంది.

అయితే నీ చేతనలో ఏదో ఒక మారుమూల ఒక సాధారణ స్ఫూర్తి, సాధారణ అంతర్దృష్టి, సాధారణ సంవేదన ఉన్నట్లయితే ఇతరుల బాధలను నీవు గ్రహించగలుగుతావు. ఆ వ్యధలను కలిగించే ఆయన లీల చాలా క్రూరంగా అన్పిస్తుంది. అలా హింస పెట్టి, ఆనందించే భగవంతుడు నీకు పరమ దుర్మార్గుడిలా కన్పిస్తాడు. అలా కాకుండా, దైవానుభూతిని పొందినట్లయితే, ఆయన ఆటలో ప్రదర్శించే అద్భుతమైన, గాఢమైన ప్రేమను మరువజాలవు. భగవంతుడు బాధించేవాడనే తీర్పుకు కారణం పరిమితమైన మన దృష్టిలోపమేనని నీవు అర్థం చేసుకుంటావు. ఇచ్ఛాపూర్వకంగా బాధించేవాడు గాదని, క్షేమంకర ప్రేమతో ప్రపంచాన్ని, మానవాళిని ప్రగతిశీల పరిపూర్ణత దిశగా దగ్గర త్రోవల ద్వారా నడిపించేవాడనీ, అంతేకాక ఆ పరిపూర్ణత కూడా క్రమక్రమంగా వృద్ధి చెందుతుంటుందని తెలుసుకుంటావు.

శ్రీమాత

అనువాదం: భాష

ఆర్జవం పరిపూర్ణతను కాంక్షిస్తుంది. కాని పరిపూర్ణత సర్వలక్షణ సమన్వితమైనది. అందువలన, విసర్జన, ఒదుగుదల, పరిమితి అవసరమయ్యే ఆర్జవానికి, తిర్కస్కారణయే లేని సర్వాన్ని స్వీకరించి, ప్రతిదానిని దాని ఉచిత స్థానంలో నుంచే పరిపూర్ణతకు, సహజంగానే సయోధ్య కుదరదు. ఈ రెండు పరస్పర విరుద్ధమైనవి.

జీవితాన్ని ఆషామాషీగ కాక ప్రాధాన్యతనిచ్చి గడుపుటలో రెండు రకముల ప్రేరణలు చోటు చేసుకుంటాయి. మొదటిది, అప్రధాన మనుకునే విషయాలకు ప్రాధాన్యత నిచ్చుట. రెండవది, జీవితాన్ని స్వచ్ఛమైన, అనుసరణీయమైన లక్షణాలకు సరిపడునట్లుగ పరిమితం చేయుట. కొందరిలో — ఉదాహరణకు సభ్యత, సంస్కారం గలవారు లేక శ్రోత్రీయులు అని శ్రీఅరవిందులచే పేర్కొనబడినవారు — ఆర్జవం పెడసరమైనదిగ, అసహనమైనదిగ పరిణమిస్తుంది, సుఖదాయకము, స్వేచ్ఛాయుతము, ఉల్లాసభరితమైన ప్రతి విషయంలో లోటుపాట్లను ఎన్నుతుంది.

జీవితాన్ని సమగ్రంగ తీర్చిదిద్దటానికి ఒకే ఒక మార్గం వుంది — ఈ పృథ్వీజీవన గమనంలో అని నా భావన — దానిని తగినంత ఊర్ధ్వస్థాయికి యెదిగి చూడాలి. దాని యొక్క ప్రస్తుత సర్వలక్షణ సమన్విత స్థాయిలోనే కాక దాని గతము, వర్తమానము, భవిష్యత్తు యే విధంగ నుంటుంది, యే విధంగా నున్నది, యే విధంగా నుండబోతుందో ఒకేసారి చూడగలగాలి. ఎందుకనగా ప్రతిదానిని దాని ఉచిత స్థానమందుంచటానికి అదొకటే మార్గం. ఏదీ విసర్జించబడదు, దేనినీ విసర్జించకూడదు, కాని ప్రతి ఒక్కటి దాని ఉచిత స్థానంలో, మిగతా వాటన్నింటితో ఒక సంపూర్ణ సామరస్యతతో నుండగలగాలి. అప్పుడు ఎంతో 'చెడ్డవిగ', 'ఏహ్యమైనవిగ', సంస్కారవంతమైన మనస్సుకు 'అనంగీకారమైనవిగ', కనిపించినవన్నీ ఒక సంపూర్ణ దివ్యజీవన గమనంలోని ఆనందదాయకమైన స్వేచ్ఛాయుత వర్తనాలుగా మారిపోతాయి. అప్పుడు తన అనంతత్వ ఉనికిని స్వయంగా గమనించుటలో అపారమైన ఆనందం పొందే ఆ అప్రమేయుని అత్యద్భుత హాసాన్ని తెలుసుకొనుటకు, అర్థం చేసుకొనుటకు, అనుభవించుటకు, అందులో జీవించుటకు, మనలను ఆపగలిగేది ఏదీ ఉండబోదు.

ఈ ఆనందహేల, ఈ అత్యద్భుత హాసావిలాసం, ఏమనాలి! అంతరంగంలో ప్రకాశిస్తున్న ఆదిత్యుణ్ణి కనుగొనటానికి నీ లోనికి తగినంత లోతుకి వెళ్లగలిగితే

చాలు. ఆ వెలుగు వెల్లువ నిన్ను ముంచెత్తుతుంది. ఒక చీకటి పొర కమ్ముకొనుటగాని, చిన్న బాధగాని చూఛాయకైనా మిగలవు. సామరస్యమైన, తేజోమయమైన దివ్య వెలుగును జిమ్మే నవ్వుల జలపాతం తప్ప మరేమీ ఉండదు.

నిజానికి అత్యంత దుర్భరమైన కష్టాలైనా, అత్యంత దుఃఖకర సంఘటనలైనా, అత్యంత బాధాకరమైన శారీరక వేదనలైనా, ఆ ఎత్తు నుండి, ఆ దృక్కోణంలో గమనించినట్లయితే, ఆ కష్టాల లోని ఆ దుఃఖభాజన సంఘటనల లోని, ఆ శారీరక వేదనల లోని అవాస్తవికతను గమనించ గలుగుతావు. అటుపైన ఆనందమయమైన, తేజోమయమైన స్పందనలు తప్ప మరేమీ వుండవు.

నిజానికి కష్టాలను కడతేర్చడానికి, విచారాలను అధిగమించడానికి, బాధలను నివారించడానికి యిది అత్యంత శక్తివంతమైన మార్గం. మొదటి రెండు మార్గాలు సాపేక్షంగా సులభమైనవి, కాని చివరిది ఎక్కువ కష్టంతో కూడుకున్నది; కారణం మనకు మన శరీరాన్ని దాని అనుభూతులను నిర్దిష్టమైనవిగా, నిశ్చితమైనవిగా పరిగణించుటకు అలవాటు పడ్డాము. అందుకు కారణం మన శరీరాన్ని ఒక అస్థిరమైనదిగ, మృదువైనదిగ, అశాశ్వతమైనదిగ, మలచుటకు అనుకూలమైనదిగ పరిగణించుట మనం నేర్చుకోలేదు గనుక. మనం మన శరీరంలోకి చీకటిని, కష్టాలను, వైషమ్యాలను, అపశృతులను, అలజడి రేపే, దుఃఖం కలిగించే, కన్నీళ్ళు కురిపించే అన్ని విషయాలను తొలగించగల తేజోమయమైన దివ్యదరహాసాన్ని కొనితెచ్చుట నేర్చుకోలేదు గనుక.

ఈ సూర్యుడు, యీ దివ్యదరహాస కాంతులను వెదజల్లే భానుడు, అన్ని విషయాలకు, అన్ని విషయాల వాస్తవికతకు కేంద్రబిందువై యున్నాడు. ఆ కాంతిని చూడగలుగుట, ఆ అనుభూతిని పొందుట, ఆ వెలుగులో జీవించుట మనం నేర్చుకోవాలి.

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ఒక చెడు తన నివారణోపాయాన్ని తనలోనే కలిగివుంటుందని కచ్చితంగా చెప్పవచ్చు.

ఏ బాధ నివారణైనా ఆ బాధతోనే కలిసి వుంటుంది.

శ్రీమాత

సాధువుల ఇనుప ములుకుల శయ్య

ప్రశ్న: ఇచ్చట మీరు ప్రస్తావించినది: "సాధువు ఇనుప ములుకులు శయ్యను వాడుట లేక క్రైస్తవ మతాచార్యుడు కొరడాను, ఇతర హింసాత్మక పరికరాలను వాడుట లాంటివి ఆమోదయోగ్యంకాని, అనుసరణీయముకాని ప్రచ్ఛన్నమైన క్రూరవైఖరి వలన సంభవించే పరిణామాలు. అవి అయుక్తమైన ఆకాంక్ష లేక అధోచేతన యొక్క అవసరాల వలన కలిగే ఆవేశపూరిత సంవేదనలు".

జవాబు: ఆహా, మేకులపై నిదురించే కఠోరనియమాలు పాటించే సాధకులున్నారని మీరెరుగుదురు. వారిని మీరెప్పుడు చూడలేదా? అలాంటివారి ఛాయచిత్రాలను కొన్నింటిని నేను స్వయంగా చూశాను. వారు చేసేదేమిటంటే, ఇనుప ములుకుల శయ్యపై పరుండట. అలాంటి ఛాయాచిత్రాన్ని ఈ మధ్యనే చూశాను. వారి పవిత్రతను నిరూపించాలని అలా చేస్తారేమో తెలియదు. ఇలాంటివి బహిరంగంగా ప్రదర్శించి నప్పుడు అదంతా నాటకీయమని అనుమానించాల్సి వస్తుంది. అయినప్పటికి అలా నిజంగా చేయగలిగేవారు కూడ వున్నారు. కాని వారు ప్రదర్శించాలనే వుద్దేశంతో చేయరు. అలాంటివారిని మీరెందుకు చేస్తున్నారని ప్రశ్నిస్తే, తాము దేహధ్యాస నుండి విముక్తుల మయ్యామని తమకు తాము నిరూపించుకొనుటకు అలా చేస్తామని సమాధాని మిస్తారు. మరింత ముందుకు వెళ్లిన వారుంటారు. ఆత్మవిమోచన కోసం దేహాన్ని బాధకు గురిచేయడం అవసరమని వారంటారు. నన్నడిగితే, దీని వెనుక దేహాన్ని బాధకు గురిచెయ్యాలనే ప్రాణికపరమైన అభిరుచి వున్నదని, అందుకు కారణం ప్రాణికం బాధపడుటలో ఒక విపరీత ఆనందం అనుభవించుటయే అని అంటాను. తమను తాము యెక్కడో ఒక చోట గాయపరచుకొని ఆ బాధను యినుమడింపజేయుటకు ఆ గాయాన్ని గట్టిగా నొక్కే పిల్లలు నాకు తెలుసు. అలా చేయటంలో వారు సుఖాన్ని అనుభవిస్తారు. ఆ విధంగా ఆనందం పొందే పెద్దవారు కూడ నాకు తెలుసు. అది అందరికి తెలిసిన విషయమే. నేనిలా చెప్తుంటాను "నీవు సంతోషంగా లేవంటే కారణం నీకు అలాగే వుండాలనే కోరిక వుంది. నీవు బాధపడతున్నా వంటే కారణం నీకు బాధంటే యిష్టం గనుక; లేనట్లయితే నీవు బాధపడవు". ఇలాంటి భావన అనారోగ్యకరమని నేనంటాను, కారణం అది సామరస్యతకు, రామణీయకతకు విరుద్ధం; ఒక విధంగా బలమైన రోగగ్రస్త సంవేదన.

మీకు తెలుసో లేదో, అతి భయంకరమైన చిత్రహింసలను ప్రవేశపెట్టిన దేశం చైనా — ఊహించలేనివి. నేను జపానులో నున్నప్పుడు చైనా దేశం గురించి గొప్పగా చెప్పే ఒక జపాను దేశస్థుడ్ని అడిగాను. అతను చెప్పింది "దూరప్రాచ్య దేశవాసులకు, జపనీయులతో సహా, యింద్రియ సంవేదన మొద్దుబారి వుంటుంది. వారి సంవేదన కొద్దిపాటిది. బాధ అత్యంత తీవ్రతరమైతే తప్ప వారు దాని అనుభూతిని పొందలేరు. ఆ కారణంగా వారి బుద్ధి అతి తీవ్ర బాధాకరమైన చిత్రహింసలను కనిపెట్టుటకు ప్రేరేపించింది". ఇలాంటి చైతన్యరహితులకు చైతన్యం యెంత లోపిస్తే వారు అంత తామసికులుగ వుంటారు; వారి సంవేదనా శక్తి అంతగా మందగిస్తుంది. ఏ కొద్ది అనుభూతి కలగాలన్నా కూడా, బలమైన సంవేదన వారికి అవసరమౌతుంది. సాధారణంగా యిదే వారిని క్రూరులుగ చేసేది. ఆ క్రూరత్వం తీవ్రమైన భావోద్రేకం కలిగిస్తుంది. ఇతరులను బాధకు గురిచేయుట ద్వారా నాడీవ్యవస్థపై కలిగే వత్తిడి వారికి అనుభూతిని సిద్ధింపజేస్తుంది. వారి అనుభూతికి అది అవసరం. లేనట్లయితే వారి కెలాంటి అనుభూతి కలుగదు. జాతులు మొత్తం క్రూరులుగా మారటానికదే కారణం. ప్రాణికంగా వారంతా చైతన్యరహితులు — మానసికంగానో లేక మరే విధంగానో వారు చైతన్యరహితులు కాకపోవచ్చు. కాని ప్రాణికంగాను, భౌతికంగాను వారికి చైతన్యం కొరవడుతుంది — అన్నింటికీ మించి భౌతికంగా.

శ్రీమాత

అనువాదం: త్రివేణి

శారీరక సమతుల్యతకు సరైన ఆహారమెంత అవసరమో, శారీరక శ్రమ కూడ అంత అవసరము.

శ్రీమాత

బాధలు రెండు రకాలు

ప్రశ్న: బాధను ఎలా అధిగమించవచ్చు?

ఈ సమస్య అంత సామాన్యమైనదేమీ కాదు. బాధకు కారణాలు అనేకం. మూలం ఒక్కటే అయినా లక్షణాలలో చాలా తేడా వుంటుంది. అయినప్పటికి బాధ కలగటానికి కారణం ఒక దైవ ప్రతికూల ప్రేరణ యొక్క ప్రాథమిక చర్య. సులభంగా అర్థం చేసుకోడానికి, బాధను రెండు వేర్వేరు రకాలుగ విభజించవచ్చు. అనుభవంలో మాత్రం చాలా వరకు ఒకటిగానే కనిపిస్తాయి.

మొదటి రకమైన బాధ అహంకార జనితం. వ్యక్తి హక్కులకు భంగం కలిగింది, అతని అవసరాలు తిరస్కరించబడ్డాయి, అవమానించబడ్డాయి, మోసగించబడ్డాయి, హానిపరచబడ్డాయి మొదలగు భావనల వల్ల కలుగుతుంది. ఈ రకమైన బాధ ప్రతికూల చర్యల ఫలితంగా ఏర్పడుతుంది. అది చైతన్యాన్ని ప్రతికూల ప్రభావానికి గురిచేయుటయే గాక ప్రతికూల చర్యలు దారుణంగా పరిణమించడానికి ఉపకరిస్తుంది. దానికి తోడు సహజంగా, అప్రయత్నంగా యేర్పడే పరిణామం యేమిటంటే పగ, ద్వేషం, బలవంతులలో ప్రతీకారవాంఛ, బలహీనులలో నిరాశ నిస్పృహలే కాక ఆత్మహత్యా వాంఛ.

రెండవ రకమైన బాధకు ప్రాథమిక కారణం ప్రతికూల పరిస్థితుల వలన కలిగే వియోగబాధ. స్వభావరీత్యా అది మొదటిదానికి పూర్తిగ భిన్నమైనది. ఈ రకపు బాధ దైవప్రేరితంగా లోకంలో నెలకొనివున్న విచారకర పరిస్థితులపై జాలి పుట్టించే ప్రేమ వలన కలిగేది — మూలము, కారణము, ప్రభావము యేదైన కావచ్చు. అయితే సంపూర్ణ మానసిక లక్షణంగల ఈ బాధలో అహంకారానికిగాని, ఆత్మన్యూనతా భావానికిగాని చోటు లేదు. శాంతి, సమర్థత, క్రియాశీలశక్తి, భవిత యందు విశ్వాసం, విజయసంకల్పం మొదలగు వాటితో నిండి వుంటుంది. అది కనికరించదు కాని ఓదారుస్తుంది. ఇతరుల అజ్ఞానజనిత గమనాలతో మమేకం కాదుగాని వాటిని సరిచేసి కాంతివంతం గావిస్తుంది.

పవిత్రతయే మూలంగా భాసించి పరిపూర్ణంగ దైవికమైనది మాత్రమే ఆ బాధ యొక్క అనుభూతిని పొందగలదు. అయితే విశాలమైన, ఉదారహృదయం గల వారందరిలో అది పాక్షికంగా లిప్తమాత్రం అహంకార కారుమేఘాల వెనుక వెలిగే

మెరుపులా గోచరిస్తుంది. ఏమైనప్పటికీ వ్యక్తిగత చైతన్యంలో తరచుగా క్రుంగుబాటుకు, బలహీనతకు కారణభూతమయ్యే తుచ్ఛమైన, అల్పమైన ఆత్మన్యూనతతో కలుస్తుంది. అయినప్పటికి ఈ కలయికను తిరస్కరించడానికి లేదా కనిష్ట స్థాయికి తగ్గించుటకు తగిన జాగ్రత్త తీసుకోగలిగితే, ఈ దైవిక ప్రేరణ ఒక గంభీరమైన, శాశ్వత పరమానందం — ప్రపంచాన్ని అజ్ఞాన, దురవస్థల నుండి తప్పించగల శక్తి సామర్థ్యాలు దేనికి మాత్రమే ఉన్నదో — పైనే ఆధారపడి వున్నదని త్వరలోనే అవగతమౌతుంది.

ప్రతికూల పరిస్థితులతో పాటు, వాటి ప్రభావం కూడా పూర్తిగా తొలగిపోయినప్పుడు మాత్రమే, ఈ బాధ కూడా ప్రపంచం నుండి తొలగిపోతుంది.

*

ప్రశ్న: అభిమానాన్ని మనం ఎలా తొలగించుకోగలం?

ఓ భగవంతుడా! మొదట, అది ఎంత విపత్కరమైనదో చూడు: అది అత్యల్పమైనది, అతి వినాశకరమైనది. ఇంకో అడుగు ముందుకు వేస్తే నిన్ను నీవు ఎంత హేళనకు గురిచేసుకున్నావో, ఎంత మేరకు పరిహాసానికి లోనయ్యావో తెలుసుకో. అది తెలుసుకొగలిగితే దీనిని వదిలించుకోవచ్చు. అయితే ఎంతకాలం నీకు అది ప్రధానమైనదిగ అనిపిస్తుందో, ఎంత కాలం ఈ లక్షణాన్ని సమర్థించుకుంటావో, ఎంత కాలం నీ మనస్సులో ఏదో ఒక మూల, “ఐతే ఏమి, ఇది సహజం. నేను నిరాదరించబడ్డాను. ఆ నిరాదరణ నన్ను బాధిస్తున్నది”, అనే భావన రగులుతుంటుందో, ఇక అయిపోయినట్టే, అది ఎప్పటికీ పోదు. కాని, ఎప్పుడైతే అది ఒక బలహీనతకు, ఆత్మన్యూనతా భావానికి, అహంకారానికి, సంకుచిత మనస్తత్వానికి, అన్నింటిని మించి అత్యల్ప భావజాలానికి, అల్పమనస్సుకు సంకేతమని అర్థం కావడం మొదలవుతుందో, అప్పుడు దానితో నీవు తలపడవచ్చు. అయితే నీ ఆలోచనా సరళి అందుకు అనుగుణంగా సాగాలి. నీ వైఖరి, “నేను నొప్పించబడ్డాను, నేను బాధపడుతున్నాను. ఎంత బాధపడుతున్నానో కనబరుస్తాను” అనే విధంగా వుంటే, అది అలాగే వుంటుంది. ఒక గుప్త ప్రతీకార వాంఛతో రగిలిపోతూ “నన్ను వారు బాధించారు కనుక నేను వాళ్లను బాధిస్తాను” అనే వారి గురించి నేను ప్రస్తావించను. ఇది ఎంత లేకి విషయమంటే చూసేవారెవరూ ఇష్టపడరు. అయితే దీనిని నిగ్రహించటం ఎల్లప్పుడూ సులభం కాదు. నీచమనస్తత్వానికిది సూచన. అది అంత సున్నితమైనదే కావచ్చు.

అత్యంత భావోద్రేకంతో కూడినదే కావచ్చు, తీవ్రమైనదే కావచ్చు కాని చాలా అల్పమైనది. అది తిరిగి ఆ వ్యక్తినే నష్టపరుస్తుంది.

ఏది ఏమైనా నీకు సరియైన వివేచనా జ్ఞానం ఉన్నట్లయితే, దానిని వుపయోగించి అసలైన సత్యాన్ని నీకు నీవే తెలుసుకోగలవు. నీ అస్తిత్వంలోని అహంకారమే ఎప్పుడూ బాధ చెందేది. ఆ అహంకారమే లేనట్లయితే, అసలు బాధ అనేదే వుండదు. ఆధ్యాత్మిక జీవనాన్ని ఆకాంక్షించేవారెవరైనా అహాన్ని అధిగమించగలగాలి. అందుకు, ముందుగా చేయవలసినది, ఆ భాధను తిన్నగా పరిశీలించాలి. అది యే మేరకు అల్పమైన అహంభావ వైఖరి వలన కలిగిందో గమనించాలి. అటు పిమ్మట దానిని శుభ్రంగా తుడిచివేసి మాలిన్యం లేకుండ చేసి, "నాకు ఈ మలినం వద్దు. నా అంతరంగ ఆవాసాన్ని శుభ్రపరచుకుంటాను" అని అనుకోవాలి.

*

నేను నీకు చెప్పేది: బాధను పెంచి పోషించకు. అప్పుడే అది నిన్ను పూర్తిగ వదిలేది. పురోభివృద్ధి సాధించటానికి బాధ యొక్క ఆవశ్యకత అసలు లేదు. ఒక అచంచలమైన, ఆహ్లాదభరితమైన సమభావంతో గొప్ప పురోభివృద్ధి సాధ్యమౌతుంది.

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి జానకి

ఈ అస్తిత్వాన్ని, నీ పురోభివృద్ధిని దివ్య చైతన్య సంరక్షణలో నుంచినట్లయితే, ప్రశాంతత నీ హృదయములో స్థిర పడుతుంది, సమస్యలన్నీ పరిష్కరించబడతాయి.

శ్రీమాత

శారీరక బాధలు — మూడు దశలు

శారీరక బాధలు? మీకు తెలుసు, ఒక విషయం మాత్రం నిశ్చయం. బాధ దాని పద్ధతిలోను, స్వభావంలోను ఒక సూచనగా కనిపెట్టబడింది. ఎందుచేతనంటే, ఉదాహరణకి శరీరాన్ని, ఏదో విధంగా సంరక్షించుకోనప్పుడు దాని వల్ల ఏమాత్రం బాధ కూడ కలగకపోతే, మనిషి తన సంరక్షణా లోపాన్ని గమనించి సరిచేసుకోడానికి ఎప్పుడూ ప్రయత్నించడు. బాధపడతాడు కాబట్టి ఆ దుఃఖాన్ని లేక అనారోగ్యాన్ని నివారించుకోడానికి ఆలోచిస్తాడు. అది ఇబ్బందికరంగా లేనట్టయితే దాని నివారణ కోసం అసలు ప్రయత్నమే చెయ్యడు. కనుక ప్రకృతి వ్యవస్థలో శారీరక బాధ యొక్క ప్రాథమిక కార్యం హెచ్చరిక చేయుట అని అనుకుంటాను.

దురదృష్టవశాత్తూ ఈ విషయంలో ప్రాణికం కలగచేసుకొని, ఆ బాధని పెంచి, మలుపులు తిప్పి తీవ్రతరం చేయడంలో ఒక వికృతానందాన్ని పొందుతుంది. దాని వల్ల మొత్తం వ్యవస్థ విధానమే మారిపోతుంది. ఒక సూచికగా పని చెయ్యడానికి బదులు కొన్నిసార్లు, అనారోగ్యాన్ని, అవతలవారి సానుభూతిని, జాలిని పొందడానికి, వారిలో ఆసక్తిని కలుగ చేయడానికి అవకాశం కల్పించి, అనారోగ్యాన్ని ఆనందించేటట్టు చేస్తుంది. ప్రాణికం నుంచి వచ్చే అన్ని రకాల అనుభవాలు, ఒకదాని కంటె ఒకటి అసహ్యం కలిగించేవిగా ఉంటాయి. కాని అసలైనదిదే అనుకుంటాను: "జాగ్రత్త పడు!" ఇదొక ప్రమాదసూచిక లాంటింది. "జాగ్రత్తపడు, ఏదో గాడి తప్పినట్లుంది".

*

మనం బాధని ఎలా ఓర్చుకోవాలో, దానిలో ఆనందాన్ని ఎలా పొందాలో చెప్పడానికి శ్రీమాత వేదనానుభవం ద్వారా తెలిపారు. వారి బోధనా పద్ధతిలో మూడు దశ లున్నాయి. మొదటిది సహనం, రెండవది ఆత్మసమతుల్యత, మూడవది పారవశ్యకత

నైతిక విషయాలకు సంబంధించినంత వరకు ఇది నిస్సందేహంగా స్పష్టము, వివాదరహితము. నైతిక బాధలన్నీ మన శీలాన్ని తీర్చిదిద్దుతాయి. మనలను తిన్నగా పారవశ్య స్థాయికి చేరుస్తాయి. అయితే వాటిని ఎలా స్వీకరించాలో తెలిసినప్పుడు. కాని శరీరం విషయానికొస్తే, బాధని ఎలా ఓర్చుకోవాలో మనిషి శరీరానికి శిక్షణ యివ్వగలిగినట్టయితే, తీవ్రత తగ్గి, సమసిపోతుందని వైద్యులు చెప్పడం నిజమే. ఇది ఒక ప్రత్యక్ష ఫలితం. అయితే శరీరానికి బాధ కలిగేసరికల్లా ఏదో జరగరానిది

జరిగినట్టు తల్లక్రిందులవడానికి బదులు దానినెలా ఓర్చుకోవాలో తెలుసుకొని, మౌనంగా, నిశ్శబ్దంగా భరించి సమతుల్యత పాటించేవారి విషయంలో శరీరం ఆ బాధని ఓర్చుకోగలిగినట్టు, విచ్ఛిన్నం గాకుండా ఉండగలిగే శక్తి ద్విగుణీకృతమైనట్టు కనిపిస్తుంది. ఇది ఒక గొప్ప సిద్ధి అనవచ్చు. ఒక ఆచరణాత్మక బాహ్యదృష్టితో నేను ఈ ప్రశ్న వేసుకుంటే, నాకు ఈ విధంగా అనిపించింది. లోలోపల నాకు పలు సార్లు అవగాహన కలిగింది. చిన్న చిన్న అనుభవాలతో తెలిసింది. బాధకి తోడు భయం, ఆదుర్దా లేనట్టయితే శరీరం మనం అనుకున్నదాని కంటె ఎక్కువగానే ఓర్చుకోగలదు. మానిసికాంశాన్ని విడిచిపెట్టినట్టయితే, శరీరాన్ని దాని పాటికి దాన్ని స్వేచ్ఛగా వదిలినట్లయితే దానికి ఏం జరగబోతున్నదోననే భయంగాని, వత్తిడిగాని, ఆదుర్దాగాని వుండవు. తీవ్రబాధగా కూడా అనిపించదు. ఎంత బాధనయినా సునాయ సంగా తట్టుకుంటుంది.

రెండవ పద్ధతి: చూడు. శరీరం ఓర్చుకోడం తప్పదనుకున్నప్పుడు, ఓర్చుకోడా నికే స్థిరనిశ్చయం చేసుకుంటుంది. వెంటనే ఆ బాధ తాలుకు తీవ్రత ఎంత గరిష్ట స్థాయిలో వున్నా అంతా మటుమాయమయిపోతుంది. ఇప్పుడు నేను చెప్తున్నదంతా భౌతిక పదార్థపరంగానే. మీరు ప్రశాంతంగా వున్నట్లయితే — ప్రశాంతత అంటే అంతరంగ ప్రశాంతత కావాలి. మీకు అంతరంగ ప్రశాంతత వున్నట్లయితే ఆ నొప్పి మాయమై ఆనందానుభూతిగా మారిపోతుంది. మామూలు అవగాహనలోని 'హాయి' కాదు. కాని చాలా వరకు సౌకర్యవంతంగా అనిపించే అనుభూతి కలుగు తుంది. ఇప్పుడు కూడా నేను మాట్లాడుతున్నది స్వచ్ఛమైన భౌతిక పదార్థపరంగానే.

ఇక చివరి దశ: భగవత్సమక్షంలో విశ్వాసం శరీరకణాలలో వున్నప్పుడు, సర్వా తిశయి అయిన దైవసంకల్పం పట్ల విశ్వాసం వున్నప్పుడు, 'అంతా మంచికే' అన్న నమ్మకం వున్నప్పుడు, పారవశ్యం కలుగుతుంది. ఈ విధంగా శరీర కణాలు తెరుచుకుంటాయి — ఎంతో ప్రకాశవంతంగా, పరవశంగా. అది నాలుగు దశలుగా చేస్తుంది. ఇక్కడ కేవలం మూడింటి గురించే ప్రస్తావించడం జరిగింది. నాలుగవది ప్రతివారికీ అందుబాటులో వుండదు. కాని మొదటి మూడు అందుబాటులో వుంటాయ న్నది స్పష్టమైన ప్రత్యక్ష నిదర్శనం. అది ఆ విధంగా వుంటుందని నాకు తెలుసు.

శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

బాధాతప్త హృదయాలలో తిరిగి ఆశను రేకెత్తించే కొన్ని పుటలు

నేను ముగించబోయే ముందు, ఇప్పటికే వాస్తవంగా ఫలించని ప్రయత్నాలు చేసివున్న వారినీ, సాధనాపథంలో ఊహించలేనటువంటి ఆపదలపాలై తమ అసమర్థతా ప్రామాణికతను ఎరిగినవారినీ, తమ ఆత్మవిశ్వాసాన్ని, స్థైర్యాన్ని కోల్పోయే ప్రమాదకర పరిస్థితిలో ఉన్నవారినీ ఉద్దేశించి కొన్ని పుటలను కేటాయిస్తున్నాను. ఈ పుటలు, ఒక ఆధ్యాత్మిక కార్యకర్త పరిశుద్ధతాగ్ని జ్వాలలను పోలిన అన్ని విధములైన విషమ పరీక్షలు ఒకానొకప్పుడు తన మీద ముప్పేట దాడిచేస్తున్న సమయాన, బాధాతప్త హృదయములైనవారిలో తిరిగి ఆశను రేకెత్తించటానికి ఉద్దేశించి వ్రాసినవి.

అలసిపోయి, నైరాశ్యంలో కూరుకుపోయి, కముకు దెబ్బలతో గాయపడి క్రింద పడిపోయిన ఓ మనిషీ, నీవు ఓడిపోయానని అనుకుంటున్నావా, ఇదిగో, ఒక స్నేహితుడి మాటల నాలకించు. అతడికి నీ కడగండ్లు తెలుసు, అతడు వాటిలో పాలు పంచుకున్నవాడు, అతడూ నీవలెనే ఈ ఐహికమైన ఈతిబాధలను అనుభవించినవాడే, నీవలెనే ఈ జీవనసమరంలో ఎన్నో మరుభూముల గుండా పయనించినవాడే. అతడికీ ఆకలిదప్పులు, ఒంటరితనం, వెలివేయబడటం, కోరిక లన్నింటి నిరాకరణ, నిరాదరణతో దారితెన్నూ కానరాని హృదయవిదారత తెలుసు. ఓ బాధితుడా, అతడు సైతం సందేహపు అనిశ్చితులు, తప్పులు, అపరాధాలు, వైఫల్యాలు, అన్ని విధములైన దౌర్బల్య క్షణాలను ఎరిగినవాడే.

కాని అతడు నీకు చెప్తున్నాడు: ధైర్యమును కలిగి ఉండు! ప్రతిరోజు ప్రాతః సమయాన ఉదయించే సూర్యుడు తన మొదటి కిరణాలతో భూమికి అందించే బోధల నాలకించు, అది ఆశను పురికొల్పే పాఠం, ఉపశమన సందేశం.

రోదిస్తూ, బాధలతో వణికిపోతూ, తమ కష్టాల కడగండ్లకు ముగింపును కలలోనైనా ఎంతమాత్రం ఊహించ ధైర్యం లేనివారందరికీ నా విన్నపం, మీ మానసిక వ్యధకు పరిష్కారం ఉందనే విషయం గమనించండి: ఉషోదయంలేని రాత్రి లేదు, అంధకారం కటిక చీకటై గాఢమైనప్పుడే పగలు ప్రకటితమౌతుంది; అరుణ భాస్కరుడు పటాపంచలు చేయలేని పొగమంచు లేదు, బంగారు వర్ణం సంతరించుకుని ధగధగ మెరియని మేఘం ఉండదు, కన్నీరు ఇంకి ఎండిపోని రోజు లేకుండా ఉండదు, కుంభవృష్టి

తరువాత తన విజయకేతనంగా మెరిసే రంగుల హరివిల్లు లేకుండా ఏ తుఫానూ ఉండదు; కరిగిపోకుండా ఉండే మంచుగడ్డ ఉండదు, అంతేకాదు వైభవకాంతులతో వసంత ఋతువుగా మారని గ్రీష్మఋతువు వుండదు.

నీకు కూడా, స్వర్గసుఖమును వెంటనిడుకుని రాని ఆవేదనాపూరిత వ్యథ ఏదీ ఉండదు, సంతోషంగా మార్చవీలు లేని క్లేశమేదీ ఉండదు, ఓటమి గెలుపుగా మారకుండా ఉండదు, అధఃపతనం ఊర్ధ్వగమనంగా మారకుండా ఉండదు. అంతేకాదు, ఒంటరితనం జీవనకోలాహలం మధ్య కాంతులీనుతూ మారకుండా ఉండదు. అంతకు మించి అభిప్రాయ భేదం సామరస్యతగా మారకుండా ఉండదు — ఒక్కొక్కప్పుడు మనసుల మధ్య మనస్పర్థలు రెండు హృదయాల మధ్య సంభాషణకు దారితీస్తాయి; చివరగా, దార్ఢ్యంగా మార్చ వీలులేని ఏ అపరిమిత బలహీనత ఉండబోదు. చెప్పాలంటే అత్యంత బలహీనతలోనే సర్వశక్తిమంతం తనను తాను బహిర్గతం చేసుకోవటానికి ఎంచుకుంటుంది.

ఓ నా ప్రియశిశువా, ఆలకించు, ఈ రోజు నీవు ఎంతో క్రుంగిపోయి ఉన్నావు, ఎంతో పతనమై ఉన్నావు, నీ కంటూ ఏమీ మిగలలేదు, నీ దీనావస్థను, నీ ఆభిజాత్యాన్ని ఉత్తేజపరచేది ఏదీ అందుబాటులో లేదు: ఇంతకు ముందెన్నడూ నీ వింత గొప్పగా లేవు! ఎవరైతే లోతులను తాకుతారో వారే అత్యున్నత శిఖరాగ్ర సమీపానికి చేరగలరు, ఆ లోతు ఎంత అగాధమైతే, అంత ఎక్కువగా ఉన్నత శిఖరాలు తమను తాము బహిర్గతం చేసుకుంటాయి!

బ్రహ్మాండమందున్న మహోన్నతమైన దివ్యశక్తులు అత్యంత పారదర్శకమైన పదార్థపొరల గుండా తమ కిరణాలతో చొచ్చుకుపోయే ప్రయత్నం చేస్తాయనే విషయం నీకు తెలుసా! ఆ అత్యంత అస్పష్టమైన, ఏ మాదిరిగా కావాలంటే ఆ మాదిరిగా మలచుటకు వీలైన పదార్థమునకూ, సర్వోత్కృష్ట ప్రేమకూ ఏమి ఆ ఆదర్శ వివాహం! ఆ అత్యుత్తమ అద్భుత ప్రకాశం కొరకు ఆ ఛాయాపరితాపం ఇంతింతని చెప్పతరమా!

విషమ పరీక్షలు లేదా అపరాధ సహస్రములు నిన్ను బలంగా తొక్కివేయగా, నీవు బాధలనే నరకప్రాయమైన పాతాళపు లోతులలో కూరుకుపోయినప్పుడు, దుఃఖించవలదు — అక్కడ తప్పక దివ్యప్రేమ, పరమానుగ్రహం నిన్ను చేరగలదు! ఎందువల్లనంటే పరిశుద్ధి గావించే రోదనాభరిత కఠోర విషమ పరీక్షలను నీవు అనుభ

వించావు, మహిమాన్వితమైన ఆరోహణలు నీ సొంతం.

నీవు దిక్కుతెలియని నట్టనడి ఎడారిలో ఉన్నావు: అప్పుడు నిశ్శబ్దపు వాణులను ఆలకించు. నీవు ఎక్కువగా ఆరాటపడుతూ కోరుకునే పొగడ్తల మాటలూ, బాహ్య హర్షధ్వానాలు నీకు శ్రవణానందం కలిగించాయి, కాని నిశ్శబ్దవాణులు నీ ఆత్మకు సంతోషం కలిగిస్తాయి, దివ్యసమరస సంగీతాలాపనల ప్రతిధ్వనులను నీ అంతరంగంలో మేల్కొలుపుతాయి!

నీవు గాఢాంధకారపు అగాధాలలో నడుస్తున్నావు: అటువంటప్పుడు ఆ చీకటిలోని అమూల్య రత్నఖచిత రాసులను ప్రోదిచేసుకో. మెరిసే సూర్యకాంతిలో మేధోదారులు ప్రజ్వలించబడతాయి, కాని కాళరాత్రి కాంతులలో గుప్త ఆధ్యాత్మిక వైభవముల నందించే పరిపూర్ణతాదారులు దాగి ఉంటాయి.

నీ నుంచి సమస్తమూ హరించివేయబడింది, బికారిగా మిగిలావు! అదే సమృద్ధికి మార్గం. నీ కంటూ ఏమీ మిగలనప్పుడు, సమస్తమూ నీకు ఇవ్వబడుతుంది. కారణం, చిత్తశుద్ధితో, నిజాయితీతో ఉండేవారికి, అత్యధికమైన కీడు నుంచే ఎల్లప్పుడూ అత్యుత్తమమైన మేలు సంప్రాప్తిస్తుంది.

భూమిలో నాటబడిన ప్రతి గింజా వేల సంఖ్యలో గింజలను ఉత్పత్తి చేస్తుంది. శోకార్తితో రెక్కల నాడిస్తూ నింగిలో పైకెగిరే ప్రతిసారి వైభవసీమల ఎత్తులకు పైకెగిరి పోవటమే కాగలదు.

కనికరమనేది లేకుండా విడువకుండా శత్రువు వెంటాడుతుంటే, నాశనం చేయడానికి అతడు వేసే ప్రతి ఎత్తుగడా ఆ మనిషిని ఇంకా ఉన్నతుడిని చేస్తుంది.

ఇటు చూడు, ఊర్ధ్వలోకాల కథను ఆలకించు: బహుశా, శత్రువు గెలవబోతు న్నట్లున్నాడు. కాళరాత్రిలోకి కాంతిజీవులను విసిరివేస్తున్నాడు. అప్పుడు కారుచీకటి సమస్తమూ నక్షత్రాలతో నిండిపోయింది. అతడు విశ్వకార్యకలాపాలపై క్రోధంతో రెచ్చిపోతున్నాడు, ఖగోళ సామ్రాజ్యం సమగ్ర ఉనికిని అతడు గర్హిస్తున్నాడు, దాని సామరస్యతను చిందరవందర చేశాడు, ముక్కలు చెక్కలు గావించాడు. దాని ధూళిని బ్రహ్మాండంలోని నాలుగు చెరగులా చెదరగొట్టాడు, కాని అదిగో అటు చూడు! ఆ ధూళి బంగారు బీజమైంది, బ్రహ్మాండాన్ని ఫలవంతం చేసింది, అది మరింత విశాలమైన వలయాకార వృత్తంలో ప్రజలతో నిండి జనలోక సంద్రమైంది, ఇప్పుడది శాశ్వత కేంద్రం చుట్టూ మరింత విశాలమైన వలయాకార వృత్తంలో

స్థిరంగా తిరుగుచున్నది — కనుక విభజన సైతం సమృద్ధిని, గాఢ ఐక్యతను సృజించగలదు, భౌతిక విశ్వాల ఉపరితలాలను లెక్కకు మిక్కిలి చేయడం మూలంగా, దేనినైతే అది నాశనం చేయాలనుకుందో అది మరింత బృహత్తర సామ్రాజ్యమైంది.

సర్వమునకు ఆధారమైన ఆద్యగ్రహగోళం అపారత ఒడిలో లాలించబడుతూ సాగిన జోలపాట ఎంత మధురమైనదోకాని దానిని మించి నభోవీధిన గ్రహగోళ సముచ్చయ సంగీతంతో నక్షత్రరాసుల సంగీత విభావరియై, గెలుపును సూచించు శాశ్వత స్తుతిగా స్వర్గమును నింపు విజయోత్సాహపు ఆ అపారగళ కీర్తన ఇంకా ఎంత మాధుర్యము!

ఇంకా విను. ఇక్కడ కూడా, భూమి మీద దివ్యమూలముల నుంచి వేరైపోయిన మానవుని స్థితిని మించిన అపాయకర స్థితి మరెక్కడా ఉండదు. అతని మీద ప్రత్యర్థుల అన్యాయాక్రాంత ప్రతికూల సీమలు విశాలముగా పరచుకుని ఉన్నవి, అతని ఆసీమాంతర రేఖ ద్వారముల వద్ద మెరిసే విచ్చుకత్తులతో జైలు అధికారులు కాపలా కాస్తున్నారు. ఆ విధముగా అతడు ప్రాణాధిక మూలానికి పైకి ఎక్కలేని పరిస్థితిలో, ఆ మూలాధారమే అతనిలో పైకి లేచింది; అతడు తన పైనుంచి వెలుగును అందుకోలేని పరిస్థితిలో, ధగద్ధగాయమానమైన వెలుగు ఆతని అస్తిత్వం మధ్యలో ప్రకాశించింది; అతడు అతీత ప్రేమతో భాషణమును సల్పలేని కారణంగా, ఆ ప్రేమే తనకు తానుగా పూర్ణాహుతిగా నివేదించుకుని, ప్రతి భూలోకవాసిని ఎంచుకుని, ప్రతి మానవ ఆత్మలో తాను వసించుతూ, దానిని పవిత్ర దేవాలయంగా చేసుకున్నది.

ఆ విధంగా, తృణీకరించబడి, పాడుబడినప్పటికీ, ఫలవంతమై, అనుగ్రహించబడిన పదార్థంలో, ప్రతి అణువులో దైవం దివ్య ఆలోచనను, ప్రతి జీవిలో దైవం దివ్యనివాసమును ధరించి ప్రవర్తిల్లుతుంటుంది. ఈ విశ్వమంతటిలో ఏ జీవికీ మనిషి కున్నటువంటి దార్ఢ్యతలేని పెళుసుదనం లేకపోతే, అతనిలాగా దివ్యమైనది కూడా ఏదీ లేదు!

ఇదే సత్యం, ఇదే సత్యం, కుంచించుకుపోయే అవమానభారంలోనే మహిమాన్వితమైన ఉచ్ఛస్థితి యొక్క శైశవదశ ఇమిడి ఉన్నది.

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ప్రగాఢమైన దుఃఖం ఆవరిస్తే...

ఎప్పుడైనా ప్రగాఢమైన దుఃఖం, ఒక తీవ్రమైన సందిగ్ధత, ఒక దుర్భరమైన బాధ నిన్ను ముంచెత్తి నిరాశా నిస్పృహలకు గురిచేసినప్పుడు నీ ప్రశాంతతను, నిశ్చలతను తిరిగి పొందేందుకు నిర్దిష్ట మార్గం ఒకటి ఉంది.

నీ అస్తిత్వపు లోతుల్లో ఒక జ్యోతి, తన దేదీప్యమానమైన వెలుగుకు దీటైన పవిత్రతగల జ్యోతి, ప్రకాశిస్తుంది. అది ఒక కాంతి. భౌతిక ప్రపంచాన్ని తేజోమయం చేసి, వుత్తేజపరచి పెంచి పోషించే విశ్వేశ్వరుని సజీవ చేతనలోని భాగం; ఆతని ధర్మాన్ని ఇచ్ఛాపూర్వకంగా శ్రద్ధాసక్తులతో పాటించగోరేవారికి శక్తివంతమైన మార్గదర్శి; ఆతనిని చూసి, ఆతని ఆదేశాన్ని విని, ఆతనికి ఆజ్ఞాబద్ధులై తరించగోరే వారందరికి ప్రేమభరితమైన ఓర్పుతో, ఆదుకోవాలనే ఆర్తితో నిండిన సహాయకుడు. ఆతనియందు శ్రద్ధాసక్తులతో కూడిన అచంచలమైన ఆకాంక్ష ఎప్పటికీ వృధా కాదు. బలీయమైన వినయవిధేయతలతో కూడిన విశ్వాసం యెప్పటికీ వమ్ము కాదు, ఆశించినది అంద కుండా పోదు.

అయితే సంకట పరిస్థితు లెన్నడూ అభిలషణీయం కాదు, అనివార్యమూ కాదు. కాని అది ఎదురైనపుడు అది చేసే మేలు ఇంతింత అనరాదు.

మన హృదయం ముక్కలయ్యే పరిస్థితి వచ్చిన ప్రతిసారీ మనలో నూతన ద్వారాలు తెరచుకుంటాయి. అంతకు ముందు అనుభవించని సంపదలు మన వవుతాయి. పతనపుటంచులలోనే బంగారు వాకిళ్ళు తెరచుకుంటాయి. జీవితానికి నూతన శోభలు చేకూరుతాయి.

ఇలాంటి పరిస్థితులు ఒకదాని వెంట మరొకటి ఎదురై, అంతవరకూ, నిన్ను మరుగున వుంచిన తెరలు తొలగిపోయినపుడు, ఓ ప్రభూ! యావత్తు సత్తనూ జ్యోతిర్మయం చేసేందుకు ఉరకలు వేస్తూ వచ్చే ఆ వెలుగునూ, జీవితం అంతటినీ పరిశుద్ధపరచి రూపాంతరం చేసేందుకు ముంచుకువచ్చే ప్రగాఢమైన ప్రేమను ఎవరు వర్ణించగలరు.

శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు

దైవం వైపు పుణ్యయాత్ర

చిరంతనుని ఆలోచనను నీ నుండి నీ మానస తేజస్సు దాచిపెడుతున్నది.
చిరంతనుని సంకల్పాన్ని నీ నుండి నీ హృదయగత ఆశారేఖలు దాచిపెటుతున్నవి.
ఈ ప్రపంచ సుఖాలు నీ నుండి అమృతుని ఆనందాన్ని దూరం చేస్తున్నవి.
ఒక చీకటి దేవత అవసరం ఏర్పడింది
ఈ లోకపు భయానక గురువు, స్రష్ట, బాధ.
అజ్ఞాన మెక్కడ వుందో అక్కడ బాధ వచ్చి తీరుతుంది.

*

మానవ హృదంతరాలలో, కాలం గుప్త హృదయసీమలో
ఒక నిగూఢ చీకటి దుష్టత్వం దాగి వుంది.
భగవంతుని సృష్టిని మార్చి, విధ్వంసం చేసే
హక్కు నాకు వుందని అది ప్రగల్భాలు పలుకుతోంది.
ఈ ప్రపంచ పురోగతి వెనుక ఒక రహస్య శతృత్వం పొంచివున్నది.
ఆలోచనపై, వాక్కుపై, కార్యసరళిపై తన
ప్రగాఢ ప్రభావ ముద్రను వేసింది. మానవుల,
మహాపురుషుల సత్కార్యాలపై చెరగని మచ్చను, లోపాన్ని ముద్రిస్తున్నది.
దానిని నాశనం చేసేంతవరకు ఈ భూమిపై శాంతి దొరకదు.

*

మానవహృదయాన్ని, దుష్టత్వానికి ఏవో గుసగుసలు పురికొల్పుతాయి.
వివేకనేత్రాలను, ఆత్మవీక్షణాన్ని అవి మూసివేస్తాయి
మన దుఃఖాలకు అవే మూలకారణం
అవే భూమిని బాధకు, ఉత్పాతానికి బంధిస్తాయి.

*

ఓ మానవా,
ఈ మహనీయ ప్రపంచపు బాధా నియతిని భరించాలి సుమా!
ఒక బాధాగ్ని, ప్రపంచంలో నువ్వు భారంగా
ప్రయాణిస్తున్నప్పుడు, నీ ఆత్మకు ఆధారంగా

స్వర్గలోకపు శక్తిపై నిలబడడం నేర్చుకో
మహోన్నత సత్యం వైపు తిరుగు,
ప్రేమ, శాంతి కోసం ఆకాంక్షించు
ఉన్నత భూమికల నుండి కొద్దిగా ఆనందం నీ వైపు ప్రవహిస్తుంది.
నీ మర్త్య దినాలపై ఒక దివ్యస్పర్శ.
నీ దైనందిన జీవనమార్గాన్ని ఒక పుణ్యయాత్రగా మార్చుకో.
చిరుసుఖాలు, దుఃఖాల గుండా నువ్వు భగవంతుని వైపు కదులుతావు.

(సావిత్రి : 443, 447, 448, 451) శ్రీఅరవిందులు

అనువాదం కె. యజ్ఞన్న

ఆలోచనలు, మెరుపులు

25: దురదృష్టం నన్ను వరించిందని నేను పరితాపం చెందినప్పుడు, అది ఒక దుష్టత్వం అని భావించినప్పుడు, అసూయతో మండి, నిరాశోపహతుడినైనప్పుడు, నాకు తెలుసు నాలో మళ్లీ ఒక చిరంతన అవివేకి నిద్ర లేచాడని.

35. ఓ దురదృష్టమా! నువ్వు ఆనందానివి. నీ ద్వారా నేను నా ప్రియతమ దైవవదనాన్ని చూశాను.

135. వ్యాధులన్నీ నూతన ఆరోగ్య, ఆనందాలకు సాధనాలు. బాధ, దుష్టత్వం అనేవి ఆనందం, మంచితనం వైపు ప్రకృతి తిరగడమే. మరణం సువిశాల అమృతత్వం వైపు తెరచుకొన్న గవాక్షం. ఏమిటిదంతా, ఎందుకిలా జరుగబోతోంది అన్న ప్రశ్న భగవంతుని నిగూఢ గుప్త రహస్యం. అహంకార వివర్జితమైన పవిత్ర ఆత్మ మాత్రమే ఆ రహస్యం తెలుసుకొనగల్గుతుంది.

522. భగవంతుడు మనల్ని ప్రతి నందనవనంనుండి గెంటి వేస్తాడు. ఎడారుల గుండా అంతకన్నా దివ్యమైన స్వర్గానికి ప్రయాణించేటట్లు ఒత్తిడి చేస్తాడు. ఎడారి లాంటి, అగ్ని సదృశమైన ఆ విరామం ఎందుకు అని నువ్వు ఆశ్చర్యపోతావు. నీ మనసు నిన్ను అవివేకిని చేస్తుంది. వాటి వెనుక ఉన్న ఆత్మను నువ్వు అధ్యయనం చేయలేదన్న మాట. ఆత్మ మసక కాంక్ష లేమిటో, రహస్య ఆనందాలేమిటో నువ్వు అధ్యయనం చేయలేదు.

501. అయినా, బాధ కోసం అన్వేషించకు ఓ మానవాత్మా! అది భగవంతుని సంకల్పం గాదు సుమా! ఆయన ఆనందాన్ని మాత్రమే అన్వేషించు. నీ కెంతవరకు అవసరమో అంత మేరకు బాధ నీకు దైవికంగా, తరుచూ వచ్చి తీరుతుంది. ఆ బాధను భరించి, బాధ కేంద్రంలోని ఆనందాన్ని తెలుసుకో.

470. భగవంతుడు నా నుండి ఎన్నో ఉపసంహరించాడు. ఆయన ప్రేమతో, వివేకంతో ఆ పని చేశాడు. మొదటే నాకు అది తెలిస్తే, మంచిని విషంగా మార్చివేసి వుందును. కాని మనం గట్టిగా పట్టుపడితే విషమే ఇస్తాడు. మనం అప్పుడు దాని నుండి విముఖులమై జ్ఞానసంపన్నులమై అమృతధారల్ని గ్రోలుతాము.

137. సృష్టిలో సంస్పర్శ వల్ల బాధకాని, సుఖంగాని కలుగుతుందని కఠోర శాసనం ఏదీ లేదు. మన మనశ్శరీరాలపై బ్రహ్మం నుండి వచ్చే వత్తిడిని, వేగాన్ని ఆత్మ కలుసుకొనే పద్ధతి అది, వెలుపల నుండే రెండు ప్రక్రియలను నిర్ధారించడం అది.

138. వెలుపల నుండి ఒకే శక్తిని నీ ఆత్మశక్తి కలుసుకోవడంవల్ల మనశ్శరీరాల అనుభవాల దృష్ట్యా కలిగే స్పర్శలోని గుణాలను సామరస్యీకరణం చేయడం జరగదు. అందువల్ల నీకు బాధ, దుఃఖం, మానస ఆందోళన కలుగుతాయి. ప్రపంచశక్తి అడిగే ప్రశ్నలకు నీలోని శక్తి ఇచ్చే జవాబులకు సర్దుబాటు చేసుకోగలిగితే, బాధ ఆనందంగా మారుతుంది. సక్రమ అనుబంధం ఆనందానకి హేతువు. ఆనందానికి హేతువు మూలం 'ఋతం'.

177. పరిపూర్ణ విశ్వదర్శనం, పరిపూర్ణ విశ్వ మనోభావన వల్ల తప్పులు, బాధ చెరిగిపోతాయి. కాని చాలామంది తమ అహంకార వృత్తాన్ని మరింత విస్తృతం చేసుకొంటారు.

285. నీ మనశ్శరీరాలు కృంగుబాటుకు, బలహీనతకు గురి అయినప్పుడు — "నేను సోమదేవుణ్ణి, సూర్యదేవతను. నేను అతి పవిత్రమైన, అజేయమైన అగ్నిదేవతను. గగనంలో శక్తిమయుమై ఎప్పుడూ ప్రజ్వరిల్లే భానుబింబాన్ని" అని అనుకో.

278. నువ్వు భగవంతుని సైనికుడవి, వీరుడవి. నీ కెందుకు బాధ లుంటాయి? నిన్నెవరు అవమానిస్తారు, బాధిస్తారు? నీ జీవితం ఒక మహోజ్వల మహస్సు, నీ చర్యలు పవిత్రాభిషేకాలు, విజయం దైవత్వ మహిత్వానికి ఆరోహణ, ఓటమి నీ విజయసోపానం.

శ్రీ అరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న



ఈ సంచికలో
శ్రీఅరవిందుల రచనలలో
స్వామి వివేకానంద, శ్రీరామకృష్ణుల ప్రసక్తి

అఖిల

అఖిల భారత పత్రిక – మే 2013

శ్రీఅరవిందుల రచనలలో
స్వామి వివేకానంద, శ్రీరామకృష్ణుల ప్రసక్తి

షికాగో విశ్వమత మహాసభలలో 11 సెప్టెంబరు 1893 న
స్వామి వివేకానందుని విజయ శంఖరావము 110 వ వార్షికోత్సవము

జైలులో ఏకాంత ధ్యానంలో నిమగ్నమై ఉన్నప్పుడు 15 రోజులపాటు నాకు వివేకానందుని వాణి వినిపిస్తూ ఉండేది. ఆయన నా చెంతనే ఉండి ఒక అతి ముఖ్యమైన ఆధ్యాత్మికానుభూతిని గూర్చి మాట్లాడారు. ఆ విషయం గురించి చెప్పవలసినదంతా చెప్పి ఆ వాణి ఆగిపోయింది.

శ్రీఅరవిందులు



రెండు పక్షుల కథ


[ఇది ఉపనిషత్తులలోని హితోపదేశ కథ. స్వామి వివేకానందుడు ఈ కథను ఆధ్యాత్మిక పరంగా అనేక సందర్భాలలో ప్రస్తావించారు. శ్రీఅరవిందులు ఈ కథను భారతీయుల్లో జాతీయస్ఫూర్తి రగల్చటానికి మొదట బరిపూరులో (పశ్చిమబెంగాల్) 12-4-1908 న స్వదేశీ సమావేశంలో ఉదహరించారు. తరువాత వందేమాతరం పత్రికలో కూడా ప్రస్తావించటం జరిగింది.]

ఒక పెద్ద చెట్టు వుంది. ఆకులతో, కాయలతో కళకళలాడుతూ కన్నుల పండువుగా వుండేది. ఆ చెట్ల కాయలు కొన్ని తీయగాను, కొన్ని చేదుగాను వుండేవి. ఆ చెట్టు మీద రెండు పక్షులు వుండేవి. ఒకటి ఎగుగభాగలోను, రెండవది దిగువభాగంలోను వుండేవి.

క్రిందిస్థాయిలో వున్న పక్షి నిరంతరం పైస్థాయిలో వున్న పక్షిని పరిశీలిస్తూ వుండేది. దాని అందచందాలు చూచి మురిసిపోతుండేది. ఔన్నత్యానికి అబ్బురపడేది. అదే తన ఉన్నతాత్మ, పవిత్రాత్మ, పరమాత్మ అని భావించేది. తానూ ఆ స్థాయికి ఎదగాలని, అంతటి ఔన్నత్యం పొందాలని ఆశించేది, ఆరాటపడేది.

అయితే ఆ చెట్టుకున్న తీపిపళ్ళు తినగానే తీయదనం మైకంలో, మాయలో పడిపోయి మార్గదర్శకుణ్ణి మరిచిపోయేది. తాను — తన లోకంగా వ్యవహరించి, వాస్తవస్థితికి దూరమయ్యేది. మళ్ళీ చేదుపళ్ళు తినగానే మాధుర్యపు మాయాజాలం దిగిపోయి మామూలు స్థితికి వచ్చేది. తానెవరో, తన పరిస్తితేమిటో తెలుసుకొని పశ్చాత్తాపపడేది. కథ మళ్లీ మొదటికి వచ్చేది. ఉన్నతాత్మ వైపు దృష్టి సారించి, ఉత్తమ ఆశయాలతో ముందుకు సాగేది.

ఈ కథ జీవాత్మ, పరమాత్మలకు కూడా అన్వయించవచ్చు. క్రిందిస్థాయి పక్షి జీవాత్మ, పైస్థాయి పక్షి రమాత్మ. వృక్షం ప్రకృతిమాత. తీపిపళ్ళు సుఖభోగాలు. చేదుపళ్ళు కష్టనష్టాలు. సుఖభోగాల మాయలో పడిన జీవులు పరమాత్మను కాదని, తాముగా వ్యవహరించి అంతా తమ ప్రమేయమే — తమ ప్రతాపమేననే అహంకారంతో సుఖశాంతులకు దూరమై, కష్టనష్టాలు కొనితెచ్చుకొంటూ వుంటారు. కథ అడ్డం తిరిగిన తర్వాత, కళ్ళు తెరచి మాయాజాలంలో నుంచి బయటపడి — వివేకంతో వ్యవహరిస్తారు. నిత్యము — సత్యమైన పరమాత్మ స్పృహలోకి వస్తారు.



శ్రీరామకృష్ణ పరమహంస


ఈ కథ మన జాతీయ విముక్తి ఉద్యమానికి కూడా వర్తిస్తుంది. ఎరకు ఆశపడి వేటగాని వలలో చిక్కిన పక్షుల్లా మన భారతజాతి ఇంగ్లీషువారి మాయామర్మాలకు లొంగిపోయి, లోభపడి అధోగతి పాలయింది. అన్ని విధాలా దిగజారిపోయింది. ఏకులా వచ్చిన ఇంగ్లీషువారు మేకులా బిగిసిపోయారు. వ్యాపారంకోసం వచ్చి వ్యవహారాల్లో తలదూర్చారు. ప్రార్థించే స్థితి నుంచి పాలించే స్థితికి ఎదిగారు. ఈ అవకాశాలన్నీ మనమే వారికి పూవుల్లో పెట్టి సమర్పించాము!

వారి కనుసన్నలలో మెదిలాము. వారితో కలిసి చదువుకొన్నాము. వారేమి నేర్పితే అది నేర్చుకొన్నాము. వారి కళ్ళతో చూచాము. వారి చెవులతో విన్నాము. వారి మనసుతో ఆలోచించాము. వారేది చెపితే అది చేసే స్థితికి వచ్చాము. వారేదంటే అది మెచ్చే మైకంలో పడిపోయాము. తరాలుగా ప్రపంచానికి వెలుగు చూపుతూ వచ్చిన భారతీయ జీవనవిధానాన్ని కాదని బానిస సంస్కృతికి అలవాటు పడ్డాము. శారీరకంగా, మానసికంగా, నైతికంగా కూడా పతనమయ్యాము. పరిపాలన మనకు చేతకాదని, రాజకీయాలకు పనికిరామని — ఆంగ్లేయులే అన్నిటికీ సమర్థులని, వారే మనకు రక్షకులు, మార్గదర్శకులని నమ్మి నానబోసుకొన్నాము. చివరకు పుచ్చి బుర్రలైనాము.

పాశ్చాత్య విద్యావిధానం ఒక ఎత్తుగడ. వ్యాపారసరళి మరొక మాయ. ఇక పరిపాలనా యంత్రాంగం సరే సరి. ఇలా ముడిపై ముడి బిగించి మనకు బంగారు సంకెళ్ళు తగిలిస్తుంటే మురిసిపోయాము. సంకెళ్ళు బంగారంతో చేయబడ్డాయని, విలువైనవని ఆశపడ్డామేగాని, సంకెళ్ళు సంకెళ్ళే! అవి మన స్వేచ్ఛను హరిస్తాయనే వాస్తవాన్ని గుర్తించలేకపోయాము. పాశ్చాత్య నాగరికతా వ్యామోహపు మాయలో పడి వ్యక్తిగత లాభాలకు లోభపడి జాతికి, దేశానికి కూడా తీరని ద్రోహం చేసుకున్నాము.

పాశ్చాత్యులు మనకు రక్షకులు కారు — కేవలం భక్షకులని గ్రహించే లోపల జరుగవలసిన అనర్థం జరిగిపోయింది. మనం వారి వంటింటి కుందేళ్ళుగా, పెంపుడు జంతువులుగా మారిపోయాము. వారిచ్చే ఉద్యోగాలకు, నెలసరి వేతనాలకు ఆశపడి మనవారు వారిని ఉన్నతాసనాల మీద కూర్చుండబెట్టి అడుగులకు మడుగులొత్తటం ఆరంభించారు.

ఇది స్వయంకృతాపరాధము. పాలించటానికి, బోధించటానికి, పోషించటానికి, చివరకు తిండి, గుడ్డ తిరిపెం పెట్టటానికి కూడ వారే దిక్కని దీనంగా, హీనంగా



శ్రీఅరవిందులు

వారి వైపు చూస్తున్నాము. పంజరంలో పడ్డ పక్షులమైపోయాం మనం.

ఈ విదేశీ మాయామోహం నుండి బయటపడి, స్వయంసమృద్ధి సాధించటానికి, పూర్వవైభవం పొందటానికి చాలా కాలం పడుతుంది. ఎంతో శ్రమపడాల్సి ఉంటుంది. ఎన్నో సమస్యలు కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. అయితే కర్జను ప్రభువు గావించిన బెంగాలు విభజన మన భారతసోదరులకు చేదు అనుభవం చవి చూపింది. మనవారు కట్టుకొన్న గాలిమేడలను నేల కూల్చింది. కనువిప్పు కలిగి కర్తవ్యోన్ముఖులయేలా చేసింది. ఇది మన వెన్ను తట్టి, కన్ను తెరిపించిన శుభపరిణామం.

నిద్రనుంచి మేల్కొన్నాము. మత్తు వదలి మార్గంలోకి వచ్చాము. మాయనుండి వాస్తవంలోకి వచ్చి నిలిచాము. మళ్లీ మార్గదర్శకుని వైపు దృష్టి సారించాము. ఉన్నతశాఖలపై ఉన్న ఉత్తమ విహంగం ఎవరో కాదు. మనమే మన ఉన్నతాత్మే — పరమాత్మే అని అర్థం చేసుకున్నాము. ఆ స్థాయి అందుకొనటానికి మానసికో ద్యమం సాగించాము. ఆత్మస్వాతంత్రం సాధించటానికి ఆ పైన దేశస్వాతంత్ర్యం. జాతి స్వాతంత్ర్యం సాధించటానికి నిరంతర కృషి సాగిస్తున్నాము, పురోగమి స్తున్నాము.

(SABCL Vol. 1, pp. 855-57)

స్వేచ్ఛానువాదం: దయానిధి

1

వివేకానందస్వామి

వివేకానందుడు అనంత ఆత్మశక్తి సమన్వితుడు. పురుషసింహం. ఇప్పటికీ ఆయన ప్రాబల్యం బ్రహ్మాండంగా పనిచేస్తుండడం మన గ్రహించవచ్చు. ఎలా? ఎక్కడ? అని మనం చెప్పలేకపోవచ్చుకాని, యేదో సింహంలా పరాక్రమేపతమైనది, వైభవోపేతమైనది, అంతర్ - జ్ఞాన స్ఫోరకమైన ఏదో భారతాత్మలో ప్రవేశించింది.

అహో! వివేకానందుడు నేటికీ తన జనని భారతమాత ఆత్మలోను, ఆమె బిడ్డల ఆత్మలలోను సజీవంగా మనుగడ సాగిస్తున్నాడు.

(SABCL Vol. p. 332)

2

వారి ప్రచారం

ప్రపంచ మానవాళిని ఆధ్యాత్మికమార్గం వైపు మళ్ళించుటకై ఉద్భవించిన ఒక మహాపురుషునిగా స్వామి వివేకానందుని గూర్చి శ్రీరామకృష్ణ పరమహంస భావించాడు. అది గురువునుండి శిష్యునికి సంక్రమించిన ప్రేరణే అని మనం భావించవచ్చు.
(SABCL Vol. 2, p. 37)

3

ధీరోదాత్తుడు

స్వామి వివేకానందుడు ప్రపంచాన్ని తన రెండు చేతులలోకి తీసుకొని దానిని పరివర్తింపజేయగల ధీరోదాత్త మహామనీషి అని ఆయన గురువర్యులు నిర్ధారించారు. భారతదేశం మేల్కాంచినది కేవలం తన కోసమే కాదు, ప్రపంచాన్ని ఉద్ధరించేందుకు కూడ అనేందుకు తార్కాణం వివేకానందుని విదేశయాత్ర.
(SABCL Vol.2, p. 37)

4

శ్రీరామకృష్ణ పరమహంస

శ్రీరామకృష్ణ పరమహంస జీవితం బ్రహ్మాండమైన ఆధ్యాత్మిక శక్తికి ఆలవాలం. కఠోరతపస్సు ద్వారా ఆయన నేరుగా దైవసాక్షాత్కారాన్ని పొందాడు. దైవ సామ్రాజ్యాన్ని జయించాడు. ఆ తర్వాత ఒక్కొక్క యోగపద్ధతిని అనుసరిస్తూ వాటి సారాంశాన్ని అద్భుతరీతిలో అమితవేగంగా సంతరించుకోగలిగాడు. సర్వమత సారాన్ని గ్రహించుటకై వారలా కృషి సలిపారు. దైవసాక్షాత్కార ఉపలబ్ధులు, పలురకాల ఆధ్యాత్మిక అనుభూతులు, సహజ స్ఫురిత జ్ఞానలీలలు — ఇవే కదా సకల ఆధ్యాత్మిక సాధనల ఫలితాలు.

శ్రీరామకృష్ణ పరమహంస తపస్సుయొక్క గమ్యం — వేరైపోయిన విభిన్న

జాతులు, విభిన్న మతాలు, అన్నీ కూడ, ఒకే సమగ్ర సత్యముయొక్క రూపాలనీ, వీటన్నింటి విభిన్న అభ్యాస ఫలితాలు చివరకు ఏకైక పరమోన్నత ఆధ్యాత్మిక అనుభూతికి చేర్చేవేనన్న పరమ సత్యాన్ని సజీవ దృష్టాంతం ద్వారా మానవాళికి బోధించుటయే కదా!

(SABCL Vol. 20, p. 36)

అనువాదం: బి. నరసింహయ్య

5

జైలులో వినిపించిన వివేకానంద వాణి

నా యోగాన్ని 1904 లో ఏ గురువూ లేకుండానే ప్రారంభించాను. ఒక మహరాష్ట్రి యోగి నుండి 1908 లో లభించిన ముఖ్యమైన సహాయంతో నా సాధన ప్రారంభమైంది. అప్పటి నుండి శ్రీమాత భారతదేశం వచ్చేంతవరకు నేను ఎవ్వరి నుండి ఆధ్యాత్మిత సహాయం పొందలేదు. అంతకు ముందరగాని, ఆ తరువాతగాని నేనెప్పుడు పుస్తకాల మీద ఆధారపడలేదు. అంతరాల నుండి నన్ను చుట్టుముట్టిన స్వానుభవాలనే నమ్ముకున్నాను. జైలులో వున్నప్పుడు గీత, ఉపనిషత్తులు నా వద్ద ఉండినవి. నేను గీతా యోగాన్ని అభ్యసించాను. ఉపనిషత్తుల ఆధారంగా ధ్యానం చేశాను. ఈ గ్రంథాలు మాత్రమే నాకు ఉపకరించినవి. చాలా కాలం తరువాత పాండిచ్చేరిలో నేను వేదాధ్యయనం ప్రారంభించినప్పుడు ఆ వేదాలు నా యోగానుభూతులను ధృవపరచినవేగాని, నాకెట్టి మార్గదర్శకాలు కాలేదు. కొన్ని సందర్భాలలో ఎట్టి సమస్య వచ్చినా, ఏ ప్రశ్నకు సమాధానం కావాలన్నా నేను గీతను ఆశ్రయించేవాడిని. అందులో నాకు అవసరమైన సహాయంగాని, సమాధానంగాని లభించేది. జైలులో నేను ఏకాంత ధ్యానంలో నిమగ్నమై వున్నప్పుడు 15 రోజుల పాటు వివేకానందుని వాణి వినిపిస్తూ వుండేది. ఆయన నా దగ్గరే ఉండి ఒక అతి ముఖ్యమైన ఆధ్యాత్మికానుభూతిని గూర్చి మాట్లాడేవారు — అంతే. ఆ విషయం గురించి చెప్పవలసినదంతా చెప్పి ఆ వాణి ఆగిపోయేది.

(SABCL Vol. 26, p. 68)

6

జీవితపు తొలిదశలో మేధస్సు ప్రభావము

భారతీయ తత్వచింతన గురించి నేను ఏమి చదవలేదు. కాని వేదాంతతత్వం గురించి సామాన్య అవగాహన మాత్రం ఉండేది. మేక్స్ ముల్లర్ రచనల నుండి, ఇతర గ్రంథముల నుండి తెలుసుకున్నది తప్ప, వేదాంతాన్ని గురించి నాకు ఎక్కువ తెలియదు. ఆత్మను గురించిన భావన నాకు నేను ఇంగ్లాండులో వున్నప్పుడే కలిగింది. ఆత్మ అనగా ఏమిటో అవగాహన చేసుకోవటానికి ప్రయత్నం చేశాను. నన్ను ఆకట్టుకున్న మొట్టమొదటి భారతీయ రచనలు ఉపనిషత్తులు. అవి నాలో గాఢమైన ఆసక్తిని రేకెత్తించినవి. తరువాతి కాలంలో వాటిలో కొన్నింటిని తర్జుమా చేయుటకు ప్రయత్నించితిని. భారతదేశంలో గడిపిన జీవిత తొలిదశలో నా ఆలోచనా పరంపరను బలంగా ప్రభావితం చేసినవి శ్రీరామకృష్ణుల ప్రవచనాలు, వివేకానందుల రచనలు, ప్రసంగాలు. కాని వీటి వలన నాకు భారతీయ ఆధ్యాత్మిక చింతనను గురించిన తొలి పరిచయం కలిగిందే గాని, భారతీయ తత్వచింతనను గురించి కాదు. అవి నాకు యోగాభ్యాసాన్ని నేర్పలేదు. మనస్సును మాత్రమే ప్రభావితం చేశాయి.

(Sri Aurobindo Arhives and Research, Dec. 1983, p. 164)

ప్రపంచానికి హిందూమతం నిర్దేశించిన ప్రధానమైన లక్ష్యాన్ని శ్రీరామకృష్ణులు భారతదేశానికి అందించారు. శ్రీరామ కృష్ణుల జననం ఒక క్రొత్త శకానికి నాంది. ఆ శకం ప్రపం చమందలి జనులు కొంతవరకైనా దైవంతో సంసర్గమొందగల స్థాయికి ఎదిగి మానవజీవనగతిలో ఆధ్యాత్మికతకు ప్రాము ఖ్యత నిచ్చే శకం.

శ్రీఅరవిందులు

7

రామకృష్ణ పరమహంస ఇచ్చిన మూడు సందేశములు

డిసెంబరు 5, 1912 నాడు వ్రాసినవి

18 అక్టోబరు – శ్రీరామకృష్ణుల నుండి వచ్చిన మూడవ ఆఖరి సందేశం ఇదే. బరోడాలో అందిన తొలిసందేశం: "అరబిందో! మందిర్ కరో, మందిర్ కరో". మరియు ప్రవృత్తి అనే పాము తనను తానే కబళించే వృత్తాంతము. రెండవ సందేశం పాండిచ్చేరి వచ్చిన కొత్తల్లో శంకరచెట్టి యింటిలో వచ్చింది. ఈ సందేశం యొక్క వాక్యాలు మరుగైపోయినవిగాని, వాటి భావము "నిమ్నజీవిలో ఉన్నతవ్యక్తి ఆవిర్భావం జరగాలి". సాధన పరిసమాప్తం అయ్యే సమయానికి మరొక మారు మాట్లాడతానని కూడ చెప్పారు. మూడవ సందేశం యిది (18 అక్టోబరు 1912):

కర్మ సన్యాసం గావించు.
చింతనా సన్యాసం గావించు.
చేతనా సన్యాసం గావించు.
ఇతి నా తుది బోధ.

(Sri Aurobindo Arhives and Research, April 1987, pp. 11-12)

అనువాదం: ఎ. కైలాసపతి

పురాతన సాంప్రదాయాలు ఆ కాలానికి వాటి పరిధిలో అవి ప్రశస్తమైనవే కాని వాటినే పునరాచరిస్తూ మన మెందుకు అభ్యుదయదిశగ అడుగువేయకుండ వుండాలో నాకు తెలియుట లేదు. భూ చైతన్యము యొక్క ఆధ్యాత్మిక వికసనంలో గత వైభవ పాశస్త్యాన్ని మించిన వైభవం గల పురోభివృద్ధి భవితలో సాధించబడాలి.

శ్రీఅరవిందులు

8

వివేకానందుని విజయ శంఖారావం

భారతీయులలో కొంతమంది ఆధునికులు అన్ని రంగాలలో ఇంకా యూరోపియన్ సంస్కృతిచే ఎందుకు వ్యామోహితులవుతున్నారు? సమస్తమైన ప్రజ్ఞలు సృజనాత్మకత, కార్యశీలతలు యూరపులోనే వున్నాయట. భారతదేశంలో వారికి కనిపించేది తనను తాను రక్షించుకోలేని అసమర్థత, నిస్తబ్ధత, నిర్వీర్యత. కాని ఎక్కడైతే భారతీయ ఆత్మ ప్రతిస్పందించి, శక్తివంతమైన దాడి జరిపి, అద్భుత విజయపరంపరలతో నవసృష్టి సాగించిందో, అయా రంగాలలో యూరప్ యొక్క సమ్మోహనశక్తి తక్షణమే అణగారిపోవడం ప్రారంభమైంది. శక్తివంతంగా యూరప్ నుండి విరుచుకుపడిన మతపరమైన దాడుల ప్రభావానికి ఇప్పుడెవరూ లోనుకావడం లేదు. ఎందుకంటే హిందూమత పునరుద్ధరణకై చేపట్టిన సృజనాత్మక కార్యకలాపాలు భారతీయ మతాన్ని సజీవమైన, పరిణామశీలమైన, సుభద్రమైన, విజయవంతమైన, స్వీయరక్షిత మహాశక్తిగా తీర్చిదిద్దాయి. రెండు సంఘటనలతో దీనికి అంకురార్పణ జరిగింది. అవి దివ్యజ్ఞాన ఉద్యమం, షికాగోలో స్వామి వివేకానందుని శంఖారావం. భారతదేశపు అసలు ఆధ్యాత్మిక ఆదర్శాలేమిటో ఈ రెండు సంఘటనలు ఆవిష్కరించాయి. భారతదేశం తనకు తాను సమర్థించుకోవడమే కాకుండ, పాశ్చాత్యదేశాల భౌతికవాదంపై మహోగ్రంగా దాడి జరపడం విశేషం.

(SABCL Vol. 14, p. 8)

మన లక్ష్యం జీవితం నుండి వైదొలగే ఆధ్యాత్మిక సాధన కాదు; జీవితాన్ని ఆత్మబలంతో జయించగలిగేది.

శ్రీఅరవిందులు

9

ప్రాచీన విలువల పరిరక్షణ, పునర్నిర్మాణం

ఈ ఉద్యమాల వెల్లువతో బాటు వీటికి వ్యతిరేకంగా భారతీయమైనది ప్రతిదానినీ న్యాయమే అని సమర్థించే మరో ఉద్యమం మహాశక్తివంతంగా మహోధృతంగా ప్రవహించ నారంభించింది. దీని తరంగాలు మన జీవితాలలో ఇప్పటికీ ప్రతిఫలిస్తు న్నాయి. ఆ ప్రభావం ఇంకా కొనసాగుతున్నది. ఈ పని ఇంకా పూర్తి కాలేదు. నిజానికి ఈ ప్రతిక్రియ మరింత సూక్ష్మ అవగాహనకు, సమన్వయానికి నాంది మాత్రమే. ఈ విధంగా ప్రాచీన విలువలు న్యాయసమ్మతమేనని భావించడం, పాత మనస్తత్వాన్ని సంతృప్తిపరచటంతో బాటు సరికొత్త సంప్రదాయబద్ధమైన విమర్శనాత్మక వైఖరిని కూడా సంతృప్తిపరచగలదు. దీనివల్ల ప్రతిఫలం లేకపోయినా, తెలిసో తెలియకో ప్రాచీన విలువల పునః ప్రవచనం వేగవంతమౌతుంది. దీనితో ప్రాచీన సంస్కృతీ ప్రాభవం తెలుసుకోవడానికి ప్రయత్నాలు జరిగాయి. సంస్కృతి రూపాలను గౌరవిస్తూ, పునర్వికాసానికి వీలుగా వాటిని సంరక్షిస్తూ, కాలదోషం పట్టిన రూపాలను తిరస్కరించడానికి, తిరిగి వాటిని రూపుదిద్దటానికి వెనుకాడలేదు. పాత ఆధ్యాత్మిక సంపద జీర్ణం చేసుకోగల కొంగ్రొత్త భావాలను తీసుకొని తన పరిధిని విస్తృతం చేసుకోవడం జరిగింది.

పాత కొత్తల మేలు కలయికను మరింత స్వేచ్ఛగా సాధించడంలో స్వామి వివేకానందుడు ఆదర్శంగా నిలిచాడు. దానినే ఆయన ప్రపంచానికి అత్యంత శక్తి వంతంగా దాటి చెప్పాడు.

(SABCL Vol. 14, p. 415)

శ్రీరామకృష్ణులు సతతము ఒక వాడివేడిగా సాగే తేజోమయ మగు ఆధ్యాత్మిక సంస్థాపననుండి మాట్లాడేవారు.

శ్రీఅరవిందులు

10 (a)

భారతీయ మతంలో అనంత వైవిధ్యం

భారతీయ తత్వశాస్త్రం, మతంలోని అంతులేని వైవిధ్యం యూరోపియన్ మనస్సుకు అంతుపొంతులేని, దిగ్భ్రాంతకరమైన విసుగు జనించే, నిరర్థకమైన వైవిధ్యంగా కనిపిస్తుంది. సుసంపన్న మైన ఆకుపచ్చని చెట్లు, చేమలతో నిండిన వనాన్ని అది చూడలేదు. వివిద రూపాలతో భాసించే ఆధ్యాత్మిక జీవన ప్రాభవం దానికి తెలియదు. అనంత వైవిధ్యం, వివేకానందుడు అన్నట్లు ఒక ఉత్కృష్టమైన మతసంస్కృతికి చిహ్నం. పరాత్పరుడు (Supreme) అనంతుడని భారతీయులకు తెలుసు. ప్రకృతిలోని ఆత్మకు ఆ అనంతం నిరంతరం శతకోటి రూపాలలో సాక్షాత్కరిస్తుందని వేదయుగం ప్రారంభంనుండి భారతీయ ద్రష్టలందరికీ తెలుసు.

మానవాళికంతా ఒకే మతం ఉండాలన్న విపరీత భావమొకటి పాశ్చాత్య మేధావులకు కల్గింది. కాని ఒక విధమైన ఆచారాలు, మూఢనమ్మకాలు. తంత్రాలు, మతభావాలు, పూజలు పునస్కారాలు, నియమాలు, నిషేధాలు, ఒకే మతశాసనంతో విశ్వజనీన మతం సంకుచితమై తీరుతుంది. ఇటువంటి సంకుచితమైన, అసంబద్ధమైన మతం నిజమైన మతం ఎలా అవుతుంది? మతగురువులు చిత్రహింసలు పెడతారన్న భయంతోనో, లేక పైలోకాలలో భగవంతుడు తమని త్రోసిపుచ్చి, భయంకరమైన శిక్షలు విధిస్తాడన్న భయంతో వణికిపోతూనో దానిని అంతా ఆమోదించి తీరాలని భావించడం హాస్యాస్పదం.

(SABCL Vol. 14, p. 129)

అనువాదం: కె. యజ్ఞన్న

10 (b)

సనాతనమతము — అనంత వైవిధ్యము

ఈ మతంలో అనంత వైవిధ్యముంది. ఇది పాశ్చాత్యులకు కొరుకుపడనిది, మ్రింగుడు పడనిది. కనుక వారి దృష్టిలో ఇదొక అద్భుతాంశం. అడవిదారిలాగా అంతుచిక్కనిది. అర్థరహితమైనది. మహారణ్యంలో ఎంతో వైవిధ్యం మహాశ్చర్యకరంగా తోస్తుంది. ఏమాత్రం మనసు పెట్టినా, ఎంతో ఎత్తైన చెట్లు — రకరకాల వృక్షాలు అలాగే మన మతంలోనూ వివిధ రూపాలున్నా అన్నిటినీ కలిపే సూత్రాత్మ వున్నది. ఇది పరిపక్వదశకు చేరిన మతమహాలక్షణంగా స్వామి వివేకానంద అభివర్ణించారు. భారతీయ దర్శనంలో పరమాత్మ అనంతమన్న అంశం వేదకాల ఋషుల నుండి గ్రహించినదే. ప్రకృతి ఎప్పుడూ వైవిధ్యంతో శోభిస్తుంది. అది దాని స్వభావం. కానీ అంతరాత్మ ఏకమే. ఈ అనేకత్వం దాని అభివ్యక్తి. అంతేకాని లోకంలో మనుజులందరూ ఒకే నామం — రూపం — మతము వుండవు. ఉండాలనుకోవటం నియంతృత్వ ధోరణి — పాశ్చాత్యుల విపరీత బుద్ధి. అదెంత అస్వాభానికమో అంత అతర్కితోప సంపన్నం. అది తర్క సహం కాని క్రూరభావన. తాను మునిగిందే గంగ కాదు. అంతవరకూ ఒకే అభిప్రాయం — ఒకే పద్ధతి — ఒకే భావం ఉండాలనుకోవటంలోనే సంకుచిత దృష్టి వుంది. కనుక ఒకే మతం — విశ్వాసం — క్రతువిధానం. ఒకే విధి నషేధాల క్రమం — ఒకే మతానుశాసనం అసహజ విషయాలు. ఇక్కడ మానవులంతా ఆధ్యాత్మిక హింసను, అక్కడ పరలోకంలో శాశ్వత శిక్షను అంతా అంగీకరించాలనీ, అందరికిదే మార్గమని అనటంకంటె మూర్ఖత్వమేముంటుంది? ఇంతకంటె సంకుచితమైన, అపహాస్యమైన విషయం సృష్టిలో ఉండదు.

(SABCL Vol. 14, p. 129)

అనువాదం: తుమ్మపూడి కోటేశ్వరరావు

11

ఒక్కొక్కరిది ఒక్కొక్క మతము

మన యోగలక్ష్యము దైవసాక్షాత్కారమును పొందుటతో సరి కాదు. ఆ దైవమును మన జీవితములో కూడ ఆవిష్కరింప జేసుకోవలెను. ఒక్కొక్క మనిషిలోను ఆ ఆవిష్కరణము యథేచ్ఛగా జరుగవలెను. మూసపో పోసినట్లుగాక, ఒక్కొక్క మనిషి ప్రజ్ఞాపాటవమును, స్వభావమునుబట్టి ఒక్కొక్క ప్రత్యేక రీతిలో ఆవిష్కారము కావలెను. విశ్వగత, విశ్వాతీతశక్తుల అభివ్యక్తిలోని అనంత వైవిధ్యమే మానవుని ఆధ్యాత్మిక జీవనానికి పరాకాష్ఠ. మతముల ఐక్యత అంటే ఏమిటి? వివేకానందుడు చెప్పినట్లు సకల మతములు అనంత వైవిధ్య వైభవములతో భాసిల్లినప్పుడే అది సాధ్యమౌతుంది. ఇంకా చెప్పాలంటే ప్రతి మనిషికి తనదైన స్వంత మతము — అనగా ఛాందసమైన ఆచార వ్యవహారాలకి కట్టుబడకుండా తన ప్రకృతిని యథేచ్ఛగా మలచి దైవముతోడి తన సంబంధమును సుసంపన్నము చేసికొనుట.

(SABCL Vol. 20, p. 81)

అనువాదం డా. ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి)

12

భారతదేశ సందేశ కిరణపుంజం

వేలమంది సాధుపురుషులు — మహాత్ములు తమ మౌనజీవిత సాధనల ద్వారా మనకు చేసిన బోధ యేమిటి? భగవాన్ శ్రీరామకృష్ణుల అనంతసాధనల నుండి ఉన్మీలితములైన సందేశ ప్రభావ ప్రసరణ లేమిటి? సింహసదృమైన గుండెతో ప్రపంచాన్ని తన వాగ్గంగా ప్రవాహధాటితో ముంచెత్తిన వివేకానందుడు బోధించినదేమిటి? ఆ సన్యాస చక్రవర్తి ప్రసరించిన బోధాకాంతు లేమిటి? గాని సారాంశమిది: సింహాసనాసీనుడైన మహారాజు నుండి — కూలీనాలీ చేసుకొని బ్రతికే సాధారణ వ్యక్తి దాకా, తన జపతపాదుల్లో మునిగిపోయిన బ్రాహ్మణుని నుండి — పొలంలో దున్నుకొని జీవించే అమాయక వ్యవసాయదారుని దాకా — అందరిలోను నిమ్నోన్నతములు లేక ఒకే పరమాత్మతత్త్వం స్పందిస్తున్నది. అందరూ తదాత్మ స్వరూపులే. అంతా

సృష్టికర్తలే. ఎందుకంటే మహాచైతన్యశక్తి మనలోనే వున్నది. జీవితమంతా సృష్టే, సృష్టి — స్థితి — లయలన్నీ సృష్టే. మనంత మనం తోలుబొమ్మలై మాయా కర్మజాలంలో చిక్కుకొనకపోతే మహాచైతన్య స్వరూపులమే. అది చెక్కిన విగ్రహాలమే, సజీవ మూర్తులమే.

(SABCL Vol. 1, pp. 66-67)

13

భారతదేశం పునర్జాగృతం కావటం భవిష్య ప్రపంచ వాంఛితం

భారతదేశం నశించదు. మన జాతి రూపుమాసిపోదు. ఎందుకంటే సర్వప్రపంచంలోనూ భారతదేశమే — ఈ సనాతన ఖండమే – దివ్యధ్యేయమై ఊర్పుగా బ్రతుకుతున్నది. భవిష్య మానవజాతి కిదే గుండెకాయ. భారతదేశమే ప్రపంచానికి కావలసిన మత ప్రభాతగీతాన్ని విన్పించేది. అదే సనాతన మతం — సర్వమతాలకు సమన్వయ సూత్రం. శాస్త్రాలకు, వేదాంతాలకు అదే ఏకైకాత్మ ద్రవ్యం. మ్లేచ్ఛభావక్షాళనం చేసి మానవజాతిని ఆర్యజాతిగా శిల్పించగల మహాశిల్పి భారతదేశమే. దీని కోసం మొదట తాను పునః ఆర్యత్వంలో జాగృతం కావాలి.

ఇదిగో ఈ మహాకార్యం కోసమే భగవాన్ రామకృష్ణులు అవతరించింది — నిజమైన వివేకానంద ప్రపంచం చుట్టివచ్చింది. ఈ సుప్రభాత గీతాన్ని మనం విన లేదంటే — మేల్కోలేందంటే మనకింకా చీకటితెరలు విచ్చిపోలేదన్న మాట. అజ్ఞాన తమస్సు చెదరిపోలేదన్న మాట. భయాందోళనలు, సంశయాలు, ఉపేక్ష, బద్ధకం అన్న చీకటి దుప్పటి ముసుగు తీయలేదన్న మాట. మనలో కొందరు భక్తిమార్గంలోను, మరికొందరు జ్ఞానమార్గంలోను ప్రయాణిస్తున్నా మనలోని శక్తిహైన్యం వలన మన భక్తి చైతన్యవంతం కావటం లేదు.

(SABCL Vol. 1, pp. 66-67)

అనువాదం: తుమ్మపూడి కోటేశ్వరరావు

14

ప్రపంచంలో భారతదేశ ఆధ్యాత్మిక ప్రభావం

ప్రపంచంలో తొలిమహాశక్తిగా భారతదేశం అగ్రపీఠం ఎందుకు అలంకరించకూడదు? ప్రపంచమంతటా ఆధ్యాత్మిక ప్రభావాన్ని ప్రసరించడంలో వివాదస్పదంకాని హక్కు మరే దేశానికి ఉన్నది? ఇదే స్వామి వివేకానందుని ప్రచార ప్రణాలిక. దేశాలను జయించే ఆధ్యాత్మిక సంపద భారతదేశం సొత్తు. ఈ ప్రాభవం తనకు వున్నదన్న ఎరుక కల్గిస్తూ మరొకసారి భారతదేశాన్ని చైతన్యప్రదీప్తం చేయాలి. ఈ ఆధ్యాత్మికత సమస్త దేశభక్తికి మూలం. ఆత్మనూన్యతను ఇదొక్కటే పోగొట్టగలదు. తను పోగొట్టుకున్న స్థానాన్ని తిరిగి పొందడానికి ఇదొక్కటే మార్గం.

(SABCL Vol. 1, pp. 427-28)

15

రామకృష్ణుని జీవితం — హిందూమత సందేశం

భగవ్భావన తరిగిపోయింది. సందేహాలు పెరిగిపోయాయి. ఇటువంటి తరుణంలో ఆధ్యాత్మికత ఎంతో అవసరం. ఆత్మ యొక్క అభివ్యక్తరూపమే ఈ ప్రపంచం అనీ, ఇంద్రియాలు చేసే గందరగోళం వెనుక అసలు రహస్యం ఇదే అనీ, మనిషి అంతరాంతరాలలో దివ్యవికాసానికి అవకాశాలు వున్నాయనీ, భగవంతుని ఆనందం మనిషి పొందవచ్చుననీ. ఇదే ప్రపంచంలోని అసలు సత్యం అనీ ఆధ్యాత్మికత చాటిచెప్పే సమయం వచ్చింది. అందులకే రామకృష్ణుడు అవతరించాడు. బుద్ధుడు అవతరించిన తరువాత రెండువేల సంవత్సరాలు పాడుపడిన ఆధ్యాత్మిక పురోగమనమంతా రామకృష్ణుని దివ్యప్రబోధానికి నాంది.

భారతదేశపు దీర్ఘనిశ అంతము కానున్నది. తూర్పులో ఒక మహత్కాంతి ఉదయిస్తున్నది. ఆ కాంతి వెదజల్లిన తొలి వైతాళిక విద్యుల్లతలు లోగడే దిఙ్మండలంపై కానవచ్చినవి. ఒక కొత్తరోజు వస్తోంది. అది ఎంత ఉజ్వలమైనదంటే పైనుంచి దిగివచ్చిన అంతిమ అవతారం కూడ ఆ కాంతికి అర్థం వివరించలేకపోయింది. అయితే ఆ అవతారం లేకుండా ఆ రోజు రాదు. భారతీయ ఆధ్యాత్మికత పరిపూర్ణంగా

వ్యక్తమవుతున్నది. ప్రాగ్దేశాల పునర్వికాసానికి అదే అసలు నాంది.

వివిధ రకాల ఆలోచనలు, నైతిక సూత్రాలు, భౌతిక వికాసంపై విచిత్రస్వప్నాలు, ఆశలు, అసంభవమైన ధార్మిక, ఆనందమయ జీవితాలను గురించి మానవాళి ఎప్పటి నుండో ప్రయోగాలు చేస్తూ వచ్చింది. కాని జీవితంలో చిట్టచివరి రహస్యాన్ని ఆవిష్కరించడంలో విఫలమైంది. ఎక్కడా తృప్తి లేదు. దారిద్ర్యం, ఆవేదనలు, అసంతృప్తి, సంఘర్షణలనుండి బయటపడేందుకు రాజకీయ, సామాజిక విధానాలు ఏవీ సహాయపడలేకపోయాయి. ఐహికమైన విధానాలన్నీ విఫలమౌతున్నాయి. ప్రాగ్దేశాలలోనే సత్యం, జ్ఞానం వున్నాయి. ప్రాగ్దేశాలే పశ్చిమ దేశాలకు దివ్యప్రబోధం అందివ్వగలవు. ప్రాగ్జ్యోతి మాత్రమే ప్రపంచాన్ని రక్షించగలదు. యుగయుగాలుగా ఆసియాఖండం తనలో నిక్షిప్తమైన కాంతి కోసం అన్వేషిస్తోంది. తాను దర్శించిన ఆ కాంతిపుంజాలే బౌద్ధమతంగా, క్రైస్తవమతంగా, మహమ్మదీయమతంగా ఫరిఢవిల్లాయి. భారతదేశమే అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రయోగకేంద్రం, ఆత్మపరిశోధనాగారం. ప్రతి యుగంలోను వేలాది మహనీయులు అవతరించారు. ఆత్మలో శాంతిసౌమనస్యం దర్శించారు. దివ్యజ్ఞానాన్ని అందించారు. మతమార్పిడుల కోసం, పేరు కోసం వారు తాపత్రయపడలేదు. కొద్దిమంది శిష్యులకు తమ ప్రయోగఫలితాలు అందించి వెళ్లారు. వారు తమ అనుభవాల అద్భుతధారలు వెదజల్లి, వచ్చిన చోటుకే తిరిగి వెళ్ళిపోయారు. అవతారాల జననం మూలంగా అనంతమైన ఆధ్యాత్మికశక్తి లభించింది. వారు తమకు లభించిన ఆనందాన్ని, ప్రపంచ మానవాళిపై ప్రవహింపచేశారు. మతాలను మార్పిడిచేయడం వారి ఉద్దేశ్యం కానే కాదు. భగవత్ సాక్షాత్కారం ఆనందపారవశ్యాన్ని నలుగురికి అందివ్వాలని వారు తపన చెందారు. అటువంటివారిలో శ్రీరామకృష్ణుడు చివరివాడు. అందరిలోనూ మహనీయుడు. చాలామంది భగవంతుని పరిమితమైన ఒకే రూపంగా దర్శిస్తే ఆయన అనంతమైన ఏకత్వంగా దర్శించాడు. ఆయనలో గతకాలపు వేలాది మహాద్రష్టల ఆధ్యాత్మిక అనుభవాలు కలసిపోయి ఒకే ప్రవాహంగా ప్రవహించాయి. హిందూమతంలోని చిట్టచివరి సందేశాన్ని ఆయన ప్రపంచానికి అందించాడు. ఆయనతో ఒక కొత్త యుగంప్రారంభమైనది. భూలోకవాసులు భగవంతునితో తాదాత్మ్యం చెందడానికి ఒక్కసారి ఉద్ధరించబడ్డారు. క్రైస్తవమతం ఏది సాధించలేక విఫలమైందో, అపరిపక్వమైన కాలగతిలో మహమ్మదీయ మతం ఏది సాధించడానికి యత్నించిందో, కొద్దికాలంపాటు బౌద్ధమతం పాక్షికంగా

యత్నించిందో రామకృష్ణుని జీవితం ద్వారా హిందూమతం ప్రపంచం కోసం ప్రయత్నించవలసి వుంది. భారతదేశపు పునర్వికాసానికి ఇదే కారణం. భగవంతుడు తిరిగి ఈ వేదభూమికి ఊపిరిపోశాడు. ఎందరో మహితాత్ములు భారతదేశ విముక్తికి పోరాడడం అందుకే. భరతపుత్రులలో హఠాత్తు మార్పు రావడం అందుకే. రాజకీయంగా ప్రారంభమైన ఈ వుద్యమం ఆధ్యాత్మిక ప్రాభవంతో ముగుస్తుంది.
(SABCL Vol. 1, pp. 799-801)

16

మానవునిలో దివ్యప్రభంజనము

హేతువు మనకు మార్గదర్శి కాదంటే కొందరు ఒప్పుకోరు. ముఖ్యంగా మేధావులు దిగ్భ్రాంతి చెందుతారు. హేతువు కాదని, ఏదో కనిపించని అదృశ్య దైవశక్తి ప్రభావానికి లోబడడం అటువంటివారికి ఆశ్చర్యం కల్గిస్తుంది. ఈ సందేహాలు వెలిబుచ్చేవారంతా భౌతికవాదప్రభావ వలయంలో చిక్కుకున్న మహానుభావులే. మనిషిని భౌతికరూపంగానే పరిగణించి, అతడు భగవంతుడునుండి రాలేదని, అతనికి ఒక దివ్యభవితవ్యం లేదని వారు వాదిస్తుంటారు. మనిషిలో దాగివున్న భగవంతుడే అసలు దర్శనం. మతము యొక్క అసలు అర్థం శంకరుడు, రామానుజుడు, మధ్వాచార్యులు, శ్రీరామకృష్ణుల దివ్యప్రబోధాలకు భారతదేశం జ్ఞప్తికి తెచ్చుకుంటే ఆమె ప్రబుద్ధమవుతుంది. ఆమె జీవితం అంతా వేదాంతమే.

తాము మేధావులం మాత్రమే అని ఎవరైనా భావిస్తే వారు హిందువులు కారు. మేధావులంటే భగవంతుని చూడనివారు. భగవంతుడు తన గొప్పతనాన్ని, మహిమను చాటాలని భారతదేశాన్ని ఆదేశించాడు. వేలాది సంవత్సరాలుగా భగవంతుని గూర్చి భారతదేశం పలికిన మంత్రవాక్కులు నలుదెసలా మారుమ్రోగాయి. యూరోపియన్ విద్య మనకు అందినప్పుడు మనం సైన్సువల్ల అపమార్గం పట్టాము. ఒక చిన్న గదిలోని వెలుగు లాంటిది సైన్సు. ప్రపంచాన్ని వెలుగులతో నింపే సూర్యుడు కాదు. అపరవిద్య అన్నది సైన్సు కాదు. దానికి మించిన విద్య ఉంది. లోకం నిమ్నస్థాయి జ్ఞానంతో, మన మేధస్సే చాలా గొప్పదని, సర్వశక్తిమంతమని భావిస్తుంది. కాని అది వట్టి భ్రమ, మాయ మాత్రమే. దేవుని మహిమను తెలుసుకున్న వ్యక్తి మేధస్సు

గొప్పదని ఎప్పటికీ విశ్వసించడు. ఉన్నతమైన మంత్రధ్వని ఒకటుంది. భగవంతుడు గుండెలోనే నివసిస్తుంటాడు. మెదడు ద్వారా పనిచేస్తాడు. మెదడు అతని ఉపకరణాలలో ఒకటి. మెదడు ఏది ఆలోచించినా అది ముందు హృదయానికి తెలుస్తుంది. మెదడును దాటి హృదయంలోకి ప్రవేశించగలిగినవాడు పరమాత్మ వాణి వినగలడు.
(SABCL Vol. 1, pp. 714-15)

అనువాదం: కె. యజ్ఞన్న

17

అంతర్జ్యోతి — భవిష్యద్దీప్తి

“నా ఇచ్ఛనే నెరవేర్చుము. నిన్ను నీవు తెలుసుకొనుము. మాలిన్యములను వదిలించు కొని పునీతుడవు కమ్ము. నీ ఇచ్ఛవచ్చిన రీతిలో ప్రవర్తించరాదు. కోరికల వెనకాల పరిగెత్త వద్దు. ” అని దివ్యాచార్యుడు క్రిందటి ఒకటిన్నర సంవత్సరాలుగా జరుగుతున్న సంఘటనల ద్వారా మనని హెచ్చరిస్తూనే వున్నాడు. అది వినిపించుకునే వాళ్లకైతే వినపడుతుంది. నీకు జ్ఞానమెలా కలుగుతుంది. సాధనామార్గమును గురించి తెలుసుకున్నంత మాత్రాన కలగదు కదా. ఆత్మసంసర్గము వలన, లోపల నుంచి వచ్చిన వెలుగు వలన కలుగుతుంది. అపరజ్ఞానంతో ఏది చేసినా ఫలితము సున్న. జ్ఞానము నిన్ను పూర్తిగా ఆవహించి నరనరాలకి పట్టినప్పుడే ఫలితము దక్కుతుంది.

దక్షిణేశ్వరంలో ప్రారంభించిన ప్రణాళికింకా పూర్తి కాలేదు — అసలు దాని నెవరైనా అర్థం చేసుకుంటే కదా. వివేకానందుని ఉద్యమము ఇంకా కార్యరూపమే దాల్చలేదు!
(SABCL Vol. 2, p. 412)

అనువాదం: డా. ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి

18

సమయమాసన్న మైనది

రాజకీయ, ఆర్థిక విషయాలపై దృష్టిని కేంద్రీకరిస్తున్న భారతజాతికి తన దృష్టిని విశాలపరచుకోవలసిన సమయమాసన్న మైనది — ముఖ్యంగా నేటి బెంగాలు విషయంలో ఇది తప్పనిసరి.

బెంగాలీలు ఎప్పుడూ భారతీయుల్ని ఒక వున్నతాదర్శం వైపు నడిపిస్తూ వుంటారు. కొత్తతరం ఔన్నత్యం సాధించడానికి అత్యవసరమయిన సాధనసంపత్తి వారి వద్ద వుంది. మానవజాతి ఒక గొప్ప ముందడుగు వేసి కదలవలసి వచ్చినప్పుడు, బలంగా హృదయాన్ని కదిలించే ఆలోచనలతో, గొప్ప స్ఫూర్తినిచ్చే వూహలు, వుద్రేకాలు వారి సొత్తు. హృదయంతో ఆలోచించే అమూల్యవరం పొందినవారు. అంతే కాదు, భావనలోని సున్నితమైన విషయాలను, వివిధ కోణాలలో, రూపాలలో వుండే అర్థఛాయల్ని, వాటి పరిధులలోనే పట్టుకోగలిగిన సూక్ష్మబుద్ధి కలిగినవారు. వీటన్నిటికి పైగా, యితర జాతులు యీ ప్రత్యక్ష జ్ఞానసామర్థ్యం అభివృద్ధి చేసుకోక పూర్వమే అందులో గొప్ప స్థాయిని సాధించినవారు. హేతువాదానికి, కాల్పనికతకి అతీతంగా మానవత్వంలో వుండే గోప్యత యిప్పుడు బహిర్గతం కావలసి వున్నది. ఆ నైపుణ్యం, జాతియొక్క అత్యున్నత స్వభావం, శ్రీరామకృష్ణునిలో ప్రస్ఫుట మయాయి. అతడు తలచుకున్నట్టయితే ఏ జ్ఞానాన్నయినా అతిసులభంగా ఆధ్యాత్మి కంగా శాసించగలడు. ఏదైనా సరిదిద్దగల విద్య అతని వద్దే వుంది. వ్యక్తియొక్క, జాతియొక్క పాతసంపర్కాలు, సంస్కారాలతో నిండిన జ్ఞాపకాలు, పరిమితమైన హేతువాదం, అర్థంకాని, అయోమయమైన వూహల అనవసర జోక్యంతో ప్రస్తుతం సాధారణ జనంయొక్క జ్ఞానం పెడదారిన పయనిస్తున్నది. ప్రాచీన భారతీయ ఋషులు యోగశాస్త్రి జ్ఞానంతో రూపొందించిన క్రమశిక్షణలో నిష్ణాతుడైనవాడే జాతికి సరియైన ప్రాతినిధ్యము వహించగలడు.

కాని కొన్ని జాతులు యీ వికాసం యిప్పటికే సాధించాయి. కొన్ని సాధించడా నికి సంసిద్ధంగా వున్నాయి. ఆ జాతులే శక్త్యారాధన ద్వారా భవిష్యద్వికాసాన్ని,

దానితోపాటు బలమైన సంకల్పసిద్ధిని, శక్తిని పొందగలవు. ఇతర సమస్త మానవాళిని జ్ఞానపథంలో నడిపించగలవు.
(SABCL Vol. 3, p. 327)

అనువాదం నడిమింటి విజయలక్ష్మి

20[1]

వివేకానందుని యతి పథము

లండన్ మహానగరంలో కాంగ్రెస్సు తలపెట్టిన మహాసభలపై మా అభిప్రాయం వ్యక్తం చేశాము. కాంగ్రెస్సు ముఖతః వెలువడిన ఈ స్పందనకు మాకు రెండు కారణాలు గోచరిస్తున్నాయి. వీరి లక్ష్యం ఇంగ్లాండులో మనకు ప్రతికూల వాతావరణం నివారించుట మొకటి కాగా, యావత్ప్రపంచ మేధావుల సానుభూతి పొందటం రెండవది. ఆ సదస్సులోని ప్రముఖుల ఉపన్యాసాలుగాని, ఇతర నాయకుల వాక్చాతుర్యంగాని ఆ దేశస్థులను ఆకర్షించవు. బ్రిటన్ దేశస్థుల ప్రయోజనాలకు దోహదపడని ప్రతిపాదనలను వారెన్నటికీ ఆమోదింపబోరు. మన లక్ష్యసాధనకు దీర్ఘకాల ఉద్యమ మొక్కటే శరణ్యం. ప్రతి నిత్యము, ఏడాది పొడవునా, ఈ ఉద్యమం విరామం లేకుండా సాగిపోవాలి. లక్ష్యసాధనకు కొన్ని సంవత్సరాలే పట్టవచ్చును. ఉద్యమం వల్ల ఆశించిన ఫలితాలు లభించకపోయినా, ఆశ్చర్యపడనక్కర లేదు. ఏతావాతా, ఫలితాలు లభించినా మనకు అక్కరకు రాకపోవచ్చును.

ఈ వ్యవహారమంతా భారతప్రభుత్వానికీ, దేశప్రజలకు సంబంధించిన రాజ్యాంగాశంగా పరిగణించాలి. అంతేగాని విదేశ ప్రజానీకానికానికి గాని, వారి సానుభూతికిగాని తావు లేదు. ఈ పెద్దల ఆమోదం మన లక్ష్యసాధనకు ఏమాత్రం సహకరించదు. వారి సానుభూతి కేవలం నోటిమాట మాత్రమే కాగలదు. ఏ కారణంగానైనా, మనకు అనుకులంగా స్పందించినా, దాని ప్రభావం లేశమాత్రమే.

ఈ తరుణంలో స్వామి వివేకానందుల అమెరికా యాత్రను స్మరించుకోవటం అవసరం. వారి యాత్రానంతరం, వారి శిష్యుల అపూర్వ కృషివల్ల మన దేశానికి

[1] *19 వ నెంబరు వ్యాసము 'రెండు పక్షుల కథ' పత్రిక మొదటి వ్యాసంగా ఇవ్వబడింది.*

జరిగిన మేలు అమోఘం. ఈ శతాధిక కాంగ్రెస్సు సదస్సుల వలన కలిగిన ప్రయోజనాల కలీతం. ఆ స్ఫూర్తితో మనము యావత్ప్రపంచానికీ, మన జాతి గతవైభవం, ప్రాచీన నాగరికత వైశిష్ట్యం ఎలుగెత్తి చాటాలి. వీటి వారసత్వం జాతిరక్తంలో కరడుగట్టి యున్నదని, ప్రపంచానికి మేలుచేయగల శక్తి యుక్తి సంపన్నులమని ఘోషిస్తూ, స్వతంత్ర ప్రతిపత్తిపై అర్హులమని గర్జించాలి.

ఈ పురుషాకారమే మన లక్ష్యసాధనకు సుగమమైన మార్గము. భిక్షాన్న ప్రవృత్తి ఎన్నటికీ కాజాలదు.

(SABCL Vol. 2, pp. 170-71)

అనువాదం: శ్రీ శరణ్

21

పాతక్రొత్తల సమన్వయము — ఒక పరిశీలన

వేదాంతమనే పదానికి, జనశ్రుతిలో అద్వైత సిద్ధాంతమని, అది శంకరప్రతిపాదిత మాయావాదమని పరిగణించటం పరిపాటి. ఉపనిషద్వివరణలో ఆ పాఠమే ప్రమాణం గాని, భాష్యాలెన్నటికీ కానేవరు. శంకరభాష్యం బహుదొడ్డదే. అయితే శంకరభాష్యము ఏకపక్షమన్న వాదనను త్రోసిపుచ్చలేము. తరువాత కాలంలో ఉపనిషత్తులపై అసంఖ్యాకంగా వచ్చిన భాష్యాలు, వాటిపై వచ్చిన వివృతులు మొదలగునవి జిజ్ఞాసువులను అత్యంత ప్రభావితం చేసినవి. మున్ముందు కూడ బహుముఖ వ్యాఖ్యలు అనేకం ఆశించవచ్చును.

ఈ బహూన్ముఖత్వమును సాధకుని నిత్యజీవితంతో సమన్వయపరచటమే శ్రీరామకృష్ణ, వివేకానందుల బోధల లక్ష్యమని తెలుస్తున్నది.

నడుస్తున్న చరిత్రను, ఒకమారు సమీక్షించుకొంటే, గత చరిత్రంతా పునరావృతమవుతున్నదని గ్రహించవచ్చును. గతంలో కూడ ఈనాటి వలెనే ఒక మహాపురుషుడు — అవతార పురుషుడో, విభూతియో మానవస్వరూపంలో అవతరించిన ఒకానొక అపూరూపమైన దివ్యస్వరూపమో పృథ్విపై కాలిడి, జనజీవనం మధ్య తిరుగాడి, తన దివ్యశక్తితో వారిని అత్యంత ప్రభావితం చేయగల్గింది ఆ మహనీయుడు గౌతమ బుద్ధుడు ఆ మహామనీషి తన సిద్ధాంతాన్ని , సదాచార సంపత్తిని ఆనాటి ఆర్యజాతులకు

ప్రభోదించాడు. అయితే ఒక విచిత్రమేమంటే, బౌద్ధమతము, వేదాంత తత్త్వాన్ని అంగీకరించినప్పటికీ, ఒకానొక మౌలిక సత్యాన్ని జీర్ణించుకోలేక, పుట్టిల్లైన భారతదేశం నుంచి బహిష్కృతమైనది. కాని నేడు షోడశకళలతో మూర్తీభవించిన ఒకానొక దివ్యస్వరూపము మన మధ్య దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నది. అందువల్ల గతచరిత్రలో ఆనాటి పరిణామాములు భారతదేశాన్ని గురస్థానంలో నిలిపి, యావత్ప్రపంచానికీ మార్గదర్శకమై, ఈనాటికిన్నీ జీవకళతో ఉట్టిపడుతున్న భావసారూప్యత, రూపకల్పనలకు కర్తృత్వం వహింపచేసిన తీరంతా ఈనాడు పునరావృతం కాగలదు.
(SABCL Vol. 2, p. 344)

అనువాదం శ్రీ శరణ్

22

హిందూమతం — కురూపము, స్వరూపము

హిందూయిజము రెండు రకాలు. ఒకటి వంటగది మీదనే ఆధారపడి వుంటుంది. అది దేహాన్ని శుభ్రం చేయడంతోనే స్వర్గప్రాప్తికి ప్రయత్నిస్తుంది. ఇక రెండవది వంటపాత్రను శుభ్రంచేయుట మీద కేవలం సాంఘికాచారవ్యవహారాల మీద ఆధారపడకుండా ఆత్మను పరిశుద్ధం చేసుకొనుట ద్వారా దైవాన్ని అన్వేషిస్తుంది. ఇది మొదటి దాని కంటె ప్రాచీనమైనది, నశించనిది. భీష్మాచార్యులు, శ్రీకృష్ణుడు, శంకరుడు, చైతన్యమహాప్రభు — వీరందరిదీ యీ హిందూయిజమే! ఇది మిక్కిలి పురాతనమైనది, శాశ్వతమైనది. యుగయుగాలుగా అభివృద్ధిచెందుతూ వచ్చింది. దీని లక్ష్యం క్రియ గాదు — కర్మ; ఆచారం కాదు — భక్తి; శాస్త్రం కాదు — జ్ఞానం ..... కాస్త ఉన్నత శ్రేణిలో అవాస్తవం కాని రెండు హిందూత్వాలు ఉన్నవి. సైద్ధాంతికపరమైనది ఒకటి కాగా ఏ సిద్ధాంతానికి ఒదగనిది వేరొకటి వేర్పాటుధోరణి కలదిగా ఒకటైతే, సంయోజనకారియై సర్వేశ్వరత్వాన్ని అన్వేషించేది వేరొకటి. మొదటిది ఒకే ఆదర్శానికి, అనుభవానికి, కొన్ని విశ్వాసాలకి, ఎన్నుకున్న గురువుకి, అవతారానికి, నిబద్ధంగా కట్టుబడినది. రజోగుణ ప్రధానమైనది, సహనం లోపించినది, అపరిపక్వత వలన గర్వం, తిరస్కార భావం కలిగినది. ఈ వర్గం వారికి స్వీయ అల్పత్వం వలన తమకంటే వేరైనవారంతా కుసంస్కారులు, మూఢులు అనిపిస్తారు. తాము నమ్మిన

గురువే గురువు. కొలిచే దైవమే దేముడు. భావాలు, అనుభవాలు, విశ్వాసాలు, గురువు. దైవం తమకు ప్రత్యేకమైనా, క్రమేపీ ఆత్మవికసనంతో పరిణతి పొంది, ఇతరుల మనోభావాలను సహించి "సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" అని భావించగలిగే ఔదార్యం వీరికి కలుగుతుంది. పరిపూర్ణ జ్ఞానోదయంతో విశ్వ చైతన్యానుభవం కలిగి దివ్యత్వం సిద్ధించి అంతా సర్వేశ్వర సంభూతంగా అనుభావ్య మౌతుంది. ఉన్నతుడు, అధముడు అనే తేడా లేకుండా అద్వితీయుడైన ప్రేమైకమూర్తి అందరినీ అక్కున చేర్చుకోగలడనే సమ్యగ్భావన కలిగి భిన్నత్వాలన్నీ పటాపంచలై 'ఏకంసత్' అన్న ఉపనిషత్సత్యం రుజువు కాబడుతుంది. తమ దివ్యజీవన సాధనానుభవంలో శ్రీరామకృష్ణ పరమహంస మనకు తెలియచేసిన సత్యమిదియే. ఈ యుగ అవతార పురుషులు వారు. అయితే వారికీ ఒక సిద్ధాంతాన్ని అంటగట్టి వారి ప్రతిమను చేసి, ఆలయానికి బందీ చేసి, యాంత్రికమైన పూజాపురస్కారాలకు పరిమితం చేయడం గర్హించాలి. ఆలయాలు, అర్చనలు ప్రధానం కావు. కావలసినది సర్వేశ్వరోపాసన.

దాస్యశృంఖలాలను త్రెంచి, భావదాస్యాన్ని తుదముట్టించి స్వేచ్ఛని పొందాలి. ఇదే అవశ్యకర్తవ్యం. ఈ ముక్తిని ప్రసాదించేందుకే శ్రీరామకృష్ణ పరమహంస అవతరించారు. శ్రీ వివేకానందులు వారి దూతగా వారి సందేశామృతాన్ని అందరికీ పంచేందుకు అవతరించారు. లోకంలో సర్వత్రా స్వేచ్ఛా సమీరాలు ప్రసారం చేశారు. హిందూత్వపుటాత్మ బండరాతి గుడికి బందీయై కృశిస్తోందని, ఆత్మ జీవనానికి కృత్రిమ భౌతిక భవబంధాలు ఆత్మ కారాదని, గ్రుడ్డినమ్మకాలకు స్వస్తి పలికి, దేహదేవాలయాన్ని పరిశుద్ధం చేసి పునరుజ్జీవింపజేసి, స్వజాతీయ యోగసాధనతో విముక్తం చేసి, ఆత్మోన్నతితో దివ్యజీవన వికాసం పొందమని హితవు పలికారు. గ్రుడ్డిగా అనుసరించే, విజాతీయ విగ్రహారాధన వైఖరిని గర్హించారు. గ్రుడ్డిగా అనుసరించే, విజాతీయ విగ్రహారాధన వైఖరిని గర్హించారు.

(SABCL Vol. 2, pp. 461-63)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు, కె. కూర్మారావు

23

రెండు సూక్తులు

అవతారమూర్తి శ్రీరామకృష్ణులు దేవదూత వివేకానందులు చెప్పక చెప్పిన హితోక్తు లెన్నెన్నో! అనీ ఎలా తెలుసుకోవటం? భగవంతుడు వ్యక్తి ఆలోచనకి, మాటకి అందుతాడా! ఆయన అవాఙ్మానస సగోచరుడు కదా!

*

ఎవరీ రామకృష్ణులు? "దైవం మానుషరూపేణ" ఈ నేలపై నడయాడిని విశ్వేశ్వరుడు. మరి వివేకానందులో? ముక్కంటి తోజేమయ విలాసం త్రిమూర్త్యాత్మకంగా రూపుదాల్చిన ప్రణవనాదం.

(SABCL Vol. 17, p. 98)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

24

నిబంధనలేగాని బంధనలు కావు

తాత్త్విక భావనా లేక మతవ్యవస్థా అనేవి మన స్థాయి ననుసరించి భగవంతుడు మనచేత దర్శింపచేయ తలచిన విశ్వం యొక్క స్థితిగతులను గురించిన ప్రకటన మాత్రమే. మాయాస్వరూపమైన ప్రకృతిలో మనం వర్తించేటప్పుడు మన మనసు విభ్రమం చెందకుండా స్థిరంగా వుండేందుకు మన కిది ప్రసాదింపబడింది. మనం చేసిన విశ్వవ్యూహనిర్మాణ దర్శనం సరిగ్గా ఇతరుల దర్శనమే అయి వుండవలసిన అవసరం లేదు. మన మానసిక ప్రవృత్తీ ఆలోచనా విధానమూ మరొకరికి వుండాలని ఎక్కడా నియమం లేదు. ఆలోచనాధోరణుల పట్ల మనకు మూఢనమ్మకంకాని విశ్వాసము, బలహీనతకాని సహనమూ ఉండాలి. మన మేధాశక్తిని బట్టి మన దృక్పథ మేర్పడాలి. నీ భావన ఆ శాస్త్రాన్ననుసరించి లేదు. ఈ మహనీయుడి ప్రమాణాన్నను సరించి లేదు. ఆ తత్త్వవేత్త అభిప్రాయానికి భిన్నంగా వుంది. ఈ అవతారమూర్తి ప్రబోధానికి భిన్నంగా వుంది అన్న విషయానికి ప్రాధాన్యం లేదు. మనదైన అనుభూతీ, సాక్షాత్కారమూ మనకు ప్రధానమని గర్తుంచుకోవాలి. ప్రపంచంయొక్క స్వభావాన్ని

గురించి శంకరభగవత్పాదు లేమి తెలవిచ్చారో, తన మేధాశక్తితో వివేకానందులేమి వూహించారో, అనేకానేక రీతుల్లో రామకృష్ణ పరమహంస వివిధ అనుభూతుల నెల పొందారో — ఇవన్నీ కూడ భగవంతుడు మనకు కలిగించిన అనుభూతితో పోల్చి చూచుకోడానికీ, ఆ అనుభవాన్ని పునరావృతం చేసుకోడానికేనని గుర్తుంచుకోవాలి. తత్త్వవేత్తల, సాధుపుంగవుల, అవతారమూర్తుల అభిప్రాయాల్ని మనలను బంధించే సంకెళ్లలాగాకాక, మన సాధనకు సూచనలగానే స్వీకరించాలి. నీ యోగప్రస్థానంలో నీ గురువు ద్వారా నీవేమి దర్శించావో — సగుణమూర్తిగానో, నిర్గుణమూర్తిగానో, సర్వంలో వసించే వాసుదేవుడిగానో లేక ఒక గురుస్వరూపంగానే, మార్గదర్శిగానో ఆ అనుభవమే నీకు సంబంధించినది.

(SABCL Vol. 17, pp. 67-68)

భావానువాదం ధారా రాధాకృష్ణమూర్తి

25

సన్యాస వైరాగ్యములు

క్షుద్రమైన విషయముల కొరకుగాక ఉదాత్త ధ్యేయాన్ని సాధించడానికే మనకు సన్యాసవైరాగ్యములని ఋషులు తాము భావించిన ఆంతర్యాన్ని విప్పిచెప్పారు. క్షుద్రమైన ధ్యేయాలపట్ల దౌర్బల్యాల విషయంలో తస్మాత్ జాగ్రత్త!

'క్లైబ్యమ్ మాస్మగమః పార్థ నైతత్ త్వయ్యుపపద్యతే' అటువంటి క్షుద్రమైన దౌర్బల్యం సృష్టి స్థితి లయ స్వరూపమైన సాక్షాత్ పరబ్రహ్మస్వరూపమైన నిత్యుడికి తగదు. ఇంకో విధంగా చూస్తే దుఃఖమూ, ఆశాభంగమూ వల్ల కలిగే వైరాగ్యం నిజమైనది కాకపోలేదు. కొన్ని సమయాల్లో కొందరు అజ్ఞానబద్ధులై క్షుద్రమైన విషయాల కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. దానికి కారణం వారి బలహీనత కాదు. క్షుద్రస్వభావం వారికి సహజమైనది కాకపోవటమే. అది వారి ఔన్నత్యానికీ, ఉత్తమ భవితవ్యానికీ తగినది కాకపోవటమే.

దుఃఖము, ఆశాభంగము వాళ్ల కళ్లకను తెరిపించి తమ నిజస్వరూపాన్ని తెలుసుకునేటట్లు చేస్తాయి. అటువంటి పరిస్థితుల్లో వారు ఏకాంతాన్నీ, ధ్యానాన్నీ, సమాధిస్థితినీ వాంఛిస్తారు. ఆరని దుఃఖాగ్నినీ, తీరని కోరికలనీ మత్తుపానీయాలతో

ఆర్పే ప్రయత్నం చేయరు. ఎందుకంటే క్షుద్రమైన విషయాలను కాంక్షించరు గనుక. భగవంతుని ప్రేమతో నిత్యుడైన పరాత్పరుని గూర్చిన జ్ఞానాన్నే వారు అభిలషిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వారిని నూతన భావ్యావేశం ఆవహిస్తుంది. ఎందుకంటే ఏకాంతమైన పరంధాముని సన్నిధి మాత్రమే వారి బ్రహ్మతేజాన్ని వృద్ధి చేస్తుంది.

ఆ స్థితిని సాధించిన తరువాత దివ్యమైన బ్రహ్మజ్ఞానం లేక భావ్యమైన పరమప్రేమ వారి హృదయం నుంచి ప్రవహిస్తూ ప్రపంచాన్ని ముంచెత్తుతుంది. అటువంటి మహనీయమూర్తులే శంకరాచార్య, రామకృష్ణ పరమహంసలు. కొన్ని సందర్భాల్లో తాము పొందే సుఖసౌఖ్యాలూ, తమ చుట్టూ వున్న ప్రపంచంలో కనిపించే దుఃఖమూ, దైన్యమూ బుద్ధుణ్ణీ, క్రీస్తునీ అజ్ఞానాందకారంలో మునిగియున్న అభాగ్యులకు వెలుగు చూపించి ఆదుకోవాలని వారి అంతరాల లోతుల నుంచి ప్రయత్నించేట్టు చేస్తాయి. తమలో అపారమైన శుద్ధసత్త్వాన్నీ, శక్తినీ నింపుకున్న ఉత్తములైన సన్యాసులే ఉత్తమ సేవాతత్పరులై భగవంతుని కార్యాల్ని నిర్వహించే మహనీయులవుతారు.

వారి వైరాగ్య స్వరూప స్వభావాలెట్టివైనా, వారు దానిని పొందడానికి ప్రత్యక్షప్రేరణ మేదైనా, వారి వైరాగ్యంలో తీవ్రమైన దైవజిజ్ఞాస మిళితమైతే, అది నిజమైనదై, మోక్షోన్ముఖమైన కారణంగా పరిణమిస్తుంది. ఎప్పటికైనా పరమాత్మను చేరాలంటే నీవు ఆ స్థితిని అధిగమించాలి. దృశ్యమానజగత్తు పట్ల నీవు వైరాగ్యం పొందటం అవసరం. ఎందుకంటే దృశ్యమాన జగత్తు నీ దృష్టిని అధోముఖం చేస్తుంది. నీవు ఊర్ధ్వంగా చూడలేవు. బహిర్ముఖుడవవుతావుగాని అంతర్ముఖత్వం పొందలేవు. కాబట్టి మొదట వైరాగ్యప్రవాహాన్ని నీలోకి ఆహ్వానించాలి. అయితే అది ఆధ్యాత్మిక ప్రస్థానంలో ప్రాథమికదశే గాని నీ అంతిమ ధ్యేయం కాదు. ప్రపంచంపట్ల కలిగిన జుగుప్సాభావంవల్ల భాస్కరానందులు సన్యాసం స్వీకరించాడు. అయితే ముక్తుడయిన తరువాత ఆయనెంతగా మారిపోయాడంటే, ఒకవేళ భార్య బ్రతికివుంటే ఆమెతో గార్హస్థ్యజీవితం గడిపి వుండేవాడు. అటువంటి అభిప్రాయం జీవన్ముక్తుడికి సహజమైన చాంధసపరులైన పండితులకు గొంతులో పచ్చివెలక్కాయే అవుతుంది.

అద్వైతస్థితి లభించిన శ్రీరామకృష్ణ పరమహంస గృహస్థుడిగా ప్రపంచంలోకి అడుగుపెట్టడానికిగానీ, ఐహికజీవితం గడపడానికిగానీ అంగీకరించలేదు. ఆయన పరమభక్తిభావానికి ప్రతిరూపమైనా, దృశ్యమానజగతిలో మానవుడిగా వ్యక్తమైన

సగుణబ్రహ్మం అనుభూతి కలిగించినట్లే. సమాధ్యవ్యవస్థలో ప్రసన్నమైన నిర్గుణ పరబ్రహ్మం కూడా ఆనందం కలిగించింది.

కర్మయోగి వైరాగ్యస్థితిని అధిగమించాలేగాని దాంట్లోనే వుండిపోకూడదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే యోగులు అధ్యాత్మికత నంటిపెట్టుకొని భౌతికతను విడిచిపెట్టాలి. వైరాగ్యానికి సంబంధించిన ఆధ్యాత్మికతాంశ మేదంటే భౌతికజగత్తులోని వ్యామోహాల, స్వార్థపరమైన కార్యకలాపాల పట్లా విముఖత్వం వహించాలి. ఇక్కడ భౌతికాంశ మేదంటే అటువంటి వ్యామోహాలకు లొంగుతాననే భయమూ, వాటినుంచి తప్పించుకోవాలనే ప్రయత్నమూ. యోగులు జాగ్రత్తగా ఆధ్యాత్మికాంశను నిలుపుకోవాలి. శారీరక పవిత్రతకూ, సాధుత్వానికీ చిహ్నాలైన భౌతికాంశాల్ని అంటిపెట్టుకొనటం మోక్షం పొందటానికి అత్యవసరం కాదు.

(sri Aurobdindo Archives and Research, Dec. 1977, pp. 63-64)

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

26

ఆధ్యాత్మిక ఐక్యత

వ్యక్తి ఎంత వికాసము నొందునో, అంత ఆధ్యాత్మిక స్వతంత్రదిశగా పయనించును. కాని ఈ స్వతంత్రత సర్వసత్త నుండి సర్వదా వేరుపడియుండునది కాదు. సర్వసత్తయు ఆత్మయే — అది ఆ సత్తతో సమైక్యమును గల్గి యుండును. అతడు ఆధ్యాత్మిక స్వతంత్రత దిశగా పురోగమించుకొలది ఆధ్యాత్మిక ఏకతాదిశగా గూడ పురోగమించును. దీనిని సమర్థించుచు, గీత మనకిట్లు నుడువును: ఆధ్యాత్మికతను సాధించిన విముక్త మానవుడు సర్వభూతముల హితమునందు రతుడై యుండును; ఈ సమైక్యమే బుద్ధుని, తాను నిర్వాణమార్గమును కనుగొనిన పిమ్మట, ఏ మానవులింకను తమ సత్య సత్తు లేక అసత్తు నుండు గాక. తమ కృత్రిమ సంరచనశీల సత్తుయొక్క భ్రమకులోనై యున్నారో వారికి ఆ నిర్వాణమార్గమును తెరచి యుంచుటకు మరల ప్రపంచము వైపునకు మళ్లించెను. అటులే వివేకానందుడు నిరపేక్ష బ్రహ్మముచేత ఆకృష్టుడయ్యు, మానవజాతి యందు మారువేషమున నున్న భగవంతుని పిలుపును,

అత్యధికముగా పతితులు, దుఃఖితుల పిలుపును, తన ఆత్మకు వచ్చు విశ్వముయొక్క అంధకారము శరీరము నందలి పిలుపును గూడ ఆకర్ణించుచున్నాడు.

SABCL Vol. 19, p. 1050

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు (దివ్యజీవనము నుండి)

27

నిజమైన విముక్తి

ఈ వైయుక్తిక మోక్షేక్ష మరొక యాకర్షణచే జయింపబడుట తరచుగా చూచు చుందుము. అది కూడ ఉన్నతస్థాయిలో మన ప్రకృతి గైకొను నొక మలుపునకు సంబంధించినదే. ముక్తాత్మ అనుసరించవలసిన కార్యపద్ధతి ముఖ్యలక్షణ మెట్లుండవలెనో అయ్యది సూచించును. అమితాబ బుద్ధుడు యాత్మనిర్వాణ ద్వారము చెంతకు చేరినప్పుడు, ఆతడద్దానినుండి మరలిపోయి, ప్రపంచములో ఒక్క జీవి దుఃఖియై, అజ్ఞానియై మిగిలియున్నంత వరకు తానా ద్వారము దాటిపోవని శపథము గైకొన్న మహత్తరగాథ యందు గర్భితమైనది ఇదియే. "అష్టసిద్ధులతో గూడిన పరమస్థితినిగాని, జన్మరహిత్యమునుగాని నేను కోరను. దుఃఖితులైన సకలజీవుల దుఃఖమునూ నేను పొంది వారిని దుఃఖవిముక్తులుగ జేయుటకై వారియందు ప్రవేశింతుము గాక" — అను భాగవత పురాణములోని మహోదాత్త శ్లోకమున నీ యర్థమే ఇమిడియున్నది.

వివేకానంద స్వామిచేత ఒక లేఖలో నీ క్రింది విశిష్టభావోపేత వాక్యముల నుల్లేఖింపజేసిన దిదియే. ఆ మహావేదాంతి ఇట్లు వ్రాసినాడు: "నా మోక్షమునకై కోరికయెల్ల నాలో పూర్తిగ నశించిపోయినది. మరల మరల జన్మలు ఎత్తి దుఃఖపరంపరల ననుభవింపవలెనని కోరుచున్నాను. ఎందుకు? ఉన్న ఒకే ఒక భగవంతుని — సకల జీవాత్మల సమిష్టిరూపుడైన భగవంతుని — అంతేకాదు — దుష్టుల రూపములో నున్న నా భగవంతుని — దుఃఖితుల రూపములోనున్న నా భగవంతుని — సకల జాతులలోనూ, దీనుల రూపములలోనున్న నా భగవంతుని అర్చించుకొనుటకు నేను ప్రత్యేకముగా అర్చించునది అతని నొక్కనినే. ఉన్నతుడు పతితుడు, పుణ్యాత్ముడు పాపాత్ముడు, దేవతారూపుడు క్రిమిరూపుడు అయిన ఆ ప్రత్యక్షస్వరూపుని ఆ జ్ఞేయస్వరూపుని, ఆ వాస్తవికస్వరూపుని, ఆ నిఖిలస్వరూపుని అర్చించుచు,

ఇతర విగ్రహములనెల్ల పగులగొట్టివేయండి. ఎవనికి పూర్వజన్మము, ఉత్తరజన్మము లేదో, ఎవరికి మరణము, గమనాగమనములు లేవో, ఎవనిలో మన మింతకు ముందు ఎల్లప్పుడునూ ఉండి ఇక ముందగూడ ఎప్పుడునూ ఉండగలమో అట్టివానిని అర్చించుచు ఇతర విగ్రహములనెల్ల పగులగొట్టివేయండి".

ఉన్న విషయమంతయు కడపటి రెండు వాక్యములలోనే యున్నది. కుటుంబమును, సమాజమును బాహ్యముగ వదిలివేయుట మాత్రమున నది నిక్కమైన సన్యాసమెట్లు కాదో, అట్లే ఇహజీవనమును త్రోసిపుచ్చుటయు, ఆధ్యాత్మిక విలయనమును జీవుడు పొందుటయు జన్మబంధమునుండి నిక్కమైన విమోచనము కానేరదు. ఎవనియందు పూర్వజన్మము, ఉత్తరజన్మము అనెడి విభాగము లేదో, జన్మలు లేని నిత్యమైన ఆత్మపరిస్థితి మాత్రమే ఎవనియందు కలదో, అట్టి ఈశ్వరునితో అంతరమున ఏకత్వమును పొందుటయే నిక్కమైన విమోచనము. అంతరమున విముక్తుడైనవాడు కర్మలు చేయుచుండియు, చేయనివాడేయని గీత నుడువుచున్నది. ఏలయన, ప్రకృతి కధినాథుడైన పరమేశ్వరుని యాజ్ఞకు లోబడి అతనిలో పనిచేయునది ప్రకృతి. అటులనే, వంద పర్యాయములు దేహధారణ మొనర్చినను అతడు జన్మబంధము నుండియు, సంసారచక్రము నుండియు విముక్తుడే.

ఏలయన, అతడు నివసించునది జననమరణములు లేని ఆత్మయందు, — శారీరక జీవితమునందుకాదు. కావున, పునర్జన్మము నుండి తప్పించుకొనుటయందాసక్తిని ఇతరులెవరు వదలకున్నను, పూర్ణయోగసాధకుడు పగులగొట్టి పారవేయవలసిన విగ్రహములలో నిది యొకటి. ఏలయన, అతని యోగము విశ్వాతీతుని సాక్షాత్కారమును వ్యష్టాత్మ పొందుట మాత్రముతో పరిమితమగునది కాదు. సకల జీవాత్మల సమిష్టిరూపమైన విశ్వాత్మ సాక్షాత్కారము సైతము దానియందంతర్భూతమై యున్నది. కావున నీ యోగము వైయక్తిక మోక్షేచ్ఛా ప్రవృత్తి పూర్వకముగా జగచ్చక్రమునుండి తప్పించుకొనిపోవుటకు పరిమితమై పోనేరదు. విశ్వపరిమితుల నధికరించిన అతీతానుభవస్థితి యందు కూడ అతడు పరమేశ్వరుని యందు ఎల్లరితోడను ఏకమై యున్నాడు. కావున విశ్వములో అతడు కొనసాగించవలసిన ఈశ్వరకార్య మింకనూ మిగిలియే యుండును.

దీనిని గురించి శ్రీఅరవిందులు ఒక సాధకునికి రాసిన వివరణ

వివేకానందుని ఉదాహరణలో నాకు తట్టిన అర్థం మానవసేవా నిష్ఠ కాదు. వివేకానందుని లేఖనుండి ఉదహరించిన పేజీలోని చివరి వాక్యాలనే నేను ఎత్తి చూపానుగానీ, దరిద్రనారాయణునిని గురించి, పాపి, హంతకనారాయణులను గురించిన మాటలను గాదని నీవు నా 'యోగసమన్వయం' లో చూడగలవు. అచ్చటి ముఖ్యాంశమేమంటే, (మానవుడియందే గాక) ప్రపంచమంతట నున్న భగవంతుడు, సర్వమూ అయిన భగవంతుడు. గీత చెప్పే 'సర్వభూతాలు' భగవంతుడు కేవలం మానవజాతి మాత్రమే కాదు. అంతకు ముందే కేవలం దరిద్రులు, క్రూరులు మాత్రమే కాదు; నిశ్చయంగా ధనికులు, సాధుజనులు సైతం భగవంతునిలో భాగమే. అలాగే ఎవరు మంచి లేక చెడువారు కారో, భాగ్యవంతులు లేక పేదలు కారో, వారూ ఆ భగవంతుడే. అలాగే (నా వ్యాఖ్యలలో) దయతో చేసే మావనసేవా ప్రసక్తి కూడ లేదు. ఒకప్పుడు నాకు వ్యక్తిగత మానవసేవా దృష్టి లేకపోయినా, మానవజాతి దృష్టి ఉంది. ఆ వాసన 'ఆర్య' లోని నా వాక్యాలకు కొంత అంటి ఉండవచ్చు. కాని 'మన యోగం మానవవజాతి కోసం' అనే దృష్టి నుంచి, 'మన యోగం భగవంతుని కోసం' అనే దృష్టికి అప్పటికే మార్పు జరిగిపోయింది. (మరొక దృక్కోణం నుంచి) భగవంతుడు విశ్వాతీతమనే కాక, విశ్వమును, వ్యక్తిని గూడ — నిర్వాణమును లేక అతీతమును మాత్రమే కాక, జీవనమును, సర్వమును — తనలో ఇముడ్చుకుంటాడు. దీనినే నేను సర్వత్రా వక్కాణించుతున్నాను.

అనువాదం: కమలాకర వేంకటరావు ('యోగసమన్వయము' నుండి);
చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు నుండి')

28

అవతార తత్త్వం

పరిణామంతో ముడిపడి ఉండకపోతే, అవతారతత్త్వానికి ప్రాయః ఏ అర్థమూ వుండదు. హిందూమత మందలి దశావతార పరంపర స్వయంగా ఒక పరిణామ దృష్టాంతమైనట్లు మనకు గన్పించుతుంది. చూడండి; మొదట చేప అవతారం; తర్వాత నీటిలోను, నేలయందు చరించే ఉభయచర కూర్మం (తాబేలు); పిమ్మట భూచర వరాహం; అనంతరం పశుమానవుల నడుమ వారధిగా పనిచేసే నర-సింహం; అటు పిమ్మట వామవ (పొట్టి). ఈ పొట్టిమనిషిలోనే ప్రపంచాన్నంతటినీ ఆక్రమించగల దేవభావ ముంది; అటు తర్వాత ఈ భౌతికమానవుని ప్రాణిక రాజసిక మానవుని దశలోనికి నడిపిన రాజసిక పరశురామ అవతారం; తదనంతంర ఇతనిని సాత్త్విక-మానసిక మానవుని దశలోనికి నడిపిన సాత్త్విక రామావతారం. వీరందరికీ పైన నిర్గణ (గుణాతీత) కృష్ణావతరం. ఇతడు మానసిక మానవుని అధిమానసిక, అతిమానవుని దశలోనికి లేవనెత్తుతాడు. కృష్ణుడ, బుద్ధుడు, కల్కి, — ఈ మూడు అవతారాలు పరిణామంలోని చివరి మూడు దశలు — ఆధ్యాత్మిక ప్రగతికి, ప్రకాశానికి క్షేత్రములు. కృష్ణుడు అధిమనస్సుకు ద్వారం తెరుస్తాడు. బుద్ధుడు విశ్వానికావల ప్రాప్తించే పరమ విముక్తిలోనికి దూసుకుపోవడానికి ప్రయత్నించుతాడు. కాని ఈ విముక్తి ఇంకా సకారాత్మకమే (నిషేదాత్మకం) — ఏలన అది తిరిగి పృథ్వీలోకి దిగి, ఇచ్చటి పరి ణామాన్ని సకారాత్మకంగా సంపూర్ణం గావించదు. కాగా కల్కి — అవతారం ప్రతిఘటించే అసురశక్తులను నాశనమొనరించి, దైవరాజ్యమును గొనిరావడం ద్వారా ఈ లోపాన్ని సవరించవలసి వుంది. పరిణామమందు అవతారాల ఈ పురోగమనం అతిస్పష్టం. ఇచ్చట సంశయానికి అవకాశమే లేదు.

అవతార జన్మలకు నడుమ వుండే భగవంతుని జన్మలకు వస్తే, గతంలో తనకు కొన్ని పరమజన్మలే గాక, ఇతర జన్మలు కూడ గడచిపోయాయని కృష్ణుడు గీతలో చెప్పడం మనం జ్ఞాపకం తెచ్చుకోవాలి. అంతేగాక తనను భగవంతునిగా చెప్పుకుంటూనే, ఒక శ్లోకంలో తనను ఒక విభూతిగా వర్ణించుకున్నాడు — "వృష్ణీనాం వాసుదేవ ః" (గీత: 10-37). అందుచేత తన పూర్ణతర దివ్యచేతనను మరుగుపరచు కుని, అనేక జన్మల్లో ఆయన విభూతిగా అభివ్యక్తమయ్యాడని మనం అనుకోవచ్చు.

పరిణామాన్ని ముందుకు నడపడమే అవతారక్రియకు ఉద్దేశ్యమని మనం అంగీకరించితే అపుడు ఇలా అనుకోవడం సముచితమే. పెద్ద పెద్ద సంక్రమణాత్మక దశలందు అవతారంగాను, చిన్న చిన్న సంక్రమణాలకు సాయపడేందుకు విభూతిగాను భగవంతుడావిర్భవిస్తాడు.

విభూతి అంటే?

సామాన్య భావాన్ని బట్టి విభూతి భగవంతుని ఒక శక్తికి మూర్తీభావం. ఈ శక్తిచేత విభూతి ప్రపంచమందు పెద్దబలంతో వ్యవహరించగలదు — విభూతిగా పరిగణించ బడడానికి అవసరమైనదంతా అట్టి వ్యవహారమే. విభూతి శక్తి ఎంత పెద్దదయినా, అతని చేతన అంతర్గత లేక అంతఃస్థితి భగవంతుని గురించిన చేతన కాదు. ఈ విషయమునందు గీతే మనకు ప్రధాన ప్రమాణం. కాగా ఈ గీతను బట్టే మనం పై అవతార విభూతి వివేచనను సంగ్రహించుకున్నాం. ఈ వివేచన ననుసరించితే, రామకృష్ణులను గురించి మనకు తెలిసినదాన్ని బట్టి, వీరుభయులు అవతారాలని మనం అంగీకరించవచ్చు. ఇక బుద్ధునికి తన లోపలి శక్తి ఎక్కువగా నిర్వ్యక్తిక రూపానే అనుభూతమయింది. అయినా ఆయన కూడ అవతారంగానే కన్పించుతాడు. పోతే, ఎవడు రాముడో, ఎవడు కృష్ణుడో, వాడు తన లోపల వున్నాడని చెప్పినపుడు, రామకృష్ణుడు గూడ భగవచ్చేతన గురించే పలికాడు. కాని చైతన్యుని విషయం విలక్షణం. ఆయన తననొక కృష్ణభక్తునిగానే తెలుసుకొని, ఆ మాటనే ప్రకటించు కున్నాడు. అంతకెక్కువేమీ కాదని చెప్పుకున్నాడు. కాని కొన్ని సమున్నత సమయా లందు ఆయన కృష్ణుని అభివ్యక్తం గావించాడు. మనఃశరీరాల్లో ప్రకాశమయుపడ య్యాడు. కృష్ణునిగానే ఉన్నాడు. ప్రభువుగానే భాసించాడు. వ్యవహరించాడు. ఆయన సమకాలికులు ఆయనలో కృష్ణావతారాన్ని దివ్యప్రేమ అభివ్యక్తిని దర్శించారు.

శంకర, వివేకానందులు నిశ్చయంగా విభూతులు. విభూతులుగా వారు ఎంత గొప్పవారైనప్పటికీ, వారిని అంతకు మించినవారినిగా లెక్కించలేము.

SABCL Vol. 22, pp. 401-02; 406-07

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు')

29

అద్భుతమైన గతము — అత్యద్భుతమైన భవితము

రామకృష్ణుడు స్వయంగా రూపాంతరీకరణం గురించి ఎప్పుడూ తలంచలేదు. అందు నిమిత్తం ప్రయత్నించలేదు. ఆయన కోరినదంతా అమ్మయందు భక్తినే. ఇక ఆ భక్తితో బాటు ఆమె ఏ జ్ఞానం ప్రసాదించితే, దానిని స్వీకరించాడు. ఆమె దేనిని చేయించితే దానిని చేశాడు. ఆయన తన చేతనయందు ఆదినుంచీ, అంతః స్ఫూర్తికం, అంతరాత్మకం. ఆయన ముందుకు సాగినకొలదీ మరింత అలా అయ్యాడు. మెట్లను ఎక్కడమే కాక, దిగి కూడా రాగల దివ్యమానవుని (ఈశ్వరకోటిని) గురించి ఆయన ప్రవచించినప్పటికీ, నూతన చేతన గురించీ, నూతనజాతిని గురించీ, పృథివీ ప్రకృతియందు దివ్య అభివ్యక్తిని గురించి ఆయన కెలాంటి ఊహా లేదు.

రామకృష్ణుని యోగం అంతర భగవంతుని అంతర ఉపలబ్ధి వైపుకే తిరిగింది — అది అంతకు తక్కువ కాదుగాని, అంతకు ఏమాత్రం ఎక్కువ కూడ కాదు. ఎవడు భగవంతునికి తన సర్వస్వం ఆహుతి గావించాడో, ఆతనికి భగవంతునిపై అధికారముంది అని రామకృష్ణుడు చెప్పిన మాట భౌతికముగా దేహం ధరించిన భగవంతునిపైన కంటె అంతర భగవంతుని పైనే, బాహ్య అధికారాన్ని గాక, అంతర అధికారాన్నే వక్కాణించుతోందని నా నమ్మకం. అది సంపూర్ణ ఆధ్యాత్మిక సంయోగము నపేక్షించే అధికారం — ఇచ్చట భగవదనురక్తుడు భగవంతుని అన్వేషించుతూ ఉండగా, భగవంతుడు కూడా స్వయముగా తనను తానర్పించుకుని, ఆ భగవదనురక్తుని కలుసుకుంటాడు. దీని కెలాంటి ఆక్షేపణ ఉండజాలదు. భగవదుపాసకులందరు అట్టి అధికారం కలిగి ఉంటారు. కాని ఈ దివ్యమిలనానికిగల లక్షణాలేమిటో, ఇది మనకంతగా తెలియజేయదు. ఆ లక్షణాలేమైనా, భౌతిక భూమికయందు ఉపలబ్ధే నా ఉద్దేశ్యం. కావున రామకృష్ణుడు చేసిందే తిరిగి చేయడానికి నేను సమ్మతించజాలను. చాలా కాలమాయన అంతర్ముఖుడై ఉండిపోయాడు. ఆయన తన జీవితమంతా శిష్యులతో గడపలేదు అని కూడ నాకు కొంత గుర్తు ఉంది. ఆయనకు ముందు తన సిద్ధి ఏకాంతమున ప్రాప్తించింది. ఇక ఆయన బహిర్ముఖుడై అందరికీ దర్శన మిచ్చినప్పుడు, ఔను కొద్ది సంవత్సరాల్లోనే అది ఆయన శరీరాన్ని జీర్ణం చేసివేసింది. అందుకాయన చింతించలేదని నేననుకుంటాను. ఏలన కేశవచంద్రుడు

చనిపోతూ వున్నప్పుడు, ఆధ్యాత్మికానుభవం శరీరాన్ని జీర్ణంచేయడం ఉచితమే — అనే సిద్ధాంతాన్ని సైతం ప్రతిపాదించాడు. కాని అదే సమయాన మీకు గొంతుకలో ఎందుకు పుండు పుట్టింది? అని ఆయన నడిగినపుడు, శిష్యులు తమ పాపాలను నా మీదకు త్రోసివేశారు. వాటిని నేను మ్రింగవలసి వచ్చింది, అని ఆయన జవాబు చెప్పాడు. అంతరవిమోచనచేత మాత్రమే నేను తృప్తిపడను — నిజానికి, ఆయనా తృప్తిపడలేదు. కావున నేనీ భావాలను లేక ఫలితాలను అంగీకరించను. పైగా అంతరజీవనానికి అదెంత సఫలసంయోగమే అయినా, భౌతిక భూమికయందు అది జీవేశ్వరుల సఫలసంయోగమైనట్లు నాకనిపించడం లేదు. పోతే కృష్ణుడు మహత్తర కార్యాలు గావించాడు. కావున ఆయన అతిస్పష్టంగానే ఒక భగవదభివ్యక్తి కాని నాకు మహాభారతంలో ఒక ఘట్టం గుర్తు వుంది. అక్కడాయన ఈ విధంగా వాపోయాడు: నా అనుయాయులు, ఆరాధకులు నా జీవితాన్ని అస్థిరపరుస్తున్నారు. వారి సంతత అభ్యర్థనలు, నిందలతో నేను విసిగిపోయాను. తమ అసంస్కృత ప్రాణిక్రప్రకృతిని నా మీదిగి నెట్టివేస్తున్నారు — అని. ఇక గీతయందు ఆయన ఈ మానవలోక మొక అనిత్య, అసుఖ, వ్యాపారమని చెప్పుతున్నాడు. అంతేకాదు, దివ్యకర్మ సిద్ధాంతం ఒక వైపున ప్రతిపాదించుతూనే, చివరకు ఈ లోకాన్ని విడిచివేయడమే ఉత్తమ పరిష్కారమని చెప్పుచున్నాడా అనిపించుతుంది. గతకాల సంప్రదాయాలు తమ స్వీయస్థానమందు గతకాలమున మిక్కిలి గొప్పవే. కాని మనం కూడ అలాగే ఎందుకు చేయాలో, ఎందుకు ముందుకు పోకూడదో, నా కర్థం గావడం లేదు. పృథివిపై చేతనయొక్క ఆధ్యాత్మికాభివృద్ధి యందు గత మహావైభవం తర్వాత భావి మహత్తర వైభవం రావాలి.

(SABCL Vol. 22, pp. 94, 87-88)

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు' నుండి)

30

శ్రీరామకృష్ణులు — అవతారమూర్తి

సగుణబ్రహ్మ (ఇష్టదైవ) దర్శనమనియు నిర్గుణ పరబ్రహ్మైక్యమనియు చెప్పబడు రెండు విధములగు బ్రహ్మసాక్షాత్కారమును మనము పొందగలము.

ఈ వాగ్దానము పూర్వకాలములో సద్గురువుల దగ్గర దీక్ష తీసికొనిన కొద్దిమంది ఉత్తమశిష్యుల విషయములోనే నెరవేరెడిది. కాని ఇది నేటి కాలములో కూడ ఫలించ గలదని మరొకసారి బుజువు చేయబడినది. ఇటీవల కాలంలో ఒక మారుమూల ప్రదేశములో నివసించిన భగవంతుని అవతారమూర్తియు, ఆయన దివ్యప్రకాశమునకు ప్రతీకయైన దక్షిణేశ్వర రామకృష్ణ పరమహంస జీవితమే ఇందుకు మహత్తర నిదర్శనము. ఆయన తన ఆధ్యాత్మిక బోధనల వలనగాని, నిస్సంగజీవన విధానము వలనగాని నైతిక ప్రబోధముచేతగాని, దుఃఖోపశమనమునకు సూచించిన మతపరమైన కర్మ కాండరూప ఔషధము చేతగాని ప్రపంచములో సంచలనము సృష్టించలేదు. తన అసమాన పరిపూర్ణత, ఔదార్యములతో మరొకసారి వేదాంతమార్గము ద్వారా భగవ దనుభూతిని, ఆంతరిక జిజ్ఞాస ప్రకటనను ఎట్లు సాధించవచ్చునో ప్రపంచమునకు బుజువు చేసెను.

నిరక్షరాస్యుడు, పేదవాడునైన ఈ వంగదేశ గ్రామీణుడు తన జీవితాంతము వరకును తన గ్రామీణ యాసతోనే మాట్లాడేవాడు. తన హావభావములను మొరటుగానే వ్యక్తపరచేవాడు. ఆయనకు సంస్కృత పరిజ్ఞానం శూన్యం. తత్త్వశాస్త్రంతోగాని, విజ్ఞానశాస్త్రంతోగాని పరిచయం లేదు. తనకు తెలిసిన వంగభాషను కూడా ప్రాంతీయ నుడికారంతోనే మాట్లాడగలడు. ఆయనకు ప్రపంచపోకడ అసలే తెలియదు. అయినా సనాతన అధ్యాత్మిక జ్ఞానమును సంపూర్ణముగ తనలో ఆవిష్కరింప జేసుకున్నాడు!

> స్వామి వివేకానందులు అన్నట్లుగ యోగం మనిషియొక్క వికసనాన్ని ఆతని దైహిక ఉనికిలోని ఒక్క జీవితకాలానికో లేక కొన్ని సంవత్సరాలకో కొన్ని మాసాలకో సంక్షిప్తపరిచే విధానంగ పరిగణించవచ్చు,
>
> శ్రీఅరవిందులు

ఆయన తన దివ్యసూక్తుల ద్వారా గంభీరము, జటిలమునైన ఆధ్యాత్మిక విషయములపై వెలుగును ప్రసరింపజేసెను. మేధావంతులకు, పండితులకు సైతము అంతుపట్టని తాత్త్విక ప్రశ్నలకు తన సహజ సరళరీతిలో సమాధానములు చెప్పి శ్రోతలను సంభ్రమాశ్చర్యములకు గురిచేయుట ద్వారా, తన ఆధిక్యతను నిరూపించుకొనెను. ఆయన ఏ పద్ధతి నవలంబించి ఇట్టి జ్ఞానభాండాగారమును తనలో నింపుకొనగలిగెనో చెప్పజాలము. అయితే అది బుద్ధికుశలతగాని, తార్కికసామర్థ్యము వలనగాని కాదని మాత్రము స్పష్టంగా చెప్పగలము. బుద్ధితో వివేచన చేయవలసిన అతిచిన్న విషయములలో కూడా ఆయన బాలునివలె ప్రవర్తించేవాడు. అజ్ఞానియైన తన సాటి పల్లెటూరి రైతు కంటె ఇంకా అమాయకంగా ఉండేవాడు. సునిశితమైన తన జ్ఞాన క్షేత్రంతో — మానసికశక్తితో కాదు సుమా — జనుల హృదయములను, వారి ఆశయములను పరిశీలించేవాడు. ఆధునికకాలంలో – ఇంకా నిజం చెప్పాలంటే మానవజాతికి విచిక్షణాజ్ఞానం ప్రాప్తించిన తరువాత యథార్థజ్ఞాన సముపార్జనకు ఈ విధంగా మేధాశక్తిని పూర్తిగా విస్మరించినవారు అరుదుగా కనిపిస్తారు. ఆయన ఇట్లు సఫలీకృతుడగుటకు కారణం ఆయన నైతికజీవన విధానము, పారమార్థికదృష్టి ఏకం కావటమే. అయితే చాలామంది వివేచన ద్వారానే తమ ఆలోచనలను, సున్నితభావములుగా మలచుకుంటారు. ఉద్రేకాలను, ఆలోచనలతో మేళవించి అనుభవిస్తారు. అయితే రామకృష్ణులు తన హృదయాంతర్గత అంతర్దృష్టితో — వివేచనాశక్తితో కాదు — బాహ్యవ్యక్తులను, వస్తువులను పరిశీలించి చూసి, ఆ వెలుగునే తన అనుభవంగా తీర్చిదిద్దుకొనేవాడు.

ఈ గ్రాహకశక్తిని వినియోగించుకొనే సామర్థ్యాన్ని ఆధునిక మానవుడు పోగొట్టుకొని చాలా కాలమైంది. ఈ విధంగా ఆయన తమ సమగ్ర మానసిక, భౌతికానుభవములకు మూలకారణం సాధించటంవలన ఆయన బుద్ధి అత్యధికంగా వాస్తవజ్ఞానంతో నిండి అది సదాత్మ వైపు తిరిగి సమస్త వస్తువులలోని సత్యాన్ని దర్శించగలిగింది. చివరకు ఏ వస్తువు కూడా తన ఆంతరిక రహస్యమును ఆయన నుండి దాచలేకపోయింది. ఏ శిఖరము ఆయన ఆరోహించుటకు అవరోధం కలిగించలేదు. ఆయన మొదటిసారి స్పష్టంగా, సమగ్రంగా ఎట్టి అరమరికలు లేకుండా సద్రూపి స్థానము మనస్సుకు పై వున్నదని చూపెను.

రామకృష్ణులు ఆ సద్రూపి సృష్టి విజ్ఞాన మంతటిని తనలో నిలుపుకొనగలిగిన

మహత్తత్త్వము లేక మహాబుద్ధి అనీ అదే అదే మానవునిలో కేంద్రస్థానమున నుండుననీ తేల్చిచెప్పెను. కనుకనే ఆయన శతాబ్దాలుగా మనల్ని బంధించి వుంచిన సంకెళ్ళను ఛేదించగలిగెను. ఇంకను ఆయన వివిధ యోగమార్గముల భేదములను గ్రహించగలిగెను. ఒక్కొక్క మార్గము ద్వారా ఆయన తన సాధనను చివరదశ వరకు కొనసాగించి సమస్త సాధనలకు పరమావధియగు నిర్వికల్ప సమాధిని మూడు రోజులలోనే చేరుకొన గలిగెను. ఈ సిద్ధి కలుగుటకు తీవ్రసాధన చేయు యోగులకు కొన్ని దశాబ్దములుగాని, లేక కొన్ని జన్మలుగాని పట్టవచ్చును. ఆయన మతబేధములను పూర్తిగా తొలగించి వేసెను. క్రైస్తవ సూఫీ సంప్రదాయ సాధనల నభ్యసించి వాటి ఫలము ననుభవించి, అది తన హిందూశాక్తేయ సాధనల మహాఫలమునకు భిన్నము కాదని గ్రహించి, అయినను తన సంప్రదాయముననే స్థిరపడెను. అతడు గురుపరంపరలోని లోటు పాట్లును ఖండించెను. తన బాహ్యాపూజా విధానమునకును, యోగశిక్షణమునకు మాత్రమే మానవ గురువులను స్వీకరించి, తన ప్రథమ, పరమ దీక్షలను జగన్మాత నుండియే తీసికొనెను. ఆతనికి అనుభవేక వైద్యమైన యథార్థజ్ఞాన మంతయును జగద్గురువైన దివ్యమాత నుండి లభించినదే.

ఆయన వేదాంతశాఖల తార్కికవాదములను ఖండించి వేదోపనిషత్తులలో ప్రతిపాదింపబడినట్లు ద్వైతాద్వైత సాధనల వలన ప్రాప్తించగల పరమానందానుభవ మొక్కటేనని నిరూపించి చూపెను. ఆనాటి ఆధ్యాత్మిక జీవనమును నియంత్రించు జ్ఞానభాండాగార మంతటిని తన హృదయములోనికి స్వీకరించుటేగాక, దానిని తన మానసిక, భౌతికానుభవములకు ఆధారముగా తీర్చిదిద్దుకొనెను. తన అఖండ, అగాధ వ్యక్తిత్వములో ఆనాటి ఆధ్యాత్మిక జీవనవిధానములోని దోషములను, అపూర్ణత లను జీర్ణింపజేసుకొని, ఆ ముసుగులు, రూపముల ద్వారానే పరిపూర్ణము, పరమో త్కృష్టమునైన దైవమును ప్రకాశింపజేసెను. ఈ విధముగా అతడు ఉత్తమ జ్ఞానప్రాప్తికి అనుభవము, అంతరబోధలే పరమసాధనములని నిరూపించెను. కావుననే ఆయన జీవితము మానవజాతి పురోగతికి బీజప్రాయముగా నిలిచిపోయెను. ఆ బీజములో మానవుని తార్కిక మనోబంధములను తెంచుకోగల సామర్థ్యముతోపాటు మానవ జీవయాత్ర హేతుబద్ధత యనెడు చుట్టూ తిరిగే బండ్లదారిన గాక ఆంతరికజ్ఞానమనే

బహు దగ్గరదైన కాలిబాట ఆధ్యాత్మిక శిఖరాగ్రమున ఎట్లా సమాప్తి చెందగలదో సూచితమై యున్నది.

Sri Aurobindo Archives and Research, April, 1981, pp. 25-26

అనువాదము: డా. కోట వేంకటేశ్వర రావు

31

క్రాంతి పథము — శీఘ్రమైన మార్గము

ప్రాచీన యోగులు, అన్వేషకులు మొదట శాంతినే కోరుకుండేవారు. ఇక ఏది సర్వదా శాంతిని గొనివస్తుందో, ఆ నిశ్చల, నీరవ మనస్సే భగవదుపలబ్ధికి సర్వోత్తమ నిబంధనయని వారు ప్రకటించారు. ఒక ప్రఫుల్ల మరియు ప్రకాశమయ హృదయం ఆనందానికి తగిన పాత్ర కాగా ఆనందం లేక దానికి దారితీసే మార్గం భగవంతునితో సంయోగానికి అవరోధమని ఎవరు చెపుతారు? విషాదాన్ని మోసుకొనిపోవడం నిశ్చయంగా ఒక భయంకర భారం. 'యాత్రికుని ప్రగతి' అనే పుస్తకమందు క్రైస్తవుడు విషాదం బురదలోనుంచే, దాని ద్వారానే ముందుకు పోవాలి — అని చెప్పబడింది. కొన్ని సమయాల్లో అలా చేయవలసి రావచ్చు. కాని దానినే తిరిగి తిరిగి వక్కాణించడం ఒక అవరోధం మాత్రమే అవుతుందిగాని మరేమీ కాదు.

విశేషించి గీత ఇలా చెపుతుంది. "విషాదానికి లోనుగాని హృదయంతో యోగాన్ని ఆచరించు" (గీత:6-23). బాధ, దుఃఖం, సంఘర్షణ, నిరాశాప్రవేశం యోగమార్గాన సహజమేనని నాకు బాగుగా, పూర్తిగా తెలుసు కాని అవి అనివార్యం కావు. ఇక అవి సహజ మెందుచేతనంటే, అవి యోగానికి సాయపడడం చేతకాదు. దేని నుండి కష్టముతో పెనుగులాడి మనం వెలుగులో అడుగిడవలసి ఉంటుందో, మన ప్రకృతియొక్క అట్టి అంధకారంచేత అని ఆరోపించబడుతూ ఉన్నాయి గనుక. నీవు ఏ ఘటనలను సూచించుతున్నావో, ఇతరులు వాటిని అనుసరించాలన్న భావనతో రామకృష్ణుడుగాని, వివేకానందుడుగాని వాటిరి ప్రస్తావించారని నేననుకోను. విశ్వాసం, సహిష్ణుత, పట్టుదల — ఇవే ఎక్కువ మంచిమార్గమని నిశ్చయంగా వారు చెప్పి వుంటారు. వారి జీవితంలో నీవు సూచించిన ఘటన లెట్టివైనా, చివరికి వారీ మార్గాన్నే అంటిపెట్టుకుని ముందుకు సాగిపోయారు. నారదుడు తపస్వి,

యోగి, వైష్ణవభక్తుడు — వీరితో గూడిన కథను, దానిలోని నీతిని ఆమోదించే రామ కృష్ణుడు చెప్పాడనేది చివరికి తేలే విషయం. ఆ కథాసారాన్ని నేనిపుడు నా మాటల్లో చెపుతాను.

నారదుడు వైకుంఠానికి వెళుతూ, కొండల్లో కఠిన తపస్సు గావించుతూ వున్న ఒక యోగిని కలుసుకున్నాడు. అపుడా యోగి కోపంతో యిలా అరిచాడు — "ఓ నారదా! నీవు వైకుంఠానికి వెళుతున్నావు. అక్కడ విష్ణుమూర్తిని చూస్తావు. నా జీవితం పొడవునా మహోగ్ర తపస్సును గావించుతూ వచ్చాను. అయినా ఇప్పటికీ గూడా నేను విష్ణువును పొందలేదు. నేనెపుడు ఆయనను చేరుకొంటానో కనీసం నా కోసం తెలుసుకో". పిమ్మట నారదుడు విష్ణువును గురించి పాటలు పాడుతూ, ఆ పాటలను బట్టి నృత్యం చేస్తూ వున్న ఒక వైష్ణవ భక్తుని కలిశాడు. అతడు గూడా ఇలా అర్థించాడు బిగ్గరగా — "నీవు నా ప్రభువు విష్ణువును చూడ బోతున్నావు. నే నెప్పుడు నా ప్రభువు ముఖపద్మాన్ని దర్శించగలనో అడిగి తెలుసుకో". నారదుడు తన తిరుగు ప్రయాణంలో ముందు యోగి దగ్గరకు వచ్చి ఇలా చెప్పాడు — "నీ వాయనను ఇంకా ఆరు జన్మల తర్వాత పొందుతావు". అపుడా యోగి ఎలుగెత్తి విలపించాడు — "నే నెంతటి తపస్సు గావించాను ఎంత బ్రహ్మాండముగా ప్రయత్నించాను! విష్ణుమూర్తికి నా పట్ల ఎంత కాఠిన్యం!" తర్వాత భక్తుని గూడ తిరిగి కలుసుకుని చెప్పాడు. "నేను నీకే శుభవార్తను మోసుకు రాలేదు. నీవు లక్ష జన్మల పిమ్మట మాత్రమే ప్రభువును దర్శించుతావు". కాని ఆ భక్తుడు పారవశ్యంతో గూడిన పెద్ద కేకతో ఎగిరి గంతులేశాడు — "ఓ, నేను నా హరిని చూస్తాను! ఒక లక్ష జన్మల తర్వాత చూస్తాను! భగవదనుగ్రహం ఎంత గొప్పది!" అని పలికి, నూతన హర్షపారవశ్యంతో పాడాడు. అపుడు నారదుడు నిజం చెప్పాడు — "నీవు చేరుకున్నావు నీ ప్రభువును. నేడే ఆయనను దర్శించుతావు". దీనిని విని నీవిలా అనవచ్చు — "బాగుంది. కాని ఇది ఎంత అతిశయంతో కూడిన కథ. మానవ ప్రకృతికి ఎంత విరుద్ధం!". కాని నీవు తలంచినంతగా ఇది మానవ ప్రకృతికి విరుద్ధం కాదు. ఈ మాట ఎలా వున్నా ఈ కథలో శిబిచక్రవర్తి, హరిశ్చంద్రుల కథలలో కంటె ఎక్కువ అతిశయోక్తి లేదు. అయినా నేనా భక్తుని ఆదర్శంగా చూపను. ఏలన ఆరుజన్మల్లోనో, లక్షల జన్మల్లోనో గాక, ఈ జన్మలోనే భగవదుపలబ్ధిని పొందాలని పట్టుబడతాను. కాని ఈ కథలోని ముఖ్యాంశం అని చెప్పదలం

చిన నీతిలో వుంది. రామకృష్ణుడు ఆ కథను చెప్పినపుడు యోగసిద్ధికి ఒక పూలబాట ఉందని ఆయనకు తెలియకపోలేదు. అంతేకాక, అదెంత మంచిమార్గమో, అంత శీఘ్రమార్గం కూడ — అని ఆయన చెప్పినట్లు కన్పించుతుంది.

SABCL Vol. 23, pp. 789-90

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు' నుండి)

32

శ్రీరామకృష్ణుడు చెప్పిన 'వకాల్తా'

కొందరు దైవం నుండి ఆదేశం కోసం నిరీక్షిస్తూ అది లభించే వరకు ఏమీ చేయకూడదని నిశ్చయించుకొని కూర్చొంటారు. వారి ఆశ తప్పకుండా నిరాశే అవుతుంది. మరి కొందరు తాము ఆంతరంగిక ఏకాంతతను పాటిస్తూ నిజంగా దైవముఖాన్ని పరికిస్తూ ఒంటరిగా పనిచేస్తారు. భౌతిక ఏకాంతత, ధ్యాన నిమగ్నత అవసరమే కాని అవి కేవలం అనుషంగికాలు. సాధనారూపంగా దైవసమర్పణ భావంతో తొలుత ఫలితాలను పరిగణించకుండా, పిదప కర్మలతో అనుబంధం లేకుండ వ్యవహరించడమన్నది తప్పనిసరి నిబంధన. శ్రద్ధతోను, విశ్వాసంతోను ఏ పని చేసినా అది దైవనిమిత్తమనేవారు, దైవదత్తమని భావించాలి. అందు దోషాలు ఉండవచ్చు. పొరపాట్లు దొర్లవచ్చు. కాని మనం భయపడవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. అది వీరమార్గం — వీరులు అనుసరించిన మార్గము.

మనం మన స్వశక్తి మీద మాత్రమే ఆధారపడినంత వరకు తప్పులు జరుగుతూనే

> స్వామి వివేకానందులు వారి గురువుల ప్రణాళిక మేరకు ప్రపంచాన్ని తమ హస్తగతం చేసుకొని దానిని మార్చుటకు నియమింపబడిన ఒక ఉదాత్తమైన ప్రతిభాశాలిగ జైత్రయాత్రకు వుద్యమించుట, భారతదేశం తన ఉనికిని కొనసాగించుటయే గాక జయించుటకు కూడ చురుకుగ సంసిద్ధమై వున్నదని లోకానికి చాటే ప్రథమ సంకేతం
>
> శ్రీఅరవిందులు

వుంటాయి. అదే ఆయన దగ్గర నుంచి వస్తే ఆ లోపాలను సవరించుకోవడానికి తగిన బలం సమకూరుతుంది. రామకృష్ణుడు ఎప్పుడూ చెబుతూ వచ్చిన వకాల్తా యిదే!

ఒక జాతి కూడా అలాగే తప్పులు చేస్తూ, పొరపాట్లు సవరించుకొంటూ, పాపాలను పరిత్యజిస్తూ ముందుకు సాగిపోతుంది. పనిలోని తప్పులూ, పాపాలు, విపత్తులు, అపజయాలు దుష్కర్మ అవశేషాలే! ఒకసారి ఆమె పేరు తన పెదాలపై పడిందా యిక దివ్యమాత పరిత్యజించదు. అనవసరంగానైనా, వ్యతిరేకంగానైనా, అనుకోకుండానైనా ఆ పేరును గ్రహిస్తే చాలు ఆమె రక్షణ లభిస్తుంది. హృదయ పూర్వకమైన సాధనకు పునాది పడితే మాత్రం మరింత ప్రయోజనం సమకూరుతుంది.
SABCL Vol. 2, pp. 431-32

అనువాదం: డా. అల్లూరి వేంకట నరసింహరాజు

32

మార్జాల కిశోర న్యాయము

నువ్వు నిజంగా దేవుడు కావాలనుకుంటే ఆయనే అంత బాధ్యతను వహించి నీ హృదయాన్ని పరిశుద్ధము గావిస్తాడు. నీ సాధనను వేగిరపరచి అవసరమైన అనుభూతుల నిస్తాడు. దేవుణ్ణి నమ్ముకొని ఆయనకు నిన్ను నీవు సమర్పించుకోవటము వలననే అది సాధ్యమౌతుంది. కాని అలా జరగాలంటే నీవు కేవలం నీ స్వశక్తి మీద ఆధారపడ కూడదు. పూర్తిగా దేవుడి మీదనే ఆధారపడి ఆయనను నమ్ముకుంటూ అధికాధికంగా సమర్పణను కొనసాగించాలి. నేనవలంబించిన పద్ధతి కూడ అదే. నా దృష్టిలో యోగానికి ఇదే ముఖ్యమైన పద్ధతి. పిల్లికూనను తల్లి ఎలా పట్టుకొని మోస్తుందో, పూర్తిగా తల్లిమీదనే ఎలా ఆధారపడుతుందో సాధకుడు కూడ పూర్తిగా దేవుని మీదనే ఆధారపడాలని రామకృష్ణుడు చెప్పిన కథలోని భావమిదే అనుకుంటాను. కాని అందరూ అలా చేయలేరు. ఆ స్థాయికి చేరేందుకు కొంతకాలం పడుతుంది. మనోప్రాణికములు చేసే గోల సద్దుమణిగి అవి కుదుటపడ్డప్పుడుగాని అది సాధ్యపడదు.

మనో[ప్రాణికములను ఆంతరంగికంగా సమర్పించుకొనుట — దీనినే నేను సమర్పణ అంటాను. ఆంతరంగిక సమర్పణలోని ముఖ్యాంశము దైవమును విశ్వసించి ఆయనను నమ్ముకొనుటయే — ...

SABCL Vol. 23, pp. 586-87

అనువాదం డా. ఆర్.ఎల్. ఎన్. శాస్త్రి

34

ఆత్మవిశ్వాసం తప్ప అహంకారం కాదు

(సాధన — శోధన)

సాధకుని చేతన విస్తరించి అతనికి దివ్యానుభూతులు కలిగినప్పుడు అతడు సహజంగానే సాధుశీలి, వినయసంపన్నుడు అవుతాడు. అప్పుడు ఒక విధమైన 'ఇగో' — అధిక్యతా భావం ఏర్పడక తప్పదు. శ్రీరామకృష్ణ పరమహంస శిష్యుల్లో నాగమహాశయుని వంటివారి విషయంలో ఆధ్యాత్మికానుభూతి వినయశీలాన్ని మరింతగా పెంపొందించింది. వివేకానందునివంటి ఇతరుల విషయంలో అది మనోధైర్యాన్ని, ఆధిక్యతా భావననీ కలిగించింది. అందుకే ఆయన పాశ్చాత్యులనుంచి తీవ్రవిమర్శలకు గురయ్యాడు. ఆధ్యాత్మికానుభూతివల్ల నాటికాలంలో ఆధిక్యతాభావం, దైవవిధేయతా స్థిరపడిన సాధకులు ఎందరో వున్నారు. ఈ స్థితులన్నింటిలో దేని విలువ దానికే వుంటుంది. వివేకానందుని విషయమే తీసుకొంటే, ఆయన ఒక మద్రాసు పండితునకు చెప్పిన సమాధానం ఎంతో ప్రసిద్ధమైనది. ఒకసారి స్వామి వివేకానంద మాట్లాడుతుంటే ఒక పండితుడు అడ్డుపడి "శంకర భగవత్పాదులవారు అలా చెప్పలేదే?" అన్నాడు. వెంటనే స్వామి సందేహించకుండా "శంకరులు చెప్పకపోవచ్చు — నేను — వివేకానందను చెబుతున్నా" అన్నాడు. ఆ పండితుడు అంతటితో అవాక్కయ్యాడు. సామాన్యదృష్టికి స్వామి చెప్పిన "నేను వివేకానందను" అన్న మాటలు హిమాలయమంతటి ఆత్మవిశ్వాసపు అహంకారంగా అనిపించవచ్చు. కాని, వివేకానందుని ఆధ్యాత్మిక సాధనలో దోషంకాని, కాపట్యంకాని ఎంతమాత్రమూ లేవు. అసలు చెప్పాల్సివస్తే అది అహంకారమే కాదు. ఒక మహత్తర వారసత్వానికి ప్రతినిధిగ, ఎవరైనా తనను కించపరిచినా, అవమానించినా సహించలేని ఒక విధమైన

సమర్పణభావంతో కూడిన న్యాయమే ఆయన మాటల్లో కనిపిస్తుంది. అయితే అహంకారరాహిత్యం, ఆధ్యాత్మిక విషయం అనవసరమని కాదు. ఏది ఆత్మవిశ్వాసమో, ఏది అహంకారమో తేల్చిచెప్పడం పైకి అనుకొన్నంత సులువు కాదని నా భావన. ఉదాహరణకు — నేను నా ఆధ్యాత్మిక అనుభూతులు వ్యక్తపరచవలసివస్తే, నేనా పనిని ఎంతో ఆర్జవంతో చేయాల్సి వుంటుంది. నేను వాటిని రాసుకోవాలి. వాటి భావం, ఆలోచనలు, అనుభూతులు, వాటిని అనుసరించి సాగే చేతనావిస్తరణలను గురించి కూడా వివరించాల్సి వుంటుంది. సమస్త విశ్వాన్ని లోపల దర్శించే అనుభూతితోగాని, అంతరాలలో ప్రవహించే దివ్యశక్తితోగాని, సంశయాత్మకులకు అతీతంగా వుండే నిశ్చయాత్మ విశ్వాసంతోగాని, దైవత్వంతో సిద్ధించే అద్వైతానుభూతితోగాని పోల్చినప్పుడు కనిపించే మానవమేధ, మానవజీవితము ఏపాటివి? అయినా వాటిని (ఆ దివ్యానుభూతులను) వివరించేటప్పుడు 'నేను' అనే పదము వాడక తప్పదు గదా! నేను మాయావాదిని కానుగానీ, 'నేను' అనే పదానికి 'ఈ శరీరం' అనో, 'ఈ అవతారం' అనో చెప్పి తప్పించుకోనూ లేను. కాబట్టి నా రాతల్లో నేను ఇతరులు నాకు గర్వమనీ, అహంకారమనీ భావించకుండా తప్పించుకోగలగుతానా? అది ఎంతో కష్టమనే నాకు అనిపిస్తోంది.

SABCL Vol. 24, pp. 1388-89

అనువాదం: డా. ద్వా. నా. శాస్త్రి

35

యోగము — పరిణామ వాదము

జీవితము, యోగము, ఈ రెంటినీ సమ్యగ్దృష్టితో పరిశీలింతుమేని, లక్షితముగానో, అలక్షితముగానో జీవితమంతయూ యోగమే అని చెప్పవలసి యుండును. ఏలయన, మానవసత్త యందలి గర్భితశక్తుల నభివ్యక్తమొనర్చి మానవునియందునూ, విశ్వమందునూ సాక్షికముగా అభివ్యక్తమైయున్న సర్వగత, సర్వాతీత తత్త్వముతో మానవవ్యక్తిని ఐక్యము కూర్చుట ద్వారా ఆత్మసంసిద్ధికై క్రమనిబద్ధమైన పద్ధతి ప్రకారము జరుపబడు ప్రయత్నమునే కదా మనము యోగమని పేర్కొనుచున్నాము. కాని, జీవితమును దాని బాహ్యరూపముల నతిక్రమించి లోతుగా పరిశీలించి చూతుమేని, జీవితమంతయూ ప్రకృతి కొనసాగించు నొక మహాయోగమే యని చెప్పవలసి యుండును. తన గర్భితశక్తుల నంతకంత కధికాధికముగా అభివ్యక్త మొనర్చుకొనుట ద్వారా ఆత్మసంసిద్ధి గాంచి, తన నిజతత్త్వమైన దివ్యత్వముతో తానైక్యము పొందుటకై ప్రకృతి కొనసాగించుచున్న ప్రయత్నమిది.

మానవుడామె మంత. అతని యందామె యీ ప్రథ్విపై తొలుదొల్తగా నీ మహనీయ ప్రయోజన మధికతర జవసత్త్వములతో నెరవేరుటకై ఎరుకతో సంకల్పపూర్వకముగా జరుగదగు కృషికి సాధనసంపత్తిని సమకూర్చుకొన్నది. వివేకానందస్వామి నుడివినట్లు, స్వపరిణామమును ఒకే జీవితకాలములోగాని, ఒకే జీవితకాలపు కొలది సంవత్సరములలోనో, నెలలలోనోగాని కుదింపజేయుట కనువైన సాధనమే యోగమని చెప్పనొప్పును.

SABCL Vol. 20, p. 2

అనువాదం: కమలాకర వేంకటరావు (‘యోగసమన్వయం’ నుండి)

ఐతే, ఎందుకని భారతదేశం ప్రపంచంలో ఒక ప్రధాన శక్తి కాకూడదు? ప్రపంచంపై ఒక నిర్వివాదస్పద ఆధ్యాత్మిక ఆధిపత్యం వేరెవరికుంటుంది? ఇది స్వామి వివేకానందుల ఉద్యమ ప్రణాళికా ప్రాతిపదిక.

శ్రీ అరవిందులు

ముత్యపు చిప్పలు

మనిషి ముత్యపు చిప్పలా ఉండాలి. భారతదేశంలో ఒక చక్కటి పిట్టకథ ఉంది. స్వాతి నక్షత్రం వెలిసిన సమయంలో వర్షం కురిసి ఒక చినుకు ఆలిచిప్పలో పడినట్లయితే ఆ చినుకు ముత్యమవుతుందట. ఆలిచిప్పలకు ఈ విషయం తెలుసు కాబట్టి స్వాతి నక్షత్రం వెలిసేనాటికి అవి సముద్రం పైకి వచ్చి ఆ అమూల్యమైన వర్షపు చినుకుకై వేచి ఉంటాయి. చినుకు వాటిలో పడిన వెంటనే చిప్పలను మూసుకొని సముద్రపు అట్టడుగుకు వెళ్లిపోతాయి. అక్కడ నిదానంగా ఆ చినుకును పొదిగి ముత్యంగా రూపొందిస్తాయి. మనిషి కూడ అలాగే ఉండాలి. ఏ విషయాన్నైనా సరే. ముందు వినాలి. తరువాత అర్థం చేసుకోవాలి. అటు పిమ్మట మనస్సును ఎట్టి బాహ్యప్రభావాలకు లోను కానివ్వక, దాని మీదనే లగ్నం చేసి, అంతరంగంలో వున్న సత్యాన్ని ఆవిష్కరింప జేయడానికి కంకణం కట్టాలి. కాని యిందులో ఓ ప్రమాదమున్నది. ఇప్పుడు ఇది, అప్పుడు అది అంటూ కేవలం కొత్తదనానికి ఆకర్షితుడవై, దీనికన్న వినూత్నమైన వేరొక విషయం తటస్థపడితే, దాని కోసం వెంపరలాడటం — ఇలా చేస్తూపోతే నీ శక్తిసామర్థ్యాలను వృథాపరచడమే అవుతుంది. ఏదైనా ఒక పనిని చేపట్టినప్పుడు దాని అంతు చూడాలి. మధ్యలో ఆగిపోకూడదు. ఎవరయితే ఒక ఆశయం పట్ల ఉన్మాదభరిత ఆసక్తితో అంకితం అవుతారో వారే వెలుగు చూడ గలుగుతారు. ఇక్కడో పని, అక్కడో పని చేపట్టి, అన్నింటిని అర్థంతరంగా వదలి వేసేవారు దేనినీ సాధించలేరు. క్షణికంగా ఉత్తేజితులవడంతోనే వారి ఉద్వేగం అంతమవుతుంది. ప్రకృతి చేతిలో కీలుబొమ్మలవడం తప్ప ఆలోచలను అధిగమించి ముందుకు సాగలేరు

ఎవరైతే యోగులు కావాలని మనసారా కోరుకుంటారో, వారు ఇట్టి కప్పగంతుల తంతుకు స్వస్తి చెప్పాలి. ఒక ఆశయాన్ని చేపడితే, ఆ ఆశయమే వారి జీవిత పరమావధి కావాలి. దానిని గురించే ఆలోచించాలి. కలలు గనాలి, జీవించాలి. మెదడు, కండరాలు, నరాలు, ఒకటేమిటి, శరీరంలోని ప్రత్యణువు ఆ ఆశయంతోనే నిండిపోవాలి.

ఇతరమైన ఆలోచనల నన్నింటిని పూర్తిగ వదలివేయాలి. విజయసాధనకు ఇదియే మార్గము.

మూలం: స్వామి వివేకానంద

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, చేకూరు జానకి

అనుబంధము:

నూటపది ఏళ్ళనాటి కథ

షికాగోలో 11,15, 19, 20, 26, 27 సెప్టెంబరు 1893 తేదీలలో జరిగిన విశ్వ మత మహాసభలలో శ్రీ వివేకానందుడు చేసిన ఉపన్యాసముల నుండి:

మొదటి రోజు వారు చేసిన మహోపన్యాసము

అమెరికా సోదరసోదరీమణులారా,

మాకు మీరొసగిన మనఃపూర్వకమైన స్వాగతమును పురస్కరించుకొని యీ సమయమున మీతో ముచ్చటించుట నాకు బ్రహ్మానందదాయకము. ప్రపంచమందలి అత్యంత ప్రాచీన యతి సంప్రదాయము పేర మీకు నా యభివందనములు. సమస్త మతములకును, సమస్త ధర్మములకును దల్లి యనదగు సనాతన ధర్మము పేర మీకు నా యభివందనములు. నానాజాతులతో, నానాసంప్రదాయములతో గూడిన భారత జనసహస్రముల పేర మీకు నా యభివందనములు.

సహనభావమును వివిధ దేశీయులకు దెలిపిన ఘనతయు, గౌరవమును నతిదూర దేశీయులగు ప్రాచ్యులకు జెల్లుననుటెంతయు సమంజసమని తత్ప్రతినిధులను గూర్చి ఈ సభావేదిక నుండి మీకు దెలిపిన వక్తలకును నా యభివందనములు. సహనమును, సర్వమతసత్యత్వమును లోకమునకు బోధించిన సనాతన ధర్మము నా ధర్మమని గర్వించుచున్నాను. సర్వమతసహనమునే గాక, సర్వమతములును సత్యములని మేము నమ్మెదము. సమస్తమత సమస్త దేశముల నుండియు పరిపీడితులై, శరణాగతులై వచ్చిన వారలకు శరణ్యమైన దేశము నా దేశమని గర్వించుచున్నాను. రోమక క్రౌర్యమునకు గుఱియై తమ దేవాలయము తుత్తునియలైన యేటనే దక్షిణ భారతదేశమునకు వచ్చి, శరణుపొందిన యూదులను — నిజమైన యూదులనదగు

వారిలో శేషించినవారిని — మా కౌగిట జేర్చుకొంటిమని తెలుప గర్వించుచున్నాను. మహాజొరాష్ట్రీయ సంఘమున శేషించిన వారలకు శరణొసంగి, నేటికిని వారల నాదరించుచున్న (సనాతన) ధర్మము నా ధర్మమని గర్వించుచున్నాను. సోదరులారా, అతిబాల్యము నుండియూ పారాయణమొనర్చు చుంటినని నాకు జ్ఞప్తిలోనున్న యొక స్తోత్రము నుండి — ప్రతిదినము కోట్లకొలది మానవులచే పారాయణ మొనర్చబడు నొక స్తోత్త్రము నుండి — కొన్ని చరణములను క్రోడీకరింతును:

"వివిధ ప్రదేశములలో బుట్టిన మహానదులు, సముద్రమున సంగమించునట్లే వివిదారాధన మార్గములు వక్రములై గన్పట్టినను, అవక్రములై గన్పట్టినను సర్వేశ్వరా నిన్నే ప్రాప్తింపజేయుచున్నవి."

"ఎవరు ఏ రూపమున నన్ను గ్రహింతురో నేను వారినట్లే యనుగ్రహించుచున్నాను. ఎల్లవారును సమస్త మార్గముల చేతను తుదకు నన్నే ప్రాప్తించుచున్నారు."

అని గీతలో తెలుపబడిన యద్భుత సిద్ధాంతమును ప్రపదమున నింతవరకు జరిగిన మహోత్కృష్ట సమావేశములలో నొకటగు ఈ మతమహాసభయే సమర్థించుచు, ముక్తకంఠమున లోకమునకు జాటుచున్నదని చెప్పనొప్పును. శాఖాభిమానము, స్వమత దురభిమానము తజ్జన్యమగు మూర్ఖాభినివేశనమును సుందరమైన యీ వసుంధరను చిరకాలము నుండియు నాక్రమించియున్నవి. భూమిని అయ్యవి దౌర్జన్యమయ మొనర్చి, యనేక పర్యాయములు మానవరక్తసిక్తము గావించినవి. నాగరికతను నాశనమొనర్చి, సంఘములను నిరాశపాలు చేసినవి. ఈ ఘోరరాక్షసులు చెలరేగియుండనిచో మానవసమాజము నేటికంటె విశేషాభివృద్ధి నొందియుండెడిది. కాని వాని యవసాన సమయ మాసన్నమైనది. ఈ మహాసభా గౌరవార్థము నేటి యుదయము మ్రోగింపబడిన గంట సర్వవిధములైన స్వమత దురభిమానమునకు, పరమతద్వేషమునకును — కత్తిచే గానిండు, కలముచే గానిండు సాగింపబడు — సర్వవిధములైన హింసకును మాత్రమే గాక, ఒకే గమ్యమును బ్రాప్తింపబోవు జనుల కొండొరులయందలి నిష్ఠుర ద్వేషభావములకును శాంతిపాఠము కాగలదని మనఃపూర్వకముగా ఆశించుచున్నాము.

విత్తనము నేలలో నాటబడినది; మన్ను, గాలి, నీరును దానిని చుట్టువారి యున్నవి. ఆ విత్తనము మన్నగునా! గాని యగునా, లేక నీరగునా! ఏదియు గాదు. అది మొక్కయగును — ఆత్మవికాస నియమను ననుసరించి యభివృద్ధి నొందుచు. గాలి, మన్నును, నీటిని జీర్ణించుకొని వానిని వృక్షతత్త్వముగా మార్చుచు, మొక్కగా పరిణమించును.

మతవిషయము — ధర్మవిషయము — కూడ నిట్టిదే. క్రైస్తవుడు హిందువుడుగానీ, బౌద్ధుడుగాని కానక్కర లేదు. మరియు హిందువుడుగాని, బౌద్ధుడుగాని కానక్కర లేదు. మరియు హిందువుడుగాని, బౌద్ధుడుగాని క్రైస్తవుడు గానక్కర లేదు. కాని ప్రతివ్యక్తియు ఇతరుల భావములను — ఇతర మతసారమును — గ్రహించుచుండియు స్వీయవ్యక్తిత్వమును నిలుపుకొని, స్వీయవికాస నియమానుసారము అభివృద్ధి నొందవలయును.

మతమహాసభ లోకమునకేమైన జాటినచో అది యిది: పూజ్యత, పవిత్రతత, త్యాగము — ఇవి ప్రపంచము ఏ మతసంస్థకును ప్రత్యేకమగు 'హక్కులు' గావనియు ప్రతిమతమును లోకోత్తర చరిత్రులగు పురుషులను స్త్రీల నుద్భవింప జేసినదనియు జాటినది. ఇట్లు విస్పష్టమై యుండ, నెవ్వరైనను తమ మత మొక్కటియే సుస్థిరముగా నిలిచి, యితర మతములన్నియు నశింపవలయునని భావించునెడల, అట్టి మందబుద్ధుల యవివేకమునకు నా హృదయాంతర్గత పరితాపమును దెలుపును. వారెంత ప్రతిఘటించినను, "వలయునది కలహము కాదు, సహకారము"; "అన్యమత ధ్వంసము కాదు. తదాశయగ్రహణము"; "శత్రుత్వము కాదు. శాంతియుత సమన్వయము" అని మతపతాకలపై వ్రాయబడు దినము శీఘ్రకాలముననే వచ్చితీరునని తెల్పెదను.

అనువాదం: చిరంతనానంద స్వామి

(శ్రీరామకృష్ణ మఠము, చెన్నైవారి సౌజన్యముతో)

ఒక మహామహితాత్మ... మానవాళిలోకి అవతరించింది. వారి నిత్యజీవన విధానంలో పరిపూర్ణ ఆధ్యాత్మిక శక్తి ప్రచోదనాన్ని తీసుకొచ్చింది.

శ్రీఅరవిందులు



ఈ సంచికలో

నిజమైన నమ్రత

ప్రార్థనా సార్థకత

అఖిల

అఖిల భారత పత్రిక

జూన్ 2013

6/6/2013.

విషయసూచిక

నిజమైన విధేయత

ప్రార్థన యొక్క సార్థకత

ప్రపంచం నుండి పారిపోతే, దానిలో మార్పు సాధ్యపడదు. ప్రపంచంలోనే కొనసాగుతూ, వినయవిధేయతలతో మెలగాలి. అగ్నిలో అజ్యం పోస్తే ప్రజ్వరిల్లేలాంటి జ్వాలాదీప్త హృదయంతోనే అది సాధ్యపడుతుంది.

నిజమైన విధేయత

జీవనయానంలో యింతవరకు చేసిన ప్రయత్నాలుగాని, పోరాటాలుగాని, సాధించిన విజయాలుగాని యెలాంటివైనప్పటికి, భవిష్యత్తులో యెదురయ్యేవాటితో పోలిస్తే అతి స్వల్పమైనవని తెలుసుకోవాలి.

*

దైవమార్గంలో యెంత యెక్కువగా పురోగమిస్తామో, అంత యెక్కువ వినయవిధేయతలు గలవారమౌతాము. నెరవేర్చినదానిని, నెరవేర్చవలసినదానితో పోలిస్తే, అది స్వల్పమని గమనించగలుగుతాము.

*

విధేయతతో మెలగాలి అనటంలో అర్థం, మనస్సు, ప్రాణికము, దేహము, దైవ ప్రమేయం లేనిదే యేమీ తెలుసుకోలేవు, యేమీ కావు, యేమీ చేయలేవు అని యెప్పుడూ విస్మరించకుండా వుండుట. దైవం తోడులేనిదే వాటికి అజ్ఞానం, కలవరం, నిస్సహాయత తప్ప వేరేమీ సమకూరదు. పరమ సత్యం, దివ్యజీవనం, దివ్యశక్తి, దివ్యప్రేమ, దివ్యానందం అన్నీ దైవస్వరూపాలే.

అందువలన మనస్సు, ప్రాణికము, దేహము తాము దైవం యొక్క మూల తత్వాన్నే గాక ఆతని చర్యలలోని, సాన్నిధ్యంలోని ఆంతర్యాన్ని తెలుసుకొనుటకు గాని, విమర్శించుటకుగాని, పూర్తిగ అశక్తులమని కచ్చితంగ తెలుసుకోవాలి.

ఇదే నిజమైన విధేయత. దీనితోపాటే ప్రశాంతత లభిస్తుంది, మనశ్శాంతి చేకూరుతుంది.

అన్ని విధములైన ప్రతికూల దాడులకు యిది దృఢమైన రక్షణ కవచం. వాస్తవానికి మనిషిలోని గర్వాహంకారాల ద్వారాన్నే ప్రతికూలశక్తులు తట్టేది. అందుకు కారణం ఆ ద్వారమే వాటి ప్రవేశానికి వీలుకల్పించేది.

*

దివ్యచేతనకు, దైవసంకల్పానికి మాత్రమే ఉనికి వున్నది, 'నేను' అనేదానికి కాదు; ఈ అవగాహన కలుగుటయే నిజమైన విధేయత.

*

మనమేమీ కాము, మనకేమీ తెలియదు, మనమేమీ చేయలేము, పరమోత్కృష్టుడైన

దైవమొక్కడే తెలిసినవాడు. ఆతడే చేయగల సమర్థుడు, ఉనికి కలిగినవాడు, ఆత డొక్కడే, అన్న అవగాహన నీకు యేర్పడితే, నీకు జ్ఞానం కలిగి దివ్యానుభూతికి చేరువౌతున్నావన్న మాట.

*

నిన్ను నీవు అధముడనని లేక అధికుడనని, అతి ముఖ్యుడనని లేక అనామికుడనని అనుకోకు. ఎందుకంటే, మనకుగా మనము యేమీ కాము. మనమేమికావాలన్నది, దైవసంకల్పం. అందుకు అనుగుణంగానే మనం జీవించాలి.

*

ఒక నిజమైన, నిష్కపటమైన విధేయత మన రక్షణ కవచం. అహంకారాన్ని అంతమొం దించుటకు అది ఆవశ్యకమైన నిశ్చయమార్గం.

విధేయత, సద్భావన, అత్యుత్తమమైన రక్షణలు. అవి లేకుండ వేసే ప్రతి అడుగు అపాయముతో కూడుకున్నదే. అవి తోడుగ నుంటే విజయం తథ్యం.

*

యోగమార్గంలో అవసరమైన ప్రాథమిక లక్షణం విధేయత. వ్యక్తిగత విలువకుగాని, ప్రత్యేక అనుభవానికిగాని, ప్రమేయం లేదు.

*

నైరాశ్యత, మనోవ్యాకులత ప్రతికూలశక్తుల ప్రభావ ఫలితాలు. నిన్ను విచారసాగరంలో ముంచినప్పుడు, వాటి ఆనందం అపరిమితం. విధేయత ఒక విధమైనదైతే, నైరాశ్యత మరో విధమైనది. మొదటిది ఒక దివ్యచలనమైతే, రెండవది చీకటిశక్తుల దుర్భర అభివ్యక్తి.

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(CWM 1st ed. Vol. 14, pp. 159-61; Vol. 3, p. 139)

విధేయత — ఏది సరియైన విధానం, ఏది కాదు

విధేయతని గురించి ఎప్పుడూ మాట్లాడుతుంటారు. కాని దాన్ని అర్థం చేసుకోవడంలో ఎప్పుడూ పొరబడుతుంటారు. దాన్ని తప్పువిధానంలో, తప్పుగా అర్థం చేసుకొని, తప్పుగా ఉపయోగిస్తారు. సరియైన విధంగా విధేయతతో ఉండు, కానీ ఉండకూడని పద్ధతిలో ఉండకు. పైపెచ్చు ఉండకూడని పద్ధతిలో విధేయంగా ఉంటే ఏ లాభమూ ఉండదు. ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. నీలో ఉన్న ఆభిజాత్యం (గర్వం) అనే కలుపుమొక్కని పెకలించగలిగితే ఎంతో కొంత సాధించినట్లే. కానీ అదెంత కష్టమో నీకు తెలిస్తే! నీలో ఆభిజాత్యపు ఆత్మసంతృప్తితో ఉబ్బిపోవడం లేకపోతేనే (మనకు ఎరుక లేకపోయినా కూడా) ఏ పనినైనా బాగా చెయ్యగలవు. మంచిభావన కలుగు తుంది. సరియైన మార్గం దొరుకుతుంది. కొంత ప్రగతిని సాధించగలవు. అప్పుడు నువ్వు దాన్ని (ఆభిజాత్యాన్ని) పగలగొట్టడానికి ఒప్పుకుంటావు. ఆ తరువాత కూడా, మిగిలిపోయిన చిన్నముక్కలు మళ్ళీ మొలకెత్తుతాయి. ప్రతి మనిషి, జీవితమంతా, మరుపు అనేది లేకుండా అభిజాత్యమనే ఈ కలుపుమొక్కని కూకటి వేళ్ళతో సహా పెకలించే పనిని కొనసాగిస్తూనే ఉండాలి. ఎందుకంటే, ఈ కలుపుమొక్క నీకు తెలియకుండా కపటంగా మళ్ళీ, మళ్ళీ, మళ్ళీ మొలకెత్తుతూనే ఉంటుంది. అది నీలోనించి పోయిందని నమ్మి, నువ్వే పని చేసినా ఎంతో వినయంతో "ఈ పని నేను చేసింది కాదు. దైవమే చేశాడనిపిస్తోంది. ఆయన లేకపోతే నేను లేనే లేను" అంటావు. మరు నిముషమే, ఇటువంటి ఆలోచన వచ్చినందుకే, నీలో నీకే తృప్తి కలుగుతుంది.

ప్రశ్న: విధేయతగా ఉండడంలో ఏది సరియైన పద్ధతి? ఏ పద్ధతి సరియైనది కాదు?

సమా: విధేయతగా ఉండమంటే, ఇతరుల పట్ల విధేయంగా ఉండాలి అనుకుంటారు. ఈ విధేయత సరియైనది కాదు. నిజమైన విధేయత అంటే దైవానికి విధేయంగా ఉండడం. దైవమంటే కచ్చితం, నిర్దుష్టం, జీవితానికి అర్థం. దైవం లేకపోతే ఎవరూ లేరు. ఎవరూ ఏదీ చేయలేరు. అసాధారణమైన తెలివితేటలూ, సామర్థ్యము ఉన్నా కూడా దైవచైతన్యంతో పోలిస్తే ఎందుకూ కొరగానివే. ప్రతివాళ్ళూ ఎప్పుడూ ఈ భావననే కలిగి ఉండాలి. అప్పుడే దైవాన్ని గ్రహించడంలో సరియైన దృక్పథం

కలిగి ఉంటారు. ఇది విధేయతతో కూడిన గ్రహింపు. ఇది వ్యక్తిగతమైన మిథ్యాకల్పనలని దైవానికి వ్యతిరేకంగా నిలబెట్టదు.

*

శ్రమించే నిజమైన శాస్త్రవేత్తని అడిగితే — "మాకు తెలిసిందేమీ లేదు. రేపు తెలిసే విషయాల ముందు ఈ రోజు తెలిసింది ఏమీ తెలియనట్లే" అంటాడు. ఈ సంవత్సరపు ఆవిష్కరణలు వచ్చే సంవత్సరం వెనక్కి వెళ్ళిపోతాయి. తనకు తెలిసినవాటికంటే తెలియని విషయాలే అధికమని నిజమైన శాస్త్రవేత్తకు తెలుసు. మానవుడికి సంబంధించిన అన్ని కర్మలకీ ఈ సత్యమే వర్తిస్తుంది. ఏ గొప్ప శాస్త్రవేత్త గర్వాతిశయంతో ప్రవర్తించడం నేను చూడలేదు. నేను చూసినవాళ్ళంతా ఎప్పుడూ 'నాకేమీ తెలియదు' అని అంగీకరించినవారే. తను ఏమేం చేశాడో, ఏం సాధించాడో చెప్పి, తరువాత నెమ్మదిగా "అసలు నాకు తెలిసిందేముంది, ఏమీ లేదు" అన్నవాళ్లని చూశాను.

ప్రశ్న: ఒక్కొక్కసారి "నాకు తెలిసింది ఏం లేదు" అని, మేము చాలా వినయం కలవాళ్ళము అని అందరికీ తెలియాలని అంటుంటారు. నిజానికి వాళ్ళు చెప్పే దాంట్లో వాళ్ళకే నమ్మకం ఉండదు.

సమా: ప్రపంచంలో నిజాయితీగా లేనివారు, కపటవర్తనులు ప్రతిచోటా ఉంటారు. దానివల్ల వాళ్ళకే చాల నష్టం. వీళ్ళు జరగవలసిన అభివృద్ధి కంతటికీ తలుపులు మూసేస్తున్నారు. అంతే

శ్రీమాత

అనువాదం: డా. టి. వి. నాగరంజని

"అచేతనలో ఉంటే తప్ప ఇతరులకంటే ఉన్నతులము అనుకోలేరు."

శ్రీమాత

స్వార్థరహిత ఆరాధన

దైవత్వాన్ని అభివ్యక్తం చేసే దేనినయినా జనులు గుర్తించటానికి ఎంత విముఖంగా ఉంటారంటే, ఎక్కడైనా దోషాలున్నాయా? ఎక్కడైనా లోపాలు కనిపిస్తాయా? అని ఎప్పుడూ చాలా అప్రమత్తంగా వెదుకుతూ ఎంత ఉన్నతమయిన దానినయినా తమ స్థాయికి దిగజార్చడానికి ప్రయత్నిస్తుంటారు. ఎవరైనా తమను అధిగమించటం వీరిని కోపోద్రేకులను చేస్తుంది. ఏదైనా అత్యల్పమైన పొరపాట్లు మాదిరివి కనిపించినా చాలా సంతోషిస్తారు. వీరికి భూమిపై దైవం ఎదురుపడినా అపరిపక్వమగు భౌతిక మనసుతో దర్శించినందున కేవలం అపరిపక్వమైనదే చూడగలుగుతామనే విషయం మరుస్తారు. దేనిని చూడటానికి యిష్టపడరో, దేనిని స్వయంగా దర్శించలేరో, దానిని చూడాలని ఆశించలేరు. దైవలీలల ఉపరితలాన్నే పరిగణించేవారు కచ్చితంగా దైవాన్ని తప్పుగా అంచనా వేస్తారు. పైకి మానవ కార్యకలాపాలలా కనిపించే ఆ లీలలు ఆసాంతం భిన్నమైనవనీ, అవి మానవపరిధి కందని ఉన్నత మూలాల నుండి ఉత్పన్నమౌతున్నాయనీ తెలుసుకోలేరు.

భూమిపై తన కార్యార్థమై ఆవిష్కృతమయ్యే దైవం మానవుల వలెనే వ్యవహరించినట్లు కనిపించినా, అది సత్యం కాదు. పైకి గోచరించే, ప్రస్ఫుటమయ్యే ప్రమాణాలను బట్టి దానిని అంచనా వేయటం సాధ్యం కాదు. కాని మానవులు తమ నిమ్నత్వాన్ని అతిగా ప్రేమించి ఉన్నత సత్యాన్ని అంగీకరించలేరు. దానికి తలొగ్గటానికి విముఖత చూపుతారు. ఉన్నతతరమైనవని తమకు తోచినప్పటికీ, దోషాలను వెతకాలనే కోరిక, అనుమానించటం, విమర్శించటమనే కుత్సితమైన లాలస మానవత ముద్ర మాత్రమే. ఇది కేవలం మానవమాత్రమైన లక్షణాన్ని సూచిస్తుంది. ఎక్కడైతే యిందుకు భిన్నంగా, సహజంగా, సౌందర్యము, ఉదాత్తత, సత్యం ఆరాధించబడతాయో అక్కడొక దివ్యత్వం అభివ్యక్తమవుతుంది. ఎప్పుడైతే ఏదైనా దైవసంజాతమయినదానిని మీ హృదయం ఎగిసిపడి, ఆరాధించి, పూజిస్తుందో అది నిశ్చయంగా మీ చైత్యపురుష సత్త లేదా అంతరాత్మకు మీ భౌతిక చైతన్య సంస్పర్శ వలన కలిగిందని మీరు గ్రహించాలి.

అటువంటి దివ్యమయిన దేదైనా మీ కెదురైందని భావించినపుడు మీరు ఆనందాశ్రువులతో ప్రతిస్పందించాలి. "అవును. అది అద్భుతమైనదే, కానీ అది నాదయి

ఉంటే, ఆరాధించి, ప్రశంసించవచ్చు. ఆ ఉన్నత ఆవిష్కరణకు నేను ఉపకరణమయి ఉంటే, ఆ విజయం నా స్వంతమైతే మరింత ఆనందంగా ఉండేది". ఇలా అని కేవలం మూర్ఖులే ఆలోచిస్తారు. భగవంతుడు తనకు నచ్చిన చోట తాను ఎన్నుకున్న విధంగా వ్యక్తీకరించుకోవటమే ప్రధానమయినపుడు మీ అహాన్ని గురించి ఎందుకు చింతించాలి? అటువంటి అభివ్యక్తి జరిగినపుడు సంతృప్తులై మీ వ్యక్తిత్వపు సంకుచిత బంధాలను తెంచుకొని నిస్వార్థ ఆనందంతో ఉప్పొంగాలి. మీ ఆత్మ జాగృతమై సత్యానుభూతిని పొందిందనటానికి ఈ ఆనందమే నిజమైన సంకేతం. అప్పుడే మీరు ఆ అవనతమయ్యే సత్యస్ఫూర్తితో వికసించి రూపుదిద్దుకుంటారు. నేను పిల్లలను చూసినపుడు అశ్రుపూరితమైన సందర్భాలు నాకు గుర్తున్నాయి. పసిపాపలు అందంగా, అమాయకంగా ఉండి దైవాన్ని తలపింపచేస్తారు. ఆ ఆనందాన్ని అనుభవించగలిగినపుడు మీ మధ్యనే దైవ సాక్షాత్కార ప్రయోజనాన్ని పొందవచ్చు.

*

ఏ సిద్ధి కలిగినప్పటికీ అనంతమయిన దెపుడూ మన ముందు ఉన్నదనే ఎరుక కలిగి ఉండటమే నమ్రత. నేను చెప్పిన అరుదైన స్వార్థరహితమైన ఆరాధన నిజమైన నమ్రత యొక్క మరొక పార్శ్యం. ఎందుకనగా, కేవలం దురహంకారమే గుర్తించటానికి నిరాకరిస్తుంది. తన చిన్న చిన్న విజయాలతో తృప్తిపడిపోయి, తన కన్నా ఎపుడూ, ముందడుగుగా ఉండే అనంతమైనదానిని విస్మరిస్తుంది. ఏది ఏమైనా, మీలో ఎటువంటి దైవత్వం లేదా ఘనత లేకపోయినా, మీరు రూపాంతర మార్గంలో ఉన్నప్పటికీ, వినమ్రులై ఉండండి

శ్రీమాత

అనువాదం: డా. సరోజా ప్రసాద్

(CWM Vol. 3, pp. 158-59, 175)}

విధేయత — దివ్యానుభూతుల సిద్ధికి అవసరమైన స్థితి

విధేయత, ఒక సంస్కారవంతమైన విధేయత, దివ్యానుభూతులు పొందుటకు పాటించ వలసిన నియమము. మనస్సు ఎంతో ఆత్మవిశ్వాసం కలది. తనకు అంతా తెలుసునని, అన్నింటిని అవగాహన చేసుకోగలననుకుంటుంది. తాను ఉదాత్తమైన కార్యమని తలచినదానికి ఆదర్శపూర్వకంగా తోడ్పడదామని యెప్పుడైనా పూనుకుంటే, దానికి అహంకారం పెరుగుతుంది. రాజీకి యేమాత్రం సమ్మతించదు. తాను ఉదాత్తమైన వని, ఆదర్శప్రాయమైనవని అనుకునే భావాలకన్నా పరహితార్థమైనవి లేక మరింత ఉన్నతమైన లక్షణాలుగల భావాలు వుండవచ్చని దానికి నచ్చచెప్పడం దాదాపు అసాధ్యం. అందుకు విధేయత ఒక్కటే విరుగుడు. నేను అనే విధేయత కొన్ని మ తాలు నమ్మినట్లుగా, దైవం తాను సృజించిన జీవులను అల్పులుగ భావించి వారు తన ముందు మోకరిల్లితేనే సంతృప్తిచెందే లాంటి విధేయత కాదు. నా చిన్నతనంలో అలాంటి విధేయతపై నాకు విముఖత యేర్పడింది. తాను సృజించిన జీవులను చిన్నచూపు చూసే దైవంపై నాకు నమ్మకం కుదరలేదు. అలాంటి విధేయతను కాదు నేను కోరేది. నేను ఊహించే విధేయత యెలాంటిదంటే, మనిషి తనకు తెలి యదని, తనకేమీ తెలియదని గుర్తించి, ప్రస్తుతం తనకు సత్యమని, ఉదాత్తమని, నిస్వార్థమని అనిపించేదానిని మించినదొకటి వున్నదనే అవగాహన కుదిరిన విధేయత. నిజమైన విధేయత అనగా, తనను తాను దైవసంకల్పానికి నిరంతరం అర్పించుకుంటూ అన్నింటిని ఆతని పర్యవేక్షణకు లోబరుచుట. నాకు యేదైనా అవాంతరం యేర్పడిన ప్పుడు (నా సాధనలో యెన్నో యేర్పడినవి) నా తక్షణ ప్రతిస్పందన, ఒక స్ప్రింగు లాగ, భగవంతుని ముందు వాలిపోయి “భగవాన్, నీవేదిక్కు” అనడం. ఇలాంటి విధేయత వినా నేనెప్పటికీ యేమీ సాధించగలిగేదాన్ని కాదు. ‘నేను’ అని యెందుకంటు న్నానంటే, నన్ను మీరు సరిగ్గా అర్థం చేసుకోగలుగుతారని, కాని, నిజానికి ‘నేను’ అనుటలో అర్థం, ఈ శరీరం ద్వారా దైవం కార్యనిర్వహణ గావిస్తాడని, నేను కేవలం ఉపకరణాన్ని అని. ఇలాంటి దివ్యమైన విధేయతతో జీవించుట ప్రారంభిస్తే దాని అర్థం, నీవు దివ్యానుభూతి పొందగలిగే స్థితికి చేరువౌతున్నావన్న మాట. ఇది అవసరమైన స్థితి; ఇదే ప్రారంభం.

డిసెంబరు 21, 1957

ప్రధానమైన అవసరం యేదైనా వున్నదంటే అది వినమ్రత. వినయవిధేయతలు కలిగి వుండుట. మామూలుగ "నేను యెంతో అల్పుడను, అసలు నేనేమీ కాను" అనే అర్థమిచ్చే వినయవిధేయత కాదు. మరో రకమైనది.

యోగమార్గం గోతుల మయం. పురోగమించేకొద్దీ అసంఖ్యాకమై అగోచరమౌతాయి. అహం కూడ మహాత్ములుగ వ్యవహరించే దొంగవ్యక్తులలో దాగి వుంటుంది. అందువలన యెవరైనా, "నేను ఆతనిపై తప్ప వేరెవ్వరిపై ఆధారపడుటకు యిష్ట పడను" అని అన్నారంటే ఆ 'ఆతను' యెంతటి మహిమాన్వితుడిగ భావిస్తారో అదే 'అహం' — ఒక భయంకరమైన అసురుడు, ఒక భీకరాకారుడు. (ఇది వారి వారి శక్తిసామర్థ్యాలపై ఆధారపడి వుంటుంది). అలాంటివారు ఈ పృథ్వి అంతటా విస్తరించి వున్నారు. ఈ భూమిని ఏలుతున్నారు. అందువలన ప్రప్రథమంగా చేయాల్సిన పని, నీ అహాన్ని జేబులో వేసుకోవడం — దాచుకోడానికి కాదు, వదిలించుకోడానికి!

నీలోనిదేదో పట్టువిడువకుండా యిలా ప్రవర్తిస్తున్నదంటే "ఇదే నేను భావించేది, ఇదే నేను ఆలోచించేది, ఇదే నేను గమనించేది, ఇదే నా మార్గం, నాదైన మార్గం. ఇదే నా అస్తిత్వపు విధానం, ఇదే నేను గ్రహించే విధానం, ఇదే దైవంతో నా సంబంధం". నీవు సృష్టించుకున్నది 'అహం' అనే దైవం అని దృఢమౌతుంది.

ఇంకా యీ విధంగా అనేవాళ్ళుంటారు. "కళ్లు మూసుకుని, ఆతనిని తప్ప వేరెవ్వరిని చూడ నిచ్చగించను. బయటి ప్రపంచం నుండి నాకేమీ అక్కరలేదు". అయితే, దివ్యప్రేమ ఒకటి వున్నదని వారు మరుస్తారు! అదే గొప్ప దేవరహస్యం — యదార్థమైన ఉనికి గలదానికి లేనిదానికి, వ్యక్తిగతమైనదానికి, కానిదానికి, వెనుకనున్న రహస్యం అదే. దివ్యప్రేమ రెండు పదార్థాల మధ్య, ఇద్దరు జీవుల మధ్య నుండే ప్రేమ కాదు. సర్వవ్యాప్త ప్రేమ.

ఈ శతాబ్దపు పూర్వభాగంలో 'ప్రార్థనలు — ధ్యానములు' వ్రాశాను. అందులో నేను ఆతని గురించి ప్రస్తావించాను. ఐతే అది నా ఆకాంక్షనంతా సమీకరించుకొని, సంపూర్ణమైన సద్భావనతో వ్రాసింది. (కనీసం నా అస్తిత్వపు చైతన్యవంతమైన భాగాల శ్రద్ధాసక్తులతో కూడినది.) దానిని ఒక బల్ల సొరుగులో యెవ్వరికి కనబడకుండా దాచాను. తర్వాతి కాలంలో అది అందరికి ఉపయోగకరమైనదిగ వుంటుంది గనుక శ్రీఅరవిందులు దానిని ప్రచురించమని కోరారు.... ఇది యాభై యేండ్ల క్రిందటి

మాట. ఇప్పుడు నాకు తెలియవచ్చినదంతా అప్పుడే నాకు తెలిసివున్నట్లైతే, నేను అణిగిమణిగి వుండేదాన్ని!

ఏమైనా, నెమ్మదిగా క్రమక్రమంగా తెలుసుకోవడం మంచిది. కొంతమేర భ్రమకు లోను అవడం కూడా మంచిదే — భ్రమను అనుభవించడానికి కాదు, మనం పయనించే మార్గంలో అవసరమైనదిగా.

సర్వమూ సరైన సమయంలో సమకూరుతుంది.

అద్భుతమైన విషయమేమిటంటే, వీటన్నింటి మధ్య దివ్యానుగ్రహం, దివ్యానందం, దివ్యతేజం, దివ్యప్రేమ వర్షింపక మానదు — అహం రాజ్యమేలుతున్నప్పటికీ, అవమానం సంభవించినప్పటికీ, అయోగ్యత యేర్పడినప్పటికీ, విధేయతతో మెలగాలి.

మే 16, 1960

శ్రీమాత

సత్ ప్రేమ్‌తో శ్రీమాత సంభాషణలు (మదర్ ఇండియా ఆగస్టు 2012)

అనువాదం: అందుగులపాటి జానకి

దైవం

ఆవరించినది అధోలోకాలనైనా,
ఆసీనుడవు ఊర్ధ్వలోకాలనే.
దొరవు పండితులకు, పాలకులకు, పనివారలకంతా
ఐనా సేవకుడవు దివ్యభవ్య ప్రేమకు.

ఖిన్నుల గానీయవు క్రిమికీటకాదులను సైతం,
మన్నించక మానవు మట్టిపెడ్డనైనా,
ఆ నమ్రత, ఆ అణకువ అవగాహన నిచ్చింది
మా దైవానివి నీవేనని.

(SABCL Vol. 5 & CWSA 2, p. 218)

శ్రీఅరవిందులు

అనువాదం: జానకి

ఆధ్యాత్మిక జీవనానికి ఆవశ్యకమైన నియమాలు

ఆధ్యాత్మిక జీవితంలో దైవం యెడల విధేయత కలిగి వుండటమనేది తప్పనిసరి నిబంధన. ఆధ్యాత్మికపరంగా అహంకారం, గర్వం లేదా నిర్లిప్తత, స్వాభిమానం — ఇవి మనిషిని నిమ్నస్థితికి దిగజారుస్తాయి. అయితే దైవం యందు విశ్వాసం, తన ఆధ్యాత్మిక గమ్యంపై నమ్మకం (అనగా నా హృదయం, నా ఆత్మ దైవం కోసం తపన చెందినంతకాలం ఏదో ఒక రోజు తప్పక ఆయనను చేరుకుంటాను.) ఇవి ఆధ్యాత్మికమార్గంలో పొందే ఒడిదుడుకుల విషయంలో అత్యంత అవసరం. ప్రత్యేకించి దైవం అంతటా ఉన్నాడు కనుక ఇతరుల పట్ల వ్యతిరేకతకు తావుండరాదు.

*

బహుశా ఆధ్యాత్మిక విధేయత అనేది, ఇంకా చేయవలసినదానితో పోల్చినపుడు ఇంతవరకు చేసినది చాలా తక్కువ అనేది తెలిసికొనుట. అంతేకాక దైవానుగ్రహం లేనిదే ఏమీ జరుగదు, అనే అవగాహన కూడా ఏర్పడుట.

*

విధేయత అనేది ప్రాథమిక అవసరం, ఎందుకనగా అహంకారం మరియు గర్వంతో ఎవరూ పరమోన్నతస్థాయిని చేరుకోలేరు.

*

అంతరంగంలో ఆధ్యాత్మిక విధేయత అనేది తప్పనిసరి. అది బాహ్యంలో మాత్రమే ఉండటం అంతగా అభిలషణీయం కాదు (గర్వం మరియు అహంకారం, నిర్లిప్తత ఇతరులతో వ్యవహరించే సందర్భాలలో వదల వీలుకాదేమో) కాని తరచుగా అది అహాన్ని పెంచుతుంది, ఒక స్వాభావిక పద్ధతిగా మారుతుంది. అయితే కొంతకాలం తరువాత నిష్ప్రయోజనమౌతుంది.

శ్రీఅరవిందులు

అనువాదం: బాషా

నాలుగు చిన్న కథలు

కాయ్ కాస్ అనే పర్షియా దేశపు రాజు చాలా యుద్ధాలు చేసి గెలుపొందాడు. అతను తన శత్రువులను కొల్లగొట్టి గొప్ప ధనవంతుడయ్యాడు. ఆ ధనంతో ఎల్‌బర్జ్ అనే కొండలలో రెండు రాజభవనాలను నిర్మించాడు. వాటిలోని గదులన్నింటినీ వెండిబంగారాలతో నింపేసాడు. వాటి మెరుపు సూర్యకాంతికి దీటుగా వుండేది.

ప్రపంచంలో తనను మించిన గొప్పరాజు లేడని కాయ్‌కాస్‌లో అహంకారం, గర్వం నిండిపోయింది.

రాజుకు తనమీద తనకున్న గొప్ప అభిప్రాయాన్ని ఇబ్లీస్ అనే దుష్టాత్మ గమనించి వంచించడానికి కపటోపాయం పన్నింది. అది ఒక రాక్షసునికి సేవకుని వలె మారువేషం వేసి వానితో బహుమానంగా ఒక పూలగుత్తి నిచ్చి పంపింది.

ఆ సేవకుడు కాయ్‌కాస్ ముందున్న నేలను ముద్దాడి రాజు నుద్దేశించి, "ప్రభూ, ప్రపంచంలో నీలాంటి రాజు లేడు. అయినప్పటికీ మీరు జయించవలసిన పైలోకం ఒకటి వుంది. అది సూర్యుడు, చంద్రుడు, గ్రహాలు అనేక రహస్యాలకు మూలమైన స్వర్గలోక సామ్రాజ్యం. పక్షులను అనుసరిస్తూ ఆకాశాన్ని అధిగమించు" అని అన్నాడు.

"కాని రెక్కలు లేకుండా ఆకాశంలోకి ఎలా వెళ్ళాలి?" అని రాజన్నాడు.

అందుకు సేవకుడు "వివేకవంతులైన నీవాళ్ళు నీకుచెప్తారు" అని అన్నాడు.

ఆకాశసీమలలోకి ఎగిరి ఎలా వెళ్ళాలని రాజు తన ఖగోళశాస్త్రజ్ఞులను సంప్ర దించాడు. వారు సామాన్య పద్ధతులను సూచించారు. అవి రాజుకు రుచించలేదు. అంతట వారు క్రొత్త తరహా ప్రణాళికను కనుగొన్నారు.

వారు గరుడపక్షి గూటి లోనుంచి నాలుగు గరుడపక్షి పిల్లల్ని తెచ్చి, అవి పెరిగి పెద్దవై బలిష్టంగా తయారయేవరకూ వాటిని పోషించి, శిక్షణ నిచ్చారు. వారు చతుర్భుజాకార చెక్కచట్రంను రూపొందించి దాని నాలుగు మూలలా నాలుగ స్థంభాలను బిగించి, వాటికి మేకమాంసపు ముక్కలను కూడా బిగించారు. ఒక్కొక్క స్థంభానికి ఒక్కొక్క గరుడపక్షిని కట్టారు.

రాజుగారు సింహాసనాన్ని ఆ చెక్కచట్రానికి బిగించి కట్టి, దాని ప్రక్కన ఒక మధిరపాత్రను కూడా ఉంచారు. రాజు దానిపై కూర్చున్నాడు.

ఆ నాలుగు గరుడపక్షులు మాంసపు ముక్కలను పట్టుకునే ప్రయత్నంలో

పైకెగరడం వల్ల చెక్కచట్రం కూడా గాలిలోకి పైకి లేపబడి అక్కడి జనసమూహానికి ఆశ్చర్యం కలిగించింది. ఆ గరుడపక్షులు పైపైకి ఎగురుతూ చంద్రునికి దగ్గర దగ్గరగా వెళ్తూ అలసటతో వాటి రెక్కలను కదిలించటం ఆపేసాయి. అంతట చెక్కచట్రం, సింహాసనం, మధిరపాత్ర, రాజు ఫెళఫెళమని శబ్దం చేస్తూ చైనాదేశంలోని ఒక అడవి ప్రాంతంలో కూలిపోయాయి. వార్తాహరులు వచ్చి రాజును తిరిగి రాజభవనానికి తీసుకొనిపోయేవరకు, ఆ రాజు ఆ అడవిలో పడి ఉన్నాడు.

రాజు తన మూర్ఖత్వానికి, దురహంకారానికి చింతించి కనువిప్పు కలిగి, తన శక్తికి మించిన ఇటువంటి ప్రయత్నం ఇకపై చేయకూడదని నిర్ణయించుకున్నాడు. అటు పిమ్మట ఆ రాజు ధర్మబద్ధంగా, జనరంజకంగా తన రాజ్యాన్ని పరిపాలించాడు.

ఈ విధంగా ఆ రాజు తన అతిశయాన్ని వదలి నిజాయితీగా ఋజుమార్గాన మెలిగాడు.

*

2

అనేక సంవత్సరాల క్రితం, ఇజ్రాయిల్ దేశానికి గొప్పరాజైన సొల్మన్ గురించి మీరు వినే వుంటారు. అతని కీర్తిప్రతిష్టలు, సార్వభౌమాధికారం గురించి అనేక కథలు బైబిల్లోను, ఇతర పుస్తకాల్లోను చెప్పబడ్డాయి. అతని గురించి ఒక కథను మీకు వినిపిస్తాను.

అతను మహాధనికుడు. జెరూసలెమ్ అనే పట్టణంలో అతనికి వెండి ఇటుకలతో నిర్మించబడిన భవంతి, అందులో దివ్యమైన సింహాసనం అనేక విలువైన బంగారుపాత్రలు ఉండేవి. అలా ఉండటము అతనికి సర్వసామాన్యమైన విషయం. వ్యాపారులు రాజుకు తరచుగా వెండి, బంగారం, ఏనుగుదంతాలు, నెమళ్ళు, కోతులు, అందమైన వస్త్రాభరణాలు, వీరులు ధరించే ఉక్కుకవచాలు, సుగంధద్రవ్యాలు, గుర్రాలు, సంకరజాతి జంతువులు మొదలైన ఖరీదైనవాటిని బహుమతులుగా సమర్పించుకునేవారు. రాజైన సొల్మన్ తన వంశస్తుల స్మృతి కోసం, జాతి కోసం, వారి భగవంతుని గౌరవార్థం, ఒక అద్భుతమైన దేవాలయాన్ని నిర్మించాడు. ఆ దేవాలయ నిర్మాణానికి ముందు, దాని నిర్మాణానికి అవసరమైన కలప అక్కడి పర్వతాల మీది, సిడార్ వృక్షాల రూపాన పెరుగుతూ వున్న సమయంలో, అతనికి ఒక కల

వచ్చింది. ఆ కలలో భగవంతుడు అతనికి కన్పించి "ఏదైనా వరం కోరుకో" అన్నాడు. అంతట సాల్మన్ అన్నాడు "మా తండ్రి డేవిడ్ న్యాయవంతుడు, సత్యసంధుడు. నేనిపుడు మా తండ్రి సింహాసనాన్ని అధిరోహించాను. నేను చేయవలసినది ఎంతో గొప్ప కార్యం, కాని నన్ను నేను చాలా చిన్నపిల్లవానిగా భావిస్తున్నాను. దీనిని ఎలా నిర్వర్తించాలో, నా ఈ ప్రజలను ఎలా పరిపాలించాలో తెలియటం లేదు. కావున నేను జ్ఞానాన్ని పొందాలని నా కోరిక. దాని వలన మంచిచెడుల అవగాహన నాకు వస్తుంది" అని అన్నాడు. దానికి జవాబుగా భగవంతుడు: "నీవు దీర్ఘాయువు కోసం, ఐశ్వర్యం కోసం అడగక, జ్ఞానాన్ని, న్యాయాన్యాయలను గుర్తించగల హృదయాన్ని కోరావు. అంతరదృష్టిలో నిన్ను ఎవరూ అధిగమించకుండా నీకు వివేకాన్ని, దీర్ఘాయువును, ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తున్నాను" అన్నాడు.

నీవు గమనించు, రాజు మాటలలో తనను తాను అమాయకమైన చిన్నపిల్లవానినిగా అభివర్ణించుకున్ననూ రాజు యొక్క శక్తిసామర్థ్యాలను మనం తక్కువగా అంచనా వేయగలమా?

ఎంత గొప్పతనం కలిగి ఉన్నా వినయంగా అణకువగా ఉండుటలోనే నిజమైన ఆనందముంది.

*

3

మీకు విజ్ఞానశాస్త్రంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఐసాక్ న్యూటన్ అనే ఇంగ్లీషు శాస్త్రవేత్త గురించి చెప్తాను.

న్యూటన్ 1642 లో జన్మించి 1727 లో మరణించాడు. అతని సుదీర్ఘ జీవితంలో ప్రకృతిని అధ్యనం చేసాడు. విశ్వశక్తి యొక్క ఆకర్షణ లేదా గురుత్వాకర్షణ శక్తి, సముద్రపు అలల మీద సూర్యచంద్రుల ప్రభావం, తెల్లని సూర్యకాంతి కిరణం ఏడు రకాల రంగులుగా పరావర్తనం చెందడం మొదలైన ప్రకృతి యొక్క అద్భుతాలను, అవి చేసే పనులను అధ్యయనం చేసాడు. అతనికున్న నైపుణ్యాన్ని, వివేచనను చూసి అందరూ అచ్చెరు వొందేవారు. ఒక రోజు ఒకావిడ అతని విజ్ఞానాన్ని, అది నేర్చుకున్న వైనాన్ని గురించి అతనిని అడిగింది. అతడిచ్చిన జవాబు:

"అయ్యో, నేను చాలా చిన్నపిల్లవాడిని. సత్యమనే మహాసముద్రతీరాన గులక రాళ్ళను ఏరుకుంటున్నాను" అని.

సత్యమనే మహాసముద్రమనగా, ప్రకృతి ధర్మాలు. వాటిని ఎంతటి ప్రజ్ఞాశాలురైనా లేశమాత్రం తెలుసుకోలేరు. సముద్రతీరాన గులకరాళ్ళను చిన్నపిల్లవాడు ప్రోగు చేస్తాడు. కాని అతని ఆలోచనకు అందనంతటి విశాలమైనది ఈ సముద్రం! మన అల్పమైన ఆలోచనలతో పోలిస్తే ఎంత అనంత విశాలమైనది ఈ విశ్వం!

న్యూటన్ తనను తాను చిన్నపిల్లవానితో పోల్చుకుంటే మాత్రం మనం అతనిని తక్కువగా అంచనా వేయగలమా? కానే కాదు. అతని వినమ్రతకు మనం అతనిని గౌరవించాలి.

*

4

చాలా సంవత్సరాల క్రితం తన అద్భుతమైన గాత్రంతో అత్యుత్తమ ప్రతిభతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గాయని ఉండేవారు. అవిడ ఒక విందుకు హాజరవడం జరిగింది. అచ్చట చక్కటి గాత్రమున్న ఒక చిన్నారి బాలికను పాట పాడమని ఆ విందులో పాల్గొన్నవారు కోరారు. ఒక యుగళగీతాన్ని పాడుటకు ఆ చిన్నారి సిద్ధ మైంది. పాటలో ముఖ్య భాగాన్ని ఆ బాలిక పాడగా, ఆ పాటలో రెండవ భాగాన్ని రెండవ గాయనిగా ఇతరులెవరైనా ఆమెతో కలిసి పాడాలి. రెండవ గాయకురాలిగా చిన్నారి బాలికతో కలసిపాడటం చిన్నతనంగా భావించి ఎవరూ ముందుకు రాలేదు. అంతట ఆ విందుకు విచ్చేసిన ఆ ప్రఖ్యాత గాయకురాలు తనంత తానుగా బాలి కతో కలసి పాట పాడుటకు ముందుకు వచ్చి "నేను నీతో కలసి పాట పాడనా" అని అడిగింది. ఇద్దరూ కలసి ప్రేక్షకుల ముందు చక్కగా పాట పాడారు. బాలిక స్వరం గంభీరంగా, స్పష్టంగా ఉంది. ఆ ప్రఖ్యాత గాయకురాలి స్వరంతో కలసి తీయగా లయబద్ధంగా ఉంది.

వినయంతో చిన్నారి బాలికకు సహితం సహకరించిన ఆ ప్రఖ్యాత గాయని హృదయం గొప్పది.

శ్రీమాత

అనువాదం: యస్. త్రివేణి



ఒక ప్రార్థన, ఒక ఉన్నతమైన కర్మ, ఒక మహోన్నతమైన భావన.
మానవశక్తిని ఒక అతీతశక్తితో అనుసంధించగలదు.

శ్రీఅరవిందులు

ప్రార్థన ఎందుకు?

భగవంతుడితో అనుసంధానం కల్గించేది యోగం. అది ఉన్నతోన్నతం, ఆనందదాయకం మరియు అత్యున్నత జీవన సాఫల్యం. మానవపరిధిలో ఇందుకోసం చాలా మార్గాలను కనుగొన్నాము. అది ప్రార్థన, పూజ, ఆరాధన, త్యాగము, ఆలోచన, విశ్వాసము, శాస్త్రము, వేదాంతము మొదలైనవి. మన శక్తికి అతీతమైన మార్గాలు మరి కొన్ని వున్నా, మానవపరిధిలో మనం ఇంకా చాలా అభివృద్ధి చెందవలసి వున్నది. అలా సంపాదించుకున్న పద్ధతులనే మనం యోగం అని వ్యవహరిస్తున్నాము.
(SABCL Vol. 17:2 & CWSA 12:5)

శ్రీఅరవిందులు

తార్కికంగా ఆలోచించేవారు "ప్రార్థించడమెందుకు? ఆకాంక్షించడం ఎందుకు? అడగడం ఎందుకు? భగవంతుడు తాను కోరుకున్నదే చేస్తాడు, తాను సంకల్పించినదే నిర్వర్తిస్తాడు" అని అంటారు. అది సహజమే; అసలు చెప్పవలసిన అవసరమేమున్నది, కాని "ఓ ప్రభూ! సాక్షాత్కరించు" అనే ప్రేరణ సాక్షాత్కారానికి తీవ్ర స్పందన కల్పిస్తుంది.

అలా కానిచో అతడు ఈ జగత్తును ఇప్పుడు ఉన్న విధంగా సృష్టించేవాడు కాదు.

ప్రపంచము తాను మరో మారు యథాతథంగా ఉండాలని ఆకాంక్షించుటలో ఒక ప్రత్యేకమైన శక్తి, ప్రత్యేకమైన ఆనందం, ఒక ప్రత్యేకమైన ప్రతిస్పందన ఉన్నది.

అందువలననే — పాక్షికంగా, అంచెలంచెలుగా — ఒక పరిణామ ప్రక్రియ చోటు చేసుకుంటున్నది.

సర్వదా పరిపూర్ణంగా, శాశ్వతంగా వుండే విశ్వం, సర్వదా అవిరామ పరిపూర్ణతమ ఆవిష్కరించుకుంటున్న విశ్వం, పురోగతి చెందడంలోగల ఆనందాన్ని కోల్పోతుంది.

శ్రీమాత

అనువాదం: కె. కవితారెడ్డి

అని, 'నాకది అవసరం' అంటావు. 'నాకది అవసరం కాబట్టి సహజంగా, వెంటనే, నా దగ్గరకది వచ్చి తీరాలి అనుకుని, నాకు కావలసినదాన్ని ఇవ్వడమే ఆ దైవం యొక్క పని' అని అనుకుంటావు.

కాని నిజానికి నీకేం కావాలో నీకు తెలియక, నీవు కోరినది పూర్తిగా సత్యం కాక, ఏదో ఒక భ్రమ మాత్రమే అయి, ఈ వ్యవహారంలో నీ చుట్టూ ఉన్న ప్రపంచం నుండి పొందాలని ఆశించి దైవం వైపు మళ్ళకుండా, ఆయన గురించి ఆలోచించ కుండా, మీ ఇద్దరి మధ్య ఏ విధమైన అనుబంధం ఏర్పరచుకోకుండా, కనీసం ఎంతో కొంత దైవం వైపుకు తిరగాలన్న దృష్టికాని, అతడిని గురించిన ఆలోచన కూడా లేనపుడు, అతడిని నీవు ఏమీ అడగలేదు కాబట్టి, అతడికి నీకేది ఇవ్వాల్సిన కారణం లేదు.

కాని నీవు అతడిని అడిగితే, అతడు దైవం కాబట్టి, నీకేం కావాలో నీకు తెలిసినదాని కన్నా, అతడికి బాగా తెలుసు. అందువల్ల నీకు నిజంగా ఏది అవసరమో అది ఇస్తాడు.

అలా కాకుండా అతడి మీద నీ సంకల్పాన్ని ఆపాదించాలని చూస్తే, నిజానికి అది నీకు ఇప్పుడు అవసరమైంది కాదు అనే జ్ఞానోదయం కలగడానికి, వాస్తవాన్ని చూపడానికి, నీ తప్పు నీకు తెలపడానికి, నీకు అడిగింది నీకిస్తాడు. ఇంక నీవు దైవాన్ని ధిక్కరించడం ప్రారంభిస్తావు – నేను నీ గురించి చెప్పటం లేదు, సామాన్యంగా ఉండే మానవుల తీరుతెన్నుల గురించి మాట్లాడుతున్నాను — "దైవం నాకెందుకు అపకారం చేసేది ఇచ్చాడు?" అని కూడా గొడవ చేస్తావు.

ఈ రెండు విషయాల్లోను కూడా నువు పోట్లాడుతావు. నీ వడిగింది అతడు ఇచ్చినపుడు, అది మంచికన్న చెడుగా, అపాయకరంగా మారితే నీవు ధిక్కరిస్తావు. పోనీ, అతడు ఇవ్వకపోతే కూడా "నేను అతడిని అడిగాను, నా కవసరమని చెప్పాను. కాని అతడునాకు ఇవ్వలేదు" అని నిరసిస్తావు.

ఈ రెండు సందర్భాలలోను నీవు పోట్లాడతావు, అమాయకుడైన దైవం మీద నేరం మోపి అతడిని దోషిగా నిలబెడతావు.

దీని కంతటికి బదులుగా, నువ్వు నీ అంతరంగంలో నిరాడంబరమైన, సహజమైన ఆకాంక్షను పొంది ఉండి, — అంటే అది నీలోని ఒక గాఢ తపనకు, ఒక గాఢ ఆవ శ్యకతకు, నీ అస్తిత్వం యొక్క ఎంతో కొంత స్పష్టమైన సత్యంయొక్క భావనకు,

ప్రార్థన — ఫలితము

ప్రశ్న: మధుర మతా! మనకి మార్గదర్శకం అవసరమైనపుడు, లేదా ఏదైనా తెలుసుకోవాలనుకున్నపుడు లేదా మరో సందర్భంలోనో, మనం దైవం నించి మనకు కావలసినదాన్ని ఎలా పొందగలం?

సమాధానం: దైవాన్ని నీవు అడగడం ద్వారా పొందవచ్చు. నీవు అతడిని అడగనపుడు ఎలా పొందగలవు?

నీవు దైవం మీద ధ్యాస ఉంచి, సంపూర్ణ విశ్వాసంతో అడిగినపుడు నీకు కావలసినది నీవు పొందగలవు — అయితే అది నీవు కావాలని ఊహించినది కాకపోవచ్చు. కాని నీకు వాస్తవంగా కావలసినది దొరుకుతుంది. అయితె దాని కోసం నీవు అతడిని అడగాలి.

ఆ ప్రయోగాన్ని నీవు నిజాయితీగా చేయాలి, నీవు నీ రకరకాల బాహ్య పద్ధతుల ద్వారా ప్రయత్నించి, దైవాన్ని అడక్కుండా ఉండి, దైవం నీకు ఇవ్వాలని ఆశించకూడదు. నీకు ఎవరి దగ్గరనించైనా ఏదైనా కావాలని అనుకున్నపుడు దాని కోసం వారిని అడుగుతావు కదా. అడగవూ? మరి దైవం మాత్రం అడక్కుండా నీకు కోరినది ఇవ్వాలని ఆశిస్తావెందుకు?

సామాన్య చైతన్యంలో ఈ కదలిక దానికి వ్యతిరేకంగా ఉంటుంది. నీవేదో ఊహించుకుని, నాకది కావాలి, నాకీ అనుబంధం కావాలి, నాకీ ఆత్మీయత కావాలి, నాకీ జ్ఞానం కావాలి... ఇలాంటివి ఎన్నో... నాకు దైవం ఇచ్చితీరాలి అనుకుంటావు. లేకపోతే అతడు దైవమే కాదు అనుకుంటావు. చెప్పాలంటె ఇది సమస్యని పూర్తిగా తల్లక్రిందులు చేయడమే.

ప్రప్రథమంగా నీవు, 'ఇది నాక్కావాలి, ఇది నా కవసరం' అని చెప్తావు. కాని అది నిజంగా నీకు కావాలో, లేదా అది ఏదో ఒక అస్పష్టభావమో, లేదా ఒక కోరికనో లేదా ఒక పూర్తి అజ్ఞానంతో కూడిన కదలికనో కాదో నీకు తెలియదు. అందువల్ల గుర్తించవలసిన మొదటి విషయం: నీకు నిజంగా ఏం కావాలో, దాని గురించి నీకు ఏమి తెలియదని.

రెండవ విషయం: 'నాకిది కావాలి' అని నీవు దైవం మీద నీ సంకల్పాన్ని కచ్చితంగా ఆపాదించడం. కనీసం నీవు అతడిని అడక్కుండా, 'నా కిది ఇవ్వాలి'

అని, 'నాకది అవసరం' అంటావు. 'నాకది అవసరం కాబట్టి సహజంగా, వెంటనే, నా దగ్గరకది వచ్చి తీరాలి అనుకుని, నాకు కావలసినదాన్ని ఇవ్వడమే ఆ దైవం యొక్క పని' అని అనుకుంటావు.

కాని నిజానికి నీకేం కావాలో నీకు తెలియక, నీవు కోరినది పూర్తిగా సత్యం కాక, ఏదో ఒక భ్రమ మాత్రమే అయి, ఈ వ్యవహారంలో నీ చుట్టూ ఉన్న ప్రపంచం నుండి పొందాలని ఆశించి దైవం వైపు మళ్ళకుండా, ఆయన గురించి ఆలోచించకుండా, మీ ఇద్దరి మధ్య ఏ విధమైన అనుబంధం ఏర్పరచుకోకుండా, కనీసం ఎంతో కొంత దైవం వైపుకు తిరగాలన్న దృష్టికాని, అతడిని గురించిన ఆలోచన కూడా లేనపుడు, అతడిని నీవు ఏమీ అడగలేదు కాబట్టి, అతడికి నీకేది ఇవ్వాల్సిన కారణం లేదు.

కాని నీవు అతడిని అడిగితే, అతడు దైవం కాబట్టి, నీకేం కావాలో నీకు తెలిసినదాని కన్నా, అతడికి బాగా తెలుసు. అందువల్ల నీకు నిజంగా ఏది అవసరమో అది ఇస్తాడు.

అలా కాకుండా అతడి మీద నీ సంకల్పాన్ని ఆపాదించాలని చూస్తే, నిజానికి అది నీకు ఇప్పుడు అవసరమైంది కాదు అనే జ్ఞానోదయం కలగడానికి, వాస్తవాన్ని చూపడానికి, నీ తప్పు నీకు తెలపడానికి, నీకు అడిగింది నీకిస్తాడు. ఇంక నీవు దైవాన్ని ధిక్కరించడం ప్రారంభిస్తావు – నేను నీ గురించి చెప్పటం లేదు, సామాన్యంగా ఉండే మానవుల తీరుతెన్నుల గురించి మాట్లాడుతున్నాను — "దైవం నాకెందుకు అపకారం చేసేది ఇచ్చాడు?" అని కూడా గొడవ చేస్తావు.

ఈ రెండు విషయాల్లోను కూడా నువు పోట్లాడుతావు. నీ వడిగింది అతడు ఇచ్చినపుడు, అది మంచికన్న చెడుగా, అపాయకరంగా మారితే నీవు ధిక్కరిస్తావు. పోనీ, అతడు ఇవ్వకపోతే కూడా "నేను అతడిని అడిగాను, నా కవసరమని చెప్పాను. కాని అతడునాకు ఇవ్వలేదు" అని నిరసిస్తావు.

ఈ రెండు సందర్భాలలోను నీవు పోట్లాడతావు, అమాయకుడైన దైవం మీద నేరం మోపి అతడిని దోషిగా నిలబెడతావు.

దీని కంతటికి బదులుగా, నువ్వు నీ అంతరంగంలో నిరాడంబరమైన, సహజమైన ఆకాంక్షను పొంది ఉండి, — అంటే అది నీలోని ఒక గాఢ తపనకు, ఒక గాఢ ఆవశ్యకతకు, నీ అస్తిత్వం యొక్క ఎంతో కొంత స్పష్టమైన సత్యంయొక్క భావనకు,

నీ లోతైన అస్తిత్వమూలం యొక్క కేంద్రస్థానంలో నిజ ఉన్నత సద్భావంగా అది ఉన్నపుడు — ఈ మన కోర్కెలన్నింటికి పరిష్కారంగా... అన్నింటిని కలబోసిన ఒక గాఢ అవ శ్యకత నీలో ఏర్పడి, దాన్ని సాక్షాత్కారింప చేసుకోవాలన్న ఆకాంక్ష నీలో బలంగా ఉన్నప్పుడు, ఇంక నీవు దైవంతో నీ వ్యక్తిగతమైన కోరికల గురించి, అవసరాల గురించి ప్రస్తావించవు. నీకేది అవసరమో దానిని ప్రసాదించమని, నీ అస్తిత్వం సత్యం వైపు నడిపించమని వేడుకుంటావు. ప్రభూ! ఏదైతే నీ సర్వోత్కృష్ట జ్ఞానంతో నాకు అవసరంగా దర్శిస్తున్నావో దాన్నే ప్రసాదించమని నివేదన చేస్తావు.

అప్పుడు నీవు పొరపడలేదని స్పష్టంగా అనుకోగలవు. అతడు నీకు ఏది హాని కల్గిస్తుందో దాన్ని నీ కివ్వడు అని.

మరొక అడుగు ఉంది, అది మరింత ఉన్నతమైనది, కాని అది ప్రారంభించడం కొంచెం కష్టం.

ఆ మొదట మార్గం నిజానికి చాలా నిజమైనది, వాస్తవమైనది, అంటే దైవాన్ని 'నా కిది కావాలి, అది కావాలి' అని అడగడం కంటె మంచిమార్గం.

నిజానికి చాలా తక్కువమందికి మాత్రమే వారికి నిజంగా ఏం కావాలో తెలుసు – చాలా తక్కువమందికి మాత్రమె తెలుసు. ఈ విషయాన్ని నిరూపించడానికి మనుషులు ఏ విధంగా నిరంతరం వారి కోరికల వెంట పరిగెడతారో చూస్తె తెలుస్తుంది. వారి శ్రమంతా ఆ కోరిక తీర్చుకుందుకు ఖర్చు పెడతారు. ఆ తరువాత ప్రతిసారి వారి కోరిక తీరిపోగానె అసంతృప్తి చెందుతారు. ఆ తరువాత మరో కోరిక వెంట పడతారు.

ఎంతో కాలం వాటి వెంటపడి, ఎన్నో తప్పులు చేసి చాలా బాధపడి, నిరాశచెందిన తరువాత కొందరు కొంచెం ఎదగడం ప్రారంభించి, కాస్త తెలివి తెచ్చుకున్నాక, అప్పుడు ఆలోచన చేస్తారు. అసలు ఈ చక్రంలోంచి బయటపడగలమా, ఈ స్వీయ అజ్ఞానంలోంచి బయటపడే దారి ఉందా అని.

అప్పుడు, సరిగ్గా ఆ క్షణంలో (శ్రీమాత చేతులు చాచి చూపుతారు) సర్వాన్ని అతడి చేతుల్లో పెట్టి: "నేను తయారుగా ఉన్నాను. నన్ను ఆ సత్యపథం వైపు నడిపించమని వేడుకొంటాను". అప్పటినించి సర్వం సవ్యంగా సాగడం ప్రారంభమౌతుంది.

*

ఎవరికైనా, ఏమాత్రమైనా నిజమైన జ్ఞానం లేకపోయినా కూడా, దివ్యకృప మీద

విశ్వాసం, అంటే, ఈ విశ్వంలో దివ్యకృప అన్నది ఉంది, అది మన ప్రార్థనలకు, ఆకాంక్షలకు, మన ఆవాహనకు బదులిస్తుంది అని భావించినపుడు, మనం మానసికంగా దాన్ని సూత్రబద్ధం చేసి, ఆ దివ్యకృపకి సమర్పించినపుడు, మనం ధృడంగా విశ్వసించినపుడు, దాని జోక్యాన్ని అర్థించినపుడు, అది తప్పక సహాయపడుతుందన్న విశ్వాసం ఉన్నపుడు, అప్పుడు వారు నిజంగా దైవసహాయాన్ని పొందడంలో సఫలీకృతులు కాగలిగే అవకాశం ఉంది.

ప్రయత్నించు, తప్పక ఫలితం నీవే చూస్తావు.

ప్రశ్న: శ్రీమాతా! దైవకృప కోసం, ఆ జోక్యం కోసం నిజాయితీగా ప్రార్థించినపుడు, వారు ఒక ప్రత్యేకమైన ఫలితం కోసం ఎదురు చూస్తారు కదా?

సమా: క్షమించాలి, అది ప్రార్థించేవారి గుణంపై ఆధారపడి ఉంటుంది. వారి ప్రార్థన యొక్క స్వభావం మీద ఆధారపడుతుంది. ఎవరైనా సహజంగా దివ్యకృపని ఆవాహన చేసినపుడు, తన్ను తాను ఆ కృప చేతుల్లో పెట్టినపుడు, అతడు ఓ ప్రత్యేకమైన ఫలితాన్ని ఆశించడు. ఒక ప్రత్యేకమైన ఫలితం ఆశించినపుడు, వారి ప్రార్థనను ఒక నిబద్ధమైన రీతిలో సూత్రీకరించాలి. అయితె నీవు ప్రత్యేకంగా ఏదీ ఆశించకుండా, గొప్ప ఆకాంక్షతో ఆ దివ్యకృపని ఆవాహన చేస్తూ ప్రార్థించినపుడు, అప్పుడు ఆ దివ్యకృపే నీకు కావలసినదానిని ఎన్నుకుంటుంది. అప్పుడు నీ ప్రమేయం ఉండదు.

ప్రశ్న: అదే మంచిది, అంతే కదా?

సమా: ఆ! అది మరొక విషయం.

ఎందుకంటె అది బహుశ నాణ్యతలో మరి కొంచెం ఉన్నతమైనది. ఏదైనా ప్రత్యేకంగా దేనినైనా కావాలనుకున్నపుడు, దాన్ని సరైన మాటల్లో పొందుపరచడం అభిలషణీయం.

అయితే సంపూర్ణ సమర్పణాభావంతో తన్ను తాను సంపూర్ణంగా సమర్పించుకున్నపుడు, ఆ కృపకి తన్ను తాను అర్పించుకుని, ఏది మంచిదో ఆ కృపే నిర్ణయిస్తుందని విశ్వసించినపుడు అది యోగ్యమైనదే. కాని అప్పుడు ఫలితం ఏదైనా ప్రశ్నించకూడదు. "అయ్యో! నాకది ఇస్తావనుకున్నాను, ఈ విధంగా చేశావు" అని అనకూడదు. అయితె నిజంగా ఏదైనా పొందాలని అనుకున్నపుడు, నిజాయితీగ, నిరాడంబరంగా మనం భావించిన సజీవచిత్రాన్ని స్పష్టంగా వ్యక్తం చేయడమే మంచిది. ఆ తరువాత అది జరగడం, జరక్కపోవడం అన్నది దివ్యకృప యొక్క

ఇష్టం. అంతేకాని అక్కడ మనం చేయగలిగినది ఏదీ లేదు. ఫలితం ఏదైనా, కావలసినది స్పష్టమైన మాటల్లో వ్యక్తపరిచామన్న తృప్తి ఉంటుంది. అది హానికరం కాదు, అందులో తప్పేమీ లేదు.

ఎప్పుడది చెడుగా మారుతుందంటే, మన అభ్యర్థనను దివ్యకృప ఆమోదించనపుడు ఆ కారణంగా ఆ దివ్యకృప మీద మన ప్రతీకారం ప్రకటించితే, అది సహజంగా చెడుగా పరిణమిస్తుంది. అప్పుడే, ఆ క్షణంలో మనం మనకున్న కోరికను గురించి అర్థం చేసుకోవాలి, లేదా ఆకాంక్ష దేనికో గ్రహించుకోవాలి. మనకి బహుశ దాని గురించి సరైన అవగాహన లేదేమో, మనకి ఏది మంచిదో, ఏది కావాలో అన్నదాని గురించిన జ్ఞానం లేదేమో — అని వివేచన చేయాలి. ఆ క్షణంలోనే మనం వివేకంతో, నిరాడంబరంగా, "సరే, నీ సంకల్పమే నెరవేరనీ" అని అనాలి. అలా కాకుండా నీ లోపల దేని గురించో యోచన, నీ అంతరంగంలో దాని పట్ల ఇష్టం ఉన్నపుడు, నీవు కోరినదాన్ని సరైన మాటల్లో పెట్టడం వల్ల ఏ హానీ లేదు. అది చాల సహజమైన కదలిక.

ఉదాహరణకి ఎవరైనా ఓ తెలివితక్కువ పనిచేసినపుడు, అతడు నిజంగా, నిజాయితీగా మళ్ళీ ఆ తప్పు చేయకూడదని భావించినపుడు, దాని గురించి అడగడంలో, వేడుకోవడంలో ఏ హాని లేదు. నిజానికి ఆంతరంగికమైన నిజాయితీతో ప్రార్థించినపుడు, అది నెరవేరడానికి గొప్ప అవకాశం ఉంది.

దైవం ఎప్పుడు నీకు వ్యతిరేకంగా ఉండడానికి ఇష్టపడతాడని భావించకూడదు. అతడు ఆ విధంగా చేయాలని అసలు కోరడు. నీకేది మంచిదో అది అతడికి నీకన్న బాగా తెలుసు. అత్యంత తప్పనిసరి పరిస్థితుల్లోనె నీ ఆకాంక్షని వ్యతిరేకిస్తాడు. లేకపోతె నువ్వేం కోరినా అతడు వెంటనె ప్రసాదిస్తాడు.

శ్రీమాత

అనువాదం: డి సత్యవాణి

ప్రార్థన — కచ్చితమైన అభిప్రాయం

తగినంత చిత్తశుద్ధితో కూడిన ఆకాంక్ష, తగినంత తీవ్రతతో చేసే ప్రార్థన, మనిషికి భగవత్సాక్షాత్కార మార్గం తెరుచుకోవడానికి సరిపోవని ఎవరు చెప్పారు?

అంటే దీనర్థం అదంతా సాధ్యమేనని.

ప్రస్తుతం మనిషి తగినంత ఆకాంక్ష కలిగి వుండాలి. తగినంత ఏకాగ్రతతో ప్రార్థన చేయాలి. అయితే అది మనిషి స్వభావంలోనే వుంది. మనిషి స్వభావానికి భగవత్కటాక్ష ప్రసాదిత అత్యద్భుత వరాలలో ఇది ఒకటి. కానీ చిక్కంతా దానిని తెలుసుకుని సరియైన విధంగా ఉపయోగించుకోవడంలోనే వుంది.

అందువలన అర్థమయ్యేదేమిటంటె, అడుగడుగునా అడ్డుపడే కేవలం సూత్రబద్ధమైన నియతివాదాలు పట్టించుకోకుండా వాటిని అధిగమించి, అత్యుత్నత చైతన్యశిఖరాన్ని ఎలా చేరాలో తెలుసుకోగలిగితే, ఏ విషయాలైతే సమగ్రంగా నిర్ధారించబడ్డాయో వాటిని మార్చవచ్చు. దీనిని ఏ పేరున పిలిచినా, అది ఒక సమగ్ర నిర్ణయంతో సంపూర్ణ స్వేచ్ఛ సమన్వయం చెందుట.

మిమ్మల్ని మీరు దాని నుండి బయటకి ఎలాగైనా లాక్కోవచ్చు. కానీ అది అలాగే వుంటుంది.

'సమగ్ర నిర్ణయం' అన్నా 'స్వేచ్ఛ' అని అన్నా, అవి కేవలం పదాలు మాత్రమే. అదంతా మిక్కిలి అసంపూర్ణమైనది, సందిగ్ధమైనది. మీలోను, మీ చుట్టూనేగాక అన్ని చోట్లా నున్న వాస్తవికతకు సంబంధించినంత వరకు అది చాలా పేలవమైన వర్ణన. ఈ ప్రపంచమేమిటో అర్థం చేసుకోడం ప్రారంభించగలగాలంటే మీ మానసిక సిద్ధాంతాల నుంచి మీరు బయటపడగలగాలి. లేకపోతే మీరెప్పటికీ ఏదీ అర్థం చేసుకోలేరు.

నిజం చెప్పాలంటే, ఒక్క క్షణం, కేవలం ఒక చిన్న క్షణం ఈ శుద్ధమైన చిత్త శుద్ధితో కూడిన ఆకాంక్ష యొక్క లేదా అత్యంత ఏకాగ్రతతో చేసిన ప్రార్థనలో జీవించితే గంటల కొద్దీ చేసిన ధ్యానం కంటె ఎక్కువని తెలుసుకోగలరు.

ప్రశ్న: మనం కర్మ సంకెళ్ళతో బంధించబడి వున్నామని మీరు చెప్పేరు. అయినా కొన్నిసార్లు భగవత్కృప పనిచేసినప్పుడు, అది కర్మసిద్ధాంతాన్ని నిరాకరించినట్లు కాదా?

సమా: పూర్తిగా. భగవత్కృప కర్మసిద్ధాంతానికి పూర్తి విరుద్ధం. మీకు తెలుసా, అది కర్మబంధాన్ని ఎండలో పెట్టిన వెన్నలా పూర్తిగా కరిగించేస్తుంది. మీరు చిత్తశుద్ధితో నైనా లేదా కావలసినంత శ్రద్ధతో కూడి చేసినా, మీలోకి అన్నిటినీ మార్చగల శక్తి ఏదైతే వుందో దానిని తెచ్చుకోగలరు. అత్యంత పరిమితమయిన అతి చిన్నదైన ఒక వుదాహరణ — అయితే అది మీరు విషయాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోగలిగేటట్టు చేస్తుంది — ఒక రాయి ఎంతో యాంత్రికంగా పైనించి క్రింద పడుతుంది. వదులైపోయిన ఒక పెంకులాగా పడుతుందనుకుందాం. అది వదులైతే పడుతుంది కదా! అక్కడ, ఉదాహరణకి, ఒక ప్రాణికమైన లేక మానసికమైన సమగ్ర నిర్ణయంతో, దారంటపోయే ఒక వ్యక్తి అది పడకూడదనుకుని, తన చేతిని అడ్డం పెడితే, అది అతని చేతిమీద పడుతుంది, కాని నేలమీద పడదు. అంటే అతను ఆ రాయి లేదా పెంకు పడవలసిన లక్ష్యస్థానాన్ని మార్చాడు. మరొక నిర్ణయం మధ్యన చోటుచేసుకుంది. రాయి ఎవరో ఒకరి తలమీద పడే బదులు చేతిమీద పడ్డది. అదెవర్నీ చంపలేదు. ఇది ఇంకొక స్థాయి నుండి కలిగిన జోక్యం — ఒక చైతన్యవంతమైన సంకల్పం నుండి మరొక అంతకంటె తక్కువ స్థాయిలో వున్న నిశ్చైతన్య యాంత్రికతలోకి ప్రవేశించినది.

నేనిప్పుడు చెప్పినట్టు, ఇందుకు తరుణోపాయం తగినంత చిత్తశుద్ధితో కూడి, ఆకాంక్ష లేదా తగినంత ఏకాగ్రతతో చేసే ప్రార్థన, 'లేదా' అని అన్నాను కాని అది 'లేదా' అని అనుకోను. కొందరు ఒకటి మంచిదనుకుంటే మరికొందరు ఇంకొకటి మంచిదనుకుంటారు. కాని రెండింటిలోను మహత్తరమైన శక్తి వుంది. మీరు తెలుకోవలసిందల్లా దానినెలా సరిగ్గా వుపయోగించుకోవాలన్నదే.

రెండింటిలోనూ ఏదో గొప్ప సౌందర్యం వుంది. దాని గురించి ఎప్పుడో ఒకనాడు మీకు చెప్తాను. ఆకాంక్షలో ఏముందో, ప్రార్థనలో ఏముందో, ఎందుకు రెండూ అందమైనవో చెప్తాను. కొంతమంది ప్రార్థన చెయ్యడాని కిష్టపడరు. వాళ్ళు వారి హృదయపు లోతుల్లోకి వెళ్ళినట్టయితే అది గర్వం అని గుర్తించగలుగుతారు. అది అంతకంటె అల్పమైన ఆడంబరం అని కూడా తెలుస్తుంది. ఆ తరువాత, ఆకాంక్ష లేనివారి విషయాని కొద్దాం. వాళ్ళు ప్రయత్నిస్తారు. కాని ఆకాంక్షించలేక పోతారు. ఎందుకంటె వాళ్ళకి ప్రగాఢమైన సంకల్ప జ్వాల లేనందువలన. అందుకు కారణం, వినమ్రత అనే జ్వాల వారిలో లోపించినందు వలన.

రెండూ అవసరమే. అత్యధికమైన నమ్రత వుండాలి. అలాగే, మనిషి కర్మను మార్చగలిగే దృఢసంకల్పం వుండాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

ప్రార్థనకు, ఆకాంక్షకు మధ్య వ్యత్యాసం

ప్రశ్న: ప్రార్థనకు, ఆకాంక్షకు మధ్య వ్యత్యాసం ఏమిటి?

సమా: చాలా విధాలైన ప్రార్థనలున్నాయి.

పూర్తిగా యాంత్రికమై, భౌతికపరమైన ప్రార్థన, నేర్వబడిన మాటలతో కూర్చబడి., యాంత్రికంగా పునశ్చరణ గావించే ఒక ప్రార్థన ఉంది. అది ఏమంత ప్రాధాన్యమయింది కాదు. దానికి ఒకే ఒక్క ఫలితం ఉంటుంది. ప్రార్థన చేసేవారిని అది ప్రశాంతపరుస్తుంది, ఎందువల్లనంటే ఒక ప్రార్థన పలుమార్లు ఉచ్చరించబడడం మూలంగా, ఆ పదాలు నీకు నిశ్చలత నివ్వటంతో పరిసమాప్తమౌతాయి.

తటాలున తనకు తానుగా పదాలతో రూపుదిద్దుకుని పెల్లుబికి వచ్చే ప్రార్థన, ఒక వ్యక్తి తాను అడగదలచుకున్నదానిని కచ్చితంగా వ్యక్తపరచేది: ఫలానాది ఇదో అదో కావాలని చేసే ప్రార్థన, ఏదో ఒకదాని కోసం లేక మరిదేని కోసమో చేసే ప్రార్థన; ఒకరి కోసం గాని, ఒక పరిస్థితి కోసంగాని, తన కోసం గాని చేసే ప్రార్థన.

ఆకాంక్ష, ప్రార్థన కలిసే చోటుంది, ఎలాగంటే కొన్ని ప్రార్థనలు అనుభవపూర్వకమైనవి. తటాలున తమకు తాముగా రూపుదిద్దుకునేవి; ఇవి అంతరంగ అస్తిత్వంలో అప్పటికే తయారుగా ఉన్నవన్నీ ఒక ప్రగాఢ అనుభవాన్ని వ్యక్తీకరించేవిగా పైకి పెల్లుబికి వస్తాయి. అవి ఆ అనుభవానికి కృతజ్ఞతలు తెలియజేయటానికో లేక దానిని ఆగకుండా కొనసాగించమని అడగటానికో లేక దాని విశదీకరణ కోసం కూడా కావచ్చు; అది అకాంక్షకు పూర్తిగా దగ్గరదేనని అనుకోవచ్చు. కాని ఆకాంక్ష పదాల కూర్పుతోనే ఉండవలసిన ఆవశ్యకత ఏమీ లేదు, లేక అది పదాలకూర్పు అయినప్పటికీ, చాలా మటుకు ఆవాహనాపరమైనదే అవుతుంది. నీ ఆకాంక్ష ఒక స్థితిని కోరుతున్నదనుకో; ఉదాహరణకు, నీ ఆదర్శానికి అనుగుణంగా లేనిదేదో నీలో ఉన్నదని, అది

అంధకారయుతమై, అజ్ఞానావృతమై యున్నదని నీవు కనుగొన్నప్పుడు, బహుశా అది దుష్ట-బుద్ధి కావచ్చు, నీవు సాక్షాత్కరింప జేసుకోవాలనుకున్నదానికి సామరస్యతలో లేనిదేదో అయి వుండవచ్చు; అప్పుడది పదాల కూర్పును కలిగి ఉండదు; అది పైకి ఎగదన్నే అగ్నిజ్వాలను పోలి ఉంటుంది, ఒక సజీవానుభవాన్ని, అది విస్తృతమై, పెద్దదై, ఇంకా ఇంకా స్పష్టతతో, కచ్చితంగా ఉండటానికై అడుగుతూ దానిని నివేదించడంగా ఉంటుంది. అదంతా తర్వాత ఆ వ్యక్తి ఆ అనుభవాన్ని గుర్తుచేసుకోవటానికి ప్రయత్నించి, దానిని వ్రాసుకుని పదాలలో పొందుపరచవచ్చు. కాని ఆకాంక్ష ఎల్లప్పుడు అగ్నిజ్వాలవలె పైగి ఎగదన్ని, చాలా ఎత్తుకు ఎగబాకి, తాను ఏమి కోరదలచుకున్నాడో లేక ఏమి చేయదలచుకున్నాడో లేక తనకు ఏమి కావాలనుకుంటున్నాడో అనే దానిని తనలో కలిగి ఉంటుంది. నేను 'కోరుకోవటం' అనే మాటను వాడాను, కాని ఇక్కడ నిజానికి 'ఆకాంక్షించటం' అనే మాటను వాడాలి, ఎందువల్లనంటే దానికి కోరుకునేదానికుండే లక్షణంకాని లేదా రూపంగాని ఉండదు.

అది నిజంగా ఇచ్ఛను పరిశుద్ధపరచే అగ్నిజ్వాల, దాని కేంద్రంలో అది ఏ సాక్షాత్కారాన్ని అడగదల్చుకుందో దానిని కలిగి ఉంటుంది.

ఉదాహరణకు, నీవు చేసినదానికి పశ్చాత్తాపం పొందటమో, ఒకవేళ దాని పర్యవసానాలు సంతోషాన్ని కలిగించకుండా అన్నింటినీ కలవరపరచేవిగా ఉండటమో, చాలామంది దానికి గురికావటమో జరిగి, ఇతరుల ప్రతిక్రియలు నీకు తెలియకపోయి నప్పటికీ, నీకు నీవుగా చేసినదంతా మంచిగా మారగలందులకై ఆశిస్తూ, ఒకవేళ అందులో పొరపాటుంటే, అది అవగతమవాలని, అది ఎటువంటి పొరపాటైనా, ఇంకా గొప్ప పురోభివృద్ధికి నీకు బహుశా ఇది ఒక సదవకాశం అవాలని, దైవం దిశగా ఒక నవ్యారోహణగా, భవిష్యత్తులో నీవు మరింత స్పష్టంగా, సత్యంగా, తీవ్రతతో ఉండాలని కోరుకునేదాని కంతటికి భవిష్యత్తులో ద్వారాలు తెరవాలని అనుకుంటే; ఆ విధంగా అదంతా ఇక్కడ (హృదయం వైపు చూపిస్తూ) కూడుకుని ఒక శక్తిగా కేంద్రీకృతం కాగా, అప్పుడది ఉబికి ఉప్పొంగి, పైకి ఒక గొప్ప కదలికతో ఆరోహించి, ఒక్కొక్కప్పుడు ఏ రూపకల్పనకు సంబంధించిన నీడ కూడా లేకుండా, మాటలు లేకుండా, వ్యక్తీకరణ అనేది లేకుండా ఉవ్వెత్తున లేచే అగ్నిజ్వాలను పోలి ఉంటుంది.

చెప్పాలంటే, అదే నిజమైన ఆకాంక్ష. ఒక వ్యక్తి ఆ స్థితిలో ఉండి, నిరంతర

పురోభివృద్ధితో పాటు, దివ్యేచ్ఛ మనల నుంచి ఆశించేదానికి ఇంకా ఎక్కువ సత్యంగా, ఇంకా ఎక్కువ సంపూర్ణ సామరస్యతతో ఉండాలని కోరుకుంటే, అటువంటిది ప్రతిరోజూ వందల వేలసార్లు సంభవించవచ్చు.

ప్రార్థన అనేది చాలా చాలా ఎక్కువగా బాహ్యంలోని విషయం, సర్వసాధారణంగా ఒక వాస్తవిక విషయానికి కచ్చితంగా సంబంధించినది అయివుంటుంది. ఎల్లప్పుడూ అది పదాలతో రూపొందించబడుతూ ఉంటుంది. ఎందువల్లనంటే, ఆ విధంగా సూత్రీక రించబడినప్పుడే అది ప్రార్థన అవుతుంది. ఒకరికి ఆకాంక్ష వుండవచ్చు, దానిని ప్రార్థనగా రూపొందించవచ్చు, కాని ఆకాంక్ష అన్ని విధాలా ప్రార్థనను మించి పోతుంది. అది దైవానికి చాలా దగ్గరగా, తనను తాను మరచిపోవడం మూలంగా ఇంకా ఎక్కువ దగ్గరగా ఉంటుంది. ఆ వ్యక్తి ఏమి కోరుకుంటున్నాడో లేక చేయద లచుకున్నాడో, దైవానికి సర్వం అర్పించటానికి ఏమి చేయాలని కోరుకుంటున్నాడో అందులోనే సజీవమై ఉంటుంది. నీవు ఏదైనా అడగటానికి ప్రార్థన చేయవచ్చు, దైవం నీకు ఒసగినదానికి కృతజ్ఞతలు తెలుపటానికి కూడా ప్రార్థన చేయవచ్చు. అది చాలా చాలా గొప్ప ప్రార్థన: దానిని కృతజ్ఞతాపూర్వకంగా ధన్యవాదాలు సమ ర్పించటం అంటారు. దేవుడు నీ మీద చూపించిన కరుణకు నీ కృతజ్ఞతను వెల్ల డించడానికీ, అతడు నీకు చేసినదానికీ, నీవు ఆయనలో దర్శించినదానికీ, నీవు ఆయనను స్తుతించి నివేదించదల్చుకున్నదానిని ప్రార్థన చేయవచ్చు. ఇదంతా ప్రార్థనారూపాన్ని సంతరించుకుంటుంది. ఇది నిరాపేక్షణీయంగా ఉన్నతోన్నతమైన ప్రార్థన, ఎందువల్లనంటే అది తన మీద తాను ప్రత్యేకించి ఎటువంటి చింతనూ లేకుండా చేసేది. అది అహంభావంతో కూడిన స్వార్థపూరితమైన ప్రార్థన కాదు.

కచ్చితంగా ఒక వ్యక్తి తనలోని అన్ని క్షేత్రాలలోను ఆకాంక్షను కలిగివుండవచ్చు. అయినప్పిటికీ, ఆకాంక్ష అసలైన కేంద్రం మటుకు చైత్య అస్తిత్వంలోనే ఉంటుంది, కాని ప్రార్థన విషయంలో ఒక వ్యక్తి అన్ని క్షేత్రాలలోనూ ప్రార్థన గావించవచ్చు. ఆ ప్రార్థన అతడు ప్రార్థించే క్షేత్రానికి మాత్రమే చెంది ఉంటుంది. ఒక వ్యక్తి పూర్తిగా విషయపరమైన, భౌతికపరమైన, ప్రాణికపరమైన, మానసికపరమైన, చైత్య పరమైన, ఆధ్యాత్మికపరమైన ప్రార్థనలు చేయవచ్చు. అది ప్రతిదీ తనదైన లక్షణాన్ని కలిగి ఉంటుంది. దేని ప్రత్యేకత దాని కుంటుంది.

ఒక విధమైన ప్రార్థన ఉంది, అది ఒక్కసారిగా తటాలున స్వార్థరహితంగా

బయలుదేరుతుంది, ఒక గొప్ప పిలుపు, సాధారణంగా వ్యక్తిగతంగా తనకు సంబంధించినదై ఉండదు, కాని అది ఒక రకంగా దైవాన్ని మధ్యవర్తిత్వంకోసం పిలవడం లాంటిది. అది ఎంతో శక్తివంతమైనది. ఈ విధమైన ప్రార్థనలు దాదాపు తక్షణం వాస్తవరూపం దాల్చినటువంటివి నా వద్ద లెక్కలేనన్ని ఉదాహరణలున్నాయి. అంటే దానర్థం గొప్ప విశ్వాసాన్ని కలిగి ఉండాలి, గొప్ప చిత్తశుద్ధి, హృదయంలో నిరాడంబరత వుండాలి. అది ఏ లెక్కలూ వేయదు, ఎటువంటి ప్రణాళికలూ రచించదు, ఎటువంటి బేరసారాలూ ఆడదు, తాను తీసుకోబోయేదానికి ఎటువంటి ప్రతిఫలాన్ని ఇవ్వజూపదు. ఎందువల్లనంటే చాలామంది మనుషులు ఒక చేత్తో ఇచ్చి, పుచ్చుకోవటానికి మరొక చేతిని చాచి ఉంచుతారు, అధికశాతం ప్రార్థనలు అటువంటివే. కాని నేనింతకు ముందు వివరించిన ప్రార్థనలు, కృతజ్ఞతాపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేసేవి. స్తుతి కీర్తనలు చాలా మంచివి.

అర్థమైంది కదా, నా మటుకు నేను అంతా స్పష్టంగా చెప్పానని అనుకుంటున్నాను, కాని విషయం మటుకు అది.

మరింత స్పష్టంగా చెప్పాలంటే, ప్రార్థనలు ఎల్లప్పుడూ పదాల పొందికలై ఉంటాయి. కాని పదాలు అవి కూర్చబడిన స్థాయిని బట్టి వైవిధ్యమైన ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. ప్రార్థన అనేది తయారుచేయబడినది కాగా, ఒక వ్యక్తి గాఢంగా ఆకాంక్షించవచ్చు, కాని ప్రార్థన ఒకరిని ఉద్దేశించి కాకుండా చేయబడేది కాదు. ఉదాహరణకు, విశ్వం విషయంలో కొంతమంది కున్నటువంటి దృక్పథంలో వారు ఆ విశ్వంలో దైవం ఉన్నాడనే అభిప్రాయాన్ని తుడిచివేశారు (ఇటువంటివారు చాలామంది ఉన్నారు, ఈ భావం వారిని బాధిస్తుంది — ఒకరున్నారని, వారికి సమస్తం తెలుసుననీ, అంతా చేయగలరనీ, వారికంటె దుస్సాధ్యమైన రీతిలో అధికాధికంగా మించి మరే ఉదాహరణలతో పోల్చి చూపలేనిది మరొకటి ఉన్నదని: అది వారి ఆత్మగౌరవాన్ని బాధిస్తుంది. అందువలన వారు దైవంలేని విశ్వాన్ని అనుకునే ప్రయత్నం చేశారు), వీరు ప్రార్థన చేయలేరనే సంగతి సుస్పష్టమే. వారు ఎవరిని ప్రార్థిస్తారు? వారికి వారు ప్రార్థించుకుంటే తప్ప. కాని అది ఆచారం కాదు! కాని దైవం మీద ఎటువంటి విశ్వాసం లేకుండా ఏదో ఒకదాని కోసం ఆకాంక్షించవచ్చు. దైవాన్ని విశ్వసించనివారు కొందరున్నారు, కాని వారు పురోభివృద్ధిని విశ్వసిస్తారు. వారు ఈ ప్రపంచం నిరంతరం అభివృద్ధిని పొందుతూ ఉంటుందని భావిస్తారు,

ఈ అభివృద్ధి ఆగిపోకుండా ఇదమిద్ధమని నిర్ధారణగా చెప్పలేని విధంగా, సదా మరింత శ్రేయోదాయకదిశగా ముందుకు సాగిపోతూనే ఉంటుందని తలుస్తారు. అటువంటివారికి అభివృద్ధిని గురించిన చాలా గొప్ప ఆకాంక్ష ఉండగలదు. దానికి వారికి దైవం ఉనికిని అంగీకరిస్తూ తలుచుకోవలసిన అగత్యం ఎంతమాత్రం లేదు. ఆకాంక్ష ఉందంటే తప్పకుండా విశ్వాసం ఉందన్నమాటే, కాని దైవ అస్తిత్వం మీద విశ్వాసం ఉండనవసరం లేదు; కాని దైవ అస్తిత్వానికి ఉద్దేశించి ప్రార్థన ఉండకపోతే ప్రార్థన అనేదే ఉండదు. ప్రార్థించేది ఎవరిని? వ్యక్తిత్వం లేనిదేదో ఒకదానికి ఏ వ్యక్తి అయినా ప్రార్థన ఎలా చేస్తాడు! మనల్ని ఆలకించేవారిని ఒకరిని అతడు ప్రార్థిస్తాడు. మనల్ని ఎవరూ ఆలకించకపోతే, ఎవరైనా ఎట్లా ప్రార్థించగలరు? కనుక, ఒక వ్యక్తి ప్రార్థిస్తున్నాడంటే దానర్థం అతడు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా అతడికి అనంతంగా తనకంటె అపరిమితంగా అధికశక్తి కలిగి, మన విధినే కాక, మనలను కూడా మార్చగలిగిన మహోన్నతమైనదేదో ఒకదాని మీద విశ్వాసం ఉందన్న మాటే. ఒక వ్యక్తి ప్రార్థించాడంటే అది వినబడాలనే. ఇది అసలైన తేడా.

కనుకనే మేధోపరులు ఆకాంక్షను సమ్మతించి అక్కున చేర్చుకుని, ప్రార్థనను అధమమైందని అంటారు. మార్మికులు ఆకాంక్ష మంచిదని చెప్తూనే, నీవు నిజంగా ఆలకించబడాలని, నిన్ను దైవం ఆలకించాలని కోరుకుంటే, నీవు తప్పక ప్రార్థించి తీరాలని, అది కూడా పసివానిబోలి అత్యంత నిరాడంబరంగా, సమగ్రంగా, సరళతతో ప్రార్థించాలని చెప్తారు. దానర్థం పరిపూర్ణ విశ్వాసం కలిగి ఉండడం: "నాకు ఇది లేక అది కావాలి (అది నైతికావసరం కావచ్చు లేక భౌతికం లేక విషయావశ్యకం కావచ్చు), నేను నిన్ను దాని కోసం అడుగుతున్నాను, నా కనుగ్రహించు" లేదా మరింకో విధంగా ఉంటుంది: "నేనడిగింది నీవు నా కిచ్చావు, నాకు ఎరుకలోలేని అనుభవాలను నిర్దుష్టంగా నాకు సాక్షాత్కారానుభవం కావించావు, ఆ అద్భుతాలు నా ఇచ్ఛ వచ్చినప్పుడు పొందగలను; ఇది నిజం, నేను ఎంతో కృతజ్ఞుడనై ఉన్నాను, నేను కృతజ్ఞతాపూర్వకంగా స్తుతికీర్తనలతో ధన్యవాదాలు తెలుపటానికి నా ప్రార్థనను నీకు నివేదిస్తున్నాను, నీ జోక్యానికి నా కృతజ్ఞతలు" అని ప్రార్థన చేయవచ్చు. ఆకాంక్షించటానికి ఆకాంక్షను ఎవరికో ఒకరికీ, ఒకరివైపుకూ గురిచేయవలసిన అవసరం లేదు. ఒక విధమైన అస్తిత్వసిద్ధి కోసం, జ్ఞానం కోసం, ఒక సాక్షాత్కారం కోసం, ఒక చైతన్యస్థితి కోసం ఆకాంక్షించవచ్చు, కాని అది ప్రార్థనగా రూపుదిద్దుకోవవలసిన

ఆవశ్యకత లేదు; ప్రార్థన ఒక విధంగా అదనం.

ప్రార్థన వ్యక్తిగతమైనది, ఒక వ్యక్తిత్వపరమైన అస్తిత్వానికి ఉద్దేశించింది, అది ఏదైనా కావచ్చు — ఒక శక్తి లేక అస్తిత్వం — నీ ప్రార్థన నాలకించి, నీకు సమాధానం ఇచ్చేది. అలా కాని పక్షంలో నీవు దేనినీ కోరలేవు. అర్థమైంది కదా!

(CWM Vol.5, pp. 141-45)

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ప్రార్థన సాఫల్యతకు అవసరమగు స్థితి

అత్యంత ప్రధానమైనది పసిబాలునిలో వుండే నమ్మకం. తాను ఫలానాదానిని అడుగ కపోయినా అది కచ్చితంగా తనకు అందే తీరుతుందన్న నిష్కపటమైన విశ్వాసం. అతడి కెప్పుడేది కావాలో అది వచ్చేస్తుందని అతడికి కచ్ఛితంగా తెలుసు. ఈ రకమైన విశ్వాసం... నిజానికి ఇదే ఆవశ్యకమైన అత్యంత ముఖ్యమైన స్థితి.

ఆకాంక్షించడమనేది అత్యావశ్యకం. కానీ కొంతమంది వాళ్ళ లోపల విశ్వాసానికి, అవిశ్వాసానికీ, నమ్మకానికీ, అపనమ్మకానికీ విజయం తథ్యమైనదన్న ఆశావాదానికీ, దానంతటదే ఉపద్రవాన్ని రమ్మని కోరే నిరాశావాదానికీ మధ్య వ్యతిరేక స్థితుల్లో వుండి ఆకాంక్షిస్తారు. ఇప్పుడిలాంటి స్థితే నీలో వుండి కోరుకోవచ్చు గానీ ఏమీ పొందలేవు. “నేను ఆకాంక్షించాను గానీ నేనేదీ పొందలేదు” అని అంటావు కూడా. ఎందుకంటే విశ్వాసమనేది నీలో లేనందువల్ల, నీలోని ఆకాంక్షను నీవే కూల దోసుకుంటావు. కానీ నీవు నిజంగా నమ్మితే, పిల్లలు పెద్దవాళ్ళ ద్వారా వక్రీకరించ బడకుండా ఉంటే, వారంతట వారుండగలిగితే, అంతా బాగుండి తీరుతుందన్న గొప్ప విశ్వాసాన్ని కలిగి వుంటారు.... ఉదాహరణకి, పిల్లలు ఏదైనా ప్రమాదానికి గురి అయినప్పుడు వారికి అది తీవ్రమౌతుందని, విషమిస్తుందనే ఆలోచనైనా రాదు. ఎంతో సహజంగా తొందరలోనే పోతుందిలే... అని సునాయసంగా నమ్ము తారు. అదే ఎంతో శక్తివంతంగా పనిచేసి, ఆపద సమసిపోవడానికి దోహదపడుతుంది.

మనిషి ఎప్పుడైతే శక్తి కోసం ఆకాంక్షిస్తాడో, దైవసహాయం కోసం అర్థిస్తాడో,

ఆ అడిగేది అచంచలమైన విశ్వాసంతో ఇక వచ్చే తీరుతుంది అనుకుంటాడో, పోవడం అసంభవమని అనుకుంటాడో, అది లభించడం తథ్యం. ఈ విధమైన విశ్వాసం, నిజమైన అంతర్గతమైన తెరుచుకోవడం. కొంతమంది నిరంతరం ఇట్లాంటి స్థితిలో వుంటారు. ఏదైనా అందుకోవల్సి వచ్చినప్పుడు దానిని అందుకోవడానికి సంసిద్ధంగా వుంటారు. కొందరు మాత్రం దేనినైనా పొందవలసినప్పుడు, ఒక శక్తి క్రిందికి దిగి వచ్చినప్పుడు, దానిని స్వీకరించడానికే సర్వదా గైరు హాజరై పోతుంటారు. కచ్చితంగా ఆ క్షణంలోనే వారు మూసుకుపోతుంటారు. ఎవరైతే పసిబాలురలో వుండే సహజమైన నమ్మకాన్ని కల్గివుంటారో, వారు కచ్చితంగా సరియైన సమయానికి సర్వదా సంసిద్ధమై వుంటారు.

ఇది విచిత్రం.... కాదా మరి; బయటకు ఏ తేడా కనపించదు. వారంతా ఎంతో సుహృద్భావంతో మంచి చేయడానికి ఒకే మాదిరి అభిలాషనూ, ఆకాంక్షనూ కల్గి వుండవచ్చు. కానీ ఎవరిలో నవ్వులతో తొణకిసలాడే నమ్మకం వుంటుందో వారు ప్రశ్నించరు. ఫలానా దానిని పొందగలమా లేదా, దైవం నుండి జవాబు వస్తుందా... రాదా... అని వారిలో వారు తర్కించుకోరు. అసలీ విధమైన ప్రశ్నలే తలెత్తవు. అది ఇదివరకే అవగతమైన విషయం. "నాకేది అవసరమో అది నా కివ్వ బడుతుంది. నేను ప్రార్థిస్తే, దానికి సమాధాన మందుతుంది. నేను కష్టాల్లో వుండి సహాయం అర్థిస్తే ఆ సహాయం నాకు లభిస్తుంది, రావడమే కాదు, అన్నిటినీ చక్క బెడుతుంది."

ఇదిగో, ఇట్లాంటి సహజ సిద్ధమైన, నిష్కపటమైన, నిస్సంశయమైన విశ్వాసమనేది వుంటే, ఇది తక్కినవాటికన్నా చాలా గొప్పగా పనిచేస్తుంది. ఫలితాలు అమోఘంగా

ప్రార్థనకు ప్రేరేపణ: హఠాత్తుగా ఒక జ్వాల ప్రజ్వలింపబడు తుంది. నీ వొక అత్యుత్సాహభరితమైన తీవ్రతను, శక్తిని అనుభ విస్తావు. దానిని పదాల రూపంలో వ్యక్తపరుస్తావు. నిజానికి అది అయత్నపూర్వకమైనదిగా నుండాలి. అది అత్యంత ఉల్లాసంగా, మేధోప్రమేయం లేకుండా, నేరుగా హృదయము నుండి పెల్లుబకాలి. ప్రార్థన అంటే అది.

శ్రీమాత

వుంటాయి. వ్యక్తి తన మనస్సులోని వ్యతిరేకతలూ, సంశయాలతోనే అంతా పాడుచేసుకొంటాడు. తానేదైనా కష్టాల్లో వున్నప్పుడు "అబ్బో! నాకిది అసాధ్యం, ఇది నా వల్ల కాదు. ఈ పరిస్థితే ఇంకా తీవ్రతరం అయితే, మరింత అధ్వాన్నంగా తయారవుతుంది. నేనింకా దిగజారుతూ పోతే"... ఈ మాదిరిగా అలోచించి అతడు తనకు తాను పొందాలనుకొన్న శక్తికి మధ్య గోడ కట్టుకొంటాడు. కానీ చైత్యపురుషుడు ఈ విధమైన విశ్వాసాన్ని కల్గి వుంటాడు. ఏ విధమైన నీలినీడ, ఎలాంటి వివాదం, ఏ విభేదం లేని అద్భుతమైన విశ్వాసాన్ని కల్గి వుంటాడు. ఆ విధంగా వున్నప్పుడు జవాబు నొందని ప్రార్థన, పరిపూర్తి నొందని ఆకాంక్షంటూ వుండదు.

శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

సామూహిక ప్రార్థన, ఆదర్శవంతమైన సాముదాయక విశేషం

సమూహాల్లో రకాలున్నట్లే, ప్రార్థనలో కూడా అనేక రకాలున్నాయి. కేవలం పరిస్థితుల ప్రభావం వల్ల, ఏ అంతర్గత సమన్వయం లేకుండా ఏర్పడ్డ గుర్తింపవీలుకాని జనసమూహాలు ఉన్నాయి. ఉదాహరణకు, ఒక రాజు లేదా ఒక వ్యక్తి, ప్రజల దృష్టిని ఆకర్షించే వ్యక్తి, సంకటస్థితిలో ఉన్నపుడు, రోగంతో లేదా ఏదైనా ఒక ప్రమాదంలో క్షతగాత్రుడుగా ఉన్నపుడు, వారి సమాచారం కొరకు లేదా తమ సానుభూతి వ్యక్తం చేయడం కోసం జనం పోగుపడ్తారు; నిర్హేతుక పరిస్థితుల్లో జనం పోగు పడ్డారక్కడ; అంతర్గతంగా వారిని కలిపేదేదీ లేదక్కడ. కేవలం వారికుండే ఒకే ఉద్వేగం, అభిరుచి తప్ప. అదే విధంగా తాము ప్రత్యేకంగా అభిమానించే వ్యక్తుల కొరకు, వారు కోలుకొనుట కొరకు, జనసమూహాలు యధేచ్ఛగా ప్రార్థించే సందర్భాలున్నాయి. అయితే, ఈ సమూహాలే, పూర్తిగా విభిన్న లక్ష్యంతో కూడా పోగవచ్చు — ద్వేషభావంతో. అప్పుడు వారి అరుపులు, ఆక్రందనలు కూడ ఒక రకమైన ప్రార్థన వంటివే, దుష్ట లేదా వినాశకర శక్తుల కొరకు. ఇవన్నీ ముందుగా ఊహించని, వ్యవస్థీకృతం కాని, యథేచ్ఛగా జరిగే ఉద్యమాలు.

ఒక ఆదర్శం, బోధ, లేదా చేయాల్సిన పని కొరకు పోగయ్యే వ్యక్తుల సమూహాలు

కూడ ఉన్నాయి. వీరంతా ఒక విశ్వాసం, ఒక ఇచ్ఛ, ఒక ధ్యేయంగల వ్యవస్థ ద్వారా కలుస్తారు. వీరంతా ఒక పద్ధతిలో సమావేశమై, ఒకే ప్రార్థన, ధ్యానం చేయ వచ్చు. ఇంకా వీరి లక్ష్యం ఉన్నతమైనదైతే, వారి వ్యవస్థ మంచిదైతే, వారి ఆదర్శం శక్తివంతమైనదైతే, వారి ప్రార్థనలు ధ్యానం ద్వారా, ఈ సమూహాలు చెప్పుకోదగినంత ప్రభావం కల్గించగలవు — ప్రపంచ సంఘటనలపైన, వారి స్వంత అంతరంగ అభి వృద్ధి పైన, సామూహిక అభివృద్ధిపైన — ఈ సమస్య నిజంగా, ఇతర సమూహాల కంటే ఉన్నతమైనది, కాని వీరికి లేదు గుంపుల కున్నంత గుడ్డి బలం, జనసమూహాల కున్నంత సామూహిక కార్యాచరణ. ఈ దూకుడు, తీవ్రతలను చైతన్యవంతమైన వ్యవస్థాబలంతో, అవి అధిగమిస్తాయి.

అన్ని కాలాల్లో ఇటువంటి వ్యవస్థీకృత సమూహాలు ఉంటూ వచ్చాయి భూమిపై. వీటిలో కొన్నింటికి ప్రపంచంలో చారిత్రక జీవితం, చారిత్రక కార్యాచరణ ఉండింది. కాని ఒక నియమంలా, ఇవేవీ ఉత్తీర్ణత సాధించలేకపోయి — కొందరు ప్రత్యేక వ్యక్తుల కంటె ఎక్కువగా. అవి ఎల్లప్పుడూ, అనుమానించబడ్డాయి, వేధించబడ్డాయి, శిక్షించబడ్డాయి. చాలా తరచుగా క్రూరంగా, అజ్ఞానంతో, అజ్ఞాతంగా రద్దుచేయ బడ్డాయి.

ఇంకా కొన్ని సమూహాలుండేవి. అవి పాక్షికంగా మతపరమైన, లేదా ఔదార్యం, సాహసంతో కూడిన, సహాయక బృందాలు. ఇవన్నీ ఒక నమ్మకం, సిద్ధాంతం, లేదా నిర్దిష్ట లక్ష్యం ద్వారా పోగైన సమూహాలు. వీటన్నిటికి ఆసక్తికరమైన చరిత్ర ఉన్నది. ప్రపంచంలో ఇవన్నీ నిశ్చయంగా, సమిష్టి పురోభివృద్ధికి, వ్యక్తిగత ప్రయత్నం ద్వారా ఎంతో చేశాయి.

ఒక ఆదర్శ వ్యవస్థ ఉన్నది. అది పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందినపుడు, ఒక విధమైన గొప్ప ఐక్యతను సృజించగలదు. దానిలో మూల వ్యక్తులందరికి, ఒకే లక్ష్యం, ఒకే ఇచ్ఛ, తగినంత అంతరంగ అభివృద్ధి ఉంటుంది. ఈ అంతరంగ ఏక త్వానికి అనుగుణంగా, ఒకే కారణం, ఒకే ధ్యేయం ఒకే ఆకాంక్ష, ఒకే చర్య గల సంబద్ధ వ్యవస్థ రూపొందించబడుతుంది.

అన్ని కాలాల్లోను ఉపదేశ కేంద్రాలు ఈ దిశలో ప్రయత్నించాయి; కొంచెం ఎక్కువగానో, తక్కువగానో ఉత్తీర్ణత సాధించాయి; శక్తి సాంప్రదాయాలన్నిటిలో పని చేసేందుకు ఇది అత్యంత శక్తివంతమైన సాధనం అని చెప్పబడింది.

వ్యక్తిగత వ్యవస్థ పొందిన సంబద్ధతనే సామూహిక వ్యవస్థ కూడ పొందగల్గితే, అది వ్యక్తి శక్తిని, చర్యలను అనేక రెట్లు పెంచగలదు.

సాధారణంగా, అనేక వ్యక్తులు ఒక చోటుకు తేబడినపుడు, ఆ సమూహ సమిష్టి లక్షణం, విలువ, విడిగా ఉన్న వ్యక్తి లక్షణం, విలువ కంటె, చాల తక్కువగా ఉంటుంది. కాని ఎరుకతో, తగినంతగా సమన్వయపర్చిన వ్యవస్థలో వ్యక్తిచర్య యొక్క శక్తిని, అనేక రెట్లు పెంచడానికి, అవకాశం ఉంటుంది.

(CWM Vol. 9, pp. 369-70)

శ్రీమాత

అనువాదం: యస్. వై. సోమయాజులు

ప్రార్థన భగవంతునితో అనుబంధానికి తోడ్పడుతుంది

మానవ జీవితం అవసరాల, కోరికల పుట్ట, వాంఛల సమాహారం. భౌతిక, ప్రాణికమైనవి కాకుండా మానస, ఆధ్యాత్మికమైనవి ఎన్నో. ఈ ప్రపంచాన్ని నిర్దేశిస్తున్న ఒక మహాశక్తి అతని స్పృహలోకి రాగానే తన అవసరాలు తీర్చుకోవడానికి, తన కష్టాల యాత్రలో సహాయం కొరకు, తన రక్షణ కోసం, తన పోరాటంలో సహాయం కొరకు ప్రార్థన ద్వార మనిషి ఆ దివ్యశక్తిని ప్రాధేయపడతాడు. ప్రార్థన ద్వారా భగవానుని సమీపించడంలో ఎన్నో అపభ్రంశలు ఉంటాయి. నిజానికి చాలా లోపాలు ఉన్నాయి. భగవంతుణ్ణి లంచాలతో, పొగడ్తలతో, మెచ్చుకోలుతో, కానుకలతో సంతుష్టుడ్ని చేయగలమని కొందరి భావన. భగవంతుని సమీపించడానికి అవసరమైన స్ఫూర్తిని పట్టించుకోరు. అయినప్పటికీ భగవంతుని వైపు తిరగడం మతపరమైన అతిముఖ్య జీవనవిధానం. అది ఒక విశ్వజనీన సత్యంపై ఆధారపడి ఉంది.

ప్రార్థన శక్తిని చాలామంది సందేహిస్తుంటారు. ప్రార్థన సహేతుకం కాదని, విలువ లేనిది, నిరుపయోగమైనదని చాలామంది భావన. విశ్వజనీన దివ్యసంకల్పం తన లక్ష్యం నెరవేరుస్తూ పోతుంది. అహంకారపూరితమైన పొగడ్తలతో కానీ, వేడుకోలుతో కాని ఆ సంకల్పాన్ని అపమార్గం పట్టించలేము.

కాని విశ్వాతీతమైన సర్వ విజ్ఞానమయుడు తన విశ్వజనీన క్రమవ్యవస్థలో

ఏది జరగాలో ముందుగా వీక్షిస్తుంటాడు. మనిషి మార్గదర్శకత్వం అవసరం కాదు. మానవ ఆలోచన ప్రేరేపించ నవసరం లేదు. వ్యక్తి కాంక్షలు ఏ ప్రపంచ వ్యవస్థలోనైనా నిజమైన నిర్ధారణ అంశం కాదు.

ఆ వ్యవస్థ కాని, విశ్వజనీన సంకల్పం కాని యాంత్రిక శాసనం ద్వారా అమలు కాదు. కాని విభిన్నమైన శక్తులు ఉన్నాయి. వాటికి మానవ సంకల్పం, ఆకాంక్ష, విశ్వాసం కనీస స్థాయిలోనైనా ప్రముఖం కాకపోదు. ఆ సంకల్పానికి, ఆకాంక్షకు, విశ్వాసానికి ఇవ్వబడిన ఒక ప్రత్యేక రూపమే ప్రార్థన. ఆ రూపాలు మొరటుగా వుంటాయి. చిన్నపిల్లవాని మాటలవలె వుంటాయి. అమాయకంగా వుంటాయి. అది పెద్ద లోపం కాదు. అపరిపక్వ మనస్సుగల చిన్నపిల్లవాని అమాయకత్వం అది. అవివేకం ఉంది, కాని దానికి నిజమైన శక్తి, విశిష్టత ఉంది. దివ్య సంకల్పంతో మానవ సంకల్పాన్ని, ఆకాంక్షను, విశ్వాసాన్ని కలపడానికి ప్రార్థన ఒక శక్తిగా పనిచేస్తుంది. అది దాని అసలు ప్రయోజనం. స్పృహ వున్న పురుషునితో మనం స్ఫూర్తిమంతమైన, సజీవ సంబంధాలు కలిగియున్నట్లు ఈ ప్రక్రియ వుంటుంది. మన సంకల్పం, ఆకాంక్ష, మన శక్తి, ప్రయత్నంతో పనిచేస్తాయి. నిమ్న, ఉన్నత ప్రయోజనాలు సాధించడానికి వాటిని తీర్చిదిద్దవచ్చిన ఆ శక్తిని ఉపయోగించడానికి అనేక సాధనమార్గాలు రూపొందించబడ్డాయి. లేదా దివ్య, విశ్వజనీన సంకల్పంపై ఆధారపడి అవి పనిచేయవచ్చు. ఈ రెండవ పద్ధతిలో మన ఆకాంక్షకు, దివ్యసంకల్పం ప్రతిస్పందించవచ్చు, దాదాపు యాంత్రికంగా. దానికి శక్తి నియమం ఉంది. లేదా నిర్వ్యక్తిగతంగా పనిచేయవచ్చు. మానవాత్మ, దివ్య ఆకాంక్ష, విశ్వాసానికి స్పృహతో ప్రతిస్పందించవచ్చును. స్పృహతో కోరుకున్న సహాయం మార్గదర్శకత్వం, రక్షణ, సాఫల్యం తీసుకొని రావచ్చు — 'యోగక్షేమం వహామ్యహం'.

మొదట నిమ్న భూమికలో అహంకారం, స్వీయభ్రమలతో కలిసిపోయి భగవంతునితో బంధాన్ని సన్నద్ధం చేయడానికి ప్రార్థన సహాయపడుతుంది. కాని తరువాత దాని వెనుకే వున్న ఆధ్యాత్మిక సత్యం వైపు పురోగమించవచ్చును. అడిగిన వరాలన్నీ ఇవ్వడం జరగదు. కాని మానవ జీవితం భగవంతునితో బంధం పెంచుకోవడమే అది. స్పృహతో కూడిన వినిమయం అది. ఆధ్యాత్మిక విషయాలలో ఈ చైతన్యబంధం ఒక గొప్ప శక్తి. ఆధ్యాత్మిక ప్రయోజనాలు సాధించడానికి కూడా అది అవసరం. మనపై మనం ఆధారపడి పోరాడడం, ప్రయత్నించడం కన్నా, అది

మరింత శక్తివంతం. అది మరింత సంపూర్ణ ఆధ్యాత్మిక వికాసం, అనుభవం ప్రసాదిస్తుంది.

మనల్ని దేని కోసం ప్రార్థన సన్నద్ధం చేసిందో అక్కడ అది ఆగిపోతుంది. విశ్వాసం, ఆకాంక్ష, సంకల్పం ఉన్నంతకాలం ప్రార్థన అనే రూపం అవసరం లేదు. లేదా భగవంతునితో బంధంలోని ఆనందం కోసం అది ఉండిపోతుంది. ప్రార్థన లక్ష్యాలు, ప్రయోజనాలు ఉన్నతోన్నతమై, మనం చివరికి అత్యున్నతమైన ప్రయోజనరహిత భక్తి కాంతిసీమలు చేరుకొంటాము. ఏ విధమైన కోరిక, అభ్యర్థన లేని సంపూర్ణ దివ్య అమృత శిఖరాలు చేరుకొంటాము.

భగవంతుని పట్ల ఈ వైఖరితో కూడిన బంధాలు దివ్యజననీజనకులు పుత్రునితో గల బంధాలతో సమానం. ఒక దివ్యస్నేహితునితోగల బంధం అది. మానవాత్మ సహాయం, సాఫల్యం, తనను నడిపించడం కోసం భగవంతుని చేరుతుంది. జ్ఞానం, లక్ష్యం అయితే మార్గదర్శకత్వం కోసం, ఉపాధ్యాయుని కోసం, కాంతిప్రదాత కోసం ఆత్మ దైవాన్ని చేరుతుంది. భగవంతుడు విజ్ఞాన సూర్యోదయం. బాధలు, కష్టాల నుండి విముక్తి కోసం, ఓదార్పు కోసం, ప్రపంచం నుండే ముక్తి కోసం, బాధలు కలిగించే అంతర్గత యదార్థ కారణాల నుండి ముక్తికోసం మానవాత్మ దైవాన్ని చేరుతుంది. వాటిలో ఒక శ్రేణి కనిపిస్తుంది. గీత అటువంటి భక్తుల్ని మూడు రకాలుగా విభజించింది. వారిని అర్థార్థి, ఆర్తి, జిజ్ఞాసువులుగా పరిగణించింది. (నాలుగు రకాల భక్తులలో అవి మూడు రకాలు). తండ్రి భావన (బంధం) తక్కువ సన్నిహితమైనది, తక్కువ తీవ్రత గలది. దానిలో తగినంత కాంక్ష లేదు. ఆత్మీయతా బంధం లేదు. అందువల్ల యోగప్రక్రియలో ఆ భావనను తక్కువగా అనుసరిస్తారు. అత్యంత సన్నిహిత సమైక్యం యోగసాధన కోరుతుంది. ఒక దివ్యస్నేహితునిగా భగవంతుడ్ని భావించడం మధురాతి మధురమైనది. మరింత ఆత్మీయబంధం ఉంది. అసమానతలో కూడా సమానత్వం, సన్నిహితత్వం అందులో ఉన్నాయి. పరస్పర ఆత్మసమర్పణకు అది నాంది. అతి సమానంగా, ఆదానప్రదానాలు అంతరించిన పిమ్మట, ఈ బంధానికి ఏ ఉద్దేశ్యం లేకపోతే, ఒక ప్రేమ మాత్రమే సర్వ సంతృప్తి పరమోద్దేశ్యమైనప్పుడు, సృష్టి లీలలో విశ్వ క్రీడాకారునితో స్వేచ్ఛా ప్రదీప్త, ఆనంద సందీప్త బంధంగా అది వికసిస్తుంది, పరిమళిస్తుంది, పరవశిస్తుంది. అయితే మాతృబంధం మరింత సన్నిహిత మధురమైనది. ఆధ్యాత్మిక ఆకాంక్ష

తీవ్రస్థాయి చేరినప్పుడు, హృదయంలో ప్రియ వాహినిగా పరవళ్ళు తొక్కినప్పుడు ఆ సాన్నిహిత్యం మరింత బృహత్ పాత్ర నిర్వహిస్తుంది.

ఆత్మ తన కోరికలతో, బాధలతో అమ్మచెంతకు చేరుతుంది. అమ్మ కోరిక అదే. ఆమె తన ప్రేమప్రపూర్ణ హృదయాన్ని అందిస్తుంది. ప్రేమలోని స్వయం వ్యక్త స్వభావం కారణంగా ఆత్మ అమ్మవైపు తిరుగుతుంది. ప్రపంచంలో తిరిగి తిరిగి మనం చేరుకొనే మధుమందిరం అదే. మనకు విశ్రాంతి నిచ్చే చల్లని గుండె.

సమున్నతమైన బంధం సామాన్యమైన మత ఉద్దేశ్యాల నుండి ప్రారంభం కాదు. యోగసారంతో దానికి సంబంధం ఉంటుంది. ప్రేమతీరాల నుండే అది ప్రభవిస్తుంది. ప్రేమికుని, ప్రియతముని ఆకాంక్ష నుండి ప్రజ్వరిల్లుతుంది. భగవంతునితోనే సమైక్యం కావాలని ఆత్మకు కోరిక ఉన్నప్పుడు, ఈ దివ్య ఆకాంక్ష మతాలలోకి ప్రవహిస్తుంది. అది లేకుండా మతాలు వ్యవహరిస్తుంటాయ. వాటి సామాన్య వ్యవస్థలో దానికి స్థానం ఇవ్వవు. ఇక్కడ మనం అడిగేది ప్రేమ. మనం కోల్పోతామేమోనని భయపడేది అదే. అన్ని ప్రపంచ వస్తువులు ప్రేమికుని కోసం బ్రతకవు. సంఘటనలుగా అవి కదిలి వస్తుంటాయి. పర్యవసానాలుగా వస్తాయి కాని ప్రేమకు లక్ష్యాలు కావు, షరతులు కావు. ప్రేమ సమస్తం స్వయంవ్యక్తం. అస్తిత్వంలోని రహస్య ఏకత్వం నుండి ప్రేమ సముద్భవిస్తుంది. తాము లేరు అన్న భావనలేని ఆత్మల మధ్య హృదయంలోని ఏకత్వం, ఏకత్వ ఆకాంక్ష అది. ప్రేమ కోసమే అన్ని ఇతర బంధాలు అస్తిత్వపు స్వయంవ్యక్త ఉద్దేశరహిత ఆనందం వైపు పరుగులు తీస్తాయి. ఇతర ఉద్దేశాల లీలలోని ఆనంద సంతృప్తుల కోసం అవి వెంపర్లాడతాయి. అవి అక్కడ నుండే ప్రారంభమై అటువైపే ప్రయాణిస్తాయి. ఒకరిని పొందాలన్న కోరిక ఉంటుంది. స్వయం వ్యక్త ప్రేమ పూర్ణత్వంలో అది కూడా దాటి వెళ్ళిపోతుంది. తన భక్తి ఏనాడూ ఆగకూడదని, కరిగి పోకూడదని ప్రతి భక్తుని అంతిమ ఆకాంక్ష. స్వర్గం కోసం కాని, జన్మల పరంపర నుండి విముక్తి కోసం కాని మరే ఇతర వస్తువు కోసం అతను కోరడు. తన ప్రేమ నిత్యమై, నిఖిలమై, నిరపేక్షమై నిలిచిపోవాలన్నదే అతని ఏకైక ఆకాంక్ష.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

ఎలా ప్రార్థించాలి

ప్రార్థన మానసికావేశ పతాకస్థాయిలో హృదయాంతరాల నుండి ఉప్పొంగాలి.
(SABCL Vol. 23: 533)

*


భగవంతుడు హృదయంలోకి తొంగి చూచి తనకు సరైన సమయమని తోచినప్పుడు, తెరను తొలగిస్తాడు. నీవు భక్తిసిద్ధాంతముపై ప్రగాఢ నమ్మకంతో, ఆతని పేరు పిలిస్తే చాలు తక్షణం స్పందించి ప్రత్యక్షమవ్వాలని అంటావు. బహుశ అలా జరగ వచ్చు. కాని అది ఎవరి విషయంలో సార్థకమవుతుంది? ఒక విశిష్టమైన భక్తుడు ఎవరైతే ఆ దివ్యనామ శక్త్యానుభూతిని పొందాడో, ఆ నామంపై అతనికున్న ప్రేమోద్వే గాన్ని తన పిలుపులో ప్రతిధ్వనింపజేసాడో అతని విషయంలో అది నిజం కావచ్చు. మనిషి ఆ విధంగ నున్నట్లయితే తక్షణ సమాధానం అందుతుండవచ్చు. లేనట్లయితే మనిషి ఆ స్థాయికి యెదగాలి, అప్పుడు సమాధానం అందుతుంది.
(SABCL Vol. 23: 788)

*

నీ అంతట నీవు నీ హృదయాన్ని, నీ యావచ్ఛక్తిని, దైవాధీనం గావించు. షరతులు విధించకు. నీలోను, నీ ద్వారా ఆతని సంకల్పం నెరవేరాలని తప్ప వేరొద్దానిని కాంక్షించకు — యోగంలో సిద్ధి పొందాలని కూడ. భగవంతుడు తనను అర్థించినవారికి అర్థించిన మేరకు యిస్తాడు. కాని వారిని వారు సమర్పించుకుని యేమీ అర్థించనివారికి, వారు అర్థించగోరేది, వారికి అవసరమైనది సమస్తమూ ప్రసాదిస్తాడు. దానితోపాటు తనను తాను వారికి దత్తత చేసుకొని, తన ప్రేమానురాగాల వరాలను అప్రయత్నంగానే అందిస్తాడు.
(SABCL Vol. 16: 414)

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి



యోగం, మతం
మధ్య వ్యత్యాసం

అఖిల

అఖిలభారత పత్రిక

జూలై 2013

9/7/2015

విషయసూచిక

యోగం, మతం మధ్య వ్యత్యాసం

శ్రీమాత ప్రవచనాలు

శ్రీఅరవిందుల ప్రవచనాలు



శ్రీమాత స్వీయ విరచిత చిత్రం

యోగం, మతం మధ్య వ్యత్యాసం

నైతికత ఒక భాగంగా కలిగిన ఆధ్యాత్మిక జీవనము, మతపరమైన ధార్మిక జీవనము, సాధారణ మానవజీవనము మూడున్నూ విభిన్నమైన విషయాలని గ్రహించాలి. వ్యక్తి వీటిలో దేనిని అనుసరించకోరుతాడో, స్పష్టంగా తెలుసుకోవాలి. వీటిని ఒకదాని కొకటి అనుకొనే భ్రాంతికి లోనుకాకూడదు.

(SABCL Vol. 22:137)

*

ప్రశ్న: మధుర మయీ, యోగానికి, మతానికి మధ్య భేదం ఏమిటి?

శ్రీమాత: ఓహ్ పాపా! నువ్వు శునకానికీ, పిల్లికీ మధ్య భేదం అడుగుతున్నట్లుగా వుంది.

(దీర్ఘమైన నిశ్శబ్దం తర్వాత)

ఒక వ్యక్తి ఏదో విధంగా దైవమనేదేదో ఉన్నదని విని, భగవంతుడనేవాడు ఉంటాడని భావించి, అన్నివిధాలయిన ప్రయత్నాలు చేయటం ప్రారంభిస్తాడు. స్థిర సంకల్పంతో, క్రమశిక్షణతో, ఏకాగ్రతతో, యిలా అన్ని రకాలయిన మార్గాలలో భగవంతుణ్ణి వెదకటానికి, కనుగొనటానికి, ఆయనతో సాన్నిహిత్యాన్ని పెంచుకొనటానికి, ఆయనతో ఏకం కావటానికి ప్రయత్నిస్తుంటాడు. అంటే ఆ వ్యక్తి యోగాన్ని అనుష్టిస్తు న్నాడని అర్థం.

ఆ వ్యక్తి తాను అవలంభించిన పద్ధతులన్నిటినీ క్రోడీకరించి, ఒక నిర్దిష్టమయిన మార్గాన్ని నిర్మించి, తాను పరిశోధించి తెలుసుకున్నదానిని ఒక కచ్చితమయిన సిద్ధాంతంగా ప్రతిపాదిస్తే, ఉదాహరణకి, దైవం యిలా ఉంటాడు, భగవంతుణ్ణి తెలుసుకోవాలంటే మీరిలా చెయ్యాలి, ఈ ముద్రలో కూర్చోవాలి, యిలాంటి మనోవైఖరి కలిగి ఉండాలి, ఈ విధమైన ఉపచారాలు చెయ్యాలి, ఇదే సత్యం అని గ్రహించాలి అని అన్నట్లయితే, "ఇదే సత్యమని నేను విశ్వసిస్తున్నాను, నేను దీనికి పూర్తిగా కట్టుబడి ఉంటాను, మీ పద్ధతి మాత్రమే సరి అయినది, ఇదొకటే మార్గం" — అని మీరు అంగీకరించాలి. ఇదంతా వ్యవస్థీకరించి క్రమపద్ధతిలో నిర్దిష్టమయిన సూత్రా

లుగా, ఆచారాలుగా గ్రంధస్థం చేసినట్లయితే, అదొక మతంగా తయారవుతుంది.

శ్రీమాత

అనువాదం: డా. సరోజా ప్రసాద్

(CWM 8:146)

మతం యొక్క స్వభావ స్వరూపాలు

ప్రశ్న: అసలు మతం యొక్క స్వభావ స్వరూపా లేమిటి? అవి ఆధ్యాత్మిక జీవనానికి అవరోధమా?

స: మతం అన్నది మానవుల ఉన్నత మానసానికి చెందినది. అది మానవుని యొక్క ఉన్నత మనసు తన శక్తి మేరకు ఆ ఆవల ఉన్నదాన్ని చేరాలన్న తపన. దానికే మానవులు పెట్టిన పేర్లు దైవం లేదా ఆత్మ ఒక సత్యం లేదా విశ్వాసం లేదా జ్ఞానం లేదా అనంతం... అలాంటి పారమార్థికమైన సమగ్రస్థితి. దాన్ని మానవ మనస్సు ఇంకా చేరలేకపోతోంది, కాని ప్రయత్నం చేస్తోంది. మతం అన్నది దాని చిట్టచివరి స్థితిలో దివ్యమైనది కావచ్చు, కాని అది తన వాస్తవ స్వభావంలో కేవలం మానవీయమైనది. నిజానికి మనం మతం గురించి కాదు, మతాల గురించి మాట్లాడాలి. ఎందుకంటే మానవులచే చాలా మతాలు తయారు చేయబడ్డాయి. ఈ భిన్నమైన మతాలకి మూలం ఒక్కటే కాకపోయినా, అవి తయారుచేయబడ్డ విధానం ఒకే విధంగా ఉంటుంది.

మనకి క్రీస్తు మతం ఏవిధంగా వ్యాప్తిలోకి వచ్చిందో తెలుసు. ఈ క్రీస్తు మతం అన్నది స్పష్టంగా జీసస్ తయారుచేసినది కాదు. కొందరు పండితులు వారి బుద్ధిని, బుర్రని ఉపయోగించి, ఇప్పుడు మనం చూస్తున్న మతంగా నిర్మాణం చేశారు. అది తయారుచేయబడిన విధానంలో ఏ విధమైన దివ్యత్వం లేదు. ఆ విధంగానే అది పనిచేస్తున్న పద్ధతిలోను దివ్యత్వం లేదు. అయితే అది ఆవిష్కరించబడిన ఆ సందర్భం మాత్రం మనం పిలిటే ఒక దివ్యజీవి యొక్క ఉనికికి సంబంధించినదే. ఎక్కడి నుంచో వచ్చిన ఒక జీవి, తనతో ఆ ఉన్నతస్థాయి నించి ఒక స్పష్టమైన జ్ఞానాన్ని, సత్యాన్ని ఈ పృథ్వి కోసం తీసుకురావడం. వారు అందుకోసమే వచ్చి

ఆ పరమ సత్యం కోసం బాధపడ్డారు. అతడు ప్రవచించిన సత్యాన్ని కనుక్కొందుకు, దాన్ని అనుసరించడానికి కొద్దిమంది మాత్రమే ప్రయత్నించారు.

బుద్ధుడు ఈ ప్రపంచం నించి నిర్గమించి దూరంగా ఏకాంతవాసంలో ధ్యానస్థితిలో ఉండి, ఈ మానవుల యొక్క దుఃఖానికి, విచారానిక, జరామరణాలకి, కోరికలు, పాపం, ఆకలి, మొదలైన అన్ని బాధల నించి బయటపడే మార్గం కనుక్కొన్నాడు. తను కష్టపడి కనుక్కొన్న ఆ సత్యాన్ని తన చుట్టూ చేరిన శిష్యులకి, తన్ని అనుసరించిన వారికి అందించడానికి ప్రయత్నించాడు. అయితే ఆతడి మరణానికి ముందే ఆతడి బోధనలు వక్రీకరించబడ్డాయి. అతడు ఈ భూమ్మీద నించి నిష్క్రమించాక మాత్రమే బౌద్ధమతం ఒక సంపూర్ణ మతంగా రూపుదిద్దుకుంది. అయితే త్వరలోనే ఆ శిష్యులు, ఆ శిష్యుల ప్రశిష్యులు వారి మాష్టర్ చెప్పిన బోధనల యొక్క భావజాలంపై విభేదించి, చివరకు ఆ మూల మాతృ మతస్వరూపాన్ని వివిధ శాఖలుగా వర్గీకరణ చేశారు. అదే చివరిక దక్షిణాయన, ఉత్తరాయణ, ప్రాగ్ పాశ్చ్య శాఖలు, ఉపశాఖలుగా రూపొంది, అందులోని ప్రతిశాఖ అది మాత్రమే మూలశాఖకు చెందినదని, బుద్ధుని యొక్క నిజమైన బోధన అని వాదిస్తుంది.

క్రీస్తు యొక్కసిద్ధాంతాలకు కూడా అదే అవస్థ వచ్చింది. అది కూడా ఒక ప్రత్యేక మూసలో వ్యవస్థీకరించబడి, ఒక మతంగా ఒక పద్ధతిలో ఇమడ్చబడింది. ఇప్పుడు జీసస్ వెనక్కి వచ్చి చూస్తే, తన బోధనలను తానే గుర్తించలేడని తరచుగా చెప్తారు. ఎందుకంటే ఆ బోధనల సంగ్రహంపై అంత ఎక్కువగా ఆ శిష్యులు తమ తమ భావాలను ఆపాదించారు. ఇంక బుద్ధుడు కాని వెనక్కి వచ్చి తన బోధనలను మార్చివేసిన తీరు చూస్తే తప్పక నిరాశతో తిరిగి నిర్వాణస్థితిలోకి పరుగు తీస్తాడు. ప్రతి మతానికి ఇదే విధమైన కథ ఉంది. ఆ మతం యొక్క పుట్టుక, ఈ ప్రపంచంలోకి ఓ గొప్ప గురువు యొక్క ఆగమనం. అతడు వచ్చి వెల్లడి చేస్తాడు. అతడు ఓ దివ్యసత్యం యొక్క అవతారం. అయితే మనుషులు దాన్ని చేజిక్కించుకుని, దానితో వ్యాపారం చేస్తారు, దాన్ని రాజకీయం చేస్తారు, ఒక వ్యవస్థగా మారుస్తారు. ఆ విధంగా ఆ మతం వారి చేతుల్లో పడి ఒక పరిపాలనా యంత్రాంగంతో, నియమాలతో, చట్టాలతో, వివిధ శాఖలతో, ఛాందసాలతో, నిబంధనలతో, కర్మకాండలతో, దాన్ని చేజిక్కించుకున్నవారి చేతుల్లో పడి సంపూర్ణంగా నిబద్ధీకరించబడుతుంది, గుర్తించలేనట్టుగా మారిపోతుంది. ప్రభుత్వంలాగే వారి విశ్వాసపాత్రులకి బహుమతు

లిచ్చి, వారిని ధిక్కరించినవారికి, పట్టించుకోనివారికి మతవిరోధులుగా పేరుపెట్టి శిక్షిస్తుంది.

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

ఆధ్యాత్మిక జీవనానికి మతం అవరోధమా?

ఇప్పటికే స్థాపించబడి ప్రాబల్యంలో ఉన్న మతాల యొక్క మొదటి ముఖ్యసూత్రం ఎప్పుడూ ఒకేలా ఉంటుంది. అది "నాది మాత్రమే అత్యంత ఉత్కృష్టమైనది, అదే నిజమైన సత్యం, మిగిలినవన్నీ అసత్యం, తక్కువ స్థాయికి చెందినవి" అని. ఈ రకమైన సిద్ధాంతం యొక్క ప్రాతిపదిక మీద తప్ప మతాలు స్థాపించబడేవి కాదు, వినబడేవి కాదు. నా ఒక్కడి దగ్గరే ఆ అసలైన సత్యం ఉందని నీవు వెల్లడిస్తే తప్ప, జనాలని ఆకర్షించ లేరు, వారిని నీ చుట్టూ చేర్చలేరు.

ఈ రకమైన దృక్పథం మతపరమైన మనస్సుకు సహజమే, అయితే అదే దృక్పథం ఆధ్యాత్మిక జీవనంలో మతాన్ని అవరోధంగా చేస్తుంది. ఈ మతసంబంధమైన సిద్ధాంతాలు, సూత్రాలు మనిషే తయారుచేశాడు. అందువల్ల వాటికి కట్టుబడి నీ జీవన విధానాన్ని నీవు తయారుచేసుకున్న ఒక సూత్రంలో బంధించుకుంటే తప్ప, నీవు విస్తృతమైన, సర్వవ్యాప్తమైన, స్వేచ్ఛతో కూడిన, అన్ని సిద్ధాంతాలకు, నిబంధనలకు ఆవల ఉన్న ఆ ఆత్మసత్యాన్ని తెలుసుకోలేవు. ఎప్పుడైతే ఒక మత విశ్వాసానికి కట్టుబడి, ప్రపంచం యొక్క సత్యం అది ఒక్కటే అనుకొని, అంతటితో ఆగిపోతే, నీ పురోగతి ఆగిపోతుంది, నీ అంతరాత్మని విస్తృతపరచడం నిలిచి పోతుంది.

అయితే, నువ్వు మతాన్ని మరో కోణంలోంచి చూస్తే అది ఎల్లప్పుడు మనుషులందరికి అడ్డంకిగా ఉండదని అర్థమవుతుంది. నీవు దానిని మానవుల యొక్క ఉన్నత కార్యాచరణ సాధనంగా, మానవునిలోని ఆకాంక్షగా చూడగలిగి, మిగిలిన అన్ని విషయాల్లో ఉన్న అసంపూర్ణత్వాలను అందులో కూడా గమనించగలిగినపుడు, అది ఆధ్యాత్మిక జీవన గమనానికి సహాయపడగలదు. దాన్ని గంభీరంగా, నిజాయితీగల

భావంతో తీసుకుని, అందులో ఉన్న సత్యాన్ని కనుక్కునే ప్రయత్నం చేయవచ్చు. అందులో దాగిన ఆకాంక్ష, అందులో ఉన్న దివ్యస్ఫూర్తి మానవ మానసిక వ్యవస్థ వలన ఏ విధంగా మార్పుచెందిందో, వక్రీకరించబడిందో తెలుసుకోవచ్చు. అదీగాక సరైన మానసిక అవగాహనతో నీవు గ్రహించినపుడు ఆ మతం యొక్క ప్రకాశం నీ ఆధ్యాత్మిక సాధనకు కొంత సహాయపడగలదు.

అన్ని మతాల్లోను తప్పనిసరిగా కొందరు ఓ గొప్ప భావోద్వేగాన్ని పొందగల సమర్థత కలిగి ఉంటారు. వారు నిజమైన, గాఢమైన ఆకాంక్షతో నిండి ఉంటారు. వారు నిరాడంబరమైన మనస్సుతో జ్ఞానం ద్వారా దైవాన్ని చేరాలన్న అవసరాన్ని కలిగి ఉండరు. అలాంటి స్వభావం ఉన్నవారికి మతం ఉపయోగపడుటతో పాటు అవసరం కూడాను. ఎందుకంటె బాహ్య ఆకృతులు, చర్యలు — చర్చిలో జరిగే ఆ ఉత్సవాలు, సంబరాలు లాంటివి — వారి ఆంతరంగిక ఆధ్యాత్మిక ఆకాంక్షకు ఒక రకమైన ఆలంబనగా ఉంటాయి. ప్రతి మతంలోను అత్యంత ఉన్నతమైన ఆధ్యాత్మిక జీవనంలోకి పరివర్తన చెందిన కొందరు వ్యక్తులుంటారు. అయితే వారికి ఆధ్యాత్మికత నిచ్చినది మతం కాదు, నిజానికి వారివల్లే ఆ మతానికి ఆధ్యాత్మికత చేకూరింది. వారు మరే చోట ఉంచబడినా, మరే సాంప్రదాయంలో ఉన్నా, వాళ్ళు అదే విధంగా జీవించి, అక్కడ కూడా అదే విధమైన ఆధ్యాత్మిక జీవనం గడిపి ఉండే వారు. నిజానికి వారిలోని స్వయంశక్తి, వారి ఆంతరంగిక అస్తిత్వంలోని ఒక శక్తి, వారి జీవితాన్ని ఆ విధంగా నడిపిస్తుంది, అంతేకాని వారు అనుసరించే మతం కాదు వారి నడతకు కారణం.

వారి స్వభావంలో ఉన్న ఈ శక్తివల్ల వారు మతానికి బానిసలుగా ఉండరు. వారికి బలమైన, చురుకైన మనసు లేకపోవడం వలన వారు ఏదో ఒక మతాన్నో, విశ్వాసాన్నో, అదే సర్వ సమగ్ర సత్యంగా విశ్వసించి, నిస్సందేహంగా స్వీకరిస్తారు. వారిని వారు సమర్థించుకుంటారు. వారిని కంగారుపెట్టే, సందేహానికి గురిచేసే ప్రశ్నలు ఉదయించవు. నేను అన్ని మతాలలోను ఇలాంటి వ్యక్తుల్ని చూశాను, వారి విశ్వాసాన్ని చెదరగొట్టడం ఓ గొప్ప నేరం. వారికి మతం అవరోధం కాదు. అయితే ఎవరైతే ఇంకా ముందుకి వెళ్ళగలరో వారికి అవరోధంగా మారుతుంది. ఎవరైతే ముందుకు వెళ్ళకపోయినా కొంతదూరం ఆత్మమార్గంలో పయనించగలరో వారికి తప్పక సహాయకారిగా ఉంటుంది.

మతం అత్యంత దుర్మార్గాలకు, అత్యంత గొప్ప విషయాలకు ప్రేరణగా ఉంటూ వచ్చింది. ఆ పేరు మీద అత్యంత భయంకరమైన యుద్ధాలు చేసినా, అత్యంత క్రూరమైన శిక్షలు అమలుపరచినా, మతం అన్నది అత్యంత మహోన్నతమైన ధీరత్వానికి, ఆత్మత్యాగానికి కారణమైంది. తాత్వికతతో పాటు అత్యున్నత కార్యాచరణలో మానవ మనస్సు చేరిన స్థాయికి తార్కాణంగా నిలుస్తుంది. అయితే దాని బాహ్యకర్మకాండలకు, బాహ్యస్థితులకు బానిసలమైనపుడు అది ఒక అడ్డంకిగా, ఒక సంకెలగా ఉంటుంది. అయితే దాని అంతర్గత శక్తిని ఉపయోగించుకోవడం నీకు తెలిసినపుడు — అది నిన్ను ఆత్మసామ్రాజ్యంలోకి పంపే శీఘ్రసాధనంగా ఉపయోగపడుతుంది.

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

మతాలలోని ప్రధానమైన పొరపాటు

అనుభవాలకు ప్రామాణికత సంతరించిపెట్టి, ప్రతివారు దానినే అనివార్యమైన సత్యముగా స్వీకరించవలసిందిగా బలవంతము చేసి, మతాలన్నీ పెద్ద పొరపాటు చేసాయి. ఆయా అనుభవాలు నిజమైనవే, వాటికవి పరిపూర్ణమైనవే, ఒప్పుకోదగినవే. అవి వారి స్వంతమే. దానికి ఒక నిబద్ధత వున్నమాట వాస్తవమే. దానిని అనుభవించినవారి వరకు అపురూపమైనవే. కాని దానినే ఇతరులకు కూడా అన్వయింప చూడడం అనేది ఒక ప్రధానమైన పొరపాటు. అదొక ఛాందసం. ఒక విధ్వంసకరమైన దుష్పరిణామం. అది సర్వదా సత్యదూరం, దూషితం కూడ.

అందుకే మతములన్ని ఎంత సుందరమైనవిగా కన్పించినా అవి మానవులను చాల హీనస్థితికి దిగజార్చినవి. ఏ ఒకరి విషయంలోని వాస్తవాన్ని సామూహికంగా అందరి విషయంలోను నిజం కావాలన్న నిర్బంధం విధించడం అనే చిన్న తప్పిదం వలన, మతం పేరిట అదే, ఎన్నో నేరాలకు, ఘోరాలకు, ఘర్షణలకు కారణమై మానవ చరిత్రలో మాయని మచ్చలను కల్గించినది.

(నిశ్శబ్దం)

అందువలన మార్గమును చూపించాలి. ద్వారాలు తెరచి వుంచాలి, అందరూ ఆ మార్గం ద్వారా ఆ ద్వారాల గుండా పయనించి ఎవరికి వారు వ్యక్తిగత సిద్ధిని పొందాలి.

అందరికి తప్పనిసరిగా అందాల్సిన సహాయం ఆ దైవానుగ్రహమే అందిస్తుంది. అది ప్రతి ఒక్కరికి వారి వారి అవసరానికి అనుగుణంగా వారిలో రూపొందుతుంది.

*

పరమ సత్యాన్ని, విపులంగా, క్షుణ్ణంగా, నిర్దిష్టంగా దాని స్థితి ఇలా ఉంటుంది అని తెలుసుకోగలిగితే, ఇంక నీవు చేయాల్సిందేమి లేదు, విశ్రాంతి తీసుకోవడం తప్ప. "ఇదిగో! ఇదే సత్యం" అని నీవు దానిని స్వీకరిస్తావు. అది నీలో దృఢపడుతుంది. అన్ని మతాలు చేసిన పని అదే. అవి గ్రహించిన సత్యాన్ని ఒక నిబంధనగా స్థిరీకరించారు, తప్పక పాటించవలసిన నియమంగా నిర్ణయించేసారు. కానీ అది సత్యం ఎంతమాత్రం కాదు.

*

నా దృష్టిలో వాటి కసలు ప్రాధాన్యత లేదు. నాకు ఏ మతంపైనా అనురాగం లేదు. అయితే దేనిపట్ల అయిష్టత కూడ లేదు. మతాలనేవి కేవలము మానవ కల్పిత ఆధ్యాత్మిక జీవనరూపాలు. ప్రతి ఒక్కరు ఆ ఏకైక, సత్యం యొక్క ఒక కోణాన్ని మాత్రం ఆవిష్కరించి, ఇతర కోణాలను పట్టించుకోకుండా వదిలేసినందువలన అసలు సత్యం వక్రీకరించబడి ఛిన్నాభిన్నం చేయబడింది. వారు చెప్పింది మాత్రమే సత్యమని చెప్పే అధికారం, హక్కు ఎవరికి లేదు. అలాగే ఇతరులు చెప్పేదానిలోని సత్యాన్ని కాదనే హక్కు కూడ లేదు. అవి అన్నింటిని కలిపి చూపినా పరమ సత్యాన్ని తెలియజేయ డానికి చాలవు. ప్రతిదాని లోను ఒక్కొక్క పార్శ్వమున్నా, అసలు సత్యం మాత్రం అన్నింటికీ అతీతమైనది.

*

ఆధ్యాత్మిక స్ఫూర్తి ఏ మతపరమైన ఆరాధనకు, భక్తికి, అభివ్యక్తికి, ఏకాగ్రతకు వ్యతిరేకం కాదు. కానీ మతాలు చేస్తున్న అవాంఛనీయమైన విషయం మనస్సును ఒకే సూత్రానికి అంటిపెట్టుకునేలా చేసి, అదే ఏకైక సత్యమని భ్రమలో పెట్టడం. సిద్ధాంతాలనేవి ఎప్పుడూ మనోకల్పితమైన సూత్రాలేననీ, సత్యమును అనేక విధాలుగా ప్రకటించవచ్చుననీ అందరు గుర్తుంచుకోవాలి.

అందుకే మతాల పట్ల అవలంభించవలసిన వైఖరి ఎలాగుండాలంటే, ఏ ఆరాధనా పద్ధతులనైనా మనస్ఫూర్తిగా గౌరవించాలి. అన్ని మతాల పట్ల ఒక వివేకవంతమైన తటస్థ వైఖరి నవలంభించాలి. అన్నింటికీ అతీతమైన పరమ సత్యమును ప్రతి మతము తనదైన పద్ధతిలో అంశికంగా ప్రకటిస్తున్నాయని తెలుసుకోవాలి.

శ్రీమాత

అనువాదం: కవితా శ్రీధర్ రెడ్డి

ఆధ్యాత్మిక జీవితానికో నిబంధన

మనం మన లోలోతులకు కొద్దిగా వెళ్ళగలిగితే అచ్చట స్థిరపడి పలురకాలుగా అభివ్యక్తమవుతున్న చేతనను కాంచగలం. మనలో ప్రతి ఒక్కరం పెక్కు దేశాలలో వివిధ జాతీయతలతో ఎన్నో మతాలను అనుసరిస్తూ జన్మిస్తున్నాము. అయితే చివరిదాన్ని మాత్రమే ఉత్తమమైనదిగా మనం ఎందుకు సమ్మతించాలి? ఈ విభిన్న దేశాలలో, వివిధ మతాల ద్వారా మనం పొందిన అనుభవాలన్నీ మన చేతనలో పరంపరాగతంగా నిలిచి జన్మానుబంధాలుగా మనల్ని అంటిపెట్టుకొని వుంటాయి. ఈ గత అనుభవాల నుండి అనేకములైన వ్యక్తిత్వాలు రూపుదిద్దుకుంటాయి. మనలోని ఈ వ్యక్తిత్వ బాహుళ్యాన్ని గ్రహించినపుడు, ఒక రకమైన సత్యాన్ని అదే ఏకైక సత్యమని, ఫలానా దేశం మాత్రమే నాదని, ఫలానా మతమే నిజమైన మతమని చెప్పటం మనకు అసాధ్యమౌతుంది. కొందరి చేతనలోని కారణాంశాలు ఒక దేశానికి చెందినవైనప్పటికీ, వారు వేరొక దేశంలో జన్మనెత్తిన సందర్భాలు ఉన్నాయి. వాస్తవానికి భారతీయులైనవారు యూరపులో పుట్టిన కొంతమందిని నేను కలిశాను.

నీ లక్ష్యం స్వతంత్రంగా నుండాలని, జీవాత్మకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను అందించాలని, దివ్యస్వతంత్రతలో స్వేచ్ఛను పొందాలంటే అంతఃచేతన యొక్క అలవాట్లనుండి ఉద్భవించినవి, నీ అంతరాత్మ యొక్క సత్యానికి చెందనివి అగు అన్ని బంధనాలను వదిలివేయాలి. నిన్ను నీవు సంపూర్ణంగా దైవానికి మాత్రమే సమర్పితం కావాలనుకుంటే దానిని నీవు పరిపూర్ణంగా చేయగలగాలి. అంతేకాని నీలో కొంతభాగం ఒక చోట, ఇంకొంత భాగం మరొక చోట బంధించపడ కూడదు.

నీ మూలాల నుండి పూర్తిగా విడిపోవడం అంత సులభం కాదని నీవు ఆక్షేపించవచ్చు. అయితే గతంలోని కొన్ని సంవత్సరాల తరబడి నీలో జరుగుచున్న మార్పులను వెనక్కు తిరిగి ఎప్పుడూ నీవు గమనించలేదా? అలా చేసినపుడు కొన్ని పరిస్థితులలో ఆ విధమైన ఆలోచన నీకెందుకు కలిగింది, ఆ విధంగా నీవెందుకు చేశావు అని నిన్ను నీవు ప్రశ్నించుకుంటావు. పదేళ్ళ క్రిందటి మనిషని నీవేనా అని అనుకుంటావు. ఆలాంటప్పుడు అప్పటి స్థితికిగానిలేక ప్రస్తుత స్థితికిగాని, భవిష్యత్తులో ఏ స్థితి ఉంటుందో, ఏది ఉండదో, అట్టిదానితోగాని ముందస్తుగా ఎలా కట్టుబడతావు?

అంతర్గత స్వతంత్రతలోని అవకాశంపై నీ సంబంధాలన్నీ సరికొత్తగా రూపు దిద్దుకోవాలి. నీవు జీవించిన లేదా పెరిగిన సంప్రదాయాలు పరిసర ప్రభావంతోగాని, లేదా మామూలుగా గాని, లేదా ఇతరుల ఇష్టప్రకారంగాని ప్రభావితమైనాయి. తప్పని పరిస్థితులలో నీవు వాటికి సమ్మతించవలసి వచ్చింది. అలా మానవులను మతమనేది ప్రభావితం చేసింది. అది తరచుగా మతపరమైన లేదా ఆధ్యాత్మికమైన లేదా ఇతర భయాందోళనల వలన జరుగుతుంది. అయితే దైవంతో నీ సంబంధంపై అలాంటి ఒత్తిడి వుండదు. అది స్వేచ్ఛగా, నీ మనో ఉల్లాసంపై, నీ హృదయానందంపై ఆధారపడి సాగుతుంది. "వేరొక విధంగా చేయలేను, నేను నిర్బంధించబడ్డాను" అంటూ భయంతో చేయడం ఏపాటిది? సత్యమనేది స్వయంప్రకటితం కావాలేగాని ప్రపంచంపై బలవంతంగా విధించబడకూడదు.

నీవు యోగమార్గంలో పయనించాలంటే నీ మానసిక మరియు ప్రాణిక నిర్మాణాలన్నీ తునాతునకలు గావించబడడానికి నీవు సిద్ధపడి వుండాలి. నీ విశ్వాసం తప్ప మరే ఆధారంలేక గాలిలో తేలడానికి సిద్ధపడాలి. నీ గతాన్ని, దాని సంబంధాలను పూర్తిగా మరిచిపోవాలి. వాటి ప్రభావాలను సైతం నీ చేతన నుండి పెకిలించివేసి ప్రతిబంధనాల నుండి విముక్తుడవై కొత్త జన్మనెత్తాలి. గతంలో నీ వేమిటో యోచింపకు. నీవు ఏమి కావాలని ఆకాంక్షిస్తున్నావో దాని కోసం నిష్కల్మషంగా అభిలషించు — నీ వీగిపోయిన గతాన్నుండి మరలి భవిష్యత్తు వైపుగా సూటిగా దృష్టి నిలుపు. నీ మతం, నీ దేశం, నీ కుటుంబం అక్కడ వుంది. అదే దైవం.

శ్రీమాత

అనువాదం: భాషా

యోగస్వభావం

ప్రశ్న: యోగసాధన గురించి మాకు కొంచెం వివరిస్తారా?

శ్రీమాత: మీరు యోగసాధన ఎందుకు కోరుతున్నారు? అధికారం పొందడానికా? మనశ్శాంతి, నెమ్మది గుణం కావాలనా? మానవసేవ కోసమా?

వీటిలో ఏదీ మీరీ మార్గం ఎన్నుకోడానికి సరిపోదు.

మీరు జవాబు చెప్పవలసిన అసలు ప్రశ్న ఇది: మీరు భగవంతుడి కోసం యోగసాధన కావాలనుకుంటున్నారా? మీ జీవితంలో అతిముఖ్యమైన అంశం సర్వేశ్వరుడైన భగవంతుడేనా? అది లేనట్టయితే ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితి కలుగుతుందా? మీ అస్తిత్వానికి కారణం భగవంతుడే అని భావిస్తున్నారా? భగవంతుడు వినా మీ ఉనికికి అర్థమే లేదనుకుంటున్నారా? అదే అయితే, అప్పుడు మాత్రమే మీరా మార్గానికి ఆహ్వానితులని చెప్పడం కుదురుతుంది.

మొదట అవసరమైన విషయం ఇది. భగవంతుడి కోసం తీవ్రమైన ఆకాంక్ష.

మీరు ఆచరించవలసిన తరువాతి విషయం ఆ ఆకాంక్షను జాగ్రత్తగా కాపాడుకొనుట, దానిని భద్రంగా, సజీవంగా నుంచుట. అందుకు కావలసినది ఏకాగ్రత. దైవసంకల్పానికి, దైవకార్యానికి సమగ్రమైన, నిశ్చయమైన సమర్పణా భావంతో ఆతనిపై ఏకాగ్రత అవసరం.

హృదయంలో ఏకాగ్రత వహించి, దానిలో ప్రవేశించండి. ఆంతర్యపు లోతులలో సుదూరంగా ఎంతవరకు వెళ్ళగలరో అంతవరకూ వెళ్ళండి. సుదూర తీరాలకు వ్యాపించిన మీ చైతన్య సూత్రాలన్నిటిని ఏరి కలిపి చుట్టగాచుట్టి ఒక్క మునక వేసి అడుగువరకూ పొండి.

అక్కడ ఒక అగ్ని రగులుతూ వుంటుంది, హృదయాంతరాళపు లోతుల్లోని నిశ్చల నీరవతలో జ్వలిస్తూ వుంటుంది. అదే మీలో వున్న దివ్యత్వం, మీ వాస్తవిక జీవి. దాని వాణిని ఆలకించు. దాని ఆదేశాన్ని అనుసరించు.

ఇంకా మరికొన్ని ధ్యానకేంద్రాలున్నాయి. ఉదాహరణకి, శిరోపరిభాగంపై ఒకటి, కనుబొమల మధ్య (భ్రుకుటి) ఇంకొకటి వున్నాయి. దేని సార్థకత దానికి ఉంటుంది. దానికి తగిన ఫలితం ఇస్తుంది. కాని ప్రధాన జీవి హృదయంలోనే వుంటుంది. హృదయంలో నించే ముఖ్య కదలికలన్నీ మొదలవుతాయి — మొత్తం

చురుకుదనం, రూపాంతరం చెందాలనే తపన, ఆత్మని గుర్తించగలిగే శక్తి, హృదయం లోనే ఉంటుంది.

*

ప్రశ్న: యోగసాధనకి సిద్ధమవడానికి, ఏం చేయ్యాలి?

శ్రీమాత: అన్నిటి కంటె ముందు మనిషి చైతన్యవంతుడు కావాలి. మన అస్తిత్వంలోని అతి స్వల్పభాగం గురించి మాత్రమే మనకు ఎరుక వుంది. మనలో ఎక్కువ భాగం గురించి మనకు తెలియదు. ఈ అజ్ఞానమే ఆధ్యాత్మిక పునరుద్దీపనకు విముఖమైన స్వభావానికి కట్టివేసి, మార్పుని దానిలో కలిగే రూపాంతరాన్ని నిరోధిస్తుంది. ఈ అజ్ఞానం ద్వారానే దైవ వ్యతిరేక శక్తులు మనలో ప్రవేశిస్తాయి. మనల్ని వాటికి బానిసలుగా మార్చేస్తాయి. మీ గురించి మీరెప్పుడూ చైతన్యవంతులై వుండాలి. మీ స్వభావాన్ని, కదలికల్ని గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి. మీరు ఏ పనైనా ఎందుకు చేస్తున్నారో, ఎలా చేస్తున్నారో, ఎలా అనుభూతి చెందుతున్నారో, ఎలా ఆలోచిస్తున్నారో ఎరుక వుండాలి. మీలో దాగివున్న, పైకి కనపడే ఉద్దేశాలు, ప్రేరణలు, స్పందనలు మీకు అర్థం కావాలి.

నిజానికి మీ అస్తిత్వపు భాగాలను ముక్కలు ముక్కలుగా విడతీసి చూడాలి. వాటి గురించి తెలుసుకోవాలి. ఒక్కసారి మీరు చైతన్యవంతులయితే, మీరు విషయాల్ని గుర్తించి సమన్వయం సాధించగలరని అర్థం. ఏ శక్తులు మిమ్మల్ని పతనానికి లాగుతున్నాయో, ఏ శక్తులు మీ ఉన్నతికి సహకరిస్తున్నాయో తెలుసుకోగలరు. మీరెప్పుడైతే ఏది ఒప్పో ఏది తప్పో, ఏది సత్యమో ఏదసత్యమో, ఏది దివ్యత్వమో ఏది దివ్యత్వానికి వ్యతిరేకమో తెసులుకోగలిగినప్పుడు, కచ్చితంగా ఆ జ్ఞానానికి అనుగుణంగా ఆచరించాలి. చెప్పాలంటే, తృణీకరించవలసినదానిని తృణీకరించి, స్వీకరించవలసినదానిని స్వీకరించాలి. ప్రతి అడుగులోను ద్వంద్వ ప్రకృతి ప్రత్యక్షమవుతుంటుంది. అందుచేత ప్రతి అడుగులోను మీకు కావలసినది మీరెన్నుకోవలసి వుంటుంది. మీరు సహనంతో వుండాలి. అత్యంత స్థిరంగా, అప్రమత్తంగా వుండాలి. అంటే రెప్ప వెయ్యకుండా అతి జాగ్రత్తగా వుండాలి. దైవవ్యతిరేక శక్తులకి ఎట్టి పరి

స్థితుల్లోను ఏమాత్రం అవకాశం యివ్వకుండా నిరంతరం వాటిని తృణీకరించాలి.

శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

(CWM 3:12)

స్వేచ్ఛ, విధివాదం — యోగలక్ష్యం

ప్రశ్న: అప్పుడిక నిజమైన స్వేచ్ఛ వుండదా? ప్రతిదీ పూర్తిగా ముందే నిర్ణయించబడిందేనా, ఆఖరికి నీకున్న స్వేచ్ఛ కూడా? విధి అన్నది అన్నింటికన్నా రహస్యమైనదా?

స: స్వేచ్ఛ, విధివాదం, విముక్తి, నియతివాదం అనేవి చేతనయొక్క వేర్వేరు స్థాయిలకు చెందిన సత్యాలు. అజ్ఞానం ద్వారా మనస్సు ఆ రెండింటినీ ఒకే స్థాయికి చేర్చి ఒకదానిపై మరొకదానిని రేపుతుంది. చైతన్యము ఒకే ఒక ఏకమైన సహజస్థితి కాదు. అది సంక్లిష్టమైనది, సమతలమైనది కాదు. బహుముఖ విస్తారమైనది. చైతన్యానికి అత్యున్నత శిఖరాగ్ర స్థితి పరమాత్మది. అధోముఖ అగాధపు లోతుల్లో వున్న సిద్ధి పదార్థానిది. ఈ అగాధపు లోతులకు, ఆ సర్వోన్నతానికి మధ్య అనంతమైన శ్రేణులతో కూడిన చేతనా స్తరాలున్నాయి.

ఈ పదార్థస్థాయిలోని సాధారణ చేతనాస్థాయికి నీవు ఆపాదమస్తకం కట్టుబడిపోయి వున్నావు. ప్రకృతిలోని యాంత్రికస్థితికి నీవొక బానిసవు. కర్మసంకెళ్ళకు బంధించబడిన వాడివి. ఈ వరుసలో జరిగేది ఏదైనా అది నిక్కచ్చిగా ఇంతకు ముందు జరిగినదాని పర్యవసానమే. నీ స్వతంత్ర వర్తనమన్నది భ్రమ, కానీ నిజానికి తక్కినవారంతా ఏమి చేస్తున్నారో నీవూ దానినే పునరావృతం చేస్తున్నావు. ప్రకృతిలోని కదలికలను అనుకరిస్తున్నావు. నలగకొడుతూ సాగిపోతున్న ఆమె యొక్క విశ్వయంత్ర చక్రానికి అంటుకుపోయి నిస్సహాయంగా గిరగిరా తిరుగుతున్నావు.

కానీ అది అలా వుండనక్కర లేదు. కావాలంటే ఈ నీ స్థానాన్ని మార్చుకోవచ్చు. అడుగున పడిపోయి యంత్రం క్రింద నలిగిపోతూ నీవొక కీలుబొమ్మలాగా వుండడానికి బదులు ఉవ్వెత్తున లేచి, అంతటినీ పైనుండి అవలోకిస్తూ నీ చేతనను మార్పుచేసు

కోవడం ద్వారా అసంభవంలా కనిపించే పరిస్థితులనూ, పాతుకుపోయిన స్థితిగతులనూ, పరివర్తనం చేయగల పట్టును సాధించగల్గుతావు. ఒక్కసారి నీ అంతట నీవు సుడి గుండంలో నుండి పైకి లేచి ఎత్తులో నిలబడగలిగినప్పుడు నీవు స్వతంత్రుడువు. అన్ని బలవంతపు చర్యల నుండీ నీవిక విముక్తుడవు. నీవు కేవలం ఒక జడమైన ఉప కరణంగా వుండకపోవడమే కాదు, ఒక ఔత్సాహికమైన సక్రియమైన ప్రతినిధివి కాగలవు. నీ కర్మ పర్యవసానాలకు బందీగా వుండటమే కాదు, అసలు ఫలితాలను కూడా మార్పు చెందించగలవు. ఒక్కసారి గనుక ఈ శక్తుల ఆటను చూడగల్గితే, ఒక్కసారిగా ఈ శక్తుల మూలస్థానాలు ఎక్కడ వరకూ వున్నాయో ఆ చేతనాస్థాయి వరకూ ఎదగగలిగి ఈ సశక్తమైన మూలవనరులతో ఒక్కటవ్వగలిగితే ఇక ఏది నడుపబడుతుందో దానికి కాక, ఏది నడిపిస్తుందే దానికి చెందినవాడివవుతావు.

కర్మచక్రంలో నుండి వెలువడి దివ్యకార్యోన్ముఖుడగుటయే యోగం యొక్క నిర్దిష్ట లక్ష్యం

యోగం ద్వారా ఒక అజ్ఞానియగు బానిసగా నిస్సహాయుడవై దౌర్భాగ్య ఉపకరణంగా ఉండడాన్ని వదిలి వేయగలుగుతావు. అలా ఇంకొక చేతనా స్తరంలో సచేతనమైన భాగస్వామిగా సక్రియమైన ఇంకొక ప్రతినిధిగా ఉన్నత విధివిధానంలోకి ఎదిగి పని చేస్తావు. ఈ విధమైన చేతనకు సంబంధించిన ఉద్యమం రెండంచెల మార్గాన్ని అనుసరిస్తుంది. మొట్టమొదటిది పైకి ఆరోహించడం. నీకు నీవుగా ఈ పదార్థస్థాయి చైతన్యం నుండీ ఉన్నతోన్నత స్థాయిల్లోకి యెదుగుతావు. అయితే ఈ రకమైన నిమ్నస్థాయికి చెందిన ఆరోహణలో ఉన్నతాన్ని ఈ నిమ్నంలోనికి దిగిరమ్మనే పిలుపు వుంటుంది. నీ వెప్పుడైతే ఈ భూమి నుండి ఊర్ధ్వంగా పోగలిగావో, ఆ ఊర్ధ్వానికి చెందిన ఏదో ఒక ప్రకాశాన్ని, ఒక శక్తిని క్రిందికి తీసుకొనివస్తావు. ఆ ప్రకాశంగానీ, శక్తిగానీ ఈ పృథ్వికి చెందిన పాత స్వభావాన్ని మార్పుచేయవచ్చు లేదా అలా చేయడానికి ప్రయత్నించవచ్చు. అప్పుడే వేర్వేరుగా విడిపోయి విభిన్నమై వున్న నీలోని ఉన్నతమైన, నిమ్నమైన నీ చేతనకు చెందిన అంతర బాహ్యస్తరాలు, కలిసి మెల్లగా ఒకదానితో ఒకటి మేళవించి క్రమేణా ఒకే సత్యంలోకి, ఒకే సమరసంలో కరిగిపోతాయి.

ఇదిగో ఈ విధంగా మనం అద్భుతాలుగా పిలుచుకొనేవి జరుగుతూ వుంటాయి.

ఈ ప్రపంచం చేతనకు చెందిన అసంఖ్య స్థాయిల్లో నిర్మింపబడింది. ప్రతి స్థాయీ దానికంటూ ఒక ప్రత్యేక సూత్రాన్ని నియమాన్ని కలిగి వుంది. ఒక స్తరానికి చెందిన నియమనిబంధనలు మరొక స్తరానికి సరిపడవు. ఒక అద్భుతం ఒక ఆకస్మిక అవరోహణం తప్ప మరొకటి కాదు. అది మరో చైతన్యం తన శక్తులతో (తరచుగా అవి ప్రాణిక స్తరానికి చెందిన శక్తులు) ఉన్నట్లుండి ఈ పదార్థస్థాయిలోకి విస్ఫోటనం చెందినట్లుగా వుంటుంది.

శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

పడవలో ప్రయాణిస్తున్న ఇద్దరు మతాచార్యుల కథ

ప్రశ్న: మధురమాతా, ఈ రోజుల్లో ప్రపంచంలో అనేకమంది జనులు ఏదో ఒక మతాన్ని అనుసరిస్తున్నారు. వారికేమైనా ఉపయోగమందుతున్నదా?

స: ఎక్కువగా కాదు. కాని గతించినదాన్ని మళ్లీ మొదలుపెడుతున్నట్టున్నారు. చాలాకాలం వరకు ఈ శతాబ్ది ఆరంభంలో ఈ మతాలు జ్ఞానానికి వ్యతిరేకమని మేధావులచే నిరాకరించబడ్డాయి. కాని ఇటీవలి కాలంలో అభ్యుదయాత్మకమైన ఉద్యమమొకటి మొదలైంది.

పరుల దృష్టిలో చెడ్డవారిగా ముద్రపడకుండుటకు ప్రజలు సాంఘికమైన అలవాటుగా మతాన్ని అనుసరిస్తున్నారు. మచ్చుకి, గ్రామాలలో జరిగే మత సాంప్రదాయ కర్మలకు హాజరుకాని యెడల ఇరుగుపొరుగువారు ఆక్షేపిస్తారు. కాని వీటికి ఆధ్యాత్మిక జీవితంతో ఏమాత్రం సంబంధం లేదు.

(నిశ్శబ్దం)

నేను మొట్టమొదటిసారిగా భారతదేశానికి జపాన్ నౌకలో వచ్చినపుడు, మాతో పాటు ఇద్దరు మతాచార్యులు కూడా ఉన్నారు. వారు క్రైస్తవమతానికి చెందిన రెండు వేర్వేరు శాఖలకు చెందినవారు. ఏ శాఖకు చెందినవారో నాకు అంతగా గుర్తు లేదు. కాని వారు మాత్రం ఆంగ్లేయులు. అందులో ఒకరు ఇంగ్లండ్ చర్చి అనుయాయిలు, వేరొకరు మరొక చర్చి సభ్యులు.

మా ప్రయాణ సమయంలో ఒక ఆదివారం వచ్చింది. ఆ రోజున నౌకలో మత పరమైన కర్మ జరపాలి. లేనట్లయితే జపానువారి లాగా మేము కూడా అనాగరికులుగా కనుపించేవారం. ఈ మతకర్మలను ఎవరు నిర్వహించాలనే విషయంలో వాదోపవాదాలు జరిగి వారిద్దరిలో ఒకరు హుందాగా ప్రక్కకు తప్పుకున్న అనంతరం మరొక సభ్యుడు ఆ తంతును జరిపాడు.

ఈ కార్యక్రమాన్ని నౌక వసారాలో జరిపారు. ఆ వసారా చేరడానికి, కొన్ని మెట్లు క్రిందికి దిగాల్సి వచ్చింది. ఆ రోజు ఎండ చాలా వేడిమిగా ఉంది. మేమపుడు ఎర్రసముద్రంలో ప్రయాణిస్తున్నామనుకుంటాను. కార్యక్రమానికి పురుషులందరూ చేతులులేని కోటులాంటి జాకెట్లను ధరించారు. దీనికి గట్టి కాలర్ పట్టీలతో టై కట్టు కుని, కాళ్ళకు బూట్లు వేసుకుని తలపై టోపీలు ధరించి చంకలో పుస్తకాలతో నౌక పై అంతస్తు నుండి వసారా వరకు అందరూ కలసి ఒక ఊరేగింపుగా సాగారు. స్త్రీలు తలపై టోపీలు ధరించి, మరికొందరు గొడుగులతో, చేతిలో ప్రార్థనాగీతాల పుస్తకాలతో ఉన్నారు.

వారందరు వసారాలో గుమిగూడిన తర్వాత ఒక చర్చి సభ్యుడు వారి నుద్దేశించి మతపరమైన ప్రవచనం చేసాడు. ప్రతి ఒక్కరూ దానిని చాలా భక్తితో విన్నారు. ఈ తంతు పూర్తైన వెంటనే అందరూ తమ కర్తవ్యాన్ని శ్రద్ధగా నిర్వర్తించామన్న తృప్తితో నౌక పై అంతస్తును చేరారు. అయిదు నిముషముల అనంతరం చాలా మామూలుగా మధుశాలలో మద్యాన్ని సేవిస్తూ, పేకాటాడుతూ తాము నిర్వర్తించిన మతకార్యక్రమాలను మర్చిపోయారు. పని అయిందనిపించారు. అంతే. దీనిని గురించి ఇంకా వివరించవలసినది ఏమీ లేదు.

కొంత సమయం గడిచిన తర్వాత ఆ చర్చి సభ్యుడు నా వద్దకు వచ్చి ప్రవచ నానికి ఎందుకు రాలేదని మర్యాదగా అడిగాడు. నేనన్నాను "అయ్యా, నన్ను మన్నించాలి. మతం మీద నాకు నమ్మకం లేదు" అని.

"ఓహో, మీరు భౌతికవాదులా"?

"కాదు, ఏమాత్రం కాదు".

"అట్లైన ఎందుకు రాలేదు"?

"ఓహ్, మీరు నా జవాబు వింటే నొచ్చుకుంటారు. అందువలన నేను ఏమీ మాట్లాడకుంటే మంచిది".

కాని, అతను నేను జవాబు ఇచ్చేంతవరకు కదలలేదు. చివరకు నేనన్నాను "ఒక సామాజిక విధిని, ఒక సామాజిక ఆచారాన్ని పాటించడానికి మీరంతా సమా వేశమయ్యారు. కాని భగవంతునితో సన్నిహిత సంబంధం ఏర్పరుచుకోవాలని ఆశించి కాదు. మీలోగాని, అక్కడ గుమిగూడిన వారిలోగాని చిత్తశుద్ధి లేదు" అని.

"భగవంతునితో సన్నిహిత సంబంధం ఏర్పరుచుకోవడమా? అది మా వలన అయ్యే పని కాదు. మాకంత శక్తి లేదు. కొన్ని మంచిమాటలు చెప్పుకోగలం. అంతే".

"అదే నాకు ఆసక్తి కలిగించనిది. అందుకే నేను రాలేదు" అన్నాను.

అనంతరం అతను నన్ను అనేక విధాలుగా ప్రశ్నించి, నాస్తికులైన చైనీయులను మార్చుటకు తాను చైనాకు వెళ్తున్నానని చెప్పాడు. నేను గంభీరంగా అన్నాను "వినండి, మీ మతం పుట్టి రెండువేల సంవత్సరాలు కూడా కాలేదు. అంతకు పూర్వమే చైనీయులకు చాలా గొప్ప తత్వజ్ఞానం, భగవంతుణ్ణి చేరే మార్గం తెలుసు. వారు పాశ్చాత్యులను సంస్కారహీనులుగా తలుస్తారు. మీకంటే మతం గురించి ఎక్కువ తెలిసినవారి దగ్గరకెళ్ళి వారికి మతాన్ని గురించి బోధించడానికి, వారిని మార్చడానికి చూస్తారా? సామాన్య జీవితం నుంచి వైదొలగి ఆధ్యాత్మిక చైతన్యం దిశగా సాగే అపార తత్వజ్ఞానాన్ని బోధించుటకు బదులుగా చిత్తశుద్ధిలేని నిరర్థకమైన కర్మలను బోధిస్తారా? మీరు చేసే పని ఉచితమైనదని నేను భావించుట లేదు" అని అన్నాను.

నా మాటలతో అతను ఉక్కిరిబిక్కిరై చివరకు "నీ మాటలు నన్ను ఒప్పించలేవు" అన్నాడు.

"ఓహ్! నిన్ను నమ్మించడానికి నేను ప్రయత్నించడం లేదు. ఉన్న పరిస్థితిని మీకు వివరించాను. మీ కంటె ముందుగా తత్వజ్ఞానాన్ని ఎరిగిన నాగరిక ప్రజల చెంతకు క్రూరులు, సంస్కారహీనులు ఎందుకు వెళ్ళి తత్వజ్ఞానాన్ని బోధించాలో నాకు అర్థం కావడం లేదు. అంతే" అని అన్నాను. అంతే.

అంతటితో ఆ సంభాషణ ఆగిపోయింది.

(CWM 8:147-49)

*

మతబోధనను ఆధ్యాత్మిక బోధన అనుకుని మీరు పొరపడకూడదు.

మతబోధన గతకాలానికి చెందినది. అది అభివృద్ధి నిరోధకం.

ఆధ్యాత్మిక బోధన భవిష్యత్తుకు చెందినది. అది చైతన్యాన్ని ప్రకాశింపజేసి, భవిష్యత్ దర్శనానికి నిన్ను సిద్ధపరుస్తుంది

ఆధ్యాత్మిక బోధన మతాల కన్నా ఉన్నతమైనది. అది విశ్వగత సత్యాన్వేషణకు ప్రయత్నిస్తుంది.

మనకు భగవంతునితో ప్రత్యక్ష సంబంధాన్ని నెలకొల్పుటను బోధిస్తుంది.

శ్రీమాత

అనువాదం: సిద్దులగారి త్రివేణి

మతసంబంధిత స్మారకనిర్మాణాలలో వాతావరణం

మతసంబంధమైన అన్ని స్మారక నిర్మాణాలలో, అత్యంత ఉన్నతమైన మతానికి చెందినవిగా భావించిన వాటిలో — అది జపాన్‌లోనైనా, ఫ్రాన్స్‌లోనైనా — అన్ని ఒక్కలా ఉండవు. అవి గుళ్ళు కావచ్చు, చర్చిలు కావచ్చు, ఒకే దేవతామూర్తులు కావచ్చు. చిన్న తేడాలున్నా, నా అనుభవం మాత్రం అన్ని చోట్లా ఒకేలా ఉంది. ఆ చర్చిలో ప్రతిష్టమైన శక్తి అక్కడ ఉన్న భక్తుల విశ్వాసం మీద ఆధారపడి వుంటుంది. అయితే అక్కడ నిజంగా ఉన్న శక్తికి, వారు అనుభూతి చెందిన శక్తికి తేడా ఉంటుంది. నేను ఫ్రాన్స్‌లోని ఒక అత్యంత సుందరమైన ప్రధాన చర్చికి వెళ్ళాను. కళాత్మకంగా చూస్తే అది మనం ఊహల్లో చూసే అత్యద్భుతమైన ఆకృతి. అక్కడ అత్యంత పవిత్రమైన స్థానంలో నేను అతి పెద్దగానున్న శక్తివంతమైన నల్లని సాలెపురుగును చూశాను. దాని గూడు ఆ ప్రదేశమంతా ఆవరించి ఉంది. అది అక్కడి ప్రజల భక్తినించి, వారి ప్రార్థనల నించి వచ్చే శక్తిప్రకంపనాలను తనలోకి లాక్కుంటోంది. అది ఏమాత్రం సంతోషకరమైన దృశ్యం కాదు. అక్కడ ప్రార్థిస్తున్న మనుషులు ఓ దివ్యస్పర్శను పొందుతూ, అన్ని రకాల వరాలను వారి ప్రార్థనల వలన అందుకుంటున్నారు. అయినా అక్కడ వున్నది ఈ సాలెపురుగే. అయితే వారిలోని

విశ్వాసం మాత్రం ఆ దుష్టకీటకాన్ని వారిలోనున్న మంచిగా మార్చింది. వారి విశ్వాసం సడలకుండా వుంది. నిజానికి నేను వెళ్ళి "మీరు దైవానికి ప్రార్థన చేస్తున్నారని అనుకుంటున్నారా? అది ఒక పెద్ద సాలెపురుగు ప్రాణశక్తి, అది మీ ప్రార్థనల శక్తులను భక్షిస్తున్నది" అని చెప్పటం ఉచితమైన విషయం కాదు. చాలా సార్లు అ విధంగానే ఉంటుంది. అన్ని చోట్ల కూడా ప్రాణశక్తి రూపాలు వున్నాయి. అవి మానవ ఉద్వేగాల ప్రకంపనాల చేత పోషించబడతాయి, వాటికి అవే ఆహారం. అయితే బహు కొద్దిమంది మాత్రం, పెద్దగా లెక్కలోకి రాని స్వల్పసంఖ్య మాత్రం, వారు చర్చికి వెళ్ళినా, గుడికి వెళ్ళినా ఒక నిజమైన ధార్మికభావంతో వెళ్తారు. అంటే వారు ప్రార్థన చేసి వారు కోరిన విమ్మని ప్రాధేయపడటానికి కాదు, వారిని వారు ఏమీ దాచుకోకుండా సమర్పణ చేసుకుందుకు, ధన్యవాదాలు చెప్పడానికి, ఆకాంక్షించడానికి, అర్పణ చేసుకుందుకు వెళ్తారు. అలాంటివారు మిలియన్లలో ఒక్కరు ఉండడం కూడా అరుదుగా సంభవిస్తుంది. అందువల్ల అరుదుగా ఉండే అలాంటివారు ఆ వాతావరణాన్ని మార్చగల శక్తిమంతులు కారు. అయితే వారి సత్యసంధతవల్ల, వారా ప్రదేశాల్లో ఉన్నప్పుడు, వారా పరిమితులను అధిగమించి మరో స్థితికి చేరి, ఓ దివ్యత్వాన్ని స్పర్శిస్తారు. అయితే అధిక జనం ఎవరైతే మూఢనమ్మకాలతో, అహంకారంతో, స్వార్థప్రయోజనం కోసం వెళ్తారో వారు ఆ రకమైన వాతావరణాన్ని తయారుచేస్తారు. నువ్వు గుడికి వెళ్ళినా, చర్చికి వెళ్ళినా అదే వాతావరణాన్ని ఆశ్వాసిస్తావు. అక్కడికి చాలా మంచిభావంతో వెళ్ళినపుడు మాత్రమే నీవు, "ఒహో! ధ్యానానికి ఇది ఎంత ప్రశాంతమైన ప్రదేశం!" అనుకోగలవు.

నాకూ బాధగా ఉంది. కాని జరుగుతున్నది ఇదే. నేను కావాలని ఈ ప్రయోగం కొంతవరకు అన్ని చోట్ల చేశాను. ఎక్కడో అరుదుగా, చిన్నగ్రామాల్లో ఉన్న చర్చిలోనో, మరో చిన్న ప్రదేశంలోనో ధ్యానానికి అనుకూలమైన ఓ చిన్న స్థలం కనిపించేది. అక్కడ నిశ్చలంగా, చాలా నిశ్శబ్దంగా ఉండేది. అదే కొంత ఆకాంక్ష ఉన్న ప్రదేశం. అయితే అది చాలా అరుదైన విషయం. నేను ఇటలీలో ఎంతో సౌందర్యంతో అలరారే చర్చిలు, చాలా అత్యద్భుతమైన ప్రదేశాలు చూశాను, కాని అవన్నీ పూర్తిగా ప్రాణికశక్తులతో నిండి ఉండేవి, భయభ్రాంతుల్ని చేస్తూ. నేను వెనిస్‌లోని బాసిలికాలో ఓ చిత్రం వేయడం గుర్తుంది. నేను నా పని చేస్తున్నప్పుడు, ఓ మతగురువు ఒక స్త్రీ తాను చేసిన పాపాన్ని చెప్పడం వింటూ

ఉంటాడు. అది నిజానికి ఓ భయంకరమైన దృశ్యం. ఆ మతగురువు ఎలా ఉంటాడో నేను చూడలేదు, అతడు ఎలాంటివాడో తెలీదు, అతడు కనిపించలేదు — నీవు ఎప్పుడైనా చూశావో, లేదో వాళ్ళు కనిపించరు. వారు ఓ మందసంలాంటి దానిలో ఉండి ఓ చిన్న కటకటాల రంధ్రం ద్వారా ఆ పాపాన్ని చెప్పడం వింటారు. అతడి పై ఓ విషణ్ణమైన శక్తి ఆవహించి ఉన్నందున, ఆ దయనీయమైన స్త్రీ భీతిల్లి ఉంటుంది. అది నిజానికి చాలా బాధాకరమైన దృశ్యం. అయితే ఈ ప్రజలందరు అది పవిత్రమైన చర్యగా విశ్వసిస్తారు. కాని అది దుష్టప్రాణశక్తుల యొక్క సాలెగూడు, అది వీటన్నింటిని తమ పోషణకు ఉపయోగించుకుంటుంది.

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

(CWM 6:194-95)

స్వర్గం, నరకం, మతాల సృష్టి

ప్రశ్న: చనిపోయిన తరువాత జనులు ప్రాణిక ప్రపంచంలోకి వెడతారు, కాని మంచి చేసినవారు స్వర్గానికి వెడతారా?

స: నీవనే స్వర్గం ఎక్కడుంది! నీకా విషయం ఎవరు చెప్పారు? వారు నీకు స్వర్గం, నరకం, పాపవిమోచన స్థానాల గురించి చెప్పారా?... లేదా? అన్నీ చెప్పలేదా? స్వర్గం గురించిన విషయాలు ఎక్కడి నుంచి సంపాదించావు? ఏ పుస్తకం నుంచి?...

అది సర్వసాధారణంగా మతపెద్దలు విశ్వాసపాత్రులైన ప్రజలకు మంచిచేయటం కోసం వారిని ఉత్సాహపరచటానికి చెప్పేమాట. ఎందువల్లనంటే ప్రజాబాహుళ్యంలో బాగా తెలిసిన విషయం దుష్టులకంటె మంచివాళ్ళకి జీవితం అంత సుఖమయం కాదనేది; సాధారణంగా జరిగే విషయం దానికి వ్యతిరేకం: దుష్టులు మంచివారికంటె ఎక్కువ సఫలీకృతులౌతారు! కనుక అంతగా ఆధ్యాత్మికులు కానివారు తమకు తాము ఈ విధంగా చెప్పుకుంటారు: "నేను మంచితనంతో ఉండాలనుకుంటూ కష్టపడటం ఎందుకు? దుష్టుడిగా ఉండటమే మంచిది, జీవితం సాఫీగా సాగిపోతుంది". మంచితనంతో ఉండటం బహువిధాలుగా ఉంటుందనీ, ఒక్కొక్కప్పుడు మంచి

చేయడానికి ప్రయత్నించడం కూడా లాభదాయకమనీ వారికి తెలియజెప్పడం చాలా కష్టమైన పని. అందువలన చాలా తక్కువ మేధస్సు కలిగినవారికి తేలికగా అర్థం కావడానికి ఈ విధంగా చెప్పబడింది:

"చూడండి, ఇది చాలా తేలికగా అర్థమయ్యే విషయం. మీరు వినమ్రతతో, పూర్తిగా మంచిగా ఏమాత్రం స్వార్థం లేకుండా, ఎల్లప్పుడూ మంచిపనులే చేస్తూ ఉంటే, మేము బోధించిన మతసిద్ధాంతాలను విశ్వసిస్తే, చనిపోయిన తర్వాత దేవుడు మిమ్ములను స్వర్గానికి పంపిస్తాడు, ఒక వేళ ఒక్కొక్కప్పుడు మంచిబుద్ధి యుండి ఒక్కొక్కప్పుడు దుష్టబుద్ధి కలిగివుంటే, ఒక్కొక్కప్పుడు మంచిపనులు చేసి ఒక్కొక్కప్పుడు చేయకపోతే, మీ గురించి మీరు చాలా ఎక్కువగానూ, ఇతరుల గురించి చాల తక్కువగానూ ఆలోచిస్తే, అప్పుడు మరణించిన తర్వాత, స్వర్గానుభవానికి మారుగా వేరొక అనుభవానికై పాపవిమోచన స్థానానికి పంపబడతారు. ఒకవేళ మీరు పూర్తిగా దుష్టులైతే, ఎల్లప్పుడూ ఇతరులకు హాని చేస్తుంటే, అన్ని రకాల చెడ్డపనులు చేస్తూ ఉంటే, ఇతరులకు చేయవలసిన మంచిగురించి ఏమాత్రం తలచకపోతే, ముఖ్యంగా మేము బోధించిన మతసిద్ధాంతాల మీద విశ్వాసం లేకపోతే, మీరు సరాసరి నరకానికి వెడతారు, అదీ శాశ్వతంగా."

నేను విన్న వాటిలో ఎంతో ఆకర్షణీయమైన కాల్పనిక; వారు శాశ్వతమైన నరకాన్ని కనిపెట్టారు. అంటే అర్థం, ఒకసారి నీకు నరకం సంప్రాప్తిస్తే, అది శాశ్వతం... శాశ్వతం అంటే అర్థం తెలిసిందా? నీవు చిత్రహింసలకు గురిచేయబడతావు, అగ్నిలో కాల్చబడతావు (ఉష్ణదేశాలలో నీవు అగ్నిలో కాల్చబడతావు, శీతలదేశాలలోనైతే నీవు మంచుముద్దగా చేయబడతావు), అదీ అనంతకాలం. అదీ సంగతి. కాబట్టి ఇంత ఆకర్షణీయమైన అద్భుత విషయాలు నీ కెవరు చెప్పారో నాకు తెలియదు; కాని అవన్నీ కల్పితాలు, ప్రజలను విధేయులుగా చేయటానికి, వారిని తమ అదుపు ఆజ్ఞలలో ఉంచుకోవటానికి చెప్పబడ్డాయి.

ఆ విధంగా చెప్పబడని బోధనలూ ఉన్నాయి, ఆ విధంగా లేని మతాలూ ఉన్నాయి. అయినప్పటికి ఎవరైనా ఒక వ్యక్తి కావ్యకల్పనగా, కళ్ళకు కట్టినట్లు, వర్ణనలతో స్వర్గం గురించి వివరించవచ్చు. కారణం, ఈ స్వర్గం అనేది ఒక అద్భుతమైన ప్రదేశం, అక్కడ అత్యధికమైన సంతోషం, ఆనందంతో పాటు, అన్ని సదుపాయాలతో సౌఖ్యంగా ఉంటుంది.... అయినప్పటికి, అదంతా నీవు ఏ మతానికి చెందినవాడివి

అనేదాని మీద ఆధారపడి ఉంటుంది. కొన్ని స్వర్గాలున్నాయి, అక్కడ సమయాన్నంతా భగవన్నామ సంకీర్తనలతో గడుపుతుంటావు. నీవు మరేమీ చేయవు, ఒక రకంగా చివరకది తప్పక విసుగు పుట్టిస్తుంది; ఏది ఎలా ఉన్నా నీవు అక్కడ వాద్యసంగీతంతో, భగవంతుని కీర్తనలతో నీ సమయాన్ని గడుపుతుంటావు. దీనికి వ్యతిరేకంగా మరికొన్ని ఇతర స్వర్గాలున్నాయి. అక్కడ నీవు ఎన్ని సుఖాల ననుభవించవచ్చునో, అన్ని సుఖాలనూ అనుభవిస్తుంటావు, నీవు నీ జీవితంలో కోరుకున్నవన్నీ స్వర్గంలో నీకు లభిస్తాయి. మరికొన్ని స్వర్గాలున్నాయి,. అక్కడ నీవు నిరంతరం పరమానందాన్నిచ్చే ధ్యానంలో నిమగ్నమై ఉంటావు — కాని ఎవరైతే ధ్యానానికి ఎక్కువ ప్రాధాన్యత నివ్వరో, వారికది అలసట కలిగిస్తుంది. ఏదయినా అదంతా వారి వారి దృక్పథం మీద ఆధారపడి ఉంటుందని తెలుసుకో: జనులందరూ నిజంగా ఒక పద్ధతిలో ఉండాలని, వారు ఈ విధంగా బహువిధాలైన కల్పనలు చేశారు. వారికిచ్చిన నియమాలను విధేయతతో పాటించాలని.

మనిషికి సృజించగలిగిన ఊహాశక్తి ఉంది, అది ఎటువంటిదంటే విశ్వంలో అటువంటి స్వర్గాలు నిజంగా ఉన్నాయనేటంతగా రూపాలను తయారుచేయగలదు. అదే విధంగా నరకలోకాలూ ఉన్నాయి, పాపవిమోచన స్థానాలూ ఉన్నాయి. మనిషి శూన్యం నుండి తాను ఊహించినవి సృష్టిస్తాడు. నీ చైతన్యం జ్ఞానప్రకాశం పొంది దురభిమానం నుండి విముక్తమై ఉన్నట్లయితే, అప్పుడు నిన్ను ఆ ప్రదేశాల నుంచి బయటకు లాగవచ్చు; లేనిపక్షంలో అందులో నీవు మూసుకుపోతావు. జీవించి ఉన్నప్పుడు నీకు ఏ విశ్వాసమైతే ఉన్నదో అదే విశ్వాసంతో అందులో బందీవైపోతావు. అది కూడ ఒక జీవితం లాంటిదే కదా అని నీ వనవచ్చు, కాని అది పూర్తిగా భ్రమాత్మకం, అత్యంత పరిమితమైనది. అది ఆ విధంగా ఉంటుందని తలచేవారికే అది వాస్తవం. నీవు దాని నుంచి భిన్నంగా ఆలోచించటం మొదలుపెట్టగానే దాని ఉనికి నీకిక ఎంతమాత్రం ఉండదు; నీవు దాని నుచి బయటపడగలవు. ఈ ప్రదేశాలలో ఉన్న వ్యక్తినీ బయటకు లాగగలవు. తక్షణమే ఆ వ్యక్తి తన ఊహాత్మక రూపాలలోనే బందీ అయిపోయినట్లు తెలుసుకుంటాడు.

మనిషికి అసాధారణమైన కల్పనాశక్తి ఉంది. అతడు తన ప్రతిబింబంలో పెద్ద ఎత్తున ఒక దేవతాశక్తి సమూహాన్ని, తనకున్నటువంటి దోషాలనే విస్తృతస్థాయిలో వాటికి ఆపాదిస్తూ, తాను చేసినదాని కంటే అత్యధికశక్తితో చేయగలిగినవాటినిగా

సృష్టి చేశాడు. నీ ఆలోచనల మాదిరిగానే అవి కూడ ఏదో ఒకదాని మీద ఆధారపడినవే అయి ఉంటాయి, వాటి వలెనే ప్రత్యేకమైన ఉనికినీ కలిగి ఉంటాయి. నీకు ఒక ఆలోచన ఉంటే అది మానసికంగా చాలా చక్కగా రూపుదిద్దుకోబడి నీ నుంచి బయటకు వెళ్ళినప్పుడు, స్వతంత్రమైన అస్తిత్వంగా తయారవుతుంది — అది తన ప్రయాణం కొనసాగిస్తూ, తాను ఏ కారణం కోసం తయారు చేయబడిందో దానిని నెరవేరుస్తుంది. అది నీ నుంచి స్వతంత్రంగా పనిచేస్తుంది. అందువలననే నీవు నీ జాగ్రత్తలో తప్పక ఉండాలి.

గుర్తుంచుకోవలసిన విషయం, ఈ రూపకల్పనాశక్తి వలన ఎంతో గొప్ప ఉపయోగం ఉంది; కాని అది ఏ విధంగా వాడాలో తెలిసి ఉండాలి. నీవు మంచి ఆకృతులను రూపొందించవచ్చు, వాటిని సరిగా చేయగలిగితే, అవి మిగతావాటిలాగానే తమ పనిని చేయగలవు. నీ గదిలోనే ప్రశాంతంగా కూర్చుని ప్రజలకు ఎంతో మంచి చేయగలవు. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి బాహ్యంలో చేసినదాని కంటే బహుశా అంతకు మించి చాలా మంచిని చేయగలుగుతావు. నీకు శక్తితోనూ, మేధస్సుతోనూ, దయార్ద్ర హృదయంతోనూ ఆలోచించడం ఎలాగో తెలిసి, నీవు ఎవరినైనా ప్రేమించి ఎంతో చిత్తశుద్ధితో వారు బాగుండాలని, లోతుగా, సంపూర్ణ హృదయంతో తలిస్తే అది వారికి నీవు ఊహించినదాని కంటే కూడా చాలా మంచిని చేస్తుంది. నీ చైతన్యాన్ని చైత్యపురుష చైతన్యంతో ఏకం చేసినప్పుడు, నీవు చనిపోయినప్పుడు నీవు నీ చైత్య అస్తిత్వం ఎరుకను కలిగి ఉంటావు, నీ చైత్య అస్తిత్వం పరమ సుఖం, ఆనందం, శాంతి, ప్రశాంతతతో కూడి జ్ఞానం వృద్ధి పొందుతూ ఉండే చైత్యలోకానికి వెళ్ళిపోతుంది. కనుక నీవు దానిని స్వర్గం అని పిలుచుకుంటే, అభ్యంతరం లేదు. ఎందువల్లనంటే, నీవు ఎంతగా చైత్య అస్తిత్వంతో తాదాత్మ్యతను పొందుతావో అంతగా నీవు దాని ఎరుకను కలిగి ఉంటావు, దానితో ఒకటై ఉంటావు. అది అమరం, అది పరిపూర్ణమైన, ఆనందభరితమైన జీవితాన్ని భోగించటానికి లేక విశ్రాంతికి తన శాశ్వతమైన క్షేత్రంలోకి వెళ్ళిపోతుంది. దానిని స్వర్గమని అనాలని నీవు అనుకంటే స్వర్గమే అను. నీవు సచ్ఛీలుడవైతే, నీవు నీ చైత్య అస్తిత్వం ఎరుకను పొంది, అందులో జీవించినట్లైతే, నీ శరీరం పడిపోయిన తర్వాత, నీవు నీ చైత్య అస్తిత్వంతో చైత్యలోకంలోకి పరమానందస్థితిలో విశ్రాంతి పొందటానికై వెళ్ళిపోతావు.

కాని నీవు నీ ప్రాణికంలో దాని అన్ని రకాలైన ప్రేరణలతో జీవిస్తే, ప్రతి ప్రేరణా ఇక్కడగానీ ఎక్కడో మరొక చోటగానీ తనకు తాను వాస్తవరూపం పొందటానికి ప్రయత్నం చేస్తుంది.... ఉదాహరణకు, ఒక లోభి తన ధనం మీద ఏకాగ్రత వహిస్తే, అతడు చనిపోయిన తర్వాత అతని ధనం మీద ఆసక్తి ఉన్న ప్రాణికంలోని ఒక భాగం అక్కడే అంటిపెట్టుకుపోయి, దానిని ఎవరూ తీసుకుపోకండా ఆ ధనాన్ని నిరంతరం కనిపెట్టుకుని ఉంటుంది. జనులు అతడిని చూడలేరు, కాని అతడు అక్కడ ఎల్లప్పుడూ ఉంటాడు, అంతేకాక తన విలువైన ధనానికి ఏదైనా జరిగితే ఎంతో అశాంతికి లోనవుతాడు.

*

ఈ అదృశ్య ప్రపంచాలలో మనిషి మానసిక రూపకల్పన ఫలితంగా కొన్ని ఆవాస ప్రదేశాలు ఏర్పడ్డాయి. అక్కడ ఎవరు కోరుకున్నవి వారికి లభిస్తాయి. వాస్తవానికి, తరచుగా ఒక వ్యక్తి తాను ఏమి చూడదల్చుకున్నాడో దానినే అక్కడ చూస్తాడు. అక్కడ నరకాలున్నాయి, స్వర్గాలున్నాయి, పాపవిమోచన స్థానాలున్నాయి. విభిన్న మతాలు, వాటి వాటి దృక్పథాలను బట్టి అక్కడ అన్ని విధాలైనవి ఉన్నాయి. వీటన్నింటికి సాపేక్షమైన ఉనికి మాత్రమే ఉన్నది, అది ఎటువంటిదంటే మనకు ఇక్కడ భౌతిక విషయాలతో పరస్పరం ఎటువంటి సంబంధం ఉందో అటువంటిదే; అనగా, ఎవరైనా ఒకరు అక్కడకు వెళ్ళడం తటస్థించితే, అవి పూర్తిగా యదార్థమైనవిగా, స్పష్టంగా స్పృశించగలిగినవిగా ఉంటాయి. భ్రమాత్మకమగు వాటి వాస్తవికత నుంచి తప్పించుకుని బయటపడాలంటే ఆ వ్యక్తి అంతరంగంలో విముక్తి పొంది, విశాలమైన చైతన్యం మరియు అత్యధిక లోలోతుల లోని ఉన్నత సత్యంతో అనుసంధానం కలిగి ఉండాలి. ఇది ఒక విధంగా చాలామటుకు ఇక్కడ జరిగేటటువంటిదే: మానవులందరూ చాలామటుకు భౌతికయదార్థతనే కేవలం వాస్తవమైనదిగా మనస్ఫూర్తిగా నమ్మి ఉన్నారు — తాము దేనిని స్పృశిస్తారో, దేనిని చూస్తారో, దానినే యదార్థంగా భావించటం — చూడలేనిది, స్పృశించలేనిది, అనుభూతి నివ్వలేనిది సహజంగానే వారికి సమస్యాత్మకం; నిజానికి అక్కడ జరిగేదేమంటే తాదాత్మ్య స్థితి. చనిపోయిన క్షణంలో, ఏదో ఒక విధమైనటువంటి విశ్వాసంతో, ఏదో కారణాన, వారు స్వర్గానికో, నరకానికో వెడుతున్నామని అనుకోవడం మూలంగా, చనిపోయిన తర్వాత నిజంగా అక్కడ తమను తాము చూసుకుంటారు. వారికి నిజంగానే అది ఒక స్వర్గం లేక

నరకం. వారు అందులో నుంచి బయటకు వచ్చి, నిజమైనటువంటిది, ఇంకా సత్యమైన ప్రదేశానికి పోగలగటం చాలా కష్టమైన పని.

*

ప్రశ్న: స్వర్గం, నరకం ఉన్నాయా?

స: స్వర్గం, నరకం అనేవి ఏకకాలంలో యదార్థము, అయదార్థమూ. అవి ఉనికిని కలిగినవి, ఉనికి లేనివీ.

మనిషి ఆలోచన సృజనాత్మకమైనది; అది కొంచెం హెచ్చుతగ్గులతో మానసిక, ప్రాణిక రూపాలనే కాక, సూక్ష్మభౌతిక పదార్థాలకూ శాశ్వతత్వాన్నిస్తుంది. ఈ రూపాలు ఉన్నట్లుగా అనిపించేవే కాని వాస్తవం కావు. కాని ఎవరికైతే ఆ ఆలోచనలుంటాయో, అంతకు మించి ఎవరైతే వాటిని విశ్వసిస్తారో వారికవి నిర్దుష్టమైన ఉనికిని కలిగినవై వాస్తవమనే భ్రమను కలిగిస్తాయి. కాబట్టి నరకమూ, స్వర్గమూ లేక అనేక స్వర్గాలూ ఉన్నవని గట్టిగా నమ్మబలికే మతాలను విశ్వసించేవారికి అవి నిర్దుష్టమైన ఉనికితో యదర్థమైనవిగా ఉంటాయి. చనిపోయినప్పుడు వారు ఎక్కువ కాలం లేదా తక్కువ కాలం ఉండటానికి అక్కడకు వెడతారు. అయినప్పటికి ఇవి అనిత్యమైన మానసిక కల్పనలు; వాటిలో శాశ్వత సత్యం లేదు.

నేను స్వర్గాలలోకి, నరకాలలోకి వెళ్ళినవారిని చూశాను. వాటిలో సత్యం లేదని వారికి అవగాహన కలిగించటం చాలా కష్టం. ఒకసారి నాకు ఒకరిని అతను అనుకునే నరకం నరకం కాదని నచ్చజెప్పి బయటకు తీసుకురావటానికి ఒక సంవత్సరం కంటె ఎక్కువ కాలమే పట్టింది.

శ్రీమాత

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

(CWM 5: 129,34; 8:217-18; 10:64-65)

మతాలలోని నివృత్తి, నిర్వాణ భావన

ఆయా దేశాల వారిచే వారి మతానుసారంగా విభిన్నంగా వ్యక్తీకరించబడినా, ప్రపంచంలో అన్ని చోట్ల యిదే వైఖరి కనిపిస్తుంది. ఈ అజ్ఞాన వైఖరికి స్పందించి యిలా వ్రాయటం జరిగింది. సహజంగా భారతదేశంలో కూడా యిదే భావన ఉంది. భౌతిక వాస్తవికత పట్ల పూర్తి సన్యాసవైఖరి, ఈ పదార్థ ప్రపంచాన్ని మాయగా, అసత్యంగా పరిగణించి నిరసించటం, అసురశక్తుల యిష్టారాజ్యానికి ఈ భౌతిక క్షేత్రాన్ని అయాచితంగా వదిలినట్లయిందని శ్రీఅరవిందులు అంటుండేవారు. శ్రీఅరవిందుల దృష్టిలో సుదూరమయిన గుహన సత్యాన్ని ఆకాంక్షిస్తూ, ఒక శూన్యస్థితిని సిద్ధింపచేసుకోవటం కోసం, ఒక శూన్య సామ్రాజ్యాధినేత కావటానికి, సుస్థిరమైన వాస్తవికత నుండి పారిపోవటం ఈ భౌతిక ప్రపంచాన్ని దుష్టశక్తుల చేతిలో పెట్టటమే. అవి పూర్తిగా ప్రపంచాన్ని ఆక్రమించి పరిపాలించటం మొదలుపెట్టాయి. వేర్వేరు రకాలుగా వ్యక్తపరచబడిన, నిర్వాణస్థితిని చేరుకోవటం అనే భావన ప్రపంచంలో అన్ని చోట్లా ఉంది.

ఇంత వరకూ దుష్టశక్తులను బలహీనతతో, పదార్థ జగతిలో ఏమాత్రం పరిణామాన్ని కలిగించలేని ఆధ్యాత్మిక శక్తితో ఎదుర్కొనటం జరిగినందువలన ఈ సత్సంకల్పం యొక్క బృహత్ ప్రయాస కేవలం దయనీయమైన అపజయంతోనే అంతమయి, ప్రపంచాన్ని దుఃఖం, దుర్మార్గం, అసత్యాల పాలిట కొనసాగుటకు వదలివేసింది. ఆ స్థాయిలోనే, ఈ దుష్టశక్తులు రాజ్యమేలుతున్న చోటే, వాటిని అధిగమించగల శక్తిని పొంది ఆ స్థావరంలోనే వాటిని పూర్తిగా జయించాలి. మరో విధంగా చెప్పాలంటే చైతన్యాన్ని, భౌతిక జగతిని రెంటినీ రూపాంతరం చెందించగలది ఆధ్యాత్మిక శక్తి అతిమానసశక్తి మాత్రమే. చేయవలసినదల్లా, భౌతిక స్తరంలో ఆ శక్తిని అందుకోగలగటమే. సుదూరమైన నిర్వాణస్థితి కోసం పరుగులు తీసి ఈ భౌతిక జగత్తును విస్మరించి, శత్రువులకు దీనిపై పూర్తి ఆదిపత్యాన్నివ్వటం అసమంజసం.

విజయాన్ని సాధించగలిగేది త్యాగమో, వైరాగ్యమో, బలహీనతో కాదు, కేవలం ఆనందమే. సహనం, అనంతమైన ధైర్యంతో కూడిన శక్తివంతమయిన ఆనందం మాత్రమే, విజయాన్ని సాధించగలదు. ఆ ఆనందం అతిమానసశక్తితోనే సమకూరుతుంది. అది అత్యంత మహత్తరరమైన ధైర్యాన్ని కోరుతుంది. అది అన్నిటినీ విడిచి పారిపోవటం కన్నా కష్టసాధ్యమయినది కానీ విజయానికి ఏకైక మార్గం అదే.

కేవలం ఆ దుష్టత్వం కన్నా మహత్తరమైన శక్తి మాత్రమే విజయాన్ని సాధించగలదు.

శిలువ వేయబడిన శరీరి కాదు, మహిమాన్వితుడైన శరీరి మాత్రమే ఈ ప్రపంచాన్ని రక్షిస్తాడు.

నూతన సంవత్సర సందేశం 1957

*

నిష్క్రమించటమే ధ్యేయమైతే ఈ సృష్టి సర్వస్వం, ఈ అనంత విశ్వావిర్భావమంతా ఒక హాస్యోక్తిగా గోచరిస్తుంది. ఇక్కడ నుండి పారిపోవటానికే అయితే అసలు ప్రారంభించటమెందుకు? ఇంత ప్రయాస కోర్చి, అష్టకష్టాలు పడి, బాహ్యదృష్టికి యింత విషాదకరము, నాటకీయమైన ఈ సృష్టి కేవలం యిందులోంచి ఎలా బయటపడాలో నేర్పించటానికే అయితే యిది ప్రారంభించకపోయినట్లైతేనే బాగుండి ఉండేదేమో.

కానీ విషయాల మూలానికి వెళ్ళినట్లయితే, అహాన్ని, అహంకారాన్ని కూడా తీసివేసినట్లయితే, ఏమాత్రం దాపరికం లేకుండా సంపూర్ణంగా, నిస్వార్థంగా, పూర్తిగా ఆత్మనివేదన చేసుకున్నట్లయితే, భగవంతుడి ప్రణాళికను అర్థం చేసుకొనే శక్తి ప్రాప్తిస్తుంది. అపుడు అర్థమౌతుంది యిదొక చెడ్డ ఛలోక్తి కాదని, దెబ్బలు తిని తిరిగి బయలుదేరిన స్థానానికే చేరుకొనే ఎన్నో మలుపుల ప్రయాణం కాదనీ తెలుసుకుంటారు. ఇందుకు భిన్నంగా ఈ సృష్టి అంతటికీ జీవించటంలో గల ఆనందాన్ని, సౌందర్యాన్ని, మహత్తును, ఉదాత్తతను, ఆ ఆనందము, సౌందర్యము, మహోన్నతిలో సదా వికసిస్తూ ఉండే నిరంతర ప్రగతి యొక్క ఔన్నత్యాన్ని బోధిస్తుంది. అపుడు అన్నిటిలోనూ పరమార్థం గోచరిస్తుంది. పడిన బాధలు ప్రయాసల పట్ల విచారం ఉండదు. దివ్యమైన ప్రస్థానం చేరుకోవటంలో ఉత్సాహం మాత్రమే ఉంటుంది. విజయం, గమ్యం నిశ్చయమనే జ్ఞానంతో తలమునకలవుతారు.

ఈ ఎరుక కలగాలంటే ఆ పరమోన్నత మూలం నుండి వేరుచేయబడిన స్వస్వభావోన్ముఖుడైన వ్యక్తిగా కాక అహంకారరహితంగా ఉండగలగాలి. చేయవలసినదదే.

అహంకారాన్ని విసిరికొట్టాలి. అపుడే నిజమైన గమ్యాన్ని దర్శించగలుగుతారు.

ఇదొక్కటే మార్గం.

శ్రీమాత

అనువాదం: డా. సరోజా ప్రసాద్

CWM 9:4-5, 426

నైతికతకు ఆధ్యాత్మికతకు మధ్య వ్యత్యాసం

ఆధ్యాత్మికతకు, నైతికతకు మధ్య అపారమైన తేడా ఉంది. ఒకదానిని మరొకదానిగ తరచు పొరపడుతుంచారు. ఆధ్యాత్మిక జీవితానికి, యోగపరమైన జీవితానికి లక్ష్యం దివ్యచైతన్యం లోనికి యెదుగుట, తత్ఫలితంగా నీలో యేదైతే వున్నదో దానిని పవిత్రీకరించి, తీవ్రపరచి, మహిమాన్వితం గావించి, సమగ్రంగా రూపొందించి, దైవాన్ని ఆవిష్కరించడానికి నిన్నొక శక్తిగా రూపొందించుట. ప్రతి ఒక్కరి వ్యకిత్వ విలక్షణ ప్రమాణాన్ని ఉన్నతతరం గావించి దానిని సంపూర్ణంగ అభివ్యక్తము చేయుట. ఎందుకనగా అది దైవప్రణాళికలో ఒక భాగమైనందు వలన. నైతికత ఒక మానసిక నిర్మాణప్రాతిపదికగా కొనసాగుతుంది. మంచి యేదో, చేడు యేదో అను విశ్లేషణాత్మక మనోభిప్రాయంతో కూడి యుంటుంది. ఒక ఆదర్శవంతమైన నమూనా వ్యక్తిత్వాన్ని రూపొందించి అందరూ దానిని అనుకరించేలా వొత్తిడి చేస్తుంది. ఈ నైతికత యొక్క వివిధ అంశాలు, వాటి సమిష్టి లక్షణాలు, దేశకాలానుగుణంగా మార్పు చెందుతుం టాయి. ఐనప్పటికి అది ఒక అసమానమైన విలక్షణత కలిగినదానిలా, ఒక నిరపేక్షమైన సమగ్రత గలదానిలా దర్శనమిస్తుంది. దానికి బహిర్గతంగా నున్న యేదానిని దరి చేరనీయదు. అంతర్గతంగా కూడ యే విధమైన మార్పుకు తావివ్వదు. అందరూ దాని ఏకైక ఆదర్శవంతమైన నమూనాకు అనుగుణంగా మలచబడవలసిందే. ప్రతి ఒక్కరు యేకరీతిగ, యేమాత్రం కొరతలేని విధంగ దానిని అనుకరించవలసిందే. నైతికతయొక్క ఈ కఠినమైన అసాధారణ లక్షణం కారణంగ దాని మూలంలోను, కార్యాచరణలోను ఆధ్యాత్మిక జీవితానికి భిన్నమైనదిగా నుంటుంది. ఆధ్యాత్మిక జీవనశైలి అందరిలో నున్న ఒకే మూలతత్వాన్ని ఆవిష్కరించుటతో పాటు దాని

అనంతమైన వైవిధ్యాన్ని కూడ వెల్లడి చేస్తుంది. ఏకత్వంలో భిన్నత్వానికి, భిన్నత్వంలో పరిపూర్ణతకు శ్రమిస్తుంది. నైతిక జీవ వైవిధ్యతకు, ఆత్మ స్వేచ్ఛకు భిన్న మైన ఒక కృత్రిమ ప్రమాణాన్ని నిర్ధారిస్తుంది. ఒక విధంగా మానసికమైన, దృఢమైన, పరిమితమైన ప్రమాణాన్ని సృష్టించి అందరూ దానిని అనువర్తించాలంటుంది. అందరూ ఒకే విధ మైన గుణగణాలను, ఒకే విధమైన ఆదర్శనీయ స్వభావాన్ని కలిగి యుండేలా ప్రయాసపడాలంటుంది. నైతికత దివ్య మైనది కాదు, లేక దైవపరమైనది కూడ కాదు. అది మనిషికి చెందినది, మానవీయమైనది. నైతికత మంచిచెడుల మధ్య ఒక నిశ్చితమైన విభజనను ప్రధానమైన ప్రాతిపదికగ పరిగణిస్తుంది. ఐతే, ఇదొక విశ్లేషణాత్మకమైన మనోభావన మాత్రమే. సాపేక్ష మైన విషయాలను పరమ నిర్దిష్టమైనవిగ అందరిపై విధించాలని ప్రయత్నిస్తుంది. కారణం, దేశ, కాల, వాతావరణ, చారిత్రక స్థితులలోగల వైరుధ్యత కనుగుణంగా, మంచిచెడులు కూడ మారుతుంటాయి. నైతిక భావనా పరంపర యెంతవరకు పోతుందంటే, అది కోరికలను మంచివిగ, చెడ్డవిగ నిర్ధారించి, ఒకదానిని అంగీకరించి మరొక దానిని తిరస్కరించమంటుంది. ఐతే ఆధ్యాత్మిక జీవితం నిన్ను అసలు కోరికనే విస్మరించమని అర్థిస్తుంది. దాని నియమమేమిటంటే దైవం నుండి నీ దృష్టిని మరల్చే చలనాల నన్నింటిని నీవు విసర్జించాలని.

నైతికమని పరిగణించబడే లక్షణాలన్నింటిని కలిగి యుండుటను మామూలుగ నైతిక సమగ్రతయని పేర్కొంటారు. దోషాలు లేకుండుట, పొరపాటు చేయకుండుట, యేది అత్యుత్తమమైనదని అనుకుంటారో ఆ మాదిరిగ నుండుట, సకల సుగుణాలను కలిగియుండుట — అనగా అత్యున్నతమైన మానసిక భావనానుభూతిని కలిగియుండుట — ఈ సుగుణాలన్నింటిని కలిగి వుండాలి — ఎన్నో వున్నాయి కదూ. మానవ దృక్పథంలో అతి సుందరమైనవి, అతి ఉదాత్తమైనవి, అత్యంత సత్యవంతమైనవిగ పరిగణింపబడే సకల సుగుణాలను కలిగి యుండి, వాటి కనుగుణంగా మనుగడను సమగ్రంగా తీర్చిదిద్ది, కార్యాచరణనంతా ఆ సుగుణాల మార్గదర్శనంలో కొనసాగించాలి — అన్ని కదలికలను, అన్ని ప్రతిస్పందనలను. దానిని సమగ్రమైన, సముచితమైన నైతిక జీవనమనవచ్చు. మనిషి యొక్క మానసిక వికసన పరాకాష్ఠ అనగా అది.

ఎక్కువ మంది ఆ స్థితిని సాధించలేరు. ఐనప్పటికి సాధించినవారు, సాధిస్తున్నవారు వున్నారు. సాధారణంగా మనుషులు దీనినే ఆధ్యాత్మిక జీవనంగ పరిగణిస్తారు. ఈ కోవకు చెందినవారిని కలిసినప్పుడు "ఓ, అతడొక ఆధ్యాత్మిక జీవి" అని అంటారు.

ఐతే, అతడొక గొప్ప సాధుపుంగవుడో లేక గొప్ప జ్ఞానియో కావచ్చు, కాని ఆధ్యాత్మిక జీవి మాత్రం కాడు.

అయినప్పటికి ఈ స్థితిని పొందగలుగుట కష్టతరమైనా చాలా మంచిది. అంతరంగ వికసన ప్రక్రియలో ఈ సిద్ధిని పొందుట ఆవశ్యకమయ్యే తరుణం ఒకటి వస్తుంది. మనిషి స్వంత మానసిక ప్రేరణలతోను, అజ్ఞానభరిత బాహ్య ప్రతిక్రియలతోను తన ప్రవర్తనను నిర్దేశించుటకు బదులు, ఈ సిద్ధిని ప్రాప్తింపజేసుకొనుట అత్యుత్తమము. ఒక విధంగా ఇది మనిషి స్వభావంపై ఆధిపత్యం నెరుపుతూనే యున్నది. అంతేగాక ఇది ప్రతి యొక్కరు గడపవలసిన దశ, కారణం, ఆ దశలో మనిషి తన అహంపై అజమాయిషీ చేయడం ప్రారంభిస్తాడు. అహాన్ని తన నుండి దూరం చేయడానికి సన్నద్ధుడౌతాడు. ఆ దశలో కూడ అహం ఇంకా అతనిని అంటిపెట్టుకునే వుంటుంది, కాకపోతే అంతమొందుటకు సూచనగ నీరసపడుతుంది. ఆవలి దిక్కుకు దాటడానికి ముందుగా నుండే చిట్టచివరి దశ అది. ఎవరైనా ఈ దశను విస్మరించి ఆవలి దిక్కుకు చేరగలమనుకుంటే, వారు ఒక తీవ్రమైన పొరపాటుకు పాల్పడుతున్నారన్న మాట. తమ నిమ్నప్రకృతి విషయంలో ఒక బలహీనతను సంపూర్ణ స్వేచ్ఛగా పరిగణించే ప్రమాదానికి లోనౌతున్నారన్న మాట..

అత్యంత పరిపూర్ణమైన, గణనీయమైనవారికి కూడ కొంతకాలం పాటైనా ఈ ఆదర్శనీయమైన సమగ్ర నైతిక ప్రవర్తనను అనుభవించకుండా, మానసిక అస్తిత్వం నుండి నిజమైన ఆధ్యాత్మిక జీవనంలోకి అడుగిడుట దాదాపు అసంభవమనవచ్చు. చాలామంది అడ్డదారి త్రొక్కుటకు ప్రయత్నిస్తారు. వారి బాహ్యప్రకృతి యొక్క బలహీనతలను అధిగమించకుండానే అంతరంగస్వేచ్ఛను అనుభవించాలనుకుంటారు. వారందరికి తమను తాము మోసపుచ్చుకునే ప్రమాదం వుంది. నిజమైన ఆధ్యాత్మిక జీవితం, సంపూర్ణ స్వాతంత్ర్యం, అత్యుత్తమ మానసికానుభూతు లన్నింటికన్న మహోన్నతమైనది. అయితే మనిషి తాను స్వేచ్ఛాస్వాతంత్ర్యాలని భావించే లక్షణాలను ఒక చనువుగా, విశృంఖలత్వంగా, నియమనిబంధన లన్నింటిని తృణీకరించే రీతిగా బావించకుండుటకు జాగ్రత్త వహించాలి.

మనిషి పైకి యెదగాలి, యెల్లప్పుడు యెదుగుతుండాలి. ఆ యెదుగుదల అత్యున్నత శ్రేణికి చెందిన మానవజాతి యెంతటి మహోన్నత స్థాయిని అందుకోగలిగిందో, దానికి యేమాత్రం తీసిపోకూడదు.

అపరిమితమైన, నిజమైన ఆధ్యాత్మికత యేదైతే అనంతత్వంలో, శాశ్వతత్వంలో సమగ్రంగా కొనసాగాలనుకుంటుందో, దానిలో ప్రవేశించుటకుగాను, వ్యక్తి తన ఆధ్యాత్మిక రెక్కలను విప్పార్చుకునే ముందు మానవజాతి దేనిని అత్యున్నతమైనదిగ అత్యంత సుందరమైనదిగ, అత్యంత సమగ్రమైనదిగ, అత్యంత నిస్వార్థమైనదిగ, మహోన్నతమైనదిగ పరిగణిస్తుందో, స్వచ్ఛందంగా ఆ మాదిరిగా నుండగలగాలి.

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

CWM 3: 117-18; 9:408-09

శ్రీఅరవిందుల బోధలు ఒక కొత్త మతమా?

ప్రశ్న: చాలా మంది అంటారు, శ్రీఅరవిందుల బోధలు ఒక కొత్త మతమని మీరూ అంటారా అది ఒక మతమని?

స: అలా అనే జనం వెర్రివాళ్లు. వారు మాట్లాడేదేమిటో వారికే తెలియదు. శ్రీఅరవిందుల రచనలపై, ఏ మతమూ ఆధారపడి ఉండటం అసంభవమని మీరు తెలుసుకోవాలంటే, వారి రచనలను అన్నింటిని మీరు చదవాలి. ఎందుకంటె, ప్రతి సమస్యను, ప్రతి ప్రశ్నను అన్ని కోణాలనుండి చూపుతారు శ్రీఅరవిందులు. చూసే ప్రతి పద్ధతిలో, కనబడే సత్యాన్ని తెలుపుతారు, ఈ పరమ సత్యాన్ని చేరాలంటే, బుద్ధి కల్పనలకు, ఆలోచనలకు ఆవల ఉండే సమన్వయం సాధించాలి, ఆలోచనా పరంపరను మించిన మహనీయతలోకి తేలిపోవాలి.

శ్రీఅరవిందులను గూర్చి మాట్లాడేటప్పుడు బోధ, దర్శనం అనే ప్రశ్నే ఉదయించదు. కేవలం దైవం చేపట్టే చర్య తప్ప. దీని ఆధారంగా ఏ మతాన్ని స్థాపించలేము.

కాని మనుష్యులు ఎంత తెలివితక్కువవారంటే, దేనినైనా వారు మతంగా మార్చగలరు; వారి సంకుచిత ఆలోచనలకు, పరిమిత చర్యకు, ఒక స్థిర చట్రంయొక్క అవసరం అట్టిది; ఇది సత్యం, అది కాదు, అని స్పష్టంగా చెప్పలేకపోతే, వారు అభద్రతకు లోనౌతారు. శ్రీఅరవిందుల రచనలు చదివి అర్థం చేసుకున్నవారికి అలా చెప్పడం అసంభవం. మతం, యోగం — ఇవి సత్తా యొక్క ఒకే తలానికి

చెందవు. మానసికమైన మూఢనమ్మకాల నుండి విముక్తి చెందినపుడే, స్వచ్ఛమైన ఆధ్యాత్మిక జీవనం ఉండగలదు.

*

(ఒక ఉపాధ్యాయునితో): మీరు ప్రయత్నిస్తున్నారు, చరిత్ర పునరావృతమౌతుందని చూపడానికి, దాని ఫలితంగా శ్రీఅరవిందులు వచ్చారని, వారే చివరివారని. కాని ఇది పూర్తిగా అసత్యం.

శ్రీఅరవిందులు చరిత్రకు చెందినవారు కారు; వారు చరిత్ర బయట ఉంటారు, చరిత్రను అధిగమించి ఉంటారు.

శ్రీఅరవిందులు పుట్టే వరకు, మతాలు, ఆధ్యాత్మికతలు ఎల్లప్పుడు గత వ్యక్తుల చుట్టూ ఉండేవి. వారు గమ్యమని చూపేది పృథ్వీ జీవన తిరస్కారాన్ని ఈ రెండింటి మధ్య నీకు ఒక ఎంపిక ఉండేది: (1) పృథ్వీ జీవనం దాని అల్పసుఖాలు, బాధలు, సంతోషాలు, వేదనలు. నీ ప్రవర్తన బాగా లేనప్పుడు నరకముచే భయపెట్టబడే బ్రతుకు. (2) తప్పించుకు పారిపోవడం, వేరే ప్రపంచంలోకి — స్వర్గం, నిర్వాణం, మోక్షం.

ఈ రెండింటి మధ్య పెద్దగా ఎంపిక చేసేదేమీ లేదు — అన్నీ చెడ్డవే, సమానంగా.

ఇదే మూల తప్పిదం, ఇండియా బలహీనంగా దిగజారడానికిదే కారణం, అన్నారు శ్రీఅరవిందులు. బౌద్ధం, జైనం, భ్రాంతివాదం, ఇవి మాత్రమే చాలు, దేశశక్తి నంతా పిండివేయాడానికి.

సత్యమే — ప్రపంచంలోకంతా ఒక్క ఇండియాలో మాత్రమే పదార్థం కంటె వేరైనదేదో ఉన్నదనే ఎరుక ఉన్నది. మిగిలిన దేశాలన్నీ దీనిని మర్చిపోయాయి. యూరప్, అమెరికా, ఇతర దేశాలు. అందువల్లే, ఆమె (ఇండియా) వద్ద ఒక సందేశం, ఇంకా భద్రపరచబడి ఉన్నది, ప్రపంచాని కందించేందుకు. కాని ప్రస్తుతం ఆమె బురదలో కొట్టుమిట్టాడుతోంది.

పృథ్వీజీవనం నుండి పారిపోవడంలో సత్యం లేదు. దానిలోనే ఉంటూ, దానిని పరివర్తన చేయాలి; దివ్యీకరించాలి; — ఇక్కడే, ఈ భౌతిక ప్రపంచంలోనే అభివ్యక్తం చేయాలి దైవాన్ని, అని విశదకీరించారు శ్రీఅరవిందులు.

శ్రీమాత

CWM, 10:95-96; 12:210-11

*

ఏదో ఒక మతాన్ని అభివృద్ధి చేయడమో, లేక, పాత మతాలన్నింటి కలబోతగా, ఒక కొత్త మతాన్ని స్థాపించడమో, శ్రీఅరవిందుల ధ్యేయం కాదు. ఎందుకంటె, వీటిలో ఏదైనా, అతని ప్రధాన ధ్యేయం నుండి దారి మళ్లిస్తుంది. అతని యోగం యొక్క ఏకైక ధ్యేయం, అంతరంగ స్వయం-అభివృద్ధి. ఈ మార్గంలో పోయే ప్రతి ఒక్కరు, కాలక్రమేణ, 'ఒకే ఆత్మను' అందరిలో దర్శించి, ఉన్నత చైతన్యస్థితిని — మానసిక, ఆధ్యాత్మిక, అతిమానస, చైతన్యముల కంటె విలువైన ఉన్నత స్థితిని — పొందగలరు. అది మానవ నైజాన్ని పరివర్తన చేసి, దివ్వీకరించగలదు.

మూలం: శ్రీఅరవిదులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

(SABCL 26:97)

మతాలు — భవిష్యత్తు

శ్రీఅరవిందులు ఈ భావజాలాన్ని చాలాసార్లు వెల్లడించారు. అలాగే నేను కూడా చాలాసార్లు చెప్పాను. దాని సారాంశాన్ని ఇలా చెప్పుకోవచ్చు. గత ఆధ్యాత్మిక మార్గాలన్నీ జీవితాన్నుండి పలాయనం చిత్తగించి ఈ ప్రపంచాన్ని యథాతథంగా వదిలేసి పరతత్వంలో లీనం గావడం లక్ష్యంగా వుండేవి. దీనికి విరుద్ధంగా మనం జీవితాన్ని దివ్యంగా మలచడం అంటే ఈ భౌతిక ప్రపంచాన్ని దివ్యప్రపంచంగా రూపాంతరం చెందించడం. ఇది మన లక్ష్యం. దీనినే మనం మళ్ళీ మళ్ళీ చెప్పుకుంటూ అవగాహన చేసుకుంటాం. నిజానికి మన కార్యాచరణకు అదే మౌలికభావన. అయితే ఇది విశాలత్వంతో ప్రగతిపథంగా సాగిపోవడం గతానికి ఒక కొనసాగింపు కావచ్చు. అయితే ఇది ఆలోచనా క్షేత్రంలో ఒక భావంగానే వున్నది. జరిగిందేమిటంటే, నిజమైన కొత్త విషయం, ఒక నూతన ప్రపంచం సాకారమయ్యింది, రూపొందింది, జన్మించింది. అది పాతది తన్ను తాను రూపాంతంరం చెందించుకున్నది కాదు, కొత్తగా ప్రభవించిన నవ్యప్రపంచం. ఈ రెండింటి సంధికాలంలో ఇప్పుడు మనం చిక్కుకొని ఉన్నాం. అయితే సాధారణ చేతనను నియంత్రిస్తూ దానిపై పూర్తిగా పెత్తనం చెలాయిస్తూ ఒకటి సాగుతోంది, కాని నూతనంగా జన్మించినది

మాత్రం ఎంతో అణుకువతో ఏ సూచన చేయకనే నెమ్మదిగా చోటు చేసుకుంటున్నది. బాహ్యంగా దేన్నీ చెడగొట్టకుండా ప్రస్తుతానికి సాగుతున్నది. చాలామందికి తెలియకుండానే వారి చేతనలో ప్రవేశిస్తున్నది. అయినా దాని కార్యాచరణ కొనసాగుతూనే వుంది. ప్రస్ఫుట మయ్యేటంత బలంగా స్థిరపడేవరకు అభివృద్ధి చెందుతుంటుంది.

ఎట్టి పరిస్థితులలోనైనా గత ప్రపంచం గూర్చి చెప్పాలంటె శ్రీఅరవిందులు తెలిపినట్లుగా అది అధిమనస్సుకు చెందిన దేవతల కాలం. అందుకే మతాలకు నెలవైంది. నేను చెప్పినట్లు మానవ ప్రయత్నాల ఫలితంగానే లెక్కలేనన్ని మతాలు పుట్టుకొచ్చాయి. ఉన్నత ఆత్మలకు మరియు అవ్యక్త ప్రపంచానికి మతపరమైన సంబంధాన్ని నెలకొల్పాయి. వీటన్నింటికి పరాకాష్ఠగా ఒక ఉన్నత అనుభూతికి ప్రయత్నంగా మతాలన్నీ ఏకం కావాలన్న భావన ఏర్పడింది. ఈ ఏకత్వ భావన దీని వెనుక ఉంది. ఒక విధంగా చెప్పాలంటే ఈ భావన నిజంగా మానవాకాంక్షకు పరాకాష్ఠ. కొసమెరుపులా కనిపించినా, అది ఇప్పటికీ పూర్తిగా అధిమానస లోకానికి చెందినదే, అధిమానసం నుండి ఆవిర్భవించినదే. అది ఇప్పుడు ఊహకు కూడా అందని ఒక నవ్యప్రపంచానికై ఎదురు చూస్తున్నట్లుగా వున్నది. దాన్ని అందుకోవాలని ప్రయత్నిస్తున్నది. దాని ఆగమనాన్ని అనుభూతి చెందుతున్నది. అయినా కూడా దానిని గ్రహించజాలదు. దాన్ని తెలుసుకునేందుకు వెనకకు మళ్ళాలి. అధిమానస సృష్టిని వదిలివేయాలి. అధిమానస చైతన్యం నిండారిన నవ్యలోకం ఒకటి ఉనికిలోకి రావలసిన అవసరం ఉంది.

ఇప్పుడు గతకాలానికి చెందినవన్నీ ఎంతో పాతవిగా, పనికిరానివిగా, వ్యర్థమైనవిగా అగుపిస్తాయి — వాస్తవమైన సత్యాన్ని, హాస్యాస్పదం గావించినట్టు.

అతిమానసలోకంలో మతాలకు తావు లేదు. దివ్య ఏకతను అభివ్యక్తీకరించేందుకు

> మతాల యుగం అంతరించింది.
> విశ్వ ఆధ్యాత్మికత యుగంలో, దాని మూలంలోని స్వచ్ఛతను అనుభవించే దశలో మనం ప్రవేశించాము.
>
> — శ్రీమాత

జీవితమే వాహికగా వికాసం చెందుతుంది. మానవులు కొలిచే దేవతలకు అక్కడ ఆవాసముండదు.

భౌతిక పదార్థం అతిమానసీకరణ చెందినపుడు భూమిపై అవతరించడం, నిమ్నత్వానికి హేతువు కాదు. అందుకు భిన్నంగా వుంటుంది. అది ఒక సమగ్రతను, నిండుతనాన్ని సమకూరుస్తుంది. మరో విధంగా దానిని పొందలేము.

అయితే ఇదంతా భవిష్యత్తులో సంభవిస్తుంది. అది ఒక భావితరం. అది ప్రారంభమైనప్పటికీ పూర్తిగా అర్థమయ్యేందుకు కొంత సమయం పడుతుంది. అప్పటిదాకా మనం పూర్వంలా కాకుండా అత్యంత ఘనమైన సాటిలేని దివ్యముహూర్తంలో ఉన్నాం. ఒక నవ్యలోకం ఉదయించడాన్ని సాక్షీభూతంగా, ప్రస్తుతం చూస్తున్నాం. అది బాల్యావస్థలో కడు బలహీనంగా ఉంది. దాని బాహ్య అభివ్యక్తీకరణలో మాత్రమేకాని మూలంలో కాదు. దాన్ని గుర్తించకపోయినా, అనుభూతికి లోనవకపోయినా, పెక్కుమంది వ్యతిరేకించినా — అది ఇక్కడ ఆవిర్భవించింది.

శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు

అహంకారాన్ని త్యజించాలి. జీవితంలో భగవంతుని అంగీకరించి జీవించాలి. ఇదే నేను బోధించే యోగం. సన్యాసం కాదు.

శ్రీఅరవిందులు

ఆధ్యాత్మికత అనగా ఏమిటి?

ఆధ్యాత్మికత అనగా గొప్ప బుద్ధికుశలత కాదు, ఆదర్శవాదం కాదు, నైతికపరమైన మానసిక పరివర్తనగాని, పవిత్రతగాని, నిష్ఠాగరిష్టతగాని కాదు. ఒక మతపరమైన ధర్మాచరణగాని, లేక తీక్షణమైన, ఘనమైన భావోద్రేకముతో కూడిన అమితోత్సాహం గాని కాదు. అమోఘమైన ఈ సర్వ లక్షణాల సంకలనం కూడ కాదు. ఒక మానసిక విశ్వాసంగాని, ఒక మతపరమైన సిద్ధాంతం లేక విశ్వాసంగాని, ఒక మనోప్రేరిత ఆకాంక్షగాని, మతపరమైన లేక నైతిక సిద్ధాంతపరమైన నడవడి నియమావళిగాని, ఆధ్యాత్మిక సిద్ధి, అనుభవంగాని కానేరవు.

ఈ విషయాలన్నీ మనసుకు, జీవితానికి అత్యంత విలువగలవి. ఆధ్యాత్మిక వికసనం కోసం శిక్షణ గరపడానికి, పవిత్రీకరించడానికి, స్వభావాన్ని సరైన విధంగా తీర్చిదిద్దడానికి సన్నాహక చర్యలుగ అత్యంత ప్రాధాన్యత గలవి. అయినప్పటికి అవి మానసిక వికాసానికి చెందినవి. అంతేగాక, ఆధ్యాత్మిక సిద్ధికి, ఆధ్యాత్మకానుభవానికి అవి ప్రారంభాలు. ఇక్కడ మార్పు యింకా చోటు చేసుకోలేదు.

ఆధ్యాత్మికత యొక్క సారాంశం ఏమిటంటే, మన అస్తిత్వం యొక్క అంతరంగ వాస్తవికత గురిచి, మన మనో ప్రాణ శరీరాలకు అతీతమైన ఆత్మ, జీవి, అంతరాత్మల గురించి క్షుణ్ణంగా తెలుసుకొనుట. అది తెలుసుకోవాలని, ఆ అనుభూతి పొందాలని, ఆ విధంగా నుండాలని, అతీతమైన, విశ్వవ్యాపకమైన, మహోన్నత పరమ సత్యంతో సంబంధం యేర్పరచుకోవాలని, దానితో సంభాషించాలని, సంయోగం చెందాలని, ఒక అంతరంగ ఆకాంక్షను కలిగియుండుట. ఆ కారణంగా మన అస్తిత్వమంతా ఒక మలుపుకు, ఒక మార్పుకు, ఒక పరివర్తనకు లోనగుటకు, తత్కారణంగా యేర్పడిన ఆ సంబంధానికి, ఆ ఐక్యతకు, ఒక క్రొత్త జీవిగా, ఒక నూతన ఆత్మగా, ఒక వినూత్న స్వభావంతో యెదగాలనే అంతరంగ ఆకాంక్షను కలిగి యుండుట.

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

SABCL 19:857

సామాన్య, ధార్మిక, ఆధ్యాత్మ జీవనరీతులు

అధ్యాత్మజీవనం, ధర్మజీవనం, సామాన్య నైతికమానవజీవనం విభిన్నమైవి. ఏది కావాలని తాను ఆకాంక్షిస్తున్నాడో ప్రతి వ్యక్తి తెలుసుకోవాలి. ఆ మూడింటిని కల గాపులగం చేయగూడదు. సగటు మానవచైతన్యం తన నిజమైన ఆత్మనుండి, భగ వానుని నుండి విడిపోయి వుండేది. సామాన్య జీవనం. మనస్సు, జీవితం, శరీరం అలవాట్లు. ఆ జీవితాన్ని ప్రభావితం చేస్తుంటాయి. అవన్నీ అజ్ఞానానికి చెందిన నియమాలు.

అది అజ్ఞాన చైతన్య ప్రపంచం నుండి భ గవంతుని వైపు తిరగడం, ఏ జ్ఞానం లేకుండానే తిరగడం, ధర్మ (మత) జీవనం అవుతుంది. ఏదో ఒక మతశాఖ నియమాలు, సూత్రాలు, పిడివాదం ఆ జీవనాన్ని ప్రభావితం చేస్తాయి. భువన చైతన్య బంధాల నుండి విడివడి, ఒక ఆనందమయమైన అతీతం లోకి ప్రయాణించే మార్గం మా వద్ద ఉన్నట్లు ఆ మతశాఖలు ప్రకటించుకుంటాయి. ధర్మజీవనం ఆధ్యాత్మిక జీవితానికి మొదటి సోపానం కావచ్చు. కాని క్రతువులు, యాగాలు, కొన్ని అలవాట్ల, భావాల ఆచరణ వైపు తిరగడం జరుగుతుంది. కాని ఆ పయనంలో ఎటువంటి మార్పు, ఎటువంటి ఫలితం ఉండబోదు.

దీనికి విరుద్ధంగా ఆధ్యాత్మజీవనం మానవచైతన్య మార్పు నుండి వేరుగా ప్రారంభమవుతుంది. భగవంతుడి నుండి, ఆత్మ నుండి విడివడిన అజ్ఞానమయ చైతన్యము నుండి వచ్చే మార్పు అది. తన నిజమైన ఆత్మ భాసించే ఉన్నతతరమైన చైతన్యంలోకి మారాలి. మొదట అది భగవంతునితో సంసర్గం ఏర్పడి, భగవంతునితో సంయోగం చెందడం ఆధ్యాత్మ జీవన లక్షణం.

ఆధ్యాత్మ జీవన అన్వేషణకు ఈ చైతన్య పరివర్తననే కోరతాడు. మిగిలిన విష యాలు అతనికి పనికిరావు.

నైతికత సామాన్య జీవనంలో భాగం. కొన్ని మానస నియమాలతో బాహ్య ప్రవర్తనను ప్రభావితం చేసే ప్రయత్నం అది. ఆ మానవ ఆదర్శపు వెలుగులో ఈ నియమాల ద్వారా శీలాన్ని రూపుదిద్దుకోవడం ఇందులో భాగం. ఆధ్యాత్మజీవనం మనసును అధిగమిస్తుంది. పరమాత్మ ప్రగాఢ చైతన్యంలోకి ప్రవేశించి, పరమాత్మ సత్యాన్ని అనుసరించి నిర్వర్తిస్తుంది.

నైతిక జీవనం, భగవంతుని సిద్ధి పొందటానికి సంబంధించి, జీవన ఆశయాల సాఫల్యం అంటే ఏమిటి అన్నదానిపై అది ఆధారపడి వుంటుంది.

ఆధ్యాత్మిక జీవనం అందులో ఒక భాగమైతే, కేవలం నైతికత దానిని నీకు అందివ్వలేదు.

*

లేఖలో ప్రస్తావించిన పూజ ధర్మజీవనానికి సంబంధించినది. ప్రగాఢమైన మతస్ఫూర్తితో ఆ పూజ సరిగ్గా చేసినట్లయితే, మనస్సును, హృదయాన్ని కొంతవరకు, పూర్తిగా కాదు, సంసిద్ధం చేస్తుంది.

ధ్యానంలో భాగంగా, లేదా ఆధ్యాత్మిక సత్యం, ఆధ్యాత్మిక చైతన్యం వైపు నిజమైన ఆకాంక్షతో, భగవంతునితో సంసర్గ, సంయోగాలను ఆశిస్తూ పూజ చేస్తే, అది ఆధ్యాత్మికంగా ప్రభావం చూపుతుంది.

నీ హృదయంలో, నీ మనస్సులో ఆధ్యాత్మిక మార్పు రావాలని నిజాయితీగా ఆకాంక్షించినట్లయితే, నీకు మార్గం కనిపిస్తుంది. నీకు మార్గం చూపే మార్గదర్శి లభిస్తాడు. పరమాత్మ మణిద్వారాలు తెరవడానికి కేవలం మానవ అన్వేషణ, ప్రశ్నల పరంపర చాలవు.

*

మన పరిమిత, మర్త్య ఆత్మల కన్న ఉన్నతమైన, మహనీయమైన ఏదో శక్తి, అస్తిత్వం ఉన్నదన్న భావంతో, ఆ శక్తిని పూజించాలన్న ఆలోచన, కార్యాచరణతో, ఆ శక్తి సంకల్పం, శాసనాలు, ఆజ్ఞలకు బద్ధులమై ఉండడం వంటి భావాలతో మతం ప్రారంభమవుతుంది. కాని మతం ప్రారంభంలో ఆ విధంగా భావించిన, పూజించిన, శిరసావహించిన శక్తికి, పూజించే భక్తునికి మధ్య అంతులేని అగాధాన్ని సృష్టిస్తుంది. యోగం చివరి దశలో ఈ అగాధాన్ని రూపుమాపుతుంది. యోగం అంటే సంయోగం. జ్ఞానం ద్వారా దానితో సంయోగం చెందుతాం. దాని పట్ల మనకుగల అస్పష్ట భావాలు స్పష్టమయి, విస్తృతమై, ప్రగాఢమైన కొలదీ, దానిని మన అత్యున్నత ఆత్మగా, మూలాధారంగా, మన అస్తిత్వ పోషకురాలిగా గుర్తిస్తాం. కర్మల ద్వారా దానితో సంయోగం చెందడానికి మనం పురోగమిస్తాం. దాని సంకల్పంతో మన సంకల్పం సాయుజ్యం చెందడానికి తొలుత శిరసావహించి, ప్రయత్నిస్తాం. మన మూలం, ఆదర్శము అయిన శక్తితో సాయుజ్యం చెందిన మేరకు, ఆ నిష్పత్తి

ప్రకారం, మన సంకల్పం పరిపూర్ణమవుతుంది, దివ్యమవుతుంది. పూజ, ఆరాధన ద్వారా కూడా మనం ఆ శక్తితో సాయుజ్యం చెందవచ్చును. సుదూరమైన పూజ అనే ఆలోచన కర్మాచరణ ద్వారా మరింత సన్నిహితమైన పూజ అవసరాన్ని పొందవచ్చును. ఇది ప్రగాఢమైన ప్రేమతత్వంగా మారుతుంది. ఈ ప్రేమ పర్యవసానం భగవంతునితో పూర్ణసాయుజ్యం.

*

మతం లేక ధర్మంలో రెండు అంశాలున్నాయి. నిజమైన మతం, మతతత్వం. నిజమైన మతం ఆధ్యాత్మికం. ఆత్మ వెలుగులో జీవించాలని కోరుకోవడం. మేధ, రసాత్మక, నైతిక, ఆచరణాత్మక అస్తిత్వానికి దూరంగా జీవించడం. ఈ భాగాలను ఉన్నత ప్రకాశంతో నియమాలతో ప్రభావితం చేయాలి.

దీనికి విరుద్ధంగా మతతత్వం అంటే అస్తిత్వంలో నిమ్నభాగాలను సంకుచితమైన సాధుభావోద్వేగాలలో చిక్కుకోవడం — మేధోపరమైన పిడివాదం, రూపాలకు, ఉత్సవాలకు, నిర్ణీతమైన, కఠినమైన నైతిక విధానానికి, మత రాజకీయ, మత సాంఘిక పద్ధతులకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది.

అయితే అవి నిర్లక్ష్యం చేయదగినవి కావు, విలువలేనివి కావు, అనవసరమైనవి కావు. ఒక ఆధ్యాత్మికమైన మతం రూపాలు, ఉత్సవాలు, మతశాఖలు, మతశాఖల వ్యవస్థల్ని ద్వేషించకూడదు. దీనికి విరుద్ధంగా, మనిషికి అవి అవసరం. అస్తిత్వపు నిమ్న భాగాలను ఉద్వేగభరితం చేయాలి. ఉన్నత స్థాయికి చేర్చాలి. వాటిని తరువాత ఆధ్యాత్మీకరించాలి. ఆత్మను నేరుగా అనుభూతికి తెచ్చుకొని, దాని నియమాలను శిరసావహించడానికి ముందు అవి అన్నీ అవసరమే. ఆలోచించి, హేతువు ప్రకారం జీవించే మనస్సుకు మేధాపరమైన ఒక సూత్రం కావాలి. అస్తిత్వపు నిమ్నభాగాల రసదృష్టికి ఒక రూపం, ఉత్సవాలు అవసరం. మనిషి ప్రాణిక స్వభావం అంతర్గత ఆధ్యాత్మజీవనం వైపు తిరిగేటందుకు, ఒక నిర్ణీత నైతిక సూత్రాలు కావాలి. ఇవన్నీ ఆధారాలు, సహాయపడేవి మాత్రమే అసలు సారం కాదు. అవి హేతువు, అల్పహేతువుతో నడిచే భాగాలకు చెందినవి. వాటికి అంతకు మించి ప్రయోజనం లేదు. అవి కావాలని గుడ్డిగా పట్టుబడితే, అతిమానస కాంతి ప్రవాహానికి అడ్డుపడతాయి.

శ్రీఅరవిందులు

అనువాదం: యజ్ఞన్న

ధర్మమంటే ఏమిటి?

తనకు అతీతంగా ప్రయాణించడం, తన అస్తిత్వపు భౌతిక విషయాలకు అతీతంగా ప్రయాణించడానికి మొదటి ప్రయత్నం మతం (ధర్మం). ఒక అనంతం యొక్క తన అంతర్ముఖత్వపు స్వరూపాన్ని ధృవీకరించడం, తనకు సత్యంగా రూపుదిద్దడం మతం చేసే మొదటి ప్రధాన పని. ఆ అనంతంపై అతని భౌతిక, మానసిక అస్తిత్వం ఆధారపడి వుంటుంది. ఆ అనంతం సాన్నిధ్యంలోకి ప్రయాణించడానికి ఆత్మ ఆకాంక్షించడం, దానితో సంపర్కం పెట్టుకుని జీవించడం ఆ అస్తిత్వంలో భాగాలు.

తనను తాను అధిగమించి, శరీర జీవనం, మర్త్యత్వం నుండి వికాసం పొందడం, అద్భుత జీవనమాధుర్యంలోకి, ఆధ్యాత్మ జీవనంలోకి ఎదగడం గూర్చి మనిషి కలలు కంటుంటాడు. మతం ఆ అసాధ్యాన్ని సాధ్యం చేస్తుంది. ప్రస్తుతం అతను జీవిస్తున్న లోకం కాకుండా, ఇంకా ఎన్నో ప్రపంచాలు, భూమికలు వున్నాయని మతం హామీ ఇస్తున్నది.

ఆ ప్రపంచంలో ఈ మర్త్యత్వం, బాధలు, దుష్టశక్తులకు లొంగిపోవడం అంటూ జరగదు. అమృతత్వపు ఆనందం శాశ్వతంగా నిలిచి వుంటుంది. ఏతావాతా, అమృతత్వానికి సన్నద్ధం చేసే మర్త్యజీవన సూత్రాన్ని మతం అందచేస్తుంది.

అతను ఆత్మ, శరీరం కాదు. ఆధ్యాత్మిక అస్తిత్వపు భవిష్యత్ స్థితిగతులను నిర్ధారించే ఉపకరణం భువన జీవనం. ఇదంతా అన్ని మతాలకు చెందినదే. ఇంతకు మించి, మతం ఏ నిశ్చయతత్వం పైన భరోసా ఇవ్వదు, వాటి మాటలు భిన్నంగా ఉంటాయి. భూమి మీద జీవనం మనకు లభించే ఒకే ఒక అవకాశం అని, భవిష్యత్తును నిర్ధారించుకోడానికి, గతకాలపు ఆత్మ అమృతత్వాన్ని త్రోసిపుచ్చి, భవిష్యత్ అమృతత్వాన్ని మాత్రమే నిర్ధారించడానికి మన జీవితం ఉపకరిస్తుంది.

సన్మార్గాన్ని కోల్పోయినవారు భవిష్యత్తులో అనంత బాధలకు గురికాక తప్పదని పిడివాదంతో ఆ మతం భయపెడుతుంది. మరింత విస్తృతమైన, హేతుబద్ధమైన మతాలు ఉన్నాయి. జన్మల పరంపర ఒకటి ఉందని, మనం అనంత విజ్ఞానంలోకి ఎదగవచ్చని, అనంతంలో చిట్టచివరి ప్రస్థానం, పరిపూర్ణత్వం లభించగలవని ఆ మతాలు హామీ ఇస్తున్నాయి.

మరి కొన్ని మతాలు అనంతం మనకన్న భిన్న మైనదని ఆ అస్తిత్వంతో వ్యక్తిగత

సంబంధాలు పెట్టుకోవచ్చని చెబుతున్నాయి. అమూర్త అస్తిత్వం ఒకటి వుందని, దానిలోనికి విడిగా వున్న మన ఆత్మ విలీనం కావచ్చునని కొన్ని చెబుతాయి.

అతీత ప్రపంచాలు మన తుది గమ్యం అని, భగవంతుని ప్రత్యక్ష సాన్నిధ్యంలో మనం ఆలోచనలలో జీవించవచ్చునని, అనంతంలోకి విలీనం కావడంతో ప్రపంచ అస్తిత్వం అంతరిస్తుందని మరి కొన్ని మతాలు చెప్పాయి.

భువన జీవనాన్ని ఒక పరీక్షగా, తాత్కాలిక బాధగా, భ్రమగా భరించాలని, లేదా పరిత్యజించాలని అతీతంపై ఆశలు పెట్టుకోవాలని చాలా మతాలు చెప్పాయి. మనిషి సామూహిక జీవితంలో ఈ శరీరంలో భగవంతుడు, ఈ భూమిపై పరమాత్మ భవిష్యత్ విజయం సంభవిస్తుందని కొన్ని మతాలలో సూచనలు కనిపిస్తాయి. వ్యక్తి ఆశా ఆకాంక్షలకు మాత్రమే కాకుండా, జాతి సమైక్య ఆశ, ఆకాంక్షను సమర్థిసున్నాయి.

మతం జ్ఞానం కాదు. ఒక విశ్వాసం, ఒక ఆకాంక్ష

ఉన్నత ఆధ్యాత్మిక సత్యాల అంతస్ఫూర్తి జ్ఞానం. మామూలు జీవితానికి అతీతంగా ఎదిగిన ఆత్మల అనుభవం అటువంటి అభిప్రాయాన్ని సమర్థించాయి. పరమాత్మ రహస్య తీరాలు, ఉన్నత వాస్తవాలను పొందడానికి ఆకాంక్షించేందుకు ఆశ, విశ్వాసం మాత్రం మతం అందిస్తుంది.

ఒక మతంలోని ఒక నిర్దిష్ట శాఖలోని విస్పష్ట సత్యాలను, ప్రతీకలను పిడివాదాలుగా మార్చడం మనం ఆధ్యాత్మిక జ్ఞానంలో ఇంకా పసిపిల్లలమని, అనంతం విజ్ఞానానికి ఇంకా చాలా దూరంలో ఉన్నామని నిరూపిస్తున్నది.

ప్రతి గొప్ప మతం వెనుక, సామాన్య విశ్వాసం, ఆశ, ప్రతీకలు పరిమితం చేసే పిడివాదాల చెదురుమదురు సత్యాలు వెనుక అంతర్గత ఆధ్యాత్మిక శిక్ష, వికాసం వంటి రహస్య విశేషాలు దాగి వుంటాయి.

ఆధ్యాత్మిక శిక్షణ ద్వారా రహస్య సత్యాలు తెలుసుకోవచ్చు. వాటిని ఋజువు చేసి, పొందవచ్చును. ప్రతి మతం వెనుక ప్రత్యేక జ్ఞానంగల యోగవిధానం వుంది. ఒక అంతఃస్ఫూర్తి జ్ఞానం వుంది. వాటికి దానిపై విశ్వాసం మొదటి సోపానం.

దానిలోని ప్రతీకలను వ్యక్తం చేయలేని వాస్తవాలు ఇమిడి వున్నాయి.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

ప్రశ్నలు — సమాధానాలు

ప్రశ్న: జపం, పవిత్ర గ్రంథపఠనం, పూజ మొదలగు మతాచారాలు దివ్యజీవనంపై ఆకాంక్ష కలిగియుండుటకు సంకేతాలు కావా? మహోన్నతమైన పరమ సత్యాన్ని చేరుటకు సహాయపడవా?

జవాబు: అది వాటిని ఆచరించుటలోగల స్ఫూర్తిపై ఆధారపడి వుంటుంది. ఒక వ్యక్తి వీటిని ఆచరించినప్పటికి ఆధ్యాత్మికతపై అనాసక్తుడుగానో లేక అసురప్రవృత్తి గలవాడిగానో వుండవచ్చు.

ప్రశ్న: తీర్థయాత్రలు చేయుటలోను, యెందరో దేవుళ్లను, దేవతలను పూజించుటలోను యేమైన ఆధ్యాత్మిక విలువ వున్నదా? దివ్య సత్యానుభూతిని పొందుటకు అది దోహదపడుతుందా?

జవాబు: దానికి, దివ్యసత్యానికి యెలాంటి సంబంధము లేదు. అది కేవలం సామాన్య చైతన్యం కోసం చేసే మతపరమైన అభ్యాసం.

ప్రశ్న: వైష్ణవులలో సర్వసాధారణమైన సంకీర్తనా సాంప్రదాయానికిగల ఆధ్యాత్మిక ప్రయోజనం యేమిటి?

జవాబు: దానికి భక్తి పారవశ్యతను యినుమడింపజేసే శక్తి యున్నది — ముఖ్యంగా దేహంలోని ప్రాణిక భాగాలలో.

ప్రశ్న: కుటుంబసభ్యులలో యే ఒకరికైనా దైవసాక్షాత్కారం కలిగినట్లయితే, మిగతావారికి దాని ప్రభావం చేత ముక్తి లభిస్తుందని కొన్ని పవిత్ర గ్రంథాలలో చదివాను. ఇది యెంత వరకు నిజం?

జవాబు: ఇది నిజం కాదు. ఎవరి భవితవ్యం వారిదే. ఒక జన్మలో ఒక కుటుంబంలో జన్మించడం కేవలం ఒక సంఘటన మాత్రమే.

ప్రశ్న: ప్రాపంచిక విషయాలలో మునిగి మనుగడ సాగిస్తున్న మనుషులకు దైవాన్ని కేవలం కష్టకాలంలోనో, విపత్కర సమయాలలోనో స్మరించినట్లయితే, వారికి పూర్తిగ దైవం వైపు మరలే వీలుంటుందా?

జవాబు: అలాంటి భావి సంభావ్యత ప్రతి ఒక్కరికి వున్నది — నాస్తికుడికైనా లేక దైవాన్ని యేనాడు స్మరించనివాడికైనా.

ప్రశ్న: నాస్తికుడికి, దైవాన్ని యెన్నడూ స్మరించనివాడికి కూడ దైవం వైపు

పూర్తిగా మరలే భావి సంభావ్యత వుంటే, యెవరైనా యెందుకని ఆధ్యాత్మిక జీవనంలో అడుగిడి కష్టాల పాలు గావాలి?

జవాబు: భావి సంభావ్యత ఓ వేయి సంవత్సరాల తదుపరి సాధ్యపడవచ్చునేమో! అప్పుడు కూడ అది యోగాభ్యాసం వల్లనే సిద్ధిస్తుంది.

ప్రశ్న: సామాన్య మానవులు ఆపత్సమయాలలో మాత్రమే దైవకృపను అర్థిస్తారు. కాని అటు పిమ్మట దైవాన్ని విస్మరిస్తారు. మనుషుల జీవితాలలో దైవకృప ఈ విధంగానే వర్తిస్తుందా?

జవాబు: సామాన్య మానవుల విషయంలోనే ఆ విధంగా వుంటుంది, దైవాన్వేషణలో నున్నవారి విషయంలో కాదు. దైవాన్వేషణాతత్పరులకే విశిష్టమైన దైవకృప లభించేది. ఇతరుల విషయంలో వారి వారి కర్మానుసారం ఈశ్వరేచ్ఛ పనిచేస్తుంది.

ప్రశ్న: దైవసంకల్పానికి, దైవకృపకు మధ్య తేడా యేమైనా వున్నదా? అవి రెండూ ఒకటి కావా?

జవాబు: దైవసంకల్పం అన్నింటా పనిచేస్తుంది. అది యెటువంటిదానినైనా సాధించి పెట్టవచ్చు. దైవకృప సహాయ మందించుటకు, రక్షణ కల్పించుటకు లభ్యమౌతుంది.

ప్రశ్న: మొత్తం జీవితకాలంలో యేనాడు కూడ దైవాన్ని స్మరించని వ్యక్తి అవసానదశలో మరణశయ్యపైన ఒక్కమారు దైవాన్ని స్మరించినా లేక ఆతని నామాన్ని ఉచ్చరించినా, అతనికి మరుజన్మలో ముక్తి లభిస్తుందనే నమ్మిక ఒకటి ప్రాచుర్యంలో వుంది. ఆ నమ్మికలో సత్యం యేమైనా వుందా?

జవాబు: లేదు. అదంతా ఒట్టి మూఢనమ్మకం. ముక్తి లభించటం అంత సులభసాధ్యమైతే, ప్రతి ఒక్కరు జీవితమంతా విశృంఖలంగా గడిపి, కేవలం అంత్యకాలంలో దైవస్మరణ గావించామనే నెపంతో ఉత్తమగతిని పొందవచ్చు. అది ఒక వెర్రి అభిప్రాయం.

ప్రశ్న: మరోలోకంలో నరకాలు వేనకు వేలుంటాయని, ఈ జన్మలో చెడుకర్మలు చేసినవారు మరణానంతరం ఆ లోకానికి వెళ్ళి కాలం గడపాలని పురాణాలు ప్రవచిస్తున్నాయి. ఇది నిజమేనా?

జవాబు: ఇది ఒక మూఢనమ్మకం. మరణానంతరం మనుషులు కొన్ని ప్రాణిక, మానసిక లోకాల ద్వారానో లేక కొన్ని మానసిక స్థితుల ద్వారానో కొనసాగవలసి వుంటుంది. ఆ స్థితిగతులు జీవితంలో వారి కర్మాచరణ ప్రయోజనా ఫలితాలు.

అటు పిమ్మట వారు చైత్య లోకాలకు చేరుకొని తరువాతి కాలంలో పృథ్వీతలానికి తిరిగి వస్తారు.

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి జానికి

(Elements of Yoga Chapter XIV)

మతోన్మాదం

మతోన్మాదంలో ఉదాత్తమైనదంటూ యేమీ లేదు. ఉద్రేకపూరిత ఉత్సాహంతో కూడిన అభిప్రాయం వుండవచ్చునేమోగాని ఔదార్యవంతమైన భావన లేదు. మతోన్మాదం మానసికంగా అల్పమైన పుట్టుక గలది, అజ్ఞానభరితమైనది. సాదారణంగా దాని కార్యాచరణ ఉగ్రమైనదిగ, క్రూరమైనదిగ, నీచమైనదిగ వుంటుంది. ధర్మానికై ప్రాణాలొడ్డే అమరవీరుడి కుండే మతపరమైన తీవ్రత ఈ రకమైనది కాదు, మరో కోవకు చెందినది.

పరమ సత్యాన్ని మాత్రమే కోరుతున్నానని అంటున్నావు. అయినా నీవు జన్మించిన మతాన్ని తప్ప వేరొకదానిని నమ్మని సంకుచిత, అజ్ఞాన దురభిమానిగా మాట్లాడుతున్నావు. అన్ని రకాల దురభిమానం వట్టి బూటకం, కారణం, అది పరమ సత్యానికి దైవప్రవృత్తికి విరుద్ధమైనది కాబట్టి. పరమ సత్యం ఒక గ్రంధానికో, ఒక బైబిలుకో, ఒక వేదానికో, ఒక ఖురానుకో లేక ఒక మతానికో పరిమితమై, అందులోనే నిక్షిప్తమై వుండదు. దైవం నిత్యుడు, విశ్వగతుడు, అనంతుడు. ఆతడు కేవలం ముసల్మానులకో, లేక సెమిటిక్ మతాల — అనగా బైబిల్ వారసత్వానికి చెందిన యూదులు, అరబ్బుల తెగకు చెందిన ప్రవక్తలను ఆద్యులుగ యెంచినవారు — ఏకైక సొత్తు కాడు. హిందూ, కన్‌ఫ్యూషియస్ మరియు టావో మతస్థులకు, యితరులకు కూడ దైవంతో సంబంధం యేర్పరుచుటకు, పరమ సత్యమేదో తమదైన మార్గంలో కనుగొనుటకు, వారి కెంత హక్కున్నదో వీరికీ అంతే వుంటుంది. అన్ని మతాలు యెంతో కొంత సత్యం కలిగి వున్నాయి, కాని దేనికిని సంపూర్ణ సత్యాన్ని పొందగల స్థోమత దక్కలేదు. అన్ని మతాలు కాలానుగుణంగా యేర్పడినవే, అన్ని చిట్టచివరకు

క్షీణించి నశించాల్సినవే. మహమ్మద్ ప్రవక్త స్వయంగా ఖురాను ఒక్కటే దైవ ప్రచోదిత అంతిమ సందేశమని, మరొకటుండబోదని అనలేదు. దైవము, పరమ సత్యము రెండునూ మతాలనన్నింటిని అధిగమించి, అధిక కాలం మన్నుతాయి. దివ్యసంకల్పం యే మార్గంలో, యే రూపంలో క్రొత్తగా ఆవిష్కృతం కావాలని యెంచుకుంటే, ఆ విధంగా పునరావిష్కృతమౌతాయి. దైవాన్ని నీ స్వీయ సంకుచిత బుద్ధి పరిధుల్లో బంధించలేవు. అలాగే దివ్యశక్తిని, దివ్యచైతన్యాన్ని యెలా, యెప్పుడు, యే మాధ్యమం ద్వారా ఆవిష్కృతమవ్వాలో ఆదేశించలేవు. దివ్యమైన అనంతశక్తిని అడ్డుకొనుటకు దుర్బలమైన అడ్డంకులను నిర్మించలేవు. ఇవన్నీ ప్రపంచమంతటా ప్రస్తుతం గుర్తింపునొందిన సాధారణ సత్యాలు. మానసికంగా శైశవావస్థలోనే కొట్టుమిట్టాడుతున్న వారు లేక గతకాలపు నమ్మకాలనే పట్టుకుని వ్రేలాడుతున్నవారు మాత్రమే ఈ సత్యాలను నిరాకరిస్తారు.

నేను సమాధాన మివ్వాలని, పరమసత్య మేమిటో తెలపాలని పట్టుబట్టావు. నేను సమాధానమిచ్చాను. అయితే నీవు ముసల్మానుగ మారాలనుకుంటే నిన్నెవరూ ఆపరు. నేను నీ కందించే సత్యం నీకు భరించడానికి గాని, అర్థం చేసుకొనుటకుగాని భారమనిపిస్తే, అర్థ సత్యంలోనో లేక నీదైన అజ్ఞానంలోనో జీవించే స్వేచ్ఛ నీకుంది. నేను యిక్కడున్నది యెవరినీ మార్చడానికి కాదు.

నీకు సమాధాన మిచ్చుటలో, చీకటి శక్తులు నీలో చొప్పించిన అజ్ఞానపు ఊహాగానాలేవైతే నిన్నుతమ స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయో వాటికి కూడ సమాధానమిస్తున్నాను. నిన్నే శక్తి ఆవహించిందో అది దివ్యశక్తి కాదని స్పష్టంగా తెలుస్తున్నది. అది అసత్యం యొక్క శక్తి. అది ఇస్లాం మతానికిచెందని అసంగత విషయాలను నీతో పలికిస్తున్నది, అలాంటి పనులను నీతో చేయిస్తున్నది. అది కేవలం ఇస్లాం మతవిశ్వాసాన్ని, దాని ఆచరణ పద్ధతిని, అతిగాను, వ్యంగ్యంగాను ఆవిష్కరిస్తున్నది. ఇస్లాం మతాన్నేగాక అన్ని ఆధ్యాత్మికమైన, మతపరమైన విషయాలను అసంగతమైనవిగా, హాస్యాస్పదమైనవిగా నీ ద్వారా నిరూపింపజేయాలని దాని వుద్దేశం. భువిపైన దైవకార్యాన్ని అస్థిరపరచాలని దాని ఆశ. ఆ దిశగా యే కొంత సాధించినా దాని ఆశ నెరవేరినట్టే. నీ మెదడును చెడగొట్టాలని, నీ మేథోశక్తిని నిర్వీర్యం చేయాలని, నీతో అవివేకపు పనులు చేయించాలని, అసంబద్ధమైన మాటలు పలికించా లని, నీ స్నేహితులు, నీ శ్రేయోభిలాషుల యెదుట నిన్నొక విచారగ్రస్తుడిగ,

కనికరించ బడవలసిన వ్యక్తిగా నిలపాలని, యితరులకు నిన్నొక పరిహాసపాత్రుని చెయ్యాలని ప్రయత్నిస్తున్నది. నీకు నీపైగాని, దైవంపైగాని, మతంపైగాని, యేపాటి గౌరవం వున్నా, పరమసత్యాన్ని, దివ్యతేజస్సును నిజంగా ఆశించినా, నీ ఆత్మ జాగృతి చెంది, నీకు ఆత్మవిమోచన సిద్ధించాలని కోరుకున్నా, ఈ అసందర్భపు పనులు చేయడం, అలాంటి మాటలు మాట్లాడటం మానాలి. నిన్ను ప్రస్తుతం ప్రేరేపిస్తున్న దుష్ప్రభావాన్ని దూరం చేయాలి.

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

SABCL 22: 490;CWSA 32: 109-10


పరాత్పరుని దివ్యసాక్షాత్కారం పొందిన అనంతరం ప్రపంచం లోనికి తిరిగి రాగలిగి, దానిని స్వాధీనం చేసుకోగలిగి వుండి, స్థితిలోని సోపానశ్రేణిని అధిరోహించగలిగి, అవరోహించగలిగినదే పూర్ణయోగం.

శ్రీఅరవిందులు

భారతమాత

నేటి సమస్యలు – భవిష్యత్ కర్తవ్యం

(I)



ప్రత్యేక సంచిక

అఖిల

అఖిల భారత పత్రిక

ఆగస్టు 2013

అఖిల

అఖిల భారత పత్రిక. ఆగష్టు 2013

ప్రత్యేక సంచిక

భారతమాత — సమస్యలు, పరిష్కారము

(శ్రీమాతారవిందుల రచనల సంకలనం)

దేశాన్ని కష్టాల నుండి గట్టెక్కించుటకు ఏం చేయాలి?

శ్రీఅరవిందులు కష్టాలన్నింటిని ముందుగానే పసిగట్టారు, పరిష్కారం సూచించారు. వారి శతాబ్ది ఉత్సవాలు త్వరలో జరుగబోతున్నవి. ఇది ముందుగానే చేయబడిన యేర్పాటు వలె అనిపిస్తుంది, ముందుగానే నిర్దేశించబడిన దైవసంకల్పంగా తోస్తుంది. ఎందుకనగా వారి ఉపదేశాలను దేశమంతటా వ్యాప్తి చెందించడానికి యిదొక అద్భుతమైన అవకాశం. అవి ఆచరణ సాధ్యమైన ఉపదేశాలు, భారతదేశాన్ని వుద్దేశించిన బోధనలు — భారతావనిని యెలా వ్యవస్థీకరించాలి, భారతదేశ కర్తవ్యం.... ప్రచార కార్యక్రమాన్ని మరింత పటిష్ఠంగా రూపొందించినట్లయితే వారి భావనా పరంపర విస్తృతంగా వ్యాప్తమయ్యేలా వారి ఉపదేశాలను దేశం నలుమూలలా వ్యాపింపజేయవచ్చు.

శ్రీమాత

(CWM Second Ed 15:405)

విషయసూచిక

భారతమాత — సమస్యలు, పరిష్కారము — I

జాతీయశక్తికి మూలం

ఆధ్యాత్మికత — శక్తిమంతమైన చైత్యపురుష ప్రవృత్తి

భారతీయ మనసు కీలకాంశం 'ఆధ్యాత్మికత' 'అనంతం' ఉన్నదనే వివేకం భారతీయ మనసుకి సహజలక్షణం. జీవితాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే ఏదో ఒక్క వెలుగే సరిపోదనీ, జీవితపు బాహ్యంలోని శక్తితో మాత్రమే పరిపూర్ణంగా జీవించలేమనే అంతర్దృష్టిని, హేతువాదయుగాలలో, అజ్ఞానం పెచ్చుపెరుగుతున్న కాలంలో కూడా భారతదేశం ఎన్నడూ కోల్పోలేదు. ఆది నుంచీ భారతదేశం ఈ దృష్టితోనే ఉంది.

అనేక యుగాల ఈ అంతర్దృష్టి, కార్యాచరణల వలన ఆమె (భారతదేశం) ఆధ్యాత్మికత, శక్తిమంతమైన చైత్యప్రవృత్తి, అనంతుడితో తలపడి అతనిని తనదిగా చేసుకోవాలన్న ఆమె తీవ్రమైన తపన, చెరిగిపోని ఆమె మతధర్మబుద్ధి, ఆమె ఆదర్శం, ఆమె యోగం, ఎప్పటికప్పుడు కొత్తపుంతలు తొక్కే ఆమె కళ, ఆమె తాత్త్వికతలు ఆమెలో జీర్ణించుకున్నాయి.

(CWSA. 20:6-7)

శ్రీఅరవిందులు

సమృద్ధమైన సృజనాత్మకత — పుష్కలమైన శక్తి

స్వప్నంలో మాయగా కనిపించినట్టు, ఒక ఆధారం లేకుండా శిఖరాగ్రాలు మేఘాలపై ఎదగనట్లుగా, భువిలో ఆధ్యాత్మిక శూన్యంనించి వృద్ధిచెందదు. భారతదేశపు గతాన్ని చూస్తే ఆమె అద్భుతమైన చేతనత్వం, తరిగిపోని జీవశక్తి, జీవితానందం, ఊహాతీత మైన సమృద్ధమైన సృజనాత్మకతలు స్ఫురిస్తాయి. మూడువేల సంవత్సరాల వరకు, ఇంకా అంతకు ముందునించీ కుడా, ఆమె పుష్కలంగా, నిరంతరాయంగా, అత్యధికంగా, అక్షయమైన బహుముఖీనంగా సృష్టిస్తూనే ఉంది. అవి — ప్రజాప్రభుత్వాలు, రాజ్యాలు, సామ్రాజ్యాలు, తత్త్వశాస్త్రాలు, విశ్వోత్పత్తి సిద్ధాంతాలు, విజ్ఞానశాస్త్రాలు, మతాలు, కళలు, కవిత్వాలు, అన్నిరకాలైన స్మారకనిర్మాణాలు, భవనాలు, ఆలయాలు, ప్రజోపయోగ కార్యక్రమాలు, సాంఘిక సంస్థలు, సమాజాలు,

మతవ్యవస్థలు, ధర్మాలు, స్మృతులు, ఆచార సాంప్రదాయలు, భౌతికశాస్త్రాలు, మనోవైజ్ఞానిక శాస్త్రాలు, యోగవిధానాలు, రాజకీయ వ్యవస్థలు, పరిపాలన, ఆధ్యాత్మిక కళలు, ప్రాపంచిక కళలు, వాణిజ్యాలు, పరిశ్రమలు, మేలిరకపు ప్రవృత్తులు, ఇలా, అంతులేని జాబితా తయారవుతుంది. పై అంశాలన్నింటిలో బ్రహ్మాండమైన కర్మ కలాపం జరుగుతోంది.

(CWSA 20:7-8)

శ్రీఅరవిందులు

భారతదేశం — ధర్మానికి, శాస్త్రాలకి నెలవు

భారతదేశం ధర్మానికీ, శాస్త్రానికీ సర్వోత్కృష్టమైన నెలవు. ప్రతి మనిషికీ చెందిన అంతరంగ సత్యాన్నీ, ధర్మాన్నీ; విశ్వగత కర్మకలాపాన్నీ, దాని ధర్మాన్నీ ఆమె అన్వేషించింది. దానిని కనుగొన్న తరువాత, దాన్నంతటినీ విస్తృతరూపంలో ఉంచేందుకూ, సమగ్ర ధర్మాన్ని ఏర్పాటు చేసేందుకూ, యదార్థ జీవితంలో, జీవనసూత్రంలో ఉపయోగించేందుకూ ఆమె శ్రమించింది. ఆత్మని కనుగొనడంతో ఆమె ప్రథమదశ ప్రకాశవంతమైంది. ధర్మావిష్కరణతో ఆమె రెండవ దశ పూర్తయింది. మూడవదశ, శాస్త్రాన్ని విస్తృతంగా, సమగ్రంగా, సులభపద్ధతిలో సూత్రీకరించడం. ఈ మూడింటిలో ఏ ఒక్కటి వేరుగా కాక, ఈ మూడంశలూ (ఆత్మ, ధర్మము, శాస్త్రము) ఎప్పుడూ కలసి ఉంటాయి.

(CWSA 20:9)

శ్రీఅరవిందులు

భారతదేశం — రెండు విపరీత ధోరణులను సఖ్యపరచగల దేశం

జీవితంలో — సుఖప్రదమైన జీవనం, పేదరిక జీవనం అన్న రెండు ఆదర్శాలు రెండు విపరీత ధోరణులకి దారితీశాయి. ఒకటి — రాజభోగాలతో జీవనాన్ని గడపడం, రెండు — కట్టుబట్టలేని కటిక పేదరిక జీవనాన్ని సహించటం. భారతదేశపు అంతరంగ ప్రవృత్తులు ఎంత సుస్పష్టమైనవి, సాహసోపేతమైననవిగా, అవి జీవితం యొక్క స్వీయభావాలతో, స్థిరమైన అలవాట్లతో తనను తాను గుడ్డిది కాకుండా కాపాడగలవు... రాచరిక వ్యవస్థను గొప్పచేసి, రాజు దైవాంశసంభూతుడని చాటి, అంతకు ముందున్న

పట్టణ గణతంత్ర వ్యవస్థను స్వతంత్ర ప్రజాప్రభుత్వ రాష్ట్రాల సమాఖ్యలను రద్దు చేయటంలో, భారతదేశపు రాజకీయ అవసరాలు నిర్బంధించినప్పటికీ, ప్రజాస్వామ్యాన్ని పెంపొందించకపోయినప్పటికీ, భారతదేశానికి ప్రజాస్వామ్యభావన ఉంది. ప్రజాస్వామ్య పద్ధతిని గ్రామంలో, సమితిలో, పురపాలక సంఘంలో, కులంలో అమలుపరిచింది. ప్రజలలో దైవత్వముందని ప్రప్రథమంగా నినదించినది భారతదేశం. శక్తిమంతుడైన రాజును "ఓ రాజు! నువ్వు కేవలం ప్రజలకు సేవకుడివి మాత్రమే" అని ఎలుగెత్తి చాటింది. భారతదేశ భావనలో "స్వేచ్ఛాయుతమైన ఆధ్యాత్మిక విశృంఖలత" వచ్చినప్పుడే అది స్వర్ణయుగం. ఇంద్రియ జీవనం, దాని ఆనందాలు — అందులోనూ భారతదేశం అత్యంత సుసంపన్నమైన ఇంద్రియసౌఖ్యాన్ని సమగ్రంగా, ఇంద్రియానుభవానికి సంబంధించిన లోతులనూ, గాఢతలను అన్వేషించింది. భారతదేశపు విపరీతమైన ఆధ్యాత్మికత అనేక యుగాలుగా ఉన్న ఇంద్రియానుభవ జీవితాన్ని తరిచి చూడడాన్ని ఆపలేకపోయింది. ఇక్కడ ఒక విషయాన్ని గ్రహించాలి. పైన వివరించిన రెండు విపరీత ధోరణులను (ఆధ్యాత్మికత, ఇంద్రియానుభవము) జీవితంలో అనుసరించడం వలన అల్లకల్లోలం ఏర్పడలేదు. ఇంద్రియసుఖవాద ధోరణి యూరప్‌లో వచ్చినపుడు, అక్కడ అడ్డూ అదుపూ లేని దుర్నీతి అనేకసార్లు ప్రబలింది. భారతదేశంలో ఈ ఇంద్రియసుఖవాద దశ ఎటువంటి దుర్నీతికీ తావు ఇవ్వలేదు. దీనికి కారణం — భారతీయ మానసం ఆధ్యాత్మికము, నైతికము మాత్రమే కాదు, మేధోవంతము, కళాత్మకము. మేధోనియమము, సౌందర్యలయలు రెండూ గందరగోళ పరిస్థితికి ప్రతికూలములే. ప్రతి విపరీత ధోరణిలో కూడా భారతీయ ఆత్మ అన్వేషించి, దాని ఉపయోగంలో ఒక నియమాన్ని, పరిణామాన్ని, నిర్మాణాన్ని వెతుకుతుంది.

భారతదేశ పతనానికి కారణం

భారతీయులలో అధిక శాతం నిజంగా వారి జీవితాలను సంపూర్ణంగా నిర్మాణం చేసికొని ఉండి ఉంటే, మనం ఇప్పుడున్న ఈ స్థితిలో ఉండేవారం కాము. ప్రజాజీవితం, మతధర్మ విరుద్ధంగా, అహంకారపూరితంగా, తనని గురించి మాత్రమే ఎవరికి వాళ్ళు ఆలోచించుకోవడం వల్ల భౌతికపరమైన జీవన విధానానికి పరిమితమవడం వల్ల భారతీయులు పతనమయ్యారు. మనం అతిగా, మితిమీరిన మతవిశ్వాస మార్గంలోకి దారిమళ్ళాము. అనగా మితమీరిన బాహ్యంలో చేసే ఉత్సవాలు,



సురత్ లో జరిగిన ఇండియన్ నేషనల్ కాం(గెసు అఖిల భారత సమావేశం
డిసెంబరు, 1907

కాం(గెసులోని మితవాద మరియు జాతీయవాద వర్గాల విభజన అనంతరం, డిసెంబర్, 1907 లో సూరత్ లో జరిగిన జాతీయ సమావేశానికి శ్రీఅరవిందులు అధ్యక్షత వహించారు. పై చిత్రంలో శ్రీఅరవిందుల కుడిప్రక్కన జి. యస్ ఖపర్దే, ఎడమ ప్రక్కన ప్రసంగిస్తున్న బాలగంగాధర్ తిలక్.

పద్ధతులు, నిత్యకృత్యాలు యాంత్రికమైన పూజాపునస్కారాలు ఒక పక్క, మరొక పక్కన, ప్రపంచాన్ని వదిలిపెట్టిపోవాలన్న సన్యాసభావన ఉన్నతమైన మనసులను లాగేసుకుంది. సనాతన ఋషులలాగా సమాజానికి ఆధారంగా ఉంటూ జ్ఞానప్రకాశ జీవితాన్ని ఇచ్చేవాళ్ళుగా ఉండడానికి బదులు, ఉన్నతులైనవాళ్ళందరూ సమాజానికి దూరమైపోయారు. అసలైన మూలకారణం — సాధారణత్వంలో, సమగ్రత్వంలో ఆధ్యాత్మికత సన్నగిల్లడం, మేధస్సుకు చెందిన కర్మకలాపం స్వేచ్ఛలు క్షీణించడం, ఉన్నతాదర్శాలు నశించడం, జీవన సారభాన్ని లేదా జీవితంలోని రసానుభూతిని కోల్పోవడం.

(CWSA 20:39)

శ్రీఅరవిందులు

అనువాదం డా. తెన్నేటి నాగరంజని

మార్పుకోసం ఆక్రందన

సామాజిక సంస్కరణ ఆవశ్యకత

సాంప్రదాయకుల వైఖరి చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. వారు ఉన్న ప్రతిదానినీ దైవానికి తుల్యమైనదానిని చేయడానికి శ్రమపడుతుంటారు. హిందూసమాజానికి నిర్దుష్టమైన పద్ధతులు, అలవాట్లు ఉన్నాయి. అవి కేవలం వాడుకలో ఉన్న ఆచారాలు, కట్టుబాట్లు. అవి ప్రాచీనకాలంలోనూ ఉన్నాయనేదానికి దాఖలాలు లేవు. సరికదా అవి భవిష్యత్తులో కూడా ఉంటూనే ఉంటాయనేదానికి హేతుబద్ధతా కనిపించదు.... ప్రాచీనతకుగాని, లేక ఆధుకతకుగాని గురుతు అనేదేదీ సత్యనిరూపణకు లేక ఉపయోగ కరమనేదానికి పరీక్ష కాబోదు. ఋషులందరూ గతకాలానికి సంబంధించినవారు కాదు; భగవంతుని అవతారాలు ఇంకా వస్తూనే ఉంటాయి; దివ్యజ్ఞానావతరణం ఇంకా కొనసాగుతూనే ఉంటుంది.

ఇదే విధంగా కేవలం వాడుకలో ఉన్న ఆచారాలను కట్టుబాట్లను తెలివితక్కువగా ఇంకా పట్టి ఉంచటానికి చెప్పే సాకులు ఉన్నాయి. తమ మాటలను సమర్థించుకోవడానికి ఎన్నో విధాలైన వాదనలున్నాయి కాని వాటిల్లో దర్పం ఉట్టిపడే నిశ్చయాత్మకమైన

వాదన ఏదైనా ఉన్నదేమో నాకు తెలియదు. వాడుకలో ఉన్న ఆచారాలను, కట్టుబాట్లను శిష్టాచారం అంటాం. దానినే సభ్యతగా చక్కని సంప్రదాయం సంస్కారంగల కుటుంబంలో జన్మించిన గౌరవమర్యాదలుగల జనులందరూ పాటిస్తారు. అదే విధంగా చాలా పురాతనకాలంలో మానివేయబడిన ఆచారాలను, కట్టుబాట్లను ఇప్పుడు పునరుద్ధరిస్తే, అవి తీవ్రస్థాయిలో నిరాకరించబడతాయి. చాలా సందర్భాలలో దండనకూ పాత్రమవుతాయి. అదే విధంగా, భవిష్యత్తులో అనుసరించవలసిన ఆచారాలను, కట్టుబాట్లను అడ్డుకోబోయినా లేదా నిరుత్సాహపరచినా అంతే — ఇంకా, గతంకంటె తక్కువకాని భవిష్యత్తు మనకోసం జీవనంలో కొత్తపుంతలను, తీరుతెన్నులను తయారుచేస్తుందనేదానిని విశ్వసించటానికి నేను తయారుగా ఉన్నాను. అది కూడా ప్రస్తుత కాలంలో చట్టంయొక్క అభిశంసనను తప్పించుకోజాలదు.... చాలాకాలంగా కొనసాగించబడుతున్న ఆచారాలు, కట్టుబాట్లు అన్నీ ఆయా కాలాలలో చాలా గొప్పగా ఉపయోగపడ్డాయి — వంశాన్ని సూచించే జంతుసంబంధమైన బొమ్మలు ధరించే ఆచారం, బహుభర్తృత్వాలతో సహా. గతకాలంలో ఉపయోగపడినవాటిని విస్మరించరాదు. కాని ఇప్పటి కాలానికీ, భవిష్యత్తులోనూ ఉపయోగపడేవాటికి ప్రాధాన్యతనిస్తాం....

సాంప్రదాయకుడూ, సంఘసంస్కర్తకుడూ ఒకే విధంగా వివరణలను ఇచ్చే క్రమంలో తప్పటడుగు వేస్తారు; ప్రధాన సూత్రాలు వివరాలను నిర్ణయిస్తాయి కాని...

కలి (యుగం) అనేది వినాశనానికీ, పునర్జన్మకూ కాలం. మనల్ని ఇక ఏమాత్రం ఉద్ధరించబోని పాతవాటినే నిరాశానిస్పృహలతో పట్టుకుని వేలాడే కాలం కాదు.... ఏదైతే మనకి రక్షణ నిచ్చిందో అది కేవలం తాత్కాలికమైన గట్టు మాత్రమే, దానిని మనం మారిపోయేటటువంటి సముద్రపు ఒడ్డున కట్టి దానిమీద ఇంకా స్థిరైన నివాసం కోసం నిరీక్షిస్తున్నాం, అది కూడా ఒక రోజు అలల తాకిడికి పెళపెళారావాలతో ముక్కలు చెక్కలు కావలసినదే, ముంచివేసే సముద్రజలాలలో తప్పక అదృశ్యమైపోవలసినదే. ఆ వినాశనానికి కాలం సమీపించిందా? సమీపించిందనే మేము అనుకుంటున్నాం. హోరుమనే ధ్వనితో తగిలే ఆ నీటి తాకిడిని విను — మూకుమ్మడిగా చేసే దాడిధ్వనికంటే ఎక్కువగా భయంకరమైనది, మెల్లగా అకారణమైన ఆగ్రహంతో, కనికరమనేది లేకుండా సమూలంగా నాశనం చేసేదానిని తెలుసుకో — అతుకులతో అసంగతమై పొంతన అనేది లేక ఊగిసలాడే మన భవనఫలకాల దొంతరలు ఒకదాని

తరువాత ఒకటిగా తుప్పుపట్టి జీర్ణమైపోతూ, కిర్రుమని చప్పుడు చేస్తూ, దెబ్బల తాకిడికి వణకిపోతూ, పగిలిపోతూ, నిశ్శబ్దంగా లేదా సవ్వడి చేస్తూ హఠాత్తుగా లేదా నెమ్మది నెమ్మదిగా నీటిని చిందిస్తూ అలల నురగలో మునిగిపోవడాన్ని తిలకించు. నూతన నిర్మాణానికి సమయ మాసన్న మైనదా? అవుననే మేము అంటాం. ముందు వెనుకలకు పోతున్న మానవజాతి ఆ చురుకుతనం, ఆ తీవ్రాకాంక్ష, ఆ హడావుడినీ, శీఘ్రంగా ఫలాపేక్షకై భవిష్యత్తులోకి ఆశతో ముందుకు వెడుతూ, అన్వేషిస్తూ, నూతన భవననిర్మాణానికి పునాదులు వేయడాన్ని కనిపెట్టు — అవతారాలు, గొప్ప విభూతులు రావడాన్నీ, అసంఖ్యాకంగా జన్మించడాన్నీ, ఒకదాని వెనుక ఒకటి దగ్గర దగ్గరగా నడుస్తుండడాన్నీ గమనించు. ఇవన్నీ సూచనలు కావా, అన్నింటిలోకి మహా దివ్య ఆవతారం ఒకటి కలిపురుషుని మొదటి దివ్యసత్యయుగాన్ని స్థాపించడానికి వస్తున్నదని అవి తెలియజెప్పడం లేదా?

(CWSA 12:50-56)

శ్రీఅరవిందులు (1912)

సంపూర్ణ సత్యానికై వెనుకకు మళ్ళవలసిన అవసరం

ప్రాచీన హిందూమతం జీవితంలోని మన సామాజిక సాహచర్యాన్ని దైవంలో సఫలం చేసుకోవటం లక్ష్యం చేసుకుంది, అయితే ఆధునిక హిందూమత జీవితం నుంచి దైవానికి తప్పించుకుపోవడాన్ని లక్ష్యంగా చేసుకుంది.... మనం మన సమాజాన్ని పరిపూర్ణం చేయాలన్నా, దేశం తిరిగి జీవించాలన్నా, మనం మన పూర్వపు సంపూర్ణ సత్యానికై వెనుకకు తప్పక మళ్ళవలసినదే. మన జీవితాన్ని వైరాగ్యంతో త్యజించడానికి నిరీక్షించేదానినిగా ఎంతమాత్రం చేయకూడదు, కాని వైరాగ్యం జీవితాన్ని సన్నద్ధం చేయాలి; నగరిలోని దైవాన్ని వదలి అడవిలోని దైవం కోసం పరుగెత్తడానికి బదులుగా, మన సొంత ఆత్మలలోని ఎత్తైన కొండలలోని ఏకాంతవాసానికి జ్ఞానం, సంతోషం కోసం, ఏ పాత్రను పోషించమని ఆ లీలాప్రభువు మనలను అడిగినా దానిని నిభాయించ గల ఆధ్యాత్మికశక్తి కోసం మనం తప్పక ఒక్కసారిగా దూకవలసినదే. మనకు ఆ శక్తి లభించినప్పుడు, ఏ సమాజాన్ని మనం స్థాపించినా అది అమరజీవితానికి సంపూర్ణంగా అంతరంగం నుండి వచ్చే సహజప్రేరణగా తప్పక ఉండటమే కాకుండా, పరిపూర్ణత దిశగా తప్పక పయనిస్తుంది.... నాకొక విషయం స్పష్టమవుతున్నదనిపిస్తుంది.

భవిష్యత్తు వ్యక్తిగత స్వార్థమనే ప్రధాన తత్వాన్నే, ఐరోపా సమాజం ఇంతకు ముందు ఆధారం చేసుకున్న సమిష్టి స్వార్థపరత్వాన్నీ తిరస్కరిస్తుంది, పునర్నిర్మిత మైన మన విధానాలు వ్యక్తిగత స్వార్థాన్ని త్యాగం చేయడం మీద, సౌభ్రాతృత్వమనే వ్యవస్థ మీద ఆధారపడి ఉంటాయి — క్రైస్తవం, ఇస్లాం, హిందూమతా లన్నింటిలోనూ అవి సమానంగా ఉన్న ప్రధాన సూత్రాలు.

(CWSA 12:58)

శ్రీఅరవిందులు (1912)

ఔన్నత్యాన్ని కోల్పోయి అధోగతికి దిగజారిపోయిన వర్ణవ్యవస్థ సంస్కరణ

మానవ వ్యవస్థలు తమ ఔన్నత్యాన్ని కోల్పోయి పతనావస్థకు చేరడం వాటికి సహజం, జీవశక్తి కోల్పోవడం, క్షీణించి నశించిపోవడం, ఎటువైపుకైనా మలచబడగలిగిన సౌకుమార్యాన్ని కోల్పోవడంతో పాటు అత్యావశ్యకమైన ఏ ఆత్మశక్తిలో ఊహించి వాటికి రూపునిచ్చారో దాని విస్మృతీ క్షీణతకు మొదటి సూచన.... వర్ణవ్యవస్థ జవ సత్వాలుడిగి తన ఔన్నత్యాన్ని కోల్పోయి అధోగతికి దిగజారిందనటంలో సందేహం లేదు. ఒకప్పుడు అత్యావశ్యకమై, ఆధ్యాత్మిక యోగ్యతా ప్రాతిపదికను పొందిన వర్ణం గుర్తింపు ఇప్పుడు పోయింది, అది ఇప్పుడు అప్రధానమై తక్కువ స్థాయికి దిగజారిపోయింది, దాని అవసరమూ లేకుండా పోయింది, ఇప్పుడు పూర్తిగా భౌతిక పరంగా వృత్తి, జన్మలను పరీక్షించి వర్ణనిర్ధారణ జరుగుతున్నది. ఈ విధమైన మార్పు వలన అది పూర్తిగా హిందూమతం ప్రాధమికంగా ఉద్దేశించి, గట్టిగా నొక్కి చెప్పిన ఆధ్యాత్మికావశ్యకతకూ, దానికి భౌతికత లొంగి ఉండటం అనేదానికి తనకు తాను వ్యతిరేకమైపోయింది. ఆ విధంగా అది దాని అర్థాన్ని కోల్పోయింది. జన్మతః సంక్రమించిన వర్ణం వలన కలిగిన పొగరుబోతుతనం, ఇతరులను దరికి రానీయక పోవడం, ఆధిక్యతతో కూడిన అహంభావంతో కర్తవ్యతాపరాయణత్వానికి మారుగా తమ అధికారం చెలాయించడం మొదలైంది, ఈ మార్పు దేశాన్ని బలహీనపరచింది, మనలను ఇప్పుడున్న పరిస్థితికి దిగజారేటట్లు చేసింది. ఇటువంటి పెడధోరణులు సరియైన దారిలోకి మారిపోతే చూడాలని మేము కోరుకుంటున్నాము. వ్యవస్థ తన ఆవశ్యకమైన శాశ్వతమైన లక్ష్యాన్ని సఫలం చేసుకోవటానికి ఆధునిక కాలంలో

మారిన పరిస్థితుల కనుగుణంగా తనకు తప్పక తాను పరివర్తన చెందాలి. అది గనుక మార్పును తిరస్కరించితే పర్యవసానంగా అది కేవలం సమాజ అవశేషంగానే ఉంటూ, ముక్కలు చెక్కలు కింద ఛిన్నాభిన్నమై పోతుంది. తనకు తాను పరివర్తన చెందితే, నాగరికత పురోభివృద్ధి చెంది సఫలం కావటంలో గొప్ప పాత్రను ఇప్పుడు పోషిస్తుంది.

(CWSA 7:684)

శ్రీఅరవిందులు (సెప్టెంబరు 21, 1907)

*

ముందు జాగ్రత్తలతో సరియైన రక్షణలను ఏర్పాటు చేసుకున్న వర్ణవ్యవస్థ శ్లాఘనీయమైన సామాజిక వ్యవస్థతో నిత్యశక్తితో ఉండటానికి దోహదం చేస్తుంది. కాని దానికి ఎటువంటి రాజకీయ అర్థాలు లేవు. దానిని ఎటువంటి రాజకీయ అర్థాలతో ముడిపెట్టడానికి అంగీకరించకూడదు.

(CWSA 7:779)

శ్రీఅరవిందులు

*

వర్ణవ్యవస్థ తగు భద్రతతో కూడి వున్నట్లయితే సామాజిక వ్యవస్థీకరణకూ, దాని సంరక్షణకూ అది అత్యంత శ్రేష్ఠమైన విధానం. కాని, అది రాజకీయ రంగును పులుముకో కూడదు, ఆ వాసన కూడ దానికి తగల నివ్వకూడదు.

(CWSA 7:684)

శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ధీరోదాత్తమైన భారతీయ ఆత్మను మేలుకొలుపుట

భారతమాత

భారతదేశమంటే ఈ నేల కాదు, ఈ నేల మీదున్న నదులూ, పర్వతాలూ కాదు. ఈ దేశప్రజల సాముదాయక నామమూ కాదు. శివుడు యెంత సజీవుడో అంత సజీవమైన ఒక జీవి భారతం. శివుడు భగవంతుడు, అలాగే భారతం ఒక భగవతి, ఆమె కావాలనుకొంటే మానవరూరం ధరించగలదు.

శ్రీమాత

ప్రతి వ్యక్తికీ ఒక చైత్యపురుషుడున్నాడు. అదే అతని సత్య ఆత్మ. కొంచెం అటూ, యిటూగా, ప్రతి జాతికీ ఒక చైత్యపురుషుడుంటాడు. అదే దాని యథార్థ అస్తిత్వం. అది తెర వెనుక ఉండి జాతి భవిష్యత్తును రూపొందిస్తుంది. అదే ఆ దేశపు అంతరాత్మ, జాతి ప్రతిభ, జాతి జవజీవం, జాతి ఆకాంక్షా కేంద్రం. ఆ దేశ జీవనానికి సంబంధించిన సమస్త సౌందర్యానికి, ఉదాత్తతకు, మహనీయతకు, ఔదార్యానికి జీవగర్ర. సిసలైన దేశభక్తులు దాని సాన్నిధ్యాన్ని ఒక స్పర్శనీయ సత్యంగా అనుభూతిచెందుతారు. భారతదేశంలో ఆ అస్తిత్వాన్ని ఒక దైవరూపంగా భావిస్తారు. తమ దేశాన్ని ప్రేమించే వారందరూ దానిని భరతమాత అని పిలుచుకొంటారు. తమ దేశం సుభిక్షంగా వుండాలని, నిత్యం ఆమెను ప్రార్థిస్తారు. భారతదేశ యధార్థ ఆదర్శానికి, ప్రపంచంలో ఆమె యదార్థ కార్యానికి రూపం, ప్రతీక అదిగో అమెయే.

భారతదేశంలో మేధావివర్గానికి చెందినవారు ఆమెను జగజ్జనని అంశమని కూడా భావిస్తారు. ఆ విషయం దుర్గాస్తోత్రంలో స్పష్టంగా చెప్పబడింది

“దుర్గామాతా! సింహవాహినీ నీవు సర్వశక్తులను ప్రసాదిస్తావు. నీ శక్తి అంశలం మేము, భారతీయ యువకులమైన మేము నీ మందిరమున నిలిచి ప్రార్థిస్తున్నాం. ఆలకించు తల్లీ, భువిపై దిగి రా, ఈ భారతదేశంలో అవతరించవమ్మా!

“దుర్గామాతా! సత్త్వాన్ని, ప్రేమను, జ్ఞానాన్ని ప్రసాదించు. ఓ సర్వశక్తివంతమైన తల్లీ! నీవు నీ ఆత్మశక్తియందు ప్రచండ బలసంపన్నురాలివి. నీవు సుందరరూపివి, భయంకరరూపివి గూడా. జీవనసంగ్రామంలో, భారత స్వాతంత్ర్యసంగ్రామంలో నీచే నియమించబడిన యోధులం. మాన మనస్సు, హృదయాలకు అతిమానుష

శక్తిని ప్రసాదించు, మా బుద్ధి, అంతరాత్మలకు దివ్యశీలాన్ని, జ్ఞానాన్ని అనుగ్రహించు.

"దుర్గామాతా! ప్రపంచంలో కల్లా అత్యుదాత్తమైన ఈ జాతి నేడు గాఢాంధకారంలో మునిగి కొట్టుమిట్టాడుతోంది. మాతా, నీవు తూర్పు దిక్కున ఉదయిస్తున్నావు. దివ్యమైన నా అంగాంగముల నుండి అంధకారాన్ని పటాపంచలు చేస్తూ ఉషఃకాంతులు ప్రసరిస్తున్నాయి. తల్లీ, నీ తేజస్సును విస్తరింపజెయ్యి, అంధకారన్ని నాశనంచెయ్యి.

"దుర్గామాతా! మేము నీ బిడ్డలం, నీ కృపాకటాక్షం ద్వారా నీ ప్రభావంతో ఒక మహనీయ ఆదర్శసాధన కోసం, ఈ మహాకార్యాన్ని నిర్వహించ సమర్థుల మగుదుము గాక. అమ్మా! మా అల్పత్వాన్ని, మా స్వార్థాన్ని, మా భయాన్ని సర్వనాశనం చెయ్యి.

"దుర్గామాతా! నీవు మహాకాళివి. ఖడ్గాన్ని చేబూని అసురులను హతమారుస్తావు. ఓ దేవీ నిర్దాక్షిణ్యమైన నీ హుంకారములచే మాలో ఆవాసమేర్పరచుకొన్న శత్రువులను దునుమాడవమ్మా! ఏ ఒక్కరు గూడ అచట జీవించి ఉండకూడదు. మేము పరిశుద్ధులము, మచ్చలేనివారము అయ్యేటట్లు అనుగ్రహించు. ఇదే మా ప్రార్థన, ఓ తల్లీ నిన్ను నీవు అభివ్యక్తం చేసుకో.

"దుర్గామాతా! స్వార్థపరత్వంతో, భయంతో, క్షుద్రతచే, భారతమిప్పుడు దిగజారిపోయి వుంది. మమ్మల్ని గొప్పవారిగా, మా ప్రయత్నాలను మహనీయమైనవిగా, మా హృదయాలను విశాలంగా, మా దృఢనిశ్చయానికి కట్టుబడి వుండే సత్యవంతులనుగా మమ్మల్ని తీర్చిదిద్దు. మేము ఎట్టి అల్పమైనదాన్ని, శక్తిహీనమైనదాన్ని, సోమరితనాన్ని పెంచేదాన్నీ, భయంతో కంపింపజేసేదాన్ని కోరుకొనకుండా ఉండేటట్లు అనుగ్రహించు.

"దుర్గామాతా! మా యోగశక్తిని విస్తరింపజెయ్యి. మేము నీ ఆర్యపుత్రులం. ఇప్పుడు లుప్తమైనట్లు కన్పిస్తున్న దివ్యోపదేశాన్ని, సౌశీల్యతను, బుద్ధిబలాన్ని, విశ్వాసాన్ని, భక్తిని, నియమపాలనా శక్తిని, బ్రహ్మచర్యశక్తిని, యదార్థ జ్ఞానాన్ని ప్రపంచానికంతా ప్రసాదించు. మానవజాతికి సహాయం చేయడానికి ప్రత్యక్షం కావమ్మా. ఓ లోకమాతా, సర్వారిష్టాలను పారద్రోలు.

"దుర్గామాతా! ముందు మాలోని శత్రువులను హతమార్చు. తరువాత బయట యెదురయ్యే సర్వవిఘ్నాలను తొలగించివెయ్యి. ప్రేమ, ఐకమత్యాలలో, సత్యం, సత్త్వాలలో, కళలు, సాహిత్యాలలో, శక్తిజ్ఞానాలలో, ఉదాత్తము, శౌర్యవంతమూ

అయిన మహోన్నత భారతజాతి, తన పవిత్ర వనాలలో, సారవంతమైన క్షేత్రాలలో, ఆకాశాన్ని తాకే పర్వతసానువుల్లో, పరిశుద్ధ నదీప్రవాహ తీరాలలో సదా నివసించునట్ల నుగ్రహించు. మాతా, నీ పాదాల కడ మేము చేసే ప్రార్థన యిది. నిన్ను నీవు అభివ్యక్తం చేసుకో తల్లీ.

"దుర్గామాతా! నీ యోగిక శక్తితో మా దేహాల్లో ప్రవేశించు. మేము నీ ఉపకరణాలమౌతాం. అమంగళకరమైన సర్వాన్నీ ఛేదించే నీ కరవాలమౌతాం. సమస్త అజ్ఞానాన్నీ పారద్రోలే నీ కరదీపికలమౌతాం. నీ ముద్దుబిడ్డల ఈ పరితాపాన్ని చల్లార్చు తల్లీ. ఓ దివ్యజననీ, ఈ నీ ఉపకరణానికి మార్గనిర్దేశకురాలివై, దీన్ని నడిపించు. నీ కరవాలాన్ని ఝుళిపించి, దౌష్ట్యాన్ని తుదముట్టించు, జ్ఞానదీపాన్ని పైకెత్తి ఆ వెలుగును విస్తరింపజెయ్యి. నిన్ను నీవు అభివ్యక్తం గావించుకో తల్లీ."

(CWM 12:42-44)

శ్రీమాత (ఆగష్టు 1952)

సంస్కృతి యెడల సరైన అవగాహనగల ఒక ఉగ్రమైన ఆత్మరక్షణా విధానం

బలీయమైన ఆత్మరక్షణ అవసరం కలుగుతుంది. బలమైనదే గాదు, ఎదురుదాడికి కూడా సంసిద్ధమైన ఆత్మరక్షణ అవసరం యేర్పడుతుంది. ఎందుకనంటే ఆధునిక సంఘర్షణాయుత పరిస్థితులలో ఎదురుదాడికి దిగగలిగిన ఆత్మ రక్షణా విధానమే ప్రభావం చూపగలుగుతుంది. మనస్సుకు, దానికి గల కఠిన నిరోధక ప్రవృత్తిని వ్యతిరేకించే ధోరణి నవలంబించే విధంగా మనల్ని మనం తయారుచేసుకొన్నాం. ఎందుకనంటే ఒక నిష్క్రియాత్మకమైన ఆత్మరక్షణా విధానానికి గట్టిగా కట్టువడిపోయిన భారతీయులు అసంఖ్యాకంగానే వున్నారు. భారతదేశానికి సంబంధించినదేదైనప్పటికీ అది భారతీయులకు మంచిదేననీ, ఎందుకనంటే అది భారతదేశానికి సంబంధించినది, అది భారతీయ ఋషీశ్వరుల సృష్టి అనే అసంగతమైన అనాలోచిత సాంస్కృతిక దురభిమానాన్నే బ వాళ్ల పటిష్టమైన ఆత్మరక్షణగా భావించారు. తరువాతి కాలంలో చోటుచేసుకొన్న వికారాలు, గందరగోళ పరిస్థితులు అన్నీ కూడా మన సంస్కృతిని బాగా దురుపయోగం చేసి, బాగా అపసవ్యంగా ఉపయోగించి తరచుగా ఎవరి యిష్టం వచ్చినట్లు వాళ్ళు సాగగొట్టి రూపొందించినందువల్ల కలిగిన దుష్ఫలితాలైనట్లు

వాళ్ళు సమర్థించుకొంటారు. కాని ఇక్కడ అసలు ప్రశ్న యేమిటంటే, అసలు నిష్క్రియమైన ఆత్మరక్షణా విధానానికి ఫలితాలు సాధించే శక్తి, విలువ యేమైనా వున్నాయా? అనేది. దానికేమీ విలువ లేదని నేనంటాను. ఎందుకనంటే అది సత్యదూరం, అసలు సత్యానికీ ఆ వాదనకు పొసగదు. అందుచేత ఆ వాదం ఓటమి పాలవక తప్పదు. ఒక ప్రక్క ప్రపంచ మహాశక్తి, దానితో పాటు భారతదేశ మహాశక్తి కూడా శరవేగంతో తమ దారిలో అవి దూసుకుపోతుంటే, వాటి కడ్డుగా మొండిగా బైఠాయించి నట్లవుతుందీ వాదం. దుబారా చేసే మన అసమర్థ హస్తాల్లో చివరి పైసా వరకూ ఖర్చైపోయి, కుచించుకుపోయిన మన సాంస్కృతిక మూలధనం, పెట్టుబడిని భర్తీచేసుకుంటూ దానితో మనుగడ సాగించాలని నిశ్చయించుకొనడమే అవుతుంది. కాని పెట్టిన పెట్టుబడి సొమ్మును నూతన లాభాల నార్జించడానికి వినియోగించుకొన కుండా, దానితోనే బ్రతకాలనుకొని బ్రతుకసాగించితే చివరకు దివాళా తీయడం, దారిద్ర్యంలో కూరుకుపోవడం అవుతుంది. గతాన్ని నిరంతరం వినియోగించుకోగల చలన పెట్టుబడిగా చేసి, మరిన్ని లాభాల నార్జించడానికి, భవిష్యత్తును ఒడిసిపట్టుకొని అభివృద్ధి గావడానికి ఉపయోగించుకోవాలి. కాని దేన్నైనా ఆర్జించడానికి, అభివృద్ధి చెందడానికి, మరింత సంపన్నులు గావడానికి మనం కొంత వదులుకోవాలి, మనం కొంత విడిచిపెట్టాలి — అదే సృష్టిలోని విశ్వజనీన ధర్మం. అలా గానప్పుడు మన జీవితం మనలోనే యే యెదుగూ బొదుగూ లేనిదై నీరసించిపోతుంది, చివరకు అనేక రుగ్మతలకు కారణమై నశించిపోతుంది. విస్తృతంగాక, మార్పుచెందక ముడు చుకుపోవడం మన అసమర్థతను ఒక తప్పుగా ఒప్పుకోవడం అవుతుంది. అలా చేయడంతో మతవిషయకంగా వేదాంతపరంగా మన సృజనాత్మక సామర్థ్యం శంకర, రామానుజ, మధ్వ, చైతన్యులతో ముగిసిపోయిందని చెప్పుకున్నట్లవుతుంది. అలాగే సాంఘిక నిర్మాణంలో రఘునందన్, విద్యారణ్యులతో అంతమొందినట్లవుతుంది. కళలు, కవిత్వం విషయంలో ఒక సృజనాత్మకత శూన్యంలో, నిష్క్రియాత్మక శూన్యంలో విశ్రమించే స్థితికి చేరినట్లు లేదా అందమైనవే అయినప్పటికీ, ప్రేరణ కలిగించలేని నిర్జీవచిత్రాల పునః చిత్రీకరణగా తయారవుతుంది. మన ప్రయత్నాలూ, అప్రయత్నాలలో ఉండే ప్రమాదకర స్థితిగతులు ఒక ప్రక్క ఉంటుండగా, కుప్పకూలి పోతున్న, కుప్పకూలిపోతూనే ఉండే సంఘ కట్టుబాట్ల రూపాలను పట్టుకొని వ్రేళ్ళాడి

నందువల్ల, అవి ధ్వంసమౌతుంటే వాటి క్రింద పడి మనం తిరిగి తలెత్తలేని విధంగా నలిగిపోవడం జరుగుతుంది.

శ్రీఅరవిందులు

శక్తి కావాలి

మనకన్నీ వున్నాయి కాని శక్తి లేదు. మనం శక్తిశూన్యులం. మనం శక్తిని నిషేధించాం, అందువల్ల మనం శక్తిచే నిషేధానికి గురైయ్యాం. దివ్యమాత మన హృదయాలలో, మన మస్తిష్కాలలో, మన బాహువుల్లో లేదు.

(CWSA 6:80)

శ్రీఅరవిందులు (1905)

*

మనం మన లోలోపలికి పోయి చూచినపుడు, మన కిప్పుడు లేనిదో విషయం వున్నదని యెక్కువగా నమ్మవలసి వస్తుంది. అన్నింటి కంటె ముందు దాన్ని సంపాదించుకొనడానికి మనం శ్రమించాలి. అదే శక్తి — దైహికశక్తి, మానసికశక్తి, నైతికశక్తి, కాని అన్నింటిని మించి, ఇతర శక్తులన్నింటికీ మాతృస్థానమైన, ఎన్నటికీ తరగని, నాశనంకాని, ఆధ్యాత్మికశక్తి అవసరం. ఆ శక్తి వుంటే తక్కిన ప్రతిదీ మనకు తేలికగా సహజంగానే లభిస్తాయి. శక్తి లేనపుడు మనం స్వప్నంలోని మనుషుల్లాగా చేతులుండీ దేనినీ పట్టుకోలేని, దెబ్బకొట్టలేని వాళ్ళలా కాళ్ళుండీ నడువలేనివాళ్ళలా అయిపోతాం.

(CWSA 6:8)


శ్రీఅరవిందులు (1905)

*

భారతదేశం మనుగడ సాగించాలంటే ఆమెను తిరిగి యౌవనవంతం చేయాలి. పరవళ్ళు త్రొక్కుతూ, ఉప్పొంగుతూ పరుగులు పెట్టే శక్తిప్రవాహాలను ఆమె లోనికి గ్రుమ్మరించాలి. గతకాలంలో వున్నట్లు ఉగ్రూతలూగే, విశాలమూ, బలీయమూ, ఇచ్ఛాపూర్వకంగా ప్రశాంతంగా వుండగల లేక కల్లోలితం కాగల కర్మ లేక క్రియాశక్తి సాగరంలా ఆమె అంతరాత్మ తయారుగావాలి.

(CWSA 6:83)

శ్రీఅరవిందులు (1905)



స్వాతంత్ర్య సముపార్జన సులభమైన పని, కాని దానిని కాపాడుకోవడం అంత సులభం కాదు.... రెండవదానికి ఐక్యతతో కూడిన, వ్యవస్థీకరించబడిన, స్థిరమైన బలం కావాలి. భారతదేశం తన చెల్లాచెదరైన శక్తులను ఒక ఏకైక ప్రబలమైన సంపూర్ణ శక్తిగా వ్యవస్థీకరించాలి.

శ్రీఅరవిందులు మార్చి 19, 1908

(CWSA 7:939)

ముఖ్యంగా ఈ క్షణంలో భారతదేశానికి కావలసింది, ఎదురుదాడి చేయగల మంచి గుణాలు, శిఖరాలను స్పృశించగల ఆదర్శవాదం సాహసోపేత సృజన, భయరహిత ప్రతిఘటన, ధైర్యంతో ఎదురుదాడి చేయగల ఉత్సాహం. నిష్క్రియ తామసికకతతో కూడిన జడత్వం మనకు ఇది వరకే సమృద్ధిగా నుంది

(CWSA 7:487)

శ్రీఅరవిందులు (జూన్ 7, 1907)

భారతీయ వారసత్వంగా మనకు లభించిన ప్రధాన సంపద: భగవద్గీత

స్వార్థరాహిత్యం, ధైర్యం, స్వేచ్ఛాపూరితమైన ఉదాత్త కర్మాచరణ, గీతా సిద్ధాంతాల సారమని బోధించారు. ఆ ఉపదేశాన్ని, హీనమైనదనిగాని, నిందార్హమనిగాని లేక నైతికతను దెబ్బకొట్టేదనిగాని ఏ దేశమూ తృణీకరించలేదు. ఆ ఉపదేశం విశ్వాతీతానికి సంబంధించినది, దాని కనుగుణంగా... జీవించలేము అని బుద్ధిగలవారెవ్వరూ దానికి విలువ నివ్వరు అని ఏ దేశంలోను యెవ్వరూ అనలేదు. గీతాసిద్ధాంతంపై, గీతలోని విషయంపై వెలిబుచ్చిన అనుమానపు ముద్రకు వ్యతిరేకంగా మేము గట్టిగా అభ్యంతరం చెప్తున్నాం. గీతా సిద్ధాంతం, గీతలోని సంపద మన జాతికి లభించిన ప్రధాన వార సత్వ సంపద. అది భవిష్యత్తుపై మనకు ఆశను కల్పిస్తుంది. మన ప్రజల పురోగమనాన్ని కుంటుపరచే, మన ప్రజలపై మచ్చగా తయారైన, నైతిక బలహీనతలను పరిశుద్ధం చేసుకొనేందుకు మనకు లభించిన గొప్ప క్రియాశక్తి గీత.

(CWSA 8:453)

శ్రీఅరవిందులు

సమాజస్థాయిలో అహింసా సిద్ధాంతాన్ని అమలుచేయడం

ఆధ్యాత్మికానికి సంబంధించినదాన్ని సాధారణ జీవనస్థాయికి అన్వయింపజేయాలని గాంధీ ప్రయత్నిస్తున్నాడేమోనని నా భయం కాదు. అహింసను ఒక ఆధ్యాత్మిక వైఖరిగా ఆచరించడాన్ని అర్థం చేసుకోవచ్చు. అది పూర్తిగా ఆమోదయోగ్యం. దాని ఔన్నత్యం దాని కుంది. కాని వాస్తవికంగా దానికో ఆధారం వుంది. ఆ సిద్ధాం

తాన్ని నువ్వు ఆధ్యాత్మికంగా అనుజీవించవచ్చు. కాని దానని సమస్త జీవనానికీ అన్వయింపజేయడంలో అర్థం లేదు.

శ్రీఅరవిందులు

(సాయం సంభాషణలు, జనవరి 16, 1939)

దేశభక్తిభావాలు — యోగం

దేశభక్తి భావాలు మన యోగానికి పొసగనివి కావు. తద్విరుద్ధంగా తన మాతృదేశ శక్తిసామగ్రతల కోసం సంకల్పించడం సమర్థనీయమే. ఆమె బాగా పురోభివృద్ధి చెందాలనీ, పూర్తి స్వేచ్ఛతో తన అస్తిత్వపు సత్యాన్ని ఆమె అధికాధికంగా అభివ్యక్తం చేయాలనే సంకల్పం కలిగి వుండడం మన యోగానికి హాని కలిగించని ఒక ఉదాత్త సంకల్పం.

కాని యెవరైనా సరే ఆవేశపడకూడదు. పరిపక్వత లేకుండా కర్మలో మునిగిపోకూడదు. సత్యం జయించాలని యెవరైనాసరే ప్రార్థించాలి, ప్రార్థించగలగాలి, ఆకాంక్షించాలి, సంకల్పించాలి. అదే సమయంలో తన నిత్య కర్మలను యధావిధిగా నిర్వర్తిస్తూ, చేయవలసిన కర్మను సూచిస్తూ పొరపడ వీలులేని సంజ్ఞకై ప్రశాంతంగా యెదురుచూడాలి.

శ్రీమాత (అక్టోబరు 27, 1962)

స్వేచ్ఛ, సమత, సౌభ్రాతృత్వాల మూలం

ఆమె (భారతదేశపు) మహాకార్యం, మానవజాతిని, మానవస్వేచ్ఛ, మానవ సమత, మానవ సౌభ్రాతృత్వం వైపు మరల్చడం. అంతకు ముందుగా అతని స్వభావం లేక అతని ప్రకృతి స్వేచ్ఛను పొందగలిగితే తక్కిన స్వాతంత్ర్యమంతా అతని కనుసన్నల్లో వుంటుంది. దేనికీ బద్ధుడుకాని స్వేచ్ఛారూపుడు ఆ పరాత్పరుడే. భ్రాంతి నుండి వ్యక్తి బయట పడినపుడు, ప్రేమ, న్యాయవర్తనాల ద్వారా ప్రపంచపు దివ్య సమతాభావన తనను తాను సాకారంచేసుకొంటుంది. ఈ అవగాహన తనకు తాను ప్రభుత్వ మరియు సామాజిక చట్టంగా రూపొందుతుంది. ఈ దివ్యసమతను వ్యక్తి గ్రహించినపుడు ఆతడు మొత్తం ప్రపంచానికే తోడబుట్టినవాడౌతాడు. అతను ఏ అధికారస్థానంలో నియమితుడైనా ప్రేమ, న్యాయసూత్రాల ఆధారంగా ప్రజలందరినీ

తన సహోదరులుగా స్వీకరించి వారికి సేవలందిస్తాడు. మతానికీ, వేదాంతానికీ, సాంఘికదృక్పథానికీ, రాజకీయాకాంక్షలకూ ఈ అవగాహన ఆధారమైనపుడు, స్వేచ్ఛ, సమత, సౌభ్రాతృత్వం సమాజ నిర్మాణంలో తమకు యుక్తమైన స్థానాన్నాక్రమిస్తాయి. అపుడు సత్యయుగం తిరిగి వస్తుంది. ప్రజాస్వామ్యమంటే ఆసియా ఖండపు ప్రజల భావన యిది. దీనిని ప్రపంచాని కందించే ముందు భారతదేశం తన కోసం తనలో దీనిని తప్పక తిరిగి ఆవిష్కరించుకోవాలి. తన అంతరాత్మను స్వేచ్ఛగా వుంచి ఏదో ఒత్తిడి వల్ల కాకుండా ప్రేమతో సేవజెయ్యడానికి కంకణం కట్టుకోవడం ప్రతి మనిషి ధర్మం. సమతా భావన కలిగి, సంఘ సేవకు ఇతరుల స్వార్థప్రయోజనానికి తగినట్లుగాకాక తన సామర్థ్యానికి తగిన స్థానాన్ని స్వీకరించాలి. తన సోదర మాన వులతో సామరస్యపూర్వక సంబంధాలు కలిగి వుండాలి. ఒక బానిసలా శృంఖలా బద్ధుడై తప్పక చేస్తున్నట్లుగా గాక లేక ఒక దోపిడీదారుతో దోచుకొనబడుతున్నవానిలా గాక తినువానిచే తినబడుతున్నవానిలాగాక పరస్పరం ప్రేమించుకొంటూ సేవా భావంతో మెలగాలి. మనిషికిగల హక్కులను గౌరవించడం మీద ప్రజాస్వామ్యం ఆధారపడి వుంటుందని అన్నారు. అయితే అది మనిషి నిర్వహించవలసివున్న విధుల మీద ఆధారపడి వుంటుందని వారికి బదులు చెప్పారు. కాని, హక్కులు, విధులు రెండూ కూడా యూరపు భావాలే. భారతీయ దృక్పథంలో ప్రజాస్వామ్యమంటే అది ఒక ధర్మం. కర్మకు మూలకారణం స్వార్థం అనే ప్రపంచదృక్పథంవలన హక్కులు, విధులకు మధ్య సృజించబడిన కృత్రిమ వైరుధ్యాలు భారతీయ భావనయైన ధర్మంలో తమ ఉనికిని కోల్పోయి, తమ ప్రగాఢ శాశ్వత ఏకత్వాన్ని తిరిగి పొందు తాయి.

(CWSA 7:931-32)

శ్రీఅరవిందులు

అనువాదం: కె.వి రావు

*

వర్ణవ్యవస్థ తగు భద్రతలతో కూడివున్నట్లయితే, సామాజిక వ్యవస్థీకరణకూ, దాని సంరక్షణకూ అది అత్యంత శ్రేష్టమైన విధానం. కాని అది రాజకీయ రంగును పులుముకోకూడదు. ఆ వాసన కూడ దానికి తగలనివ్వకూడదు.

(CWSA 7:684)

శ్రీఅరవిందులు

జాతీయజీవనాన్ని జాగృతపరచుట

పార్థసారథి అయ్యంగారికి 13 జూలై 1911 న వ్రాసిన లేఖ

(13 జూలై 1911న శ్రీ పార్థసారథి అయ్యంగారికి వ్రాసిన ఉత్తరం నుండి సంగ్రహించ బడినది.)

...పాత రాజకీయ విధానాలను విసర్జించుటలో నా ఆదేశాలను జాగ్రత్తగా పాటించు. ఆధ్యాత్మికత మాత్రమే భారతదేశ రాజనీతిసూత్రం. సనాతన ధర్మప్రయోజనా సాఫల్యత మాత్రమే భారతదేశ స్వారాజ్యం. పాశ్చాత్య ప్రజాస్వామ్య దృక్పథం దేశాలకు మేలుచేయుటలో యెంత నిస్సహాయమైనదో అనుభవపూర్వకంగ తెలుసుకొని దానిని వదిలించుకొనుటకు ప్రజాప్రాతినిధ్యంగల మన లోకసభ దశను అనుసరించవలసి వుంటుందనుటలో నా కేమాత్రం సందేహం లేదు. నిజానికి భారతదేశం ఒక విధమైన జాతీయ యోగంలో ప్రాథమిక దశను అనుభవిస్తున్నది. ఆరంభదశలో ఉద్ధృతమైన వురవడితో 1905 లో ప్రచోదితమైన దివ్యశక్తి ఒకటి దానిని తామసిక అజ్ఞానస్థితినుండి తట్టి లేపింది. అయితే వ్యక్తుల విషయంలో జరిగినట్లుగానే, దుష్టమైన అధర్మసంస్కారాలు, అక్రమమైన మనోవికారాలు, మానసిక నైతిక అలవాట్లన్నీ దానితోపాటే తలెత్తి ఆ దివ్యశక్తిని దుర్వినియోగపరిచాయి. ఆ కారణంగా అతిశయాత్మకమైన రాజకీయ ఉపన్యాస వాగ్ధాటి, ప్రజాస్వామిక అత్యుత్సాహం, సమావేశాలు, ఊరేగింపులు, సత్యాగ్రహాలు మొదలగు కార్యక్రమాలన్నీ చివరకు బాంబులు, తుపాకులు, నిర్బంధక చట్టాలకు దారితీశాయి. అదొక అశుద్ధ రాజసిక కర్మాచారణ దశగా పరిణమించింది. ఆశాభంగమొందిన రాజుల తామసిక ప్రతిస్పందనలతో నిండిన దశ అనుసరించింది. పర్యవసానంగ, ఆంగ్లేయుల విమోచనాతంత్ర అక్రమజనిత మితవాదతత్వం ఐరోపా, ఆసియా దేశాల మిశ్రమ భావజనితమైన జాతీయవాదం, బాకునిన్, మజ్జినీల నెలలు నిండని బిడ్డలాంటి ఉగ్రవాదం తలెత్తాయి. చివరిదైన ఉగ్రవాదం యింకా సమసిపోలేదు గాని నెమ్మదిగా విచ్ఛిన్నమౌతున్నది. ఈ మూర్ఖత్వం పటాపంచలైనప్పుడే సత్యానికి అవకాశం దక్కుతుంది. భారతదేశంలో నూతనము, ఉన్నతము అయిన ఆధ్యాత్మిక నైతికస్థితి పునరుద్ధరణకు నాందిగా ఒక నిజమైన, బలమైన ఆధ్యాత్మిక ఉద్యమం మొదలవుతుంది. ఇంకా యెదుర్కోవలసిన కష్టాలు, పొరపాట్లు కావలసినన్ని తారసపడ

తాయి అనుటలో సందేహం లేదు. కాని సరైన మార్గంలో అడుగువేయటానికి మరొక అవకాశం లభిస్తుంది. మొత్తానికి దైవం మనకు అవసరమైన అనుభవాలను కలిగిస్తూ, అవసరమేన పరిస్థితులను యేర్పరుస్తూ, మనకు మార్గదర్శనం చేస్తాడని నా నమ్మకం.
(CWSA 36:170-71)

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

భారతదేశానికి ఆదర్శవంతమైన పాలనా వ్యవస్థ

(కొందరు అనుయాయులతో శ్రీఅరవిందులు జరిపిన సంభాషణలను కొన్నింటిని శ్రీ పురాణీ, శ్రీ నిరోద్ బరన్ గార్లు టూకీగ వ్రాసి వుంచారు. శ్రీఅరవిందుల దృష్టిలో భారతదేశానికి సరిపడే రాజ్యపాలనావ్యవస్థపై వారి అభిప్రాయాలు సంక్షిప్తంగా సంగ్రహించబడినవి.)

డిసెంబరు 27, 1938:

భారతదేశం యొక్క పూర్వరాజ్యపాలనా వ్యవస్థ జనజీవన విధానానికి అనుగుణంగా రూపుదిద్దుకున్నది. అందులో ప్రజల అన్ని అవసరాలు, అన్ని ప్రయోజనాలు చోటు చేసుకున్నవి. రాచరికపు యేలుబడి, ధనికవర్గ ఆధిపత్యం, ప్రజాస్వామ్య విధానం కూడ అందులో ప్రతిబింబించినవి. ప్రతి ప్రయోజనానికి చెందిన అంశం పాలనా వ్యవస్థలో యిమిడి వుండినది. అయితే పాశ్చాత్య పాలనావ్యవస్థ బౌద్ధికంగా రూపొందించబడింది. యూరోపియన్ దేశాలలో అది వివేకవిచక్షణల ప్రాతిపదికపై యేర్పడింది. ప్రతి అంశం యిష్టానుసార మార్పులు చేర్పులకు, విశృంఖలత్వానికి అవకాశంలేని విధంగ నిర్దుష్టమైన నియమబద్ధమైన రీతిలో పొందుపరచబడింది. అది ప్రజాస్వామ్య బద్ధమైనదైతే, ప్రజాస్వామ్యం తప్ప మరో వ్యవస్థకు తావుండదు, తోచినట్టుగ మలచు కొన వీలుండదు.

ప్ర: అయితే భారతదేశానికి అనువైన పాలనావ్యవస్థపై మీ అభిప్రాయం యేమిటి?

జ: ఒకప్పుడు రవీంద్రనాథ్ ఠాగూర్ ఉటంకించినదే నా అభిప్రాయం కూడ. అత్యున్నత స్థానంలో ఒక రాష్ట్రపతి వుండవచ్చు. అతనికి రాజ్యతంత్ర విధానం మరియు ప్రజాప్రాతినిధ్యసభ అవిచ్ఛిన్నంగా కొనసాగనిచ్చుటకు అవసరమైన అధికారం వుండాలి.

రాష్ట్రాలన్నీ ఒక సంయుక్త కూటమిగా యేర్పడి అగ్రస్థాయిలో ఏకమై వుండాలి. స్థానిక సమితులకు, స్థానిక సమస్యల కనుగుణంగా చట్టాలను చేసేందుకు కావలసినంత వెసులుబాటు వుండాలి.

(Evening Talks, A. B. Purani)

శ్రీఅరవిందులు

జనవరి 29, 1939

సామ్యవాద వ్యవస్థలో ప్రభుత్వం తన ఉద్యోగుల ద్వారా అడుగడుగునా జోక్యం చేసుకుంటుంది. వారు ప్రజల నుండి ధనాన్ని దోచుకుంటారు. ఉద్యోగవర్గం ప్రభుత్వ విధివిధానాలను నిర్ధారిస్తుంది. సమాజం యొక్క శ్రేయస్సును అది పట్టించుకోదు. కమ్యూనిజంలో, భూమి సమాజం యొక్క ఉమ్మడి సొత్తుగ పరిగణించబడుతుంది. సమాజంలోని ప్రతి వ్యక్తికి శ్రమించే హక్కు వుంటుంది. ఉత్పత్తిలో ప్రతి ఒక్కరు తమ భాగానికి హక్కుదారులవుతారు.

మన దేశంలోని గ్రామాల్లో ఒక విధమైన కమ్యూనిష్టు వ్యవస్థ వుండింది. దేశమంతటా ఒక పెద్ద కుటుంబంగా వుండింది. అట్టడుగు స్థాయికి చెందిన వ్యక్తికి సైతం కుటుంబంలోని వ్యక్తికుండే హక్కుండేది. చాకలి, వడ్రంగి, కమ్మరి మొదలగు వృత్తులవారంతా వారికి కావలసింది వారు పొందేవారు.

(Talks with Sri Aurobindo by Nirodbaran, p. 213))

శ్రీఅరవిందులు

పార్టీరహిత ప్రభుత్వం: (మే 25, 1970)

దేశాన్ని కష్టాల నుండి గట్టెక్కించడానికి ఏం చేయాలి? శ్రీఅరవిందులు కష్టాలన్నింటిని ముందుగానే పసికట్టారు, పరిష్కారం సూచించారు....

చూశారూ, ఈ విషయం రాజకీయాలకు అతీతమైంది. ఇది పార్టీకి సంబంధించిన విషయం కాదు. ఎందుకంటే కొందరు రాజకీయం చేయడానికి మొగ్గుచూపుతారు కాబట్టి యితరులు సహజంగానే అందుకు సుముఖంగా వుండరు. ఈ అంశం అన్ని రాజకీయాలకు అతీతమైనది. దేశాన్ని రాజకీయ పరిధులను అతిక్రమించి వ్యవస్థీకరించడానికి సంబంధించినది. అదొక్కటే మార్గం. రాజకీయాల్లో నిరంతరం

పోరాటమే క్షుద్రమైన పోరాటం — జుగుప్సాకరమైనది. అది యెంతో కలుషితమై బాధాకరంగా పరిణమించింది. వారు ఎప్పుడూ నాతో అనేవారు, విషయాలు చెడ్డగా పరిణమిస్తాయని; కారణం ఇది ఈ తరం అంతమొందే తరుణం కాబట్టి. మనం మరో తరంలోకి ప్రవేశించబోతున్నాం. ఈ తరంలో విషయాలన్నీ మరో విధంగ వ్యవస్థీకరించబడాలి. అందువలన అదొక కష్టకాలం....

రాజకీయా లెప్పుడూ పార్టీకి, భావాలకు, కొన్నిసార్లు విధులకు కూడ పరిమితమై వుంటాయి. మన మొక పార్టీరహిత ప్రభుత్వాన్ని యేర్పాటుచేస్తే తప్ప; పార్టీకి చెందని అన్ని భావాలను స్వీకరించగలిగే ప్రభుత్వం, కారణం, అది పార్టీలకు అతీతంగా వుంటుంది గనుక. పార్టీ ఒక పరిమితి; అది ఒక పేటిక లాంటింది: నీవు పేటికలోకి ప్రవేశిస్తావు (శ్రీమాత నవ్వుతారు). ఏ పార్టీకి చెందకుండ ప్రభుత్వంలో కొనసాగే ధైర్యమున్నవారు కొందరైనా వున్నట్లయితే — "మేము ఏ పార్టీ ప్రతినిధులం కాము. మేము భారతదేశ ప్రతినిధులం — అది పరమ దివ్యంగా నుంటుంది.

చైతన్యాన్ని పైకి లాగాలి, పైపైకి, పార్టీకి పైగా.

అప్పుడు సహజంగానే రాజకీయ పార్టీలలోకి ప్రవేశించలేనివారు కొందరు తయారవుతారు. అదీ కావలసింది! అది నిజంగా రేపటి కోసం పనిచేయటం అనిపిస్తుంది. రేపటి రోజు అలాగే వుంటుంది. ఈ మీమాంస అంతా యెందుకంటే దేశం ముందంజవేసి దారి చూపాలి,ఈ పాత రాజకీయ అలవాట్లను అధిగమించాలి. పార్టీరహిత ప్రభుత్వం — ఓహ్, అది యెంత దివ్యంగా వుంటుంది.

(CWM 15:405-07)

శ్రీమాత (మే 25, 1970)

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

పరస్పర గౌరవం, సహనంతో కూడిన సంయుక్త రాష్ట్ర వ్యవస్థ అవసరం

భారతదేశం సంయుక్త రాష్ట్ర ప్రాతిపదికపై వ్యవస్థీకరించబడుటతో పాటు, జాతీయతా భావన కూడా దానంతటదే అంకురిస్తుంది. భారతదేశం ఒక గొప్ప శక్తివంతమైన రాజ్యంగా రూపొందటానికి, దేశమందలి మహమ్మదీయులు, హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులు అందరూ ఐకమత్యంతో మెలగటానికి, వారంతా ఆయా మతాలకు

చెందినవారుగా చలామణి అగుట ఆగిపోయే అవసరం లేదు. ఎవరి ఆదర్శాలకు, వ్యవస్థలకు వారు అంకితభావంతో వుంటూ, సమాజంలోని యితర వర్గాలవారి ఆదర్శాలను, వ్యవస్థలను సహనంతో, గౌరవంతో ఆదరిస్తూ, సర్వజనుల సమిష్టి ప్రయోజనానికి ఆవశ్యకమైన ఆదర్శవంత పౌరజీవనంపై వుత్సాహభరిత ప్రేమాను రాగాలను అలవరచుకొనుట, నిజమైన భారతదేశ నిర్మాణానికి ప్రస్తుతం అత్యవసరం.
(CWSA 6: 169)

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

భారతదేశ అంతరాత్మ ఒక్కటే

మొత్తం దేశాన్ని ఒకటిగా చేయగలిగింది భారతీయ అంతరాత్మ మాత్రమే. సహజ స్వభావాలలో, వైఖరిలో, సంస్కృతిలో భాషలో సైతం భారతదేశం లోని రాష్ట్రాలు చాలా భిన్నమైనవి వాటికి కృతకంగ ఏకం చేసే యే ప్రయత్నమైన విపత్కర ఫలితాలకు దారితీస్తుంది.

కాని ఆమె అంతరాత్మ ఒక్కటే. ఆధ్యాత్మికసత్యం యెడల, సకలసృష్టి ఒక్కటే అన్న భావన యెడల జీవనమూలం దైవం అనే భావన యెడల, దాని ఆకాంక్ష చాలా తీవ్రవతరమైనది. ఈ ఆకాంక్షతో మమేకం కావడం ద్వారా ఉన్నత మానసికతకు యెన్నడు లుప్తమైనట్లు కనిపించని ఐకమత్యాన్ని అది తిరిగి పొందగలదు.
(CWM 13:368)

శ్రీమాత జూలై 7, 1968

*

ప్ర: భారతదేశపు మొట్టమొదటి సమస్య, అది తన అంతరాత్మను తిరిగి కనుగొని అభివ్యక్తం చేయడం అని మీరొక సందేశంలో తెలిపారు. భారతదేశపు అంతరాత్మను తిరిగి కనుగొనటం యెలా?

అమ్మ: నీ చైత్యపురుషుని తెలుసుకో. భారతీయ అంతరాత్మ యందు తీవ్రవతరమైన శ్రద్ధను పెంచుకోవాలి. అందుకు నీవు సేవాభావంతో ఆకాంక్షించాలి. నీకు చిత్తశుద్ధి

వుంటే తప్పక విజయం సాధిస్తావు.

శ్రీమాత (జూన్ 15, 1970)

అనువాదం: కె. వి. రావు

సమసమాజవాదాన్ని సఫలం చేయడం — భారతీయ పద్ధతి

సమసమాజవాద సిద్ధాంతం ఐరోపాకు చెందిన ఆలోచన కాదు, అది సంపూర్ణంగా ఆసియా ఖండానిది, ప్రత్యేకించి భారతీయులది. ఐరోపాలో పేర్కొనబడిన సమసమాజ సిద్ధాంతం అనేది, ప్రాచీనకాలంలో ఆసియా ఖండంలోని సమాజం ఆర్థిక సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని అమలుచేసి, దాని ఫలితంగా మనిషికి అవసరమైన విరామాన్ని, ప్రశాంతిని అందించి, తద్వారా ఏ అవాంతరమూ లేకుండా ఉన్నతమైన ఆత్మాభివృద్ధి చేసుకోవడానికి చేసిన ప్రయత్నమే. సమాజం లేకుండా ప్రజాప్రభుత్వం విధానపరమైనదే అవుతుంది. కాని అది ఎప్పటికి సఫలతను పొందదు. అది కేవలం జనబాహుళ్యం సమ్మతించి ఓట్లు వేసి గెలిపించిన కొద్దిమంది ఉన్నత వంశీయులు, లేదా ధనికవర్గపు మూకపరిపాలన లేదా వృత్తి పనులలో నైపుణ్యంగల వర్గాలు ఇతర వర్గాల మీద చేసే నిరంకుశ పరిపాలన అవుతుంది. సమసమాజవాదంతో కూడిన ప్రజాపరిపాలనే నిజమైన ప్రజాపరిపాలన. ఎందువల్లనంటే అది ఆ విధంగా లేకపోతే సమానంగా, సమారస్యంగా విధివిధానాలు అందరికీ పంపకం చేయడం జరిగే పని కాదు. జాతిలోని ప్రతి భాగం అందరి శ్రేయస్సు కోసం జీవిస్తూ, తనవే అయిన ప్రయోజనాలకు పెనుగులాడకుండా మనుగడ సాగిస్తుంది. అప్పుడు మానవజాతి మొత్తానికి దాని అధికాధికమైన అభివృద్ధికై తన సంపూర్ణ శక్తియుక్తులను వెచ్చించటానికి అవసరమైన పరిస్తితులను కల్పించగలదు. అటువంటి పరిస్థితులను అనుభవసిద్ధం చేసుకోవటం కూడా. హిందూనాగరికత ధ్యేయం, వర్ణవ్యవస్థ మూలోద్దేశం, హిందూమతం సఫలం అవడమంటే మానవనాగరికత అత్యున్నతమైన ఉద్దేశాలు సఫలం అవడం. ఆ విధంగా అది ముందుకు వేగంగా అన్నింటిని తనతో తీసుకుపోయేటప్పుడు. ఆధునిక జీవితం లోని అత్యంత ప్రాణిక ప్రేరణలను తప్పక కలుపుకునిపోవాలి. అది ప్రజాపరిపాలనను, సమసమాజవాదనను కూడా కలుపుకుంటూ, వాటిని పరిశుద్ధపరుస్తూ, ఏవైతే అభివృద్ధికి మార్గమో అటువంటి ఆర్థిక సర్దుబాట్ల మీద ఎక్కువ ఒత్తిడి లేకుండా వాటిని ఇంకా ఉచ్ఛస్థితికి చేర్చుతూ, నైతికపరంగా, మేధోపరంగా, ఆధ్యాత్మికపరంగా అంతిమంగా

మానవజాతి పొందవలసిన పరిపూర్ణత మీద ఇంకా ఎక్కువగా నిరంతరంగా, స్పష్టంగా వాటి దృష్టిని శ్రద్ధగా నిలపడానికి అవబోధ చేస్తుంటుంది.

(CWM 7:684-85)

శ్రీఅరవిందులు (సెప్టెంబరు 21, 1907)

ప్రజాస్వామ్య శక్త్యుత్సాహాలను అలవరచుకొనుట – భారతీయపద్ధతి

మన సామాజిక వ్యవస్థలో స్థిరమైన విలువగల పద్ధతులను, నియమనిబంధనలను అత్యంత అప్రమత్తతతో మనలో నిక్షిప్తంచేసుకోవాలి. అవి మన శక్త్యుత్సాహాలకు స్ఫూర్తిదాయకాలు, భావితరానికి వుపయోగకరమౌతాయి. అయితే, నిరంతర వృద్ధిచెందుతుండే భారతదేశ శక్త్యుత్సాహాలను గత కొన్ని శతాబ్దాల కాలంలో రూపొందిన తాత్కాలిక విధానాలకు పరిమితం చేయకూడదు. అలా చేయడం వ్యర్థమైన, దురదృష్టకరమైన ప్రయత్నమౌతుంది. ఒక నమూనాగా పోత పోయబడిన మూస పగిలిపోయింది. ఆ మూసను పరిమాణాన్ని పెంచి తిరిగి పోతపోయాలి, దానిలోని పదార్థాలను సుసంపన్నం చేయాలి. ఆ విధంగ పునర్వ్యవస్థీకరించబడిన ప్రజాస్వామ్య వ్యవస్థకు మనం చేరువ కావాలి. దానిని ఆహ్వానించాలి. ఆ ప్రజాస్వామ్య శక్త్యుత్సాహాలను, విధానాలను ఆకళింపు చేసుకుని వాటిని అధిగమించి మరింత వున్నతస్థాయికి యెదగాలి. మన సగం జమీందారీ, సగం దైవిక వ్యవస్థను ఛేదించాలి. వేదాంతం యొక్క ప్రజాస్వామ్యస్ఫూర్తిని విడుదల గావించాలి. జమీందారీ, దైవిక సంస్కృతుల నుండి అవసరమైన అంశాలను గ్రహించాలి. భారతజాతికి ఒక నూతన శక్తివంతమైన రాజకీయ మరియు సామాజిక వ్యవస్థను యేర్పాటు చేయాలి. వ్యక్తి వాదాన్ని, భౌతికవాదాన్ని పారద్రోలి ప్రజాస్వామ్యాన్ని నిలుపుకోవాలి.

(CWSA 8:247-48)

శ్రీఅరవిందులు (సెప్టెంబరు 25, 1909)

అనుభవసిద్ధమైన వేదాంతం మాత్రమే సామ్యవాద సమాజానికి ఆచరణాత్మకమైన పునాది. అది క్రైస్తవం, ఇస్లాం, పౌరాణిక హిందూమతం కలలుగన్న మహాత్ముల దైవసామ్రాజ్యం

(CWM 12:465)

శ్రీఅరవిందులు

సామాన్య ప్రజల రాజకీయ చైతన్యాన్ని జాగృతపరచుట అవసరం

స్వరాజ్యం కోసం పాటించవలసిన మరొక ముఖ్య నియమం, సామాన్య ప్రజల రాజకీయ విజ్ఞానాన్ని జాగృతపరచుట. చరిత్ర పూర్వకాలంలో కొన్ని వర్గాలకు చెందినవారు, ముఖ్యంగా పాలకవర్గానికి బాగా చదువుకున్న వర్గానికి చెందినవారు, కొంతవరకు వ్యాపార వర్గానికి చెందినవారు, జాగృతి కలిగివుంటే సరిపోయేది, కాని ఆధునిక రాజ్యవ్యవస్థ సామాన్య ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని జాగృతపరచుటపై ఆధారపడి వుంటుంది. ఇది ప్రజాయుగం. కోటానుకోట్ల ప్రజానీకానికి చెందినది, ప్రజాస్వామ్య యుగం. ఈ అధునిక పోరాటంలో యే దేశమైనా కడదాకా మనగలగాలన్నా స్వరాజ్యాన్ని తిరిగి పొందాలన్నా లేక నిలబెట్టాలన్నా, అది ప్రజలను జాగృతపరచి వారిని దేశ చైతన్య జీవనస్రవంతిలోకి కొనితేవాలి. అప్పుడుగాని ప్రతి ఒక్కరు తాము ఈ దేశవాసులమని, దేశాభ్యుదయంతో పాటు తాము కూడ వర్ధిల్లుతామని, దేశం స్వతంత్రంగా వున్నప్పుడే తాము కూడ స్వేచ్ఛ ననుభవించగలమని భావించగలుగుతారు. ఈ భావన ప్రజలలో నాటుకోవడం గ్రామసమితులపై ఆధారపడి వుంటుంది. మనం ఐక్యతతో కూడిన గ్రామ జీవన విధానాన్ని యేర్పాటు గావిస్తే తప్ప చదువుకున్నవారికి, సామాన్య ప్రజలకు మధ్య నున్న అంతరాన్ని దూరం చేయలేము. వారి జీవితాలు ఒకదానితో నొకటి ముడిపడేది వారిలో ఐక్యతా భావం యేర్పడేది యిక్కడే.

చివరిగా — సమైక్యత లేనిదే స్వరాజ్యం అసాధ్యం. అయితే స్వరాజ్యం కోసం మనకు ఆవశ్యకమైన ఐక్యత, భావసమైక్యత, వాక్సమైక్యత, మేధో విశ్వాస సమైక్యత కాదు. ఐక్యత హృదయాలకు సంబంధించినది. అది ప్రేమానురాగాల నుండి పుట్టుకొస్తుంది.

(CWSA 7:1049-50)

శ్రీఅరవిందులు (ఏప్రియల్ 20, 1908)

గ్రామజీవనం — వికేంద్రీకరణ (ఏప్రియల్ 7, 1926)

నీకు పార్లమెంటరీ వ్యవస్థ లేక రాజ్యాంగం అత్యుత్తమైనదని అనిపించటానికి కారణం పాశ్చాత్య భావనా పరంపర. ప్రాచీన భారతదేశంలో మనకు గొప్ప కుల, మత స్వేచ్ఛ ఉండేది. స్థానికి సంస్థలు అధికారానికి, జాతీయ జీవనానికి కేంద్రాలుగా నుండేవి. రాజు స్థానిక సంస్థల హక్కులను ఉల్లంఘించుటకు అశక్తుడై వుండేవాడు. హక్కులకు భంగం వాటిల్లినట్లైతే ప్రజలు తమంతట తాము తమ నిరసనను వ్యక్తపరిచె 'వారు. మన జాతి యొక్క అసాధారణ మేధాశక్తి అలాంటి సుస్థిర వ్యవస్థను రూపొందించింది.

పార్లమెంటు రూపొందించిన రాజ్యాంగంలో మాదిరి ప్రతి విషయం యెందుకు కేంద్రీకరించబడాలో నా కర్థం కాదు. మనకు వైవిధ్యభరితమైన అనేక సాంస్కృతిక అధికారిక కేంద్రాలుండాలి. అవి దేశమంతటా విస్తరించి జాతీయ జీవనంతో నిండి వుండాలి. స్వయం వృద్ధి సాధించటానిక రాజీకయ స్వేచ్ఛను కలిగి వుండాలి.

(ఒక అనుయాయి) గ్రామీణవ్యవస్థ కూడా అట్టి కేంద్రాల స్థాపనకు దోహదపడుతుంది కదా?

శ్రీఅరవిందులు: అవును, మన మిప్పుడు ప్రయత్నిస్తున్నట్లుగా, గ్రామప్రజలకు ఉపన్యాసాలిస్తూ నీతిబోధల ద్వారా కాదు. నీవు గ్రామంలో పనిచేయాలనుకుంటే గ్రామీణ జీవితానికి సహజమైన వృత్తిని చేపట్టాలి, వారి మధ్య నివాసమేర్పరచుకొని వారిలో ఒకడిగ మెలగాలి. వారు నిన్నెప్పుడైతే క్రియాశీలుడైన వ్యక్తిగా గుర్తిస్తారో అప్పుడు నిన్ను విశ్వసించడం ప్రారంభిస్తారు. నీ వక్కడ పది, పదిహేను సంవత్సరాలు పనిచేయగలిగితే, వారి మధ్య ఒక గౌరవనీయ స్థానాన్ని పొందగలుగుతావు. వారు నీవు చెప్పేది వినడానికి సంసిద్ధులైనందువలన యెంతో కొంత వారికి మేలు చేయగలవు.

మన ప్రజలకు పార్లమెంటరీ విధానం కించిత్తైనా పొసగదు. అయితే ప్రాచీన భారతదేశంలో పాటించిన విధానాలు నేడు కూడ అనుసరించవలసిన అవసరం లేదు. కాని నీవు ప్రగతిశీల పథాన్ని అవలంబించి, జాతి ప్రజ్ఞాపాటవ ప్రతిభకు దీటైన విధానాన్ని అనుసరించవచ్చు.

శ్రీఅరవిందులు (ఏప్రియన్ 7, 1908)

జాతీయతా భావానికి అనుగుణంగా గ్రామీణ జీవన పునరుద్ధరణ

మన మిప్పుడు స్వశక్తిపై ఆధారపడి గ్రామీణ వ్యవస్థను పునరుద్ధరించే కార్యక్రమంపై దృష్టి సారిద్దాం. ఈ కార్యక్రమంలో మనం యెల్లప్పుడూ గుర్తించుకోవలసిన విషయం, గ్రామజీవన పునర్వ్యవస్థీకరణలో జాతీయ ఐక్యతకు యేమాత్రం భంగం వాటిల్లకుండా జాగ్రత్తపడుట. మన జాతీయతకు, భారతదేశ సమైక్యతకు మహోన్నత ఆదర్శమైన స్వరాజ్య స్థాపన నుండి మన ధ్యాసను మళ్లించే దేనిని కూడ అనుమతించకూడదు. ఇది యేమాత్రం అన్యమైన లేక విపరీతమైన ధోరణితో గూడీన ఆదర్శం కాదు. అది కేవలం భారతదేశ చరిత్రను వేల సంవత్సరాల పర్యంతం మహోన్నత వైభవంతో నింపి, దాని ఊర్ధ్వగమన వైఖరిని సాఫల్యం చేయుటకు చేపట్టే చైతన్యవంతమైన ప్రయత్నం. శ్రీకృష్ణుడు ప్రారంభించిన, చంద్రగుప్తుడు, అశోకుడు, గుప్త చక్రవర్తులు అవిచ్ఛిన్నంగా కొనసాగించిన, అక్బరు చక్రవర్తి దాదాపు సఫలీకృతం గావించిన, ఏ కార్యం కోసమైతే శివాజీ జన్మించారో, బాజీరావు వ్యూహరచన గావించి పోరాడారో, ఆ కార్యసాఫల్యానికై చేసే ప్రయత్నం. మన గ్రామాలను వ్యవస్థీకరించుట ఒక అనివార్యమైన కార్యం. అందుకు మనం సత్వరం పూనుకోవాలి. అయితే ఆ కార్యాచరణలో మనం యెలాంటి మెళకువతో వ్యవహరించాలంటే, ఆ గ్రామాలన్నీ అవిభాజ్యమైన జాతీయ సమైక్యతలో భాగాలని, వాటి జీవనగమనంలోని ప్రతి దశలోను, మొదట జిల్లా యొక్క తదుపరి రాష్ట్రం యొక్క, చివరిగా దేశం యొక్క సహాయ సహకారాలు ఆవశ్యకమనే భావన వాటికి కలిగే విధంగా వ్యవహరించాలి. గ్రామాలు స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించే కాలం చెల్లిపోయింది. ఆ వ్యవస్థను పునరుద్ధరించ కూడదు. దేశం యిప్పుడు తన ఆశయం నెరవేరే అవకాశాన్ని అపేక్షిస్తున్నది. ఈ దేశ గ్రామీణ ప్రజానీక జానపద జీవన స్రవంతిని ఒక మహోన్నతమైన అవిచ్ఛిన్న ప్రజాస్వామ్య జాతీయ భావన గలదానిగా సంస్కరించాలి.

(CWSA 7:909-10)

శ్రీఅరవిందులు (మార్చి 7, 1908)

గ్రామాలలో ప్రేమానురాగాలు అంతరిస్తున్నాయి

ప్రస్తుతం మనం ప్రతి విషయంలోను విదేశీమూలాలున్న వాటి వైపే మొగ్గు చూపుతున్నందు వలన మన దేశప్రజల పట్ల మన కుండవలసిన ఆదరాభిమానాలు, పరస్పర సహకారమందించుకునే అలావట్లు, ఒకరి పట్ల ఒకరి కుండే బాధ్యతలు కనుమరుగైపోయాయి. ప్రతి ఒక్కరు తమని గురించి ఆలోచించుకునేవారే, తమని గురించి పాటుపడేవారే. మన తోటివారికి యేమైనా చేయాలంటే అది ప్రభుత్వ బాధ్యతేగాని మనకేమీ పట్టదు అనే ధోరణి ప్రబలింది. పరస్పర ఆదరాభిమానాలు కరువై పోవుటయే యిందుకు కారణం. ఈ పరిస్థితిని అధిగమించటం అవసరం. ఇది మెరగుపడటానికి గ్రామసమితుల పాత్ర ప్రధానం. మన జీవితాలు పరస్పరం దూరమైపోవుట, ఒకరి నుండి ఒకరు వేరు అనే ధోరణిని గ్రామసమితుల పునరుజ్జీవనం నిర్మూలించి సామాజిక స్పృహను, పరస్పర సహకారాన్ని, ప్రయోజనాన్ని అందించుకునే అలవాటును పునరుద్ధరిస్తుంది. నీటి కొరత సమస్యను పరిష్కరిస్తుంది. మధ్యవర్తిత్వంతో సమస్యలను పరిష్కరించే న్యాయవ్యవస్థను యేర్పాటు చేసి కుటుంబ కలహాలను, వ్యక్తిగత విబేధాలను నివారిస్తుంది. మరచిపోయిన సోదర భావాన్ని తిరిగి నెలకొల్పుతుంది. రోగులకు వైద్యసదుపాయాన్ని అందుబాటులోకి తెస్తుంది. కరువు నివారణ వ్యవస్థను పునరుద్ధరిస్తుంది. న్యాయాన్ని అందిస్తుంది, రక్షణ కలిగిస్తుంది. ఆ విధంగా సమిష్టి ప్రయోజనార్థం అందరూ కలసి శ్రమిస్తున్నప్పుడు మన జీవితాలలో గతంలో నున్న ఐక్యతా భావవ పునరంకురిస్తుంది. అలా జనుల హృదయాలను ఒక్కటిగా కలిపే బంధం ద్వారా స్వరాజ్య స్థాపనకు పునాదులు వేయవచ్చు.

(CWSA 7:1050-51)

శ్రీఅరవిందులు (ఏప్రియల్ 20, 1908)

పేదరికం యొక్క రెండు ముఖాలు

ఈ దేశంలోని నిరుపేద వర్గాల పరిస్థితి యింతవరకు అత్యంత నిరాదరణకు లోనయ్యింది. మన ఉద్యమానికి భగవంతుని ఆశీస్సులు తోడవ్వాలంటే దానినిక మీదట యేమాత్రం వుపేక్షించకూడదు. ప్రజాబాహుళ్యాల పేదరికం పెరుగుదలపై లెక్కలేనన్ని కరపత్రాలు, ఉపన్యాసాలు, వార్తాపత్రిక వ్యాసాలు వెలువడ్డాయి. అయితే పేదరిక

సమస్య వున్నదని బుజావు చేయడంతో మన కర్తవ్యం నెరవేరిందనుకొని, పరిష్కారాన్ని భవిష్యత్తుకు వదిలివేయడం అలవాటుగా మారింది, పరిష్కారం అందే లోపు జనులు పతనావస్థకు దిగజారిపోతారని, ఆ పరిస్థితి మెరుగుపరచడానికి దేశానికి కొన్ని దశాబ్దాలు పడుతుందనే సంగతిని విస్మరిస్తున్నాము. పేదరికము యొక్క ఆర్థిక కోణాన్ని మాత్రమే పరిగణించటం మనకు అలవాటైంది కాని ఆ సమస్యకు అంతకన్నా ముఖ్యమైన నైతిక కోణం మరొకటుంది. భారతదేశపు రైతాంగం సర్వదా భక్తి తత్పరత, సాధుస్వభావం, ప్రశాంతత, పవిత్రత, పొదుపుదనం, జన్మతః సంక్రమించిన తెలివి తేటలు కలిగి యుండేది. అవి కరువై, నాగరికత లోపించిన ఐరోపా దేశవాసులకు మన రైతులు భిన్నంగా వుంటారు. అయితే వారు యిప్పుడు మున్నెన్నడూ కనీ వినీ యెరుగని అతి క్రూరమైన పాశవిక హింసకు గురౌతున్నారు. ప్రభుత్వం యెంతో దయతో యెంతో వుదారంగ నెలకొల్పిన మద్యం దుకాణలకు ఆకర్షితులై, మితిమీరి పెరుగుతున్న అనైతికతకు లోబడిన ధనికివర్గపు పోకడలకు పశుప్రాయులుగ సమ్మోహితులై, క్రమక్రమంగా ఆ వర్గపు చెడునడతకు, కాఠిన్యానికి అలవాటు పడుతున్నారు. ఈ దిగజారుడుతనం అతి త్వరితగతిని భయానకంగా పెరిగిపోతు న్నది. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో యిది యెంతగా విషమించిందంటే, యీ కుంటుపడిన స్థితి పూర్వ ఉన్నతస్థాయిని తిరిగి అందుకోవటం అసాధ్యమనిపిస్తుంది. జమీందార్లు, తేయాకు తోటల యజమానులు, పోలీసులు పాల్పడే నిర్బంధపు వసూళ్లతో రైతులు నిరుపేద లౌతున్నారు. వారిలో ధృఢకాయులైవవారు, జీవనోపాధికి మిగిలిన యేకైక విధానంగా, దారి దోపిడీలకు, బందిపోట్లకు పాల్పడుతున్న వుదంతాలు వింటున్నాం. పాతికేళ్ల క్రితం మద్యాన్నిగాని, వేశ్యనుగాని యెరుగని నిరపేద గ్రామస్థులు, నేడు వాటికి బానిసలైపోయిన గ్రామాలను గురించి వింటున్నాం. ఇలాంటి భ్రష్టుపట్టిన గ్రామాల పరిస్థితి త్వరలో యితర గ్రామాలకు సైతం వ్యాపించే అవకాశం వుంది. ఈ దురదృష్టకర పరిస్థితిని అదుపు చేయడానికి యేదో ఒకటి చేయకపోతే, భారతదేశ ఆత్మను, దాని మురికి వెల్లువ వూడ్చుకొనిపోయి, మానవ ప్రకృతి యొక్క అత్యంత హేయమైన వికృత ఆకృతి యొక్క జుగుప్సాకర స్వరూపాన్ని మిగులుస్తుంది.

ప్రస్తుతం చదువుకున్న వర్గానికి చెందినవారు మాత్రమే సమాజాన్ని పూర్వస్థితికి పునరుద్ధరించే ఆశయానికి ఆశాకిరణాలు. పునరుద్ధరించాలనే వుత్సాహం వారిని

ఆవహించి వుంది. ప్రజలు మార్గదర్శనానికి వారి వైపే చూస్తున్నారు. ఆ లక్ష్యానికి దీటుగా వ్యవహరించుట, అట్టడుగుకు దిగజారిన దేశప్రజలలో ఆశాజ్యోతిని రగిలించుట, వారి జీవితాల్లో శక్తిసామర్థ్యాలను, వెలుగును తిరిగి కలిగించుట వారి కర్తవ్యము. నేటి వరకు స్వదేశీ వస్తు ఆదరణ ప్రజలను ఆర్థికంగా ఆదుకోగలదనే భావనలోనే వున్నాం. ఇప్పుడు దయాదాక్షిణ్యాలకు, న్యాయానికి, ధర్మానికి, నిస్వార్థతకు, ప్రజోప యోగ ప్రవృత్తికి, సహనశీల ప్రజాసేవకు మనకుగా మనం మార్గదర్శకులుగా మారి మన దేశం యొక్క నైతిక సముద్ధరణ కోసం నడుం కట్టాలి.

(CWSA 7:985-86)

శ్రీఅరవిందులు (మార్చి 20, 1908)

అనువాదం అందుగులపాటి కైలాసపతి, జానకి

మధ్యతరగతి పరివర్తన చెందవలసిన ఆవశ్యకత

ప్రస్తుత భారతదేశాన్ని మధ్యతరగతివర్గమే ముందుకు నడిపిస్తోంది, ఆది మంచికైనా, చెడుకైనా, దేనికైనా కావచ్చు. జాతి సంరక్షణ కోసం ఏ ప్రేరణ అయినా అది మధ్యతరగతి నుంచే రావాలి. పురోగతి కోసం ఏ విధమైన కదలిక కలిగినా మధ్యతరగతే చొరవ తీసుకొని దాన్ని నడిపించాలి. అలా జరగాలంటే మాత్రం ఏదో గారడీ జరిగి మధ్యతరగతి ఇప్పుడున్న స్థాయి నుంచి ఉన్నతస్థాయిని పొందాలి. అంటే మధ్యతర గతి మనస్తత్వాన్ని కాకుండా ఉన్నత యోధుల మనస్తత్వాన్ని అలవరచుకోవాలి; రాచరికపు మనస్తత్వాన్ని అలవరచుకోవాలి. అంటే అది పుట్టుకవల్ల కానీ, ధనకనక సముపార్జన వల్ల కానీ, మేథాశక్తి వల్ల కానీ, వర్తక వ్యాపారాదుల వల్ల కానీ కాక కేవలం గుణశీలాదుల వల్లనూ, ఆచరణాత్మకత వల్లనూ కావాలి. భారతదేశానికి స్వాభావికమైన ఆత్మ-బలిదానం, ధైర్యం, ఉన్నత ఆకాంక్షలను తిరిగి పెంపొందించు కోవాలి. ఈ విధమైన పరివర్తనా కార్యాన్నే మన నూతన జాతీయవాదం కార్యాచరణగా స్వీకరించింది. ఇదే దాని ఉత్సాహానికీ, సాహసానికీ, కలకలానికీ వెనుక నుండి ఉద్యమం లోనున్న మేధావంతులూ, జాతీయవాదులూ దిగ్భ్రాంతు లగుటకు గడబిడ చెందు టకు కారణమైంది. నూతన జాతీయవాద మనేది ఒక నమ్మిక, అంతకంటే ఎక్కువైన ఒక క్రమవిధానం, కేవలం పద్ధతే కాదు అంతకు మించినదైన పంథొమ్మిదద శతాబ్దపు భారతీయునిలో ఆధ్యాత్మిక పరివర్తన తీసుకునిరావటానికి చేసే ప్రయత్నము.

అది మధ్యతరగతి మనస్తత్వాన్ని నిర్మూలించటానికీ లేదా వారి ఆలోచనా విధానాన్ని, పద్ధతులనూ, పనులనూ తాత్కాలికంగానైనా నిషేదించటానికై చేసిన హెచ్చరిక. విప్లవాలు తేగల సాహసవంతులకూ, అసాధ్యులకూ, అతివాదులకూ ప్రచారకులకూ, అమరవీరులకూ, ఉద్యమకారులకూ, విప్లవకారులకూ, తెగింపుతో సాహసానికి పాల్పడే వారికీ అపాయాన్ని లక్ష్యపెట్టకుండా పనిచేసేవారికీ ఒక పిలుపు, ఒక ఆహ్వానము. ఇది భారతావనిలో క్షాత్రానికీ, సాహసానికీ పునర్జన్మ.

(CWSA 7:1107-08)

శ్రీఅరవిందులు (1907-80)

పారిశ్రామిక, సాంఘిక జీవన పుర్నిర్మాణము

మన జీవితంలోని ఏ విభాగమూ కూడా ఈ గొప్ప పునరుద్ధరణ, పునర్నిర్మాణశక్తిని తప్పించుకోలేవు. ఒక విప్లవంతో సరిసమానమైన పునర్నిర్మాణానికి మన సంఘం లోనుకావలసి వస్తుందని అనుకోవడంలో సందేహం లేదు. అయితే అది సాధారణ సంస్కర్తలు గుడ్డిగా ఆశిస్తున్నట్లుగా ఐరోపీయతను అలవరచుకోటానికై కాక సంఘంలో పరిపూర్ణమైన ఒక గొప్ప జాతీయభావం సిద్ధింపచేయటానికై జరిగే ప్రయత్నము. అది వ్యక్తి స్వార్థం కానీ ఒకరినొకరు దోచుకునే ప్రయాస కానీ కాక ప్రేమతో అందరినీ విడదీయరాని జీవిత బంధంలో ఒకటిగా చేసే జాతీయస్ఫూర్తి కావాలి. పూర్వం రక్తసంబంధీకులతో ఉమ్మడి కుటుంబ విధానంగా ఈ బంధం కొనసాగేది; గ్రామవ్యవస్థలో పాక్షిక సామ్యవాదంతో ఈ బంధం ఉండేది, ఇంకా కులవ్యవస్థలో జన్మతహ సంక్రమించే సమిష్టి గౌరవమర్యాదలతో ఇది నిలబడేది. ఇక భవిష్యత్తులో మరింత పరిపూర్ణమైన, ఆధ్యాత్మికపరమైన బంధం ఇందుకు ఆవసరం కావచ్చు. ఇంకా వాణిజ్యరంగంలో కూడా ఐరోపీయతత్వాన్నీ, వారి విధానాలనూ అంటే స్వప్రయోజనం కోసం పోటీపడే స్వార్థపరత్వం, కేవలం భాగస్వామ్య వర్తక సంఘ ఆసక్తి వల్ల ఏర్పడే బంధాలు, అన్నిటినీ మించి అత్యంత అపాయకరమైన సహకార ధనస్వామ్య వ్యవస్థ విస్తరణ, విస్తారమైన అధికారబలం కలిగిన (అది పెద్ద ఆక్టోపస్ వంటి) ట్రస్టులు, సిండికేట్ల అభివృద్ధి మొదలగువాటిని మనం అనుసరించినంత కాలం ఆరోగ్యవంతమైన పారిశ్రామిక జీవనాన్ని పునర్నిర్మాణం చేయలేము. భారతీయు లందరినీ కలిపి ఉంచగలిగేవి ఈ బంధాలు కాదు. ప్రపంచం సాధ్యమని ఊహించగలిగిన దానికంటే కూడా అత్యున్న

తమైన, సంపూర్ణ జీవనాన్ని భారతావని పొందపోతున్నది. ఈ బహువిధ కార్యాచరణలలో తనను తాను వ్యక్తీకరించుకోగల మర్మాన్ని ఆమె కనుగొనినప్పుడు తన పారిశ్రామిక, సాంఘిక జీవనాలు పటిష్ఠంగా విస్తరించగలవు.

(CWSA 8:65, 66)

శ్రీఅరవిందులు (జూలై 26,1909)

పెట్టుబడిదారీ విధానం, పన్ను విధింపు (జనవరి 29, 1939)

సామ్యవాదులు కోరుతున్నట్టు పెట్టుబడిదారీతనాన్ని రూపుమాపటం అంత మంచిది కాదు. జాతీయ సంపదకు వారే మూలస్తంభాలు. జాతి కోసం ధనం వినియోగించేటట్టు వారిని ప్రోత్సాహపరచాలి. పన్నులు విధించడం సరైనదే అయితే ఉత్పత్తులు పెంచడం, కొత్త కొత్త పరిశ్రమలు స్థాపించడం, జీవన ప్రమాణాలు పెంచడం చేయాలి. అలా చేయకుండా పన్నులను మాత్రం పెంచితే మాంద్యత ఆవహిస్తుంది.

(Evening Talks)

శ్రీఅరవిందులు

*

ఏప్రియల్ 15, 1949)

రాజకీయ, సాంఘిక, ఆర్థిక రంగాలలో, ప్రస్తుత ప్రపంచ సంస్థలకుగాని, వర్తమాన భావాలకు గాని శ్రీఅరవిందులు ఏ విధంగానూ కట్టుబడి లేరు. వాటికి సమ్మతించడం, సమ్మతించకపోవడమనే దానితో వారికి అవసరం ఏమీ లేదు*. వారి దృష్టిలో ప్రపంచ భవిష్యత్తుకి పెట్టుబడిదారీ విధానంగానీ, శుద్ధ సామ్యవాదంగానీ సరైన పరిష్కారమార్గం కాదు. అట్లాగని ప్రైవేటు సంస్థలను అనుమతిస్తే సమాజం పెట్టుబడిదారీ ప్రభావానికి లోనౌతుందని కూడా వారు ఒప్పుకోరు. సామ్యవాద ఆర్థికవ్యవస్థ కూడా తన విధానానికి లోపం రాకుండా కొంతవరకు నియంత్రిత ప్రైవేటు రంగాన్ని తన కార్యాచరణకు పాక్షిక వెసులుబాటుగా లేక చేదోడుగా చేసుకోవచ్చు. కాంగ్రెసు తన ఆర్థిక వ్యవస్థను మనస్ఫూర్తిగా సామ్యవాదపరంగా ఉంచాలనుకుంటున్నదా లేక అలా పైకి కనిపిస్తున్నదా అనే విషయంలో శ్రీఅరవిందులు స్వంత అభిప్రాయం కలిగి వున్నారు. ప్రస్తుతం తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయటానికి వారు సుముఖత చూపించలేదు.

*శ్రీఅరవిందులు ఈ విషయాన్ని తన సెక్రటరీకి చెప్పితే, వారు విలేఖరికి సమాధాన మిచ్చారు.

(CWSA 35:222)

శ్రీఅరవిందులు

వర్తక వ్యాపార వ్యవహారం, పెట్టుబడిదారి వ్యవస్థల కాలం ముగియబోతున్నది.

ఇంక కమ్యూనిజానికి కూడా కాలం చెల్లిపోతుంది. ప్రచారం చేయబడుతున్న కమ్యూనిజంలో నిర్మాణాత్మకత లేదు, అది ధనికవర్గ పరిపాలనను ఎదుర్కొనే ఆయుధం మాత్రమే. ఆ పోరు పరిసమాప్తి అయినప్పుడు ఆ సైన్యం అవసరముండదు కాబట్టి వారికి చేసే పని ఏమీ ఉండదు. అప్పుడిక వారంతా ఒక మహోన్నత సత్యాన్ని వ్యక్తం చేసే కార్యక్రమానికి ఉపయోగపడగలరు.

ఆ సత్యమేమిటో మాకు తెలుసు. దాని పరిపాలన భూమి పైకి తేవడానికై మేము పనిచేస్తున్నాము.

శ్రీమాత (మార్చి 21, 1956)

వాక్స్వాతంత్ర్యము, ఆదర్శమైన సత్యము, సద్భావము

ప్రాచీన రోమన్ కుటుంబాలలో పుట్టిన బానిస జాతివారు కూడా ఉండేవారు. 'వెర్నే' లుగా వ్యవహరింపబడే వారిని చిన్నతనంలో యజమానులు చాలా గారాబంగా చూసేవారు. కొంత పరాధీనత, కొంత విచ్చలవిడితనం రెండూ కలిసిన ఒక ప్రత్యేక స్థానంలో వారి కుండేది; విపరీతమైన స్వేచ్ఛతో వారు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం, యజమానులను తిట్టడం, ఇంకా వారిపై ప్రమాదకరమైన యుక్తులు పన్ని ఏడిపించడం మొదలైన పనులన్నీ యజమానుల మనఃస్థితి సంతోషంతో కూడి వున్నప్పుడు చేయటానికి వారికి అనుమతి ఉండేది ఒక్కసారి యజమాని కోపోద్రిక్తుడైతే మాత్రం కొరడా దెబ్బలు తినవలసిందే. ఈ ప్రభుత్వపాలనలో మనకు లభించిన వాక్స్వాతంత్ర్యం కూడా సరిగ్గా ఇటువంటిదే. అది ఆ నిరంకుశ పాలకులు ఇష్టానిష్టాలపై ఆధారపడి ఉండేది., ఏ నిమిషాన అయినా అది రద్దు కావచ్చు లేక సవరణకు లోను కావచ్చు. ఏ ముహూర్తాన అయినా ఆక్షేపణకుని వీపు చట్టం కొరడాదెబ్బలకు బలి

కావచ్చు. ఈ వాక్స్వాతంత్ర్యం రష్యా సెన్సారుతనాని కన్నా హేయమైనది, మించినది. ఎందువల్లనంటే అక్కడ రష్యాలోని సంపాదకుడు ఏ విధమైన భ్రాంతికి లోను కాకుండా పనిచేస్తాడు, తనకి వాక్స్వాతంత్ర్యం లేదనే విషయం అతనికి తెలుసు. ఒకవేళ పరిపాలనకు వ్యతిరేకంగా రాస్తే అది అతని సాహసమే. అక్కడ ఏ బూటకపు చేష్టలకు, అబద్ధ ప్రకటనలకు తావు లేదు. కానీ ఇక్కడ మన వాక్స్వాతంత్ర్యము మనలను భ్రష్టులను చేసి దాస్యము, విశృంఖలత్వాలు రెండూ కలిసిన తుచ్ఛభావాన్నే గాక ఒక బానిస మాదిరి నక్కవినయము, బరితెగింపు కూడా కలిగిస్తోంది. మనం చేసే బాహ్య ప్రకటనలలో కూడా నిజాయితీ, సూటితనము లోపించి అన్నీ కప్పదాటు చేసి లేనివాటిని చెప్పడం, బ్రిటిష్ పరిపాలనను పొగడ్తలతో ఆకాశానికి ఎత్తుతూ ఆ నోటితోనే విషం కక్కే హానిపూరిత వ్యాఖ్యానాలలతో కూడి వుంటాయి. ఈ విధంగా ఒక నీచమైన పిరికి కుటిలత్వం మనలో చోటు చేసుకుంది. అది మన గుండె ఆరోగ్యానికి ప్రమాదకరం. ఆ కుటిలత్వం పాలకుల తోటి సంబంధాలతో ఆగక మనతోటి జాతివారితో సంబంధాలకు కూడా పాకింది. ఆ కుటిలత్వమనే కుళ్ళు మన బహిరంగ చర్యలకే కాక మన వ్యక్తిగత జీవితాల్లోకి కూడా పాకి మన రాజకీయాలనూ, సాంఘిక సంస్కరణలనూ కూడా నవ్వులాటగా చేసింది, మనుష్యుల నందర్నీ కృత్రిమ వేషధారులుగా మార్చివేసింది.

ఈ భయంకర దుష్టత్వాన్ని మొదలంటా నరుక్కుని రావటం జాతీయపార్టీకి దొరికిన గొప్ప అవకాశము. స్వదేశీ ఉద్యమం ప్రారంభం కాగానే అందులోని వక్తలు, రయితలు అందరూ కూడా ఇక మీదట కృత్రిమ ముఖాలతో కాక మామూలు మనుషులుగానే ఉండాలనీ, వారి మనసులో ఉన్న సత్యాన్నే వ్రాయలనీ, మాట్లాడలనీ, వారి హృదయ భావనలను ఏ సంకోచం లేకుండా, శ్లేషరహితంగా స్వతంత్రులు తమ స్వాతంత్ర్యాన్ని నిరూపించుకున్నట్లుగా మెలగాలని నిశ్చయించుకున్నారు — జన్మతహ స్వతంత్రులు, అనుగ్రహించబడిన స్వాతంత్ర్యం పొందినవారుగా కాదు.

(CWSA 7:970-71)

శ్రీఅరవిందులు (26, మార్చి 1908)

సామాన్య మానవుని అభిరుచులను పెంచి పోషిస్తున్న వార్తా సంస్థలు

(ఒక శిష్యులు) ఈ వార్తాపత్రికలు వారికేది తోస్తే దాన్ని ప్రకటిస్తున్నారు. ఎవరింట్లోనైనా జరిగిన సంభాషణను వారు ముద్రించవచ్చునా?

ఈ ప్రజాస్వామ్యంలో ఆధునిక వార్తాపత్రికల నుంచి నీవు మర్యాదలు ఆశిస్తే అది వ్యర్థమే. ఈ నవీన ప్రజాస్వామ్యానికి అదొక వరము. నీవు అమెరికాలో వున్నప్పుడు ఎవ్వరినీ కలవకపోయినప్పటికీ వారు నీతో మాట్లాడినట్లే ఏదో ఒకటి రాస్తారు! ఈ పత్రిక లనేవి ప్రజాసంస్థలు. పూర్వం అది చాలా గౌరవప్రదంగా ఉండేవి. కానీ ఇప్పుడు వార్తాపత్రిక లనేవి మానవజీవిత నిరర్థకతకు సరైన కొలబద్దలుగా తయారైనాయి. ఈ కాలం అన్ని విషయాలకూ అదే వర్తిస్తుంది. పత్రికలు, థియేటర్లు, రేడియో మొదలైనవన్నీ కూడా జనసామాన్యపు స్థాయికి దిగజారిపోయాయి. సామాన్య మానవుల అభిరుచులను సంతృప్తిపరిస్తే గానీ అవి నిలబడలేవు.

అయితే ఏదో కొంత ఉన్నతమైనదాని వలన సామాన్య జనాన్ని ఉద్ధరించవచ్చు కదా అనే పాత ప్రశ్న వస్తుంది. కానీ ఎప్పుడు మాదిరిగానే ఉన్నతిని పొందే బదులు అన్నిటినీ తమ స్థాయికి దిగజార్చేస్తారు.

శ్రీఅరవిందులు (1 జూన్, 1926)

రసజ్ఞతను కళాభిరుచిని దిగజార్చడము

పూర్తి వ్యాపారదృష్టితో లౌకిక ప్రధానమైన అరకొర ఐరోపీయ విధానం మన మనస్సులను, స్వభావాలను, అభిరుచులను దిగజారుస్తున్నదనే యువ జాతీయవాదుల వాదనలో నిజముంది. మనకున్న కళాపరిజ్ఞానం, సుకుమారమైన పనితనం, సునిశిత దృష్టి, హస్తలాఘవంవల్ల ఒకప్పుడు ఐరోపా విపణివీధులలో పేరుప్రఖ్యాతులు పొందినదంతా సర్వనాశనమై పోయింది, అన్నిటినీ మించి ఈ ప్రస్తుత విద్యవిధానం గతంలోని ఆధ్యాత్మికతను, మేధాసంపదను కూడా దెబ్బతీసింది. దాని వలన మన దేశం తన సహజత్వాన్ని, జాతిని స్వేచ్ఛగా మహోన్నతంగా నిలిపే శక్తియుక్తులను, అత్యున్నత ఆకాంక్షలను కూడా కోల్పోయింది. ఇప్పుడు మనం దాన్నంతా తిరుగవ్రాసి పోయిన వాటి నన్నిటినీ తిరిగి పొందటమే నిస్సందేహంగా మన ప్రథమ కర్తవ్యం, మనం

దానికే అంకితం కావాలి. ఆలా మనం కోల్పోయిన మూలస్థితీ, ఆకాంక్ష, శక్తి చాలా ముఖ్యమైనవి కాబట్టి వాటిని తిరిగి పొందటమే మనకు చాలా ముఖ్యమైనటువంటి ధ్యేయం. ఆ తర్వాతది మన మనస్సులను, అభిరుచులను ఉన్నతస్థాయికి పెంచి ఉదాత్తమైన ఆర్యస్వభావాన్నీ, ఆర్యదృక్పథాన్నీ అలవర్చుకొని గత రోజుల వైభవాన్నీ, ప్రవృత్తినీ తిరిగి పొందాలి. పథ్వీజీవితాన్ని ఆహ్లాదభరితంగానూ, అద్భుతంగానూ చేయగల ఆర్యదృక్పథాన్ని, తత్వాన్ని అలవరచుకోవాలి. ఇంకా మహిమాన్వితమైన ఆధ్యాత్మిక అనుభవాలనూ, మనలను ప్రగాఢ హృదయులుగా, ప్రగాఢ మనస్కులుగా చేయగల సిద్ధులు ఏవైతే మనలను ప్రపంచ జనాభాలో అగ్రశ్రేణిలో నిలిపాయో, వాటిని తిరిగి పొందునట్లు చేయుటయే తర్వాత చేపట్టవలసిన అతి ముఖ్యమైన ఆవశ్యకత.

(CWSA 1:245-246)

శ్రీఅరవిందులు (సెప్టెంబరు 25, 1909)

సౌందర్యదృష్టిని జాగృతం చేయడం

జీవితానికి అర్థం లేకుండా పోతున్న ఈ రోజుల్లో మన పూర్వులు సంగీతసాహిత్యాలకు, కళలకూ, కవిత్వానికీ ఇచ్చిన విలువ ఈ తరానికి పట్టనందు వలన ఈ పృథ్వి ఒక గొప్ప చీమలపుట్టగా, తేనెతుట్టగా తయారవుతున్నది.

(CWSA 1:1433)

శ్రీఅరవిందులు (1909-10)

*

సంగీతము, చిత్రలేఖనము, కవిత్వము మొదలైనవన్నీ కూడా ఆత్మకొక పరిపూర్ణ విద్యాబోధనలే; అవి ఆత్మ చలనాలను స్వచ్ఛంగా, సంనియమంగా, సామరస్యపూరితంగాను, ప్రగాఢంగాను చేస్తాయి. కాబట్టి మానవజాతి ముందుకు పోతున్న సమయంలో ఇతర లాభసాటి వ్యవహారాలలో పడి ఈ ముఖ్యకర్తలను అశ్రద్ధ చేయకూడదు. ఇంకా ఈ ఉదాత్త కళలను కేవలం విషయలోలతను పరితృప్తి పరిచేటట్లుగా చేయకూడదు. అలా చేస్తే అవి వ్యక్తిత్వాన్ని దృఢం చేసే బదులు బలహీనపరుస్తాయి. వాటిని

సక్రమంగా వినియోగపరుచుకుంటే అవి ఉపదేశక, జ్ఞానవర్ధకములుగా, నాగరీక శక్తులుగా పనిచేస్తాయి.

(CWSA1:448)

శ్రీఅరవిందులు

*

ప్రతి వ్యక్తీ కళాకారుడు కానవసరం లేదు. కానీ ప్రతివారూ తమ కళాత్మకను, కళాభిరుచినీ, సౌందర్యదృష్టినీ పెంచుకొని, ప్రతిదాని రంగు, రూపురేఖలలోకి లోతుగా దృష్టిని సారించి ఆ రంగులు, రూపురేఖలు దేనిని వెలిబుచ్చుతున్నాయో దాన్ని కచ్చితంగా, సున్నితంగా తెలుసుకోగలగాలి. కళాసృష్టి చేసేవారు అవి గొప్ప అపురూప కళాఖండాలు కావచ్చు, మేధావంతమైనవిగానీ లేక సాధారణ మానవులు నిత్య కృత్యంగా వాడుకునే చిన్న చిన్న వస్తువులు కావచ్చు గానీ, వాటిని అందంగా మలచాలి. అసహ్యంగా, జుగుప్సాకరంగా ఉండేవాటి స్థానంలో ఉదాత్తమైనవాటినీ, మొరటుగా ఉండేవాటి బదులు సున్నితమైనవాటినీ, గజిబిజిగా చేసే బదులు సమరస పూరితంగానూ చేయటానికి అలవాటుపడాలి. దేశము ప్రతి రోజూ సౌందర్యంతో, ఉదాత్తతతో, సున్నితత్వంతో, సామరస్యంతో నిండి ఉంటే, అది సమాలోచనతో, పరిపూర్ణంగా విస్తరిస్తున్న శుద్ధ ఆత్మను తనలోనే సిద్ధింపజేసుకోడానకి సమాయత్త మౌతుంది.

(CWSA 1:453)

శ్రీఅరవిందులు

*

భారతదేశంలోని కళాకారులు వస్తుగతమైన ఆత్మతో ఏకత్వం పొందగలగాలనేది కళలు ఆశిస్తాయి. ఇంకా భౌతికసౌందర్యం కన్నా ఆత్మను గుర్తించడమే ముఖ్యం గానూ, అంతర్గతంగా నిబిడీకృతమైన దర్శనం పైనే దృష్టి పెట్టాలనీ కోరుతాయి.

శ్రీఅరవిందులు

*

సౌందర్యాన్ని పట్టించుకోనక్కర్లేదనే బోధన అసురుని చేతిలో ఉండే వినాశకర

ఆయుధము. అది భారతదేశానికి పతనం తెస్తుంది.

(CWM First Edition13:380-81

శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి; అమరవాది వేంకటరామ శాస్త్రి)

భగవంతుని ప్రార్థించు, సత్యాన్ని ఆధారంగా చేసుకొని నిలబడు

ప్రపంచమంతా అసత్యంలో కూరుకుపోయినందువల్ల అందులో జరిగే కర్మలన్నీ అసత్యాలే అవుతాయి. ఈ పరిస్థితి చాలా కాలం వరకు కొనసాగవచ్చు, తత్ఫలితంగా దేశము, దేశప్రజలు ఎంతో బాధపడతారు. అందుచేత ప్రార్థించడం, సత్యం పక్షం వహించడం చాలా అవసరం.

దైవం కల్పించుకోవాలని హృదయపూర్వకంగా ప్రార్థించడం ఒకటే చేయాలి. ఎందుకనంటే మనల్ని రక్షించగలిగేదదొక్కటే. దీన్ని గుర్తెరిగినవారంతా పరమసత్యం వైపు మాత్రమే నిలబడాలనీ, సత్యంలోనే కర్మ చేయాలనీ చాలా గట్టి నిర్ణయం తీసుకోవాలి. ఇందులో యెటువంటి రాజీకి తావుండరాదు. ఇది చాలా అవసరం. ఇదొక్కటే మార్గం.

మనకు వ్యవహారాలు బెడిసికొడ్తున్నా, చెడుగా పరిణమిస్తున్నా — నిజానికలానే జరుగుతుంది కూడా — ఎందుకనంటే ప్రస్తుతం పెత్తనం చెలాయిస్తున్న అసత్యమే దానికి కారణం. అటువంటప్పుడు గూడా పరమసత్యాన్ని ఆధారం చేసుకొని నిలబడాలని మనం స్వయంగా నిర్ణయం తీసుకోవాలి. ఆ నిర్ణయం నుండి మనం వెనుదగ్గరాదు.

ఇదొక్కటే మార్గం

(CWM 13:372)

శ్రీమాత (జూలై, 1971)

అనువాదం: కె. వి. రావు

సమైక్యతా సమస్య — పరిష్కారం

సంస్కృతం — సమైక్యం చేసే జాతీయభాష

పునరుజ్జీవనం పొందిన సంస్కృతం భారతదేశానికి ప్రాతినిధ్య భాషగా ఉంటుంది. కొద్ది సంవత్సరాలలో అదే ఆదర్శమై వెలుగొందుతుంది. అన్ని భారతదేశ భాషల వెనుక సంస్కృతం ఉండే విధంగా సంస్కృతం మాట్లాడే భాష అవుతుంది. అది అలా ఉండి తీరాలి. ఈ విషయం గురించి ప్రస్తావించినప్పుడు, ఇదీ శ్రీఅరవిందుల భావన. ఇప్పుడు ఆంగ్లం దేశమంతటా భాషగా చలామణి అవుతున్నది. కానీ అది అసాధారణం. ప్రపంచంలోని ఇతర దేశాలతో సంబంధాలు పెట్టుకోడానికి అది చాలా సహాయం చేస్తుంది. కాని ప్రతి దేశానికి తనదైన భాష ఉంది కాబట్టి మన దేశానికీ ఒక భాష ఉండాలి. అందుకని జాతీయభాష ఉండాలంటే ఇక్కడ ప్రతివారు పోరాటం ప్రారంభిస్తారు. ప్రతివారు తన రాష్ట్రభాషే జాతీయభాషగా ఉండాలని వారు కోరతారు. అది అవివేకం. అయితే సంస్కృత భాషకు అభ్యంతరం చెప్పలేరు. ఇతర భాషలకన్నా అది మరీ ప్రాచీనమైనది. ఇందులో ఇతర భాషల యొక్క మాటల శబ్దాలు, మూల శబ్దాలున్నాయి. సాధ్యమైనంత వరకు తేలికైన, సాధారణమైన సంస్కృతం ఆశ్రమంలో నేర్పడం మంచిదని నా అభిప్రాయం. కాని సాధారణీకరణం చేసిన సంస్కృతం కాదు.

(CWM 12;414-15)

మాతృశ్రీ

అనువాదం; కె. యజ్ఞన్న

జాతీయ గీతంగా వందేమాతరం

(ఒక శిష్యుడు) వందేమాతరానని జాతీయగీతంగా పరిగణించడానికి అభ్యంతరం చెప్పేవారున్నారు. ఈ గీతంలో నుండి కొన్ని భాగాలు తొలగించాలనే వాదనను కొందరు కాంగ్రెసువాదులు బలపరుస్తున్నారు.

జ: అదే చేస్తే హిందువులు తమ సంస్కృతినే వదులుకోవాలి.

గీతంలో దుర్గవంటి హిందూదేవతలున్నారని వాదన. అది ముస్లిములకు అభ్యంత

రంగా ఉంది అని శిష్యుడు అన్నాడు.

జ: కాని అది మతపరమైన గీతం కాదు. అది జాతీయగీతం. అందులో వినిపించే దుర్గ భారతదేశం తల్లిగా భావించాలి. ముస్లిములు ఎందుకు అంగీకరించరు? కవితలో అది ఒక పదచిత్రం (భావచిత్రణ) జాతీయతా భావంపై భారతీయ దృక్పథంలో హిందూభావన సహజంగా ఉంటుంది. అక్కడ ఆ పదం లేకపోతే, తమ సంస్కృతిని వదులుకోవాలని హిందువుల్ని కోరవచ్చును. 'అల్లాహో అక్బర్' అన్నప్పుడు హిందువులు అభ్యంతరం చెప్పరు. హిందువులు తమ దేవథను ఎందుకు ప్రార్థించకూడదు? లేకపోతే, హిందువులు మహమ్మదీయ మతాన్ని లేదా యూరోపియన్ సంస్కృతిని ఆమోదించాలి లేదా నాస్తికులుగా మారాలి.

బ్రిటిష్‌వారు పోకముందే ఈ హిందు-ముస్లిం సమస్యను పరిష్కరించి తీరాలి. లేకపోతే అంతర్యుద్ధ ప్రమాదం వస్తుంది అని సి. ఆర్ . దాస్‌తో 1913 లో చెప్పాను. ఆయన కూడా అంగీకరించి, దానిని పరిష్కరించాలని అభిలషించాడు.

(Evening Talks)

శ్రీఅరవిందులు (డిసంబరు 30, 1939)

జాతీయ చైతన్య ఆవశ్యకత

దేశభక్తి సాత్వికగుణ సంపన్నమైనది. జాతీయ చైతన్యం రజోగుణ ప్రధానం. తన అహాన్ని దేశ అహంలో లయింపచేసినవాడే ఆదర్శ దేశభక్తుడు. దేశ అహాన్ని పెంచుతూ తన అహాన్ని పటిష్ఠంగా ఉంచుకొనేవాడు జాతీయచైతన్యంగల వ్యక్తి. ఆ శకంలో భారతీయులకు జాతీయ చైతన్యం లేదు. దేశంలో జాతీయ చైతన్యాన్ని వ్యాప్తం చేస్తే విభజనతో క్షతగాత్రమైన ఈ దేశం కూడా ఐక్యతను సాధించవచ్చును. "మాకు ఐక్యత కావాలి, మాకు ఐక్యత కావాలి" అని కేకలు వేయడం చాలదు.

(Bengali Writings, p. 218)

శ్రీఅరవిందులు

ఐక్యత ఆవశ్యకత, మార్గం (డిసెంబరు, 1909)

ఇంతకు ముందు దేశంలో ఐక్యత లేదు. కాని ఐక్యత వైపు ఆకర్షణ, ప్రవాహం ఉంది. విభిన్న ప్రాంతాలకు ఒక ఐక్యత రూపంగా మార్చాలన్న ప్రయత్నం వుంది.

ఐక్యత సాధనలో పెద్ద అవరోధాలున్నాయి. మొదటిది రాష్ట్రీయ (ప్రాంతీయ) విభేదాలు. రెండవది హిందూ ముస్లిమ్ సంఘర్షణ. మూడవది దేశం తన మాతృదేవత అన్న భావన లేకపోవడం. సువిశాల ప్రాంతం, వార్తాప్రసారాలలో జాప్యం, ఇబ్బందులు, భాషాపరమైన విభేదాలు, ప్రాంతీయ అనైక్యత ప్రాథమిక కారణాలు. ఆధునిక శాస్త్రీయ విజ్ఞానం పుణ్యమా అని ప్రాంతీయ విభేదాలు తప్ప మిగతావి తమ వేర్పాటు తీవ్రతను కోల్పోయాయి.

దేశమాత అవిభాజ్యమైన నిజమైన స్వరూపం చూపిననాడు, ఆమె సౌందర్యానికి వివశులమైనప్పుడు, ఆమె సేవకు మన జీవితాలను అంకితం చేస్తాం ఎంతో ఆత్రుతగా. అప్పుడే ఈ ప్రతిబంధనం తొలగిపోతుంది. భారతదేశ ఐక్యత, స్వేచ్ఛ, పురోగతిని తేలికగా సాధించవచ్చును. భాషాపరమైన అవరోధం ఎంత మాత్రం జనాన్ని విభజించదు. అనుసంధానభాషగా హిందీని ఆమోదించి, ప్రాంతీయభాషకు గౌరవం ఇచ్చి నట్లయితే ఈ ఇబ్బంది తొలగిపోతుంది.

హిందు ముస్లిమ్ ఘర్షణకు నిజమైన పరిష్కారం లభిస్తుంది. దేశాన్ని తల్లిగా పరిగణించకపోవడం వల్ల ఈ ప్రతిబంధకాలను వదిలించుకోవాలన్న కోరిక బలంగా పాదుకొనలేదు. అందువల్ల మార్గాలు కనుగొనలేకపోవడం వల్ల సంఘర్షణ మరింత అధ్వాన్న మైంది. నిజమైన అవిభాజ్యమైన దేశ మాతృభావన అవసరం. దర్శనమిదే అనుకొంటూ, హిందువుల మాత అని, హిందూ జాతీయవాదం అని ఇంకా కలలు కంటుంటే, పాత పొరపాటే చేస్తున్నట్లు అవుతుంది. జాతీయవాదం పూర్ణవికాసాన్ని కోల్పోక తప్పదు.

(Bengali Writings pp. 225-26)

శ్రీఅరవిందులు

హిందూ ముస్లిమ్ సమస్య

మహమ్మదీయుల వ్యతిరేకతకు భయపడ నవసరం లేదు. అది నిజాయితీతో కూడిన స్వదేశపరమైన ప్రతిపాదన అయితే, సిమ్లాలోను, షిల్లాంగ్ లోను ఉత్పత్తి కాకుంటే జీవ సంకేతంగా, ఆకాంక్షగా మేము అభిలషిస్తాము. ఇండియాలో ఇస్లాము జాగృతం కావాలని మేము కోరతాము. దానిని వదులుకోము. ఈ సందర్భంలో తొలి మొరటు ప్రయత్నాలు మన పైకి దూసుకొనివచ్చినా నష్టం లేదు. శక్తి, బలం, కార్యాచరణ

అన్నీ జాతీయ నిర్మాణపు యంత్రాగారంలో మూలధాతువులు. రాజకీయ రంగంలో కలుసుకొనే సమయం వచ్చినప్పుడు, మహమ్మదీయులతో సోదరుని ఆలింగనాన్ని లేదా వస్తాదు బలమైన పట్టును వారి కోరిక మేరకు ఇచ్చిపుచ్చుకోడానికి మేము సన్నద్ధంగా వున్నాము.

మహమ్మదీయుడు పురోగతి సాధించలేదు. రాజగీయ హక్కుల మిఠాయిలను అతనికి రుచి చూపి, వాటిని నోటిలో బూడిదగా మార్చుకోవలసి యున్నది. అతని కోర్కెలకు రూపకల్పన చేయాలి. వాగ్దానాల పట్ల సంతోషం పొందాలి. వంచనలపట్ల అవేశం ప్రజ్వరిల్లాలి. తన ఆశలు తప్పు అని అసంభవమని అతను చివరికి తెలుసు కొంటాడు.

ఒకటి మాత్రం నిశ్చయం హిందూ-ముస్లిమ్ ఐక్యత రాజకీయ సర్దుబాట్లతో, కాంగ్రెస్ పొగడ్తలతో సాధించలేము. మనస్సు, హృదయాల స్థాయిలో ఈ ఐక్యత రావాలి. అనైక్యతకు కారణాలు ఎక్కడ వున్నాయో, అక్కడే పరిష్కారమార్గాలను కనుగొనాలి.

ఆపోహల వల్ల విభేదాలు వస్తాయి, ప్రేమతోనే ప్రేమను పొందాలి, బలంతో బలవంతులను దార్లోకి రమ్మనాలి. ఇవి మనం గుర్తు పెట్టుకొంటే, సమస్య పరిష్కారం అవుతుంది. పరస్పర సానుభూతి, జ్ఞానం వున్నప్పుడు ఆపోహలకు గల కారణాలను రూపమాపడానకి ప్రయత్నించాలి. ముసల్మాన్‌లో కూడా నారాయణుడు భాసిస్తుం టాడు, అతనికి కూడా మన దేశమాత తన గుండెలో శాశ్వత స్థానం ఇచ్చింది అని గుర్తు పెట్టుకొని అతని పట్ల మనం ప్రేమభావనతో మెలగాలి. కాని మనం అతనిని తప్పుగా అర్థం చేసుకోరాదు. స్వార్థపరమైన బలహీనతతో, పిరికితనంతో అతనిని పొగడరాదు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఇదొక్కటే ఆచరణాత్మక మార్గమని మేము నమ్ముతున్నాము.

మేధాపరమైన సానుభూతి మాత్రమే అందరినీ చేరదీస్తుంది. హృదయంలోని సానుభూతి మాత్రమే సమైక్యపరుస్తుంది. కాని మొదటిది రెండవదానిని సన్నద్ధం చేస్తుంది.

(CWSA 8:30-31)

శ్రీఅరవిందులు (1909 జూన్ 19)

*

ఇండియాలో రెండు పెద్ద వర్గాలను విడదీయడంలో ప్రస్తుతానికి ప్రభుత్వం విజయం సాధించింది. విద్య, వికాసం, రాజకీయ అనుభవం లేకపోవడం వల్ల మహమ్మదీయులను ప్రభుత్వం విడదీసింది. చెవులకు ఆనందం కలిగించే వాగ్దానాల వల్ల వారు వేరుపడ్డారు. వారి ప్రయోజనాలను నాశనం చేయకుండా ప్రభుత్వం మినహాయింపు వాగ్దానాల వల్ల వారు దూరమయ్యారు. మహమ్మదీయయులు చేదు అనుభవాల వల్ల తమ ఆశలు, తమ రాజకీయ ఉపకరణాలు తప్పు అని తెలుసుకొనేంతవరకు రెండు వర్గాలు ఐక్యం కావడం కష్టం. వారి ఉమ్మడి ప్రయోజనాలు సిద్ధించడానికి కలిసి ఉండడం కూడా అసంభవమే.

(CWSA 8:46)

శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

మహమ్మదీయ ప్రాతినిధ్యం

మహమ్మదీయులకు ప్రత్యేక ప్రాతినిధ్యం అన్న ప్రశ్న ఒక రాజకీయవేత్త తను వ్యవహరిస్తున్న శక్తుల్ని అర్థం చేసుకోలేక, తొందరపాటుగా లేవదీసిన ప్రముఖ విషయాల్లో ఒకటి. దాని ఫలితం ఎవ్వరూ ఊహించనిది. ముఖ్యంగా దాని పుట్టుకకు ప్రధమ కారకుడైన, వక్రబుద్ధిగల ఫ్రాంకెన్‌స్టీన్ లాంటివాడు కూడా ఊహించనిది. ప్రభుత్వం హిందూదేశ ప్రజలలోని హిందూభావనని కొంతస్థాయి తగ్గించి, మహమ్మదీయుల స్థాయిని కొంత పెంచి, తద్వారా మహమ్మదీయుల ఓట్లని శాశ్వతంగా పొందవచ్చుననన్న ప్రాతిపదికపై పాటించిన విధానం అని సామాన్యంగా హిందువులందరిలో ఉన్న నమ్మకం. మైనారిటీల హక్కులను రక్షించడానికి, ఎంతో జాగ్రత్తగా పరిశీలించి మహమ్మదీయులకు ప్రత్యేక ప్రాతినిధ్యం ముఖ్యవిషయంగా ఈ నూతన సంస్కరణా ప్రణాళికలో పొందుపరచామని, ఎంతోమంది ఉన్నత ఉద్యోగులు ప్రకటించినా, అది ఒక హిందూమనస్సుకి కూడా నచ్చుబాటు కాలేదు. దానికి కారణం — వారు ఒకే ఒక్క మైనారిటీని ప్రత్యేకంగా, జాగ్రత్తగా చూడడమే, అంతేకాక ఆ ప్రత్యేకత మహమ్మదీయులు అధిక సంఖ్యలో ఉన్న రాష్ట్రాలలో కూడా అమలుపరచడం. హిందూమైనారిటీల పరిరక్షణకు ఏ వ్యవస్థ లేదు. అలాగే పార్శీలకు, సిక్కులకు, క్రిష్టియన్లకు, మరే ఇంత వర్గాలకు లేదు, వారు సహేతుకంగా మైనారిటీలమని,

హిందుదేశస్థులమేనని, ఈ సామ్రాజ్య పౌరులమేనని, మహమ్మదీయుల కంటె ఏమాత్రం తక్కువ కాదని చెప్తున్నా...

మా వైఖరి స్పష్టంగానే ఉంది. అధిక సంఖ్యాకుల ఆదరాభిమానాలను చూరగొన నిది, తగినంత అధికారం ఇవ్వనిది, హిందూదేశస్థుల సామర్థ్యానికి మరియు రాజకీయ నాయకత్వానికి అవకాశా లివ్వనిది, స్వేచ్ఛతో వారు విస్తరించడానికి విత్తనం వేయనిది అగు ఈ నూతన సవరణలలో భాగం పంచుకోలేం. మేం ఒక్క క్షణానికి కూడా ఈ ప్రత్యేకమైన నియోజకవర్గాలను లేదా ప్రత్యేక ప్రాతినిధ్యాలను అంగీకరించం. మేం అంగీకరించకపోవడానికి కారణం భవిష్యత్తులోని అసెంబ్లీలలో మహమ్మదీయుల ప్రభావ ఆధిక్యత గురించి కాదు, మేం వ్యతిరేకించేది హిందూ అని, మహమ్మదీయులని బేధాన్ని గుర్తించి, వారిని శాశ్వతంగా విభజించి ప్రత్యేకమైన రాజకీయ వర్గాలుగా వేరుచేసే విధానం మాకు అంగీకారం కాకపోవడం; దాన్ని మేం వ్యతిరేకిస్తున్నది. దాని ఫలితంగా అవిభాజ్యమైన, ఏకమైన హిందూదేశం యొక్క ఎదుగుదలని ఆదిలోనె త్రుంచివేస్తున్నారు. విభజనకు దోహదం చేసే ఏ ప్రయత్నాన్నైనా మేం వ్యతిరేకిస్తాం. అది రాజకీయ మద్దతును వెతుక్కునే సిగ్గుమాలిన ప్రభుత్వం వలన జరిగినా లేదా కోపోద్రిక్తమైన హిందూసంఘం క్షణికమైన వారి తీవ్రభావాలతో రాబోయే భవిష్యత్తును అస్పష్టం చేసినా వారి ప్రయత్నాలనైనా మేం ప్రతిఘటిస్తాం.

(CWSA 8:287-89)

శ్రీఅరవిందులు (నవంబరు 6, 1909)

హిందూజాతీయత, భారతదేశపు ఐక్యత

హిందూమతాన్ని ఐక్యపరచగలిగి శక్తి కల్గినవి రెండే విషయాలు. ఒకటి వేదాంతం మీద ఆధారపడిన నూతన ఆధ్యాత్మిక ప్రేరణ మానవులంతా అంతస్సారంలో ఒక్కటే అన్న భావన, త్వరితగతిన స్పందించే ప్రయోజనాత్మకమైన సంస్థలు, ఉన్నత ఆదర్శాలైన సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ, సమానత్వం, హిందూ ఆధ్యాత్మిక ఉన్నత భావాలు చేపట్టవలసిన గొప్ప కార్యం, మరియు వాటి గొప్ప భవిష్యత్తు యొక్క గుర్తింపు, మరియు హిందూజాతియొక్క క్రమశిక్షణ లేదా హిందువు లందర్ని సంఘటితపరచగల, వారి జాతిని రక్షించి, వారి సంఘ అభివృద్ధికి సహాయపడగల ఓ గాఢమైన శక్తివంతమైన రాజకీయ ప్రేరణ...

లాలా లజపతి రాయ్ మరి కొంచెం ముందుకు వెళ్లారు. ఉన్నత భారతీయ జాతీయత కోసం ముందుగా హిందూ జాతీయభావన ఒక ఆవశ్యకత అన్నారు. మేం ఈ ఆదర్శాన్ని నమ్మలేం. మేం వాస్తవాలకు గుడ్డిగా ఉండడం మా అపనమ్మకానికి కారణం కాదు. ఈ హిందూ-మహమ్మదీయుల శత్రుత్వం గతానికి చెందిన వారసత్వమని ఇది బ్రిటిషువారి ఆధిపత్యంలో తగ్గక మరింత ఎక్కువయ్యిందని గుర్తించక పోవడం కాదు. ఈ విషయం తేల్చుకోవలసినది, పరిష్కరించుకోవలసినది. పరస్పర సహకారంతో లేదా జాతీయత మరియు వేర్పాటుతనాల పరస్పర సంఘర్షణవల్లనో, కాదు. అయితే మేం హిందూ జాతీయతను ఆధునిక పరిస్థితుల్లో ఒక సంభావ్యతగా అర్థం చేసుకోలేం. హిందూజాతీయత శివాజీ మరియు రామదాసుల కాలంలో అర్థవంతంగా ఉండేది. అప్పుడు జాతి పునరుద్ధరణే ముఖ్యలక్ష్యంగా, మనపై మహమ్మదీయులు చూపే అధికారాన్ని కూలదోయవలసి వచ్చింది. హిందూదేశ ఐక్యతకు, సహనానికి రక్షణగా నిలిచిన ఆ దశ తరువాతి కాలంలో నిరంకుశంగా, విచ్ఛేదకరంగా తయారయింది. అప్పుడు భారతదేశం తనకు తానే ఓ ప్రపంచగా ఉన్న దేశం. పూర్తిగా హిందువులకు చెందిన రెండు ప్రత్యేక భౌగోళిక భాగాలు. మహారాష్ట్ర మరియు రాజపుటానా వుండేవి. అప్పుడు మహమ్మదీయులు వారి ఆధిపత్యాన్ని దుర్వినియోగపరచడం హిందూదేశ భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారినందువలన వారిని శిక్షించి, సన్మార్గంలో పెట్టడం హిందూ పునరుద్ధరణ ఆధిపత్యం మీద ఆధారపడింది. అది సాధ్యపడటం అవసరం కనుక అది ఆచరణసాధ్యమయింది. కాని ఇప్పుడు ఆధునిక పరిస్థితులలో భారతదేశం అంతా కలిసి ఒక్కటిగా వున్నప్పుడె తన ఉనికిని నిలుకోగలదు.

మహమ్మదీయుల వేర్పాటు వాదానికి కారణాలు ప్రప్రథంగా వారు హిందూదేశస్థులుగా భావించి తరువాత మహమ్మదీయులుగా భావించడానికి నిరాకరిస్తారు. ఎందుకనగా — ఒకే గడ్డ మీద, ఒకే రక్తం పంచుకు పుట్టినా, వారు వారి ఉనికిని, సంబంధాన్ని గొప్ప మహమ్మదీయ దేశాలతో జత చేసుకుంటారు. హిందువులకు అలాంటి అవకాశం లేదు. మంచికో, చెడ్డకో హిందువులు నేలను నమ్ముకోవాలి. ఈ గడ్డ మీదనే ఆధారపడాలి. వారు వారి మాతృమూర్తిని నిరాకరించలేరు. ఆమెను ముక్కలు చేయలేరు. అందుకే మన ఆదర్శం హిందూజాతీయత, విశాలమైన హిందూజాతీయత, ఆత్మలోనూ సంప్రదాయంలోను — ఎందుకంటె ఈ భూభాగం

ఖ్యాతిగల గతంతో, సంస్కృతితో, నాగరికతతో అజ్ఞేయతమైన పౌరుషంతో, వీటన్నింటిని పట్టి ఉంచి, విశాలహృదయంతో ముస్లింలను, వారి సంస్కృతి సాంప్రదాయాలతో సహా తమలోకి ఇంకించుకోగల జాతీయతగావెదగడం. మహమ్మదీయులు ఆ కచ్చితమైన భవిష్యత్తును గుర్తించలేక తమని తాము దీన్ని వ్యతిరేకించే స్థితిలో ఉంచుకోడం ఇష్టపడవచ్చున్నది కూడా సంభవమే.

(CWSA 8:302-05)

శ్రీఅరవిందులు (6 నవంబరు, 1909)

మతోన్మాదం అంతా అసత్యమే (అక్టోబరు 23, 1929)

... నువ్వు సత్యాన్ని మాత్రమె అడుగుతానంటున్నావు. కాని ఇరుకు పరిధిలో తను పుట్టిన మతం తప్ప దేనిని నమ్మని, అన్నింటిని తిరస్కరించే మతోన్మాదివలె మాట్లాడుతున్నావు. మతోన్మాదం అంతా అసత్యమే, ఎందుకంటే అది దైవం యొక్క, సత్యంయొక్క స్వభావానికి విరుద్ధమైనది. సత్యం అన్నది ఏ ఒక్క పుస్తకంలోను బంధించబడి ఉండదు. అది బైబిలు లేదా వేదం, లేదా కొరాను, లేదా ఏదో ఒక మతంలో మూయబడి ఉండదు. దివ్య అస్తిత్వం శాశ్వతము, విశ్వజనీనము, అనంతము. అది ఒక్క ముస్లింల, లేదా హీబ్రూ మతాల ప్రత్యేక ఆస్తి కాదు — బైబిలు ననుసరించి, ఆ క్రమంలో వచ్చిన యూదులు లేదా అరేబియన్ ప్రవక్తల చేత ఆవిష్కరించబడిన మతానికి చెందినవారు. అలాగే హిందువులు, కన్‌ఫ్యూసియస్‌లు, తావోలు — ఇంకా మిగిలినవారు — వారందరికీ కూడా దైవంతోటి, సత్యంతోటి సంబంధం ఏర్పరచుకుందుకు, వారి మార్గంలో సత్యాన్ని గ్రహించడానికి అంతే హక్కుంది. ప్రతిమతంలోను ఏదో కొంత సత్యం ఉంటుంది. అయితే, సంపూర్ణ సత్యం ఎవరి సొత్తూ కాదు. అన్నీ కాలంలో సృష్టించబడి చివరికి కాలగర్భంలో కలిసిపోతాయి. ప్రవక్త మహమ్మద్ కూడా కొరాన్‌లో మాత్రమే సంపూర్ణ సత్యం ఉందని, ఇంకెక్కడా ఉండబోదని బుకాయించలేదు. దైవం, సత్యం అన్నవి ఈ మానవ నిర్మితమైన మతాలను అధిగమించినవి. అది అవసరమైనపుడు ':దివ్యప్రజ్ఞ' యొక్క ఎన్నికను బట్టి కొత్తగా అభివ్యక్తమౌతాయి. నువ్వు దైవాన్ని మెదడు యొక్క ఇరుకు పరిధిలో బంధించలేవు, లేదా ఆ దివ్యశక్తిని, దివ్యచైతన్యాన్ని ఏ విధంగా, ఎక్కడ, ఎవరి ద్వారా అభివ్యక్తి కావాలో నియంత్రించలేవు. సర్వశక్తిమంతుడగు దైవానికి

ఎదురుగా నీ అల్పపరిధులు పెట్టలేవు. ఈ సాధారణ సత్యాలన్నీ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తించబడుతున్నాయి. మరీ ఎదగని మనసుతో చిన్నపిల్లల్లా ప్రవర్తించే వాళ్ళు లేదా ఏదో ఒక గతంలోని సూత్రంలో బంధించబడి మార్పుకోరనివాళ్లు మాత్రం దీన్ని అంగీకరించకపోవచ్చు.

(CWSA 32:109-10)

శ్రీఅరవిందులు

*

మతోన్మాదంతో కూడుకున్న వాటిల్లో ఏ ఔన్నత్యం లేదు — ఉద్దేశ్యంలో ఉన్నతత్వం లేదు, బహుశ ఉద్దేశ్యం యొక్క ఉద్రిక్తపూరిత ఉత్సాహం తప్ప. మతపరమైన ఉన్మాదం అన్నది మానసికంగా నిమ్నస్థాయిలో పుట్టిన అజ్ఞానానికి చెందినది — దాని కార్యాచరణ సాధారణంగా భయంకరంగా, హింసాత్మకంగా, హీనంగా ఉంటుంది. మతపరమైన ఉద్రేకపూరిత ఉత్సాహం అంటే ఒక యోధుని వలె తన జీవితాన్ని త్యాగం చేసి అమరవీరుడు కావడం అన్నది భిన్నమైన విషయం.

(SABCL 22:490)

శ్రీఅరవిందులు

మతం మార్పిడి గురించి (అక్టోబరు 19, 1935)

ఏ మతపరమైన విధానమైనా శాశ్వతమైనది, మార్పుచేయబడనిది అన్నది ఆ ప్రకటన యొక్క అర్థం అయితే దాన్ని అంగీకరించడం కుదరదు. కాని ఇక్కడ మతం అంటే అర్థం ఓ వ్యక్తికి దైవంతో ఉన్న సంబంధం అంటే, అప్పుడు అది సత్యమని, అది మానవుని ఆంతరంగిక జీవనానికి సంబంధించిన విషయమని అంగీకరించాలి. అందువల్ల దానిని ఏదో వ్యక్తిగత ప్రాపంచిక, సాంఘిక సౌకర్యాల కోసం ఇల్లు మార్చినట్టు, దుస్తులు మార్చినట్టు మార్చలేమని అర్థం. ఒకవేళ మార్పు చేయవలసినా, అది ఆంతరంగిక ఆధ్యాత్మిక కారణం కోసం, అంతర్గత అభివృద్ధి కోసం మాత్రమే జరగాలి. ఎవరూ ఏదో ఒక మతానికి, జాతికి, విధానానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. అయితే ఒక మతధర్మంలో ఉండి, బాహ్యజీవితానికి సంభంధించిన కారణంగా మరో మతంలోకి మారడం అంటే అర్థం, అతను అంతరంగంలో ఏ మతానికి చెందినవాడు కాదనీ, ఆతని పాత కొత్త మతాలు రెండూ ఓ శూన్యమైన

సిద్ధాంతం మాత్రమేనని అర్థం. అందువల్ల ఆ ప్రకటన తన సారాంశంలో ఆ విషయాన్నే ప్రతిపాదిస్తుందని నేననుకుంటున్నాను. ఇక్కడ మహాత్ముడు వ్యతిరేకించింది. — సత్యాని చేరడానికి మరో మార్గం ఎన్నుకోవడం లేదా ఆంతరంగిక ఆధ్యాత్మిక అనుభవాన్ని కోరుతూ మతం మార్చుకోవడం గురించి కాదు. ఆధ్యాత్మికపరమైన ఉద్దేశ్యం లేకుండా కేవలం సామాజిక అంతస్తు పెరగడానికో, లేదా ధనం కోసమో, లేదా వివాహం కోసమో మతం మార్చుకోవడం గురించే ఆ అవరోధం వ్యక్తపరచబడింది. ఓ వ్యక్తి తాను అంతరంగంలో ఏ మతానికి చెందనపుడు, తనకంటూ ఏ మతం లేనపుడు, అతడు ఏ ఉద్దేశ్యంతోనైనా తన మతాన్ని మార్చుకోవచ్చు. కాని తనకంటూ ఓ మతం ఉన్నపుడు మార్చుకోలేడు. ఒక ఆంతరంగిక ఆధ్యాత్మిక ఆవశ్యకతకు ప్రతిక్రియగా మాత్రమే మతాన్ని మార్చగలడు. కృష్ణుని దైవంగా పరిగణించి భక్తి భావంతో పూజించే ఓ వ్యక్తి, సంఘంలో పలుకుబడి కోసం సాంఘికమర్యాద కోసం, "నేను కృష్ణుని స్థానంలో క్రీస్తుని కొలుస్తాను" అని అనలేడు.

(CWSA 35:188-90)

శ్రీఅరవిందులు (అక్టోబరు 19, 1935)

అనువాదం: డి. సత్యవాణి

భారతమాత

నేటి సమస్యలు — భవిష్యత్ కర్తవ్యం

(II)



అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబరు 2013

13/9/201

అఖిల

అఖిల భారత పత్రిక. సెప్టెంబరు 2013

ప్రత్యేక సంచిక

భారతమాత — సమస్యలు, పరిష్కారము II

(శ్రీమాతారవిందుల రచనల సంకలనం)

త్రివిధ కర్మాచరణ అవసరం

ప్రాచీన ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని, అనుభవాన్ని, వాటి సమగ్ర వైభవము, పరిపూర్ణత, గాంభీర్యతలతో పాటు తిరిగి పొందుటకు అత్యావశ్యకంగా చేపట్టవలసిన మొట్టమొదటి పని. ఈ ఆధ్యాత్మికత నూతనంగా రూపొందిన తాత్వికచింతన, సాహిత్యం, కళ, విజ్ఞానశాస్త్రం, విమర్శనాత్మక నైపుణ్యతలలోకి జాలువారునట్టు చేయుట ఈ రెండవ పని. కొత్తగా తలెత్తిన సమస్యలను తనదైన ప్రజ్ఞతో భారతీయస్ఫూర్తి వెలుగులో ఎదుర్కొని ఆధ్యాత్మికత సంతరించుకున్న సమాజ సంయోజనాన్ని మరింత శ్రేష్ఠంగా తీర్చిదిద్దే ప్రయత్నం, అతి క్లిష్టమైన మూడవ పని. ఈ మూడు పనుల్లో సాధించే సాఫల్యత మానవజాతి భవితకు అందించే సహాయ సహకారాలకు కొలబద్దగా నిలుస్తుంది.
(CWSA 20:15)

శ్రీఅరవిందులు

విషయసూచిక

భారతమాత — నేటి సమస్యలు, భవిష్య కర్తవ్యము

"భారతావని మీ కంఠంతో పలుకుతుంది" — రవీంద్రనాథ టాగూరు

మహాకవి రవీంద్రనాథ టాగూర్ శ్రీఅరవిందుల వద్దకు 1907 లో, వారి విడుదల అనంతరం, విచ్చేసిన సందర్భంలో, ఈ వాక్యాలు వ్రాసారు:

"ఓ నేస్తమా, నా మాతృభూమి మిత్రమా, మూర్తీభవించిన స్వతంత్ర భారత ఆత్మ కంఠస్వరమా! ఓ అరవిందా! రవీంద్ర నాథుడు మీకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాడు".

మరో మారు 1928 లో' టాగూరు పాండిచ్చేరికి విచ్చేశారు. అప్పుడు వారు ఉద్ఘాటించినది:

"మీకు దైవాజ్ఞ అందింది. దానిని మీ నుండి స్వీకరించడానికి మేము వేచివున్నాము. ప్రపంచాన్ని ఉద్దేశించి భారతదేశం మీ కంఠంతో పలుకుతుంది, నా మాట వినండి..." అని.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

మన ముందున్న మహత్కార్యం

నిజమైన భారతీయ ఆత్మశక్తిని తిరిగి యథాస్థితికి తెచ్చుకోవడం (జూన్ 19, 1909)

మనం మన ముందు పెట్టుకున్న మహాకార్యం యాంత్రికమైనదేమీ కాదు. కాని అది నైతికం, ఆధ్యాత్మికం. మన లక్ష్యం ప్రభుత్వస్వరూపాన్ని మరొక విధంగా మార్చడం కాదు. అది ఒక దేశాన్ని నిర్మించేవిధం. ఆ మహాకార్యంలో రాజకీయం ఒక భాగం, కేవలం ఒక భాగం. మనం కేవలం రాజకీయాలకే మన జీవితాలని అంకితం చేయకూడదు, సామాజికమైన ప్రశ్నలకు కూడా కాదు, మతధర్మ గ్రంథాలకు లేక వేదాంతానికి లేక సాహిత్యం లేక విజ్ఞానశాస్త్రానికి కూడా కానే కాదు; వీటి నన్నింటినీ ఒకే అస్తిత్వంలో పొందుపరచాలి, మనం సర్వమూ ముఖ్యం అనేదానిని విశ్వసిస్తాం, అదే ధర్మం, అదే మన దేశం మతం, అది సార్వజనీనమని కూడా విశ్వసిస్తాం. అక్కడ జీవితాన్ని నడిపించే ఒక గొప్ప ధర్మముంది, మానవజాతి పరిణామానికి సంబంధించి ఒక గొప్ప సూత్రముంది, ఆధ్యాత్మిక జ్ఞానం, అనుభవాలతో కూడిన ఒక సమగ్ర శాస్త్రముంది. భారతదేశం వీటినన్నింటిని ఎల్లప్పుడూ సంరక్షిస్తూ ఉండాలని, ఉదాహరణప్రాయంగా ఉండాలని, ధర్మప్రచార కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఉండాలని విధి నిర్ణయించింది. ఇదే సనాతనధర్మం, శాశ్వతమగు మతం. పరాయిపాలనలోని అణచివేతల ఒత్తిడి వలన ఆమె చాలా వరకు తన ధర్మస్వరూపం కోల్పోవడందో పాటు తన జీవనసత్యాన్ని కూడా కోల్పోయింది. అది ఎందువల్లనంటే దానిలో జీవించనప్పుడు భారతదేశ మతం శూన్యం అవుతుంది. దానిని జీవితానికి మాత్రమే కాదు, జీవితం మొత్తానికి శ్రద్ధతో అనుసంధానించాలి, దాని ఆత్మశక్తి మన సమాజం లోకి, మన రాజకీయాలలోకి, మన సాహిత్యంలోకి మన శాస్త్రీయ విజ్ఞానంలోకి, వ్యక్తిగతస్వభావంలోకి, ఆత్మీయమగు ప్రేమలలోకి ప్రవేశించి వాటిని తీర్చిదిద్దాలి. ఈ ధర్మం హృదయం ఏమిటో తెలుసుకోవడం, దానినే సత్యంగా అనుభవంలోకి తెచ్చుకోవడం, అది పైకి ఉసిగొల్పే భావోద్వేగాలను అనుభూతిలోకి తెచ్చుకోవడం, వాటిని వ్యక్తపరచి, జీవితంలో అమలుపరచడం అనేదంతా కర్మయోగంగా మనం అర్థం చేసుకుంటాం. మానవజీవితం మొత్తంలో యోగాన్ని ఆదర్శంగా చేయడం

కోసమే ఈ రోజు భారతదేశం పునరుజ్జీవితం అవుతున్నదని మేము విశ్వసిస్తున్నాము; యోగం వలన ఆమె స్వతంత్రతతనూ, ఏకతనూ, మహత్వాన్నీ అనుభవంలోకి తెచ్చుకొవడానికి కావలసిన బలాన్ని పొందుతుంది, యోగం వలన దానిని భద్రంగా కాపాడుకోవటానికి వలసిన బలాన్ని సిద్ధంగా ఉంచుకుంటుంది. రాబోయేది ఆధ్యాత్మిక విప్లవంగా మేము చూస్తున్నాం. భౌతికం కేవలం దాని నీడ, ప్రతిబింబం మాత్రమే.

ఐరోపా జాతీయుడు యంత్రాన్నే అత్యంత ఉత్కృష్టమైనదిగా భావిస్తాడు. అతడు సమాజపరమైన వివిధ వ్యూహాలు పథకాలతో, ప్రభుత్వ వ్యవస్థలతో మానవజాతిని బాగుచేయటానికి అన్వేషిస్తుంటాడు. అతడు పార్లమెంటులో చట్టం ద్వారా సుపరిపాలనతో సర్వసమృద్ధతను తీసుకురాగలనే ఆశాభావం కలిగి వుంటాడు. యంత్రాలు చాలా ముఖ్యమైనవే, కాని అవి కేవలం వెనుక నుంచి నడిపించే శక్తియైన ఆత్మశక్తి యొక్క పనిని చేయడానికి తోడ్పడే ఉపకరణాలు మాత్రమే.

వ్యవస్థాపక విధానాలను మార్చడం ద్వారా మన సమాజాన్ని ఐరోపాకు అనుకరణ మాత్రంగా చేసి, దానిని పునరుద్ధరించ వచ్చుననే దానిని మేము విశ్వసించం. విధవా వివాహాలు, వర్గాన్ని వర్ణానికి ప్రత్యామ్నాయంగా చేయడం, వయోజన వివాహాలు, భిన్న కుంటుంబాలు — వర్గాలు — జాతుల మధ్య వివాహం, భిన్న కుటుంబాలు — వర్గాలు — జాతుల మధ్య ఆహారవిహారాదులు, ఇంకా సమాజసంస్కర్త చేసే ఇతర ప్రత్యేక కార్యక్రమాలూ అన్నీ కేవలం యాంత్రికమైన మార్పులు; అవన్నీ ఏ విధమైనటువంటి యోగ్యతలను లేదా అయోగ్యతలను కలిగి ఉన్నా అవి తమకు తాముగా దేశం ఆత్మను బతికించలేవు లేదా భ్రష్టమైపోవడాన్ని, క్షీణించిపోవడాన్ని ఆపలేవు. కేవలం ఆత్మశక్తి మాత్రమే రక్షిస్తుంది, కేవలం హృదయంలో ఉన్నతులమై, ముక్తులమై మనం సామాజికంగానూ, రాజకీయంగానూ మహోన్నతులమూ, స్వతంత్రులమూ కాగలము.

పశ్చిమ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న సంకుచితమైన, అధమమైన భావాలు కలిగిన మతాలకు లోబడి వాటికి మాత్రమే పరిమితమైన కొత్త తెగలను వృద్ధిచేసినంత మాత్రాన లేదా కేవలం వేషధారణతోను, రూపంతోను హిందూమతాన్ని కాపాడి నిలబెట్ట చూసే వ్యవస్థలను సృజించినంత మాత్రాన మన ఆధ్యాత్మిక స్వస్థతను, శక్తిని గొప్పతనమును తిరిగి పొందగలమనే విషయాన్ని మేము విశ్వసించం. ప్రపంచం అంతా స్వతంత్రమైన ఆలోచనలోనూ, భౌతికవాదంలోనూ బయటకు

రాలేనంతగా కొట్టుమిట్టాడుతూ, ఒక కొత్త సంయోజనంతో కూడిన పవిత్రమైన ఆలోచనలకూ, అనుభవాలకూ, అన్యమత ద్వేషం నుంచి విముక్తిపొందిన పవిత్రమైన విశ్వాసము, అత్యుత్సాహము సంపూర్ణంగా కలిగిన కొత్త జీవితం వైపుకూ, దేవుడు ఒక్కడే అనేదానిలో అచంచలమైన విశ్వాసం ఉండటం మూలంగా సర్వమతస్వరూపా లను ఆమోదిస్తూ, ముందుకు సాగిపోతున్నది. ఏ మతం విజ్ఞానశాస్త్రమును, విశ్వా సమును, ఆస్తికతను, క్రైస్తవాన్ని, ఇస్లాంను, బౌద్ధాన్ని అక్కున జేర్చుకున్నదో, అయినప్పటికీ వీటిలో దేనికీ సంబంధించినది కాదో దానికి ఈ విశ్వ-ఆత్మశక్తి పయ నిస్తున్నది. మనకు సొంతమైన మన మతం, చాలా ఎక్కువగా సందేహించబడింది, చాలా ఎక్కువగా విశ్వసించబడింది, చాలా ఎక్కువగా సందేహించబడింది, ఎందువల్ల నంటే అది చాలా ఎక్కువగా ప్రశ్నించింది, చాలా ఎక్కువ ప్రయోగాలను చేసింది. చాలా ఎక్కువగా విశ్వసించబడింది. ఎందువల్లనంటే దాని కున్నటువంటి లోతైన అనుభవం, ఎన్నో భిన్నరీతులు, అభ్యుదయాత్మకమైన ఆధ్యాత్మిక జ్ఞానం — అటువంటి విశాలమైన ఆ హిందూమతం ఒక మూర్ఖవాదంతో కూడిన సిద్ధాంతం కాదు, కాని అది ఒక జీవనధర్మం, అది ఒక సామాజిక చట్రం కాదు కాని భూతభవిష్య త్తుల సామాజిక పరిణామ ఆత్మశక్తి. అది దేనినీ తిరస్కరించదు, కాని ప్రతిదానిని పరీక్షించి, అనుభవంతో మేళవిస్తుంది: అది పరీక్షించి అనుభవ సాక్షాత్కారం చేసుకున్న ప్పుడు దానిని ఆత్మకు ఉపయోగకారకాలుగా మలుస్తుంది. ఈ హిందూమతంలోనే మనం భవిష్య ప్రపంచానికి ఆధారమును కనుగొంటాం. ఈ సనాతన ధర్మానికి ఎన్నో పవిత్ర గ్రంథాలు, వేదాలు, వేదాంతం, భగవద్గీత, ఉపనిషత్తులు, దర్శనాలు, పురాణాలు, తంత్రం ఉన్నప్పటికీ అది బైబిలును, ఖురానును తిరస్కరించ లేదు, కాని దాని నిజమైన అత్యంత ప్రామాణికమైన పవిత్ర గ్రంథం, శాశ్వతుడి నివాసం దేనిలో ఉందో, దాని హృదయంలో ఉంది. మన అంతరంగ ఆధ్యాత్మిక అనుభవాలలో ప్రపంచ పవిత్ర గ్రంథాల బుజువులను మూలాలను, జ్ఞానసంచయ సూత్రాలను, ప్రేమ, వర్తనలను, కర్మయోగానికి ఆధారాన్ని, స్ఫూర్తిని తెలుసుకోగలుగుతాం.

కనుక మన లక్ష్యం మానవజాతి కోసం భారతదేశ పునర్నిర్మాణంలో తోడ్పడటం — ఈ ఆత్మనిశ్చయంతో కూడిన దేశభక్తిని మేము బోధిస్తున్నాం, అనుసరిస్తున్నాం. మేము మానవజాతికి చెప్తున్నాం, "మీరు ఒక గొప్ప అడుగు వేయవలసిన సమయం ఆసన్నమైంది, భౌతిక అస్తిత్వంలో నుంచి ఎక్కువ ఉన్నతికి, ఎక్కువ లోతుకు,

ఎక్కువ విశాలతగల జీవితంలోకి మేల్కొని పునరుజ్జీవితులు కావాలి, అటువైపుకే మానవజాతి పోతున్నది. మానవజాతిని పట్టి పీడిస్తున్న సమస్యలను అంతరంగ స్వారాజ్యమును గెలవడం ద్వారానే పరిష్కరించగలం. అంతేకాని విశ్వప్రకృతి శక్తులను మన సుఖాలకు, విలాసాలకు ఉపయోగించుకోవడంతో కాదు. మేధోశక్తులనూ, ఆత్మశక్తులనూ స్వాధీనపరచుకోవడం ద్వారా, మనిషి స్వాతంత్ర్యాన్ని అంతరంగంలోనూ, బాహ్యంలోనూ కూడా సమర్ధవంతంగా వ్యక్తపరుస్తూ, అంతరంగంలో నుండి బాహ్యంలోని విశ్వప్రకృతిని గెలిచి వశంలోకి తెచ్చుకోవడం ద్వారా...".

వ్యక్తులందరికీ, ప్రత్యేకించి ఇప్పుడు భారతదేశ కార్యాచరణకు నడుం బిగించిన యువతకూ మేము చెప్తున్నాం, "మీరు ఐరోపాకు చెందిన భావాలకు తల ఒగ్గినా లేక జీవితాన్ని భౌతికపరంగా చూసినా మీరు ఈ ఆదర్శాలను అంటిపెట్టుకుని ఉండలేరు సరికదా వాటిని సఫలీకృతమూ చేయలేరు. భౌతికంగా మీరు ఏమీ కాదు, ఆధ్యాత్మికంగా మీరు సర్వస్వమూ. భారతీయుడు మాత్రమే సర్వాన్నీ విశ్వసించగలడు, సర్వాన్ని సవాలు చేయగలడు. సర్వాన్నీ త్యాగం చేయగలడు. కనుక మొదట భారతీయులు కండి. మీ పూర్వీకుల పిత్రార్జితమును తిరిగి రాబట్టుకోండి. ఆర్యుల ఆలోచననూ, ఆర్యుల నియమపాలననూ, ఆర్యుల విలక్షణతనూ, ఆర్యుల జీవితమునూ తిరిగి పొందండి. వేదాంతమును, గీతను, యోగమును తిరిగి వశంలోకి తెచ్చుకోండి. వాటిని మేధస్సులోనూ, మానసికోద్వేగాలలోనూ తిరిగి పొందడమే కాకుండా మీ జీవితాలలో కూడా పొందాలి. వాటి నన్నింటిని జీవించండి, దానితో మీరు గొప్పవారుగానూ, దృఢంగానూ శక్తిమంతులుగానూ, అజేయులుగానూ, నిరభయులుగానూ ఉంటారు. జీవితంలోనూ లేక మృత్యువులోనూ మీకు ఎటువంటి భయభీతులూ ఉండవు. క్లిష్టమూ, అసాధ్యమూ అనే మాటలు మీ పదకోశం నుంచి మాయమైపోతాయి. ఎందువల్లనంటే ధారుఢ్యం ఆత్మశక్తిలోనే శాశ్వతం. మీ బాహ్య సామ్రాజ్యాన్ని మీరు తిరిగి గెలుపొందగలిగే లోపల మీరు మీదైన మీ రాజ్యం, అంతరంగ స్వరాజ్యాన్ని తప్పక తిరిగి గెలుపొందాలి. అక్కడ శ్రీమాత నివసిస్తుంటుంది, ఆమె ధృఢత్వాన్నొసగటానికై ఆరాధనకు నిరీక్షిస్తుంటుంది. ఆమెలో విశ్వాసముంచండి, ఆమెను సేవించండి, మీ ఇచ్ఛలన్నీ ఆమె ఇచ్ఛకు వదలివేయండి, మీ అహంకారాన్ని దేశం యొక్క మహదహంకారంలో వదలండి, మీకే ప్రత్యేకమైన మీ స్వార్థాన్ని మానవజాతి సేవలో వదిలివేయండి. మీలోని సమస్త ధృఢత్వ మూలాన్ని

తిరిగి స్వాధీనపరచుకోండి. తదితరములైనవన్నీ సామాజిక భద్రత, విశేషమైన మేధస్సు, రాజకీయ స్వతంత్రతత, మానవ భావజాలం మీద ఆధిపత్యం, ప్రపంచసమాఖ్య మీద ఆధిపత్యం మీకు చేర్చబడతాయి."

CWSA 8:25-28

శ్రీఅరవిందులు

జాతీయ విద్య ఆవశ్యకత

(సుమారు 1902 ప్రాంతంలో)

భారతదేశంలో మనం ఎంత అనాగరికంగా తయారయామంటే మన పిల్లలను నీతి మాలిన ఉపయోగవాద సిద్ధాంత ప్రేరేపణలతో జ్ఞానమును సముపార్జించటానికి నిరాసక్తమైన కోరిక ఏమాత్రమూ లేకుండా పాఠశాలలకు పంపుతున్నాం, కాని దీనికి బాధ్యత మనం పొందే విద్యదే....

కనుక మనం చెడుపు కలిగిస్తున్నదని ఫిర్యాదు చేస్తున్నదాని మూలం ఒక విధంగా భిన్నమైంది. అది ప్రధానమైన తప్పు, పశ్చాత్తాపాన్ని కలిగించేది; అది ఏమిటంటే ఈ దేశంలో మనం విద్యను జ్ఞానసముపార్జనతో గందరగోళపరచి జ్ఞానానికే అర్థాన్ని విడమరచి చెప్పటంలో దానిని సాటిలేనిదిగా వృత్తిపరంగా, సాంకేతికపరంగా ప్రాధాన్యతనిస్తూ సంకుచితం చేసి వికాసానికి అవకాశం లేనిదానినిగా వ్యాఖ్యానించాం. విద్యార్థికి జ్ఞానాన్ని ప్రసాదించడం అవసరమైన విషయమే, దానితో పాటుగా దానికంటె ఇంకా ఎక్కువ అవసరమైనది అతనిలో అతని జ్ఞానమును వాడుకోగల సామర్థ్యమును నెలకొల్పడం.

కనుక సంస్కరణలోని మొదటి అడుగు విద్యకు సంబంధించి మొత్తం మన లక్ష్యాలకు, పద్ధతులకు విప్లవాత్మకంగా తీవ్రమైన మార్పులను చేసుకోవడమే. మనం మన ఉపాధ్యాయుల శక్తియుక్తులలో పదింట తొమ్మిది వంతులను క్రియాశీలకమై నిగూఢంగా ఉన్న మానసికశక్తులకు సంబంధించిన విద్యను గరపటానికి అంకితమయ్యే విధంగా తప్పక అలవాటు చేయాలి. దానితో పాటుగా స్మృతి అని మనమంతా పిలిచే, ఉదాసీనంగా ఉండే జ్ఞాపకముంచుకునే శక్తిని గుర్తించి, చక్కగా నిర్వచించి హద్దు లేర్పరచి తక్కువ స్థాయిలో దానికి చోటును నిర్ధారిస్తూ, మన పాఠశాల,

విశ్వవిద్యాలయ పరీక్షలను క్రియాశీలకమైన మానసికశక్తులను పరీక్షించటానికై నిర్దేశించాలే కాని జ్ఞాపకశక్తిని కాదు. ఇది మన ధ్యేయం అయినట్లయితే, దీనిని మనం కేవలం నిర్ధారించిన పాఠ్యప్రణాళికలో మార్పు చేయడం లేదా మళ్ళీ వర్దుబాటు చేయడం వలన సాధ్యమయ్యే పని కాదు. కొన్ని ప్రజ్ఞావిషయాలు మనస్సులో నిగూఢంగా ఉన్న కొన్ని శక్తులను అభివృద్ధి చేయడానికి ఎక్కువగా తగినవేననే విషయం నిజమే. కచ్చితమైన హేతువాదంతో ఆలోచించే ప్రజ్ఞకు రేఖాగణితం, తర్కం మరియు రాజకీయ ఆర్థికశాస్త్రం సమర్థవంతంగా సహాయపడతాయి. భాషలు నేర్వడం వలన ఒనగూడే సత్ఫలితాలలో చాలా ముఖ్యమైన ఫలితం సున్నితమైన భావాలతో భాషను వ్యక్తపరచే సామర్థ్యం తేటపడడంతో పాటుగా దానికి వలసిన శిక్షణ కూడా అలవడటం. చరిత్రను సునిశితంగా బుద్ధి సూక్ష్మతతతో అధ్యయనం చేస్తే, పోల్చి చూడగలిగే, తారతమ్యాలు గుర్తించగలిగే సామర్థ్యాన్ని అది విస్తృతపరచగలిగినట్లుగా మరేదీ చేయలేదు.... సమర్థవంతుడైన బోధకుడి చేతిలో, సర్వసామాన్యమైనటువంటి మానసిక సామర్థ్యాలన్నింటిని ఏ బోధనా విషయాలలోనూ, ఒక్క గణనశాస్త్రాలను మినహాయించి, అభివృద్ధిపరచ లేకపోవడమనేది లేదు.

CWSA 1:358-61

శ్రీఅరవిందులు

ఏ విధంగా చూచినా ఒక్క విషయం మాత్రం నిశ్చయం. భారతదేశ భవిష్యత్తులో, గతంలో మాదిరిగానే, ఆధ్యాత్మిక ప్రేరణ యదార్థమైన, ప్రధానమైన లక్షణంగా వుంటుంది.

CWSA 20:23

శ్రీఅరవిందులు

సమగ్ర విద్య ఆవశ్యకత

భారతదేశానికి ఆత్మను గురించిన జ్ఞానం ఉన్నది లేక ఒకప్పుడు ఉండేది, కాని ఆమె పదార్థమును నిరాకరించడం మూలంగా కష్టాల పాలయింది.

పశ్చిమానికి పదార్థం యొక్క జ్ఞానం ఉంది కాని ఆత్మను తిరస్కరించడం మూలంగా ఎక్కువగా కష్టాల పాలవుతున్నది.

సమగ్ర విద్యను కొన్ని తేడాలతో ప్రపంచ దేశాలన్ని సవరించి అమలుపరచుకుంటే, అది పూర్తిగా అభివృద్ధిపరచబడి, వినియోగించబడిన పదార్థం మీద సక్రమమైన పరమాత్మ అధికారాన్ని తీసుకురాగలదు.

*

ప్రశ్న: ఏ భ్రమలు, భ్రాంతులతో మన విద్యావిధానం ఈ రోజు ఇబ్బందుల పాలవుతున్నది? వాటిని మనం బహుశా ఏ విధంగా లేకుండా చేయగలం?

1) విజయాలకి, జీవనోపాధికి, ధనానికి చాలా మట్టుకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఇవ్వబడడం మూలాన.

2) పరమాత్మతో సాంగత్యానికీ, అస్తిత్వపరమ సత్యం వృద్ధికీ, అభివ్యక్తతకూ ఒత్తిడి చేయాలి.

*

నేను వారిని (ప్రభుత్వమును) యోగమును విద్యగా గుర్తించమని కోరుతున్నాను, అదేమీ మా కోసం కాదు, కాని అది దేశానికి మేలు చేస్తుంది.

పదార్థం పరివర్తన చెందుతుంది, అది ధృఢమైన ఆధారం అవుతుంది. జీవితం దివ్యం అవుతుంది. భారతదేశమే ముందుండి నడిపించు గాక.

CWM 13:361-63)

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ

స్వంత ఆలోచన ఆవశ్యకత
(1912 ప్రాంతంలో)

భారతదేశం సజీవంగా భగవద్దత్తమైన తన కార్యాన్ని ప్రపంచంలో నిర్వహించాలంటే భారతీయ యువత స్వతంత్రంగా ఆలోచించడం నేర్చుకోవాలి. విషయాల ఉపరి తలాన్ని మాత్రమే స్పృశించి ఆగిపోక ముందుగా వాటిని గురించి అభిప్రాయాల నేర్పరచుకొనకుండా, ఒక పదునైన ఖడ్గంతో, కుతర్కాన్ని, దురభిమానాన్ని చీల్చిచెండాడుతూ ప్రగతి నిరోధకమైన సమస్త విధానాలను భీముని గదాదండంతో తుత్తునియలు చేస్తూ, వాటి హృదయాన్ని తాకేటట్లు అన్ని విషయాల గురించి స్వతంత్రంగా ఆలోచించాలి. ఫలవంతమైయ్యేటట్లు ఆలోచించాలి. బట్టలతో చుట్టి కట్టివేతకు గురయ్యే యూరపు చంటిబిడ్డల్లా మన మస్తిష్కాలను ఎంత మాత్రం కట్టి పడవేయకూడదు. మనలో దైవశక్తులు తమ నిర్నిబంధ స్వేచ్ఛా కదలికలను తిరిగి సంపాదించుకొనేటట్లు చేయాలి. భారతీయుని మేధస్సుకు సహజమైన సూక్ష్మ పరిశీలననే గాక, విస్తృతమైన సాధికారతను సార్వభౌమ్యతను గూడా అది తిరిగి పొందాలి. ఒకసారి అది తన శక్తిని గ్రహించడాని కలవాటుపడితే, ఆ శక్తివల్ల కలిగే ప్రయోజనం మీద నమ్మకం కుదిరితే, ఆ శక్తి తేలికగానే భారతీయ మేధకు తిరిగి లభిస్తుంది. అది గనుక గతానికి సంబంధించిన అవరోధాల నధిగమించి బంధాలను పూర్తిగా తొలగించుకో లేకపోతే కనీసం రోటికి కట్టివేయబడిన చిన్ని కృష్ణునిలాగ అయినా అది తయారై, తనతో పాటు రోటిని, దానితోపాటు అడ్డువచ్చిన అన్నింటినీ ఈడ్చుకొని పోతూ, తన ప్రగతి పథాని కడ్డుగా నిలిచే రెండు వృక్షాలను అంటే ఆత్మోద్ధరణ కవరోధాలైన మధ్య యుగాల నాటి అంధదురభిమానం, ఆధునిక తలబిరుసుతనం గల మౌఢ్యం అనే రెండు వృక్షాలను సైతం పెకిలించివేయాలి. పాత సుస్థిర పునా దులను కూల్చివేయాలి. మన మిప్పుడు పెనుమార్పుల పరివర్తనా జలధుల్లో పడి అటూ, ఇటూ కొట్టుకుపోతున్నాం. మంచు పలకల్లాంటి పాతవాటిని పట్టుకొని వ్రేళ్ళాడితే ప్రయోజనముండదు. అవి త్వరలో కరగిపోయి వాటి నాశ్రయించిన వాళ్ళను ప్రమాదాల వరదల్లో కొట్టుమిట్టాడేటట్లు చేస్తాయి. సముద్రమూ లేక మంచి పొడి ప్రదేశమూ కాని అస్థిరమైన ఐరోపాకు చెందిన ద్వితీయ శ్రేణి ఊబిలో మనల్ని మనం పడవేసుకొన్నందువల్ల ప్రయోజనం ఉండదు. అక్కడ మనం హృదయ

విదారకమైన, అసహ్యామైన చావు చస్తాం. అలా జరగడానికి వీలు లేదు. మనం ఈత నేర్చుకోవాలి, ఆ శక్తి నుపయోగించి, నిత్యమై నిలిచి సత్యానికి సంబంధించిన మంచి నావ దగ్గరకు చేరాలి, యుగయుగాల నుండి నిలిచివున్న శిలలాంటి శాశ్వత సత్యంపై మనం తిరిగి నిలబడాలి.

మనం అనాలోచితంగా దేనినీ ఎంచుకోగూడదు. ఇదమిత్థంగా దేన్నీ తేల్చి చెప్పలేనట్లు, దాన్నీ దీన్నీ కలిపి ఒక కలగూర గంపను చేసి ప్రాచ్యపాశ్చాత్యాలను జీర్ణించుకొని తయారుచేసాం దీన్ని అని దేన్నో చూపించి గర్వంగా చెప్పుకోగూడదు. ఎటువంటిదాన్నైనా, ఎక్కడ నుండో లభించినదాన్నైనా వెంటనే అంగీకరించకుండా ప్రతిదాన్నీ ప్రశ్నించుకొంటూ స్వంత అభిప్రాయాల నేర్పరచుకోవాలి. అలా చేస్తే మనం భారతీయులం కాకుండా పోతామేమోననీ, హిందూధర్మాన్ని త్యజించి నట్లౌ తుందేమోననీ మనం భయపడాల్సిన అవసరం లేదు. నిజంగా మన కోసం మనం ఆలోచించినట్లైతే భారతదేశం భారతదేశం కాకుండా పోదు, హిందూధర్మం హిందూ ధర్మం కాకుండా పోదు. మన కోసం యూరపు ఆలోచించడాన్ని మనం అంగీకరించిన ప్పుడే హిందూధర్మాన్ని సరిగా నిర్వహించలేనివాళ్ళమై యూరపుకు మతిలేని నకలుగా తయారయ్యే ప్రమాదంలో భారతదేశం పడిపోతుంది. మన దారిలో మనం పయనించే ముందు గ్రుడ్డిగా దేన్నో అనుసరిస్తూపోయే వాళ్ళంగా కాకూడదు. స్వతంత్రంగా ఆలోచించగలవాళ్ళంగా మనం మొట్టమొదట దేన్నీ అంగీకరించక ప్రతిదాన్నీ ప్రశ్నించాలి. అవి క్రొత్తవిగాని, పాతవిగాని పరీక్షించి నిగ్గు తేల్చని అభి ప్రాయాలను వదిలించుకోవాలి. మనస్సులో కేవలం అలవాటుగా తయారైన సంస్కా రాలను ముందుగానే యేర్పరుచుకొన్న అభిప్రాయాలను వదిలించుకోవాలి. బుద్ధుడు "అనిత్యః సర్వ సంస్కారః" అన్నాడు. దీనితో నేను పూర్తిగా యేకీభవించగలనో లేదో తెలియదు. వస్తువులున్నట్లే శాశ్వతంగా వున్నట్లు కన్పించే కొన్ని సంస్కా రాలున్నాయి. అసలు ఆత్మ అంటే యేమిటి? విషయాలను దర్శించే ఒక ప్రాథమిక, శాశ్వత వైఖరి, స్వతహాగా అజ్ఞేయమైన, నేతి, నేతి, సమస్త అస్తిత్వపు అత్యంతావశ్యక ఆధారం. అందుచేత తరువాతి కాలంలోని బౌద్ధులు ఆత్మ అనేదసలు లేనే లేదని సిద్ధాంతీకరించారు, చిట్టచివరికి శూన్యం దగ్గరకు చేరారు. అదొక ప్రయోజనంలేని, మతిలేని మాట. ఎందుకనంటే శూన్యం కూడా స్వయంగా ఒక సంస్కారమే. అలా అయినప్పటికీ మనకు అలావాటుగా మారిన అవగాహనా రాశిలో, అధిక భాగం

తాత్కాలికమైనవే గాక, అపరిపూర్ణమైనవి, పెడదారి పట్టించేవి అనేది యదార్థం. మనం ఈ అపరిపూర్ణతల నుండి బయటబడి సత్యమైనదేదో, చిరస్థాయిగా ఉండేదేదో దానిని తెలుసుకొనడానికి, అన్నింటినీ ఒకే విధంగా, తీవ్రంగా నిష్పక్షపాతంగా ప్రశ్నించాలి. అయితే మన భావనా పరంపర ప్రకారం ఏది నిజమైనదో, యేది శాశ్వతమైనదో తెలుసుకొనుటకు అన్నింటినీ ఒకే రకమైన నిష్పకర్షతో, నిష్పాక్షికతతో పరిశీలించాలి.

CWSA 12:40-41

శ్రీఅరవిందులు

ఒక దృఢమైన పునాది నిర్మాణం జరగాలి (1909)

సముద్రంలో తరంగం యెలా ఒక భాగమో అలా విశ్వం నుండి మనిషి వేరుకాదని, విడదీయలేని ఒక భాగమని ప్రాచీన ఆర్యులకు తెలుసు. ఒక అనంత ఊర్జం, ప్రకృతి, మాయ లేక శక్తి ప్రపంచమంతా వ్యాపించి వుంది. ప్రతి నామ, రూపంలోనూ తనను తాను నింపుకొంటుంది. మట్టిముద్ద, మొక్క, క్రిమి, జంతువు, మనిషి, ఈ దృశ్యజగత్తులో, ఈ మహా ఊర్జానికి, హెచ్చుతగ్గులుగా దక్షతగల ఆధారాలు. ఆ ఊర్జతరంగాలు ఉత్పత్తై, నిలువ వుండే ఒక యంత్రం లాంటి వాళ్ళం మనలో ప్రతి ఒక్కరమూ. నిరంతరం ఆ ఊర్జాన్ని భద్రపరుస్తూ, ఉపయోగిస్తూ, తిరిగి భర్తీ చేస్తూన్న యంత్రంలాంటి వాళ్ళం మనలో ప్రతి ఒక్కరం. ఏ క్రియాశక్తి తారకల్లోనూ, గ్రహాల్లోనూ కదలాడుతోందో అదే మనలోనూ కదలాడుతోంది. మన చింతన, కర్మ కేవలం దాని క్రీడ, దాని వ్యాపారాల సంక్లిష్టత నుండి ఉద్భవించినవే అవి. దానికి ఒక ఆధారంగా తన సామర్థ్యాన్ని పెంచుకొనేందుకు మనిషికి అందుబాటులో కొన్ని ప్రక్రియ లున్నాయి. అతనికీ, విశ్వజనీన ఊర్జానికీ మధ్య ఆదానప్రదానలు జరిగేందుకున్న మార్గంలోగల ఆటంకాలను అతడు తొలగించి నిష్కంటకం చేసి, ఆ ఊర్జపు నిల్వల నుండి అధికాధికంగా అతని అంతరాత్మలోనికి, మస్తిష్కంలోనికి, దేహం లోనికి గ్రుమ్మరిల్లేటట్లు చేయడానికి మరి కొన్ని ప్రక్రియ లున్నాయి. ఈ విధంగా ఆధారంలో తరచుగా జరిగే అభివృద్ధే, దానిని ప్రోత్సహించే, విశ్వజనీన

ఊర్జం నిర్వహించే కర్మ పరిమాణంలోనూ, సంక్లిష్టతలోనూ జరిగే అభివృద్ధే, పరిణామపు మొత్తం లక్ష్యం. మానవ ఆధారానికిగల శక్తిని బట్టి అది భరించగలిగినంతగా ఆ ఊర్జం వాసిలో అత్యున్నతమూ, రాశిలో సంపూర్ణమూ అయినపుడు, లోపలికి దుముకుతూ ప్రవేశించివచ్చేదాన్ని, దాని ఖేలనాన్ని భరించగలిగినట్లు పూర్తిగా ఆ ఆధారం శిక్షణ పొంది వున్నపుడు, అతడు సిద్ధుడౌతాడు, పరిపూర్ణుడు, ధన్యుడు అవుతాడు. సాధారణ జనబాహుళ్యం యుగాల పర్యంతం దేని కోసం శ్రమిస్తున్నదో ఆ అభివృద్ధి అతనిలో సంపూర్ణమైనట్లే, అతని పరిణామం ముగిసినట్లే.

ఈ సిద్ధాంతం సరైనదైనపుడు మేధోవ్యాపారానికి ఆధారంగా వున్న ఊర్జం మనలోనే ఉండి ఉండాలి. అయినపుడు అది అపరిమిత అనుష్టానానికి, మహనీయ విస్తరణకు, మరింత సమృద్ధ ప్రయోజనానికి తప్పక సమర్థవంతమై వుంటుంది. అంతేగాక ఇదొక పటిష్టమైన సూత్రం కూడా అయివుండాలి. అంటే మనం ఈ ఊర్జాన్ని యెంతగా మనలో పెంపొందించుకొని, యెంతగా సమృద్ధం చేసుకోగలుగుతామో అంతగా మన మనోవ్యాపారాలకు సంబంధించిన అంతర్నిహితంగా ఉండే శక్తి, పనిచేసే శక్తి, కార్యకలాపాల పరిధి పెరుగుతుంది. తత్పర్యవసానంగా మన బుద్ధికుశలత, మనం సాధించేవాని మహనీయత గొప్పగా అవుతాయి, అనేదొక పటిష్ట మార్గదర్శకసూత్రం కూడా అవుతుంది. ప్రాచీన ఆర్యులు ఈ ప్రధాన సూత్రాన్నాధారంగా చేసుకొని తమ విద్యావిధానాన్ని రూపొందించారు. ఆ ఊర్జాన్ని మనిషిలో పెంపొందించడానికి వారు పాటించినది బ్రహ్మచర్యం.

CWSA1:370-71

శ్రీఅరవిందులు

సమగ్రాభివృద్ధి ఆవశ్యకత

(1909-1910)

మానవచింతన కార్యసరళి తనను తాను రెండు బృందాలుగా విడగొట్టుకొంది. ఒకటి దక్షిణహస్తం: జపం, సృజన, ఊహ, సత్యాన్ని చూడగల కేంద్రాలు అన్నీ కలిసి ఒక బృందం. రెండు వామహస్తం: విమర్శ, తర్కం, వివేచన, విచారణ, చూచినదాని సత్యాన్ని బేరీజు వేసే కేంద్రాలు. విద్యావిధానంలో రెండవ బృందానికి సంబంధించినవి. శాస్త్రీయ, ప్రత్యక్ష శిక్షణల ద్వారా వృద్ధిచెందాయి. అయితే, వామహస్తానికి సంబంధించిన వాటి అభివృద్ధి ఒక్క పరిశీలనా లక్షణం మాత్రమే. ఈ కారణంచేత కేవల శాస్త్రీయ విద్యావిధానం కొన్ని పరిమితులకు లోబడి చింతనను నిశితం చేస్తుంది, స్పష్టంగా చూడగలిగేటట్లు చేస్తుంది. కాని అది సంకుచితమూ, ఆర్ద్రతారహితమూ, నిస్తేజమూ అవుతుంది. దక్షిణహస్తానికి సంబంధించిన వాటిలో యెటువంటి శిక్షణ లేకపోయినా మనిషి తన పరిధిలో సైతం, ఒక స్థిరమైన గాడిలో మాత్రమే పురోగమించగలడు. మానవ సంస్కృతిని అతడు విశాలం చేయలేడు లేదా విజ్ఞానశాస్త్రపు హద్దుల్ని విస్తృతం చేయలేడు.

మేధోపరంగా అభివృద్ధి చెంది విజ్ఞానశాస్త్ర జ్ఞానంలో బలవంతునిగా యెదిగి, పంచభూతాలను తన సేవకులుగా, ప్రపంచాన్ని తన పాదపీఠంగా ఉపయోగించుకొంటూ, స్థూల సూక్ష్మ ప్రకృతిపై మనిషి పట్టు సాధించాడు. కాని అతడు హృదయంలోనూ, తత్త్వతహానూ అభివృద్ధి చెందలేదు. ఆ కారణంచేత తనలోని జంతు స్వభావాన్ని సంతృప్తిపరచేందుకు పాక్షిక దైవశక్తుల్ని ఉపయోగించే అధమస్థాయి అసురుడుగా తయారవుతాడు.

CWSA 1:438-39

శ్రీఅరవిందులు

మనుష్యుల్ని తయారుచెయ్యాలి, యంత్రాల్ని గాదు

(ఫిబ్రవరి 24, 1908)

జాతీయవిద్యను రెండు మూడు వాక్యాల్లో నిర్వచించలేము. గతంలో తానేమిటో అచటి నుండి మొదలుపెట్టి వర్తమానాన్ని పూర్తిగా వినియోగించుకొంటూ ఒక గొప్ప జాతిని తయారుచేసే విద్యగా, దానిని ప్రస్తుతానికి చెప్పుకోవచ్చు. ఒక జాతిని గతంతో సంబంధం లేకుండా వేరుచేయాలని చూసేవాళ్ళెవరైనా వాళ్లు మన జాతీయ జీవనవికాసానికి తోడ్పడనివాళ్లే. వర్తమానం వల్ల ప్రయోజనం పొందలేని వాళ్ళెవరైనా సరే వాళ్ళు జీవనసంగ్రామంలో మనల్ని ఓటమికి గురిచేసేవాళ్ళే. అందువల్ల భారతదేశం మనకు తెలియని పూర్వకాలం నుండీ కూడబెట్టిన జ్ఞానాన్ని, సౌశీల్యాన్ని, ఉదారభావాల్ని అన్నింటినీ కాపాడుకోవాలి. యూరపు మన కివ్వగలిగిన అత్యుత్తమ జ్ఞానాన్ని మనం ఆమె కోసం సంపాదించి, ఆమెకే ప్రత్యేకంగా కల జాతీయ ప్రవృత్తికి తగిన విధంగా జీర్ణించుకోవాలి. మానవజాతి అభివృద్ధి చేసిన అత్యుత్తమ బోధనా పద్ధతులను, అవి ఆధునికమైనవైనా, లేదా ప్రాచీనమైనవైనా మనం స్వీకరించి మన విద్యావిధానంలో ప్రవేశపెట్టాలి. యంత్రాన్నిగాక మనుష్యుల్ని తయారుచేయడానికి వీలుగా, తమ మీద తమకు నమ్మకం కలిగించే విద్యావిధానానికి, వీటి నన్నింటినీ సమన్వయం చేసి ఒక వ్యవస్థను రూపొందించాలి.

CWSA 7:895

శ్రీఅరవిందులు

నైతికత, విలువల ఆధారిత విద్యకు సరైన మార్గం

(1910)

నీతికి సంబంధించిన, మతానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను పిల్లలకు బోధించడం ద్వారా వాళ్ళను నీతివంతులుగా, మతావలంబకులుగా తయారవుతానుకోవడం వ్యర్థం, అదొక భ్రమ. ఎందుకనంటే మనస్సు హృదయం ఒకటి కావు. మనస్సుకు విద్య గరపినందున హృదయం తప్పకుండా అభివృద్ధి చెందుతుందని లేదు. అలా అని దానికేం ప్రభావం ఉండదని చెప్పడమూ సరి కాదు. అది అంతఃకరణలోనికి కొన్ని ఆలోచనా బీజాలను వెదజల్లుతుంది. ఈ భావాలు గనుక అలవాట్లుగా మారితే అవి శీలం మీద ప్రభావం చూపిస్తాయి. నీతులను తెలిపే పాఠ్యపుస్తకాలతో ప్రమాదమేమిటంటే ఉన్నత విషయాలను ఆలోచించడాన్ని గూడా యాంత్రికం గానూ, కృతకంగానూ తయారుచేస్తాయి. యాంత్రికమైనది, కృతకమైనదేదీ గూడా శాశ్వతంగా మంచిని పెంచలేదు.

పిల్లల మీద ఒకానొక క్రమశిక్షణను విధించవచ్చు, క్రమపద్ధతిలో ఒక ప్రత్యేక రీతిలో వుంచవచ్చు. కావాలనుకొన్న మార్గంలో వారిని కట్టడి చేయవచ్చు. కాని వాళ్ళ హృదయాలను, స్వభావాలను నీ వైపు త్రిప్పుకోలేకపోతే నీవు విధించిన ఈ నియమావళి ననుసరించడం మిథ్యాచారంగా, హృదయం లేనిదిగా ఒక కట్టుబాటుగా తరచుగా పిరికివాళ్ళ అంగీకారంగా తయారవుతుంది.

నైతికశిక్షణ ప్రథమ నియమం ఏమిటంటే సూచించడం, ఆకర్షించడమే గాని ఆజ్ఞాపించడం విధించడం గాదు. సూచించడానికి ఉత్తమమైన విధానం వ్యక్తిగత ఉదాహరణ, నిత్యసంభాషణ, రోజూ చదివే పుస్తకాలు. మరీ క్రింది తరగతులలోని విద్యార్థికి గతంలోని ఉదాత్త ఉదాహణ లుండాలి. అది కూడా నీతిపాఠాలుగా గాకుండా మానవులకు యెంతో ఆసక్తి కలిగించే విషయాలుగా ఉండాలి. పై తరగతుల విద్యార్థుల పుస్తకాలలో చరిత్ర పుటల కెక్కిన మహాత్ముల మహనీయ భావాలు, మహోన్నత భావోద్వేగాలు రగిలించే ఉన్నతోన్నత ఆదర్శాలు, ఆకాంక్షలు, వాటిని జీవిస్తూ సోదాహరణంగా నిలచినవారి జీవితచరిత్రలు ఉండాలి. ఇదొక విధమైన సత్సంగం. అది ఆడంబరంతో నిండిన మతప్రవచనం గాకపోతే ప్రభావం చూపకుండా ఉండదు. తన విద్యార్థుల ముందు తానుంచే మహనీయ విషయాలచే తాను రూపుదిద్దుకొన్న

వాడై వున్న ఉపాధ్యాయుని వ్యక్తిగత జీవితం విద్యార్థులపై అత్యున్నత ప్రభావం చూపిస్తుంది. ఏదేమైనా దానికున్నది పరిమిత పరిధే యైనప్పటికీ, ఆ పిల్లవాని జీవితంలో తలెత్తే నైతిక ప్రేరణలు, అతని చర్యలలో వ్యక్తం గావడానికి అవకాశమిస్తే తప్ప అది పూర్తిగా శక్తివంతం గాదు.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

భారతదేశం — స్త్రీల సమస్య

...మగవాడు తను గొప్పవాడినని భావించి ఆధిపత్యం చెలాయించాలని చూస్తాడు. స్త్రీ తను అణచివేయబడినట్లు భావించి రహస్యంగానో, బాహటంగానో ప్రతిఘటిస్తుంది. స్త్రీపురుషుల మధ్య ఈ నిరంతర సంఘర్షణ తరతరాలుగా కొనసాగుతోంది. దాని సారాంశం ఒక్కటే. అయినా అది అసంఖ్యాకమైన భిన్నరీతుల్లో వ్యక్తమౌతూ ఉంటుంది.

స్త్రీ మొత్తం తప్పంతా మగవాడిదే నన్నట్లు, మగవాడు కూడా నేరమంతా స్త్రీ మీద వేస్తాడు. నిజానికి ఆ తప్పు ఇద్దరూ సమానంగా పంచుకోవలసినదే. ఎవ్వరూ ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ అని చెప్పడం కుదరదు. పైగా ఈ ఎక్కువ, తక్కువ అన్న భావం పూర్తిగా నిర్మూలిస్తే తప్ప, ఏదీ కూడా, ఎవరూ కూడా ఈ అపార్థాలను అంతమొందించలేరు. మానవజాతిని రెండు పరస్పర వ్యతిరేక వర్గాలుగా విభజించిన ఈ సమస్యను పరిష్కరించడం కుదరదు.

...వారి పరస్పర సంబంధాలలో స్త్రీపురుషులు ఒకే సమయంలో ఒకరిపై నొకరు నిరంకుశ ఆధిపత్యం నెరపుకుంటూ, కొంతవరకు ఒకరి కొకరు జాలిగొలిపే బానిసలుగా కూడా వ్యవహరిస్తారు.

అవును, బానిసలే. ఎందుకంటే ఎవరికైనా కోరికలున్నంత వరకు, ఇష్టాయిష్టాలు, ప్రాధాన్యత లున్నంతవరకు, మమకారులున్నంత వరకు, వాటిని తృప్తిపరచడం కోసం, మనుషుల మీద ఆధారపడినంత వరకు, వాటికి, ఆ మనుష్యులకు బానిసలై వుండపలసిందే.

ఆ విధంగా స్త్రీ మగవానికి బానిస అయింది. కారణం, పురుషునిపైన అతని

సామర్థ్యం పైనా స్త్రీకున్న ఆకర్షణాభావం, తనదన్న ఇంటి కోసం అది కలిగించే భద్రతాభావం కోసం, చివరిగా మాతృత్వం పట్ల ఆమెకున్న మమకారం కోసం. అలాగే పురుషుడు కూడా స్త్రీకి బానిసగా ఉంటాడు. కారణం, అతడు స్త్రీని తన స్వంత ఆస్తిగా భావిస్తాడు, అధికారబలంతో ఆధిపత్యం చూపాలన్న దాహం, భౌతిక సుఖలాలస, వివాహం ద్వారా వచ్చే చిన్న చిన్న సుఖాలు, సదుపాయాలు, మమకారాల పై ఆశ.

అందుకే, తమంతట తాము స్వేచ్ఛను కోరితే తప్ప స్త్రీలకు ఏ చట్టం విముక్తి కల్గించలేదు. ఆ విధంగానే ఎంతో ఆధిపత్యం చూపే పురుషులు కూడా, వారి ఆంతరంగిక బానిసత్వం నుండి విముక్తి పొందితే తప్ప స్వేచ్ఛను పొందలేరు.

అత్యంత ఉన్నత క్షణాల్లో స్త్రీపురుషులు వారి లింగభేదాన్ని మర్చిపోగలరు, కాని అది ఓ చిన్న ప్రేరణతో తిరిగి బయటకొస్తుంది. స్త్రీకి తను స్త్రీనన్న భావం, పురుషుడికి తను పురుషుడినన్న భావం తలెత్తి మళ్ళీ ఆ ఘర్షణ అనంతంగా బాహాటంగానో, తెర వెనుకనో లేక మరేదో రూపంలో సాగుతూనే ఉంటుంది. స్త్రీపురుషులన్న భేదం లేకుండా, లింగభేదంలేని శరీరాల్లో ఆత్మ అభివ్యక్తి జరిగేంత వరకు, ఈ సంఘర్షణ తప్పదని మనం ఆశ్చర్యంతో చూస్తూ ఉంటాం....

అలాంటి విప్లవాత్మకమైన, ఆనందకరమైన పరిష్కారానికి మనం చేరుకునేవరకు, ఇతర దేశాలలో వలె భారతదేశంలో కూడా ఈ విషయంలో సంఘర్షణాత్మకమైన వైరుధ్యాలతో కూడి ఉన్నదిగానే ఉంటుంది. అయితే అది చాలా విస్తృతమైన, సర్వసమగ్రమైన సంయోజనం ద్వారా మాత్రమే పరిష్కరించబడుతుంది.

నిజానికి, భారతదేశంలో కాదా, దివ్యమాతను, విశ్వమాతను, శత్రువిజేతను, సర్వదేవతా జననిని, లోకమాతను , వరప్రదాయినిని అత్యంత గౌరవపురస్కర ప్రేమానురాగాలతో, సంపూర్ణ భక్తితత్పరతతో పూజించేది?

మరి ఈ భారతదేశంలోనే కదా, స్త్రీజాతికి కీలకమైన విషయాలపై తీవ్రమైన నిరసన అత్యంత అధికమైన ఏహ్యత వ్యక్తమయింది. స్త్రీజాతిని మాయగా, కలుషితం చేసే భ్రమగా, పతనానికి, దైన్యానికి కారణంగా, వంచన అపవిత్రతలతో దైవం నుంచి దూరంచేసే ఆకర్షణగా చూడబడుతున్నది.

భారతదేశ జీవితమంతా ఈ పరస్పర వైరుధ్యాలతో నిండి ఉంటుంది. దానివల్ల ఆమె మనసు, హృదయం కూడా వేదనాభరితంగా ఉంటాయి....

ఏది ఏమైనా నూతన చైతన్య ప్రోద్బలంతో ప్రకృతి పరస్పర సహకారంగానున్న భిన్నజాతులైన స్త్రీ, పురుషులుగా విభజింపబడినందున ఈపశుప్రాయమైన సంపర్కానికి లొంగి ఉండవలసిన అవసరం తప్పే వరకు మానవజాతి అత్యధికమైన మంచిని సమకూర్చాలంటే, ఈ రెండు జాతులను సమగ్ర సమానత్వంగల స్థాయిలో పరిగణించాలి. ఏ రకమైన పక్షపాతం లేకుండా ఒకే రకమైన విద్య, శిక్షణ మరియు ఏ లింగభేదం లేని దివ్యవాస్తవం యొక్క ఎరుక కల్గించాలి.

ఆ విధంగా పరస్పర వైరుధ్యాలకు నెలవైన భారతదేశం, కొత్త ఆలోచనలకు, నూతన ఆవిష్కరణలకు కూడా నిలయం కావచ్చు. గతంలో కూడా ఆమె అట్టి ఆలోచనలను అంకురింపచేసి పోషించే ఊయలగా అలరారింది.

(CWM 12:103-06)

శ్రీమాత

గర్భనిరోధం

(ఆగస్టు 29, 1926)

విజ్ఞానశాస్త్రివేత్తలు, వైద్యనిపుణులు గర్భనిరోధనకు నూతన పద్ధతులు కనిపెట్టారు. అది శరీరానికి ఏ ప్రమాదం లేకుండా గర్భాన్ని నిరోధించగలవు. దీని లక్ష్యాలు రెండు: మొదటిది, అధిక సంతానం కలగకుండా ఆపడం; రెండవది జన్మించే కొద్దీ శిశువులైనా ఆరోగ్యవంతులుగా నుండుటకు, స్త్రీని ఆరోగ్యవంతంగా ఉంచడం.

ఆంతరంగిక నిగ్రహం కల్గి ఉండడం మంచిదే, కాని అది మనుషుల నుంచి ఆశించగలమా?...

(ఒక శిష్యుడు) దీనికి ఒక అభ్యంతరముంది; అది మరింత స్వేచ్ఛను ఇవ్వచ్చు.

అది కూడా ఒక నైతికమైన ఆలోచన. ఇక్కడ రెండు పరాకాష్ఠ స్థాయి లున్నాయి. ఒకటి ఆత్మనిగ్రహం, రెండవది నిగ్రహంలేని విచ్చలవిడి స్వేచ్ఛ. ఈ రెండింటికి మధ్య ఉన్నది గర్భనిరోధం.

(సంభాషణల జ్ఞాపకాల్లోంచి)

శ్రీఅరవిందులు

వివాహ మరియు కుటుంబవ్యవస్థల రద్దు

ప్రశ్న: కొందరు ఆధునిక సంఘసంస్కర్తలు కుటుంబ వ్యవస్థ కూలిపోవచ్చునని, అంతరించిపోవచ్చునన్న భయం వ్యక్తం చేసిన సందర్భంలో, మీరు ఇదివరలో ఈ వ్యవస్థ రద్దుకావడం గురించి ఇలా చెప్పారు.. "ఈ కదలిక గతంలోను, ప్రస్తుతం కూడా మానవజాతి మరింత ఉన్నత విస్తృత సాక్షాత్కారాన్ని పొందడానికి తప్పనిసరి".

ఇది మరికొన్ని ముఖ్యమైన ప్రశ్నలను లేవదీస్తుంది. వాటిని మీకు విశదీకరించడానికై ప్రస్తావిస్తున్నాను:

1. కుటుంబ వ్యవస్థ రద్దు చేయడం అన్నది ఆధ్యాత్మిక ఆదర్శాన్ని, లేదా ఉన్నత మానసిక మార్గాన్ని అనుసరించే ప్రత్యేకమైన వ్యక్తులు మాత్రమే తప్పనిసరిగా ఆవలంబించవలసిన పద్ధతిగా మీరు భావిస్తున్నారా?

అవును. ఎవరైతే ఆధ్యాత్మిక లేదా ఉన్నత మానసిక ఆదర్శాన్ని అనుసరిస్తారో ఆ కొద్దిమంది ప్రత్యేక వ్యక్తుల కోసమే.

2. ఈ పృథ్వీ మీద నూతన విధానంలో సూటిగా జన్మ ధారణ జరగటం సర్వసాధారణమగుటకు ముందుగానే, మీరు మానవులందరికి కుటుంబవ్యవస్థను రద్దుచేయడం సిఫార్సు చేస్తారా?

విధానంలో మరింత స్వేచ్ఛ, మృదుత్వం ఉండడం ఎప్పుడూ ఉచితమైనవే. మార్పులేని నిబంధనలు పరిణామానికి అపాయకరం.

3. మానవుల ఉన్నతికి, అభివృద్ధికి ఈ కుటుంబవ్యవస్థ రద్దుతో పాటు, వివాహ వ్యవస్థ కూడా రద్దుచేయడం తప్పనిసరి అని మీరు భావిస్తారా? నూతన విధానంలో జన్మ ధారణ సాధారణమైన విషయంగా సంభవం కానంతవరకు, ఇప్పుడున్న ఈ సామాన్యమైన లైంగిక సంపర్కం వల్లనే జన్మ ధారణ జరగడం కొనసాగాలి కదా? అలా జరిగినప్పుడు ఏదో విధమైన వివాహబంధం అవసరం కదా?

వివాహ వ్యవస్థ ఎప్పటికీ ఉంటుంది. కానీ చట్టబద్ధమైనవి, సాంప్రదాయమైన తతంగాలు చట్టవిరుద్ధత నుంచి తప్పించుకుందుకు బలవంతంగా రుద్దకూడదు.

\- శ్రీమాత

స్త్రీ కూడా స్వేచ్ఛాజీవే

...స్త్రీల అణచివేతకు మగవారు స్త్రీని తమ స్వంత సొత్తుగా పరిగణించడం, ఒకప్పటి సాంఘిక జీవనసూత్రం. అది ఈ మధ్యకాలంలోనే సమర్థవంతంగా సవాలు చేయబడింది. పశుప్రాయమైన పురుషప్రవృత్తిలో పెత్తనం చెలాయించాలన్న సహజ భావం ఎంత దృఢంగా ఉండేదంటే, దానిని మతం, శాస్త్రం కూడా అనుమతించాల్సి వచ్చింది... ఆ భావాలు కూడా నెమ్మదిగా కాలధూళిలో కలిసిపోతున్నాయి, అయితే ఇంకా ఆ మిగుళ్ళు జీవితాన్ని పట్టుకుని పాత శాసనాల పరంపర, గత వాసనల కొనసాగింపు సాంప్రదాయబద్ధమైన ఆలోచనల మొండివైఖరిగా ఇంకా జీవితాన్ని పట్టుకుని వేళ్ళాడుతున్నాయి. అయితే ఆ సనాతన సాంప్రదాయలకి విరుద్ధంగా స్త్రీని కూడా ఒక స్వేచ్ఛాజీవిగా గుర్తించాలన్న ప్రతిపాదన వల్ల అవన్నీ వెనక్కి తగ్గాయి.

(CWSA 25:631)

శ్రీఅరవిందులు

జీవనగతిలోని అన్ని క్షేత్రాలలోను స్త్రీలు

(జూలై 26, 1926)

సహజంగా స్త్రీలు భౌతికస్థాయిలో చాలా సమర్థవంతంగా పనిచేస్తారని అనవచ్చు. ఎందుకంటే ఆమె తన అంతర్బుద్ధిని అనుసరిస్తుంది. సామాన్యంగా ఆమె విషయాలను క్రమపద్ధతిలో అమర్చగలదు, సూటిగా జరగాల్సిన విషయాన్ని గ్రహించగలదు అదే సందర్భంలో మగవాళ్ళు ఆలోచనలు, మానసిక నిర్మాణాల్లో తెలిపోతుంటారు. రాజకీయాల్లో కూడా ఈ విషయం స్పష్టమౌతుంది, స్త్రీలు రాజకీయాల్లో బాగా రాణించగలరు. మగవారు ఎక్కువగా మనోశక్తిని ఉపయోగించగలరు. అయితే స్త్రీలు ఎక్కువ శారీరకంగా పనిచేస్తారు. పురుషుడు ఎక్కువగా మేధోపరమైనవాడు, స్త్రీ ఎక్కువగా అంతర్బుద్ధి కలిగి ఉంటుంది. ప్రాణికస్థాయిలో ఆమె చాలా చురుగ్గా పనిచేస్తుంది.

(ఒక శిష్యుడు) స్త్రీ, పురుషునికి తరచుగా స్ఫూర్తి ప్రదాతగా ఉండడం చూశాం కాని, ఆమె స్వయంగా గొప్ప సృజనాత్మక కార్యాన్ని నిర్వహించడం చూడ లేదు.

ఎందుకంటే, సాంఘికపరమైన కట్టుబాట్లు ఆమెకా అవకాశం ఇవ్వలేదు. ఎక్కడైతే స్త్రీలకు అవకాశం ఇవ్వబడిందో అక్కడ వారు తమ సమర్థతను చూపారు. వారి కార్యాచరణలోని సామర్థ్యాన్ని చూడాలంటే కొన్ని తరాలు నిరీక్షించాలి.

(సంభాషణలు — జ్ఞాపకాల్లోంచి)

శ్రీఅరవిందులు

ప్రజాజీవితంలో అవినీతిని ఎలా ఎదుర్కోవాలి?

ఒక సీనియర్ ప్రభుత్వోద్యోగి అతను, అతిమానసం ఈ పృథ్వి మీద ఎప్పుడు అభివ్యక్తమవుతుంది అని ప్రశ్నించాడు.

ఆ తరువాత అతడు అడిగినది జీవితంలో నిజాయితీపరులు కష్టాల గురించి, అవినీతిపరులు లాభం పొందడం గురించి... ఎంతకాలం దైవం ఈ పరిస్థితిని కొనసాగిస్తాడు, ఎప్పుడు వీటికి ముగింపు అన్న విషయాన్ని గురించి ప్రశ్నించాడు.

దీనికి శ్రీమాత సమాధానం: "సామాన్యంగా విషయాలన్నీ ఒక తారాస్థాయికి చేరి నపుడు, పూర్తిగా ఆ చెడుతో విసిగి వేసారిన మనషులు, ఆ అవినీతి చర్యల్ని ఏ మాత్రం సహించలేమని ఎదురు తిరిగే వరకు కొనసాగుతాయి. కొంతకాలం ఈ నీతిమంతులు సైతం వారి ప్రత్యర్థులు అనుసరిస్తున్న మార్గంలో ఎందుకు అభివృద్ధి చెందకూడదని ఆశ్చర్యపడతారు. ఆ విధంగా అవినీతికి ఆలంబన దొరికినంత వరకు అది మరింత శక్తివంతమౌతుంటుంది. ఎప్పుడు ఆ చెడు ఓ పరిమితిని దాటి దుస్స హంగా మారుతుందో అప్పుడే అది బ్రద్దలై, ఓ విప్లవం వస్తుంది".

దానికి అతడి సమాధానం: "కాని మాతా, ఈ విప్లవానికి ముందే దైవం ఎందుకు కలగచేసుకోడు — ఒక్కోసారి ఆ విప్లవం అత్యంత హింసాత్మకంగా వెల్లడౌ తుంది? ఎందుకా విప్లవం ప్రశాంతంగా రాకూడదు?"

శ్రీమాత మృదువైన స్వరంతో అతడికి అర్థమయ్యేలా చెప్పారు: "అందుకే నేను

సామాన్యంగా... కొనసాగుతాయి అని చెప్పాను. మరో మార్గం కూడా నీకు తెరిచే ఉంది. నిన్ను అణిచివేసి నీ మీద ఒత్తిడి తెచ్చే శక్తులు ఎంత బలంగా ఉన్నా, నీవు నీ ఆదర్శాలకు కట్టుబడి ఉండే, నిన్ను అనుసరించేవారి సంఖ్య పెరుగుతుంది. వారు నీ సహన పరిధులను సన్నగిల్లేలా చేస్తారు. నీవు ఉన్నతస్థితిలోకి ఎదిగి, అధిక సంఖ్యాకులు నిన్ను ఉదాహరణగా భావించినపుడు, ఆ పద్ధతి సులభమౌతుంది...."

నాలుగేళ్ళ తరువాత కూడా, అవినీతికి విరుద్ధంగా అతడి సంఘర్షణ అలాగే ఉండి — అతడిని బాధించేది. అందువల్ల అతడు అదే ప్రశ్నను మళ్ళీ శ్రీమాత ముందుంచాడు, అది 17-3-1960 లో, శ్రీమాత మళ్ళీ అదే సమాధానం ఇచ్చారు, ఆమె చెప్పారు:

"నీ పరిస్థితులు నీ అధీనంలో లేవని నీవు తెలుసుకున్నపుడు, నిన్ను నీవు ఓ అద్దంలో చూసుకుని, ఆ పరిస్థితులు ఆ విధంగా ఉండడానికి నీ వెంత వరకు బాధ్యుడివో తెలుసుకో. నేను నీవు నిజాయితీ లేనివాడవని అనడం లేదు. చెడుకు మనం ఆలంబనగా లేకపోతే చెడు నెమ్మదిగా బలహీనపడుతుంది. ప్రతి ఉద్యోగస్తుడు, స్థాయిలో పెద్ద చిన్న తారతమ్యాలు లేకుండా పైకి అసత్యం విజయం సాధించినట్టు కన్పించినా సత్యానికి కట్టుబడి ఉంటే, ఆ అసత్యం క్రమంగా కూలిపోతుంది."

(శ్రీఅరవిందాశ్రమంలో జీవితం, నారాయణ ప్రసాదు: 207-208)

ప్రతి విషయంలో ప్రభుత్వం జోక్యం

(ఆగస్టు 14, 1964)

మనమే ప్రభుత్వం కానంత వరకు మనమేం చేయలేమని శ్రీఅరవిందులు చెప్పారు (వారు బేషరతుగా నాతో చెప్పారు.) — మనం వ్యక్తిగతంగా ప్రభుత్వంగా వ్యవహరిస్తామని కాదు. కాని ఆ పాలిస్తున్నవారే సరైన 'పాత్రలు' గా ఉండి ఆ ఉన్నత శక్తుల్ని అందుకొని, వారి ఆజ్ఞల్ని పాటించాలి. అది వారు'67 లోనే ఇండియాలోనే కాకుండా, మొత్తం ప్రపంచమంతటా ఆ విధంగా జరుగుతుందని ఎదురుచూశారు. ప్రభుత్వాలు అతిమానస ప్రభావాన్ని అందుకోడం ప్రారంభిస్తాయన్నారు. ఆ కారణం వల్లనే అన్నింటా చెడు అన్నది దాని పరాకాష్టను చేరుతుంది... ఈ ప్రపంచంలో

కావలసినంత చెడు ఉంది. అన్ని చోట్ల ప్రజలు పోరాటం చేస్తున్నారు, ప్రతి చోట ప్రజల్ని హతమారుస్తున్నారు — ఇండోనేషియాలో అనేకమంది హత్య చేయబడ్డారు, సైప్రస్ లోను అనేకమంది చంపబడ్డారు. ఇదంతా ప్రకటించబడని యుద్ధం, కాని సర్వత్రా జరుగుతున్నది ఇదే.

ఇంక ఇక్కడ పూర్తి స్థాయిలో అవినీతి రాజ్యమేలుతున్నది — పూర్తిగా అది ఏ స్థాయికి చేరిందో మీకు సోదాహరణంగా వివరిస్తాను. ప్రభుత్వం అన్ని విషయాల్లో జోక్యం చేసుకుంటుంది. నువ్వు ప్రభుత్వం అనుమతి లేకుండా ఓ వేలు కూడా కదపలేవు. నీవు ఈ దేశాన్ని వదిలి వెళ్ళలేవు. ఈ దేశంలోకి ప్రవేశించలేవు, నువ్వు ఎక్కడికీ డబ్బు పంపలేవు, ఓ షాపు కూడా తెరవలేవు, ఏం చేయలేవు.... ఏమీ, ఏదీ చేయలేవు, ఆ ప్రభుత్వ అనుమతి లేకుండా నీ స్వంతభూమిని కూడా సాగుచేసుకోలేవు. వాళ్ళు అన్నింటిలో తలదూరుస్తారు, దాని వరకు అదే పెద్ద బుద్ధిలేని పని. దానికి తోడు వాళ్ళు నిబంధనలు తయారుచేస్తారు — సహజంగానే నిబంధనలు ఎక్కువైనకొద్దీ, అవిధేయత పెరుగుతుంది.

అత్యంత క్లిష్టమైన ఈ పద్ధతుల వలన ప్రజలు పంటలు పండించటం మానేస్తారు. దానికి తోడు విపరీతమైన పన్నుల భారం (రకరకాల పన్నులు కట్టాలి) వారి సంపాదనను మించి ఉంటుంది. సరిపడ్డ ఆహారధాన్యాలు వుండవు కాబట్టి, కొందరు ఆహారధాన్యాలను నిలవచేసి అధిక ధర వస్తేకాని అమ్మరు.

అందుకే ఈ నిబంధనలవల్ల అంతా కరడుగట్టిపోయింది. ప్రతిచోట, ప్రతిచోట, అన్ని విషయాల్లోను ఇదే పద్ధతి. ఈ దయనీయమైన సంక్లిష్టత, నిజానికి నమ్మలేనంత బుద్ధిహీనత. ఇవి మన ఊహ కందని నమ్మలేని నిజాలు. తల్లిదండ్రులు పిల్లలకి పెట్టే నిబంధనల కన్న మరింత కఠినమైనవి. ప్రజల కంటె చిన్నపిల్లలకు ఎక్కువ స్వేచ్ఛ ఉంది. అంతటినీ నియంత్రించాలన్న ఓ దృఢసంకల్పం ఉంది, అది ఒక తెలివితక్కువ ప్రయత్నం, ఆలోచనకు అందనిది.

(అజెండా నుంచి)

శ్రీమాత

అనువాదం: సత్యవాణి

సరిహద్దుల ఆవల పొంచివున్న ప్రమాదం

చైనా బారినుండి రక్షణ అవసరం (ఏప్రియల్ 1, 1908)

భౌగోళికంగా భారతదేశం ఆసియాకు కీలకస్థానం. మూర్త్యారాధక దూరప్రాచ్యాన్ని, మహమ్మదీయ పశ్చిమాన్ని వేరు వేరుగ విభజించింది. రెండు సంస్కృతుల కూడలి స్థానం ఆమే. సమైక్యతా ప్రేరణ శక్తి ఆమె నుండి మాత్రమే ప్రసరించగలదు. ఆమె మహమ్మదీయ మరియు దూర ప్రాచ్య సంస్కృతులకు మధ్య రాజీస్థానం. ఆసియా ఖండ సమైక్యతకు ఆమె స్వాతంత్ర్యము ఆవశ్యకము. భౌగోళికంగా ప్రాగ్దిశనే గాక పశ్చిమాన్ని గూడ అదుపులో వుంచగలిగే ఒక బలమైన అభేద్యస్థానం ఆమెది. పటిష్టమైన కోటలాంటి ఆ స్థానం నుండి పర్షియా మరియు చైనా ప్రాంతాలపై దాడిచేయవచ్చు. ఒప్పందాలుగాని పరస్పర విరుద్ధమైన దేశప్రయోనాల మధ్య రాజీకుదిర్చే యత్నాలు గాని దేశకాల పరిస్థితుల వలన అనివార్యమయ్యే కఠినమైన, పరోక్షమైన వ్యూహాల అనుసరణను పాటించుట తప్ప వివేకవంతమైన లేక రాజకీయ పరమైన పరిష్కారాలను అనుసరించలేవు. అనివార్య పరిస్థితు లేర్పడి చైనా బలగాలు భారతదేశ హిమాలయ ప్రాంగణంపై దాడిచేసినప్పుడు, జపాను నౌకాదళాలు బొంబాయి తీరంలో ప్రత్యక్షమైనప్పుడు, యే బలంతో ఇంగ్లాండు యీ రాక్షస కూటమిని అడ్డుకుంటుంది? మంగోలుల శాస్త్రపరిజ్ఞానం, నైపుణ్యం, ఇంగ్లాండును ఛిన్నాభిన్నం చేయగలదు. ఆ విధంగా ఆసియాకు కీలకమైన స్థానం మంగోలుల చేతుల్లోకి జారిపోతుంది....

CWSA 7:990

శ్రీఅరవిందులు

మానవాళిని రాజకీయ యంత్రాంగంతో మార్చలేము.అది వీలు కాదు!

శ్రీఅరవిందులు

డిసెంబరు25, 1938

చైనాదేశ పురోగతి

(అక్టోబరు 9, 1909)

బాక్సర్ కలతల తరువాత స్వల్పకాలంలోనే చైనా తన విద్యావిధానంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చింది. అన్ని స్థాయిలకు చెందిన అధునాతన పాఠశాలల సంకీర్ణ వ్యవస్థను యేర్పాటు గావించింది. దేశ యువరాజులకు, రాజవంశీయులకు ఒక సమగ్రమైన విద్యాబోధనతో సైనికశిక్షణలోను, సైనిక అలవాట్లలోను మంచి తర్ఫీదును అందించింది. ఈ ప్రక్రియ పూర్తి అయ్యేలోపల చైనీయులంతా ఆయుధాల వుప యోగంలో సుశిక్షితులుగ తయారైనందున, యే యితర రాజ్యం కూడ, లేక రాజ్య కూటములు కూడ చైనాను తాకడానికి కూడ జంకేవి. వారి జాతీయాభివృద్ధిలోని మరో దశ చైనీయులు స్వయంగా నిర్మించి, నిర్వహించే రైలు మార్గవ్యవస్థ. విద్యా బోధనా కార్యక్రమము మరింత ముందుకు సాగినప్పుడు చైనా ప్రభుత్వ వుద్దేశ్యం, దేశాన్ని ఒక రాజ్యాంగబద్ధమైన పార్లమెంటరీ వ్యవస్థగ మార్చాలని. వారి ప్రణాళిక ప్రకారం యీ గొప్ప విప్లవాత్మక పరిణామం రాబోవు యెనిమిది సంవత్సరాలలో చోటు చేసుకోవాలి. కన్ఫ్యూషియన్ విధానంలో నిర్దుష్ట పద్ధతులకు, విషయాలు చిన్నవైనా, పెద్దవైనా నిలకడగల గాంభీర్యతతో మెలిగే వ్యవహార శైలికి వారు పెట్టింది పేరు. చైనీయులు తప్ప మరే జాతివారు కూడ యింతటి అత్యద్భుత రాజకీయ సామాజిక విద్యావిధాన మార్పును ప్రశాంతంగ, ఒక సాంప్రదాయబద్ధమైన విధినిర్వహణగ, సంపూర్ణంగ, సమర్థవంతంగ నెరవేర్చలేరు. ఒక్కసారి చైనీయులు విప్లవాత్మక మార్పును తేవాలని సంకల్పిస్తే చాలు వారు పరిపూర్ణంగ, క్రమపద్ధతిలో, సమర్థమైన యేర్పాట్లతో వ్యర్థంగాని, ఘర్షణగాని చోటు చేసుకోకుండ నెరవేర్చగలరు. జపాను చరిత్రకు యేమాత్రం తీసిపోని చైనా చరిత్రలో జాతీయ సంకల్పశక్తికి గల అపరిమితమైన విలువను గమనించగలము. అంతటి ధృఢమైన సమిష్టి సంకల్పశక్తికి మూలము వారి ప్రాచీన క్రమశిక్షణ యొక్క శ్రేష్టత. తాత్కాలికంగా ఒక నిర్దిష్ట పరిధిలో వారి సమాజ ఆలోచనా సరళి, పాలనా వ్యవస్థ ఆ క్రమశిక్షణ చట్రంలో బంధింపబడినా, దాని ప్రభావ తీవ్రత మాత్రం తగ్గలేదు. పూర్వం భారతదేశంలో, చైనీయులకు గాని జపనీయులకు గాని వున్న క్రమశిక్షణ కన్న అత్యంత శక్తివంతమైన క్రమశిక్షణ వుండేది. కాని, ఆ జాతీయ సంకల్పశక్తిని యుక్తమైన విధంగ వుపయో

గించుటకు శాసించగలిగే సార్వభౌమాధికార కేంద్రం భారతదేశానికి యేది? అలాంటి పాలనావ్యవస్థ కొరతను తీర్చుటకు, జాతీయ స్థాయిలో ప్రయత్నం చేపట్టుటకు అనువుగా ఒక కేంద్రమైనా యేదీ? మన పాలనావ్యవస్థ విదేశీయుల చేతిలో నుంది. మన జాతీయశక్తి సంస్కృతుల మూలం గురించిన అవగాహన వారికి లేదు. పైపెచ్చు, వారికి వాటిపై ఒక యేహ్యతతో కూడిన తిరస్కార భావన ఉంది. మనకున్న విద్యా విధానంలో కూడ మన జాతీయశక్తి సంస్కృతులకు చోటు లేదు. అదీగాక, మనదైన సంస్కృతిని పునరుద్ధరించి, ప్రోత్సహించి ఆధునిక అవసరాలకు అనుగుణంగ తీర్చిదిద్దే బదులు వాటి స్థానే ఒక విదేశీ సాంప్రదాయాన్ని ప్రతిష్ఠించే ప్రయత్నం జరుగుతున్నది. మన నాయకులు విదేశీ సాంప్రదాయంతో శిక్షణ అలవరచుకున్నవారు. భారతదేశంలో విప్లవాత్మకమైన పరివర్తనను చైనా, జపాను దేశాలకన్న వేగంగ మరింత వున్నతంగ కొనితేవడానికి మనకున్న శక్తిని వినియోగించ వచ్చునని వారికి తెలియదు. అంతేగాక, వారికి దానిలో నమ్మకం కూడ లేదు. ఆసియా ఖండపు యితర దేశాలలో కన్నా మన భారతదేశంలో యీ కార్యాన్ని కష్టతరం చేసేది యిలాంటి వైఖరే కాని అంతర్గత విభేదాలు కాదు, లేక పురాతన అనుచితమైన పరిస్థితుల కొనసాగింపు కూడ కాదు.

CWSA 8:265-66

శ్రీఅరవిందులు

చైనా నుండి బెదిరింపు ముప్పు

(ఏప్రియ్ 1950)

(Ideal of Humanity అనే పుస్తకపు 1950 సం. ప్రచురణలో శ్రీఅరవిందులు ఒక అధ్యాయాన్ని అనుబంధంగ చేర్చారు. అందులో నుండి సంగ్రహించబడినది.)

ఆసియా ఖండంలో మరింత ఘోరమైన విపత్కర పరిస్థితి యేర్పడింది. కమ్యూనిస్టు చైనా ఆవిర్భావం ప్రపంచంలోని యీ భాగపు ప్రజల ఖండాంతర సమైక్యత సంభావ్యతకు గొప్ప ఆటంకంగా యేర్పడింది. రెండు అతి పెద్ద కమ్యూనిస్టుశక్తులైన రష్యా మరియు చైనాల కలయిక ఉత్తర ఆసియాను యావత్తు ఒక బ్రహ్మాండమైన రాజకీయ కూటమిగ రూపొందించి, నైరుతి ఆసియా మరియు టిబెట్ దేశాలను హరించే బెదరింపుతో వాటిని ఆవహించి మరింత రెచ్చిపోయి, భారతదేశ పొలిమేర వరకు వ్యాపించి, ఆ దేశ భద్రతకే గాక పశ్చిమ ఆసియా భద్రతకు సైతం ముప్పు తెచ్చి వాటిపై దాడిచేసే ప్రమాదం వుంది. కమ్యూనిస్టు ప్రభావాన్ని ఆ దేశాలకు వ్యాపింపజేసి, అవసరమైతే అపారమైన సైనికశక్తితోనైనా వాటిని అయిష్టమైన సిద్ధాంతానికి, రాజకీయ సామాజిక సంస్థాపనకు ప్రబలమైన ఆకర్షణ, పోరాట పటిమతో నిండిన కమ్యూనిజం యేలుబడికి లోనుచేసే ప్రమాదం కూడ వుంది.

CWSA 25:590-91

శ్రీఅరవిందులు

ఆధిపత్యం కోసం కమ్యూనిస్టు వ్యూహం

కొరియా విషయంలో నీకు (కె. డి. సేత్నా) మార్గదర్శనం కోసం నా సలహాను యెందుకు కోరుతున్నావో నాకు తెలియదు. ఈ విషయంలో సందేహించవలసిందేమీ లేదు. విషయమంతా సుస్పష్టం. ఆధిపత్యం కోసం కమ్యూనిస్టులు పన్నిన వ్యూహంలో మొదటి ప్రయత్నం, ఉత్తర భాగాలను ముందు వశపరచుకుని తరువాత ఆగ్నేయ ఆసియాపై దాడి. ఆసియా ఖండం యొక్క యితర దేశాలపై దాడిసలిపే ప్రణాళికలో యిది ప్రథమ చర్య. టిబెట్ భారతదేశానికి ముఖద్వారం. ఇందులో వారు సఫలీకృతు

లైతే మొత్తం ప్రపంచంపై ఆధిపత్యం అంచెలంచెలుగ పొందలేకపోవుటకు కారణం కనిపించదు.

CWSA 36:507

శ్రీఅరవిందులు

గమనిక:

1. కొన్ని రోజుల ముందు ఉత్తర కొరియా సైన్యాలు సోవియట్ రష్యా సహాయంతో దక్షిణ కొరియాపై దాడి చేశాయి. కొన్ని నెలల తరువాత చైనా సైన్యాలు కూడా వారికి బాసటగ చేరాయి.

2. ఈ ఉత్తరం వ్రాసిన నాలుగు నెలల తరువాత అక్టోబరు 1950 లో చైనా టిబెట్‌ను ఆక్రమించింది.

ఒక శిష్యునితో శ్రీమాత సంభాషణ

(ఆగస్టు 7, 1963)

జయించితీరాలనే తపన చైనీయులను మరోమారు హఠాత్తుగ ఆవహించినట్లున్నది....

నాకు ఆ తీవ్రదోరణులు కనిపిస్తున్నాయి అవి మనుషులను, విషయాలను పట్టి పీడించే ఉన్మాద ప్రసరణల లాంటివి. నిజానికి అసలు మూలంలో అది అవును, కాదు అనే వాటికి మధ్య ఒక రకమైన తీవ్ర ఘర్షణ, అనగా, నూతన విషయాల ఆగమనాన్ని వేగిరపరచే ప్రయాసలకు, వాటిని ప్రతిఘటించే వాటికి మధ్య పోరాటం — తీవ్రమైన ఉగ్రతతో కూడిన తిరస్కరణ.

జూన్, 1965

చైనీయుల ఆధిపత్యం క్రింద వుండుట కన్నా... మరణించుట మేలు.

భువిపై చైనీయుల ఆధిపత్యం... దాని అర్థం యీ భూమి గడ్డకట్టుకు పోతున్నదన్న మాట. చంద్రుడిలా చల్లబడి పోతున్నదని, ఓహ్, అది భయంకరంగా వుంటుంది....

మనం సర్వనాశనం కోరము.

జూన్ 19, 1969

అపాయం పొంచి వుంది.

కాని అంతర్గత గందరగోళం... ఇంచుమించు యిప్పటికీ వున్నది, నీకు తెలుసా. సహజంగానే చైనీయులు యీ పరిస్థితిని వారికి అనుకూలంగా మలుచుకోవచ్చు.

మే 12, 1971

చూడండి, మనుషులు చేసే భయానక కృత్యాలకు హద్దులంటూ వుంటాయి. అయినా కూడా వాటిని నిగ్రహించడానికి వెనుక మానసిక అస్తిత్వమొకటి వుండుట అందుకు కారణం. కాని చైనీయులకు అది లేదు. దానికి తోడు వారు చాలా చాలా తెలివైనవారు.

(Agenda)

శ్రీమాత

అనువాదం అందుగులపాటి కైలాసపతి, జానకి

టిబెట్ వ్యవహారం

(చారిత్రాత్మకమైన ఇంటర్వ్యూ జనవరి 18, 1973)

జనవరి 18, 1973)

(దలైలామా): టిబెట్‌లో సంపూర్ణమైన ఆర్థికాభివృద్ధి జరగాలనేది నా కోరిక; ఒక పరిపూర్ణమైన వ్యవస్థీకరణ, కమ్యూనిజంలో ఉండే మంచి కార్యదక్షత ఉండాలి. ఇవన్నీ కూడా బౌద్ధలక్షణాలైన ప్రేమ, కరుణలనే మూలస్తంభాల ఆధారంగా ఏర్పడాలి. అలా ఉంటేనే అధికారంలో ఉండేవారు లంచగొండితనానికి లోబడకుండా ఉంటారు. నేను కంటున్న ఈ కలల గురించి శ్రీమాత ఏమంటాలో? టిబెట్‌లో ఇది సాధ్యపడే విషయమేనా?

అది కల కానే కాదు. సహజంగా జరగబోయేది అదే. కాని అందుకు ఎంత కాలం పడుతుందో నేను చెప్పలేను. ఇది శ్రీఅరవిందులు అతిమానసము గురించి చెప్పిన దానిలాగ వుంది. సత్యము, ప్రేమ, కరుణలనేవి ఈ నూతన సృష్టికి పునాదులు కాగలవు. అధి కారానికి హక్కు పుట్టుకతో కలుగదు. వారి వారి విలువలనుబట్టి అందుకు యోగ్యత కలుగుతుంది.

శ్రీఅరవిందుల బోధన ప్రపంచమంతా వ్యాపించి, అతిమానసము సంపూర్ణంగా అభివ్యక్తమైతే, ఆ శక్తే టిబెట్ దేశాన్ని పూర్తిగా విముక్తి చేయగలదు.

అది జరుగక తప్పదు, జరిగి తీరుతుంది. కానీ ఇప్పుడు నడుస్తున్న తీరు చూస్తే అందుకు వందల సంవత్సరాలు పడుతుంది. అయితే అతిమానసము అభివ్యక్తమైతే అది త్వరితంగానే సిద్ధించవచ్చు. త్వరలో అంటే పది పన్నెండేళ్ళని కాదు. అదే గనుక జరిగితే, ఇంచుమించు అదొక దివ్యఘటనే కావచ్చు.

కిరీట్: అయితే ఇప్పుడు అతిమానసము అత్యంత శక్తివంతంగా పనిచేస్తున్నది కదా?

అవును, అది పనిచేస్తున్నది. సరైన వ్యక్తులు అధికారంలోకి వచ్చినపుడు అది తగినంత శక్తితో వ్యక్తం కాగలదు.

ఇప్పుడే మనిపిస్తోందంటే ఈ ప్రాతికూల్యత అసత్య శక్తులు వినాశమయ్యే లోపల పూర్తి బలంతో దాడి చేస్తాయని. మనుషులు ఇప్పుడు చెప్తున్న అబద్ధాలు లోగడ ఎన్నడూ చెప్పేవారు కాదు. అప్రయత్నంగా పాత అలవాట్లు వస్తున్నట్లున్నాయి. దాన్ని వెంటనే విచ్ఛేదం చేయాలి.

చెప్పాలంటే భూమి చరిత్రలో మనం ఇప్పుడు ఒక అసౌఖ్యకరమైన ఘట్టంలో ఉన్నాము. ఆ చర్యల తీవ్రత వల్ల అది ఆసక్తికరంగానే ఉన్నప్పటికీ సుఖదాయకం అని చెప్పలేము.

అది నేను మీకు అదివరకే చెప్పాను, రాశాను కూడా.

కిరీట్: అవును తల్లిగారూ, ఆ సందేశం ఇచ్చారు.

దలైలామా: నా మటుకు నాకు ప్రభుత్వంలో అధికారంలో కొనసాగాలనే కోరిక లేదు. ఎందుకంటే ప్రభుత్వం ఎప్పుడూ పార్టీ తగాదాల్లో మునిగి తేలుతూ ఉంటుంది అందులో ఉన్నప్పుడు ఏదో ఒక పక్షం వైపు ఉండవలసిన అవసరం ఏర్పడుతుంది.

ఏదో పక్షం వహించకుండా పరిపాలన చేయవచ్చు. అదే అన్ని ప్రభుత్వాలూ చేసే పొరపాటు. అవి వారి పరిపాలనా సామర్థ్యాన్ని గణనీయంగా తగ్గించేస్తాయి.

అయితే మనస్సును మించినట్టి ఉత్తమమైన ప్రగాఢ చైతన్యం ఒకటి ఉన్నది కదా — వారు ఆ చైతన్యాన్ని పొంది వారి సామర్థ్యాల నన్నిటినీ చక్కగా వినియోగించవచ్చు. తగినంత విస్తృతమైన చైతన్యం ఉంటే ప్రతి సామర్థ్యాన్నీ దాని స్థానంలో

దాన్ని ఉంచి సర్వత్రా సామరస్యాన్ని నెలకొల్పవచ్చు.

దలైలామా: ప్రపంచమంతటా మనుషుల్లో సహృదయము, సద్భావము ఉన్నాయి, కానీ అలా ఉన్నవారి సంఖ్య ఎక్కువ లేదు. ప్రపంచ పరిస్థితులను మార్చడం వారి వల్ల సాధ్యపడుతుందా? అది మారి తీరవలసిందే. ప్రజలు ఋజువర్తనులైతే అది త్వరితంగానే సిద్ధించ వచ్చు. మనుషుల్లో చిత్తశుద్ధి ఉంటే, అది వేగవంతమౌతుంది.

కపటత్వాన్నీ, అసత్యాన్నీ అరికట్టడం తప్పనిసరిగా చేయవలసిన మొదటి పని. మనలోని దైవత్వాన్ని వ్యతిరేకించేదంతా అసత్యమే.

శ్రీమాత

(కిరీట్ జోషిగారి అనుమతితో)

భారత, పాకిస్థాన్‌ల విభజన పోవలసిందే

ఆగస్టు 1947

ఈనాడు ఇండియా స్వతంత్రమైంది. కానీ ఐకమత్యం సాధించలేదు.... పూర్వపు మతవిభజన ఇప్పుడు శాశ్వత రాజకీయ విభజనగా ధృడపడిపోయింది. అయితే ఇలా జరిగిన ఏర్పాటు శాశ్వతమైనది కాదని, తాత్కాలికమే అని ఆశిద్దాం. అది శాశ్వతమే అయినట్లయితే ఇండియా చాలా బలహీనపడి, కుంటువడవచ్చు. అంతర్గత కల్లోలాలు నిరంతరంగా కొనసాగే అవకాశం వుండవచ్చు. కొత్త కొత్త దండయాత్రలు విదేశీ దూరాక్రమణలూ జరగవచ్చు. భారత అంతర్గత అభివృద్ధి, శ్రేయస్సులకు అవరోధాలు కలుగవచ్చు, ఇతర దేశాల మధ్య ఆమె స్థానం దిగజారవచ్చు, ఆమె భవిష్యత్తు అయోమయం, అగమ్యగోచరం కావచ్చు. అది జరుగకూడదు. విభజన రద్దు కావాలి. అది సహజసిద్ధంగా జరుగుతుందని ఆశిద్దాము; శాంతి, సామరస్యతల ఆవశ్యకతే కాక సమిష్టి కార్యాచరణ, అందుకు కావలసిన వనరుల ఏర్పాటు ద్వారా అది జరగాలని ఆశిద్దాం. ఈ విధంగా చివరకు ఏదో రూపకంగా ఐక్యత ఏర్పడవచ్చు. ఏ రూపకంగా ఏ విధంగా విభజన రద్దు అవుతుందనేది ముఖ్యం కాదు, ఐక్యత అనేది జరిగితీరాలి, తీరుతుంది; ఇండియా భవిష్యత్తు ఘనత వహించటానికి అది చాలా ముఖ్యము.

శ్రీఅరవిందులు

18 ఏప్రిల్, 1923

హిందువులు, ముస్లిములు ఐక్యత కలిగి ఉండటమంటే హిందువులు వారికి తలొగ్గి ఉండటం కాదు. ప్రతిసారీ హిందువుల సాధుత్వం వల్ల అలా జరిగింది. దీనికి మంచి పరిష్కారమల్లా హిందువులను చక్కగా వ్యవస్థీకరించుకునేట్లు చేస్తే హిందూ, ముస్లిం ఐకమత్యం సమస్య దానంతటదే పరిష్కరింపబడుతుంది.

శ్రీఅరవిందులు

21 జూన్, 1940

కాశ్మీరులో హిందువులకే గుత్తాధిపత్యముండింది. ఇప్పుడు ముస్లిముల కోరికలన్నీ ఒప్పుకోటం జరిగితే, హిందువులు తుడిచిపెట్టుకు పోతారు.

శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది వేంకటరామ శాస్త్రి, అమరవాది ప్రభావతి

ఆసియా సమాఖ్య యొక్క ఆవశ్యకత

21 సెప్టెంబరు, 1966

ఐక్యరాజ్యసమితిది చాల మొండివ్యవహారంగా ఋజువవుతోంది (అందులోని వక్రోక్తి బ్రహ్మాండంగా ఉంది.) అక్కడివారంతా కాలానికి వెనకబడిపోయినట్లున్నారు. వారింకా మతవ్యతిరేక, అనాత్మవాద ప్రవృత్తులను అధిగమించలేదు. ఇంకా వారు అరోవిల్ వివరణాత్మక సంచికను గురించి చాలా వికృతంగా విమర్శించారు; అది మతవైఖరులున్న మార్మిక విధానం అని. వారి కువిమర్శ మనోహరమే!

బాహ్యంగా కూడా ఇండియా, పాకిస్థాన్‌ల పోరు చూస్తే ఒకటి స్పష్టమవుతుంది. అది చెప్పడం కష్టమే — అది ఒక దివ్యసత్యానికి కట్టుబడి ప్రారంభమైందని చెప్పవచ్చు. ఆ సత్యం ప్రచోదనం వల్ల "ఆసియా సమాఖ్య" ప్రారంభించాలనే సంకల్పం ఏర్పడింది; కమ్యూనిస్టు చైనా శక్తినీ దాని దురాక్రమణలను ఎదుర్కొనే శక్తిని తద్వారా పొందాలి. అనుబంధిత ప్రదేశాలతో సహా పాకిస్థాన్ విలీనం అయితే, ఈ సమాఖ్యలో టిబెట్, బర్మా, శ్రీలంక చేరాలి. ఏ దేశానికి ఆదేశం స్వతంత్ర ప్రతిపత్తితో స్వేచ్ఛగా అభివృద్ధి చెందుతూ శాంతిసామరస్యాలు పొందాలనే సామూహిక ఆకాంక్షతో, విచ్ఛి

న్నికర, దురాక్రమణ శక్తులను ఎదుర్కోవాలి. అదంతా చాలా స్పష్టంగానే ఉంది, అందరూ ఒప్పుకున్నారు — కానీ ఐక్యరాజ్యసమితి జోక్యంతో అంతా చెడిపోయింది. (అజెండా నుంచి)

శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

భారతదేశ పునరుజ్జీవనం


ఒక వేళ భారతదేశం ఐరోపా అడుగుజాడలను అనుసరిస్తే...

(ఏప్రిల్ 14, 1908 లో వ్రాసింది)

అపనమ్మకం ఆధునిక రాజకీయవాతావరణం. పరస్పర అనుమానం, ద్వేషం, కర్మాచరణ రహస్యం. బయటికి అందంగా కనిపించే భౌతిక నాగరికత లోపల నైతికరుగ్మత తిష్ఠ వేసుకొని యూరపు సమాజ ప్రధాన అంగాలను తొలచివేస్తున్నది. అందుకు వేలకొలది రోగలక్షణాలు కంటికి స్పష్టంగా కనిపిస్తున్నాయి.

భారతావని గనుక యూరపు అడుగుజాల్లో నడుస్తూ, ఐరోపా రాజకీయాదర్శాలను, సాంఘిక వ్యవస్థను, ఆర్థికసూత్రాలను అనుసరిస్తే, అదే మాదిరి వ్యాధులు ఆమెకు కూడా అంటుకుంటాయి. అట్లాంటి పర్యవసానం ఇటు భారతావనికీ, అటు యూరపుకు గాని మంచిది కాదు. భారతదేశం యూరపు దేశ మేధాక్షేత్రాలలో ఒక ప్రాంతీయ భాగంగా తయారయితే ఆమె తన సహజసిద్ధమైన మహత్వస్థితిని అందుకోలేదు. ఆమెలో అంతర్లీనంగా వున్న, సంభావ్యతలను సాఫల్య మొనర్చలేదు. 'పరధర్మో భయావహః' పరాయిధర్మాన్ని అంగీకరించడం అపాయకరం. అది వ్యక్తినిగాని, దేశాన్నిగాని దాని సహజశక్తినీ, జీవనరహస్యాన్ని కోల్పవునట్లు చేస్తుంది. దాని స్వభావానికి, స్వేచ్ఛాయుతమైన విశాలమైన సహజవికాసానికి బదులు ఒక కృత్రిమమైన గిడసబారు ఎదుగుదలను కలుగచేస్తుంది. ఎప్పుడైనా ఒక దేశం దాని ఉనికి యొక్క ముఖ్యోద్దేశాన్ని వదిలివేసినట్లయితే అది అభివృద్ధిని కోల్పోయే మూల్యం చెల్లించింది. తన భవితవ్యాన్ని సాఫల్యం చేయాలంటే భారతదేశం భారతదేశంగానే వుండితీరాలి.

శ్రీఅరవిందులు



నేను అధికాధికమైన స్పష్టతతో చూస్తున్నదేమిటంటే మానవజాతి నిరంతరంగా అనుసరిస్తున్న నిష్ప్రయోజనమైన వ్యవహార వలయం నుండి బయటపడటానికిగాను, మనిషి తనంతట తాను కొత్త ప్రాతిపదిక స్థాయికి ఎదగగలిగితే తప్ప, అందులో నుండి ఎప్పటికీ బయటపడలేడు. అంతేగాదు, ప్రపంచానికి ఈ మహోన్నత విజయాన్ని సమకూర్చడం భారతదేశం యొక్క దైవ నిర్ణీత కర్తవ్యమని నేను విశ్వసిస్తాను.

CWSA 36:260-61

శ్రీఅరవిందులు (శ్రీచిత్తరంజన్ దాస్, 18 నవంబరు, 1922)

మూడంచెల భారత పునరుజ్జీవనం

అంతిమ ఫలితం ప్రస్తుతానికి సుదూరమైనదిగా కనిపించినా, అనివార్యమైన పునరుజ్జీవనానికి దారితీసిన ప్రక్రియను చారిత్రకంగాను, హేతుబద్ధంగాను మూడు దశలుగా విశ్లేషించవచ్చు. 1. క్లిష్టపరిస్థితిని ఉపశమింపజేయుట 2. పునర్నిర్మాణము 3. నవనిర్మాణము. దీనికి సంబంధించిన తొలి పునాదులు అక్కడక్కడా ఇదివరలోనే వేయబడి ఉండవచ్చు. పూర్వసంస్కృతికి చెందిన క్రొత్తయుగ రూపాంతరం జరిగింది. పురాతనమై అంతమొందిన నాగరికతకు సంబంధించినది కాదు కాని ఒక పునర్జన్మ, ఒక పునరుజ్జీవనము. మొదటి దశలో ఐరోపాతో సంబంధాన్ని స్వాగతించుటతో పాటు ప్రధాన అంశాలను గూర్చి ఒక సమూలమైన పునఃపరిశీలన గావించి గత సంస్కృతికి చెందిన విధానాలకు సంబంధించి కొంత విప్లవాత్మకమైన నిరాదరణ. రెండవదశలో భారతీయాత్మపై యూరపు ప్రభావంపై ప్రతిస్పందన. కొన్నిసార్లు అందించిన వాటన్నింటిపై నిరాదరణతోపాటు గత జాతీయతాభావం యొక్క ప్రధానమైన అంశాలను తు. చ తప్పకుండా పాటించుటకై ఒత్తిడి. మూడవ దశ ఇప్పుడిప్పుడే మొదలయ్యింది. ఇది నూతనసృష్టికి చెందిన ప్రక్రియగా భారతీయ మానసంలో నెలకొనివున్న ఆధ్యాత్మికశక్తే పరమోన్నతమైనదిగా తన సత్యాలను పునః సమీకరించుకొని ఆ పనికి భావన మరియు విధానంలో ఏది దృఢమైనదో, ఏది నిజమైనదో .... ఏది ప్రయోజనకరమైనదో, ఏది అనివార్యమైనదో దానిని స్వీకరించి, దానిని మార్పుచేసి భారతీయం గావించి, తనలో లయం చేసుకొని, పూర్తిగా తనదిగా రూపాంతరం చెందించి, మూలతః దానికున్న విదేశీ నైజం లేకుండా అది కూడా ప్రాచీన దేవతా రూపంలో పనిచేసే సమరసాత్మక అంశంగా మారి భారతావని యొక్క పరాశక్తిగా, అధిదేవతగా, ఆధునిక ప్రభావానికి లోబడక దానినీ స్వాధీనపర్చుకొనేదిగా అవ్వాలి.

శ్రీఅరవిందులు

సరియైన నివారణోపాయం

భారతావని తనకు తానుగా వుండి, తన స్వభావానికున్న నియమనిబంధనలను అనుసరిస్తూ వున్నప్పుడే అత్యుత్తమపు గతిని సాధించి, ఈ మానవజాతిని సేవించ గలదు. అంటే దీనర్థం కొందరు సంకుచితంగా, గ్రుడ్డిగా ఊహించినట్లు కాలాను గుణంగా వచ్చే ప్రతి క్రొత్తదానిని లేదా పాశ్చాత్యులు ప్రప్రథంగా వృద్ధిపరచి, బహిర్గతం చేసి బలపర్చినదానిని నిరాకరించడం కాదు. అట్లాంటి ధోరణి అవివేకంగా, అసంబద్ధంగా, వుంటుంది. భౌతికంగానూ అది సాధ్యమయ్యేది కాదు. అన్నింటికీ మించి అనాధ్యాత్మికమౌతుంది. అసలైన ఆధ్యాత్మికత క్రొత్త వెలుగును నిరాకరించదు. మానవ స్వయం వికాసానికై అవసరమైన వనరులను, అదనంగా కలిసివచ్చే సాధనా సంపత్తిని త్రోసిపుచ్చదు. దీని అర్థమేమంటే మన మూలస్థానాన్ని అట్లాగే, మన విలక్షణ అస్తిత్వశైలినీ, జన్మతః అలవడిన స్వభావాన్ని నిలద్రొక్కుకుంటూ బయట నుండి పొందిన దాన్నంతా దానికి ఇమిడ్చి మనం చేసే ప్రతి పనీ, మనం సృష్టించే దాన్నంతా దాని నుండి ఉద్భవించేలా చేయాలి.... ఒకవేళ మతమనే దానికి ఆధ్యాత్మక ప్రేరేపణను దాని పూర్తి స్థాయిలో అనుసరించగల సంవేదనను కలుగచేసి దైవాన్నీ, అతున్నత ఆత్మస్థితిని తెలుసుకోవడం, దానిలో జీవించడం, సమస్తాన్నీ తనలో కలుపుగోల ఏకత్వాన్ని, దివ్యతమ సంభావ్యతలతో కూడివున్న విలువలను అందుకోగలిగేలా జీవితంలోని అన్ని భాగాలనూ ఉద్ధరించడమే ఆధ్యాత్మికతగా నిర్వచించినప్పుడు దానిలో మతపరమైనది అధికంగా లేదని, కొద్ది మాత్రమే వున్నది అన్నది సుస్పష్టం. అలా వున్న దానిలో కూడా చాలా వరకు ఏకపక్షమైనదే వున్నందున చాలినంత ఉన్ముఖత కొరవడుతుంది. దీనికి నిజమైన నివారణోపాయం అనాదిగా భారతదేశ ఆదర్శాన్ని చిన్నబుచ్చకుండా, దాని గత ఔన్నత్యదశకు చేరుకొని, దానికి మరింత విస్తృత పరిధిని కల్పించి వాస్తవానికి దేశజీవితాన్నే ఉన్నత ఆధ్యాత్మిక భావనలో ఒక మతంగా రూపొందించడం. పాశ్చాత్య తత్వశాస్త్రం, సాహిత్యం, కళలు కొంత అస్పష్టంగా ఈ దిశగా మన్నా పెరుగుతున్న వెలుగులో మలుపు తిరగడం మొదలుపెడుతున్నాయి. అంతేగాక సత్యం యొక్క కాంతులు మంద కొడిగా రాజకీయ, సామాజిక ఆదర్శాలపై పడుట ప్రారంభమయింది. ఆ ఆదర్శానికి చెందిన జ్ఞానానికి, చైతన్యవంతమైన ఆచరణకు తాళంచెవి భారతావని కలిగి వున్నది.

ఆమెకు దానిని ఆచరణలోకి తేవడంలో మునుపు ఏది అంధకారమయంగా వున్నదో ఇప్పుడు దానిని క్రొత్త వెలుగులో ప్రకాశింపజేయగలదు. పాత విధానాల్లో ఏ పొర పాట్లు, వక్రతలున్నాయో వాటినన్నింటినీ తాను ఇప్పుడు సరిచేయగలదు. తన ఆధ్యాత్మికధర్మం యొక్క బాహ్యవికాసాన్ని కాపాడుకోవడానికి ఏ 'కంచె' ను వేసుకుందో అది తరువాతి కాలంలో తనకు తాను విస్తరించుకోవడానికి, తన భవిష్య ప్రయోజనానికి అవరోధాలుగా మారిన నిబంధనలను విచ్ఛిన్నం చేయగలదు. తన ఆత్మకు స్వేచ్ఛాయుత విశాల సీమలను, బ్రహ్మాండమైన శక్తినీ అందివ్వగలదు. ఆమె సంకల్పిస్తే సమస్త మానవజాతీ తొట్రుపాటుతో పరిష్కారానికై ప్రయాసపడు తున్న సమస్యలపై ఒక క్రొత్త నిర్ణయాత్మకమైన పరిష్కారపూర్వకమైన ఒక మలుపు తేగలదు. వీటి పరిష్కారాలకు కీలకమైన ఆధారం ఆమె యొక్క ప్రాచీన జ్ఞానంలో నిబిడీకృతమై వున్నది.

శ్రీఅరవిందులు

భారతదేశం — ప్రపంచ సంస్కృతి
సంస్కృతుల విలీనం
(1916 జూలై)

వర్తమాన ప్రపంచ చరిత్ర పెద్ద సంక్రమణల దశగా భావించవచ్చు. ప్రాక్ పశ్చిమ దేశాలు మారుతున్నప్పుడు, ప్రాచ్యదేశాల గుండె అయిన ఇండియా మారాలి. యూరోప్ రుద్దిన సమస్యలను ఎదుర్కోవడానికి భారతదేశం మారక తప్పదు. తప్పించుకోలేదు. ప్రగతిశీల మరియు మార్పులు కోరని యధాతథ సాంప్రదాయ సంరక్షక ఆదర్శాలు, ధోరణుల మధ్య సంఘర్షణ వలన కాని, సంలీనం వలన కాని, సమతుల్యం వలన కాని పొందిన కొత్త ప్రాచ్యవ్యవస్థ అయివుండాలి. ఈ దేశంలో యధాతథ మనస్సుతో మార్పుకు లోనుకావలసిన అవసరం వైపు తెరుచుకుంటే, తత్ఫలితంగా పునరుద్ధరణ చెందిన భారతదేశం నుండి ఆవిర్భవించిన సంస్కృతి ప్రపంచ భవిష్యత్ నాగరికతలో ఘనమైన మార్పు తేవడం సాధ్యపడవచ్చు. అయితే, నిర్జీవ కల్పనలు, కుతర్కం చేసే హేతువాదాల మాటల మాయజాలంలో అది

చిక్కుకొన్నట్లయితే, ఎటువంటి మార్పు అనేది కోరని పక్షంలో, అప్పుడు కొత్త భావాలు వికాసం చెందడం విఫలం కావడంతో, పాశ్చాత్య సాంఘిక రాజకీయ సంస్కరణకర్తల మూసలో భారత భవిష్యత్తు అల్లకల్లోలం అవుతుంది. అటువంటి సంస్కర్త మౌలిక ఆలోచనలు కోల్పోయి, అనుభవాలతో మనోవికాసం పొందలేక, యూరప్ భావాల రూపాలను సృష్టిస్తాడు. మనల్ని పాశ్చాత్య దేశపు వానరాలుగా మార్చి వుండేవాడు. లేదా ఈ సువిశాల జీవనలోతుల లోనుండి ఒక నూతన ఆధ్యాత్మిక జాగృతి రావాలి. అంతకు మించిన ఉత్తమ పరిణామం లేదు. భువన జీవన సమస్యలు, ఆత్మ, దాని భువనాతీత భవితవ్యాలు అన్నింటిని ఆ జాగృతి తనలో ఇముడ్చుకోవాలి.

పాశ్చాత్య దేశాల పునరభ్యుదయ ఆధ్యాత్మిక అన్వేషణతో పాటు మానవాళి పరిపూర్ణత్వం కోసం భారతదేశపు ఆకాంక్షను జతచేసే జాగృతి రావాలి. ఈ మూడవ అజ్ఞేయ వాస్తవికత ప్రాక్ ప్రపంచానికి కావలసిన శక్తిగా మారుతుంది.

CWSA 13: 137-38

శ్రీఅరవిందులు

అభివృద్ధి సమన్వయాల కొత్త యుగం

రానున్న యుగాలకు చెందిన మనం కొత్త, విశాలమైన సమన్వయానికి దారితీసే వినూతన అభ్యుదయ శకం శిఖరంలో నిలిచి వున్నాము. ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత శాఖలు, తాంత్రిక శాఖ, ఏదో ఒక ఆస్తికమతం, — వాటికే పరిమితం అయ్యే సంప్రదాయ వేదాంతులం కానక్కరలేదు. భగవద్గీత ప్రబోధం కటకటాల వెనుక బంధింపబడ నవసరం లేదు.

మనలో నుండే మన శక్తుల నుండే కొత్త ఆధ్యాత్మిక జీవనవిధానాన్ని నిర్మించుకోవ డానికి బ బదులు ఇతరుల అస్తిత్వం, జ్ఞానం, స్వభావం నుండి, గతకాలపు వ్యక్తుల నుండి ఆధ్యాత్మిక జీవనానికి పరిమింత చేసుకోవడం అది.

మనం గతకాలపు ఉదయాలకు కాకుండా భవిష్యత్ మధ్యాహ్నాలకే మనం చెంది వున్నాం. కొంగ్రొత్త భావాలు మనలోకి ప్రవహిస్తున్నాయి. భారతదేశపు ఆస్తిక మతాలు, ప్రపంచ మతాలు, తిరిగి అర్థం చేసుకొన్న బౌద్ధమతం వాటి ప్రభా వాలను మనం జీర్ణించుకోవాలి. అంతేకాదు ఆధునిక జ్ఞానం, అన్వేషణల శక్తివంతమైన

పరిమిత ఆవిష్కారాలు స్వీకరించాలి.

ఆ పైన మానవజాతి కోల్పోయిన అనేక తేజోమయ రహస్యాల వెలుగు వైపు నిర్జీవమైనట్లు కనిపిస్తున్న ఎన్నో యుగాల నాటి గతం తిరిగి మన వైపు తెర వెనుకగా ప్రయాణిస్తున్నది.

ఇది ఒక కొత్త సుసంపన్న మైన, విశాలమైన సమన్వయాన్ని సూచిస్తోంది, మనం సాధించిన విజయాల వినూత్న అఖిల సామరస్యీకరరణ భవిష్యత్తుకు మేధా పరమైన, ఆధ్యాత్మిక అవసరం కాగలదు.

CWSA 19:10

శ్రీఅరవిందులు

ఆధునికత, యధాతధ వాదం

1916 మే

భవిష్యత్తు రెండు మనస్సులు గల ఒక మహాయక్షిణి. ఒక శక్తి తనను తాను అర్పించుకుంటుంది. తిరస్కరిస్తుంది. తనను తాను ఇచ్చుకొంటుంది. ప్రతిఘటిస్తుంది మనల్ని సింహాసనంపై కూర్చోబెట్టేది అదే. సంహరించేది అదే. ఈ విజయం సాధించడానికి ప్రయత్నించేది. అయితే మనం గెలుపు కోసం ప్రయత్నించాలి. పంధాన్ని ఆమోదించాలి. భవిష్యత్తు మనకు అందించే మరణాన్ని, జీవనాన్ని మనం ఎదుర్కోవాలి. అది మనని భయపెట్టబోదు. పాత పేరులు, పాత రూపాల మరణంతో మరింత మహనీయమైన, వినూతనమైన రూపాలలో శక్తివంతంగా జీవించగలం. ఎలాగైనా మనం అడుగు ముందుకే వెయ్యాలి. మనం ముందుకు నడవకపోతే, మనం ఎంతగా అచలత్వాన్ని ప్రీతిపాత్రంగా పొందినా, కాలమే మనల్ని ముందుకు తోస్తుంది. ఇది చాలా దయనీయమైన, ప్రమాదకరమైన చలనం. మనల్ని రక్షించమని కరిగిపోతున్న గతకాలపు శకలాలను, మృతరూపాలను ఉన్మాదంతో ఎంతగా వేడుకున్నా, ఎంత యత్నించినా, విచ్ఛిన్నమైపోతున్న గతాన్ని పట్టుకొన్న మనం నిస్సహాయంగా ముందుకు తోయబడడం ఎంత దయనీయం? స్వభావరీత్యా చలనశీలమైన దానిపై అచలత్వాన్ని రుద్దడం కన్నా ప్రమాదకరమైనది లేదు. భవిష్యత్తుకు భయపడని వారే మహనీయమూర్తులు, వారు భవిష్యత్తు సవాలును, పందాల్ని ఆమోదించినవారు.

ప్రపంచాన్ని నడిపే భగవంతునిలో, శక్తిలో వారికి అమేయ విశ్వాసం, అనంతంతో పోరాడే ఉన్నత విజ్ఞత వారికి ఉంది. అసంభవాన్ని వారు సాధించగలరు. అందుకు భవితవ్యంలో వీరోచితమైన తెలివైన విశ్వాసం ఉండాలి. ఈ లక్షణాలన్నీ అవతారాలలో, ప్రవక్తలలో, కొత్త సృష్టి చేసేవారిలో, సమాజ పునరుద్ధరణ కర్తలలో కనిపిస్తాయి.

CWSA 13:29-30

శ్రీఅరవిందులు

ఆలోచనలో విశాలత
(1912)

ముందు మన కొత్త ఆలోచన విశాలంగా పటిష్ఠంగా ఉండాలి. ఆలోచనలు బృహత్తరంగా ఉండాలి. ఆ విశాలజ్వాలతో పోరాడగల శక్తి మన ఆత్మలకి ఉండాలి. మనం ఏది నాశనం చేస్తున్నామో తెలుసుకోడానికి జాగ్రత్త పడాలి. మరింత మహనీయమైన, మరింత పరిపూర్ణమైనదానిని కూలిపోతున్న గతం స్థానంలో చూ లేకపోతే, అసలు నాశనమే చేయకూడదు.

సాంఘిక సంస్కర్తల, యూరోపియన్ సమాజాల స్ఫూర్తితో, తాత్విక, అతాత్విక అరాచకవాదుల స్ఫూర్తితో హిందూసమాజాన్ని కూల్చివేయడం, వ్యవస్థను నాశనం చేయడమవుతుంది. గందరగోళాన్ని సృష్టించడం జరుగుతుంది. ఈ జాగ్రత్తలను పాటిస్తే అత్యంత సాహసోపేతమైన, నిర్దాక్షిణ్యంతో కూడిన నవ్యత్వం గల మౌలిక ఆలోచన సాధించినా ప్రమాదం లేదు. ఉదాహరణకు కొత్త న్యాయము శిక్ష వ్యవస్థ లేకపోయినా, ప్రస్తుత వ్యవస్థ అర్ధరహితం, ఒక దుష్టవ్యవస్థ అని నేను దూషించవచ్చు. కొత్త వ్యవస్థ వచ్చేవరకు అర్ధరహితమైన పాతవ్యవస్థను నాశనం చేయాలని తలచకూడదు.

మానవ శ్రేయస్సును ఉద్ధరించే పరమాత్మ ద్వేషించే ఖాళీస్థలాన్ని నింపుతుంది. కొత్తమతం బోధించడానికి ప్రబోధాలు ఏవీ లేనప్పటికీ, ఇప్పుడున్న మతాన్ని దానిలోని బలహీనతలను, సంకుచితత్వాన్ని నేను వెల్లడించవచ్చును. అటువంటి లోపాలను విమర్శిస్తే, మన విశ్వాసాన్నే నాశనం చేయడం జరుగుతుంది. అసలు మతం లేకుండా పోవడం కన్నా చెడ్డమతమైనా ఉంటే చాలు.

విశ్వాసం, ఆధ్యాత్మికత కోల్పోవడం కన్నా ఆఫ్రికా ఆటవిక మానవులతో నా చుట్టూ ఉన్న శక్తిని ఆరాధించడం మేలు. ఆ మృగాలలో, విజ్ఞానరహిత ఆరాధనలో దివ్యాగ్నిశిఖ ఉంటుంది. అదే మానవాళి మనుగడకు కారణం. విలాసవంతమైన ఆధునిక సంపన్నుడు శరీరమే సుఖ సాధనమని భావించేవాడు సర్వనాశనం వైపు తన జాతి ప్రజలను నడుపుతాడు. మన వెలుగు స్పష్టంగా వుండాలి, నిలకడగా ఉండి కాంతికిరణాలను ప్రసారం చేస్తుండాలి. చీకటిలో, సన్నని వెలుగులో తీవ్రమైన కాంతిచ్ఛాయగా అది వుండకూడదు. అటువంటి ఆదర్శం మనం రూపకల్పన చేయలేకపోతే, ఆలోచించడం విరమించుకోడం కన్నా ఆలోచించడమే మేలు. చీకటిలో నుండే ఉషస్సు ప్రభవిస్తుంది. మెరుపులకు వాటి ప్రయోజనం ఉండి తీరుతుంది.

CWSA 12:43-44

శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

ప్రపంచంలో భారతదేశం వహించవలసిన పాత్ర

భారతదేశ భవిష్య కార్యాచరణ

భారతదేశ భవిష్యత్కార్యక్రమంగా నేను విశ్వసించిన దానిలో అవి (ఇంతకు ముందె ర్పరచిన లక్ష్యాలు, ఆదర్శం) ఒక భాగం. ఆ కార్యక్రమంలో ఆమె (భారతదేశం) నాయకత్వం వహించి తీరవలసిందే. భారతదేశం జాగృతమౌతోందని నేను అనుభవ పూర్వకంగా చెప్పింది, భౌతికమైన తన ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి గానీ, తనను తాను విస్తరించుకోవడానికీ, తన గొప్పతనాన్ని, శక్తినీ సంపదనీ సాధించుకోవడానికి కాదు. తన గొప్పతనాన్ని, శక్తినీ సంపదనీ సాధించుకోవడానికి కాదు. శక్తిసంపదలని ఆమె ఉపేక్షించకూడనప్పటికీ, నిశ్చయంగా ఇతరులలాగా, వేరే దేశాలమీద అధికారం చెలాయించడానికి కాదు. దైవంకోసం జీవించేందుకూ, ప్రపంచం కోసం జీవించేందుకూ, మొత్తం మానవజాతి కంతటికీ ఉపకారిగా, నాయకురాలిగా ఉండడం కోసం మాత్రమే, భారతదేశం జాగృతమౌతోంది. ఆ లక్ష్యాల ఆదర్శాల (ఇంతకు ముందేర్పరిచినవి) సహజక్రమం ఇది: భారతదేశపు స్వేచ్ఛనీ ఐకమత్యాన్ని

సాధించే విప్లవం: ఆసియా పునరుజ్జీవన, విమోచనాలని పొందడం, మానవనాగరికతాభి వృద్ధిలో ఆమె (భారతదేశం) వహించిన మహనీయమైన పాత్రను తిరిగి చేపట్టడం; ఒక నూతన, మహనీయ, ఉజ్వల, ఉదాత్త జీవనంగల మానవజాతి వృద్ధిచెంది, దాని సంపూర్ణ జ్ఞానం బాహ్యంలో, ప్రత్యేక అస్తిత్వాలు కలిగిన వివిధ దేశాల ప్రజలను అంతర్జాతీయంగా ఏంక చెయ్యడంలోనూ, వారి జాతి జీవనాన్ని సంరక్షిస్తూ, పరి రక్షిస్తూ కూడా వారందరినీ పరిపూర్ణ ఏకత్వపు ఆధిపత్యం కిందకి నడిపించడంలోనూ ఉంటుంది; భారతదేశ ఆధ్యాత్మికజ్ఞానం, జీవితాన్ని ఆధ్యాత్మికం చేయడానికి ఆమెకి గల సాధనాలు — ఇవి భారతదేశం జాతి మొత్తానికీ అందించే కానుక; పరిణామంలో రాబోయే కొత్త అడుగు, చైతన్యాన్ని ఉన్నతస్థాయికి పైకెత్తడం ద్వారా, మానవులు ఆలోచించడం ప్రారంభించినప్పటినించీ, వ్యక్తిగత పరిపూర్ణతనీ, పరిపూర్ణ సమాజాన్ని గురించి కలగన్నప్పటినించీ, మానవజాతిని కలవరపెట్టి చికాకు పరిచే అస్తిత్వానికి చెందిన అనేక సమస్యలను పరిష్కరించడం ప్రారంభిస్తుంది.

భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందించి కానీ, ఏకత్వాన్ని సాధించలేదు. చీలిన, బీటలువారిన స్వాతంత్ర్యమే దక్కింది. ఏ విధంగానైనా సరే విభజన లేకుండా పోవాలి. పోతుంది. లేకపోతే భారతదేశ భవిష్యత్తుకి తీవ్రహాని కలుగుతుంది. నిష్ఫల మౌపోతుంది.

ఆసియా జాగృతమైంది. ఆసియాలోని అనేక ప్రాంతాలు విమోచన పొందాయి. పొందుతున్నాయి. మరి కొన్ని ప్రాంతాలు స్వేచ్ఛ కోసం పోరాటం చేస్తున్నాయి. చెయ్యవలసింది ఇంకా కొద్దిగా ఉంది. నేడో రేపో అది కూడా జరుగుతుంది. ఈ సందర్భంలో భారతదేశం నిర్వహించాల్సిన పాత్ర ఉంది. ఇప్పటికే ఆమె తన శక్తి సామర్థ్యాలతో ఈ పనిని ప్రారంభించింది. వివిధ దేశాల సమాఖ్యలలో ఆమె చేపట్టవలసిన స్థానాన్ని, ఆమె సంభావ్యతల ప్రమాణాలను ఆమె శక్తిసామర్థ్యాలు సూచిస్తున్నాయి.

మానవజాతి ఏకీకరణ సాగుతోంది. దీని ఆరంభం అపరిపూర్ణతలోనే జరిగినా, ఒక క్రమబద్ధంగా, అంతులేని ఆటంకాలను ఎదుర్కొంటూ సాగుతోంది. చలనగతి ఉంది. గత చరిత్రానుభవాన్ని మార్గదర్శకంగా తీసుకుంటే, మానవజాతి ఏకీకరణ విజయం సాధించేదాకా అనివార్యంగా అభివృద్ధి చెందుతూనే ఉండాలి. ఇక్కడ కూడా భారతదేశం ముఖ్యపాత్ర వహించడం ప్రారంభించింది. ఆమె తన అత్యున్నత రాజనీతిజ్ఞతని పెంపొందించుకుంటే, వర్తమాన వాస్తవాలకి, తాత్కాలిక ప్రయోజనాలకి

కట్టుబడకుండా భవిష్యత్తును చూడగలిగితే దాన్ని (మానవజాతి ఏకీకరణని) త్వరగా సాధ్యమయ్యేటట్లు చేయగలదు. ఆమె (ఏకీకరణ) సాన్నిహిత్యం వల్ల మందగొడిగా భీరుత్వంతో సాగే పురోగతికీ, ధైర్యంగా, శీఘ్రంగా జరిగే పురోగతికి మధ్య హస్తిమశ కాంతరమంత తేడా కనపడుతుంది. జరిగిన అభివృద్ధిని ఏదో ఒక విపత్తు ముంచెత్త వచ్చు, నాశనం చెయ్యొచ్చు. అప్పుడు కూడా అంతిమ ఫలితం రావడం మాత్రం నిశ్చయం. కారణం, ఏదేమైనా కూడా ప్రకృతి పురోగమనంలో ఏకీకరణ అత్యంత ఆవశ్యకం. అనివార్యమైన గమనం. నిస్సందేహంగా అది విజయం సాధిస్తుందని చెప్పచ్చు. ప్రపంచదేశాలకి దీని (ఏకీకరణ) అవసరం ఉందనేది సుస్పష్టం. ఏకీకరణ జరగకపోతే చిన్న దేశాల ప్రజల స్వేచ్ఛకి భద్రత ఉండదు. ఇక నించీ పెద్ద దేశాలకి, శక్తిమంతమైన దేశాలకు కూడా రక్షణ ఉండదు. భారతదేశం ముక్కలౌతుంటే ఆమె భద్రత కూడా ప్రశ్నార్థకమౌతుంది. కనుక అందరి ప్రయోజనాల దృష్ట్యా దేశాలన్నీ ఏకం కావడం అత్యంత అవసరం. మానవుడి మూఢత్వం, బుద్ధిహీనతా స్వార్థం ఏకీకరణని అడ్డుకోవచ్చు. దీన్ని ఆపడంలో దేవతల శ్రమ కూడా నిష్ఫలమైపోతుంది. అయితే, ప్రకృతి అవసరానికీ, దైవేచ్ఛకి విరుద్ధంగా ఎల్లకాలం అడ్డుకోవడం సాధ్యపడదు. అప్పుడు జాతీయభావన తనని తాను సఫలం చేసుకుంటుంది. అంతర్జాతీయస్పృహ, దృక్పథం పెరగాలి. అంతర్జాతీయవిధానాలు, వ్యవస్థలు రూపొందాలి. మారే ప్రక్రియలో భాగంగా, ద్వంద్వ, బహుళ పౌరసత్వాలు, విభిన్న సంస్కృతుల స్వచ్ఛంద సమ్మేళనం వంటి పురోగతులు జరగవచ్చు. జాతీయ భావన తన తీవ్రతని వదిలిపెట్టి ఇవన్నీ సంపూర్ణంగా అనుకూలమైనవనే దృష్టిని పెంపొందించుకోవచ్చు. ఒక కొత్త ఏకత్వభావన మానవజాతిని వహిస్తుంది.

భారతదేశం ప్రపంచానికందించిన ఆధ్యాత్మిక కానుక ప్రభావం అప్పుడే మొదలైంది. ఇదివరకెన్నడూ లేనంతగా, భారతదేశపు ఆధ్యాత్మికత యూరప్, అమెరికా దేశాలలో వేగంగా విస్తరిస్తోంది. ఈ ఉద్యమం పురోభివృద్ధి చెందుతూనే ఉంటుంది. కాలంలో వచ్చే విపత్తులలో ఎన్నెన్నో కళ్ళు ఆమె వైపు ఆశతో చూస్తుంటాయి. అధికాధికంగా ఆమె బోధనలను ఆశ్రయించేవారు అధికమవడంతో పాటు, ఆమె చైత్య, ఆధ్యాత్మిక ఆచరణలని కూడా అనుసరించేవారి సంఖ్య పెరుగుతునే ఉంది.

మిగిలినదంతా వ్యక్తిగత విశ్వాసం, భావన, ఆదర్శాలు. భారతదేశంలోను, పాశ్చాత్య దేశాలలో కూడా భవిష్యత్తును చూడగల మనసులను వ్యక్తిగత విశ్వాసం,

భావన, ఆదర్శాలు అంటిపెట్టుకొని ఉంటాయి. ఈ మార్గంలో ఎదురయ్యే ఇబ్బందులు ఇతర రంగాలలో కృషిచేస్తున్నప్పుడు కలిగే ఇబ్బందుల కంటే చాల ప్రబలమైనవి. అయితే ఇబ్బందులు అధిగమించడం కోసమే ఏర్పడ్డాయి. అత్యున్నతుని ఇచ్ఛ ఉంటే వాటిని అధిగమించవచ్చు. ఇక్కడ కూడా పరిణామం జరగాలంటే ఆత్మాభివృద్ధితో, అంతరంగచైతన్యంతో జరగాలి. దీని పరిధి విశ్వజనీనమైనా ప్రధాన గమనం మాత్రం భారతదేశానిదే.

అభివ్యక్త జీవితంలో సామరస్యానికి దారి

మానవ పురోగతి సంపూర్ణం కావడానికి మానసిక, ప్రాణిక, భౌతిక ప్రాముఖ్యత గల యూరప్ ధోరణి, ఆధ్యాత్మిక, అంతరాత్మ ప్రేరణలుగల భారతీయ ధోరణి రెండూ అవసరమే. అభివ్యక్త జీవితంలో విజయవంతమైన సామరస్యాన్ని సాధించే అంతిమ మార్గాన్ని ఆధ్యాత్మిక మార్గం చూపుతున్నప్పుడు భారతదేశం సత్యాన్ని వదలకుండా ఉండడం చాల ముఖ్యం. ఆమెకి తెలిసిన అత్యున్నతాన్ని వదిలి, త్వరగా అచరణలో పెట్టగలిగేదానితోనూ, ఆమె స్థిరమైన, నిజమైన స్వభావానికీ పరాయిదైన నిమ్నస్థాయిలోనే ఉన్న ఆదర్శంలో మార్పిడి చేసుకోగూడదు.

సత్యం — అత్యున్నత ప్రవర్తనా ధర్మం

హిందూమతం ఒక శాఖ కాదు, మూఢమతం కాదు. ఆచారాల సమూహం, సంఘ నియమ సముదాయం కాదు. అది శక్తిమంతమైన శాశ్వతమైన విశ్వసత్యం. అనంతమైన దైవ అస్తిత్వంతో కూడిన దివ్య పరిపూర్ణ తాదాత్మ్యాన్ని పొందడానికి మానవ అంతరాత్మని సన్నద్ధం చేసే రహస్యాన్ని ఆమె తెలుసుకుంది. ఈ మహనీయమైన సన్నద్ధతకి దోహదపడితేనే, జీవితంలోని నియమాలు, విశ్వాసానికి సంబంధించిన సూత్రాలు ప్రయోజనకరమూ, పవిత్రమూ అవుతాయి. జీవితం మొదటి సూత్రం, మానవుడు ఉన్నతమైన జీవితాన్ని జీవించడం, దానివల్ల అతడికి స్వార్థాన్ని, భయాన్ని భౌతికసుఖాల కోసం సత్యంతో బేరసారాలాడే ప్రలోభాన్ని అధిగమించగల సామర్థ్యం కలుగుతుంది. విశ్వాసానికి సంబంధించిన మొదటి సూత్రం 'సత్యాన్నాస్తి పరోధర్మః'.

నడవడకి చెందిన ఉన్నత ధర్మం సత్యం ఒక్కటే.

ప్రపంచానికి ప్రకాశ, పునరుద్ధరణలకు చెందిన శాశ్వత మూలాధారాన్నందించడమే భారతదేశ ప్రథమ కర్తవ్యం.

CWSA 7:928, 1086

శ్రీఅరవిందులు

అనువాదం: తెన్నేటి నాగరంజని

విశ్వగురువుగా హిందూదేశం

భారతదేశ ఆత్మ ఒక్కటే. అది ఆవిభాజ్యం. ఈ ప్రపంచంలో తన పాత్ర యొక్క ఎరుకను హిందూదేశం కలిగే యున్నది. ఆ ఆశయ ఆవిష్కరణకై ఆమె బాహ్యసాధనాల కోసం వేచియున్నది.

*

భారత భవిష్యత్తు సుస్పష్టం. హిందూదేశం విశ్వగురువు కావటం తథ్యం. ప్రపంచ భవిష్య నిర్మాణం భారతదేశంపై ఆధారపడి ఉన్నది. భారతదేశం ఒక సజీవాత్మ. ప్రపంచ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని భారతదేశం మూర్తీభవిస్తుంది. ఈ పరిధిలో భారత ప్రభుత్వం భారతదేశపు ప్రాముఖ్యతను గుర్తించి, అందుకు అనుగుణంగా వారి కార్యప్రణాళికను రూపొందించుకోవలసి ఉన్నది.

*

భారతదేశ పటం గురించి

ఇది పాకిస్థాన్, భారతదేశాల విభజన తర్వాత తయారైన పటం. తాత్కాలికమైన మార్పులు జరిగినప్పటికీ, ఇదే నిజమైన భారతదేశ పటం. భావాలు ఏ విధంగానున్నా భారతదేశ పటం, వాస్తవానికి ఎప్పటికీ ఇలాగే ఉంటుంది.

శ్రీమాత (29 జూలై, 1964

*

భారతదేశం ప్రపంచానికి గురువుగా వుండవలసి వున్నది. అంతర్గతంగా ఆమెకు ఈ సమర్థత ఉన్నప్పటికీ, నిజానికి బాహ్యంగా ప్రస్తుతం ప్రపంచానికి ఆధ్యాత్మిక



పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, శ్రీ కామరాజ్ నాడార్, శ్రీమతి ఇందిరాగాంధీ, శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి గార్లతో శ్రీమాత – 29 సెప్టెంబరు 1955 ఆశ్రమ క్రీడా ప్రాంగణంలో.

గురువు కావటానికి యింకా ఎంతో చేయవలసి ఉన్నది. ఇప్పుడు అందుకు ఎంతో అద్భుతమయిన అవకాశం వుంది! కానీ...

*

ఓ భారతావనీ! ఆత్మజ్ఞాన తేజోసంపన్న భూమీ! విశ్వంలో నీ నిజపాత్ర పోషించేందుకు మేలుకో. సమతా, సమైక్యతా మార్గాన్ని ప్రబోధించు!

*

ఆధునిక మానవజీవి ఎదుర్కొంటున్న సమస్య లన్నించికీ భారతదేశం ఒక సంకేతాత్మక ప్రతినిధి. సత్యము, మహోన్నతమైన ఆధ్యాత్మిక జీవన పునరుద్ధరణకు భారతదేశం పుణ్యభూమిగా నిలుస్తుంది.

*

ఈ అనంతమయిన సృష్టిలో పృథ్వి కొక విశిష్టత ఉంది. మిగిలిన గ్రహాలవలె గాక ఆమె తన కేంద్రంలో చైత్యసత్యను కలిగి పరిణామాత్మకమయినది. అందునా ప్రత్యేకంగా భారతదేశం దైవికంగా ఎన్నుకోబడిన దేశం.

*

నిజమైన విముక్తి అనేది ఒక ఆరోహణాయుత కదలిక. నిమ్నమయిన ప్రవృత్తులకు లొంగనిది. నిజమైన విముక్తి దైవసాక్షాత్కార ఫలితం. మానవాళి ఏ అంతిమ పరివర్తనకు లోనుకావాలో దానికి సరైన ప్రతీకగా ప్రపంచానికి దర్శింపచేయడానికి భారతదేశం ఒక నమూనా కావాలి. అందుకే మనం భారతదేశానికి యదార్థమైన విముక్తిని అభిలషిస్తున్నాం.

*

ఆధ్యాత్మిక దృష్టితో చూసినట్లయితే ప్రపంచంలో అన్ని దేశాలకు భారతదేశం ముందుంటుంది. ఆమె ధ్యేయం ఆధ్యాత్మిక ఆదర్శాన్ని నిలపటం. శ్రీఅరవిందులు ఇది బోధించటానికే భూమిపై అవతరించారు. ఈ సత్యం ఎంత స్పష్టంగా కనిపిస్తున్నదంటే భారతదేశంలో ఎంతో సాదాసీదాగా ఉండే అమాయక రైతు కూడా అతని హృదయంలో మేధావంతుడైన పాశ్చాత్యుడి కన్నా భగవంతుడికి దగ్గరగా ఉంటాడు.

*

దివ్యజీవనానికి ఒక సమగ్రమైన దూత కాగలిగినప్పుడే భారతదేశం ప్రపంచంలో తన నిజస్థానాన్ని పొందుతుంది.

CWM 13:244-45, 351-72

శ్రీమాత

వినతి

ఆగస్టు 15, 1947

ఓ మా తల్లీ! ఓ భారతావని ఆత్మా! జననీ! గాఢ తమోమయ ఘడియలలోనూ నీవు నీ బిడ్డలను విడనాడలేదు. నీ వాక్కును పెడచెవిని పెట్టినపుడు, నిన్ను తిరస్కరించి పరాయి ప్రభువులను సేవించినపుడు కూడా నీవు నీ బిడ్డలను నిరసించలేదు. ఈనాడు వారు నిలిచి ఈ స్వాతంత్ర్య శుభోదయ రోచిస్సులో నీ వదనం ప్రకాశిస్తున్న మహోజ్వల క్షణాలలో తలవంచి నీకు వందనం చేస్తున్నాము. మా ముందు తెరచుకుంటున్న స్వాతంత్ర్యపు ప్రాచీరేఖ, ప్రపంచదేశ సంఘాలలో నీ ఔన్నత్యానికి నీ సత్యజీవనానికి కూడా క్షితిజతీరమై మమ్ములను నడిపించు గాక. మేము అనునిత్యము ఉన్నతాదర్శముల పక్షమునే ఉండునట్లు, దైనికి మార్గమున నీ నాయకత్వమును, సర్వమానవాళికి నీ మిత్రత్వ సహకారములను చాటునట్లు అనుగ్రహింపుము.

CWM 13:312

శ్రీమాత

ఆశామంత్రం

పురాతన భారతావని గతించి పోలేదు. తన అంతిమ సృజన మంత్రాన్ని ఇంకా ఆమె ఉచ్చరించలేదు. తనకూ, మానవాళికీ ఇంకెంతో సాధించడానికి ఆమె సజీవమై ఉన్నది. మేల్కొనడానికి ఇప్పుడు మనం కోరవలసినది ఆంగ్లీకరించబడిన ప్రాచ్య దేశస్థులను కాదు, లేక పాశ్చాత్యుల జయాపయాలను వల్లించే విధేయులైన విద్యార్థులను కాదు; మరిచిపోలేని దివ్య ప్రాచీనశక్తి తన ప్రగాఢ ఆత్మతత్త్వాన్ని తిరిగి పొందుతూ, శిరస్సును ఊర్ధ్వతేజోశక్తుల వైపు పైకెత్తి, తన స్వధర్మం యొక్క సంపూర్ణ అర్థాన్ని,

విస్తృతమైన రూపాన్ని కనుగొనటానికి ప్రయత్నిస్తున్న భారతావనిని.

CWSA 20:444

శ్రీఅరవిందులు

సంశయము, నిరుత్సాహం, విశ్వాసం కోల్పోవడం లేదా వీగిపోవటం, ఆదర్శంపట్ల ప్రాణికమయిన ఉత్సాహం లోపించటం, సందిగ్ధత, భవిష్యత్ పట్ల స్థిరమైన ఆశలేక పోవటం అనేవి సంకటానికి వుండే సాధారణమైన లక్షణాలు. బాహ్యప్రపంచంలో మరింత అధ్వాన్నమయిన లక్షణాలను చూస్తాం. కీడునే ఎంచటం, దేనినీ విశ్వసించక పోవటం, నిజాయితీ లోపించటం, పెరిగే అవినీతి, ఆహారము, ధనము, సౌఖ్యాల పట్ల లాలసత, ఉదాత్తం కాని విషయాలలో ఆనందం పొందటం. కీడును శంకించడం, ప్రపంచంలో జరిగే పరిణామాలన్నీ మరింత అధ్వాన్నమయినవిగా వుంటాయని భావించటం. ఇవన్నీ ఎంత తీవ్రమయినప్పటికీ, విశ్వశక్తి, విశ్వాత్మ యొక్క కార్యపు తీరు తెలిసినవారు వాటిని తాత్కాలికమైనవిగా భావించి అందుకు సిద్ధంగానే ఉంటారు.

నేనీ దుస్థితి వస్తుందని ముందుగానే గమనించాను. ఇది ఉషోదయం ముందు అలముకొనే గాఢాంధకారం. అందుకే నేను ఏమాత్రం నిరుత్సాహపడలేదు. ఈ తమస్సు వెనుక సంసిద్ధమవుతున్నది నాకు అవగతమయింది. దాని తొలి సంకేతాలను నేను అందుకున్నాను, అనుభూతి చెందాను. దైవాన్ని కోరుకొనేవాళ్ళెపుడూ స్థిరంగా నిలబడి, తమ ఆకాంక్షను విడువకూడదు. కొంతకాలం తర్వాత అంధకారం వెలిసి, అంతరించటం ప్రారంభమయి వెలుగు అవతరిస్తుంది.

CWSA 35:369

శ్రీఅరవిందులు (ఏప్రిల్ 1947)

అనువాదం: డా. సరోజా ప్రసాద్

7/10/2013.



అఖిల

అఖిల భారత పత్రిక

అక్టోబరు 2013

7/10/2013.

విషయసూచిక



శ్రీమాత

యువతకు పిలుపు

ఓ యువకులారా, దేశానికి ఆశాజ్యోతులు మీరే. మిమ్ములను ఈ విధంగా ఊహించిన దానికి యోగ్యతను పొందటానికి మీకై మీరు సంసిద్ధులు కండి.

*

ఒక విషయంలో అది కచ్చితంగా జరిగితీరుతుందనే మీరు అనుకోవచ్చు — మీ భవిష్యత్తు మీ చేతులలోనే ఉంది. మీరు ఎటువంటి మానవుడిగా కావాలని కోరు కుంటారో, ఆ విధంగా అయితీరుతారు, మీ ఆదర్శం, లక్ష్యం ఎంత ఉన్నతంగా ఉంటే, అంత ఉన్నతంగానూ మీకు సాక్షాత్కారం కలుగుతుంది, కాని దాని కోసం మీరు దృఢంగా నిర్ణయించుకోవాలి. అసలైన మీ లక్ష్యాన్ని జీవితంలో ఎన్నటికీ మరువవద్దు.

*

అప్పుడు... ఇంకా తెలుసుకోవలసిన దానంతటితో పోలిస్తే నీకు తెలిసిందంటూ ఏమీ లేదనే విషయం నీవు నమ్మినప్పుడు, చేయవలసినదానిలో ఇప్పుడు నీవు చేసింది కేవలం ప్రారంభం మాత్రమేననీ, ఆకర్షించే సూర్యునివలె భవిష్యత్తు లెక్కలేనన్ని సంభావ్యతలను కలిగి ఇంకా ఎన్నింటినో సాధ్యం చేసుకోవలసి ఉందని నీవు గ్రహించ గలిగినప్పుడు, అప్పుడు నీవు యవ్వనంలో ఉన్నట్లు. భూమి మీద ఎన్ని సంవత్స రాలు గడిపినప్పటికీ నీవు యవ్వనుడవే. రేపటి సాక్షాత్కారము లన్నింటితో నీవు యవ్వనుడవు, సుసంపన్నుడవు.

నీ శరీరం జీర్ణమై పడిపోకూడదనుకుంటే అనవసరమైన ఆందోళనలతో నీ శక్తులను వృథా కానీయవద్దు. నీవు ఏమి చేసినా నిశ్చలంగా, శాంతచిత్తంతో చేయి. ప్రశాంతత లోను, నిశ్శబ్దంలోను మహోత్కృష్టమైన దృఢత్వముంది.

CWM 2nd Ed 12:122-23

శ్రీమాత

అనువాదం: డా. టి. ప్రసన్నక్రిష్ణ

సాహసయాత్ర అన్నింటిలోకి మహనీయమైనది

ఇప్పుడున్న విధంగానే జీవనం కొనసాగుతుండగా, మానవచైతన్యం సైతం ఉన్న దున్నట్లుగానే ఉంటుండగా, అదంతా ఒక విధంగా పూర్తిగా భరించలేని విధంగా తయారయి, ఒక రకమైన ఏవగింపుతో, అసహ్యం కలగే సమయమొకటి ఆసన్నమౌ తుంది. అప్పుడతడు ఈ విధంగా చెప్తాడు, "లేదు, అది ఆ విధంగా కాదు, అది ఆ విధంగా కానే కాదు, అది ఆ విధంగా ఉండటానికి వీల్లేదు, అది ఎంత మాత్రం కొన సాగకూడదు". అటువంటి పరిస్థితికి ఎవరైనా చేరుకుంటే, అతడు కేవలం తనకున్న దంతా — తన ప్రయత్నాన్నంతా, తన శక్తినంతా, తన జీవితాన్నంతా, తన అస్తి త్వపరమైనదాని నంతా — ఈ దైవఘటనలోకి, దానిని ఆ విధంగా అతడు తలిస్తే లేదా ఆవతలి ఒడ్డుకు చేరుకోవటానికి అపురూపమైన అవకాశంగా భావించితే — ఆ దైవఘటనలోకి లేక ఆ అవకాశంలోకి ధారపోయడం తప్ప మరో గత్యంతరం లేదు. ఎక్కడికో తీసుకువెళ్ళే కొత్తదారిలో అడుగువేయడం ఎంత హాయినిస్తుందో కదా! ఒక్క గంతు వేయడానికి అన్నింటినీ వదిలించుకుంటూ ఎంతో బరువును ఈ విధంగా తగ్గించుకోవడానికి నిర్ణయించుకోవడం సబబే. నేను సమస్యను ఈ విధంగా చూస్తాను.

వాస్తవానికి ఇది అన్ని సాహసయాత్రలలోకి విలక్షణత కలిగినది, మహనీయమైనది. ఒక వ్యక్తిలో ఏమాత్రమైనా సాహసయాత్రకు అసలైన అంతఃస్ఫూర్తిశక్తి ఉంటే దానంతటి కోసం సర్వస్వమునూ త్యాగం చేయడం యోగ్యమే.

CWM 7:323

శ్రీమాత

అనువాదం: డా. టి. ప్రసన్నక్రిష్ణ

అంతరంగ ఆకాంక్ష పరిస్థితులను కల్పిస్తుంది

అంతరంగ ఆకాంక్ష ఎంత తీవ్రతతో ఉందో అనేదాని మీద అంతా ఆధారపడి ఉంది. నీవు ఎరుకతో కూడిన ఆకాంక్షను కలిగి, చాలా చిత్తశుద్ధిని కలిగి ఉంటే, అప్పుడు, నీ ఆకాంక్షకు సహాయపడటానికి నీ చుట్టూ ప్రతిదీ క్రమపద్ధతిన ఉంచబడుతుంది. అది ప్రత్యక్షంగా కాని లేదా పరోక్షంగా కాని, నిన్ను పురోభివృద్ధి నొందించటానికి దేనితోనైనా కొత్తదానితో నీవు సంపర్కంలోకి వచ్చేటట్లు చేయడానికి లేక నీ ప్రకృతి నుంచి అదృశ్యమవవలసిన దానిని లేకుండా చేయటానికి పరిస్థితులు కల్పించబడతాయి. ఇది చాలా గణనీయమైన విషయం. నీవు నిజంగా తీవ్రస్థాయిలో ఆకాంక్షను కలిగి ఉంటే, నీ ఆకాంక్షను సాక్షాత్కరించుకోవటానికి సహాయపడని ఏ పరిస్థితీ రాబోదు. ప్రతిదీ నీ చెంతకు వస్తుంది. అవును ప్రతిదీ, ఏదో ఒక పరిపూర్ణమైన, సంపూర్ణ చైతన్యం నీ చుట్టూ అన్నింటినీ క్రమపద్ధతిలో అమర్చుతున్నట్లనిపిస్తుంది. బాహ్యంలోని నీ అజ్ఞానంలో, నీకుగా నీవు దానిని గుర్తించలేవు. బహుశా అవి మొదట నీ దృష్టికి తారసపడినా నీవు వాటిని అడ్డుకుంటావు కూడా. వాటిని గురించి బహుశా ఫిర్యాదునూ చేయవచ్చు, బహుశా వాటిని మార్చడానికి ప్రయత్నమూ చేయవచ్చు; కాని కొంత సమయం తర్వాత, నీకు వివేకం అధికమైనప్పుడు, నీకు ఆ సంఘటనకు మధ్య కొంతదూరం ఏర్పడినప్పుడు, ఆవశ్యకమైన నీ పురోభివృద్ధికి అదే అవసరమైనదనే విషయం అప్పుడు నీకు స్పష్టమౌతుంది. నీకు తెలుసా, అది ఆయన ఇచ్ఛ, ఆ పరమేశ్వరుని దయ. నీవు దానికి ఒప్పుకోకుండా ఫిర్యాదు చేస్తూ, నీ అసమ్మతిని తెలియజేస్తున్నప్పటికీ, అదే నీ చుట్టూ అన్నింటినీ ఏర్పాటు చేస్తుంది. సరిగ్గా అటువంటి క్షణాలలోనే అది చాలా సమర్థవంతంగా పనిచేస్తుంది.

నేను చిన్నవాక్యం ఒకదానిని వ్రాశాను... బులెటిన్‌లో... అది ఈ విధంగా ఉంటుంది (ఆ పదాలు నాకు కచ్చింతా గుర్తులేవు*). అస్తిత్వంలో ఏదో ఒకటి అంటుంది. “నాకు నీవు మాత్రమే కావాలి”... అది కేవలం ఆకాంక్ష... దాని తర్వాత

---

*“నీవు హృదయపూర్వకంగా దైవానికి ‘నాకు కేవలం నీవు మాత్రమే కావాలి’ అని చెప్తే, దైవం పరిస్థితులను ఏ విధంగా ఏర్పాటు చేస్తాడంటే దానితో నీవు బలవంతంగా చిత్తశుద్ధితో ఉండవలసి వస్తుంది.”

ఆ వ్యక్తి ఒక వంద చిత్రవిచిత్ర విషయాలను కోరుకుంటాడు, అవునంటావా, కాదా? ఒక్కొక్కప్పుడు ఏదో ఒకటి వస్తుంది, చెప్పాలంటే, సాధారణంగా అది ప్రతిదానిని కలవరపరచి చిందరవందర చేసేదిగా ఉంటుంది — అది నీ దారికి అడ్డంగా నిలిచి నీ ఆకాంక్షను సాక్షాత్కరించనీయకుండా చేస్తుంది. దైవం తాను కనపడకుండా వస్తాడు. ఆయన వచ్చేది నీవు చూడలేవు. నీకు చిన్న అనుమానం కూడా కలగకుండా వస్తాడు. ఆయన పరిస్థితుల నన్నింటినీ ఏ విధంగా ఏర్పాటు చేస్తాడంటే, కేవలం దైవానికి సంబంధించినవాటిని మాత్రమే అడ్డుకునే ప్రతిదానినీ నీ దారిలో నుంచి తొలగించివేస్తాడు, అదీ అనివార్యంగా. అన్నింటినీ తొలగించివేసినప్పుడు, నీవు బాధతో అరుస్తావు, ఫిర్యాదు చేస్తావు; కాని అటు పిమ్మట నీవు చిత్తశుద్ధి కలిగి, నీ వైపుకు తిరిగి నీవు నీ కళ్ళలోకి సూటిగా చూసి... నీవు ప్రభువుకు చెప్తావు, "నాకు కేవలం నీవు మాత్రమే కావాలి" అని.ఆయన నీకు సమీపంగా ఉండిపోతాడు. ఇతరములైనవన్నీ తరలిపోతాయి. ఇది ఉన్నతోన్నతమైన దైవానుగ్రహం. ఆ మాటను నీవు తప్పక ధృఢవిశ్వాసంతో చెప్పాలి. నీవు దానిని తప్పకుండా సర్వాత్మనా చెప్పాలని నేననడం లేదు, కారణం, ఒక వ్యక్తి గనక దానిని సర్వాత్మనా చెప్పడం తటస్థిస్తే, కార్యం సఫలం చేయబడుతుంది. అత్యావశ్యకమైనదేమంటే, అస్తిత్వంలోని ఒక భాగం, వాస్తవంలో అస్తిత్వ కేంద్రంలోని ఇచ్ఛ, ధృఢవిశ్వాసంతో పలుకుతుంది, "నాకు కేవలం నీవు మాత్రమే కావాలి". అది ఒక్క మారైనా చాలు: అదంతా కొంత కాలం పడుతుంది, ఒక్కొక్కప్పుడు సాగి అధికంగా కొన్ని సంవత్సరాలూ పడుతుంది, కాని అతడు గమ్యస్థానం చేరుతాడు.

ప్రశ్న: కాని అతడికి అన్ని విధాలైన అపరిపూర్ణతలూ ఉంటాయి!

స: ఆ! ఎంత ఎక్కువగా అపరిపూర్ణత లుంటాయో అంతగా ఎక్కువ సమయం తీసుకుంటుంది, ఎంతగా అతడి బంధనాలుంటాయో అంతగా ఎక్కువ సమయం తీసుకుంటుంది.

కాని గమ్యం చేరడం తథ్యం.

CWM 6:175-76

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

నిరాశావాదం — సైతాను యొక్క గొప్ప ఆయుధం

నిరాశావాదమంతా... ఆత్మశక్తి యొక్క పూర్ణత్వాన్ని, శక్తిని తిరస్కరించం. అంతేకాక ఈ ప్రపంచంలో దైవంయొక్క మార్గదర్శకత్వంపై అసహనం, ఈప్రపంచాన్ని సృష్టించి, సదా నడిపించే ఆ దివ్యజ్ఞాన సంకల్పాలపై పరిపూర్ణ విశ్వాసం లోపించడం.

అది సర్వోత్కృష్ట జ్ఞానం మరియు శక్తిపై అయుక్తమైన అభిప్రాయాన్ని కలిగి వుంటుంది. అందుచేత నిరాశావాదం ఏ ఆత్మశక్తిని ఈ ప్రపంచం తన మార్గదర్శిగా భావిస్తోందో, ఏది సమస్త జీవనాన్ని దివ్యమయం చేసి, దైవం వైపు ఉద్ధరిస్తోందో, ఆ ఆత్మశక్తి యొక్క ఉన్నత జ్ఞానం, శక్తి కాజాలదు.

*

హిందూ మతదర్మంలో మనసు — జీవితాన్ని ఓ దివ్యలీలగా అంగీకరించి మన ప్రస్తుత పరిస్థితుల వెనక ప్రతి ఒక్క మానవునికి ఉన్న శాశ్వత దైవసాన్నిధ్యాన్ని చూడగలదు.

ఓ తేజోమయ కిరణంగా ఆ దైవంలోకి ఆరోహణ చేసి జీవన సాఫల్యాన్ని పొందే మార్గం మానవుని చేతుల్లో ఉందన్నదే ఎల్లప్పుడూ విశ్వసించబడింది.

CWSA 25:179;20:131

శ్రీఅరవిందులు

*

నిరాశావాదం సైతాను యొక్క ఆయుధం. అతడు తన సందర్భాన్ని బాగా గ్రహిస్తాడు (వణుకుతున్న సంజ్ఞ). సరే, నేను సాధ్యమని అనుకున్నది సంభవమై, అనుకున్నది జరిగితే అది నిజంగా దుష్టశక్తులపై నిశ్చయాత్మక విజయమే. సహజంగా నిరాశా సైతాను ఎంత గొప్పగా తనను తాను సమర్థించుకున్నా అది ఎన్నటికీ సైతానే. నువ్వు ఆ నిరాశావాదం యొక్క చివరి కొన చూసినా, అది సైతానే. అదే అతడి గొప్ప ఆయుధం.

CWM 11:176-77

శ్రీమాత

శాంతి ద్వారా స్వేచ్ఛ — అభివృద్ధి ద్వారా స్వేచ్ఛ

ఈ భూమిపై మానవులకు స్వేచ్ఛను ప్రసాదించగల దివ్యకృప యొక్క కార్యాచరణకు పరస్పర సామరస్యతగల రెండు అంశాలున్నాయి.

ఈ రెండు అంశాలు సమానంగా ఉండి తీరవలసినవే, కాని సమానంగా శ్లాఘించ బడవు.

ఆరాటం, ఒత్తిడి, బాధల నుంచి విముక్తి కలిగించే
సర్వసమగ్రమైన చెదరని శాంతి.
దాస్యం, పరతంత్రం, తమస్సు నుంచి స్వేచ్ఛనిచ్చే
క్రియాశీలమైన, అత్యంత శక్తివంతమైన అభివృద్ధి.

శాంతి విశ్వమంతట శ్లాఘించబడి, దివ్యమైనదిగా గుర్తించబడింది., కాని, అభివృద్ధి మాత్రం గాఢమైన సాహసంతో కూడిన ఆకాంక్షాపరులచేత మాత్రమే స్వాగతిం చబడింది.

CWM 15:185

శ్రీమాత

నిజమైన అభివృద్ధే సాధన

నిజమైన అభివృద్ధే సాధన, అంటే అది అత్యంత చైతన్యవంతమైన, శీఘ్రతర అభివృద్ధి. లేకపోతే సామాన్యంగా ఎవరి అభివృద్ధి అయినా ప్రకృతి యొక్క లయకు అనుగుణంగా సాగుతుంది. దాని అర్థం అది చిన్న అభివృద్ధి సాధించడానికి కూడా శతాబ్దాలు, యుగాలు తీసుకుంటుంది. కాని నిజమైన అభివృద్ధి సాధన వలన మాత్రమే సాధ్యమౌతుంది. సామాన్యంగా మానవులకు అనంతకాలం పట్టేది, యోగం ద్వారా అతి తక్కువ కాలంలో సాధించగలం. కాని ఎప్పుడూ అది ఈ పృథ్వి మీద, ఈ శరీరంలో మాత్రమే సాధ్యపడుతుంది, మరో చోట కాదు. అందుకనే మనం శరీరంలో ఉండగానే, దీన్ని పూర్తిగా ఉపయోగించుకుని అత్యంత ఉపయుక్తమైన సాధనంగా మలచుకోవాలి. ఏమాత్రం కాలం వృథా చేయకూడదు. 'కాస్తంత తరువాత' 'కాస్తంత తరువాత' అని వాయిదా వేయకుండా ఉండాలి. సత్వరం ఆచరించడం

మంచిది. నువ్వు ఏ అభివృద్ధి సాధించకుండా గడిపిన కాలమంతా వ్యర్థమైనదే. ఆ తరువాత అందుకు తప్పక చింతిస్తావు.

CWM 7:33

శ్రీమాత

అభివృద్ధికి మూడు మార్గాలు

సదా అభివృద్ధిని కోరేవాళ్ళకి, అభివృద్ధి సాధనాలుగా, మూడు ప్రధానమైన మార్గాలున్నాయి:

1) వ్యక్తి చైతన్య క్షేత్ర విస్తరణ
2) తెలిసిన విషయాన్ని సంపూర్ణంగా, మరింత మెరుగ్గా ఎల్లప్పుడు అర్థం చేసుకోవడం.
3) దైవాన్ని తెలుసుకొని మరింత ఎక్కువగా ఆతడి సంకల్పానికి వశమైపోవడం.

మరో మాటల్లో దాని అర్థం:

1) ఈ సాధనం యొక్క సంభావ్యతలను నిరంతరం సమృద్ధి చేసుకోవడం.
2) ఈ సాధనం పనిచేసే విధానాన్ని అవిశ్రాంతంగా సమగ్రపరచడం.
3) ఈ సాధనం దైవానికి సదా విధేయతతో ఆతని ఆదేశాలను అధికంగా గ్రహించగలగడం

అర్థం చేసుకొని మరిన్ని కార్యాలను నెరవేర్చడం, నేర్చుకోవడం, మరిన్ని విషయాలను నేర్చుకుని వాటిని అర్థం చేసుకోవడం మన అస్తిత్వంలో దైవానికి సంపూర్ణ సమర్పణ గావించడానికి ఆటంకంగా ఉన్న అన్నింటిని శుద్ధపరచడం. దివ్యప్రభావాన్ని శీఘ్రంగా గ్రహించే విధంగా మన చైతన్యాన్ని తయారుచేసుకోడం.

ఇలా చెప్పవచ్చు: మరింతగా మనలను మనం విస్తృతపరచుకోవడం, మరింతగా మనలను మనం లోతుగా గంభీరంగా మలచుకోవడం, మరింత ఎక్కువగా మనను మనం సంపూర్ణంగా సమర్పించుకోవడం.

CWM 16:435-436

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

కోరిక యొక్క లక్ష్యాన్ని ఆకాంక్షగా మార్చు

మనిషికి కోరిక అనేది వుండకూడదని చెప్పే బోధనలున్నాయి. మనిషి ఆత్మ యొక్క నిశ్చలస్థితిలోకి, కర్మరాహిత్యస్థితిలోకి, చలనరహితస్థితిలోకి, అతీంద్రియస్థితిలోకి, బాహ్యంలో కనిపించేదంతా అసత్యమని భావించే స్థితిలోకి చేరాలంటే, జీవితంనుండి పూర్తిగా తిరోగమించుట అవసరమని వాటి ఉద్దేశం. ఆ స్థితిని అందుకోవాలంటే మనిషికి కోరిక అనేది యేమాత్రం కూడ వుండకూడదు. అనగా, పురోగమించాలనే ఇచ్ఛను మనిషి పూర్తిగా విసర్జించాలి. అప్పుడు పురోగతి అనే విషయమే అవాస్తవమౌ తుంది, అప్రధానమౌతుంది. కాని, యోగంపై నీకున్న భావనలో అభివృద్ధి చెందాలనే కోరిక వున్నట్లయితే, లోకమంతా ఒక పురోగమన బాటను అనుసరిస్తుందనే నమ్మిక నీకుంటే, నీవు చేయవలసిందల్లా, నీ కోరిక యొక్క లక్ష్యాన్ని మళ్ళించడం. దానిని బాహ్యమైన, అసహజమైన, స్వార్థపరమైన దృశ్యమాన విషయాల వైపు మళ్ళించుటకు బదులు పరమసత్య లక్ష్య దిశగా కదలుతున్న ఆకాంక్షను ఫలప్రదం చేసే శక్తికి అనుసంధించాలి.

పరమ సత్యాన్ని అందుకొనుటకు, ఆ పరమసత్య అనుభూతిని పొందగలిగే శక్తిని పొందుటకు, నీవు ఆధ్యాత్మిక చైతన్యాన్ని, ప్రగతిశీల మానసిక చైతన్యానికి అనుసంధించాలని శ్రీఅరవిందులు తెలిపారు.

CWM 3:194

శ్రీమాత

విశ్వాసంతో ఆకాంక్షించు

మనిషి దేనినైనా యెప్పుడు ఆకాంక్షిస్తాడో, ఆ ఆకాంక్షను దైవం వింటాడని ఆశించినంత మేరకు సమాధానమందుతుందనే నమ్మకంతో వున్నట్లయితే, అది ఆ జీవిలో మనశ్శాంతిని కలుగుజేస్తుంది. ఆ జీవి స్పందనలో ఒక ప్రసన్నతా భావం చోటు చేసుకుంటుంది. ఒక వేళ ఆ నమ్మికకు బదులు ఒక అనుమానం, ఒక సంధిగ్ధత తలెత్తితే, గమ్యం చేరే మార్గం అగోచరమైతే లేక అసలు గమ్యాన్ని యెప్పటికైనా చేరగలనా అనే సందేహం యేర్పడితే, అసలు గమ్యం చేరడానికి యేదైనా మార్గం వుందా లేదా అనేటటువంటి అనేక అనుమానాలు పీడిస్తుంటే, అప్పుడు మనిషి అలజడికి లోనౌతాడు, ఒక సుడిగాలిలో చిక్కుకుంటాడు. తత్ఫలితంగా అతడు పొందవలసింది అతనికి దక్కకుండా పోతుంది. దీనంతటికీ బదులు మనిషికి నిశ్చలమైన విశ్వాసం వున్నట్లయితే, చిత్తశుద్ధితో కూడిన ఆకాంక్షకు సమాధానం అందకుండా వుండదనే దృఢనమ్మకం అతను కలిగి వుంటే, అతను ప్రశాంతంగా వున్నాడని అనవచ్చు. అతను సాధ్యమైనంత తీవ్రతతో ఆకాంక్షిస్తాడు. అయినా, తాను కోరినది సత్వరమే అందలేదని చికాకుపడి కలత చెందడు. ఎలా వేచి వుండాలో అతనికి తెలుసు. నేను ఎక్కడో చెప్పాను, వేచి వుండడం యెలాగో తెలిసి వున్నట్లయితే కాలాన్ని స్వాధీనంలో వుంచుకున్నట్లు అని. అది అక్షరాలా సత్యం. ఎందుకంటే, మనిషి ఆవేశానికి లోనైతే అతను తన కాలాన్ని మొత్తం కోల్పోయినట్లన్న మాట. ఆ కాలంతో పాటు తన శక్తిని కూడ కోల్పోవుటయే గాక తన లక్ష్యసాధనను కూడ మరుస్తాడు. నెమ్మదిగా, నిశ్చలంగా, ప్రశాంతంగా, సత్యమే నెగ్గుతుందనే ధృఢమైన నమ్మకంతో నుండి ఆ నమ్మకాన్ని సఫలీకృతం గావించగలిగితే, ఆ పని యెంతో వేగంగా నెరవేరుతుంది. అప్పుడు ఆ ప్రశాంతతలో సర్వం సుసంపన్నమౌతుంది.

CWM 5:395-96

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలసపతి, జానకి

మహాకాళి అంశ

దివ్యమాతకు నాలుగు అంశలు ఉన్నాయి. అవి ఆమె నాలుగు ప్రముఖ శక్తులు, ప్రముఖ దివ్యవ్యక్తిత్వాలు. విశ్వాన్ని నడపడంలోను, భువన లీలకు సంబంధించిన ఆమె వ్యవహారంలోను ఆమెకు సహకరిస్తాయి. ఆ నాలుగు వ్యక్తిత్వాలను, నాలుగు దివ్యనామాలతో పిలుస్తుంటాము. అవి మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి.

వారిలో మహాకాళి స్వభావం వేరు. ఆమె విశిష్ట శక్తి విశాలత కాదు, మహోజ్వల ఔన్నత్యం. వివేకం కాదు, అపరిమిత శక్తి, బలాలు. ఇది ఆమె విచిత్ర శక్తి. ఆమెలో ముంచెత్తే పరమ తీవ్రత ఉంటుంది. విశ్వవిజయాలను సాధించివేయాలనే మహనీయ శక్త్యావేశ ప్రవాహం ఆమె. ప్రతి పరిమితినీ, అవరోధాన్ని, విచ్ఛిన్నం చేయడానికి ముందుకు పరవళ్ళు తొక్కే దివ్య మహోధృత విజృంభణ. ఆమె అపరిమేయ దివ్యత్వం అంతా ఒక ప్రచండోజ్వల క్రియా మహత్వ రూపంలో వెలికి దూకుతుంది. ఆమె మహావేగం వెంటనే కార్యాన్ని సాధించే తత్వం, శీఘ్ర ప్రత్యక్ష ప్రక్రియ, సమస్తాన్ని మోసుకుని వెళ్లే ఆకస్మిక ఆఘాతం. ఆమె వదనం రాక్షసులకు మహా భయానకం. దైవ విద్వేషుల పట్ల ఆమె ప్రవృత్తి అత్యంత విపత్కారం, కర్కశం. ప్రపంచాలను తన అధీనంలో పెట్టుకున్న వీరవిజేత. యుద్ధం నుండి ఆమె ఏనాడూ వెనుతిరగదు. ఆమె అపరిపూర్ణతను భరించలేదు. మార్పును అభిలషించని మానవుడి పట్ల దురుసుగా వ్యవహరిస్తుంది. అజ్ఞానమూ, అప్రకాశమూ పట్ల ఆమె కఠోరంగా వర్తిస్తుంది. విద్రోహం, అసత్యం, దుష్టత్వం పట్ల ఆమె క్రోధాగ్ని జ్వాల. ద్వేషాన్ని అణచివేసే ఖడ్గప్రహారం. దివ్య సాధనామార్గంలో అలక్ష్యాన్ని, అలసత్వాన్ని, ఉపేక్షను ఆమె సహించలేదు. అకాల సుషుప్తిలో పడినవాడిని, తిరుగుబోతును అవసరమైతే బాధాగ్ని తప్తం చేసి నిద్ర మేలుకొల్పుతుంది. మహావేగవంతము, సరళము, నిష్కపట మైన స్పందనలు, నిరపేక్షము, నిర్మలము (ఏమీ దాచిపెట్టని స్వభావము) అయిన ఆమె కదలికలు, ప్రజ్వరిల్లుతూ పైకి ఎగసే దివ్య ఆకాంక్ష — ఇవన్నీ మహాకాళి అద్భుత లక్షణాలు.

ఆమె ఎవరికీ లొంగని ఆత్మ. నీలాకాశంలో విహరించే విహంగంలా ఆమె దర్శనం, సంకల్పం అత్యున్నతం. అధిరోహణా పథంలో ఆమె అడుగులు అతివేగంగా

కదులుతాయి. సంహారం, సమాదరణ కోసం ఆమె హస్తాలు నిత్యం సన్నద్ధంగా వుంటాయి.

ఆమె కూడా అందరికీ తల్లియే. ఆమె కోపం వలె ఆమె ప్రేమ కూడా తీవ్రమైనది. ఆమెది ప్రగాఢమైన దయార్ద్ర దృష్టి. స్వీయబలంతో ఆమెను కల్పించుకోననిచ్చి నప్పుడు, సాధనలో అడ్డువచ్చే అవరోధాలు, లేక దాడిచేసే శత్రుమూకలు చెల్లాచెదరై పోతాయి. ఆమె కోపం విరోధులకు భయావహం, ఆమె ప్రచండమైన ఒత్తిడి దుర్బలు లకు, పిరికివారికి బాధాకరం. ఆమె ఉత్తేజం గొప్పవారికి, బలవంతులకు, ఉదాత్తులకు ఆరాధ్యనీయం. ఆమె ప్రేమ కోసం వారు తహతహ లాడతారు. ఏలన, వారి అను భవం ఇది — వారి ప్రకృతిలో ఏది ప్రతిఘటిస్తుందో, ఆమె దెబ్బలు దాన్ని బలంలోకి, పరిపూర్ణ సత్యంలోకి మారుస్తాయి. ఏది కుటిలమో, విపరీతమో దానిని సక్రమంగా తీర్చిదిద్దుతాయి. ఏది మలినమో, అపరిపూర్ణమో దానిని బయిటకు గెంటివేస్తాయి. ఆమె లేకపోతే, ఒక రోజులో సాధించేది శతాబ్దాల సమయం పడుతుంది. ఆమె లేనప్పుడు ఆనందం సువిశాలంగా, గంభీరంగా, మధురంగా, అందంగా ఉండ వచ్చును, కాని అది అప్పుడు అత్యంత సంపూర్ణ తీవ్రతతో ప్రజ్వరిల్లే ఆనందాన్ని కోల్పోతుంది. ఆమె జ్ఞానానికి విజయమహత్వం ఇస్తుంది. అలాగే అనుపమ సౌందర్య సామరస్యాలకు ఒక మహోన్నత అధిరోహణా చలనాన్ని ఇస్తుంది. అట్లే పరిపూర్ణత కోసం కొనసాగే మంద, కఠిన శ్రమశక్తికి పెడమార్గాన్ని తగ్గించే శక్తియుక్తుల్ని ప్రసాది స్తుంది. పరమాద్భుత ఆనందపారవశ్యాలను, అత్యున్నత శిఖరాలను, సముదాత్త లక్ష్యాలను, సువిశాల తీరాలను చేరలేనిదేదీ ఆమెకు సంతృప్తి నివ్వదు. కాబట్టి ఆమెలోనే భగవంతుని విజయ సాధనశక్తి ఉంది. కావున మనం తలపెట్టిన మహా యజ్ఞాన్ని ఎప్పుడో కాకుండా ఇప్పుడే సాధించాలంటే ఆమె జ్యోతిస్సు, ఆకాంక్ష, వేగాల అనుగ్రహం వల్లనే సాధ్యమవుతుంది.

CWSA 32:17-20)

శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

ఒక ప్రాచీన పౌరాణిక గాథ

చాలా కాలానికి పూర్వం, ప్రస్తుతం అరేబియాగా పిలవబడుతున్న యెడారి ప్రాంతంలో, దివ్యప్రేమ తత్వాన్ని మేల్కొల్పుటకుగాను ఒక దివ్యజీవి సాక్షాత్కరించింది. అనుకున్నట్లుగానే, ఆ జీవి మనుషులచే పీడించబడింది, అపార్థం చేసుకోబడింది, అనుమానించబడింది, తరుమబడింది, శత్రువులచే ప్రాణాంతకంగా గాయపరచబడింది. తన కార్యసాఫల్యత కోసం యేకాంతంలో ప్రశాంతంగా మరణించాలనుకుంది, కాని శత్రువులచే తరుమబడి పారిపోతూ ఆ విశాలమైన యెడారిలో హఠాత్తుగ ఒక చోట ఒక చిన్న దానిమ్మ మొక్కను చూసింది. ప్రశాంతంగ దేహత్యాగం చెయ్యాలని ఆ మొక్క కొమ్మల క్రింద దూరింది. ఆశ్చర్యం! వెంటనే ఆ మొక్క కొమ్మలు విస్తరించాయి. మొక్క పెద్దదిగా యెదిగింది. ఎంత నిండుగా దట్టంగా పెరిగిందంటే ఆ జీవిని తరుముతున్నవారు దాని ప్రక్కగా వెళ్లినా తాము వెంటాడుతున్న జీవి అక్కడే దాగివున్నదని గమనించ లేకపోయారు.

ఆ జీవి గాయాల నుండి రక్తం బొట్లు బొట్లుగా జారి నేలను తడుపుతున్న కొద్దీ ఆ మొక్కకు అద్భుతమైన పూలు పూచి దానిని పూర్తిగ నింపివేశాయి — రంగు రంగుల పూలు, ఎర్రనివి, పెద్దవి, వొత్తైన రెక్కలతో నిండినవి, లెక్కలేని రక్తపుబొట్లకు దీటుగా,

దివ్యప్రేమను తమలో నింపుకొని మన కోసం అభివ్యక్తం చేసేవి యీ పుష్పాలే.

*

ప్రశ్న: మధురమాతా మీరు వ్రాసిన ఆ పురాణగాథకు, కాళీపూజకు యేమైన సంబంధం వున్నదా?

సమా: ఉన్నది. ఎందుకంటే యెల్లప్పుడు కాళీపూజ రోజున నేను 'దివ్యప్రేమ' పుష్పాలను పంచుతాను. కారణం, మహాశక్తి యొక్క అన్ని అంశలలోకి మహాకాళి మహనీయ ప్రేమమూర్తి. ఆమె ప్రేమ అత్యంత క్రియాశీలమైనది, అనంత శక్తివంతమైనది.

CWM 7:373, 365

శ్రీమాత

దుర్గ

సృష్టికి రెండు భాగాలున్నాయి — సాకారము, నిరాకారము. దేవుళ్లు కూడ నిరాకారులే అయినప్పటికీ వారికీ రూపాలున్నాయి. కాని ఒక మహోన్నతుడైన దైవం అనేక రూపాలను ధరించవచ్చు — ఇచ్చట మహేశ్వరిగా, అచ్చట పల్లాస్ అతేన్‌గా. స్వతహాగా మహేశ్వరి తన స్వల్పతరమైన అవతారాలలో అనేక రూపాలలో గోచరి స్తుంది, దుర్గ, ఉమ, పార్వతి, చండీ మొదలైన రూపాలలో.

*

దుర్గలో మహేశ్వరి, మహాకాళి లక్షణాలు కొంతమేరకు మిళితమై వున్నాయి.

*

దుర్గ దివ్యజనని యొక్క రక్షాశక్తి

CWSA 32:67-70

శ్రీఅరవిందులు

*

మీకు దుర్గాదేవి కథ తెలుసు కదూ? ప్రతి సంవత్సరం అసురుణ్ణి దునుమాడే దుర్గాదేవి, ఈ కార్యాన్ని సర్వదా ఆమె ప్రారంభిస్తుండాలి. అందుకామె బద్ధురాలు. రాక్షసజాతి ఆధిపత్యం అంతమొందే వరకు ఈ విధంగా జరుగుతూనే వుంటుంది. వారు ఈ లోకం నుండి సమూలంగా నిర్మూలించబడిన పిమ్మట ఆ విధంగా జరగదు. కాని అంతవరకు, వారి వుపయోగం వున్నంతవరకు ... ఆకాంక్షను తీవ్రతరం చేయడానికి, చైతన్యాన్ని పారదర్శకం చేయడానికి, మనుషుల చిత్తశుద్ధిని పరీక్షించ డానికి వారు కొనసాగుతారు. ఏ రోజున ఈ పరీక్ష అవసరం తీరిపోతుందో, ఏ రోజున చిత్తశుద్ధి స్వచ్ఛమై స్వయంస్థితమౌతుందో, ఆనాడు వారు అదృశ్యులౌతారు. ఆనాటి నుండీ దుర్గాదేవికి యేటేటా తన యుద్ధం పునః ప్రారంభించే అవసరం తీరి పోతుంది.

CWM 5:96-97

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

అత్యున్నత వైఖరి

ఈ ఉదయం ప్రారంభమవుతున్న నెలను పరికిస్తూ, ఇంతకంటే బాగా మీకు ఎలా సేవ చేయగలనా అని ఆలోచిస్తుండగా నాలో నించి ఆ నిశ్శబ్దంలో సణుగుతున్నట్లు ఒక సన్నని గొంతు వినిపించింది. అది: "బాహ్యపరిస్థితుల ప్రాముఖ్యం ఎంత స్వల్పమో తెలుసు కదా! నీవు సత్యం అని భావిస్తున్నదాన్నే, సాధించుకోవాలని కష్టపడు తున్నావెందుకు? ఇంకా నమ్రమముగా, నమ్మకంతో ఉండు. నీవు చేయ వలసిందల్లా దేనితోనూ ఇబ్బంది పడకుండా ఉండటమే. సరైన పని చేయాలని నిన్ను నీవు హింసపెట్టుకుంటే అది దుస్సంకల్పం కంటే ఎక్కువ హాని చేస్తుంది. గంభీర జలాశయములాగా నిశ్చలంగా ఉన్నప్పుడే నిజమైన సేవకు అవకాశం లభి స్తుంది" అన్నది.

ఈ సమాధానం ఎంతో దీప్తివంతంగా స్వచ్ఛంగా ఉంది. ఒక గొప్ప వాస్తవంగా కొట్టొచ్చినట్లు కనబడుతూ ఏ రకమైన సందేహం రాకుండా ఆ స్థితిని నాకు తెలియ జేసింది. దానితో గంభీర జలాశయంలో నిశ్చలంగా తేలిపోతున్నట్లు నా కనిపించింది; నాకు బాగా అర్థమైంది; సరైన వైఖరి ఏమిటో స్పష్టంగా గ్రహించగలిగాను. ఇక ఇప్పుడు నిన్నే అడగాలి ప్రభూ, నీవే పరమ గురువువి, ఆచార్యుడవు, నేను సదా ఈ స్థితిలోనే ఉండేటట్లుగా కావలసిన స్థైర్యము, స్నిగ్ధదృష్టిని అనుగ్రహించు ప్రభూ!

"నిన్ను నీవు హింసించుకోవద్దు బిడ్డా. నిశ్శబ్దత, శాంతి, శాంతి"

CWM 1:26

శ్రీమాత

"నేను నీకే చెందాలని అనుకుంటున్నాను"

చైత్యపురుషుడు నీ చైతన్యపు అంతరాంతరాల్లో ఉన్నాడు, అదే నీలో ఉన్న భగవంతుని ఆలయము. ఈ కేంద్రస్థానం చుట్టూనే నీలో ఉండే భిన్న భిన్న భాగాలు, పరస్పరం వ్యతిరేకంగా ఉండే వివిధ ప్రవృత్తులూ ఏకీకృతం కావాలి. నీలోని చైత్యపురుషుని ఆకాంక్షను, వాని చైతన్యాన్ని నీవు పొందగలిగినప్పుడు నీ సంశయాలు, ఇబ్బందులూ పటాపంచలు కావచ్చు. దానికి కొంత సమయం పట్టినప్పటికీ చివరకు తప్పక కృతకృత్యుడవు కాగలవు. ఎప్పుడైతే నీవు భగవంతునితో "నీకే చెందాలనుకుంటు న్నాను" అన్నప్పుడు ఆ దైవం 'సరే' నంటాడో ఇక ప్రపంచమంతా ఏకమైనా నిన్ను అతని నుండి వేరుచేయలేదు. కేంద్రస్థ సత్త శరణాగతి పొందినప్పుడే దుష్కర సాధ్యమైన ఇబ్బంది తొలిగిపోతుంది. బాహ్యసత్త ఒక దళసరి పెచ్చులాగా ఉంటుంది. సాధారణ మానవులకు అది ఒక పెంకులాగా తయారై యుండటం వల్ల లోన ఉండే భగవంతుని ఎరుక వారి కుండదు. ఎప్పుడైనా, ఒక్క క్షణమాత్రమైనా అంతర్గత పురుషుడు "నేనిక్కడే ఉన్నాను, నేను నీ వాడిని" అన్నప్పుడు ఒక వారధి ఏర్పడినట్లవు తుంది. అప్పుడిక క్రమక్రమంగా పైనున్న పెచ్చు దళసరి తగ్గి బాహ్య, అంతర్గత సత్తలు కలిసి ఒక్కరుగా అయిపోతారు.

CWM 3:7

శ్రీమాత

భౌతిక దేహానికీ, జీవితానికీ మూలకారణము

సత్తను (వ్యక్తి) దివ్యకేంద్రం చుట్టూ వ్యవస్థీకరించడం, సమన్వయీకరించడం అనే కార్యక్రమం ఈ భూమిపైనే, ఈ దేహంతో మాత్రమే సాధ్యమవుతుంది. భౌతిక జీవనానికి అదే ముఖ్యమైన మూలకారణము. భౌతిక దేహంలో నీవు లేని క్షణం నుంచీ ఏమీ చేయలేవు.

అన్నిటినీ మించి గమనించ వలసిందేమిటంటే మానవులు మాత్రమే దానిని చేయగలరు, ఎందుకనగా మానవులకు మాత్రమే కేంద్రస్థానంలో దైవం ప్రత్యక్షంగా చైత్యపురుషునిలో కొలువై యుంటాడు.

అయినప్పటికీ భౌతిక దేహం ఎందుకు ధరిస్తున్నారో తెలియకుండానే మానవులు పుడుతారు. ఏదీ తెలియకుండానే జీవితం గడిపేస్తారు, తెలియకుండానే దేహాల నుంచి నిష్క్రమిస్తారు. మళ్ళీ ఇదంతా తిరిగి ప్రారంభిస్తారు. ఇది పునః పునః ఎడ తెగకుండా కొనసాగుతుంది. చివరకు ఒక రోజున ఎవరో వచ్చి, "జాగ్రత్త నాయనా, దీని కంతటికీ ఒక కారణముంది. ఈ పని కోసమే నీ విక్కడున్నావు, ఈ అవకాశం జారవిడుచుకోకు" అని చెపుతారు.

నీ వెన్ని సంవత్సరాలు వృథా చేసుకున్నావో!

CWM 8:175

శ్రీమాత

భగవంతుడు కానిదంటూ ఏమీ లేదు

'భగవంతుడు సృష్టికర్త' అనే క్రైస్తవభావన ప్రజల్లో బాగా గాఢంగా నాటుకొని పోయింది. సృష్టి ఒక వైపు, భగవంతుడు మరొక వైపు అనే ఆలోచన నీకు వచ్చినప్పుడు నీవు దాన్ని తిరస్కరిస్తావు. కానీ అది నీ భావాల్లోకి, ఆలోచనల్లోకీ చాలా స్వతఃసిద్ధంగా, సహజాతంగా, దానంతటదే నీకు తెలియకుండా నీలోకి చొచ్చుకుని పోయింది. అన్నిటికన్నా మంచిదీ, అన్నిటినీ మించిన సుందరమైనదీ, ఇంకా అన్నిటినీ మించి నీవు సిద్ధింప చేసుకోవాలనుకున్నదీ, నీవు భగవంతునికి ఆపాదిస్తావు. ప్రతివారూ వారి వారి చైతన్యస్థితి ననుసరించి భగవంతునికి అర్థాలు చెప్పుకుంటారు. అయితే ఎప్పుడూ కూడా అది వారి దృష్టిలో అత్యుత్తమమైనదే అయి ఉంటుంది. అందువల్లనే నీ కిష్టం లేనిదీ, నీవు ఒప్పుకోనిదీ, నీ దృష్టిలో శ్రేష్టమైనది కాదు అనుకున్నది కూడా భగవంతుడనే భావన వస్తే మాత్రం సహజంగా, స్వతఃసిద్ధంగా, వ్యక్తావ్యక్తంగా నిశ్చేష్టుడవైపోతావు.

నేను కావాలనే ఇదొక ఆకతాయి ధోరణిలో చెప్పాను, నీవు సరిగా అర్థం చేసుకుంటావని. కానీ అది నిజంగా అంతే, నాకు బాగా తెలుసు; ఎందుకంటే నన్ను నేను చాలా కాలం పరిశీలిచుకున్నాను. చిన్నతనంలో ఉపచేతనంలో ఏర్పడి నది, పరిసర ప్రభావం వల్లనూ, బోధనల వల్లనూ ఏర్పడి ఉంటుంది. సారూప్య చైత న్యాన్ని నీవు దేహంలోకి చొప్పించ గలగాలి, కేవల అభిన్నత్వం మాత్రమే — ఎందువల్లనంటే భిన్న మైనది ఏదీ లేదు కాబట్టి, ఉన్నదంతా ఒక్కటే పరమాత్మ, మనం ఏవగించుకునే వాటితో కూడా....

ఉన్నదంతా పరమాత్మే. ఆయన కానిది ఏమీ లేదు. మనం మననం చేసుకో వలిసింది అదే. ఉదయం నుంచీ సాయంత్రం దాకా, మళ్ళీ సాయంత్రం నించీ ఉదయం దాకా అదే కావాలి — ప్రతి నిమిషం మరచిపోతాము కదా!

CWM 10:102-03

శ్రీమాత

భగవంతుడు — విశ్వము

ఈ వివాదానికి ఒక్కటే పరిష్కార మార్గముంది. ఆవిర్భావంలో భగవంతునికీ, విశ్వానికీ మధ్య విబేధము చేయకపోవటమే. విశ్వమంటే అంతరిక్షంలోకి ప్రక్షేపితమైన భగవంతుడు, భగవంతుడంటే ఆవిర్భావములో నున్న విశ్వము. ఏ విధంగా చూసినా వస్తువు ఒక్కటే. దాన్ని విభజించలేరు. అది 'సృష్టికర్త' అతని 'సృష్టి' రెండూ వేర్వేరు అనేదానికి వ్యతిరేక భావన. ఎటొచ్చీ "ఈ విధంగా సృష్టికర్త, అతని పనీ అని చెప్పుకోవడం చాలా సదుపాయంగా ఉంటుంది. అది వివరించడం కానీ, బోధించడం కానీ సులువుగా నుంటుంది అయితే అది సత్యం మాత్రం కాదు. అప్పుడు నీవు: "భగవంతుడు అంత శక్తివంతుడైనప్పుడు ఈ ప్రపంచం ఇలా ఉండటానికి ఎందుకు ఒప్పుకున్నాడు?" అంటావు. కాని అది నీ భావన మాత్రమే. ఎందుకంటే నీవు నీకు నచ్చని పరిస్థితుల్లో ఉండవలసివస్తున్నది కాబట్టి దాన్ని భగవంతునికి ఆపాదించి ఆయనతో "ఇటువంటి ప్రపంచాన్ని ఏర్పరిచావేమిటి?" అంటావు. "నేను ఆ విధంగా చేయలేదే, అది నీవే చేసుకున్నావు. మళ్ళీ నీవు 'నేను' గా అయితే ఇప్పుడనుకుంటున్నట్లుగా అనుకోవు. నీవు నేనుగా ఉండటం లేదు కాబట్టే ఆ భావన నీకు వచ్చింది". భగవంతుడు నీకు సమాధానంగా చెప్పగలిగింది ఇదే. అసలు విషయం ఏమిటంటే నీ చైతన్యాన్ని దైవచైతన్యంతో ఏకం చేయటంలో నీవు కృతకృత్యుడవైతే సమస్యే ఉండదు. ప్రతిదీ చాలా సహజంగానూ, మంచిగానూ, సాదాసీదాగానూ అది ఎలా ఉండవచ్చో అలాగే ఉంటుంది.

CWM 5:311

శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి, వేంకటరామ శాస్త్రి

ప్రశ్నలు — సమాధానాలు

ప్రశ్న: మన యోగంలో ఏకాగ్రతకు, ధ్యానానికి మధ్య గల భేదమేమిటి?

సమా: ఏకాగ్రత అంటే మన యోగంలో చేతనను ఒకానొక స్థితి మీద (ఉదా; శాంతి) లేదా కదలిక (ఉదా: ఆకాంక్ష, సంకల్పం, దివ్యజననితో సంపర్కం లోనికి రావడం, దివ్యజనని నామాన్ని జపించడం) పై స్థిరంగా నిలిపి వుంచడం. వస్తువులను గురించి సరైన జ్ఞానం పొందడానికి ఆంతరిక మనస్సు వాటిపై దృష్టి పెట్టడాన్ని ధ్యానం అంటారు.

ప్రశ్న: "తమ ఆంతర అస్తిత్వంలో దివ్యజనని సదా చేతనను కేంద్రీకరించి వుంచుతారు" అని మీరు వ్రాసారు. "కేంద్రీకృత చేతన" అంటే యేమిటి?

సమా: ఉన్నతతర చేతన ఎప్పుడూ కేంద్రీకృతమైయ్యే ఉంటుంది. మామూలు మానవచేతనలా అది చెల్లాచెదురైపోక, ఈ మానసిక భావాల వెనుక లేదా ప్రాణిక కోర్కెల వెంట లేదా భౌతికావసరాల వెనుక పరుగులు పెట్టకుండా వుంటుంది. అంతేగాదు వందలకొలదిగా సాగిపోతుండే అస్తవ్యస్త ఆలోచనలు, అనుభూతులు, ప్రేరేపణలచే ఆక్రమించబడక, తనకు తాను సర్వాధికారియై, కేంద్రీకృతమై, సమ రసంతో వుంటుంది.

ప్రశ్న: ధ్యానం విజయవంతమైనదనడానికి గుర్తేమిటి?

సమా: ఒక లోతైనా లేదా ఉన్నతమైన చేతన లోనికి ప్రవేశించడం లేదా ఆ లోతైన ఉన్నతమైన చేతన నీ లోనికి దిగిరావడం జరిగితే అది యధార్థంగా విజయవంతమైన ధ్యానం అవుతుంది.

ప్రశ్న: ధ్యానం చేయకుండానే ఉన్నతానుభవాలు పొందడం అసాధ్యం అన్న మాట నిజమా?

సమా: కొంత ధ్యానంతో అది తేలికౌతుంది. కాని అసలెప్పుడూ ధ్యానంలో కూర్చొనని వాళ్ళు కూడా ఉన్నతానుభవాలను పొందుతారు. కాబట్టి 'అసాధ్యం' అనడంలో అర్థం లేదు.

ప్రశ్న: అనుభవం, సాక్షాత్కారం, సిద్ధి, వీటి మధ్యగల భేదమేమిటి?

సమా; యోగంలో సంభవించేవన్నీ కూడా అనుభవం క్రిందకు వస్తాయి. ఏవైనా కొంత కుదురుకొని వుండిపోతే అప్పుడు దానిని ఎంత మాత్రం అనుభవం అని

అనం. అది సిద్ధిలో భాగమౌతుంది. ఉదా: శాంతి గనుక వస్తూ పోతూ ఉంటే, అది అనుభవం. అతి వచ్చి నీలో స్థిరపడితే, వెళ్ళకుండా వుండిపోతే అప్పుడది సిద్ధి అవుతుంది. సాక్షాత్కారం వేరు. నీవు దేనికై ఆకాంక్షిస్తున్నావో అది నీకు నిజమైనపుడు, వాస్తవమైనపుడు అది సాక్షాత్కారం అవుతుంది. ఉదా: సమస్తంలోనూ దైవం ఉన్నాడనే భావన నీకుంది, కాని అది కేవలం ఒక భావన మాత్రమే, ఒక నమ్మకం మాత్రమే. అన్నింటి యందున్న దైవాన్ని నీవు అనుభూతి పొందితే, లేదా దర్శిస్తే అది సాక్షాత్కారం అవుతుంది.

ప్రశ్న: అంతర్దర్శనం, అనుభవం, సాక్షాత్కారం మధ్యగల భేదమేమిటి?
సమా: నీకు వెలుగు కన్పించిందనుకో, అది అంతర్దర్శనం, ఆ వెలుగు నీలో ప్రవేశించిన అనుభూతి కలిగితే అది అనుభవం. ఆ వెలుగు నీలో స్థిరంగా వుండి ప్రకాశాన్ని, జ్ఞానాన్ని అందిస్తే అతి సాక్షాత్కారం. కాని సాధారణంగా కలిగే అంతర్దర్శనాలను కూడా అనుభవాలుగా చెప్తారు.

Elements of Yoga, Chapter 9

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

'తరవాత' మార్గం

(మంచి మార్గంలోకి మళ్ళడానికి) 'తరవాత' 'రేపు చూద్దాం' అనుకుంటూపోతే అది "అసలు లేని కోటకు" దారి తీస్తుంది.

రోడ్డు కిరువైపులా రంగురంగుల పూలు కనువిందు చేస్తున్నాయి. గుబురుగా పెరిగిన చిన్న చిన్న చెట్లపై తళుకులీనుతూ ఎర్రని బెర్రీ పూలు, దూరాన కోత కొచ్చిన పైరు కంకుల పైన పడి మెరిసే బంగారు సూర్యకాంతులు కనువిందు చేస్తున్నాయి.

యువకుడైన ఒక బాటసారి స్వచ్ఛమైన ప్రాతఃకాల పిల్లవాయువులు పీలుస్తూ సంతోషంగా చకచకా నడుచుకొంటూ ఆ రోడ్డు వెంట పోతున్నాడు. భవిష్యత్తును గురించిన బెంగ లేకుండా సంతోషంగా, సాగిపోతున్నట్లు కన్పిస్తున్నాడు. అతను

నడుస్తున్న దారి ఒక కూడలి దగ్గరకు చేరుకొన్నది. అక్కడ అనేక మార్గాలు, అనేక దిశల్లోకి పోతున్నాయి.

ఆ యువకుడికి ప్రతి చోటా అటూ యిటూ జనం నడిచినట్లు అనేక అడుగుజాడలు కన్పించాయి. ఆకాశాన సూర్యుడు ప్రకాశిస్తున్నాడు, చెట్లమీద పక్షులు కిలకిల లాడుతున్నాయి. ఆ రోజు చాలా చక్కగా గడుస్తుందనిపిస్తోంది. మరో ఆలోచన లేకుండా ఆ బాటసారి తనకు దగ్గరగా ఉన్న దారిలో పోవ మొదలుపెట్టాడు. అది అనుచితమే అనిపిస్తుందెవరికైనా. మరో దారిలో వెళ్తే బాగుండేదేమో అని అతనికో క్షణం అనిపించింది. అతను నడుస్తున్న దారి యెక్కడికీ చేర్చలేదని అతని కనిపిస్తే వెనక్కు తిరిగిపోవడాని కతనికి చాలినంత సమయముంది. "వెనక్కు తిరుగు, వెనక్కు తిరుగు, నీవు సరైన దారిలో లేవు" అని అతని కెక్కడి నుండో వినిపిస్తున్నట్లని పించింది. కాని అతని చుట్టూ వున్నదంతా చాలా చూడ ముచ్చటగా వుంది, ఆనందం కలిగించేదిగా వుంది. ఏం చేయాలి? అతని కేం పాలుపోవడం లేదు. ఏ నిర్ణయమూ తీసుకొనకుండా అతను నడుస్తూనే వున్నాడు. అతనికా క్షణంలో లభిస్తున్న సంతోషాలను అనుభవిస్తూ పోతూనే వున్నాడు. అలా వినిపిస్తున్నదానికి "కొంచెం సేపట్లో, కొంచెం సేపట్లో నేను ఆలోచించి నిర్ణయిస్తాను, ఇంకా చాలా సమయముంది గదా" అని సమాధానం చెప్తున్నాడు. అతని చుట్టూ పిచ్చిగా పెరిగిన పచ్చగడ్డి అతని చెవిలో "తరవాత" అని గుసగుస లాడింది. తరవాత, అవును తరవాతే అనుకున్నాడు. సూర్యరశ్మితో నునువెచ్చగా తయారైన ఆ వాతావరణంలో గుబాళించే పిల్లవాయువులను పీల్చడంలో ఎంత హాయి వుంది! 'తరవాత' 'తరవాత' అనుకొంటూ ఆ బాటసారి సాగిపోతున్నాడు. దారి వెడల్పైంది. దూరం నుంచి గొంతుకలు వినిపిస్తున్నాయి. "ఎక్కడికి పోతున్నావ్, ఓ మతిహీనుడా, నీవు సర్వ నాశనం అయ్యే చోటుకు పోతున్న సంగతి తెలియడం లేదా? నీవు చిన్నవాడివి, రా, మా దగ్గరకు రా, సత్యం, శివం, సుందరం అయిన మా దగ్గరకు రా, బద్ధకం, బలహీనతలచే దారి తప్పకు. వర్తమానంలో నిదురించకు, భవిష్యత్తు వైపు అడుగు వెయ్యి." "తరవాత, తరవాత" అని ఆ బాటసారి, తానడగకుండా సలహా యిచ్చిన ఆ గొంతుకలకు బదులు చెప్పాడు. అచటి పుష్పాలు అతని వంక చిరునవ్వుతో చూస్తూ "తరవాత" అన్న అతని సమాధానాన్ని ప్రతిధ్వనించాయి. పోను, పోను దారి మరింత వెడల్పుగా తయారైంది. సూర్యుడు నడినెత్తికి చేరాడు. పగలు

నడుస్తున్న దారి ఒక కూడలి దగ్గరకు చేరుకొన్నది. అక్కడ అనేక మార్గాలు, అనేక దిశల్లోకి పోతున్నాయి.

ఆ యువకుడికి ప్రతి చోటా అటూ యిటూ జనం నడిచినట్లు అనేక అడుగుజాడలు కన్పించాయి. ఆకాశాన సూర్యుడు ప్రకాశిస్తున్నాడు, చెట్లమీద పక్షులు కిలకిల లాడుతున్నాయి. ఆ రోజు చాలా చక్కగా గడుస్తుందనిపిస్తోంది. మరో ఆలోచన లేకుండా ఆ బాటసారి తనకు దగ్గరగా ఉన్న దారిలో పోవ మొదలుపెట్టాడు. అది అనుచితమే అనిపిస్తుందెవరికైనా. మరో దారిలో వెళ్తే బాగుండేదేమో అని అతనికో క్షణం అనిపించింది. అతను నడుస్తున్న దారి యెక్కడికీ చేర్చలేదని అతని కనిపిస్తే వెనక్కు తిరిగిపోవడాని కతనికి చాలినంత సమయముంది. "వెనక్కు తిరుగు, వెనక్కు తిరుగు, నీవు సరైన దారిలో లేవు" అని అతని కెక్కడి నుండో వినిపిస్తున్నట్లని పించింది. కాని అతని చుట్టూ వున్నదంతా చాలా చూడ ముచ్చటగా వుంది, ఆనందం కలిగించేదిగా వుంది. ఏం చేయాలి? అతని కేం పాలుపోవడం లేదు. ఏ నిర్ణయమూ తీసుకొనకుండా అతను నడుస్తూనే వున్నాడు. అతనికా క్షణంలో లభిస్తున్న సంతోషాలను అనుభవిస్తూ పోతూనే వున్నాడు. అలా వినిపిస్తున్నదానికి "కొంచెం సేపట్లో, కొంచెం సేపట్లో నేను ఆలోచించి నిర్ణయిస్తాను, ఇంకా చాలా సమయముంది గదా" అని సమాధానం చెప్తున్నాడు. అతని చుట్టూ పిచ్చిగా పెరిగిన పచ్చగడ్డి అతని చెవిలో "తరవాత" అని గుసగుస లాడింది. తరవాత, అవును తరవాతే అనుకున్నాడు. సూర్యరశ్మితో నునువెచ్చగా తయారైన ఆ వాతావరణంలో గుబాళించే పిల్లవాయువులను పీల్చడంలో ఎంత హాయి వుంది! 'తరవాత' 'తరవాత' అనుకొంటూ ఆ బాటసారి సాగిపోతున్నాడు. దారి వెడల్పైంది. దూరం నుంచి గొంతుకలు వినిపిస్తున్నాయి. "ఎక్కడికి పోతున్నావ్, ఓ మతిహీనుడా, నీవు సర్వ నాశనం అయ్యే చోటుకు పోతున్న సంగతి తెలియడం లేదా? నీవు చిన్నవాడివి, రా, మా దగ్గరకు రా, సత్యం, శివం, సుందరం అయిన మా దగ్గరకు రా, బద్ధకం, బలహీనతలచే దారి తప్పకు. వర్తమానంలో నిదురించకు, భవిష్యత్తు వైపు అడుగు వెయ్యి." "తరవాత, తరవాత" అని ఆ బాటసారి, తానడగకుండా సలహా యిచ్చిన ఆ గొంతుకలకు బదులు చెప్పాడు. అచటి పుష్పాలు అతని వంక చిరునవ్వుతో చూస్తూ "తరవాత" అన్న అతని సమాధానాన్ని ప్రతిధ్వనించాయి. పోను, పోను దారి మరింత వెడల్పుగా తయారైంది. సూర్యుడు నడినెత్తికి చేరాడు. పగలు

అద్భుతంగా వుంది. కాని బాట విశాలమైన రోడ్డుగా తయారైంది. అది తెల్లగా ధూళితో నిండి వుంది. దారి కిరువైపులా లేత బిర్చ్ చెట్లు బారులు తీరివున్నాయి. సెలయేటి మృదువైన గలగలలు విన్పిస్తున్నాయి. కాని అతను నిరర్థకంగా దిక్కులు చూస్తూన్నాడు. అంతమంటూ లేని ఈ రోడ్డుకు అంతెక్కడా అతనికి కన్పించలేదు.

తెలిసీ తెలియని ఒక రకమైన అసౌకర్యంతో ఈ యువకుడు "ఎక్కడున్నాను? ఎక్కడికి పోతున్నాను? ఏం జరుగుతోంది? ఆలోచించడం యెందుకు? పనిచేయడం ఎందుకు? అంతులేని ఈ దారి వెంట పడిపోతాను, రేపు ఆలోచిస్తాన్లే" అనుకొన్నాడు.

చిన్న చెట్లు అంతర్థానమైనాయి. ఇప్పుడు రోడ్డు ప్రక్క ఓకు వృక్షాలు బారులు తీరాయి. ఇరుప్రక్కలా మురుగు కాలువలు కూడా రోడ్డుతో పాటే వున్నాయి. బాటసారికి అలుపు కలగడం లేదు. మన స్పృహలో లేనట్లు రోడ్డు వెంట పడిపోతు న్నాడు.

మురుగు కాలువ బాగా లోతుగా తయారైంది. ఓకు చెట్లు పోయి ఫర్ చెట్లు వచ్చాయి. ప్రొద్దు వాలడం మొదలైంది. ఒక విధమైన దిగ్భ్రాంతితో ఆ బాటసారి తన చుట్టూ పరికించాడు. ఫర్ చెట్లను, రాళ్ళను, నేల నుండి పైకి తేలిన చెట్ల వ్రేళ్ళను పట్టుకొని మానవాకారాలు వ్రేళ్ళాడుతూ భూచెరియలలోనికి దొర్లిపోతు న్నాయి. ఆ ఆకారాల్లో కొన్ని ఎలాగైనా పాక్కుంటూనైనా పైకి రావాలని చాలా ప్రయత్నిస్తున్నాయి. కాని అవి పై అంచు దగ్గరకు చేరగానే తలలు ప్రక్కకు త్రిప్పి తమంతట తామే పడిపోతున్నాయి. బాటసారికి "ఈ చోటు విడిచి పారిపో, కూడలి దగ్గరికి పో, సమయం మించి పోలేదు", అన్న అరుపులు విన్పించాయి. ఆ యువకుడు "రేపు" అని కొంత తడవు సంశయించి బదులు పలికాడు. భూమి లోనికి జారిపోతున్న ఆకారాలను చూడలేక మోమును తన చేతుల్లో దాచుకొని ముందుకే పోవాలని ఆపుకోలేని ఒకానొక బలమైన ప్రేరణతో లాగబడి రోడ్డు వెంట పరుగులు పెట్టాడు. బయటపడేందుకు అసలేదైనా దారి దొరుకుతుందా అని ఆలోచిం చటం మానేసాడు. నుదుట ముడుతలతో, చింపిరి బట్టలతో నిరాశ నిండిన తెగింపుతో పరుగు పెట్టాడు. శాపగ్రస్తమైన చోట చాలా దూరంగా వచ్చేసానని భావిస్తూ కళ్ళు తెరిచాడు. అక్కడ చెట్లు లేవు. చుట్టూ ఉన్నదంతా కఠినశిలలు, బూడిదరంగు దుమ్ము. సూర్యుడు అస్తమించాడు, చీకటి పడుతోంది. ఆ దారే చివరకు ఒక అంతులేని యెడారిలో అంతమైంది. సుదీర్ఘంగా పరుగు పెట్టడం వల్ల, ఆ నిరాశోపహతు

డైన బాటసారి నీరసించిపోయి, ఇహ ఆగిపోవాలనుకొన్నాడు. కాని అతడు సాగిపోవాలి. అతని చుట్టూ వినాశనమే కనిపిస్తున్నది. గొంతు పెకలని ఏడ్పులు వినిపిస్తున్నాయి. అతని పాదాలు అస్థిపంజరాలపై తడబడుతున్నాయి. దూరంగా దళసరి పొగమంచు భయంకర రూపాలు ధరిస్తోంది. నల్లని రూపాలు పైకి లేస్తున్నాయి. పెద్ద విపత్తును, అశుభాన్ని సూచించే భయంకరాకారం రూపుదాలుస్తోంది. గమ్యం అని సంవేదించిన దాని వైపు నడకతో గాకుండా యెగురుతూ పోతున్నాడు. గమ్యం కూడా అతని కంత కంతకూ దూరమౌతోంది. ఏవో పిచ్చి అరుపులు అతడిని నడుపుతున్నాయి. అతడు భయంకర రూపాలను ప్రక్కకు నెట్టుకొంటూ పోతున్నాడు.

చివరికతడు అంధకారయుతమైన, పాడుపెట్టబడిన, కళావిహీనమైన "భూతగృహం" అని అనతగిన ఒక కోట దగ్గరకు చేరుకొన్నాడు. కాని ఆ యువకుడు ఆ ప్రదేశపు స్థితిని గురించి పట్టించుకోలేదు. నల్లని పెద్ద పెద్ద గోడలు అతని మీద ప్రభావం చూపలేకపోయాయి. అతడు దూళితో నిండిన ఆ ప్రదేశంలో నిలబడి వున్నాడు. ఆ భయంకర బురుజులు చూసి అతడేం భయపడకపోగా గమ్యం చేరానను కొన్నాడు. తన నీరసాన్ని, నిరుత్సాహాన్ని మరచిపోయాడు. అతడు కోటను సమీపించి ఒక గోడను తట్టాడు, ఆ గోడ వెంటనే కూలిపోయింది. క్షణంలో అతని చుట్టూ ఉన్నదంతా బురుజులు ఎత్తైన భవనాలు, గోడలు అన్నీ అదృశ్యమైపోయాయి. అది వరకే దుమ్ము, దూళితో నిండిన ఆ ప్రదేశంలో మరింత దుమ్ము, ధూళిని నింపుతూ ఆవన్నీ అందులో కూరుకుపోయాయి.

గుడ్లగూబలు, కాకులు, గబ్బిలాలు ఎగురుతూ అతని శిరస్సు చుట్టూ తిరిగాయి. అతడు దిగ్భ్రాంతి చెంది, కుంగిపోయి, ఆ చోటుకతుక్కుపోయినట్లు, కదలలేక నిలుచుండిపోయాడు. అకస్మాత్తుగా భయాలన్నింటి కన్నా భయం కలిగించే, ఏవగింపు, నిరాశ, నిస్సహాయతలుగా పిలువబడే అతిభయంకర భూతాలు అతని యెదుట నిలిచాయి. ఆ శిధిలాల మధ్య అంతులేని లోతుగల ఒక అగాధం పైన పాలిపోయిన, కళాహీనమైన ఆత్మహనన భూతాన్ని కూడా చూసాడు. ద్వేషం నిండిన ఈ భూతాలు, దయ్యాలు అన్నీ అతన్ని చుట్టుముట్టి పట్టుకొని నోరు తెరచుకున్న అగాధంలోకి తోసుకుపోయాయి. ఆపనలవికాని ఈ శక్తులను ప్రతిఘటించడానికా నిస్సహాయ యువకుడు ప్రయత్నించాడు. అతడు వెనక్కు పోవాలనుకొన్నాడు, పారిపోవాలని, తనను పెనవేసుకొని పట్టి బంధించిన ఈ అదృశ్యశక్తు లన్నింటికీ అందకుండా తనను

తాను చీల్చివేసుకోవాలని అనుకొన్నాడు. కాని అప్పటికే చాలా ఆలస్యమైంది. అతడు ప్రాణాంతకమైన అగాధం వైపుకే పోతున్నాడు. తన నెవరో ఆ వైపు లాగుతున్నట్లు, దాని మైకంలో పడిపోయినట్లు అతని కనిపిస్తోంది. అతను పిలుస్తున్నాడు బిగ్గరగా, కాని అతని అరుపుల కెవరూ సమాధానం చెప్పడం లేదు. ఆ భూతాలను పట్టుకోవాలనుకొంటున్నాడు. కాని అతని క్రింద ఉన్నదంతా కుంగిపోతున్నది. లోతుకు పోయిన కళ్ళతో అతడు శూన్యాన్ని తేరి చూసాడు. అతడాక్రందించాడు, వేడుకొన్నాడు, చివరకు సమాధానంగా కీడు నవ్విన అసహ్యపు నవ్వు విన్పించింది.

బాటసారి అగాధపు టంచుకు చేరాడు. అతని ప్రయత్నాలన్నీ నిరర్థకమైనాయి. ఎంతో సంఘర్షణకు లోనైన తరవాత అతడు పడిపోయాడు — తన మంచం మీది నుంచి.

మరుసటి రోజు ఉదయానికి ఒక పెద్ద వ్యాసాన్ని ఆ యువవిద్యార్థి తయారు చేయాలి. పగలంతా చేసిన పనితో కొంచెం అలసిపోయి, ఇంటికొచ్చిన తరవాత "తరవాత ఆ పని చూద్దాంలే" అనుకొన్నాడు. త్వరగా పడుకొంటే మరుసటి రోజు ఉదయం పెందలకడ మేలుకొని, త్వరగా తన పని పూర్తిచేసుకోవచ్చు అనుకొన్నాడు. "ఇహ పడుకొంటాను. రేపు ఇంకా బాగా వ్రాయగలుగుతాను. ఈ పూటకు ఆ విషయం పక్కన పెడతాను", అనుకొన్నాడు. అతడలా అనుకోవడంలో ఎంత సత్యముందో అతనికే తెలియదు. మనం ఇంతకు ముందు వర్ణించుకొన్న భయంకర పీడకల వల్ల అతని నిద్రకు భంగం కలిగింది. అతడు క్రింద పడటంతో ఒక్క ఉదుటున మేలుకొన్నాడు. తాను కలగన్న దానిని గురించి ఆలోచిస్తూ, "చాలా స్పష్టంగా తెలిసింది. ఆ మార్గం 'తరవాత' మార్గం, రోడ్డు 'రేపటికి' రోడ్డు. 'ఎన్నడూ, ఏదీ కానిది, లేనిది ఆ కోట'. తన తెలివితేటలకు తానే సంబరపడి, ఈ రోజు చేయగలిగినదానిని, రేపటివరకూ ఎన్నడూ వాయిదా వేయకూడదు అని తనకు తానే ప్రతినబూని పని కుపక్రమించాడు.

(15 సంవత్సరాల వయస్సులో, దివ్యజనని, 1893 లో ఈ వ్యాసం వ్రాసారు.)

CWM 2:1-4

శ్రీమాత

అనువాదం: కె. వి. రావు

స్వప్న నౌక

స్వాప్నిక అగ్ని శిఖలతో వెలిగే నావలో
నా చెంతకు ఏతెంచారు ఎవరు?
నిప్పులు విరజిమ్మే కనుబొమలతో, సూర్య సువర్ణ
మయ దేహంతో కదిలి వచ్చిన
ఆ రూపం ఎవరు?
నిశ్శబ్దం తీయని రహస్య ధునిగా కరిగించి —
"ఇప్పుడు నాతో వస్తారా? హృదయగతాగ్ని సంసిద్ధమేనా?"

*

గుండె లోతుల గుహలలో దాగి ఎదో వణికింది.
జీవన ఆనందాలన్నీ స్మృతులుగా మెరిసాయి.
తను శాశ్వతంగా పోగొట్టుకోవలసిన సంతోషాన్ని
గుర్తు చేసుకుంది.
నావ కదలి పోయింది. బంగారు దేవత మాయమైంది.


*

ఇప్పుడు ప్రపంచపు హృదయంలో తీరని వెలితి.
ఆ ప్రేమలు అంతరించాయి, ఆ ఆనందం అంతర్ధానమయింది.
తరలిపోయిన ఆనందం శూన్యాన్ని మిగిల్చింది.
స్వర్ణ దేవత, స్వప్న నౌక ఇక రాదు.

CWSA 2:576

శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

అఖిల



అఖిల భారత పత్రిక

నవంబరు 2013

27/11/20

విషయసూచిక

శరీరంలోని కణాల ప్రార్థన

భగవత్ కృప ప్రభావంతో మనం నెమ్మదిగా నిశ్చేతనలో నుండి బయటపడి చైతన్యవంతమైన జీవనంలో మేల్కొంటున్న సమయాన, ఒక ప్రగాఢమైన ప్రార్థన మరింత ప్రకాశం, మరింత చైతన్యం కోసం మనలో పెల్లుబుకుతుంది.

ఓ పరమేశ్వరా! విశ్వప్రభూ! నిన్ను వేడుకుంటున్నాము. ఈ పృథ్విపై నీ దివ్య ఉపకరణాలుగా ఉండేందుకు కావలసిన బలాన్ని, సౌందర్యాన్ని, సమరసయుక్తమైన పరిపూర్ణతను మాకు ప్రసాదించు.

శ్రీమాత

యువతకు పిలుపు: "నిరంతరాభివృద్ధి, ముందంజ"

మొదటి నియమం యేమిటంటే, వ్యక్తికి స్వార్థప్రయోజనం లక్ష్యం కాకూడదు.

మొదటిగా కావలసిన లక్షణాలు, ధైర్యం, పరాక్రమం, పట్టుదల.

తదుపరి లక్షణాలు: తాను తెలుసుకోవలసిన దానితో పోలిస్తే, తనకు తెలిసినది యేమీ లేదు అనే యెరుక; తాను నెరవేర్చవలసిన దానితో పోలిస్తే, తాను నెరవేర్చింది యేమీ లేదు అనే యెరుక; తాను ఉండవలసిన స్థితితో పోలిస్తే, తానున్న స్థితి యేమీ కాదు అనే యెరుక.

వ్యక్తికి తన స్వభావంలో యే లక్షణం కొరతబడి వున్నదో, దానిని పొందాలనే స్థిరసంకల్పం వుండాలి; తనకు యిప్పటివవరకు తెలయనిదేదో తెలుసుకోవాలనే సంకల్పం వుండాలి; తాను యిప్పటి వరకు నెరవేర్చలేని దానిని నెరవేర్చాలనే సంకల్పం వుండాలి.

వ్యక్తిగత కోరికలు లేని స్థితిలో సమకూరే ప్రశాంతతలో, వెలుగులో నిరంతరాభి వృద్ధి చెందాలి.

"సర్వదా ముందంజ" — ఇది నీ కార్యక్రమం కావాలి.

ఒకే ఒక లక్ష్యం వుండాలి: దైవసాక్షాత్కారం పొందగలుగుటకు దైవాన్ని తెలుసు కొనుట.

పట్టువదలకు, నేడు చేయలేనిది రేపు చేయగలవు.

శ్రీమాత

CWM 2nd Edition 16:430

ప్రప్రథమంగా నేర్చుకోవలసిన విషయం

నీ ఆలోచనా సరళిలోగాని, అనుభూతిలోగాని లేక ఆచరణలోగాని నీవే ఈ ప్రపంచానికి కేంద్రబిందువునని, ఈ ప్రపంచం నీ కోసమే వున్నదనే భావనను విడనాడాలి. ప్రధానంగా వ్యక్తి ఈ ప్రపంచంలో ఒక భాగం. నీవు ప్రపంచంతో ఐక్యత పొందవచ్చు, కాని దానికి కేంద్రబిందువు సర్వేశ్వరుడు మాత్రమే. ఎందుకనగా ఆతను ప్రపంచాన్ని అధిగమించి తనలో యిముడ్చుకున్నవాడు.

CWM 16:265

మనిషి తన జీవన గమనంలో ప్రప్రథమంగా నేర్చుకునేదేమిటనగా, పుచ్చుకొనుటలో కన్నా ఇచ్చుటలో గల ఆనందమే అధికమైనదని.

పోను పోను మనిషికి తెలియవచ్చే దేమిటనగా తనను తాను మరిచే స్థితిని చేరుకొనుట అచంచలమైన ప్రశాంతతకు మూలం అని. అటు పిమ్మట తనను తాను మరచిన స్థితిలో అతను దైవాన్ని కనుగొంటాడు. ఆ స్థితి నిరంతరాభివృద్ధి చెందే పరమానందానికి మూలం.

CWM 16:432

తన అహంకారంతో సంకుచిత అవధుల్లో బంధింపబడిన వ్యక్తి ఆత్మసమర్పణ ద్వారా ఆ బంధనాలను ఛేదించుకొని బయల్పడిన ప్రతిసారీ, అది మరో వ్యక్తి కోసమో, లేక తన కుటంబం కోసమో, తన దేశం కోసమో, తన విశ్వాసం కోసమో, దేనిని గురించైనా సరే, తనను తాను మరచిన స్థితిలో అత్యద్భుతమైన ప్రేమానంద రసాస్వాదన ముందుగానే చేయగలుగుతాడు. ఈ అనుభవం అతనికి తాను దైవంతో సంపర్కమొందాననే అనుభూతిని కలిగిస్తుంది. అయితే, చాలా వరకు యిది క్షణికమైనది గానే వుంటుంది. ఎందుకనగా, మానవునిలో ప్రేమ వెంటనే నిమ్న అహంభావ కదలికలతో కలసిపోవుట వలన ఆ ప్రేమ నీరుగారి తన పవిత్రతాశక్తిని కోల్పోతుంది.

CWM 12:68

నిజమైన నిర్వాణం అనగా, నీ అహం ఆ పరమాత్మ వైభవంలో విలీనం కావడం. ఈ మార్గాన్ని నేను సునిశ్చితమైన మార్గమని అంటాను. ఇదొక సమగ్రమైన, సంపూర్ణమైన, కచ్చితమైన, మినహాయింపులేని, బేరసారాలులేని ఆత్మార్పణం.

తనను గురించి మాత్రమే ఆలోచించకుండా, తనను గురించి మాత్రమే

జీవించకుండా, తన అభిప్రాయాన్నే అన్నిటిపైన రుద్దకుండా, కేవలం దివ్యసుందరమైన, ప్రకాశవంతమైన, ఆనందభరితమైన, శక్తివంతమైన, సానుభూతితో కూడిన అనంతమైన దాని పైనే ఆలోచనను నిలిపి వుంచగలిగితే చాలు, అందులో యెంతో దివ్యమైన ఆనందం వుంటుంది. దానితో దేనినీ పోల్చలేము.

ఇదొక్కటే ఉచితమైన విషయం, ప్రయత్నించ యోగ్యమైనది. మిగతాదంతా కాలక్షేపానికే పనికొస్తుంది.

CWM 3:269

ప్రశ్న: తనను తాను మరచిపోవుటకు సులువైన మార్గమేది?

సమాధానం: సహజంగా అది వ్యక్తిపై ఆధారపడి వుంటుంది. ప్రతి ఒక్కరికి తమను తాము మరచిపోవుటకు వారికి యుక్తమైన ప్రత్యేక మార్గమొకటి వుంటుంది. సాధారణంగా అందరికీ సరిపోయే మార్గం కూడ ఒకటుంటుంది. అది అనేక విధాలు. తనకు తాను మరో విషయంలో నిమగ్నమైపోవుటయో లేక తనకు సంబంధించినదానికి బదులు మరొకరి వ్యవహారంలో తలదూర్చుటయో లేక వేరొక ఆసక్తికరమైన యేకాగ్రత వహించవలసిన కార్యంలో మునిగిపోవుట లాంటింది.

అయినప్పటికి యిదంతా ఒకటే, వీటన్నిటి ఫలితం ఒకటే. లోకంలోకంతా అత్యంత విలువైనదైనట్టు పదే పదే తనను గురించే ఆలోచించుకుంటూ ఖిన్నపడుటకు బదులు తనను తాను తెరుచుకొని తనది కాని మరొక పనిలో నిమగ్నమైతే అది తనను తాను మరచిపోవుటకు సులభమైన, వేగవంతమైన మార్గం.

CWM 8:288

నిజమైన నిస్వార్థత మన పనుల్లో మునిగిపోయి మనలను మనం మరచిపోవడం కాదు, అంతకు మించి మనలను మనం మరచిపోతున్నామని తెలుసుకోలేక పోవడంలో వున్నది. ఈ విషయాన్ని మనసులో నిలుపుకోవడం తప్పనిసరి.

క్లుప్తంగా చెప్పాలంటే, నిజంగా, నిస్వార్థంగా వుండాలంటే, మనం నిస్వార్థంగా వున్నామని గమనించడం మానివేయాలి.

CWM 2:58

ధైర్యంగా నుండు. నిన్ను గురించి నీవు యెక్కువగా ఆలోచించకు. నీవు నీ అల్ప మైన అహాన్ని నీ వ్యవహారాల్లో కేంద్రబిందువుగా చేసుకొనుట వలన నీవు విచారపడు

తున్నావు, తృప్తి పొందలేకపోతున్నావు, నిన్ను నీవు మరచిపో గలుగుటయే అన్ని అస్వస్థతలకు పరమౌషధం.

CWM 16:178

మనిషి దివ్యానందానుభూతికి హక్కుదారుడు, ఎందుకనగా, అందుకోసమే అతను సృష్టించబడ్డాడు. అయితే యెలాంటి అహంకారపూరిత కదలికైనా దివ్యానందానుభూతికి ప్రతికూలమౌతుంది. ఎలాగంటే, దానిని నీ కోసం మాత్రమే కావాలనుకుంటే, దానిని ఆకర్షించే బదులు తరిమివేస్తావు. నిన్ను నీవు మరచిపోవుట ద్వారా, ఆత్మసమర్పణ ద్వారా, ప్రతిఫలాన్ని ఆశించక, దివ్యానందం తన వెలుగును అందరిపై ప్రసరింపచేయాలని ఆశించి, నీవు దానిలో విలీనమైపోయినట్లయితే, నీవు అంతరంగ ప్రశాంతతను, ఆనందాన్ని పొందుతావు. అవి నిన్ను ఎన్నటికీ వీడవు.

CWM 10:278

ప్రశ్న: 'నిన్ను నీవు మరచిపోవుట' కు 'ఆత్మార్పణ' కు మధ్య తేడా ఏమిటి?
సమాధానం: నిన్ను నీవు మరచిపోవుట అనగా, పూర్తి అహంకార రాహిత్యం వలన సంభవించే ఉదాసీనస్థితి. ఆత్మార్పణ ఒక క్రియాశీలమైన కదలిక. అది దైవం దిశగా మళ్ళినప్పుడు సుసంపన్నమౌతుంది. అందులో స్వచ్ఛమైన, ఉదాత్తమైన ప్రేమ మిళితమై వుంటుంది. దైవానికి సంపూర్ణ ఆత్మార్పణ గావించుటయే మనిషి ఉనికిలో గల యదార్థ ప్రయోజనం.

CWM 10:278

శ్రీమాత

ఏమీ కానని, ఎవరూ కాననీ ఒప్పుకో. కాలానుగుణంగా చేసిన కర్మను కాలగర్భంలో కరిగిపోనీ. నీ మనసును విడిచిపెట్టు. నామరూపాలను ఖాతరు చేయకు. భగవంతుని ఉనికి మాత్రమే వుండేందుకు నిన్ను నీవు లయం చేసుకో.

సావిత్రి పుట. 538 — శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

నిజమైన జీవితలక్ష్యం

సాధారణ జీవితలక్ష్యం తన కర్తవ్యం తాను నిర్వహించడం. ఆధ్యాత్మిక జీవితలక్ష్యం దైవానుభవం పొందడం.

*

నిజమైన జీవితలక్ష్యం మనిషి తన ఆంతర్యంలోగల దివ్యాంశని గుర్తించి దానికి తనను తాను సమర్పణ గావించడం. అదే ఆతని జీవితమార్గదర్శి అవుతుంది. శరీర సంబంధమైన ఆలోచనలకు ఆచరణలకు కూడా అదే మార్గదర్శనం చేస్తుంది.

అదే ఉనికికి తేజమయమైన, సత్యమయిన లక్ష్యమేర్పరుస్తుంది.

*

జీవాత్మ, పరమాత్మ ఒక్కటే. ప్రతి లోకంలోను, ప్రతి జీవిలోను, ప్రతి వస్తువులోను, ప్రతి అణువులోను దేవుడున్నాడు. మనిషి కర్తవ్యం దానిని అభివ్యక్తం చేయడమే.

*

సంతోషంగా వుండడానికే జీవించకు. దైవాన్ని సేవించడానికి జీవించు. ఆ ఆనందం నువ్వాశించిన వాటన్నిటి కంటె అతీతమయిన అనుభవమవుతుంది.

*

జీవితానికొక ప్రయోజన ముంది. దైవాన్ని తెలుసుకుని సేవించడమే ఆ ప్రయోజనం.

దేవుడెక్కడో దూరంగా లేడు, మనలోనే వున్నాడు. లోతైన ఆంతర్యంలో, మన ఆలోచనలకు, అనుభూతులకు అతీతంగా ఉన్నాడు. దైవంతోనే శాంతి, విశ్వాసం, అన్ని ఆపదలకు పరిష్కారం సమకూరుతాయి.

నీ సమస్యలన్నీ దైవాని కర్పించు. అతడే నిన్ను అన్ని కష్టాలు, సమస్యల నుండి బయటపడేస్తాడు.

*

దైవాన్ని ప్రకటించడానికే మనిషి సృష్టించబడ్డాడు. అందువలన అతని కర్తవ్యం దైవాన్ని గురించిన చైతన్యాన్ని పొంది, ఆతని సంకల్పానికి తనని తాను సంపూర్ణంగా సమర్పించుకోవడం. మిగిలినదంతా, కళ్ళకెలా కనిపించినా అదంతా భ్రమ, అజ్ఞానమే.

శ్రీమాత

దైవాన్ని కనుక్కో

ప్రశ్న; దైవం అన్నిటిలోను ఉన్నాడా — చెత్తకుండీలో కూడ?
సమాధానం: విశ్వమంతా పరమాత్మ అభివ్యక్తే. కాని, ప్రారంభంలో ఆ అభివ్యక్తికి దాని మూలం గురించిన ఎరుక లేదు. తరువాత అది కొద్ది కొద్దిగా చైతన్యం దిశగా ఎదుగుతుంది.

*

దైవం భౌతికస్థాయిలో సౌందర్యం ద్వారా, మానసికస్థాయిలో జ్ఞానం ద్వారా, ప్రాణిక స్థాయిలో శక్తి ద్వారా, చైత్యస్థాయిలో ప్రేమ ద్వారా తన్ను తాను ప్రకటించుకుంటాడు.

మనం ఎప్పుడైతే తగినంత ఔన్నత్యం సాధించామో, అప్పుడు పై నాలుగు అంశాలూ ఒకే చైతన్యంలో ఒకదానితో ఒకటి కలిసే వున్నాయని, ప్రేమతో, ప్రకాశంతో, శక్తితో, సౌందర్యంతో నిండి, సర్వసమన్వితమై, సర్వవ్యాప్తమై వున్నాయని గ్రహిస్తాము.

కేవలం సార్వత్రికమైన సృష్టి క్రీడను సంతృప్తిపరచడానికే ఈ చైతన్యం వివిధ మార్గాల్లో లేదా వివిద పద్ధతుల్లో తనను తాను విభజించుకొని అభివ్యక్తమవుతుంది.

*

ప్రతి జీవిలో పరమాత్మ కొలువై వుంటాడు. ప్రపంచంలో మనిషంత దుర్బలమైన ప్రాణి లేకపోయినా అతనంత దివ్యత్వం కలిగిన ప్రాణి కూడా ఏదీ లేదు.

*

పరమ సత్యం విషయానికొస్తే మనందరం దివ్యులమే. కాని మనకా విషయం తెలియదు. అయితే, మనలో తనను తాను దివ్యమైనదని తెలుసుకోలేనిదానిని మనం 'మనమని' పిలుచుకుంటాము.

*

సర్వేశ్వరుడు తప్ప మిగిలినదంతా పరస్పర సంబంధమున్నదే. ఆ సర్వేశ్వరుడొక్కడే శుద్ధాత్మ. కాని సర్వేశ్వరుడు ప్రతి జీవి హృదయకేంద్రంలో కొలువై వున్నందున ప్రతి జీవి తనలో తాను ఆతని శుద్ధాత్మను కలిగి వుంటాడు.

*

విశ్వం యొక్క అద్భుతాలకి అంతం లేదు.

మన చిన్న అహం పరిమితుల నించి మనం ఎంత ఎక్కువ స్వేచ్ఛ పొందుతామో అంత ఎక్కువ ఈ అద్భుతాలు తమకు తాముగా మనకు ప్రత్యక్షమౌతాయి.

*

ఈ భ్రాంతిమయ ప్రపంచం, ఈ చీకటి పీడ కల, వీటిపై పరమాత్మ అతడి అత్యున్నతమైన, అసాధారణమైన దివ్యసత్యాన్ని అనుగ్రహించాడు. పదార్థంలో ప్రతి అణువూ అతడి శాశ్వతతత్వపు అంశలో ఏ కొంతయినా కలిగి వుంటుంది.

*

సృష్టి సమస్తం పరమాత్మను గురించి ఎవరితో మాట్లాడుతుందంటే ఎవరైతే తమ హృదయాంతర్గతంగా వినగలుగుతారో, వారితో మాట్లాడుతుంది.

*

మన ప్రతిభ మనలను మనం ఎంత వరకు అధిగమించామన్న దానిపై మాత్రమే ఆధారపడి వుంటుంది. మనలను మనం అధిగమించడమనగా, దైవాన్ని అందుకోవడమే.

*

ఏముంది. ఇదంతా చాలా తేలిక. మనం మన ఆంతర్యపు లోతుల్లో ఏమిటో, కేవలం అలా తయారయితే చాలు.

శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

రహదారికి, గజిబిజి దారికి మధ్య ఎన్నిక

ప్రతి వారి జీవితంలోను ఒక క్షణమొస్తుంది. అది రెండు మార్గాల మధ్య ఎన్నుకోవలసిన సమయం. ఆ రెండు మార్గాల్లో ఒకటి రహదారి, రెండవది గజిబిజి దారి (అస్తవ్యస్తమైనది). ఇక్కడొక కాలు, అక్కడొక కాలు వేయడం కుదరదు. ఒకవేళ ప్రయత్నించినా, నీవు విచ్ఛిన్నమై చెదరిపోతావు.

ఎన్నుకోలేని హృదయం, మరణించే హృదయం

*

సత్యాసత్యాలు, చీకటి వెలుగులు, పురోగమన తిరోగమనాలు, ఉన్నత శిఖరారోహణ అధః పాతాళానికి పతనం — వీటి మధ్య జరిగే నిత్య ఎన్నిక ప్రక్రియే జీవితం. ప్రతి

వారు వారికి కావలసింది స్వేచ్ఛగా ఎన్నుకోవచ్చు.

*

మేధోపరమైన దృక్పథం ముందు వస్తుంది, కొంచెం కొంచెంగా దానిని ఆచరణ అనుసరిస్తుంది. జీవితేచ్ఛని, మనం ఏది సత్యంగా తెలుసుకున్నామో దాని ప్రకారం జీవించడాన్ని, అప్రమత్తంగా అనుసరించడం చాలా ముఖ్యమైన విషయం. అప్పుడు ఆగిపోవడం కాని, వెనకపడడం కాని జరగదు.

*

ఈ మొత్తం ప్రపంచం అంతా పురోగమనం చెందే రూపాంతరీకరణ వైపు సాగుతోంది. నీవు యోగమార్గాన్ని అనుసరిస్తే, నీలో ఆ ప్రక్రియ శీఘ్రంగా పనిచేస్తుంది.

*

శారీరక సంపూర్ణ విశ్రాంతి ఎప్పుడూ ఆరోగ్యకరం కాదు. కాని తాత్కాలికమైన విశ్రాంతి తరుచుగా సహాయకారిగా ఉంటుంది. ముఖ్యంగా కావలసింది ఆంతరంగికమైన నిర్లిప్తత మరియు సంపూర్ణంగా దైవం వైపు దృష్టిని మళ్ళించడం.

*

మనిషిగా మనగలుగుటకు క్రమశిక్షణ అత్యంతావశ్యకం.

క్రమశిక్షణ లేని మనిషి మృగంతో సమానం.

ఎవరైతే మరింత ఉన్నతమైన, సత్యవంతమైన జీవితాన్ని ఆకాంక్షిస్తారో, పరివర్తనకు చెందే క్రమశిక్షణను అంగీకరిస్తారో, అప్పుడే వారు మనిషిగా జీవించడం మొదలు పెడతారు. దీని కోసం ఎవరైనా వారి యొక్క నిమ్నస్వభావంపై దాని కోరికలపై ఆధిపత్యం సాధించడంతో ప్రారంభించాలి.

CWM 14:29, 29, 30, 32, 50, 46

శ్రీమాత

నిజమైన చైతన్యంతో పనిచేయడం

యోగదృష్టితో చూసినపుడు, నీవు ఏం పనిచేస్తున్నావన్నది ముఖ్యం కాదు. ఏ విధంగా చేస్తున్నావన్నదే అత్యంత ప్రాముఖ్యతను కలిగి ఉంటుంది.

*

చేస్తున్న పని కంటే, ఆ కార్యాచరణ వెనక ఉన్న ఆత్మస్ఫూర్తి, ఉద్దేశ్యం, చైతన్యం ఆ కార్యాన్ని యోగంగా చేస్తాయి.

*

మనం ఏ పని చేస్తున్నా, దానిలో ఓ నిజచైతన్య బిందువును ప్రవేశపెట్టితే అది ప్రయోజనకారిగా ఉంటుంది.

వారు చేస్తున్న కార్యం కంటె, వారు ఏ చైతన్యంతో ఆ పని చేస్తున్నారన్నది ఎక్కువ ముఖ్యమైనది. నిజచైతన్యంతో చేసినపుడు నిష్ప్రయోజనంగా కనిపించే పనులు కూడా ఎంతో ప్రయోజనా న్నందిస్తాయి.

*

ఆధ్యాత్మిక జీవన దృక్పథంలో నీవు ఏం చేస్తున్నావన్నది ప్రధానమైన విషయం కాదు. నీవు ఎలా చేశావు, ఏ చైతన్యంతో చేశావన్నదే ముఖ్యం. ఎప్పుడూ దైవాన్నే స్మరించు, అప్పుడు నీవు ఏం చేసినా అందులో ఆ దైవం యొక్క ఉనికి ప్రతిబింబిస్తుంది.

నీ చర్యలన్నీ ఏకీకృతం చేసి దైవానికి సమర్పించినపుడు నీ కార్యకలాపాలు కొన్ని ఎక్కువైనవిగాను, కొన్ని తక్కువైనవిగాను చూడబడవు. అన్నింటికి ఒకే రకమైన ప్రాధాన్యత ఇవ్వబడుతుంది — అది దైవసమర్పణ కోసం ఏకీకృతం చేసిన కార్యాల కిచ్చే విలువ.

శ్రీమాత

దానిని కర్మమార్గం చాలా సులభమైనది. అయితే దానికి కావలసినది దైవాన్ని విస్మరించి మనస్సును పనిమీద పూర్తిగా లగ్నం చేయడం కాదు. మన లక్ష్యం దైవం కావాలి. ఆ పని దైవాన్ని చేరడానికి మార్గం మాత్రమే.

శ్రీఅరవిందులు

విసుగు, అలసటల నివారణ

మనం చేసే పనుల్లో మనకు ఆసక్తి లేనపుడు విసుగు పుడుతుంది.

నువ్వు ఏ పని చేస్తున్నా అందులో ఆసక్తిని పొందవచ్చు. అయితే దానిని నీవు నీ అభివృద్ధి సాధనంగా తీసుకున్నపుడు మాత్రమే అది సంభవం. నీవు చేస్తున్న పనిని మరింత మెరుగ్గా చేయాలని ప్రయత్నించి, అభివృద్ధి సాధించాలన్న సంకల్పం నిరంతరం ఉన్నపుడు నీవు ఏం చేస్తున్నా, ఆ పనిని ఆసక్తితో చేస్తావు, అది ఏ పనైనా సరే. ఆ విధంగా చేసినపుడు ఏమాత్రం ప్రయోజనంలేని వ్యాపకం కూడా ఆసక్తికరంగా ఉంటుంది.

అయితే ఎంతో ముఖ్యమైన, ఆకర్షణీయమైన కార్యం కూడా త్వరలోనె నిన్ను నిరుత్సాహపరిచి ఆసక్తి సన్నగిల్లునట్లు చేస్తుంది. దానికి కారణం ఆదర్శప్రాయమైన పరిపూర్ణత దిశగా పురోగమించాలనే సంకల్పం లేకపోవడం.

*

అలసట, అభివృద్ధి కోసం సంకల్పం లేకపోవడాన్ని సూచిస్తుంది. నీవు అలసిపోయినా విసుగుచెందినా అది నీలో అభివృద్ధి కోసం సంకల్పం లేనందువల్లనే.

*

మొదట సరైన దృక్పథాన్ని స్థిరపరచుకో, అది నీ మూలాన్ని, నీ ఆలంబనని, నీ సహాయాన్ని కేవలం భగవంతుని యందే పొందడం. అప్పుడే నీ విసుగు మటుమాయ మవుతుంది.

*

కౌవ్ యొక్క పద్ధతి ఉపయోగించు. (Ewile Cowe ఒక ఫ్రెంచి డాక్టరు). అది స్వయంప్రేరణ పద్ధతి (auto-suggestion). "నేను అలసిపోలేదు, నాకు రక్షణ ఉంది కనుక నేను అలసట చెందను", అని అనుకోవడం.

*

కండరాలు వాటికి సరిపోయినంత పనిచేయనపుడు ఏ విధంగా అలసిపోతాయో, ఇది కూడా అలాంటి అలసటే. ఏ పని చేయకుండా ఉండటం కూడా అతిగా పనిచేయడం

వల్ల వచ్చిన అలసట లాంటిదే. పని చేయకపోవడం కూడా అత్యధికంగా పనిచేయడ మంత చెడ్డది.

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

*

ఆ తలనొప్పి. ఆ అలసట అంతా పోవాలని, నీవు సంపూర్ణ ఆరోగ్యంతో వుండాలని నా కోరిక. అందుకోసం నీవొక శారీరక శిక్షణ పాటించాలి. నిద్రించడం, ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం మొదలైనవి ఒక క్రమానుసారం జరగాలి. దురదృష్ట మేమిటంటే నీవు యేమాత్రం క్రమశిక్షణ కూడా పాటించవు. అందువల్ల నా పని మరీ కష్టతరమౌతుంది.

*

గొప్ప మేధావులను, మెప్పొందిన కళాకారులను నేనెరుగుదును. వారికి వారి పనిపై పట్టు సడలడం ప్రారంభం కాగానే వారు మూర్ఖంగా ప్రవర్తించేవారు. అసభ్యకర మైన పనులు చేసేవారు. సరైన పెంపకం కొరవడిన పిల్లల్లా ప్రవర్తించేవారు — అనగా వారు అలసట తీర్చుకుంటున్నారన్న మాట! ఈ అలసట తీర్చుకొనే 'అవ సరం' నుండే అంతా పుట్టుకొస్తుంది. అధికశాతం జనులకు అది ఏ విధంగా అర్థమవు తుంది? దానిని ఏ విధంగా అర్థం చేసుకుంటారు? దాని అర్థం ఎల్లప్పుడూ అథమ స్థాయికి దిగజారడమే. నిజంగా అలసట తీరాలంటే, ఒక మెట్టు పైకి ఎదగాలని, వారిని వారు అధిగమించగలగాలని వారికి తెలియదు. ఒక వేళ వారు క్రిందిస్థాయికి దిగజారిపోతే, అది వారి అలసటను మరింత పెంచి ఒక విధమైన స్తబ్దతను కలిగిస్తుంది. దానికి తోడు, దిగజారిన ప్రతిసారీ వారి అంతశ్చేతనలో కల్మష భారం పెంచు కుంటారు. మనిషికి ఎదగాలనే కోరిక వుంటే, అంతశ్చేతన పైనున్న కల్మషాన్ని శుభ్రం చేస్తుండాలి. లేకపోతే అది కాళ్ళకు సంకెళ్ళలా పరిణమిస్తుంది.

ఈ విషయం పిల్లలకు ఎన్నడూ తెలియచెప్పరు. వారికి ఆటవిడుపులాంటి సడ లింపు అవసరమనే సాకుతో లోకంలో తెలివిమాలిన పనులన్నీ చేయిస్తుంటారు.

తానున్న స్థాయికన్నా క్రింది స్థాయికి దిగజారితే విసుగు తొలగిపోదు. మనిషి నిచ్చెనను అధిరోహించాలి. నిజమైన ప్రశాంతత, వెలుగు, విశ్వశక్తి, అక్కడే సమ కూరుతాయి. అప్పుడు గాని మానవుని ఉనికికి కారణమైన అసలు సత్యంతో

అంచెలంచెలుగా సంపర్క మేర్పడుతుంది.

దానితో గనక నిశ్చయాత్మకమైన సంపర్క మేర్పడితే, విసుగు పూర్తిగా తొలగి పోతుంది.

CWM 14:248-49; 17:12; 16:80, 147, 127; 4:156

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ఏకాగ్రతకు అసలైన అర్థం

ప్రశ్న: మధురమాతా! 'సంభాషణల్లో' నేను చదివింది "ఏకాగ్రత ఒక్కటే నిన్ను ఈ గమ్యం చేరుస్తుంది" అని. ధ్యానం సమయాన్ని పెంచాలా?

శ్రీమాత: ఏకాగ్రతకు అర్థం ధ్యానం కాదు. దానికి విరుద్ధంగా, బాహ్య కార్యకలాపాలేవైనా సరే వాటికి అతీతంగా నిరంతరాయంగానే ఉండగలగడం ఏకాగ్రత. ఏకాగ్రత అనగా, నా భావనలో, శక్తి, సంకల్పం, ఆకాంక్ష. సమస్తం కేవలం భగవంతుడి వైపే మళ్ళించి, మన చైతన్యంలో ఆ భగవంతుడి అనుభూతిని పరిపూర్ణంగా పొందగలగాలి.


*

నిరంతరం ఆంతర్యంలో భగవద్భావనను ఏకాగ్రతతో నింపుకోవడం అన్నది, ఏవో కొన్ని గంటల సమయం ధ్యానానికి కేటాయించడం కంటె ఎంతో ముఖ్యమైనదని నా అభిప్రాయం.

*

నాకు కలిగిన స్వీయానుభవం ఏమిటంటే ఎవరైనా పూర్తిగా ఏకాగ్రతలో భగవంతుడితో తాదాత్మ్యస్థితిలో వుండగలరు, వారు భౌతికంగా ఏ పని చేస్తున్నాసరే. అయితే దీనికి కొంత అభ్యాసం కావాలి. ఇలా వుండగలగాలంటే అనవసరమైన వ్యర్థప్రసంగాలు మానుకోవాలి. మనలను భగవంతునకి దూరం చేసేది పని కాదు, పనికిమాలిన ప్రసంగాలు.

ప్రశ్న: అమ్మా, నేను నా కుర్చీలో కూర్చొని, నీటి మీద వెన్నెల పడి ఆడుకుంటూన్న దృశ్యాన్ని గురించి ఆలోచించినట్లైతే బాగుండేది కదా!



పుష్పం: రూపాంతరం

నా గురించి యిలా అంటుంటారు: "ఆమెకు గాఢమైన కోరికలుండేవి, ప్రపంచాన్నే మార్చాలని ఆమె కోరేది." అయితే, ప్రపంచం సుదీర్ఘంగా, నెమ్మదిగా సాగే ప్రక్రియతో తప్ప మరో విధంగా మార్పు చెందటానికి యిచ్ఛగించదు. ఆ మార్పు కూడ యెంత నింపాదిగ చోటు చేసుకోవాలంటే ఒక తరంలో జరిగే మార్పు తరువాతి తరానికి గమనించలేనంత మందకొడిగ నుండాలి.

నా కనిపిస్తుంది, ప్రకృతి జాగు చేస్తుందని, దుబారా చేస్తుందని. కాని ప్రకృతి అనుకుంటుంది, నేను చాలా తొందరపడుతున్నానని, చాలా యిబ్బంది కలిగిస్తున్నానని, నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నానని.

నేను చెప్పాలనుకున్న దాన్నంతా నన్ను వ్రాయనీ; చేయవలసిన దాన్నంతా ముందుగానే చెప్పనీ....

CWM 13:49-50

శ్రీమాత



శ్రీమాత

శ్రీమాత: అంతకన్నా మంచిది, అసలు దానిని గురించి ఆలోచించకుండా, దివ్య సౌందర్యంపై కేంద్రీకరించడం.

శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

ఇది నీకు తెలిసిందా?

ఒక క్రొత్త శరీరంలో చైత్యపురుష సత్త (అంతరాత్మ) జన్మించిన ప్రతిసారి తన వ్యక్తిత్వాన్ని పరిపూర్ణం చేసుకునేందుకు, అభివృద్ధిపరచుకుందుకు సహకరించే ఒక క్రొత్త అనుభవాన్ని పొందాలనే తపనతో అది ప్రవేశిస్తుంది. ఇలా చైత్యపురుష సత్త ఒక జన్మ నుండి మరొక జన్మకి ప్రయాణిస్తూ రూపుదిద్దుకుంటుంది.

అది భౌతిక శరీరంలోకి దిగిరావటమంటే తప్పక అది చీకటిలోకి, అజ్ఞానంలోకి, అచేతనలోకి దిగటమే. అది ఏ అనుభవం కోసం శరీరంలోకి ప్రవేశించిందో ఆ శరీరాన్ని ఉపయోగించుకొనేందుకు శరీరంలోకి కొద్దిపాటి చేతననైనా ప్రవేశపెట్టటానికి దీర్ఘకాలం పరిశ్రమించవలసి ఉంటుంది కాబట్టి శరీరానికి ఎంతటి సమర్థవంతమైన, సుస్పష్టమైన, వివేకవంతమైన వైఖరితో శిక్షణనిస్తే అది అంతట అంతరాత్మ ఎదుగుదలకు, దాని వికాసానికి, దాని ఉద్దీపనానికి సహకరిస్తుంది.

శారీరక సంస్కరణ అనేది శరీరకణాల లోనికి చైతన్యాన్ని ప్రవేశపెట్టే ప్రక్రియ. ఇది మనిషికి తెలియవచ్చు, తెలియకపోవచ్చు, కాని వాస్తవం. మనం మన సంకల్పానికి అనుగుణంగా మన దేహకండరాలని కదిలించడానికి ఏకాగ్రత వహిస్తే మన శరీరాంగాలు మరింత సానుకూలమైనవిగా వాటిల్లో చురుకుదనాన్ని, బలాన్ని, నిరోధకశక్తిని లేక సహజంగా వాటికుండని సులభంగా మలచుకునే శక్తిని పెంపొందించేందుకు పరిశ్రమించినపుడు, ఇంత క్రితం లేని చేతనను శరీరకణాల్లోకి ప్రవేశపెట్టగలం. ఆ విధంగా మన శరీరాన్ని అధిక సమతుల్యత గల, గ్రహణశక్తిగల ఉపకరణంగా మార్చగలం. అది తన క్రియాకలాపాల ద్వారా అభివృద్ధి చెందుతుంది. ఇదే శారీరక సంస్కరణ యొక్క ప్రాథమిక ఉపయోగం. అయితే ఈ ఒక్క పనే శరీరంలో చేతనను కలుగచేయకపోయినా అది సర్వతోముఖంగా ఉపకరిస్తుంది. ఇది చాలా అరుదైనది. నేను మీకు చాలా సార్లు చెప్పి ఉన్నాను. ఒక మేధావి చైత

న్యాన్ని తన మస్తిష్కంలోకి ప్రవేశపెట్టినట్లుగా, ఒక చిత్రకారుడు చాలా గొప్ప చైతన్యాన్ని తన చేతుల్లోకి ప్రవేశపెట్టగలడు. అయితే ఇవన్నీ కొంతవరకు దృగ్గోచరమైన విషయాలు, కానీ శారీరక సంస్కరణ సార్వత్రికమైనది, సర్వులకు ఆచరణీయమైనది. మనిషి ఎప్పుడైతే శారీరక సంస్కరణలకి సంబంధించిన సంపూర్ణమైన, అద్భుత ఫలితాన్ని చూస్తాడో, ఎప్పుడైతే ఈ శరీరం తనకు తానుగా ఎంత మేరకు సమగ్రపరచుకోగల సామర్థ్యం కలిగివున్నదో గ్రహించగలుగుతాడో, అప్పుడు ఈ సారభూతపదార్థం లోనికి ప్రవేశించిన చైత్యపురుషుడు పనిచేయడానికి శరీరం ఎలా ఉపయోగపడగలదో అర్థం చేసుకొంటాడు. ఎప్పుడైతే అంతరాత్మకు ఒక సమర్థవంతమైన, పొందికైన ఉపకరణం దాని పూర్తి బలంతోను, సానుకూలమైన మృదుత్వంతోను, ఎన్నో సంభావ్యతలతోను ఉన్నది లభిస్తే అప్పుడు ఆ అంతారాత్మ కార్యం అత్యంత సౌకర్యవంతంగా పరిణమిస్తుంది.

శారీరక శిక్షణను కొనసాగించేవారంతా ఈ ఉద్దేశ్యంతో, ఇదే అవసరంతో చేస్తున్నారని నేననను. ఎందుకంటే, చాలా కొద్దిమందికే దాని ఫలితమేమిటో తెలుసు. తెలిసినా తెలియకపోయినా దాని ఫలితం మాత్రం ఇదే. అంతేగాక, సునిశిత జ్ఞానం కలిగి శారీరక శిక్షణను పొంది, ఒక క్రమబద్ధమైన తెలివైన పద్ధతిలో అభ్యసించిన వ్యక్తి శరీర కదలికలను గమనించినట్లైతే ఆ శరీరంలో ఇతరులలో లేని ప్రత్యేకమైన ఒక తేజస్సు, ఒక చైతన్యం, ఒక జీవాన్ని నీవు చూస్తావు.

ఎప్పుడూ, అన్నింటినీ బాహ్యదృష్టితో చూసి చెప్పే మనుష్యులుంటారు. ఉదాహరణకు, భౌతికంగా కఠోరమైన శ్రమచేసే కార్మికులు వాళ్లు చేసే పనిలో భాగంగా అధిక బరువు మోసుకెళ్ళటం నేర్చినవాళ్ళు కూడా కండరాలను దృఢపరచుకొంటారు. ఉన్నత ధనికవర్గీయులు లేదా ఉచ్ఛవంశీకులుగా పిలువబడేవారు ఫలానా లక్ష్యమంటూ లేకుండా బయటకు ఎట్లాంటి ప్రయోజనకరమైన ఫలితాన్ని ఇవ్వని వ్యాయామాలను చేసేవారిలా కాలాన్ని వృథా చేయటం కంటే, ఈ కార్మికులే ఎంతో కొంత ఉత్పత్తి చేసి చూపిస్తారని అంటారు. ఇది అజ్ఞానం. ఒక ప్రత్యేకమైన పరిమిత ప్రయోజనం కోసం కండరాలకు శిక్షణనిచ్చి వాటిని పెంపుచేయాటానికి, సావధానంగా శిక్షణనిచ్చి, సామరస్యంతో, పొందికతో శరీరంలోని ఏ భాగము పని చేయకుండా ఉండనివ్వని సమగ్రమైన కార్యక్రమానికి మధ్య ఎంతో వ్యత్యాసమున్నది.

శ్రామికులు, రైతులు ఇలా ప్రత్యేకమైన వృత్తులకు చెందినవాళ్ళు ఒక నిర్దిష్టమైన

స్థాయి వరకు కొన్ని కండరాలను మాత్రం పెంచుకుంటారు. కానీ వారికి వృత్తిపరమైన అంగవైకల్యాలు సంభవిస్తాయి. ఏవిధంగానూ ఇది వాళ్ళ చైత్యపురుష సత్త అభివృద్ధికి సహకరించదు. అయినప్పటికీ జీవితం మొత్తం ఆవశ్యకంగా చైత్యపురుషసత్త అభి వృద్ధిలో సహకరించినా, అది ఎంతటి అచేతనా స్థితిలో ఎంత నెమ్మదిగా నెరవేస్తుం దంటే, ఆ చైత్యపురుష సత్త తన లక్ష్యసిద్ధి కోసం మళ్ళీ మళ్ళీ తిరిగి రావలసి వస్తుంది — అనిశ్చితంగా. కాబట్టి పొరబడుతున్నామనే భయం లేకుండా చెప్పగలిగేది ఏమంటే శారీరక సంస్కారణ అనేది శరీరానికి సంబంధించిన సాధన అని, అన్ని సాధనలు తప్పకుండా లక్ష్యసిద్ధికి దోహదపడగలవని.

నీ వెంత చైత్యన్యవంతంగా దానిని అభ్యసిస్తావో అంత వేగంగా, అంత సహ జంగా ఫలితం వుంటుంది. దీనిని గ్రుడ్డిగా చేసినా సరే, నీ ఎదుట వున్న వ్రేళ్ళ చివ ర్లను లేదా నీ పాదాలను లేదా నీ ముక్కు చివర కంటె మించి చూడలేకపోయినా సరే... సర్వతోముఖాభివృద్ధికి నీవు సహాయపడతావు.

చివరిగా, ఏ రకమైన క్రమశిక్షణనైనా తీవ్రంగా, చిత్తశుద్ధితో, సావధానంగా అనుసరించితే అది ఈ జీవితం భూమిపై దాని లక్ష్యాన్ని అతి శీఘ్రంగా పొందటానికి, క్రొత్తజీవితాన్ని అందుకోవటానికి సంసిద్ధమవ్వటంలో సహాయకారి అవుతుంది. వ్యక్తి క్రమశిక్షణతో ఉండటమంటే, అతిమానస సత్యంతో సంబంధాన్ని, నూతన జీవిత ఆగమనాన్ని వేగవంతం చేయడం అన్న మాట.

ఈ భౌతిక శరీరం అనేది నిజానిక 'ఆత్మ' యొక్క అనంత జీవితం యొక్క వికృతరూప స్వరూప ఛాయ. కానీ ఈ భౌతిక శరీరం ప్రగతిశీలమైన అభివృద్ధికి సమర్థత గలిగి వుంటుంది. వైయక్తికమైన రూపనిర్మాణం ద్వారా భౌతిక సారపదార్థం వికసిస్తుంది. అది ఒకనాటికి ఇప్పుడు మనకు తెలిసిన భౌతిక జీవితానికి అవతరించబో తున్న అతిమానస జీవనానికి మధ్య వారధిని నిర్మంచగల సమర్థత గలది.

శ్రీమాత

అనువాదం సిహెచ్. హర్షవర్ధన్ రాజు

బాహ్యసత్తను స్థిమితంగా నుంచడం ఎలా?

1973 మార్చి 14 న ఒక సాధకుడు శ్రీమాతతో తాను పనిచేసే విభాగంలో ఏర్పడిన సామరస్య లోపం గురించి, తద్వారా అతనిలో ఏర్పడిన ఆంతరిక ఆందోళన గురించి మాట్లాడాడు. సంభాషణ ముగిసినప్పుడు శ్రీమాత ఈ క్రింది విధంగా చెప్పారు:

నిజంగా ఇది ఒక క్లిష్టసమయం. మనం చాలా చాలా నిశ్చలంగా వుండితీరాలి. నీకు నా పాత మంత్రాన్ని చెప్పబోతున్నాను. అది నీ బాహ్యసత్తను స్థిమితపరుస్తుంది.

ఓం – నమో – భగవతే

నాకీ మూడు పదాలు ఈ అర్థాన్ని స్ఫురింపజేస్తాయి.

ఓం — నేను పరమ ప్రభువును ప్రార్థిస్తున్నాను.

నమో — ఆతడికి నమస్సులు.

భగవతే — నన్ను దివ్యంగా రూపొందించు.

ఆ మంత్రానికి నా భావానువాదం ఇదే.... నాకు సంబంధించి సర్వాన్ని శాంతపరచే శక్తి దానికుంది.

*

నిశ్శబ్దంలోనే మనిషి ఏదైనా తెలుసుకోగలడు, చేయగలడు. వ్యతిరేకతతో, హింసతో జరుపబడేదంతా పెడత్రోవ పట్టడం — మూర్ఖత్వం అవుతుంది. మనలో దైవసాక్షాత్కారం జరిగిందనటానికి తొలి సంకేతం, ప్రశాంతత.

*

స్తబ్దతను ప్రశాంతత అనుకొని తికమక పడవద్దు. ప్రశాంతత స్వయంశక్తి సమన్వితం, నిశ్చలం, సచేతనమైన శక్తి, ఆవేశంపై నియంత్రణ. అచేతన ప్రతిక్రియలపై నియంత్రణ, పనిలో ప్రశాంత నైపుణ్యతకు మూల వనరు, పరిపూర్ణత కోసం ఆవశ్యకమైన పరిస్థితి.

CWM 12:447,114; 14:134

శ్రీమాత

అనువాదం సిహెచ్. హర్షవర్ధన్ రాజు

పసివాని కలలపై చన్నీళ్ళు చల్లవద్దు

ఎవరైనా చిన్నతనంలో ఆరోగ్యవంతంగా పుట్టినట్లయితే, అంటే తనలో చైతన్యవంత మైన చైత్యపురుష సత్తతో పుట్టినట్లయితే, ఆ పసిపిల్లవాని కలలలో ఒక ఆకాంక్ష వుంటుంది. ఆ పసిపిల్లవాని చైతన్యానికి అది ఆశ వంటిది. కురూపితనం లేని సౌందర్యం కోసం, అన్యాయం లేని న్యాయం కోసం, పరిమితులు లేని మంచితనం కోసం ఆకాంక్ష అది. చైతన్యవంతమైన నిత్య విజయం, ఒక నిరంతర అద్భుతం అది. పసితనంలో ఉన్నప్పుడు వ్యక్తి అద్భుతాల గూర్చి కలలు గంటాడు. కుటిలత్వం అంతా మాయం కావాలని, ప్రతిదీ కాంతివంతంగా, అందంగా, ఆనందంగా ఉండాలని కోరుకొంటాడు. ఆనందంగా ముగిసే కథలు కావాలని కోరుకొంటాడు. అవసరమైన ప్పుడు గాలిలోకి తేలిపోవాలని, కావలసిన చోట ఉండగలగాలని, వక్రమార్గం పట్టే పరిస్థితులను చక్కదిద్దాలని, రోగులకు చికిత్స చేయాలని కలలు కంటాడు. పసితనంలో అన్ని రకాల కలలు కంటాడు. సాధారణంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారి కలలపై చన్నీళ్ళు చల్లుతారు. “ఓ! అది కల మాత్రమే. అది నిజం కాదు” అని వారంటారు. సరిగ్గా దీనికి వ్యతిరేకంగా మాట్లాడాలి. “ఔను. నువ్వు దీనిని సాధించాలి. అది సంభవమే కాక ఈ పనులు చేసే నీలోని భాగంతో నువ్వు కలుసుకోగలిగితే ఇది తప్పక సిద్ధిస్తుంది.” ఇది నీ జీవితాన్ని నడిపించాలి, దానిని వ్యవస్థీకరించాలి. మామూలు ప్రపంచం మాయ అని పిలిచే వాస్తవం వైపు నువ్వు పెరుగుతావు.

నిరుత్సాహం, పామరజన సంబంధమైన ప్రపంచ జ్ఞానంతో పిల్లలను సామాన్యు లుగా చేయడం, అదొక అలవాటుగా మారనీయడం, వారు ఏదైనా బాగుగా సాధిస్తుంటే, “అది ఆలా జరుగదు” అనే భావాన్ని వారిలో కలిగించడం, ఎవరైనా దయతో వ్యవ హరిస్తుంటే వారు మారతారు అనే భావన కలిగించడం, ఎవరైనా ఏ పనైనా బాగా చేస్తుంటే, “రేపు అంతకన్నా బాగా చేయలేకపోవచ్చు” అనే భావాన్ని కలగించడం లాంటివి జీవికి వినాశనాత్మకమైన యాసిడ్ వంటిది. భవిష్యత్తు సంభావ్యతలలో ఆశ, నమ్మకం, నిశ్చయత్వం తొలగించడమే అవుతుంది.

పసివాడు ఉత్సాహవంతంగా పనిచేస్తున్నప్పుడు చల్లనీళ్ళు పోయవద్దు. “జీవితం ఇలా ఉండదు” అని ఎప్పుడూ అతనితో చెప్పవద్దు. అతనిని ప్రోత్సహించాలి. “ప్రస్తుతం పరిస్థితులు అలా లేవు. అవి అసహ్యంగా వున్నాయి, కాని వాటి వెనుక

సౌందర్యం వుంది. ఆ సౌందర్యం వ్యక్తం కావడానికి ప్రయత్నిస్తున్నది” అని అతనితో అనాలి. “ఈ సౌందర్యాన్ని నువ్వు ప్రేమించాలి, నీ వైపు ఆకర్షించుకోవాలి. దీనిని నీ స్వప్నాల, నీ ఆశల లక్ష్యంగా చేసుకోవాలి” అని అతనితో చెప్పాలి.

నువ్వు చిన్నతనంలో వుండగా ఈ పని చేస్తే, పెద్దయిన తరువాత దుష్ఫలితాలను పారద్రోలడం అంత ఎక్కువ కష్టంగా వుండదు. చెడు విద్య దుష్ఫలితాలను, నిరుత్సాహపూరితమైన, పామరజన సామాన్య పరిజ్ఞాన దుష్ఫలితాలను పారద్రోలాలి. జీవితం నుండి మంచి కోరడం లేదని, జీవితం నిస్సారంగా వుంది, విసుగు పుట్టిస్తుంది అని ఆశల్ని వ్యతిరేకించే క్షణాలున్నాయి, అందాలనే ఎండమావులు నిండిపోయి వుంటాయి మొదలగు పరిస్థితులు రాకుండా చూసుకోవాలి. దీనికి విరుద్ధంగా ఒక శిశువుతో (లేదా నువ్వు పసివాడివి కాకపోతే నీతోనూ) ఇలా చెప్పాలి: “నాలోని ప్రతిదీ అవాస్తవం, అసంభవం, భ్రాంతి అనిపిస్తుంది. అదే నిజం, అదే నేను పోషించుకోవాలి.” ఏ అశక్తతా ఆవరించకుండా వుండాలి. ఒక దుష్టసంకల్పం వల్ల వెనుకంజ వేయకుండా ఉండాలి. ఈ ఆకాంక్షలు ఉన్నప్పుడు, అదే సత్యం, దానినే సాధించాలి.

అప్పుడు శరీర కణాలలో శ్రద్ధ మేలుకుంటుంది. అప్పుడు శరీరంలోనే ఒక ప్రతిస్పందనను నువ్వు గమనిస్తావు. తనలోని సంకల్పం సహాయపడితే, సమర్థతతో మార్గాన్ని చూపితే, అప్పుడు దాని పరిమితులన్నీ నెమ్మదిగా అంతరించిపోతాయి.

తానొక అందమైన కల కన్నానని, ఆ కలలో తనకెన్నో శక్తులున్న భావం కలిగిందని, అక్కడ అన్నీ సౌందర్యంతో భాసిస్తున్నాయి అని పసివాడు చెప్పినప్పుడు, “ఓ జీవితం అలా వుండదు” అని వాడితో చెప్పవద్దు. అది చాలా తప్పు. దీనికి విరుద్ధంగా “జీవితం అలాగే ఉండితీరాలి. జీవితం అలాగే వుంటుంది” అని వాడితో చెప్పాలి నువ్వు.

CWM 9:162-65

శ్రీమాత

అనువాదం: యజ్ఞన్న

చనిపోయివారి మధ్య సంభాషణ — దిన్‌షా, పెరిజేడ్

దిన్‌షా

పెరిజేడ్ , ఇరాన్‌లోని సాయంసంధ్యలు మన మజిందెరాన్ నగరంలో మాదిరిగా ఇంతగా చల్లగానూ, ఉల్లాసకరంగానూ ఉండేవి కావు. ఇక్కడ మన ఉద్యానవనాలు పుష్పశోభితమై మరింత ఆకర్షణీయంగా, మరింత మాధుర్యంతో సువాసనలు వెదజల్లే పుష్పాలతో శాంత నదీతీరంలో తివాసీలాగా పరచుకుని ఉన్నాయి; పక్షులు ప్రతిచెట్టు పైన పాటలు పాడుతూ భూలోకానికి చెందని ఆహ్లాదభరితమైన కిలాకిలా రావాల మధురస్వరాలతో రోజంతా శ్రావ్యంగా శ్రవణానందం చేస్తాయి. అవి వివిధ రకాలైన ఈకలతో, రంగులతో కంటికి ఇంపును కలిగిస్తుంటే వాటి లాలిత్యం, వైభవంతో వాటి పేరేమిటో, జాతేమిటో తెలుసుకోవాలనే కోరిక లేకుండా ఒక వ్యక్తి సంతృప్తి చెందుతాడు. ఇక్కడ మనం రెండువేల సంవత్సరాలు దేవతల ఆనందాన్ని చవి చూశాం. కాని ఎందువల్లనో తెలియదు, నాకు ఇరాన్ జ్ఞాపకాలు గుండెల్లో తొలుస్తు న్నాయి. ఒక చోట నుండి మరొక చోటకి సంచరించే ఆఫ్రాసియన్ తెగలు తిరుగాడే టార్టర్ల గుడారాలు, జిహాన్ జలాలు, సమృద్ధమైన డమాస్కస్ నగరం, మన సొంత నగరాల్లో పక్క పక్కన నివసించే మన తల్లిదండ్రుల ఇళ్ళు, మనమేమో బాల్కనీలలో వంగి గుసగుస లాడుకోవటం, ఇవన్నీ తిరిగి ఉంటే బాగుండు ననిపిస్తున్నది.

పెరిజేడ్

పాతకాలంలో మనం తరచూ తిరిగే చోట్లకు పోవడం నాకూ ఇష్టమే. దానర్థం నాకు మజిందెరాన్ అంటే విసుగుపుట్టి కాదు, కాని మరణాంతకమై, వేగంగా జారిపోయే టటువంటి దానిలోని ఆనందాన్ని తిరిగిపొందమని నన్ను ఏదో పిలుస్తున్నది, అది అతి కష్టంతో వేగంగా అందుకోగలిగినదీ మరియు పరిపూర్ణమైన ఆనందం యొక్క ఆస్వాదనా భావన లేనిదీ మాత్రం కాదు. అయినా దిన్‌షా, రెండువేల సంవత్సరాలు గడిచిపోయినై, మనం వెళ్ళేముందు మనం ప్రేమించినవాటి స్థానంలో ఏవేవి వచ్చి చేరినాయో తెలుసుకోవలసిన అవసరం ఉంది కదా! వేరు మనుషులు, వేరు భాషలు, వేరు బుద్ధిప్రవృత్తులు, బహుశా వాటిని స్వాధీనపరచుకుని ఉండవచ్చు.

మనం ఆ ప్రపంచానికి తగినవారం కాకుండా, అపరిచితులుగా అక్కడకి వెళ్ళవలసి ఉంటుంది.

దిన్‌షా

నేను వెళ్ళి చూసి వస్తాను పెరిజేడ్, నువ్వు నా కోసం నిరీక్షించు.

దిన్‌షా

పెరిజేడ్, పెరిజేడ్ మనం భూమి మీదకు తిరిగి వెళ్ళవద్దు, ఎప్పటికీ ఇక్కడే ఈ మజిందెరాన్‌లో ఉండిపోదాం, నేను భూమిని చూశాను, అది మారిపోయింది. ఓ నా దేవతా, నీ వెంత తెలివైనదానివి!

పెరిజేడ్

ప్రియుడా, నీవు ఏం చూశావు లేదా ఏం విన్నావు?

దిన్‌షా

నేను సౌందర్యరహిత ప్రపంచాన్ని చూశాను. ఇళ్ళు న్యూనతతో, అసహజంగా ఉన్నాయి లేదా డాంబికం చూపిస్తూ కృత్రిమమైన అభిరుచులను లక్ష్యంగా చేసుకున్నవై ఉన్నాయి. మైళ్ళ కొద్దీ ఇటుక, అరుదుగా అక్కడక్కడ కాస్త పచ్చదనం, ఇవీ ఆ నగరాలు. వాటి నుండి ఎప్పుడూ రణగొణ ధ్వని వినపడుతూ హోరుమంటుంది. మెరిసే వేడి మంటల కొలుములు, లోహాల మోతలు. ఆకాశాన్ని కప్పివేసిన ఒక మందమైన హానికారక పొగ; ఉద్యానవనాలు ధ్వంసం చేయబడినాయి, వాటిలో అందం లేదు. మనుషులు వారి సంతోషహీనమైన ముఖాల కంటే వికారమైన అంగాల కంటే, ఏవగింపు కలిగించే అమర్యాదకరమైన వస్త్రధారణతో ఉన్నారు. అది అనాగరిక ప్రపంచం; పాతాళం నుంచి భూతాలు భూతలం పైకి భానుడి కిరణాల వెలుగులో పనిచేయడానికి వచ్చాయి.

పెరిజేడ్

దిన్‌షా, ఇది ఎంతో విచారం కలిగించే వార్త, అందువల్ల మనం తప్పక వెళ్ళాలి.

ఈ ప్రేరేపణలు మనకు సూచనలని తెలియడం లేదా?

దిన్‌షా

అవును, కాని పెరిజేడ్, ఇటువంటి ఏవగింపు కలిగించే చోట కాదు కదా హృదయం సేద తీరేది, ఇరాన్‌లోని ఎత్తైన గోపురాలలో, ఉద్యానవనాలలో కదా.

పెరిజేడ్

కావచ్చు, దిన్‌షా, మనం కిందికి వెళ్ళేది ప్రపంచాన్ని తిరిగి అది పూర్వం ఏ విధంగా ఉందో అ విధంగా చేయడానికి, ఒక సుందరమైన స్థలంగా, గానామృతంతో, ఆనందమయం గావించడానికి. నీవు వర్ణించిన ప్రపంచంలోకి మనం వెళ్ళడం తటస్థిస్తే, మనం కోరుకున్న ప్రకారం అది పూర్తిగా మారేవరకూ మనం వెనుకకు తిరిగి రావడానికి కచ్చితంగా ఇష్టపడం.

దిన్‌షా

ఎప్పుడూ నీవు చెప్పే విధంగానే పెరిజేడ్, నీ వన్నది సరైనదనే నాకూ అనిపిస్తున్నది. మనం వెళ్ళడానికి తయారవుదాం.

CWSA 1:473-75

శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

కామవాంఛా ప్రవృత్తుల మీద ప్రశ్నలు — సమాధానాలు

ప్రశ్న: యోగంలో కామవాంఛలు పెద్ద అడ్డంకి అనే మాట నిజమేనా?

సమా: పెద్ద అడ్డంకులలో ఒకటి అనే మాట నిజం.

ప్రశ్న: ఆహారం ఎక్కువగా తీసుకుంటే కామవాంఛ ఎక్కువ కావటం, తక్కువ తీసుకుంటే తక్కువ అవటం జరుగుతుందా?

సమా: కొన్ని రకాల ఆహారపదార్థాలు తింటే అవి దానిని ఎక్కువ చేస్తాయని భావించడం జరుగుతుంది. ఉదాహరణకు, మాంసం, ఉల్లిపాయలు, మిరపకాయలు మొదలైనవి.

ప్రశ్న: అత్యాశ, కోపం, అసూయ మొదలైనవి కామవాంఛను అనుసరించి ఉంటాయా?

సమా: సర్వసాధారణంగా అవి కామవాంఛతో పాటే ఉంటాయి, కాని ఎల్లప్పుడూ కాదు.

ప్రశ్న: శ్రీమాత ఇలా చెప్పారు, "కామం వంటి ఆకస్మికంగా వచ్చే ప్రవృత్తులకు బలం సర్వసాధారణంగా జనులు వాటి మీద ఎక్కువ ధ్యాస పెట్టడం మూలంగా వాటికి కలుగుతుంది." ఎక్కువ ధ్యాస పెట్టడం అంటే ఏమిటి?

సమా: ఎల్లప్పుడూ అతడు వాటిని గురించే ఆలోచిస్తూ, వాటితో సతమతమౌతూ ఉంటే, అది ఎక్కువగా ధ్యాస పెట్టటం అవుతుంది.

ప్రశ్న: ఎక్కువగా ధ్యాస పెట్టడం నుంచి తప్పించుకోవటానికి అతడు ఏం చేయాలి?

సమా: అతడు దాని నుండి విడివడి, కామం గురించి తక్కువ ఆలోచిస్తూ, దైవం గురించి ఎక్కువ ఆలోచించాలి.


ప్రశ్న: శ్రీమాత కామసంబంధమైన ఆలోచనల గురించి ఏం చెప్పిందంటే "వాటిని బలవంతంగా అణచి, లోపల పట్టి ఉంచి వాటి మీద కూర్చోవడం" తప్పు అని. ఎవరైనా ఒక వ్యక్తి ఏ విధంగా వాటిని తనలో పట్టి ఉంచి, వాటి మీద కూర్చోగలుగుతాడు?

సమా: ఆ పదాలే వివరించి తెలుపుతున్నాయి. నీవు పూర్తిగా కామభావనలలో పడి ఉండిపోయి, ఏ విధమైన ఆచరణలోనూ వాటిని అభివ్యక్తం కానీయకుండా వాటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తే, అది వాటిని లోపల పట్టి ఉంచి, వాటి మీద కూర్చోవడం



శ్రీఅరవిందులు ఏ ఒక్క దేశానికో చెందినవారు కారు, యావత్ప్రపంచానికీ చెందిన వారు. వారి ఉపదేశం మనలను మహోన్నత భవిష్యత్ వైపుకి నడిపిస్తుంది.

శ్రీమాత



పుష్పం: అవతారం

దైవసాక్షాత్కారం సాధ్యమా అనే విషయాన్ని నమ్మడమా, నమ్మకపోవడమా అనే దానిపై మీమాంసతో అసలు యదార్థం మారదు.

ఒక వేళ దైవం మానవ దేహంలో సాక్షాత్కరించడానికి యెన్నుకుంటే మానవుడికి దానిని అంగీకరించాలా లేక తిరస్కరించాలా అని కలిగే ఆలోచన దైవనిర్ణయాన్ని కించిత్తైనా ప్రభావితం చేయలేదు. ఒక వేళ దైవం మానవదేహంతో జన్మిస్తే, మానవుడు దానిని నమ్మక నిరాకరించినా, యదార్థం యదార్థం గాకుండా పోదు. అలాంటప్పుడు ఆరాటపడి అలజడి చెందవలసినదేముంది.

అనుకూల ప్రతికూల వైఖరులు లేని ఒక సంపూర్ణ ప్రశాంత నిశ్శబ్ద స్థితిలో మాత్రమే చైతన్యం సత్యాన్ని గ్రహించగలదు.

CWM 1350

శ్రీమాత

అవుతుంది. అదే విషయం కోపానికి లేక ఇతర వాంఛామయ ప్రవృత్తులకూ వర్తిస్తుంది. వాటిని తరిమికొట్టాలి, నీలో ఉంచుకోవడం కాదు.

ప్రశ్న: చెడుగమనాన్ని నిగ్రహించడం మూలంగా అది కేవలం దానిని అణచి వేస్తుంది, కాని దానిని సంపూర్తిగా తొలగించాలంటే దానిని తిరస్కరించాలని మీరు చెప్పారు. అటువంటప్పుడు కామం, క్రోధం, భయం మొదలైనవాటిని నిగ్రహించడం వలన ఏం ప్రయోజనం?

సమా: నీ తిరస్కరణ సాధ్యం కాకపోతే, నీవు దానిని నిగ్రహించాలి. నిగ్రహం కనీసం నీవు దానికి బానిస కావడం నుంచి ఆపుతుంది. ఒకసారి నిగ్రహం కుదిరిన తరువాత, అప్పుడు దానిని తిరస్కరించడం తేలికగా సాధ్యమౌతుంది. నిగ్రహం లేకపోతే తిరస్కరణ ఫలవంతం కాదు.

ప్రశ్న: కామశక్తిని "ఓజస్" గా మార్చే పద్ధతి ఏమిటి?

సమా: అది ఒక పద్ధతిగా జరగాలంటే దానికి మార్గం తపస్సు చేసి (మనోవాక్కాయ కర్మలపై స్వయం-నియంత్రణ) వీర్యశక్తిని ఇచ్ఛ ద్వారా ఊర్ధ్వముఖంగా మళ్ళించడం. కాని మహాశక్తి అవతరణ ద్వారానే దానిని బాగా చేయవచ్చు. మహాశక్తిని కామ కేంద్రం మీద పని చేసేటట్లు చేసి, పర్యవసానంగా దానికి పరివర్తన కలిగించాలి, ఈ యోగంలో ఇతర విషయముల మాదిరిగానే.

Elements of Yoga, Chapter XIII

శ్రీఅరవిందులు

అనువాదం డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఏం జరిగింది,1926 నవంబరు 24 న

1926 నవంబరు ప్రారంభం నుండి ఊర్ధ్వశక్తి వత్తిడిని భరించడం కష్టమవడం ప్రారంభించింది. చివరకు ఆ గొప్ప రోజు, శ్రీమాత ఎన్నో సంవత్సరాల నుండీ నిరీక్షిస్తున్న ఆ గొప్ప రోజు 1926 నవంబరు 24 న వచ్చింది. సూర్యుడు అస్త మించాడు ఇంచుమించుగా. ప్రతి ఒక్కరు తమ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. కొందరు నడవడానికి బీచ్ ఒడ్డుకు వెళ్ళారు. శ్రీమాత కబురు చేశారు శిష్యులందరికీ, సాధ్యమైనంత త్వరలో ధ్యానం చేసే వరండాలో సమావేశం కమ్మని. ఈ వార్త అందరికీ చేరడానికి ఎక్కువ సమయం పట్టలేదు. 6 గంటలకు చాలా వరకు సమావేశ మయ్యారు. అప్పుడు చీకటి పడుతోంది. వరండాలో గోడపై శ్రీఅరవిందుల కుర్చీ వెనుక, వారి తలుపు దగ్గర, ఒక నల్లని సిల్కుతెర వ్రేలాడదీయబడి ఉన్నది. దానిపై 3 చైనా డ్రాగన్‌ల బంగారు జలతారు అల్లిక పని ఉన్నది. దానిలో ఒక డ్రాగన్ తోక, రెండవ డ్రాగన్ నోటికి చేరువగా ఉన్నట్లు, తెర ఒక చివరి నుండి రెండవ చివరి వరకు, ఆ డ్రాగాన్లు వ్యాపించి ఉన్నట్లు చూపబడింది. తర్వాత మాకు తెలిసింది చైనాలో ఒక భవిష్యవాణి ఉన్నదని, ఈ మూడు డ్రాగన్లు (భూ ఆవరణకు, బుద్ధి ఆవరణకు, ఆకాశ ఆవరణకు చెందినవి) కలుసుకున్నప్పుడు, భూమిపై సత్యం, తనకు తానుగా, అభివ్యక్తమౌతుందని. ఈ రోజున, 24 నవంబరున, సత్యం దిగువకు వస్తోంది. అందుచే వ్రేలాడుతున్న ఈ సిల్కుతెర ప్రత్యేకతను సంతరించుకుంది.

శిష్యులు సమావేశమయ్యాక వాతావరణంలో ప్రగాఢ నిశ్శబ్ధం ఆవరించింది. చాలమంది చూశారు ఒక కాంతి వెల్లువ — సముద్రం వంటి కాంతి వెల్లువ — పైనుండి దిగువకు రావడం. అక్కడ ప్రతి ఒక్కరు వారి తలపై, ఒక విధమైన వత్తిడిని అనుభూతి పొందారు. ఏదో ఒక విద్యుత్ శక్తితో వాతావరణమంతా ఆవహింప బడింది. ఆ నిశ్శబ్దంలో, ఆ వాతావరణంలో, విద్యుత్ ఆవహింపబడిన వాతావరణంలో, సంపూర్ణ ఆకాంక్ష నిరీక్షణలతో కూడిన వాతావణంలో — సాధారణమే అయినా, ఈ రోజు అసాధారణంగా — లోనికి పోయే తలుపు వెనుక 'టిక్' అని శబ్దం వినబ డింది. ఎదురు చూపులు తీవ్రమైనాయి. సగం తెరిచిన తలుపు నుండి శ్రీమాతారవిం దులను చూడగలుగుతున్నాము. శ్రీమాత కనుసైగతో శ్రీఅరవిందులను వెలుపలకు అడుగు వేయమన్నారు. అటువంటి సైగతోనే శ్రీఅరవిందులు శ్రీమాతను కూడా

అడుగు వేయమన్నారు. నెమ్మదిగా, ఠీవిగా అడుగువేసి శ్రీమాత బయటకు వచ్చారు. ఆమె వెనుక శ్రీఅరవిందులు, తనదైన హుందాతో అడుగువేసి వచ్చారు. శ్రీఅరవిందుల కుర్చీ ముందు సాధారణంగా ఉండే చిన్న టేబుల్ ఈ రోజు తీసివేయబడింది. వారి కుడి వైపున ఒక చిన్న స్టూలుపై శ్రీమాత కూర్చున్నారు.

సంపూర్ణ నిశ్శబ్దం, సజీవ నిశ్శబ్దం, దివ్యత్వంతో పొంగి పొర్లుతున్న నిశ్శబ్దం. ధ్యానం కొనసాగింది, సుమారు 45 నిమిషాలు. తరువాత ఒకరి వెనుక ఒకరు శిష్యులు వంగి నమస్కరించారు శ్రీమాతకు.

ఆమె, శ్రీఅరవిందులు వారికి ఆశీర్వాదాలిచ్చారు. ఒక్కొక్క శిష్యుడు శ్రీమాతకు వంగి నమస్కరించినపుడు, శ్రీఅరవిందుల కుడిచేయి ముందుకు వచ్చేది — శ్రీమాత కుడిచేయి వెనుక — శ్రీమాత ద్వారా తను ఆశీర్వదించినట్లుగా. ఆశీర్వచనాల తరువాత అదే నిశ్శబ్దంతో లఘు ధ్యానం కొనసాగింది.

నిశ్శబ్ధ ధ్యానం, ఆశీర్వచనముల మధ్య వ్యవధిలో చాలమందికి స్పష్టమైన, ప్రత్యేకమైన, అనుభవాలు కలిగాయి. అంతా అయాక ఒక దివ్యస్వప్నం నుండి మేల్కొన్న అనుభూతి చెందారు, శిష్యులందరు. ఆ సన్నివేశ వైభవాన్ని, దివ్యత్వాన్ని, పరిపూర్ణ అందాన్నీ వారు అనుభూతి పొందారు. ఉత్తమ గురువు, తల్లి నుండి ఏ కొద్దిమంది శిష్యులో భూమిపై ఒక మూలన ఆశీర్వచనాలు పొందిన సన్నివేశం మాత్రమే కాదది. దాని ప్రాముఖ్యత, విశిష్టత, అంతకంటె చాలా చాల గొప్పది.

ఒక అధికతర చైతన్యం భూమిపై అవతరించినది సత్యం. మర్రిచెట్టులో మొలక త్వరగా చిగురించి అభివృద్ధి చెందినట్లు, అక్కడ ప్రగాఢ నిశ్శబ్దం నుండి, ఒక గొప్ప ఆధ్యాత్మిక కార్యం మొలకెత్తి త్వరగా అభివృద్ధి చెందడం ప్రారంభమయింది. ప్రతి చిన్న కదలికలో అతిలోక ఠీవి, అందం, వైభవంగల ఈ చరిత్రాత్మక సన్నివేశం — దివ్యక్రియాశీల నిశ్శబ్దంలో — తన ప్రాముఖ్యతను అందజేసింది, అక్కడున్న వారందరకు. ఈ దివ్యత్వం యొక్క ప్రగాఢ ముద్రను పొందారు అక్కడున్న ప్రతి ఒక్కరు. అది వారికి ఒక వెలలేని సంపద.

శ్రీఅరవిందులు, శ్రీమాత లోనికి వెళ్ళారు. వెంటనే దత్తా ఆ నిశ్శబ్దంలో ఉద్వేగంతో ఇలా మాట్లాడారు. "భగవంతుడు భౌతికంలోకి ఈ రోజున అవతరించారు".

24 నవంబరుకు, శ్రీమాతారవిందుల పుట్టిన రోజులతో సమాన ప్రాధాన్యత

నివ్వాలి. ఎందుకంటే, ఈ రోజున, శ్రీమాతారవిందుల ఉద్యమం విజయవంతమైంది. దీనికి చిహ్నంగానే, అధికతర చైతన్యశక్తి భౌతికంలోకి అవతరించింది. ఏ అధిమానస ఆనంద చైతన్యం శ్రీకృష్ణుని లీలా మానుష అవతారంలో ఉన్నదో, అదే చైతన్యం ఈ రోజున అవతరించింది. భౌతికంలోకి ఇది కల్పిస్తుందొక సంభావ్యతను — అతిమానస చైతన్యం, భౌతికంలోకి అవతరించడం. ఈ అవతరణ గురించి శ్రీఅరవిందులు రాశారు, తర్వాత అనేక సందర్భాలలో. అక్టోబరు 1935 లో ఇలా వ్రాశారు.

"అది — (24 నవంబరు 1926) భౌతికంలోకి శ్రీకృష్ణుని అవతరణ.

"కృష్ణుడు అతిమానస కాంతి కాదు. కృష్ణావతరణ అంటే, అధిమానస శీర్షావతరణ. అది, తాను స్వయంగా తీసుకురాకపోయినా, అతిమానస ఆనంద అవతరణకు తగిన భూమికను ఏర్పాటు చేస్తుంది. కృష్ణుడే ఆనందమయుడు. అతడు అధిమానసం ద్వారా, పరిణామక్రమాన్ని పరమానందం వైపు నడిపిస్తాడు.

The Life of Sri Aurobindo by A. B. Purani, pp. 215-17, 1978 editon

ఎ. బి పురాణి

అనువాదం: యస్. వై. సోమయాజులు

విధి విధానం: స్వేచ్ఛా సంకల్పం

ప్రపంచాన్ని ఆచ్ఛాదించి, పొదుగుతున్న విధి రెక్కలను సంవేదించలేని వ్యక్తులు, సమాజాలూ, క్రియాశక్తుల పరిధి కావల కెన్నడూ దృష్టి సారించని, నిశ్చలభావ యెరుకను యెన్నడూ పొందని, లేదా వస్తువుల నుండి వాటి గమనాన్ని నిర్దేశించు ఒక ధృవమైన దివ్యసన్నిధి యెరుక నెన్నడూ పొందని వ్యక్తి, నిజంగా ఒక బంధించబడ్డ జీవియే. పైగా అది ఆలోచనలోని లోపం అవుతుంది, లేక విధికి, లేక దాగివున్న దైవసన్నిధికి కట్టువడిపోయిన చిత్తవృత్తిలో, ధైర్యం, స్పష్టతలను కోల్పోయి నిరుత్సాహంతో తలవంచడానికి చిహ్నమౌతుంది. వస్తువు లందలి దివ్యశక్తిని, నాలో గల అదే దివ్యశక్తిని, నిర్వీర్యం లేదా అవసరానికి మించిన దానిగా చేసి నిష్ఫలం అయ్యేటట్లుగా చేయడం అవుతుంది. విధి, స్వేచ్ఛా సంకల్పం అనేవి ఒకే అవిభాజ్య ఊర్జానికి సంబంధించిన రెండు చలనాలు మాత్రమే. నా సంకల్పం నా విధికి మొట్టమొదటి ఉపకరణం. ప్రపంచపు నిరోధించ నలవిగాని ఉపచేతన ఉద్దేశ్యంలో

గల దివ్యసంకల్పం తనను తాను అభివ్యక్తం చేసుకొనే ఒక సంకల్పమే విధి.

అవిభాజ్యమైనదానిలో జరిగిన ఒకానొక విభజన నుండి సమస్త కీడు లాగానే సమస్త దోషం పుట్టుకొచ్చింది. ఎందుచేతనంటే భగవంతుని బహుపార్శ్వాలున్నాయి. అతని యేకత్వాన్ని మనస్సు భగ్నం చేస్తుంది. జగత్తును యేకం చేయడంలో తీరిక లేకుండా ఉన్న దివ్యభావనలు, శక్తుల ఉమ్మడి కుటుంబంలో పరస్పరం బహిష్కరించుకొనేటట్లు చేయడానికి నిరర్థక ప్రయత్నాన్నీ, ఒక తీవ్ర వ్యతిరేకతను అది సృష్టిస్తుంది. ఆ విధంగా మన ఆలోచన ఒక అనిర్వచనీయ విధిని లేదా అంతే అనిర్వచనీయమైన లేదా ఒక అద్భుతావహమైన స్వేచ్ఛా-సంకల్పాన్ని యెదురెదురు నిలబెట్టి, ఇదో, అదో యేదో ఒకటే ఉండాలనీ పట్టుబట్టి రెండూ కలిసి మనుగడ సాగించలేవు అని అంటుంది. అదొక తప్పుడు, అసత్య తగవులాట. నాకొక సంకల్పం వుంది. అది స్పష్టమే. ప్రపంచంలో తానొక్కదానినే ఉన్నాననుకొంటూ లేదా మహా అయితే ఒక అదృశ్యతరంగ శిఖరంలా, రూపంలా తనను తాను దృశ్యమానం చేసుకోగల స్వేచ్ఛ ఉన్నదనుకోవడం అసత్యం. తనకు తానే తన కర్మలను, కర్మ ఫలితాలను నిర్దేశించుకొనే విధంగా విడివడి ఉన్న ఒక వస్తువు అనే అర్థంలోని స్వేచ్ఛయే గాని అసలు సత్యమైన స్వేచ్ఛ గాదు. తరంగం కూడా తనకంటే అధికమైనదే. దాని వెనుక అగాధమైన సముద్రమంతటి దివ్యశక్తి, మహాకాలానికి సంబంధించిన సంచారం వుంది. ఒక భయంకరమైన వేటగానిచే మసక చీకటి పంజరంలో బంధింపబడిన పక్షి తన రెక్కలను నిరర్థకంగా దేనికి యెలా ఢీ కొడుతుందో అలా అంతరాత్మ తప్పించుకొనడానికి యెదుర్కొనవలసిన అగణనీయ విధి, అంధ, కర్కశ తప్పించుకొనలేని విశ్వనియతి అంటూ యేదీ లేదు. ఉన్నదని అనడం తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకొనడానికి చూపే సాకు మాత్రమే. అలా తప్పించుకొనే శక్తి లేనపుడు అది మరో సాకు కనిపెడ్తుంది.

అన్ని కాలాలూ, జాతులూ గూడా విధి భావనకు లోనయ్యాయి లేదా దానితో ఆటాడుకున్నాయి. దేవతల దివ్య కాల్పనికాలను తన అధీనంలో నుంచుకొనే అద్భుత, అనిర్వచనీయ, విశ్వనియతిని గురించి గ్రీకుల చింతన సాగింది. కిస్మత్ కాడి క్రింద మహమ్మదీయులు ప్రశాంతంగా, అచేతనంగా చతికిలబడ్డారు. విపత్తు సంభవించినపుడు లేదా వైఫల్యం యెదురైనపుడు లేదా శ్రమిస్తూ కృషి సాగించవలసి వచ్చినప్పుడు, పౌరుషంతో పనిచేయవలసి వచ్చినప్పుడు, తప్పించుకొనడానికి

లేదా తనను తాను ఓదార్చుకొనడానికి కర్మ లలాట లిఖితం అని హైందవుడు చెప్పుకొన్నాడు. దాని లోతైన విశిష్టతను, మసక సంధ్యాకాంతుల లోనే, వదలి వేయడంలో అవి ఆచ్ఛాదించే భావానికి సర్వసాధారణ అస్పష్టతను కట్టబెట్టడంలో ఇవన్నీ రక్తబంధువులే. ఒక స్వేచ్ఛామయ, సద్భావాత్మక కార్యనిర్వాహక వ్యక్తి బాధ్యతకు సంబంధించిన భావాన్ని వ్యతిరేకించడానికి ప్రకృతి ధర్మం, వారసత్వం అంటూ అంతే సమానమైన రూపరహిత అనుమానాస్పద, ముందే నిర్ధారించబడిన గమ్యాన్ని ఆధునిక విజ్ఞానశాస్త్రం తీసుకొచ్చి పెట్టింది. అంతరాత్మ లేనిచోట స్వేచ్ఛ వుండదు. ప్రకృతి తన మౌలిక ధర్మాన్ననుసరించి మనలో పనిచేస్తుంది. మన తల్లిదండ్రులలో వున్న ప్రాణిక సంబంధమైనదంతా మనకు ముందే సంక్రమించిన, ముందే నిర్ణయమైన రెండో గమ్యం. ఆ విధంగ మృతమైన తరాలు జీవిస్తున్న వాటిపై బలవంతంగా వచ్చి పడతాయి. పరిసర వాతావరణం వత్తిడి మూడవ విధిగా ప్రవేశిస్తుంది. క్రియాశక్తుల వలయాలలో నుండి మనం దొరకబుచ్చుకొని ఇంకా నిలిపి వుంచుకొన్న స్వేచ్ఛకుగల అవకాశాన్ని మనకు లేకుండా చేయడానికి దాస్తుంది. గ్రీకులకు సంబంధించిన త్రివిధ మోయిరై (మూడు రకాల విధులు) ఇతర ముసుగులతో, క్రొత్త పేర్లతో తిరిగి గద్దె నెక్కాయి. మనం మన విధికి సంబంధించిన బ్రహ్మాండమైన అల్లికనే మరోసారి, కాని అపారమైన భౌతికశక్తుల నిర్దిష్ట పరిమాణంలో సాగే నర్తనం ద్వారా నమ్ముతాం. బుద్ధి, మానవ సానుభూతి కవకాశం లేకుండా చేయబడిన పాత దేవుళ్ళే వాళ్ళు. తమను గురించిన, మనలను గురించిన యెరుక లేనందువల్ల, దయారహితులైన పాత దేవుళ్ళే ఆ శక్తులు.

మనిషి చేసే కర్మలో, విధి యందు లేదా స్వేచ్ఛాసంకల్పాలలో నమ్మకం యే కొంతైనా భేదాన్ని కలిగిస్తుందా అనేది అనుమానమే గాని అది అతని ఆంతరిక మనోవృత్తి మీద, ఆంతరసత్త మీద ఎంతో ప్రభావం తప్పక చూపిస్తుంది. ఎందుకనంటే అది అతని అంతరాత్మ మూస మీద తన ముద్ర వేస్తుంది. చేతగానితనానికి విధి అని చెప్పి నమ్మే మనిషికి దీనిని గాకపోతే మరో వంకను దేన్నైనా కనుగొంటాడు.

అతని ఆ భావం అతడు తన చిత్తవృత్తికి తొడిగిన ఉదాత్తమైన బట్టను కట్టబెట్టడం గానూ, లేదా ఒక గౌరవనీయమైన ఆచ్ఛాదనంతో అలంకరించడంగానూ అవుతుంది. కాని అతని సంకల్పం ఒక వస్తువు మీద గాని, ఒక కర్మ మీద గాని పట్టుపట్టినపుడు స్వేచ్ఛాసంకల్పాలలో అత్యంత స్వేచ్ఛగా నమ్మకం పెంచుకొన్న వానికంటే

అతడు, అంత గట్టిగా తీర్మానించుకొనకుండా కొనసాగిస్తున్నాడనిగాని, లేదా క్రూర తనపు అసహనంతో మొండిగా కొనసాగిస్తున్నాడని గాని, చెప్పలేం. మన కర్మల్ని శాసించేది మన స్వభావం, మన చిత్తవృత్తే గాని మన మేధస్సుకు సంబంధించిన భావాలు గాదు, మన 'ధీ' కాదు. మతి లేదా మన్యు కూడా కావచ్చు లేదా గ్రీకులు చెప్పినట్లు నౌస్ (బుద్ధి) కాదు, అది థుమోస్.

పైగా ప్రపంచాన్ని మార్చే మహాకార్య నిర్వహణాపథంలో తనను నడిపించే ఒక ప్రబల శక్తిని సంవేదించి తనకై దానిని దివ్యీకరించుకొనడానికి విధికి సంబంధించిన భావనపై కార్యశూరుడు తరచుగా ఆధారపడ్తాడు. మొదటి వరుసలో ఉన్న ఈ కందకాలకు చాలా వెనుకగా రహస్య ప్రదేశంలో నిలిపివుంచిన సరిగా పనిచేయని అతి పెద్ద శతఘ్ని నుండి విసర్జించబడిన మందుగుండు లాంటి వాడతడు. విశ్వప్రాణంచే పదార్థ ప్రపంచం లోనికి నెట్టబడినవాడుగా కనిపిస్తాడు. లేదా యెంతో దూరానున్న సర్వోత్తమ వెలుగు చుట్టూ స్థిరకక్ష్యలో పరిభ్రమించడానికీ, దాని కివ్వబడిన కాలంలో, ప్రపంచ జీవనానికి నిర్దేశించిన సేవ చేయడానికి సరిపోయే మూలాధారశక్తిని నింపుకొని విశ్వప్రకృతి హస్తాల నుండి వేగంగా విడివడిన ఒక గ్రహం లాంటి వాడతడు. ప్రపంచానికి సంబంధించిన స్థిరమైన, సుప్రతిష్ఠితమైన వాటిని భగ్నం చేయ వైదిక మరుత్తు వలె లేక మానవ విధి నిర్ణాయక భవిష్యత్తుకు సంబంధించిన నదులు దుముకుతూ పారే ప్రవాహ మార్గాన్ని తొలచడానికి తనను క్రిందికి విసరివైచిన శక్తి సజీవ స్పృహను, విధిని గురించిన భావనలో అతడు సదా వ్యక్తపరుస్తూనే ఉన్నాడు. అతడు ఇంద్రునిలా లేక భగీరధునిలా ముందు దారితీస్తుంటే, దివ్యజలధులు పరవళ్ళుత్రొక్కుతూ అనుసరిస్తాయి. అతని కదలిక వాటి ప్రవాహదిశను నిర్ణయిస్తుంది. ఇక్కడ సింధు ప్రవహిస్తుంది, అక్కడ గంగ ఒక్కో చోట సంశయిస్తూ, మరో చోట చురుకుగానూ, సముద్రం వైపు సాగిపోతుంది. అందువలన ప్రపంచం గుర్తించిన మహాకార్య శూరా గ్రేసరులు, విధి యెడల దివ్యసంకల్పం యెడల నమ్మకం కలవాళ్ళేనని మనకు తెలుసు. సీజరు, మహమద్ , నెపోలియన్ కంటె గతంలో బ్రహ్మాండమైన కార్యశూరు లెవరున్నారు? ఉత్కృష్ట మానవులు నిస్సంకోచంగా విధిని నమ్ముతారు. సగటు మానవమనస్సు కంటే భగవంతుని యెరుకను వారు మరింతగా ప్రాణికంలో సంవేదిస్తారు.

ఈ విషయంలో నెపోలియన్‌ను గురించి ఒక నానుడి ఈ యథార్థ సత్యంతో నిండి వుంది. ఎప్పుడూ యెందుకని అతడు విధిని గురించి మాట్లాడుతున్నా ఎప్పుడూ

ఆలోచిస్తూండడం పథకాలు రచిస్తూండడం ప్రయోజనకరమని భావిస్తూ వుంటాడని అడిగినపుడు అతడీ సరైన సమాధానం చెప్పాడు. "నేను పథకాలు రచించాలని సంకల్పించేది కూడా విధే గనుక". ఇదీ సత్యం. విశ్వంలో జరిగే మహాకార్యం మొత్తంలో ఒక భాగంగా నా కర్మ ఫలితాన్ని నిర్దేశించే ఒక మహాసంకల్పం లేదా మహా క్రియాశక్తి ప్రపంచంలో ఒకటున్నది. నా ఆలోచన వ్యక్తిగత యెంపిక వల్ల మరుగుపరచబడి మొత్తం మీద జరిగేదాన్ని నిర్దేశిస్తూ నేను స్వీకరించవలసిన భాగాన్ని నిర్దేశించే ఒక మహాసంకల్పం నాలో ఉంది. ఇదిగో, దానినే నా మనసు పట్టుకుని నా సంకల్పం అని చెప్తుంది. కాని నేను నాది అనేవి ముసుగులు మాత్రమే. నా వాస్తవికతను నా కందిచ్చేది భగవదస్తిత్వం. నేను గణించేటపుడు తన స్వీయ అగణిత కార్యం కోసం నాలో పనిచేసేది సమస్త-సంకల్పం, సమస్త-జ్ఞానం.

ఈ కారణం చేతనే నా స్వేచ్ఛాసంకల్పం గురించి ఒత్తి చెప్పే హక్కు నాకున్నది. ఒక విశ్వనియతి దేవతాశక్తులను గూడా నియంత్రిస్తున్నట్లైతే అపుడు గూడా తన మాతృమూర్తి అంతఃపురంలో హక్కు కలిగి ఉన్న పుత్రిక నా సంకల్పం. ప్రపంచంతో అనేక రూపాల్లో ఆటలాడే దివ్యనియతి మోము అది. కిస్మత్ గనుక భగవత్ సంకల్పమే అయితే, నేను పుట్టిన లేదా ప్రపంచం పుట్టిన క్షణంలో మాత్రమే గాకుండా ఈ ప్రస్తుత క్షణంలో గూడా ఆ సంకల్పం పనిచేస్తూనే వుంది. నా గత కర్మలు నా వర్తమానాన్ని నిర్దేశిస్తే, నేనిప్పటికిప్పుడు చేసే కర్మలు రాబోయే క్షణాన్ని నిర్ధారిస్తాయి. ఎప్పుడో వచ్చే జీవితంలో ఆలస్యంగా వచ్చే ప్రభావాలను చూపించే మందకొడి యంత్రాంగంతో ఇపుడు యేమాత్రం ప్రభావం చూపించకుండా వుండవు. ప్రకృతి ధర్మం, వారసత్వం, పరిసరాలు శక్తివంతమైన వైనప్పటికీ అవి వాటి పనికి, వాటి నుపయోగించే వ్యక్తి మీద తప్పక ఆధారపడ్తాయి.

నా కర్మ ఫలితాలు నాకు చెందవు, భగవంతునికి ప్రపంచానికీ చెందుతాయి. నా కర్మ నాకు భగవంతునికి చెందుతుంది. అక్కడ నాకు హక్కున్నది. లేక ఇంకా చెప్పాలంటే నాలోని భగవంతునికవి చెందుతాయి. అది అతని హక్కు, కాని నేను దానిని భోగిస్తాను. నాలో పనిచేసే మహాసంకల్పం అవిభాజ్య సమస్తం. ఒక సముద్రమంతా ఒక ప్రత్యేక తీరం మీదకు ఒక ప్రత్యేక ఉత్తుంగ తరంగ రూపంలో విరుచుకు పడేటట్లు అది తన నుండి తాను వేరుచేసుకొన్నట్లు కన్పిస్తూ నామరూపాలలో పనిచేస్తోంది. సమస్తం, నేను, ఒక అనంత జగత్తులో ఒక మూల ఒకరితో ఒకరం

దోబూచులాడుతున్నాం.

పూర్తిగా విరుద్ధ ప్రయోజనాల కోసం నాలోని సమస్తంతో, నేనాడుకొంటుండవచ్చు. అజ్ఞానమయమై, ఆవేశితమై తనను తాను స్తుతించుకొంటూ బహిరంగంగా లేక అనేక వంకలతో దాని స్వంత దైవంగా నేను నా సంకల్పశక్తిని, నా మనస్సుకు సంబంధించిన నాడీ భాగానికి సేవకునిగా అప్పగించినపుడు అలా జరుగుతుంది. తన మీద విధి తన భారమైన హస్తం పెట్టిందనీ, ఒక నిరంకుశుని పీడనను లేదా ఒక అంధ, బుద్ధిలేని శక్తి నిరోధాన్ని సంవేదించేది, ఇదిగో, నాలోని ఇది, ఈ అహంకారి, ఈ ఆకొన్నవాడు. ఎందుకనంటే ఇది తన స్వంత అవసరంలోనే, తన దృక్పథంలోనే యెల్లవేళలా మునిగిపోతూ, సమస్తంతో ప్రపంచ యంత్రాంగాని కత్యంతావశ్యకమైన ఘర్షణ, వైరుధ్యాల ద్వారా సమస్తానికీ సహాయం చేస్తోంది. అది విధేయతతో పురోభివృద్ధి చెందడం నేర్చుకొనలేదు, గనుక ప్రేమతో వత్తిడి కలిగిస్తూ స్వీయ-సంకల్పంతో పెనగులాడుతూ, బాధపడుతూ అభివృద్ధి చెందేందుకు పట్టుబట్టే గురువును, అతని కాఠిన్యాన్ని అది అపార్థం చేసుకుంటుంది.

భగవంతుని గురించిన జ్ఞానం ఉన్నా లేకపోయినా, ఆతనిని సేవించేందుకు ఒక బలమైన ఆదర్శానికి, వివేకంగల క్రియాశక్తికి సేవకునిగా స్వభావంలో ఒక అంతః స్ఫూర్తి, హృదయంలో ఒక ఆకాంక్ష, మనస్సులో ఒక తార్కికబుద్ధి ద్వారా నన్ను నేను అంకితం చేసుకోవచ్చు. అప్పుడు నా సంకల్పం సత్యసంకల్పం అవుతుంది. తన వంతు కార్యం అది నిర్వహిస్తుంది,తన వాటాను పూర్తి చేస్తుంది, తానుప యోగించిన లేదా పెంచుకున్న ప్రతిభతో సహా తన గురువు దగ్గరకు తిరిగి చేరుకొం టుంది. కొంతవరకది స్వతంత్రమే. మనలోని రాక్షస సంబంధం నుండి, మృగం నుండి విడుదల పొందడం, సరైన సత్యమైన దానిని యెంచుకొనడానికి లేదా దానితో యెంచుకోబడడానికి స్వేచ్ఛ కలిగి వుండడం అనేది ఒక గొప్ప స్వేచ్ఛ.

తనను వెంటనంటి వుండే దివ్య అనుగామిని వద్ద గాక అది ఆశ్రయం పొందిన నా అహాన్ని దాని నుండి, దాని మూస నుండి బయటపడ గలిగితే అప్పుడెంత భిన్నంగా వుంటుందో గదా! అప్పుడొక గొప్ప వైరుధ్యం ఉపశమించడమే గాదు పూర్తిగా రద్దై పోతుంది. నా స్వేచ్ఛా-సంకల్పం భగవంతుని సంకల్పమౌతుంది. విధి తన ముసుగును తొలగించివేస్తుంది. కేవలం భగవంతుని బానిసగా ఉండడానికి అంగీకరించినందువల్ల తన ఉపకరణాలచే బంధింపబడని ఆ 'తత్' కొక సజీవ ఉప

కరణంగా ఉండడాని కంగీకరించినందువల్ల స్వర్గలోక విపంచిలపై గానమాలాపించే స్వేచ్ఛను నేనెరుగ గలుగుతాను. కాని దీనినే మానవవాక్కు పలుకలేదు. నేను పరిశుద్ధ శక్తి, పరిశుద్ధ ప్రహర్షమూ, సమస్త-అస్తిత్వానికీ, సమస్త-జీవన, సమస్త-క్రియాశక్తికి సంబంధించిన అపరిమేయ లోతింతని తెలియని మహదానంద తరంగాలలో కొట్టుకుపోతాను, ఓలలాడతాను. విధి మహాసంకల్పంలో వైభవోపేతమై ఆ మహాసంకల్పం భగవంతుని లోనికి చేరుకొనడాన్ని నేను దర్శిస్తాను.

CWSA 13:158-62

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

పడవ అంతర్ధానం

మార్గం చివర తీరం వెంట అస్పష్ట రేఖ మెరయు
రేవులో సుదూర కాంతులు తళుక్కుమన్నాయి.
ఆకాశం అంచుల్ని ఒక మబ్బు నల్లగా చేసింది.
విడుదల పొందిన భూతం భయానక హాసం వలె గాలి వీచింది.
కాంతి ప్రహారాలతో తుఫాను బృహత్ కాంక్ష దూకింది.
మృత్యు పర్జన్య సుదీర్ఘ రావం అదృశ్య హస్తం విసురుగా
లాగినట్లు,విశాల, నిరామయ, నిరాధార సాగరంలో పడవ అంతర్ధానమైంది.

అది యాదృచ్ఛికపు ఆఘాతమా?
విధి వెటకారమా?
పాశవిక ప్రకృతి మృత కార్యకలాపాలా?
అంధ ప్రయోజనమా?
లేదా, స్థిరమైన పగతో, పచ్చి న్యాయంతో
మనిషి చేసిన పనులే అతని శాపగ్రస్త
శిరము వైపు తిరిగి వస్తున్నాయా?

లేదా జీవితం వెనుక ఒక రౌద్ర సంకల్పం
బాధను గమనిస్తూ, పగలబడి నవ్వుతూ


మృత్యువుకు ఆహ్వానం పలుకుతోందా?
ఈ కార్య కలాపాల,
సంఘటనల అరణ్యంలో, శ్రమించే
మన ఆలోచనలలో భగవంతుని చిచ్ఛక్తి, లేక
మరేదో శక్తి పరిపాలిస్తున్నదా?
మెరిసే జీవితాలు మునిగిపోలేదు, ఆనంద
సాహసాలు విఫలం కాలేదు, సముద్రంలో అంతం కాలేదు.
కాని సుదూరంగా పయనించిన పిమ్మట
వారు ఒక అజ్ఞేయ తీరం, ఒక వింత
సూర్యుడ్ని, ఒక కొత్త నీల గగనాంచలం,
మృగ మదోజ్వల తేజఃపుంజాలకు, పక్షుల
సంగీతాన్ని, ప్రగాఢ కాంతిరేఖలను,
సుసంపన్న ప్రకృతిని, సృష్టి నూతనార్థాలకు
సమీపంగా వెళ్లిన, వినూత్న జీవనం చేరుకున్నారు.
నిగూఢ గుప్త ప్రయోజనాన్ని స్పృశించారు.

యాదృచ్ఛిక సంఘటనలలో, విధి విలాసాలలో,
పాశవిక ప్రకృతి మృత కదలికలలో
ఆమె భయానక రాకాసి చాపల్య క్రీడలో,
మృత్యువు వైపు, దుర్విధి వైపు కదిలే శక్తిలో
గుప్తమై ఒక సంకల్పం పరిశ్రమిస్తోంది.

తీక్షణ క్షణాలతో, అస్పష్ట తెర రాలడంతో
ఈ విశ్వలీల ఆగదు.
దాటవలసిన కాలం ఉంది.
జీవించవలసిన జీవితాలున్నాయి
ఆత్మ నాటకంలోని అనావిష్కృత
అధ్యాయాలు ఎన్నో, ఎన్నెన్నో.

శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

7/12/2013



అఖిల

అఖిల భారత పత్రిక

డిశంబరు 2013

7/12/2013.

విషయసూచిక

ప్రథమ భాగం: అవతారములు — మానవరూపంలో దైవావతరణ

ద్వితీయ భాగం: శ్రీఅరవిందుల మహాసమాధి

ఎవరైతే తమలో ఆవిర్భవించిన లేక అవరోహించిన దైవం యొక్క ఉనికిని గురించి, ఆతని శక్తిని గురించి చేతన కలిగి వుంటారో, యెవరు తమ ఇచ్ఛా జీవితం, కర్మలు తమ అంతరంగంలో ఆవాస మున్న ఆతని నియంత్రణలో నుంటాయనే అవగాహన కలిగి వుం టారో, వారు అవతార పురుషులని ఉజ్జాయింపుగా చెప్పవచ్చు. అట్టివారికి వారి అంతరంగంలో ఆ దైవం యొక్క ఉనికితోను, దైవికశక్తితోను తాదాత్మ్యం చెందిన అనుభూతి యేర్పడుతుంది.
(CWSA 28:485)

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

అవతారమనగా యేమిటి?

భగవద్గీత ననుసరించి మానవరూపంలో దైవం అవతారం స్వీకరించుట అనగా, పరమాత్మ మానవ లక్షణాలను, మానవ ప్రకృతిని స్వీకరించడమన్న మాట. మానవ జన్మలో నున్న రహస్యం యొక్క మరో కోణం యిది. ఈ రహస్యం పైకి వెల్లడి కాకపోయినా నిజానికి అదొక అత్యద్భుత ఘటన. ప్రతి మానవ జీవిలో శాశ్వతుడైన, విశ్వవ్యాప్తుడైన భగవంతుడు అంతరాత్మగా విరాజిల్లుతున్నాడు. మనిషిలోని వ్యక్తి గతమైన ఆత్మకూడ దైవాంశమే. 'మా మైవం సహః'. అది భగవంతునిలో ఒక స్వల్పభాగంగాని లేక అవశేషంగాని కాదు; కారణం భగవంతుడిని ముక్కలు చెక్కలైన వాడిగా మన మూహించలేము. అది యేకైక శుద్ధచైతన్యము యొక్క పాక్షిక చేతన, యేకైక పరమశక్తియొక్క పాక్షికశక్తి, విశ్వవ్యాప్త జీవుడి దివ్యానందాన్ని పొందే ప్రాపంచిక జీవి యొక్క పాక్షిక అనుభూతి. అందువలన మానవుడు అభివ్యక్తమగుటలోను లేక ప్రకృతిలోను ఒక్కడే అయిన అనంతుడు, అప్రమేయుడు అగు దివ్యపురుషుడి యొక్క పరిమితమైన ప్రతిరూపం. ఆ పరిమితి యొక్క ముద్ర అజ్ఞానజనితం. అందువలన అది మానవుడు తాను యే దివ్యపురుషుడి నుండి ఆవిర్భవించాడో ఆతనినేగాక తనలో సర్వదా నిలచి వుండి, తన స్వీయప్రకృతిలో నిగూఢంగా హృదీయాంతర్గతంగా జీవిస్తున్న, తన మానవమందిర అంతరంగ పూజాపీఠంపై కప్పబడిన జ్వాలగా వెలుగుతున్న ఆ పరమాత్మను గూడ విస్మరించునట్లు చేస్తుంది.

అతనిని అజ్ఞానం ఆవరించుటకు కారణం అతని అంతరాత్మ చక్షువులపైన, దాని అంగాంగాల పైన ప్రకృతి యొక్క మహామాయ యొక్క ముద్రవేయబడింది. ఆ ప్రకృతి, ఆ మాయ మూలకంగానే భగవంతుని నిత్యసత్య అస్తిత్వము నుండి మానవుడు అభివ్యక్తం చేయబడినాడు; దివ్యపదార్థమనబడే అమూల్యమైన లోహం నుండి పోతపోయబడిన నాణెంలా రూపొందించబడినాడు. అయితే ప్రకృతి యొక్క మాహామాయ యొక్క అసాధారణ లక్షణాల పూతతో దట్టంగా అలముకొనబడి, వాటి ప్రత్యేక ముద్రతో పాటు పాశవిక మానవీయ ముద్ర కూడ అతనిపై వేయబడింది. పరమాత్ముని రహస్యచిహ్నం అతనిపై వున్నప్పటికి, అది మొదట్లో స్పష్టంగా

గుర్తించ బడదు; దానిని తెలుసుకోవడం చాలా కష్టం. ఏ మానవ అస్తిత్వ రహస్యం తెలుసు కోవడంతో దైవికమైన మానవతకు భువనపరమైన మానవతకు మధ్యగల తేడా విశదమౌతుందో, దానితో తప్ప మరే విధంగాను ఆ తేడాను వాస్తవంగ తెలుసుకోలేము.

అవతారంగా దివ్యజన్మ నెత్తిన మహాపురుషునిలోని యదార్థ పదార్థం అతని శరీరంయొక్క పైపూతలో నుండి మెరుస్తూ కనబడుతుంది. మాయా ముద్ర అన్నది కేవలం ఆకారం కోసమే. దర్శనం మాత్రం నిగూఢమై యున్న ఆ దైవానిది. ప్రాణ శక్తి ఆ దైవానికి చెందినది. అది మానవప్రకృతి ధారణముద్రలను ఛేదించుకొని కన బడుతుంది. బాహ్యమైనది, భౌతికమైనది కాని లోపలి అంతరాత్మ చిహ్నాన్ని దర్శించ గోరేవారు, దర్శించగలవారు, స్పష్టంగా తెలుసుకొనుటకు అది ప్రత్యక్షంగా కనపడు తుంది. ఆసురిక ప్రవృత్తి యెప్పటికి యీ విషయాలను కనుగొన లేదు. అది కేవలం శరీరాన్ని మాత్రమే చూస్తుంది కాని అంతరాత్మను కాదు; ఉపరితల జీవిని మాత్రమే చూస్తుంది కాని అంతరంగజీవిని కాదు; ఆచ్ఛాదననే చూస్తుంది కాని దాని లోపలి పరమ పురుషుడిని కాదు. సాధారణ మానవుని పుట్టుక విషయంలో విశ్వవ్యాప్తుడైన దైవం మానవాకృతిని పొందుటలోగల ప్రకృతిపరమైన అంశానికి ప్రాధాన్యత వుంది; అవతారం విషయంలో అదే సంఘటనకు దైవాంశపరమైన ప్రాధాన్యత వుంది. ఒక దానిలో దైవం మానవప్రకృతికి తనలో ఒక భాగాన్ని స్వాధీనపరచుకొని దానిపై అధికారం పొందే వీలు కలిగిస్తాడు. మరోదానిలో తానే తనలో ఒక భాగాన్ని, దాని ప్రకృతితో సహా స్వాధీనపరచుకొని, దానిపై దైవికమైన అధికారం వహిస్తాడు. భగవద్గీత మనకు చెప్పదలచేదేమంటే, దైవాతరణ సాధారణ మానవుని విషయంలో మాదిరిగ పరిణామ ప్రక్రియ ద్వారానో లేక ఊర్ధ్వగతి పొందుట ద్వారానో లేక దివ్యజన్మ నెత్తుట ద్వారానో జరుగదు. దైవం మానవాళిలోకి నేరుగ దిగివచ్చి మానవాకృతి మూసలో తనను తాను మలచుకొనుటతో జరుగుతుంది.

(CWSA 19:158-59, SABCL 13:149-50)

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

అవతార కార్యం

... ఆ ఆరోహణకు లేక పరిణామ ప్రగతికి సహాయం చేయడానికి అవతారం దిగిరావడం లేక అంగీకరించడం జరుగుతుంది. ఈ విషయాన్ని గీత స్పష్టం చేసింది. అంటే మనిషిలో దైవాభివ్యక్తి సంభావ్యతను సోదాహరణంగా చూపించడానికి అని మనం చెప్పుకోవచ్చు. అప్పుడు అదంటే యేమిటో, ప్రత్యక్షంగా చూచి అందులోని కెదగడానికి మనిషి ధైర్యం చేస్తాడు. అంతేగాక ఆ అభివ్యక్తి ప్రభావం భూ-ప్రకృతిలో ప్రకంపిస్తూ వుండి, ఆ అభివ్యక్తి అంతరాత్మ, దాని ఊర్ధ్వప్రయాణ కృషికి సారథ్యం వహించేటట్లు చేయడానికి, అవతరణ జరుగుతుంది. మానవుని ఆకాంక్షించే అంతరాత్మ తనను తాను యే మూసలోనికి పోత పోసుకోవాలనుకుంటుందో ఆ మూసకు దివ్యపురుషుడి యొక్క ఆధ్యాత్మిక ఆకృతిని అందించడానికి అవతరణ జరుగుతుంది. కేవలం ఒక మతసిద్ధాంతాన్ని గాక, బాహ్య, అంతర జీవనధర్మాన్ని, దైవత్వం వైపు అతడెదగడానికి తగిన రీతిగా తనను తాను మలచుకొనేందుకు ఒక మార్గాన్ని, ఒక నియమాన్ని, ఒక ధర్మాన్ని, ఒక మతాన్ని అందించడానికి అవతరణ జరుగుతుంది. ఈ యెదుగుదల, ఈ ఆరోహణ కేవలం, యెవరికీ సంబంధం లేకుండా, విడిపోయిన వ్యక్తిగత సంఘటన గాదు. దివ్యప్రపంచ కార్యకలాపా లన్నింటిలో లాగానే అది కూడా ఒక సామూహిక వ్యాపారం గనుక ఇదొక మహాకార్యం, జాతి కోసం జరిగే కార్యం, మానవాళి పురోగతికి సహాయం చేయడానికి; ఆ జాతికి సంభవించే మహాసంకట సమయంలో అది చెదరిపోకుండా దానిని ఒకటిగా నిలిపి వుంచేందుకు; మనిషి స్వభావంలో, క్రిందికి లాగుతుండే శక్తులు బలపడి అతని మీద మరింత వత్తిడి చేసేటట్లు తయారైనపుడు వాటిని రూపుమాపేందుకు భగవంతుని వైపు నడిపే గొప్ప ధర్మాన్ని మనిషిలో నిలిపి వుంచడానికి లేదా పునః ప్రతిష్ఠిచడానికి; ఎప్పటికైనా గాని, భగవంతుని రాజ్యస్థాపనకు; వెలుగు కోసం, సంసిద్ధి కోసం ఆకాంక్షించే సాధుజనులు విజయు లయ్యేటట్లు వారిని సంసిద్ధం చేసేందుకు; కీడు, అంధకారాలను కొనసాగేటట్లు చేయాలని పోరాడేవారిని అంతమొందించడానికి కూడా అవతరణ జరుగుతుంది. ఇవన్నీ కూడా అవతారం దిగిరావడంలో వున్న, గుర్తించబడిన ప్రయోజనాలు. అవతారం నిర్వహించిన మహాకార్యాన్ని బట్టే జనబాహుళ్యం ఆతని ప్రత్యేకతను గుర్తించి, అందుకోసమే అతనిని ఆరాధించడానికి సిద్ధమౌతారు. మానవ

జీవన ప్రతీకలో, వాళ్ళు దానితో యేకమయ్యేటట్లు, దానికి వశులయ్యేటట్లు యెదగగల విధంగా తమకే చెందిన మనస్తత్వ, దేహతత్త్వాల క్షేత్రంలో తనను తానభివ్యక్తం చేసుకొంటున్న శాశ్వత ఆంతరిక భగవత్తత్త్వానికి ఈ బాహ్య అవతార తత్త్వం ఒక చిహ్నంగా చూచేది ఆధ్యాత్మిక జనులే. మన స్వీయ ఆంతరిక మానవతలోనే ఉన్న శాశ్వత అవతార అభివ్యక్తి యేదైతే ఉన్నదో అదే అభివ్యక్తి తన ఆంతరిక సత్యంగా చేసుకొన్నదే బాహ్య మానవతలో ఒక క్రీస్తు, ఒక కృష్ణుడు, ఒక బుద్ధుని దివ్య అభివ్యక్తిలో ఉన్నది. భువిపై గల బాహ్య మానవజీవితంలో యేది నిర్వహించబడుతుందో అదే సమస్త మానవజీవుల ఆంతరిక జీవనంలో పునః నిర్వహించబడుతుంది.

ఇది, అవతార ప్రయోజనం.

*

అవతార పుట్టుక కున్నట్లుగానే, అవతార రాకకూ ద్వంద్వార్థం వున్నది, ద్వంద్వరూపం వున్నది. చర్య, ప్రతిచర్య నియమం ద్వారా ముందుకు పోవడం, వెనక్కి తగ్గడం అనే లయబద్ధమైన ప్రక్రియ ద్వారా ప్రకృతి పురోగతి కొనసాగుతుంది. అయినప్పటికీ భగవంతుని వైపుకు పయనించుటకు మానవజాతి చేసే కృషిలో, తిరుగులేని వెనుకంజ వేయడానికి బదులు, నిశ్చయాత్మక ధోరణితో ముందుకే పోవడం అనే దివ్యధర్మాన్ని కొనసాగించడానికి, తిరిగి నూతనంగా దానిని తీర్చిదిద్దడానికి తగు విధంగా బాహ్య ప్రపంచం మీద పనిచేసే దివ్యక్రియాశక్తికి సంబంధించిన బాహ్యపార్శ్వం కూడా అవతారం దిగిరావడంలో వుంది. భగవంతుని వైపు తిరిగిన చేతన, తన ఉన్నత శిఖరాలకు అధిగమించే ఆత్మ-వికాసశక్తిలో నూతన రూపాలను స్వీకరించి, భరిస్తూ, నూతనీకరిస్తూ, సమృద్ధం చేస్తూ, వ్యక్తిగత అంతరాత్మ, జాతి అంతరాత్మలపై పనిచేస్తుండడమనే అంతర్ముఖమైన పార్శ్వం కూడా ఆ దివ్యక్రియాశక్తి కుంది. చాలా తరచుగా, మానవజాతి భావించేందుకు ఉత్సాహం చూపించే అర్థంలో, అవతారం ఒక గొప్ప బాహ్యకార్యం చేయడానికి దిగిరాదు. కర్మ, సంఘటన, వాటిని వాటిగానే చూస్తే వాటి విలువ తెలియదు. అది యే క్రియాశక్తికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయో, అవి యే భావనకు ప్రతీకగా నిలిచాయో, ఆ క్రియాశక్తి యే కార్య నిర్వహణకై వచ్చిందో వాటిని బట్టే, కర్మకు, ఘటనకు విలువ వస్తుంది.

ఏ సంకట స్థితిలో అవతారం ప్రత్యక్షమౌతుందో అది పైకి ఘటనల సంక్లిష్ట

స్థితిగా మాత్రమే బాహ్యాన్ని చూచే కంటికి కనుపించినా, మూలంలో, నిజమైన అర్థంలో మానవజాతి చేతనలోని ఒక సంకటస్థితి అది. ఆ చేతన ఒక విశిష్ట సంస్కరణకు లోనుగావలసి వచ్చినప్పుడు దానిలో కొంత నూతన అభివృద్ధి జరుగవలసి ఉన్నపుడు యేర్పడిన సంకటస్థితిలో అవతారం ప్రత్యక్షమౌతుంది. ఈ మార్పు చోటు చేసుకొనుటకు ఒక దివ్యశక్తి అవసరం. అది ఏ చేతనాశక్తిని ధరించి వస్తుందో, దాన్ని బట్టి ఆ క్రియాశక్తి మారుతూంటుంది. మానవజాతి మనస్సులో, అంతరాత్మలో, దివ్యచేతన అభివ్యక్తి అవసరం అందువల్ల కలుగుతుంది. నిజానికి ఈ మార్పు యెక్కడ బౌద్ధికమైనది, లౌకికమైనదై వుంటుందో అక్కడ అవతార జోక్యంతో అవసరం ఉండదు. చేతన గొప్పగా ఉద్ధరించబడేటప్పుడు శక్తికి సంబంధించిన గొప్ప అభివ్యక్తి జరిగేటపుడు, మనుషులు, వాళ్ళ వాళ్ళ మామూలు స్థితులను మించిపోయే విధంగా ఉత్తేజానికి లోనవుతారు. ఈ విధమైన చేతనా పొంగులోని తరంగ శిఖరాలు కొంతమంది విశిష్ట వ్యక్తులలో, 'విభూతు' లలో బయల్పడతాయి. సార్వత్రిక కర్మను నడిపే వీరి కర్మ, ఉద్దేశించిన మార్పు తీసుకురావడానికి సరిపోతుంది. యూరపులోని సంస్కరణోద్యమం, ఫ్రెంచి విప్లవం ఈ తరహా సంకటస్థితులే. అవి గొప్ప ఆధ్యాత్మిక సంఘటనలు గాదు. అవి బుద్ధికి సంబంధించినవి, క్రియాత్మకమైన మార్పులు. ఒకటి మతానికి సంబంధించిన మార్పు, మరొకటి రాజకీయ చింతనలో మార్పు కోసమేగాని, ఆధ్యాత్మిక సంస్కరణలకు సంబంధించినవి గావు. కాని ఆ సంకటస్థితిలో ఒక ఆధ్యాత్మిక బీజం లేక ఉద్దేశ్యం ఉన్నట్లైతే, అపుడు మానవమనస్సు, అంతరాత్మలలో భగవచ్చేతన దానికి మూలంగా లేదా నాయకునిగా ఒక పూర్ణ లేక పాక్షిక అభివ్యక్తి జరుగుతుంది. అదే అవతారం అంటే.

(CWSA 19: 159-60, 168-69; SABCL 13: 150-51, 159-60)

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

అవతారం బాహ్యకర్మ

ఈ ప్రపంచం సంఘర్షణ కేంద్రం. ఈ సంఘర్షణ రెండు రకాలు. అంతస్సంఘర్షణ, బాహ్య సమరం. ఈ విషయాన్ని గీత నొక్కి వక్కాణించింది. అంతస్సంఘర్షణలో శత్రువులు లోపలే వుంటారు. వ్యక్తిలో దాగి వుంటారు. కోరికల్ని, అజ్ఞానాన్ని, అహంకారాన్ని నశింపచేయడమే ఘనవిజయం, కాని బాహ్య యుద్ధం ఒకటి ఉంది. మానవ సామూహిక జీవనంలో ధర్మ, అధర్మ శక్తుల మధ్య సంగ్రామం అది. ధర్మశక్తులకు భగవంతుడు, మనిషిలోని అంతర్గత దైవ ప్రకృతి బలం చేకూర్చుతూ వుంటాయి. ధర్మానికి ప్రతినిధిగా వున్నవారు, జీవితంలో ఆ ధర్మాన్ని సాక్షాత్కారింప చేసుకోవాలని భావించేవారు ధర్మాన్ని రక్షిస్తూ వుంటారు. అధర్మాన్ని రాక్షసులు పరిపోషిస్తూ వస్తారు. తీవ్రమైన అహంభావం వారి శిరస్సు. అధర్మవర్తనులు, అధర్మాన్ని సంతృపి పరిచేవారు వున్నారు. ఇది దేవతల, రాక్షసుల యుద్ధం. భారతీయ వాఙ్మయం నిండా ఆ యుద్ధాల గాథలే. మహాభారత గాథలో శ్రీకృష్ణుడే ప్రధాన వ్యక్తి (అవతారం). ధర్మసంస్థాపనకు యుద్ధం చేసే పాండవులు దేవతల కుమారులు; మానవరూపాలలో ఉన్నవారి శక్తులు. వారి శత్రువులు రాకాసిశక్తుల అవతారాలు. వారే అసురులు. అసురుల పాలనను అంతం చేయడానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహాయం చేయడానికి అవతారం దిగివస్తుంది. అసురుల్లోని దుష్టశక్తిని అణచివేసి, అణచివేయబడిన ధర్మాన్ని ఉద్ధరిస్తాడు అవతారమూర్తి.

జనసామాన్య జీవనసీమలో స్వర్గాన్ని మరింత చేరువగా తీసుకొని రావడానికి, వ్యక్తి ఆత్మలో స్వర్గసామ్రాజ్యాన్ని సంస్థాపించడానికి అవతారమూర్తి వస్తాడు.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

అవతారం రాక వెనుక అంతర్గత ప్రయోజనం

దివ్యజన్మ, దివ్యకర్మల నిజమైన స్వభావాన్ని అవతారం నుండి నేర్చుకున్నవారు అవతారం అంతఃస్ఫురిత సారాన్ని పొందగలరు. తమ చైతన్యం నిండా అవతారం నిండి, ఆయనలో తమ యావత్ అస్తిత్వధారతో శరణు పొంది, (మన్మయ మామ్ ఉపాశ్రితః) తమ జ్ఞాన సిద్ధ శక్తి ప్రవాహంతో పవిత్రమై, నిమ్నప్రకృతి నుండి విముక్తమై, భగవదస్తిత్వాన్ని, భగవత్ ప్రకృతిని (మద్భావం) పొందగలరు.

నిమ్నప్రకృతికి అతీతంగా మనిషిలో ఉన్నత దివ్యప్రకృతి మహత్వాన్ని ఆవిష్కరించడానికి, స్వేచ్ఛాయుతమై, అహంకార వివర్జితమైన, నిష్కామమై, నిర్వ్యక్తిగతమై, విశ్వజనీనమైన దివ్యకర్మల్ని బహిర్గతం చేయడానికి అవతారం వస్తుంది. దివ్యకర్మలు, దివ్యకాంతి, దివ్యశక్తి, దివ్యప్రేమ ప్రజ్వలితమై ఉంటాయి. అతను దివ్యమహనీయ వ్యక్తిత్వంగా వచ్చి మానవ చైతన్యమంతా నిండిపోతాడు. పరిమితమైన అహంకార వ్యక్తిత్వాన్ని నిర్మూలిస్తాడు. అహంకారం నుండి అనంతంలోకి, విశ్వజనీనతలోకి జననం నుండి అమృతత్వంలోకి సాధకుడ్ని విముక్తం చేస్తాడు.

దివ్యశక్తి, దివ్యప్రేమలాగా భగవానుడు అవతరిస్తాడు. వాటి పిలుపు మేరకు మానవులు అందులోనే శరణు పొందుతారు. వారి సంకల్పాల పరిమితత్వంలో, మానవ భయాలు, క్రోధాలు, కాంక్షల ఘర్షణలో ఎంతమాత్రం శరణు పొందరు. ఈ అశాంతి, బాధల నుండి విముక్తమై భగవంతుని ప్రశాంతిలో, ఆనంద తరంగాలలో జీవించగలరు.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

సాధకుల ప్రశ్నలకు శ్రీఅరవిందుల సమాధానాలు

భగవంతుని అవతార తత్వం రెండు విధాలుగా వుంటుంది. దివ్యచైతన్యం ఒకటైతే కారణభూత మూర్తిమత్వం మరొకటి. దివ్యచైతన్యం అనంతశక్తి సంపన్న మైనది, అయితే అది తన కారణార్థక తత్వాన్ని ప్రకృతిలో పెట్టింది. దానికి ప్రకృతి నియమాలు వర్తిస్తాయి. అక్కడ అవసరానికి సరిపడే నియమావళి ప్రకారమే పాటిస్తుంది. కానీ ఒక్కొక్కసారి ఆ నియమావళిని మార్చుతుంది కూడా. అవతారమనేది కేవలం మెరుపుగా మెరిసిపోయే మాయే అయితే దానివల్ల నాకు ఉపయోగం లేదు. అట్లాకాక అది సర్వాంతర్యామియైన భగవంతుడు ప్రకృతి ఏర్పాటులో భాగంగా చేసినదైతే, నేను అర్థం చేసుకుని ఒప్పుకుంటాను.

*

మానవతకు ఉన్నత చైతన్య మార్గాన్ని తెరవటానికి వచ్చినదే అవతారమని చెప్పాను కదా! ఆ మార్గాన్ని ఎవ్వరూ అనుసరించలేకపోతే దానిపై మనకున్న అవగాహనతో పాటు ఏసుక్రీస్తు, క్రిష్ణుడు, బుద్ధుడు అనుకుంటున్న అభిప్రాయమంతా తప్పే. ఇంకా అవతార జీవితము దాని పనులు అన్నీ దండగ. ఒక గన్నయ్య ఏమంటాడంటే అక్కడ ఏ మార్గమూ లేదు, అది అనుసరించే అవకాశమూ లేదు, అవతార పురుషుని కష్టాలు, బాధలు అంతా అబద్ధం, బూటకం — భగవంతుని ప్రతినిధిగా వచ్చే వానికి గింజులాటకు అవకాశమే లేదు అని. అటువంటి భావాలు అవతార తత్వాన్నే కించపరుస్తాయి. అందుకు కారణం లేదు, అర్థం పర్థం లేదు, అవసరం లేదు. దైవ తత్వం అత్యంత శక్తివంతమైనది. భూమిపై అవతరించాల్సిన అవసరం లేకుండానే అది మానవులను ఉద్ధరించగలదు. అయితే అది ఈ ప్రపంచక్రమంలో భాగమైనపుడే మానవత బరువు బాధ్యతలను వహించి మార్గాన్ని తెరిచినప్పుడు అవతార మెత్తడంలో పరమార్థం ఉంటుంది.

*

మళ్ళీ చెపుతున్నాను. భగవంతుడు ఈ ప్రపంచ బాధ్యతలు వహించాలని సంకల్పించినప్పుడు దాన్ని మనస్ఫూర్తిగా ఏ విధమైన కపట నాటకాలు, యుక్తులు లేకుండా పూర్తిగా వహిస్తాడు. ఒక వేళ ఇంకేదైనా వెనక నుండి బయటపడినా కూడా సారాంశం ఒకటే అవుతుంది. ఇంకా దృఢంగా ఉంటుంది. అన్నిటి వెనుక అదే వుంటుంది —

తానే ఉన్నానని తెలుసుకునేటట్లు చేయడమే.

ఆధ్యాత్మిక మార్గానుయాయుల్లో చైత్యపురుషుడు చేసేది కూడా అదే. యోగమార్గాన్ననుసరించాలంటే మానవులు అసాధారణ మానవులు గానవసరం లేదు. మీరు చేసే పొరపాటు అదే, గొప్పవారు మాత్రమే ఆధ్యాత్మిక మార్గం అనుసరించ గల రనుకుంటూ ఆ గొప్పతనాన్ని అదే పనిగా తలుచుకోవడము.

*

పరిణామవాదంతో అనువదించుకోకపోతే అవతార తత్వానికి అర్థముండదు. మన దశావతార క్రమాన్ని పరిశీలిస్తే అది పరిణామ క్రమానికి దృష్టాంతంగా కనిపిస్తుంది. మొట్టమొదటి మత్స్యావతారం, ఆ తర్వాత ఉభయచరమైన, అంటే నీటిలోనూ, నేల పైనా కూడా సంచరించే కూర్మము, ఆ తర్వాత భూమిపై మాత్రమే సంచరించే జంతువుగా, ఆ తర్వాత మానవునకు జంతువునకు వారధిగా ఉన్న నరసింహావతారము, ఆ తర్వాత వామనుడు అంటే అసంపూర్ణంగా ఉండి దైవత్వంతో సర్వాన్ని కైవసం చేసుకున్న బడుగుమూర్తి, ఆ తర్వాత రాజస, సాత్త్విక, నిర్గుణ అవతారాలు వస్తాయి. ఇవన్నీ కూడా మానవులను ముఖ్యమైన రాజసత్వాన్నుంచి సత్వమనోమయ మానవుని దాకాను, ఆ తర్వాతది అధిమానస మానవుని దాకాను తీసుకువచ్చాయి. క్రిష్ణుడు, బుద్ధుడు, కల్కి ఈ ముగ్గురు చివరి మూడు ఆధ్యాత్మిక స్థితులకు ప్రతినిధులు. అధిమానస అవకాశాన్ని క్రిష్ణుడు కలిగిస్తే, బుద్ధుడు సర్వోత్కృష్ట విమోచనానికి ఆవల స్థితికి చేరే ప్రయత్నం చేశాడు. అయితే అది వ్యతిరేక స్థితిగానే ఉండిపోయింది. అది భూమిపై పరిణామాన్ని స్పష్టపరిచి సంపూర్ణం చేయటానికి తిరిగి రాలేదు. ఈ స్థితిని సరిచేయడానికి కల్కి అవతారం దిగివచ్చి అసుర శక్తులను నాశనం చేసి దైవ రాజ్యాన్ని స్థాపించవలసి ఉంది. ఈ పురోగతి అతి స్పష్టము, పొరపాటుకు అవకాశం లేదు.

ఒక అవతారానికి ఇంకొక అవతారానికి మధ్యన జన్మల విషయానికొస్తే క్రిష్ణభగవానుడు చెప్పాడు. తాను ఇంతకు ముందు ఎన్నో జన్మలు పొందాననీ, కొన్ని పరమావతారాలే కాక తాను భగవంతుడనని చెప్పుకున్నప్పటికీ వేరొక సంద ర్భంలో తానొక విభూతినని చెప్పుకొన్నాడు — 'వృష్ణీనామ్ వాసుదేవః'. దీనిని బట్టి చాలా జన్మలలో ఆతను పూర్ణమైన దివ్యచైతన్యాన్ని మరుగునపెట్టి విభూతులుగా అవతరించినట్లుగా మనం అనుకోవచ్చు. పరిణామప్రక్రియను ముందుకు నడిపించడమే

అవతారోద్దేశంగా మనం అంగీకరంచినట్లైతే పెద్ద సంధికాలంలో అంటే ఒక పెద్ద స్థితి నుంచి వేరొక స్థితి రావలసినప్పుడు భగవంతుడు అవతారం ధరిస్తాడు. చిన్న స్థితులు దాటేటప్పుడు విభూతిగా అవతరిస్తాడనుకోవడం సబబుగా నుంటుంది.

(శ్రీఅరవిందులు వేరొక పత్రంలో తర్వాతి విషయాలను విశదీకరిస్తున్నారు)

తర్వాత మెట్టు నిరాకార అఖండాత్మ కాక అతిమానస అవతారము. అన్నిటినీ దాటిపోవాలనే ఉద్దేశంతో బుద్ధుడు, ఆదిశంకరాచార్య కూడా తప్పే చేశారని నేనను కుంటున్నాను, వారు విమోచనస్థితిలోని క్రియాశీల తత్వాన్ని వదిలిపెట్టేశారు. అందువల్ల కల్కి అవతారం దాన్ని సరిదిద్దవలసి వచ్చింది.

ఇదంతానూ ఈ దశావతార వృత్తాంతాన్నీ పరిణామ క్రమానికి ఉపమాన కథగా చెపుతూ ఆ దృష్టితోనే వివరించాను. కాబట్టి నేను చెప్పింది నా స్వంత అభిప్రాయం కాదు.

(ఇంకా)

కల్కి అవతారానికి సంబంధించిన వివరాల కంత ప్రాముఖ్యత నివ్వక్కర్లేదు. భవిష్యత్చరిత్ర వివరాలు చెప్పాలనే ప్రయత్నం కన్నా అది కేవలం ఒక ప్రతీక మాత్రమే. రాబోయే దానికొక సూచన తప్ప వేరేమీ కాదు.

*

భగవత్ చైతన్యం నేను పొంది అనుభవించినదాన్ని నేను వ్యక్తపరచాలని అనుకుంటున్నాను తప్ప అది నన్ను అవతారంగా నిరూపిస్తుందో, ఇంకేం చేస్తుందో నా కనవసరము. దానితో నాకు సంబంధం లేదు. దాన్ని వ్యక్తపరచడమంటే దివ్య చైతన్యాన్ని వెలికితెచ్చి వ్యాపింపచేసినట్లయితే ఇతరులంతా దానిని అనుభవించి, దాని యందు ప్రవేశించి అందులో జీవించగలరని నా అభిప్రాయము.

(CWSA 28:472-73, 476,478, 487, 488, 489; 35:419)

శ్రీఅరవిందులు

అనువాదము: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి



కారుణ్య సింధువు, నిశ్శబ్ద ఆలయం
ఆమె అంతర్గత సహాయం స్వర్గంలో తలుపులు తెరిచింది
ఆమె ప్రేమ విశ్వంకన్నా సువిశాలమైనది.
ఆమె ఏకైక హృదయంలో మొత్తం ప్రపంచం అంతా శరణు పొందవచ్చు.

శ్రీఅరవిందులు (సావిత్రి, 15 పుట)

శ్రీఅరవిందుల గురించి శ్రీమాత

ప్రపంచచరిత్రలో శ్రీఅరవిందులు ప్రాతినిధ్యం వహించునది ఒక ఉపదేశానికో లేక అంతర్దర్శనానికో కాదు, పరమేశ్వరుడి నుండి నేరుగా అవతరించిన నిర్ణయాత్మక క్రియాస్వరూపానికి.

*

మానవుడు నిన్నటి సృష్టికి చెందినవాడు. రేపు రానున్న సృష్టిని, రాబోయే అతిమానస జీవిని ప్రకటించడానికి శ్రీఅరవిందుల ఆగమనము.

అతిమానస ప్రపంచ అభివ్యక్తిని గురించి తెలియచెప్పుటకు శ్రీఅరవిందులు పృథ్వి పైకి అరుదెంచారు. కేవలం ఆ అభివ్యక్తిని మాత్రమే వారు ప్రకటించలేదు; దానితో పాటు సాక్షికంగా అతిమానసశక్తిని కూడా. దానిని అభివ్యక్తపరచుటకు వ్యక్తి ఏమి చేయవలసి వుంటుందో చేసి చూపించారు.

*

అనంతమైన ఆత్మపరిణామంలో, ప్రతి అవతారం ఒక ప్రకటన మాత్రమే. ఒక సమగ్ర సాక్షాత్కారం గురించి ముందుగా తెలియచేసే సూచన.

అయినప్పటికి భవిష్యత్తుకు చెందిన అవతారానికి బదులుగా గతానికి చెందిన అవతారాన్ని దైవంగా పూజించుటకు మానవులు అలవాటు పడ్డారు.

ఇప్పుడు, మరోసారి భవిష్యత్ సిద్ధిని గురించి తెలియచేయడానికిగాను శ్రీఅరవిందులు అవతరించారు. తిరిగి వారి సందేశానికి కూడ, వారి పూర్వీకులకు ఎదురైన ప్రతికూల పరిస్థితి తటస్థపడబోతుంది.

అయితే వారు సాక్షాత్కరింపచేసిన దివ్యసత్యాన్ని భవిష్యత్తే రుజువు చేస్తుంది. వారి దివ్యకార్యం నెరవేరుతుంది.

శ్రీమాత

అనువాదం: కె. కవితా రెడ్డి

శ్రీఅరవిందుల మహాసమాధి రోజున శ్రీమాత చెప్పినది

ప్రభూ, మీ పని సాఫల్యమయ్యే దాకా, మమ్మల్ని నడిపించి, ప్రకాశింపచేసే చైతన్యంగా మాత్రమే కాక, కర్మలో క్రియాశీలక సాన్నిధ్యంగా కూడా మాతో ఉంటానని ఈ ఉదయమే నాకు వాగ్దానం చేశారు. భూమి పరివర్తన పొందేవరకూ మీదైనదంతా ఇక్కడే ఉంటుందనీ, భూవాతావరణాన్ని విడిచి వెళ్ళదనీ, పొరపాటు పడడానికి అవకాశం లేకుండా స్పష్టంగా చెప్పారు. ఈ అద్భుతమైన సాన్నిధ్యానికి మేము యోగ్యులం కావాలనీ, మీ మహనీయమైన పని సఫలం కావడానికి ఇక నుంచీ మాలోని సమస్తమూ ఒకే ఒక ఇచ్ఛ మీద ఏకాగ్రమవ్వాలనీ, అధికాధిక పరిపూర్ణతతో సమర్పించుకోవాలనీ అనుగ్రహించండి.

*

డిసెంబరు 8, 1950 రోజున శ్రీఅరవిందులతో "మీ శరీరాన్ని మీరు మళ్ళీ స్వీకరించండి" అని నేను కోరినపుడు ఆయన స్పష్టంగా ఇలా చెప్పారు. "నేను ఈ శరీరాన్ని ఉద్దేశ్యపూర్వకంగానే వదిలిపెట్టాను. మళ్ళీ నేను దీన్ని వెనక్కి తీసుకోను. దివ్యచైతన్య పద్ధతిలో ఏర్పడే మొట్టమొదటి దివ్యచైతన్య శరీరంలో అభివ్యక్తమౌతాను."

*

శ్రీఅరవిందులు పరమ నిస్వార్థంతో తన శరీరాన్ని వదిలిపెట్టారు. సామూహిక సాక్షాత్కారాన్ని వేగవంతం చెయ్యడానికి శరీరంలో తాను పొందిన సాక్షాత్కారాన్ని పరిత్యజించారు. ఈ భూమి మరింత ఎక్కువగా ప్రతిస్పందించి ఉంటే నిశ్చయంగా, ఇది అవసరమయ్యేది కాదు.

*

ఇక్కడ ఆశ్రమంలో నువ్వు అనువాదం చేసి పంచిపెడుతున్న కరపత్రాన్ని గురించి విని, నాకు బాధాకరమైన విస్మయం కలిగింది. మన కోసం తనను తాను సంపూర్ణంగా త్యాగం చేసిన మన ప్రభువు, నీకు అర్థం కాలేదనీ, నీకు ఆయనపై గౌరవప్రపత్తులుండవనీ నేనెన్నడూ అనుకోలేదు. శ్రీఅరవిందులు అశక్తులు కాలేదు. తన శరీరాన్ని వదిలిపెట్టబోయే కొన్ని గంటల ముందు పక్క మీద నుంచి లేచి, చాలాసేపు తన

పడక కుర్చీలో కూర్చుని చుట్టూ ఉన్నవారితో చాలా హాయిగా మాట్లాడారు. శ్రీఅరవిందులకు శరీరాన్ని వదిలిపెట్టాలన్న నిర్బంధమేమీ లేదు. మానవమనసుకు అందని మహనీయమైన కారణాల వల్ల ఆయన కోరి ఈ నిర్ణయం తీసుకున్నారు.

అర్థం చేసుకోలేకపోతే ఎవరైనా చేయవలసిందొక్కటే. గౌరవప్రదమైన నిశ్శబ్దాన్ని పాటించడం.

*

ప్రశ్న: విశ్వచరిత్రలో శ్రీఅరవిందుల పుట్టుక 'శాశ్వతం' అన్నారు. 'శాశ్వతం' అంటే అర్థమేమిటి?

సమాధానం: ఈ మాటను చైతన్యానికి చెందిన నాలుగు వేర్వేరు ఆరోహణా భూమికలలో అర్థం చేసుకోవచ్చు:

1. భౌతికంగా, ప్రపంచానికి సంబంధించి, ఆయన పుట్టుకవల్ల కలిగే పర్యవసానానికి శాశ్వత ప్రాముఖ్యం ఉంటుంది.

2. మానసికంగా, విశ్వచరిత్రలో ఈ పుట్టుక, శాశ్వతంగా గుర్తుంచుకోదగినది.

3. చైత్యపురుషపరంగా, ప్రతియుగంలో భూమి మీద శాశ్వతంగా పునరావృతమయ్యే పుట్టుక.

4. ఆధ్యాత్మికంగా, ఈ భూమి మీద 'శాశ్వతుని' పుట్టుక.

(CWM 13:6-10)

శ్రీమాత

అనువాదం డా. తెన్నేటి నాగరంజని

భగవంతుడు మానవతలోనికి దిగివచ్చినందువల్ల, మనిషి దైవత్వంలోని కెదగడం గనుక జరుగకపోతే, ధర్మం కోసం, అవతారతత్త్వం దిగిరావడమనేది ఒక నిష్ప్రయోజన కార్యం అవుతుంది. కేవలధర్మం, కేవల న్యాయం లేదా సాధుజీవన ప్రమాణాలు యెల్లప్పుడూ, మహాత్ములు, లేక మహోద్యమాలు, ఋషులు, రాజుల, మతాచారుల జీవితం, కర్మల వంటి సాధారణ సాధనోపాయాల ద్వారా, అసలైన అవతారంతో పని లేకుండానే సర్వశక్తివంతమైన దైవంతో పరిరక్షింపబడుతుంటాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు



శ్రీఅరవిందుల దేహపరిత్యాగం – దాని అంతరంగ ప్రాముఖ్యత, పర్యవసానం

అమల్ కిరణ్

"నా జీవితం గురించి ఏ ఒక్కరూ వ్రాయలేరు, ఎందువల్లనంటే మనుషులకు కన పడే రీతిలో అది బాహ్యంలో లేదు" – శ్రీఅరవిందుల జీవితచరిత్రను నిర్దిష్టంగా వ్రాయాలనే ఆలోచనను ప్రతిపాదించినప్పుడు ఆయన అన్న మాటలివి. అందులో సందేహం ఎంతమాత్రం లేదు. ఇంగ్లాండులో ఆయన విద్యాభ్యాసకాలం, భారతదేశంలో జాజ్వల్యమానమైన ఆయన రాజకీయ జీవితపు ప్రథమాంకం మినహాయించి, ఆయన జీవితం ఎంతో లోతుగా అంతర్ముఖమై, దాని పూర్ణత్వాన్నీ, ఉద్దేశాన్నీ, సాధించిన దానినీ బాహ్యసంఘటనల ఆధారంగా మానసిక విశ్లేషణతో అనుసంధానించి విడమరచి సవివరంగా వర్ణించ నలవికానిది. దాని దర్శనం కొంతైనా పొందాలంటే, ఒకరు బృహత్తర్థమైన అద్భుతాల సమాహారమైన సాంప్రదాయక ఆధ్యాత్మిక సాక్షాత్కారా నుభవ సూచనలను అందుకున్నవారై ఉండటమే కాకుండా, నూతనమై, భూపరివర్తనను గావించే కనులు మిరుమిట్లు గొలిపే ప్రకాశపు అపారతలను, వేటినైతే అతిమనస్సని ఆయన అన్నారో, నలభై సంవత్సరాలు దానిని యథాతథంగా బాధిత మానవజాతి కోసం కిందికి తీసుకురావడానికి కృషి చేశారో, అటువంటి దాని సూచనలను సైతం అందుకున్నవారై ఉండాలి. అసాధారణమైన ఆయన జీవితంలాగే, ప్రపంచంలో ప్రకటించబడిన ఆయన మరణం కూడా అసాధారణమైనది. శ్రీఅరవిందుల జీవితం ఎంత అంతర్ముఖమైనదో, ఎంతటి అపార జ్ఞానసంపన్నమైదో, వారి మరణం కూడా అంతే విలక్షణతతో కూడుకొన్నది.

ఏ యోగీ వాడుకభాషలో చెప్పే విధంగా చనిపోవడమనేది జరుగదు: అతడి చైతన్యం ఎల్లప్పుడూ భౌతకి శరీర సూత్రాలను అధిగమించే ఉంటుంది, అతడు భౌతిక ఆవరణలో నివసిస్తున్నా, దానికి సుదూరంగా, దానిని మించి ఉంటాడు. మానవజాతి మీద ఆతని కార్యసరళి ముఖ్యంగా ఆతడి స్వేచ్ఛాయుతమైన, విశాలమైన ఆత్మశక్తి ద్వారా జరుగుతుంటుంది. దానికి జీవితం, చావు అనేవి దివ్యుని, శాశ్వతుని అపరిమిత అస్తిత్వంలో, అమృతత్వం ఎరుకను సంపూర్ణంగా కలిగినదాని చిన్ని ముసుగులు మాత్రమే. అంతకు మించి, యోగేశ్వరుడైన శ్రీఅరవిం

దులకు 'మరణం' అనే మాట ఆయన తన దేహాన్ని వదిలిపోవటానికి ఎంతమాత్రమూ వర్తించదు. ఎందువల్లనంటే, అతిమానసం పరివర్తనశక్తి ఆయన శరీరంలోని కణాలలో సైతం పనిచేస్తున్నది; అది మానసికతకు ఏమాత్రం తక్కువ కాకుండా భౌతికంలోనూ తన ప్రభావాన్ని శాసించింది. దానికి వందలాది శిష్యులే ఋజువు, కారణం వారికి, తమ వ్యాధుల మీద అది చూపించిన అద్భుతమైన నివారణ ప్రభావం. ఈ ప్రభావం ఆశ్రమానికే పరిమితం కాలేదు: భారతదేశం లోని టెలిగ్రాఫు కార్యాలయాలన్నీ ఎన్నో రకాలైన జబ్బులకు సహాయం కోసం రోజూ వచ్చే మెరుపు విన్నపాలతో సాక్ష్యాలుగా నిలుస్తాయి — అందులో కొన్ని వైద్యశాస్త్రానికి సవాలుగా నిలిచినవి — అటు తరువాత ఆధ్యాత్మిక మార్గంలో జరిగిన వ్యాధి ఉపశమనం, నివారణకు కృతజ్ఞతాపూర్వక సందేశాలు వచ్చిపడేవి. శ్రీఅరవిందులు మరణించారనడం సరి కాదు, శ్రీఅరవిందులు అతిమానసపు యోగి, ఆయన బాహ్యంలోనేకాక, అంతరంగంలో సైతం అతీత లోకాల అనంతమైన అమృతత్వంతో పాటుగా దివ్యజీవనాన్ని భూమి మీదకు తీసుకురావడానికి అవతరించారు. ఆ కారణంగా ఆయన వెడలిపోవడాన్ని, ముదిమి వయస్సు వల్లనో, భౌతిక కారణాల వల్లనో జరిగిందని అనుకోవడానికి వీల్లేదు. వ్యాధిపరంగా అది ఎంత స్పష్టంగా ఉన్నప్పటికీ, దాని వెనుక తప్పకుండా సమగ్రమైన, అత్యంత గమనార్హ మైన ప్రమాణాల కందని భౌతిక జీవితానికి మించిన ఆయన ఆధ్యాత్మిక సిద్ధికి ప్రాముఖ్యత ఉంది.

వ్యాధి అద్భుతంగా టక్కున అదృశ్యమైపోయే నివారణోపాయంతో నివారింపపడకూడదు. దానికి తగిన చికిత్సతో ఉపశమనం చెందాలి అనే సూత్రానికి శ్రీఅరవిందుల యోగానికి సామ్యత ఉంది. ఆయన యోగం ఒక విధానం, పరిణామంతో పురోగతి నొందే పద్ధతి: అది విభ్రమాలతో తబ్బిబ్బు చేస్తూ దైవలక్షణాలను పైపైన ఆరోపించి, మానవప్రకృతి బీజాలను మార్పుకు గురిచేయకుండా వదిలివేయుట దాని లక్ష్యం కాదు. అయితే అది ఆధ్యాత్మికపరంగా శరీరావయవాలు ప్రకాశవంతంగా ఎదిగి, దివ్యప్రకృతి ప్రకృతిలో ఇమిడిపోయి, ఏదో అత్యద్భుతమైనదే కాని అసహజమైన రూపపరివర్తనం కాక, జీవితపర్యంతం చేసిన తీవ్రపరిశ్రమతో భూపరిణామ లక్ష్యానికి పరాయిది కానటువంటిదై, పూర్తిగా వస్తువిషయ ధర్మాలకు లోబడి దాని అంతరాళల్లోని అర్థాన్ని, ఆ విధంగా బహిర్గతమవటానికి యుగాలు పట్టేదైనప్పటికీ, బహిర్గతం చేసేటటువంటిది. శ్రీఅరవిందుల దివ్యమనోయోగంలో పరిణామగతి

ఎల్లప్పుడూ విప్లవాత్మక భావాలతో సంధించబడి ఉంటుంది. ఏ విధంగా అయితే ఆయన జీవితంలోని సాహసకృత్యాలు, ఆయన పద్యగద్య కావ్యశిల్పాల మాదిరిగా ఎల్లప్పుడూ ఆనందాన్నిస్తూ, సులభతరంగా, సమయస్ఫూర్తితో, ప్రకృతిని ఉల్లంఘించకుండా మహిమాన్వితంగా దానిని మలచుకుంటూ పోయిందో అదే మాదిరిగా ఆయన మరణమనే సాహసయాత్ర పూర్తిగా అసాధారణం కాదు, కాని అది సమృద్ధిని కలిగి ఫలప్రదమై, సర్వసాధారణంగా సాగిపోయే పద్ధతిలోని నిశ్చలతకు, ఛాయకు కొంత పోలిక కలిగి ప్రత్యేకమైన రీతిని కలిగి ఉంది.

కనుక వైద్యశాస్త్రం వివరించి చెప్పటానికి ప్రయత్నించే భౌతిక కారణాలు, వాటి వలననే శ్రీఅరవిందులు చనిపోలేదనే ప్రతిపాదనను ఎంతమాత్రం పూర్వపక్షం చేయలేవు. ఈ ప్రతిపాదన శ్రీఅరవిందుల ప్రత్యేకమైనటువంటి ఆధ్యాత్మిక స్థితి మీద ఆధారపడి ఉండటమే కాకుండా గుర్తించదగిన ఎన్నో వాస్తవమైన భౌతిక కారణాల మీద కూడా ఆధారపడి వుంది. వైద్యులు తాము ఇచ్చిన ప్రేరణకు ప్రతిస్పందన లేకపోయినదాని ఫలితంగా, నివారణోపాయాలన్నీ ఫలించని పరిస్థితిలో, తీవ్రమైన మూత్రపిండాల వ్యాధి పర్యవసానంగా ఆయన పూర్తిగా కోమాలోకి వెళ్ళిపోయారని ప్రకటించారు. ఆ విధంగా కోమాలోకి పోయినవారు తిరిగి చైతన్యవంతులు కాలేరనే విషయం నూతనంగా వైద్యవృత్తిలోకి అడుగుపెట్టిన ప్రతివారికి కూడా తెలిసినదే. అయినప్పటికీ, ఆయనకు వైద్యం చేస్తున్న వైద్యులు ఆశ్చర్యపడే విధంగా, శ్రీఅరవిందులు తరచూ మధ్య మధ్యలో కనులు తెరవడమే కాకుండా, తాగటానికి నీటిని లేదా టైమెంతయిందని అడిగారు! ఈ రకంగా పలుమార్లు పునరావృతమయిన, వైజ్ఞానికశాస్త్రరీత్యా అసాధ్యమైన విషయాలు ఈ మూత్రపిండాల వ్యాధితో వచ్చే కోమాతో కలగలసిపోయాయనే విశ్వాసం కలిగిస్తోంది. అది ఏ విధంగానంటే, సాధారణ క్రియలకు పనికిరాకుండా పోయిన ఉపకరణం నుంచి ఎంతో ఎరుక గలిగిన యోగి తనను తాను ఉపసంహరించుకోవటం జరిగినప్పటికీ అది అసాధరణమైన తన ప్రభువు ఇచ్ఛను ఏమాత్రమూ అడ్డుకోలేకపోయినట్లుగా ఇచ్చట మెదడులో వున్నది కేవలం కర్బనం, ఇనుము, భాస్వరం మాత్రమే కాదు: ఇక్కడ మనస్సు యొక్క అతిసూక్ష్మ గ్రహణశక్తి కలిగిన భృత్యుడు దేవుని శిఖరాగ్రాల మీద కూర్చుని అక్కడి నుంచి నిర్ధారిత పదార్థ ధర్మాలన్నింటి మధ్యన ప్రతిస్పందనను శాసించాడు. శ్వాస ఆగిపోవటానికీ, గుండె కొట్టుకోవటం ఆగిపోవటానికీ అరగంట ముందు కూడా,

శ్రీఅరవిందులు తన ప్రశాంత దయాపూరిత దృక్కులతో చూసి, తన పక్కనున్న వైద్యుని పేరును ఉచ్ఛరించి, కొంత నీరు త్రాగారు. ఇది వైద్యచరిత్రలోనే అత్యాశ్చ కరమైన మూత్రపిండాల వ్యాధికి సంబంధించిన కోమా.

ఈ యోగులకే యోగి అంతిమ ఘడియలు అసాధారణ రీతిలో సాగిపోయిన రీతి అంతటితో ముగిసిపోలేదు. మూత్రపిండాలు తోసివేయవలసిన రక్తంలో హానికారక విషపదార్థాలు పూర్తిగా శరీరమంతా వ్యాపించిందని వైద్యులు రూఢీపరచిన వ్యక్తి ఉన్నటువంటి రోగపరిస్థితిలో, అతని శరీరం చాలా త్వరితగతిన రంగుమారిపోతుంది, శీఘ్రంగా నలుపురంగు అలుముకుంటుంది, వెంటనే కుళ్లిపోవడం మొదలుపెడుతుంది. కాని అధికారికంగా మృత్యుధ్రువపత్రం జారీ చేసిన రెండున్నర రోజుల తర్వాత ఫ్రెంచి వైద్యులు, భారతీయ వైద్యుల సంప్రతింపులు జరుగుతుండగా వారికి శ్రీఅరవిందుల శరీరం, ఏదయితే తెలుపు-బంగారు వర్ణానికి ప్రసిద్ధిగాంచిందో అది ఆ విధంగానే ఉండి, ఈషణ్మాత్రమైనా కుళ్ళుతున్న ఛాయలు లేవని గమనించారు. అది ఆయన వెడలిపోయిన క్షణాలలో — డిశంబరు 5, తెల్లవారు ఝామున 1.26 ని.లకు — ఏవిధంగా ఉందో, అది అదే విధంగా 41 గంటల తర్వాత కూడా ఉంది, ఆ సమయంలో నిర్ధారిత ఖనన సమయాన్ని అనిశ్చితంగా వాయిదా వేయబడుతున్నదనే శ్రీమాత చేసిన ప్రకటన లోకప్రసిద్ధం:

"శ్రీఅరవిందుల అంత్యక్రియలు ఈ రోజు జరుపబడ లేదు. ఆయన శరీరం అతిమానస తేజస్సుతో ఎంతగా ఏకాగ్రతతో దట్టించబడిందంటే, శరీరం కుళ్ళబోతున్న సూచనలు ఎక్కడా కనబడలేదు; ఆయన శరీరం అది ఎంతకాలం ఇదివరకు ఉన్నట్లుగా అదే విధంగా చెక్కుచెదరకుండా ఉంటుందో అప్పటిదాకా దానిని ఆయన మంచం మీదనే ఉంచబడుతుంది. "

అది ఆ విధంగా చెక్కుచెదరకుండా చాలా రోజులు మహద్వైభవంగా విజయం వరించిన ప్రశాంతిలో ఉండగా, వేలకు వేలుగా ప్రజలు ఆ అవతారమూర్తిని దర్శించుకున్నారు. కేవలం డిశంబరు 9 సాయంత్రం 5 గంటలకు దానిని అతిసాధారణ రీతిలో వెండి, సాటిన్ బట్టలతో లోపల పొరలు వేయబడిన రోజాచెక్కతో చేసిన పెట్టెలో, ఎటువంటి మతసిద్ధాంతాలకు సంబంధించిన తంతూ లేకుండా, ఆశ్రమం ప్రాంగణం మధ్యలో ప్రత్యేకంగా తయారుచేయబడిన గుంటలో సమాధి చేశారు. శరీరాన్ని పెట్టెలో ఉంచే సమయంలో కూడా, ఏ విధంగానూ చెడిపోవటంగానీ,

మృతవాసనగానీ లేదు, కానీ అద్భుతంగా, చెడిపోకుండా భద్రంగా కాపాడుతున్న తేజస్సు వెడలిపోతున్న ఛాయలు మాత్రం ఉన్నాయి. ఆ తేజస్సు సంపూర్ణంగా 90 గంటల పైగా అక్కడే ఉన్నదని చెప్పవచ్చు — అది లియాన్స్ మెడికల్ జూరిస్ ప్రూడెన్స్ తూర్పుదేశాలలోని వాతావరణ స్థితిగతుల ననుసరించి ఒక మృతశరీరాన్ని చెడిపోకుండా, ఎంత సమయం ఉంచవచ్చని చెప్పిందో దానికి రెండింతల ప్రమాణ కాలం.

జీవితానికి అంతిమఘడియలు సమీపించినప్పుడూ, దాని తర్వాతనూ, దట్టమైన మృత్యుఛాయలో ఉన్నప్పుడూ పదార్థం మీద ప్రభువు ఆధిపత్యం అభివ్యక్తమైంది, ఎక్కువెక్కువగా నిరంతరం వృద్ధి అవుతూ వచ్చిన శ్రీఅరవిందుల అతిమనస్సు పరివర్తనా శక్తి కాదనలేనిది, కాని అది విపరీతార్థాలతో వివరించబడింది. దానిని గురించి, చాలా తక్కువగా చెప్పాలంటే, అతిమానస ప్రకాశం గురించి, ఏ కొంచె మైనా అర్థం చేసుకుంటే ఆయన స్వచ్ఛందంగా వెడలిపోయిన క్షణాల పరాకాష్ఠకు కారణమైన పరిస్థితుల ప్రాముఖ్యతను తప్పక తెలుసుకోగలరని ఆయన దేహపరిత్యాగ ఘటన నంతటిని తరచిచూస్తే వివేచించి గ్రహించవచ్చు. కాని ఇక్కడ ఒక ప్రశ్న తెలెత్తుతుంది: దేహపరిత్యాగం స్వయంనిర్ణయమైతే, రాబోయేదాని సూచనలను ఆయన ఏమైనా ఇచ్చారా? అవుననేదే దానికి సమాధానం. ఆయన శిష్యులకు వ్రాసే ఎంతో జ్ఞానప్రకాశాన్నిచ్చే జాబులలో ఏమాత్రం తగ్గుదల లేనప్పటికీ లేదా అప్పుడప్పుడు చెంగుమని దూకుతూ, చెణుకులు విసురుతూ బయల్పడే సున్నిత హాస్యప్రియత్వాన్ని మరచిపోవనప్పటికీ లేదా ప్రపంచం మీద ఆ విశాల దృష్టిని ఇతరత్రా మరల్చకపోవనప్పటికీ అది యాదార్థమే. ఆయన గత రెండు మూడు సంవత్సరాలుగా తన భవిష్య ప్రణాళికల గురించి వివరించి మాట్లాడకపోవటం, ఎక్కువెక్కువగా తన ఆధ్యాత్మిక కార్యంలోనూ, సాహిత్యదృష్టిలోనూ నిమగ్నమై పోవడం, — ముఖ్యంగా ఐతిహాసిక కావ్యమైనటువంటి చారిత్రకగాథ — ప్రతీక అయిన సావిత్రి విషయంలో అది ప్రస్ఫుటం. కాని ఆ మౌనం, ఆ వీలీనం ద్వారా కొన్ని ఊహించనటువంటి అత్యాశ్చర్యకరమైన, సంప్రాప్తించబోయే విపత్కర పరిస్థితులను ఆయన తన విధాయక కార్యానుసరణ క్రమంలో ఎదుర్కొనబోతున్నారనే వాటి కొన్ని సంజ్ఞలు మినుకు మినుకుమంటూ అస్పష్టంగా వెల్లడైనాయి.

నవంబరు మధ్యకాలంలో ఒక రోజు ఒక గుజరాతీ జ్యోతిష్కుని భవిష్యవాక్కులు

ఆయనకు చదివి వినిపించడం జరిగింది. 1950 మరియు 1964 సంవత్సరాల మీద వాటి దృష్టి కేంద్రీకృతమైంది. ఆ జ్యోతిష్కుడు ఈ విధంగా వ్రాశాడు: "1950 వ సం.లో రవిచంద్రుల కలయిక వలన, చంద్రుడు 12 వ స్థానానికి అధిపతి అవడం మూలంగా, శ్రీఅరవిందులు తమకు తాముగా కాలధర్మం చెందే అవకాశం ఉంది." 1964 గురించి ఆయన అభిప్రాయం "ఆ సంవత్సరంలో శ్రీఅరవిందుల శక్తిమంతమైన అద్భుతం తిలకించబడుతుంది. 93 సంవత్సరాల వయస్సులో ఆయన తన విధాయక పనిని సంపూర్తిగా నిర్వర్తించి, ఇచ్ఛానుసారంగా ప్రపంచం నుంచి ఉపసంహరించుకుంటారు." దానిని విని, శ్రీఅరవిందులు చేయి పైకెత్తి, కొంత హాస్యభరితంగా ఇలా అన్నారు, "ఏమిటీ, తొంభైమూడా!", ఆయన చేయవలసిన పని పూర్తవటానికి ఆ వయస్సు చాలా దూరమని ఆయన చూసినట్లుగా అందులో ధ్వనించింది. 1950 గురించి ఒక శిష్యుడు మాట్లాడుతూ, ఆ సంవత్సరం చాలా ముఖ్యమైనదనీ, ఎందువల్లనంటే, శ్రీఅరవిందుల జీవితంలో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి ముఖ్యమైన సంఘటనలు జరిగాయని వ్యాఖ్యానించాడు. శ్రీఅరవిందుల ఆధ్యాత్మిక జీవితంలో 1926 ప్రముఖంగా ప్రస్తావించదగిన సంఘటన జరిగిన సంవత్సరం: రాబోయే విజయం మీద పూర్తి నమ్మకం కలిగించిన సంవత్సరం. శ్రీమాత ధగద్ధగాయమానంగా ఆశ్రమం అధ్యక్షతా కార్యక్రమాలు చేపట్టి, మొదలు పెట్టినదానిగా గుర్తింపుపొందిన సంవత్సరంగా కూడా అదే. అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న దానికి 12 సంవత్సరాల తర్వాత 1938 లో శ్రీఅరవిందులు కిందపడి, తుంటియెముక విరగడం మూలంగా ఏర్పడిన భౌతికమైన గడ్డు పరిస్థితిని దాటారు. 1950 సంవత్సరం — ఆయన కాలధర్మం చేస్తారని సూచించబడిన సంవత్సరం — తిరిగి 12 సంవత్సరాలు పూర్తయిన కాలం. జ్యోతిష్కుడు శ్రీఅరవిందుల జీవితంలో 93 ఏండ్ల వయసును చాలా ప్రసిద్ధమైనదిగా గుర్తుంచుకోదగిన కాలంగా చెప్పినప్పటికీ, శ్రీఅరవిందులు ఆ వ్యాఖ్యలను ఏమంత ప్రాముఖ్యమైనవిగా తీసుకోలేదు. ఆయన ఈ విధంగా అన్నారు, "అతడు కొంత సత్యాన్ని గ్రహించాడు". అప్పుడు ఆయనను ప్రశ్నించడం జరిగింది, "ఈ సంవత్సరం మీ కాలధర్మం అనే విషయం అర్థంలేని మాట కదా? కచ్చితంగా మీరు మమ్మల్ని వదలిపోవటంలేదు కదా?" ఏమాత్రం తొందరపడని తత్త్వం కలిగిన ఆయన నుంచి ప్రశాంతతతో కూడిన ఒక నిగూఢమైన మాట ఎదురు ప్రశ్నగా

వచ్చింది: "ఏ కారణంగా".

శ్రీఅరవిందుల కార్యక్రమంలో అతిమానసం ఎక్కువెక్కువగా అవరోహించడం మూలంగా అసాధారణంగా జీవించగలగటం ఒక భాగమని తలపోసిన వారందరికీ అది చాలా ఆశ్చర్యం కలిగించే మాట యిది. ఊహించనివిధంగా ఆనందాన్ని హరించివేసే మరొక ఆశ్చర్యకర సంఘటన ఒకటి అందరినీ కలచివేసింది. ఎవరైతే ఆయనకు సేవ చేశారో లేదా అయన గదిలో పనిచేశారో వారికి హఠాత్తుగా ఆయన వ్యక్తిగతంగా వాత్సల్యాన్ని చూపించారు. శ్రీఅరవిందులది కచ్చితంగా భావాలను వ్యక్తపరచే స్వభావం కాదు: ఆయనలో సమస్తమునూ ఆవరించియుండే ఆకాశంవలె అతిసూక్ష్మ మైన దయార్ద్రహృదయం ఉంది; ఆయన తలపెట్టిన పనిలో, చేసే పరి శ్రమలోనూ, క్లిష్టసమయంలో సైతం శిష్యులకు వ్రాసే అనేకానేక ఉత్తరాలవల్లనూ ఆయన అత్యంత కారుణ్యహృదయం తెలిసినదే అయినా, భౌతికంగా ఆయన పితృవాత్సల్యాన్ని వ్యక్తపరచిన సంఘటనలు అరుదు. కాని ఇప్పుడు చాలా తక్కువ సమయం ఆయనకు పరిచర్య చేయడానికి వెళ్ళిన ప్రతివారికి వేరువేరుగా వేరువేరు సందర్భాలలో ప్రత్యేకమైన వాత్సల్యంతో కూడిన బాహ్యసంజ్ఞలను చూపించారు, అది ఏ విధంగా ఉండిందంటే, వారు చేసిన సేవకు ఆయన తన ప్రశంసను కాలాతి క్రమణం జరగకుండా తెలాపలనుకున్నట్లుగా ఉండింది. ఆ హావభావాలు, అత్యంత మధురమై, ఆహ్వానించదగినవే అయినా, అది సెలవు తీసుకోబోతున్నారా అని అనిపించే అస్పష్టతతో నిండిన హృదయవిదారకదృశ్యంగా కనిపించింది.

గమనించదగిన మూడవ ఆశ్చర్యకరమైన విషయం: శ్రీఅరవిందులు ఉత్తరంగానీ లేక పుస్తకంగానీ ఆయన చెప్తున్నప్పుడు వ్రాసే పని అప్పగించబడిన ఒక శిష్యునికి విచిత్రమైన మాట ఒకటి చెవిన పడింది. తాను ఇదివరకు రూపం ఇచ్చినదానినే తిరగవ్రాస్తూ, నిరంతరం కొత్తదానిని జోడిస్తూ, ప్రాముఖ్యతలు విపులీకరిస్తూ, గాధను మరింత సుసంపన్నం చేస్తూ, సంజ్ఞలను విస్తరిస్తూ, ఆయన సమీపించగలిగి దర్శించిన అతిమానవుని సీమల ఉనికినీ, చైతన్యాన్నీ ఎక్కువెక్కువగా తీవ్రతతో అందుకుంటూ, తనకు సుపరిచితమై ప్రవర్ధమానమౌతూ వచ్చిన శాశ్వత సత్యంతో ఒళ్ళుజలదరించే దేవతల కదలికల అత్యంత విస్తారమైన లయలతో అనుక్షణం ఊపిరి పీలుస్తూ, ఆ ప్రభువు అనేక సంవత్సరాలుగా సావిత్రి గ్రంధరచనలో విరామం లేకుండా ఉన్నారు. ఎంతో గాఢమైన నిశ్శబ్దంలో నుంచి ఒక అమృతవాక్కు, ఒక అలౌకిక వాక్యం —

వాటిని బహిర్గతం చేయడానికి అనంతకాలం నిరీక్షిస్తున్నట్లుగా — వైభవోపేతంగా హఠాత్తుగా బయటకు వెలువడే అతీంద్రియమైన అలంకారిక దృష్టాంతాలతో కనుల ముందు సాక్షాత్కారమిచ్చే వర్ణనలతో అల్పాతి అల్ప సందర్భములను వివరించడంలోనూ పెట్టవలసిన గుర్తుల మీద లేదా క్రమవరుస మీద దృష్టిని నిలుపుతున్నా, మళ్ళీ సర్వతోముఖ గ్రాహ్యశక్తి ఉన్నప్పటికీ సూక్ష్మాతిసూక్ష్మాంశాల మీద కూడా అంతర్బుద్ధి కలిగి రచన ముందుకు సాగిపోతూ ఉండేది. రాచఠీవితో గంభీరంగా, ఎంతో శ్రమపడి బహుకాలం తీసుకున్న రచన సావిత్రి, పూర్వకాలానికి సంబంధించిన భావావేశాలతో పొందుపరచబడి, ఆకర్షణీయంగా పరమానందభరితంగా అక్షర నిర్మాణం చేయబడింది — అది ప్రత్యేకించి రామాయణ, మహాభారతాలను అందించిన వారి భావావేశాలు, ఏ విధంగా వారి విస్తృతాశయంతో, రహస్యలోకాలలోని దేవతలు, రాక్షసులు, భూతాలు భూలోక కార్యక్రమాలలో భాగస్వామ్యమైనవారి విధానాన్ని సైతం కలిపి వర్ణించారో ఆ విధానాన్ని కలిగి యున్నది. ఒక విధంగా విశ్వమంతటినీ సంపూర్ణంగా చుట్టబెట్టింది శ్రీఅరవిందుల రచన. ఆయన తన కావ్యం అతిమానస యోగంలోని అసాధారణ రహస్యాలను పద్యపాదాలలో శ్రావ్యబద్ధంగా బహుముఖాలతో, అనేకానేక రంగులతో మలచి అలంకరించాలని తపించారు. దానిని అసదృశమైన దర్శనంగా మరియు అసమానమైన అనుభవాల నిలయంగా చేయడానికి యాభైవేల పంక్తులు అవసరమని తలచారు. ఆ దర్శనం, ఆ అనుభవం ఎంత విశాలమైనదో అంత ఓర్పు ఐతిహాసిక కావ్యరచన చేస్తున్నప్పుడెల్లప్పుడూ శ్రీఅరవిందుల సహజ లక్షణమైంది. ఆయన అప్పటికే పదకొండవ లేదా పన్నెండవ మారు తిరిగి దానికి మార్పులు చేర్పులు చేయడంతో తీరిక లేకుండా ఉన్నారు. కావ్యం వ్రాసేవారికి దానిలోని ప్రధానమైన ఇటువంటి పంక్తులను శ్రీఅరవిందులు చెప్తున్నప్పుడు కాలం అంతులేకుండా ఆయనకు అందుబాటులో ఉన్నదా అని అనిపించేది:

నర్తనలోని మార్మికతను, చలనమును కలిగిన
స్వచ్ఛమైన పారవశ్యాల పూజారిణి
బయల్పడెడు మహాసత్యపు లంఘమునుంచి కలిగిన ప్రోత్సాహము, పరిపాలనము
కదలును ఒక విధమగు దేవతల భవిష్య సారంగమునకు,
పుష్కలమగు సృజన లయల ధ్వనుల కావాసమై
ఉషోదయారంభమును పోలిన శరీరము

దైవనిర్దేశిక స్థాన మనిపించు దివ్యత్వపు ముసుగు
లేక విషయముల కావల సుదూరపు స్వర్ణదేవాలయపు వాకిలి.

కాని హఠాత్తుగా విధి నిర్ణయించిన డిశంబరు 5 కు కొన్ని నెలల ముందు శ్రీఅరవిందులు తనవద్ద నున్న లేఖకుడితో ఈ విధంగా పలుకుతూ అతడిని ఉలికిపాటుకు గురిచేశారు:

"నేను సావిత్రిని త్వరగా తప్పక పూర్తిచేయాలి."

సహజంగానే, ఇది ఆయన నిర్వాణం తేదిని గాని లేక వెడలిపోవాలనే ఆయన కోరికనుగాని నిశ్చయించవు, కాని స్పష్టంగా, ఆయన తనకు తానుగా కోరి చిక్కుకున్న భయంకరమైన సంఘర్షణ ఆ తేదీన ముగింపుకు చేరుకుంటుందని, భవిష్యత్తులో జరిగే విషయంగా అప్పటికే అది మసకమసకగా పరిసర వాతావరణాన్నంతా కమ్మి వేసింది. సావిత్రికి సంబంధించిన ఒక ఘటన ప్రస్తుతానికి అత్యంత ఉచితమైన రీతిలో ప్రతీకగా అమరిపోతుందనవచ్చు. ఆయన ఐతిహాసిక కావ్యాన్ని త్వరగా పూర్తి చేయాలని విశ్వప్రయత్నం చేస్తున్నా, అది కొంత అసంపూర్ణంగానే ఉండి పోయింది. పన్నెండు పుస్తక భాగాలుగా దానికి ప్రణాళికను రూపొందించడం జరిగింది, ఉపసంహారంతో సహా. కాని ఉపసంహారం వ్రాయబడుతున్నప్పటికీ — సాధారణంగా చిత్తుప్రతిగానైనా — ఇతర పుస్తకాలు ప్రారంభాలు, లోకయాత్రికుడు, దివ్యమాత, పుట్టుక మరియు అన్వేషణ, జీవితం, ప్రేమ, విధి, ఇంకా ఎన్నో పుస్తకాలు అచ్చులో గాని లేక వ్రాతప్రతి రూపంలోకాని ఉన్నప్పటికీ, ఏ రూపంలోనూ లేని ఏకైక పుస్తకం ఒకటి — చాలా కాలం క్రితం వ్రాసిన ఒక చిన్న భాగం తప్పించి, తిరిగి తిరగ వ్రాయాలనుకున్నదీ, మొత్తం గ్రంధంలో భాగంగా కలిపి పొందుపరచాలనుకున్నదీ — మృత్యువు. చాలా ఎక్కువగా దానంతటదే స్ఫురించే విషయం, భయంకరమైన భూతప్రేత భూమికలపై వాస్తవంగా పట్టు బిగించి సాధించేవరకు అ పుస్తకానికి ఒక రూపాన్ని ఇవ్వకూడదని అనుకున్నట్లుగానూ, శ్రీఅరవిందులు ఈ చారిత్రక గాధ – ప్రతీకలోని ఈ భాగాన్ని వ్రాయడం కొనసాగించడానికి స్వయం తన శరీరం ఉనికికి చాలా శక్తివంతమైన సంకట పరిస్థితి కోసం నిరీక్షించారా అని అనిపించేదిగా ఉన్నది.

డిశంబరు నెలలో ఆ రోజున జరిగన ప్రతీది ఏమాత్రము పూర్తిగా భౌతికమైన దుర్ఘటన కాదనీ, ధర్త్రి మీద దివ్యజీవనాన్ని అభిలషించి అన్వేషించే సాధకుడికి

అది కాకతాళీయంగా జరిగిన ప్రమాదం కాదనేదానినీ ధ్రువపరుస్తున్నది. అంతేకాక స్వయంగా స్వచ్ఛందంగా ఆమోదించిన భయంకరమైన సాహసోపేతమైన యుద్ధం కాగా, ఒక లక్ష్యాన్నుద్దేశించి సంభ్రమాశ్చర్యకరరీతిలో పరీక్షకు లోబడుతూ, శాశ్వతుడగు పరమాత్మ అభివ్యక్తమవటానికి అత్యంత వరప్రదాయియైన, వైభవోపేతమైన శరీరోపకరణాన్ని ప్రయాసతో పురోగమింపజేస్తూ, సమరంలో దానికి తగిలే ప్రతి దెబ్బనూ సవివరంగా సహిస్తూ, దానిని పోగొట్టుకోవటం ఏ సమయంలోనైనా సంభవమేనని తేటతెల్లమవుతున్నా దాని లోపాలు పంచుకుంటూనే ఉన్నారనేది సత్యం. కాని ఈ ప్రశ్నకు సమాధానం దొరకవలసి ఉంది: ఇంత విపత్కరమై ప్రాణాపాయకరమైన ప్రయోగానికి హేతువు ఏమిటి? కేవలం మానసిక సమాధానం పూర్తి సంతృప్తినిస్తుందనేది సందేహాస్పదమే. బహుశా ఎవరూ ఆ ప్రయత్నం చేయబోరు. మనం శ్రీఅరవిందులు స్వయంగా తన ఇచ్ఛప్రకారం తాను ఎన్నుకున్న కార్యపురోగమనానికి ఏది అత్యంతాశ్యకమో దానిని చేశారనే ధృఢవిశ్వాసంతో సమాధానపడాలి, భవిష్యత్తులో పూర్ణయోగం వాస్తవ అభివృద్ధికి పరమోత్కృష్ట హేతువుతో నిండిన ప్రభువు ఇచ్ఛను తెలియజెప్పడానికి ఆ పనిలో భాగస్వామి అయిన శ్రీమాతకు సర్వం వదలివేయాలి. అయినప్పటికీ, అనేక విధాలుగా ప్రయోజనకారియైన పరమాత్మ కార్యసరళిని గ్రహించటంలో మానసిక ప్రయత్నాన్ని స్వామి ఎప్పుడూ నిరుత్సాహపరచలేదు. సూటిగా అంతరంగ జ్ఞానంతో కూడిన మేధోరూపకల్పనను లేదా ఎరుకలో లేనిదాని గురించి అకస్మాత్తుగా వచ్చే అంతర్బుద్ధిని పెంచి పోషిస్తూ ఉండాలని ఆయన ఆశించారు. అంతేకాక ఆయన ప్రకాశవంతమైన సొంత తాత్త్వికజ్ఞానంతో కొంతైనా సంబంధం కలిగినవారమై శ్రీఅరవింద అతిమానసోద్దేశాన్ని మినుకుమినుకు మనే మానసిక జ్ఞానంతో కొంతైనా అందుకోగలిగితే బహుశా మన మందకొడి ఇంద్రియాలు దానిని అందుకోవడానికి వ్యతిరేకత చూపించినా, కొంతలో కొంత మనం సఫలీకృతమయినట్లే.

అమల్ కిరణ్

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

II

శ్రీఅరవిందుల తత్త్వము, యోగముల హృదయస్థానం చైతన్యశీలమైన సత్యచైతన్యం. అదే అతిమానసం. సత్యచైతన్య మనగా దైవం యొక్క స్వచ్ఛమైన భౌతికాతీత స్థితిని సమగ్రమైన పరమాత్మ సత్తగా ప్రకటించగల స్థాయి, శక్తి; ఒక్కడు అనేకముగా వ్యక్తపడే దైవం యొక్క లీలావిన్యాసాల స్వీయ క్రియాశీల పరిణామం. ఈ అభివ్యక్తి పూర్ణసామరస్యత గలది. దీనిలో సృజనాత్మక సత్యాలు, అకళంక మూలాలు, ఆదర్శ యుతమైన సువర్ణ నమూనాలు నిబిడీకృతమై వుండి కర్మాచరణను గావిస్తాయి. అపరిపూర్ణ ప్రపంచంలో నుండే వాటన్నింటికి ఇవి ప్రతీకలు. ఈ అపరిపూర్ణ ప్రపంచంలో దైవం ఓ క్లిష్టమైన పదార్థ పరిణామ ప్రక్రియను, ప్రాణశక్తిని, మనస్సును ఏర్పరిచాడు. వీటికి అంతారాత్మను ఆలంబనగా అమర్చాడు. వాటన్నింటిని తనచే ఏర్పాటు చేయబడిన విస్తృత అచేతన నుంచి, ఒక ఆదిమ అంధకారం నుంచి సర్వాతీతుడైన సర్వేశ్వరుడికి ఊతకర్రగా నిలిపాడు.

ఈ రెండు స్థితులకు మధ్యన, ఈ పరిణామం చెందుతున్న భూమికి పైన, నమూనా స్థితి అయిన అతిమానసానికి క్రింద వివిధ మార్మిక స్థితులున్నాయి — సూక్ష్మపదార్థం, ప్రాణశక్తి, మనసు, అధిమనస్సు — ఆ మొదటి మూడింటికి వెనక ఆత్మ — వీటన్నింటి కదలికలు, అస్తిత్వాలతో కూడిన ఓ సంక్లిష్టమైన విశ్వంపై విశ్వం యొక్క పరస్పర క్రియాచరణే ఈ మొత్తం విశ్వంయొక్క విధానం; ఇదంతా సామాన్యంగా సనాతన జ్ఞానులకు తెలిసినదే, వారు దానినే విశ్వానికి సంగ్రహరూపు డైన మానవుడిలోని సూక్ష్మవిశ్వంగా దర్శించారు. అదే త్రివిధ వాస్తవంగా ఘనస్థితిని పొందింది. వాటినే మూడు కోశాలు, లేదా శరీరాలుగా పిలుస్తారు. అదే స్థూలశరీరం, సూక్ష్మశరీరం, ఉన్నత కారణశరీరం. ఆ చివరిదే అతిమానస పదార్థం. అదే పరిపూర్ణ జ్ఞానం, సృజనాత్మక ప్రకాశం యొక్క క్లుప్తీకరణ, అనంతశక్తి, అమరానందం. అయితే సనాతనులు ఈ పృథ్వీ పరిణామం, ఈ అస్తిత్వాన్ని ఆ విశ్వాత్మలోకి విముక్తి కల్గించడం, మరింతగా గాఢమైన, ఉన్నతమైన చైతన్యం స్థాయిలలోకి, జనన మరణాల కతీతమైన శాశ్వతత్వంలోకి వ్యాపింపజేయడమే కాకుండా, ఆ చైతన్య విధానాల విశాలత్వాలు, లోతులు, ఎత్తులతో పాటు చివరికి ఆ సత్యం యొక్క సర్వోత్తమ కారణశరీరంలో సంభవించడం, ఆ విధంగా పూర్ణంగా ఎదిగిన

దివ్యసత్యశ్రేణిని, ప్రకాశవంతమైన, ఆ ఉన్నత గాఢ విశాలత్వాల్లోకి నిష్క్రమించడం కాక ఫలప్రదమగునట్లు చేయుట. టూకీగా చెప్పాలంటే, సనాతనులకు ఆ అతి మానసంయొక్క సంపూర్ణ మరియు క్రమబద్ధమైన ప్రయోజనం మరియు శక్తి గ్రాహ్యం కాలేదు: మన అంతరాత్మతో అతిమానస ప్రకాశం సమ్మిళితమై, ఆ ప్రకాశం మనసు, ప్రాణశక్తి, చివరికి భౌతికశరీరం లోకి అవరోహణ చేసి వాటిని సంపూర్ణంగా రూపాంతరం చెందించి దివ్యీకరించడం, శ్రీఅరవిందుల ప్రత్యేకమైన ఆవిష్కరణ మరియు యోగము. అతిమానస అవరోహణతో ఒక లక్ష్యాన్ని సాధించడానికి పని చేశారు శ్రీఅరవిందులు. అది జీవితం స్వీయ అభివ్యక్తిలో పరిపూర్ణ సిద్ధిని పొంది, అన్ని రంగాల కార్యాచరణలోను దివ్యజీవనాన్ని సాగించే ఓ నూతన మానవజాతి సృజన కోసం పనిచేశారు. ఈ ఆశయంతోనె వారు ఈ నూతన మానవాళి కోసం, స్వయంగా తమ యొక్క, శ్రీమాత యొక్క అతిమానసీకరణ ద్వారా ప్రారంభ కేంద్రాల ప్రతిష్ఠాపనకు పూనుకున్నారు.

అతిమానసీకరణ అంతిమ లక్ష్యాలలో అనారోగ్యం నుంచి స్వేచ్ఛ, సంకల్ప మాత్ర జీవితకాలం, శరీరం పనిచేసే తీరులో మార్పు కూడా చోటు చేసుకుంటాయి. అయితే ఇదంతా మానవునిలో ఆవిర్భవిస్తున్న ఆ దివ్యప్రకృతిని భౌతికంగా అభివ్యక్తి చేయడానికే గాని అది అంతరంగ అహంకార అభివృద్ధిని బాహ్యంలో ఆడంబరంగా ప్రకటించడానికి కాదు, కాని ఈ అంతిమ లక్ష్యాలన్నింటినీ గ్రహించగలిగినపుడే అతిమానసం ఉనికికి భువనతత్వంలో రక్షణ ఏర్పడుతుంది కనుక, యోగి తాను అచేతనా పునాదుల్ని దైవత్వాన్ని ముంచివేసిన ఆ అట్టడుగు అంధకారమూలం ఎక్కడి నుంచైతే పరిణామం ప్రారంభమైందో, దానిని శోధించాలి. శ్రీఅరవిందులు, శ్రీమాత మానవ స్వభావంలో అనాదిగా నాటుకుపోయిన కష్టాలన్నింటికి ప్రాతినిధ్యం వహించిన నాయకులుగా ఈ అజ్ఞానమూలాలతో దశాబ్దానికి పైగా తలపడుతున్నారు.

"లేదు, నేను తీరిక లేకుండా ఉన్నది దివ్యలోకాలతో కాదు" అంటూ శ్రీఅరవిందులు 1936 లో ఓ శిష్యునికి వ్రాస్తూ ఇంకా చెప్తారు: "నిజానికి అలా ఉండాలనే నేను అభిలషిస్తాను. నిజానికి నేను దానికి వ్యతిరేకస్థితిలో నున్నాను; అచేతనా అగాధాల్లోకి దూకి, ఈ రెండింటికి మధ్య వారధి కట్టాలని ప్రయత్నిస్తున్నాను. అది కూడా నా కార్యాచరణకు అవసరమే, దాన్ని ఎదుర్కోవాలి, తప్పదు."

ఈ దూకే ప్రయత్నంలో అచేతన యొక్క పొర తరువాత పొర ఛేదించబడి,

అందులోకి అతిమానసకాంతిని ప్రసరింపజేయాలనే ప్రక్రియలో అనేక ఆంతరంగిక గాయాలను, శారీరక సంబంధమైన వత్తిడిని సహించాల్సిన సంభావ్యతలు ఎదురౌతాయి. కాని ఈ పోరాటం చేస్తున్నంత కాలం ఈ అతిమానస నియంత ప్రమాదభరితమైన ఘటనలను తుదముట్టించడానికి ఒక తాయెత్తును ధరించినట్లనిపిస్తుంది. ఉన్నతమైన వెలుగుతో శరీరం నిండివున్నా, వారి ప్రయత్నాలు, ప్రయాసలు అత్యంత తీవ్రమైనవి. అయినప్పటికి వాటి నెదుర్కొని వాటిలో నుండి విజయవంతంగా బయటకు రాగలిగిన సమర్థత, తన ననుసరించే మానవులకు ఓ వెలుగుబాటను వేయగలిగిన సామర్థ్యం వారి కుంది. ఆ విధంగా ఈ ప్రకృతి పరిధుల నించి బయటపడటం శ్రీఅరవిందుల ప్రణాళిక అని ఇప్పటిదాకా వారి తాత్విక రచనల ద్వారా, వారు స్వయంగా వ్రాసిన లేఖల ద్వారా తేటతెల్లమవుతుంది. ఆ ప్రణాళిక మరియు అహంకారరహిత విస్తృత విశ్వదృక్పథంగల అవతార తత్వం 1935 లో వారు వ్రాసిన ఓ లేఖలో ధ్వనిస్తాయి.

"నేను నా కోసం ఏమీ చేయుటలేదు, ఎందుకంటె నాకుగా నాకు కావలసినది ఏదీ లేదు, మోక్షం కాని, అతిమానసీకరణ కాని, ఏదైనా నా కవసరం లేదు. నేనెందుకు ఈ అతిమానసీకరణ కోసం తపిస్తున్నానో దానికి కారణం, అది ఈ పృథ్వీ చైతన్యం కోసం చేసి తీరవలసిన కార్యం. దాన్ని నేను నాలో సంభవింపచేయకపోతే, అది మరెవరిలోను చేయబడదు".

అవును, ప్రచురించబడిన శ్రీఅరవిందుల ప్రవచనాలలో ఈ ఆవశ్యకతను గుర్తించి, ఆ కారణంగా అతిమానసజాతి ఆరంభకులుగా వారు శ్రీమాత ఉండాలన్న అవసరాన్ని వెలిబుచ్చారన్నట్టుగా కనిపిస్తుంది. అయితే వారు ఆ అభిప్రాయంలోనే మరొక ఒక భిన్నమైన సూచనకు కూడ చోటిచ్చారు. 1934 లో వ్రాసిన ఓ ఉత్తరంలో దైవ వాహిక యొక్క విధానాలను గురించి వ్యక్తపరిచారు:

"దివ్యత్వం పైన ఉన్న సత్యచైతన్యాన్ని, క్రింద జరిగే ఈ 'లీల' ని అనుసరించి కార్యాచరణ చేస్తుంది. అది ఆ 'లీల' యొక్క ఆవశ్యకతని బట్టి పనిచేస్తుంది, అంతేకాని మానవుల యొక్క ఆలోచనల ననుసరించి అది ఏమి చేయాలో ఏమి చేయకూడదో కాదు."

ఆ దైవకార్యాచరణలోని అనుకోని మలుపుల గురించిన మరొక స్పష్టమైన సూచన 1935 లోని ఒక ఉత్తరంలో కనిపిస్తుంది:

"ఎందుకు తన ప్రతి కార్యంలోను దైవం విజయం మాత్రమే సాధించాలని అతడిని కట్టిపడెయ్యాలి? ఒక వేళ అతడి కార్యసాధన సాఫల్యానికి ఓటమి ఎక్కువగా సహాయపడి, అతడి అంతిమ లక్ష్యసాధనకు ఆ ఓటమి ఉపకరిస్తే? దైవం గురించిన మూర్ఖమైన ఈ ప్రాథమిక భావాలేమిటి?"

ఇక్కడ మనకు అందే సూచన, దైవం యొక్క అద్భుత లక్ష్యం పైకి ఓటమిగా కనిపించినా, నిజానికి అది అప్రకటిత విజయం కావచ్చు. అది తన లక్ష్యం చేరడానికి మరింత శీఘ్రగతిలో సాగే వైరుధ్యంతో కూడిన వ్యూహం కావచ్చు. ఈ పరిస్థితులన్నీ పరిగణనలోకి తీసుకున్నప్పుడు — సరిగ్గా శ్రీఅరవిందులు ఇలాంటి వ్యూహాన్నే ఉపయోగించారనిపిస్తుంది. అదే మన సామాన్య మానవదృష్టికి వారు మూత్రపిండాల అస్వస్థతకు గురైనట్టు కనిపిస్తుంది.

అతిమానసయోగం మొత్తం ఒక గొప్ప సైన్యాధికారి, అంతవరకు ఎవరూ ఎదుర్కోని శక్తులతో చేసిన పోరాటం లాంటిది. అది ఇంతవరకు ఏ ఆధ్యాత్మిక వ్యక్తిచేత ఎదుర్కోబడనిది. సామాన్య మానవ అనుభవాలకు, యుగయుగాల నించి ఇప్పటి వరకు ఉన్న మానవ స్థితిగతులకు, ఇప్పటిదాకా వ్యక్తీకరించబడిన ఆధ్యాత్మిక సాంప్రదాయాలకు విరుద్ధంగా ఈ యోగం పదార్థమూలాలనే మార్చాలన్న ఆకాంక్షతో, ఆ ప్రతిఘటించే అంధకారమూలాలతో పోరాటానికి సిద్ధపడింది: శ్రీఅరవిందుల వంటి ఓ నిర్భయుడైన యోధుడు, ఆతడి వంటి దైవిక సైనికుడు, మేధావి మాత్రమే పరిణామ ప్రక్రియలోని మహోన్నత రహస్యాన్ని తన అంతర్బుద్ధితో అవగాహన చేసుకొని వ్యవస్థీకరించబడిన ప్రకృతిపై పరివర్తనాత్మక దాడిని చేసి ముందుకు సాగగల సమర్థుడు. ఇదంతా 1935 లోని మరొక లేఖలో వెల్లడించారు:

"నా వ్యక్తిగత గొప్పతనం కోసం నేను అతిమానస అవరోహణ సాధన చేయటం లేదు. మానవదృష్టిలో ఉండె గొప్పతనాలు, అల్పత్వాలను నేను ఖాతరు చేయను.... కృష్ణుడు చేయని ప్రయత్నం నేను చేస్తున్నానని మానవ తార్కికత నన్ను ఒక అవివేకిగా జమకట్టినా నేను లక్ష్యపెట్టను. ఆ విషయంలో మరెవ్వరైనా సరే. అది దైవానికి, నాకు మధ్య ఉన్న ప్రశ్న — అది దైవసంకల్పమా, కాదా, నేను దాని అవరోహణ కోసం పంపబడ్డానా లేక ఆ అవరోహణకు మార్గం వేయడానికి లేదా ఆ మార్గం ఏర్పరచడం మరింత సంభవం చేయడానికా అన్నది. చేతనైతే మానవులందరు నన్ను హేళన చేయనీ లేదా నరకమైనా నా పై పడనీ — గెలిచేంతవరకు లేదా

నశించేంతవరకు, నా కృషి కొనసాగుతుంది. ఈ విధమైన స్ఫూర్తితో నేను అతిమానసాన్ని అన్వేషిస్తున్నాను. అంతేకాని నా గొప్పతనం కోసమో, ఇతరుల గొప్పతనం కోసమో నేను వాటి వెంట పడటం లేదు.”

ఇక్కడ మనం చూసేది తన లక్ష్యానికి చేరువ అగుటకు ఏ ప్రమాదాన్నైనా ఎదుర్కొనే యోధుడైన యోగి యొక్క నిస్వార్థభరిత ధీరత్వం యొక్క స్పష్టమైన దృశ్యం — నిజానికి వారు వ్యక్తపరచిన సూత్రం, “నేను గెలిచినా లేదా నాశనం చెందినా” అయినప్పటికీ యదార్థంగా వారి మనసులో ఉన్న ధీరోదాత్తమైన సూత్రం: “నేను నశించేది గెలవడానికే” అని చెప్పడం కావచ్చు.

ఈ సూత్రాన్ని అనుసరించాలంటే అందుకు కావలసిన భావన ఇది — అచేతనా చీకటిశక్తులతో చేసే అంతిమ పోరాటంలో, అతిమానసీకరణ పొందిన అద్భుత శరీరాన్ని త్యాగం చేయడం వలన, ఆ శక్తులు విపరీతంగా అలసిపోయి, ఆ పైనున్న సువర్ణ దైవం తీవ్రంగా ఈ పృథ్వి వైపుకు, ఈ అతిమానసయోగాన్ని చేస్తున్న శరీర భాగస్వామిలోకి లాగబడతాడు. ఈ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న భావన ఉదయించగానే శ్రీఅరవిందులు ఓ సర్వసైన్యాధిపతి వలె సంసిద్ధులై ఉంటారు. ఒక్కసారిగా వారి యుద్ధతంత్రాన్ని మార్చివేసి, అంతకు ముందు తయారుచేసిన పథకాలను త్యజించి, గతంలోని అభివృద్ధి విధానాన్ని వదిలి, వ్యూహాత్మకంగా రచించిన ప్రణాళిక దర్శకత్వాన్ని ఒక్కసారిగా మార్చి, తన భౌతిక ఉనికిని కూలంకషంగా అతిమానసీకరణ చేయడానికి బదులుగా, అలజడి చెందకుండా పొంచివున్న దానవశక్తుల వైపు సాగుతూ, ‘అతిమానసం’ వారి కిచ్చిన రక్షణను వదిలి, — పైకి అంతా పోగొట్టుకుని, ఓడినట్టు కన్పించినా, నిగూఢంగా విజయం సాధిస్తారు.

ఓ మహత్తరమైన ఇలాంటి వ్యూహాత్మక త్యాగం తప్ప శ్రీమాత యొక్క భౌతిక రూపాంతరాన్ని అనూహ్యంగా వేగవంతం గావించి సురక్షితంగా తీర్చిదిద్ది, తద్వారా ఈ పృథ్వి మీద మానవుల దివ్యజీవనానికి వేళ్ళు నాటబడి, ఫలించి పుష్పించడం సాధ్యపడదు. శ్రీఅరవిందుల నిర్వాణాన్ని ఈ విధంగా తప్ప మరో మాదిరిగా వివరించలేము. ఇందులోనే, ఈ దివ్య ఆత్మత్యాగంలోనే ఈ ప్రపంచాన్ని రక్షించెడి క్రియాచరణ యొక్క మాధుర్యశక్తి గురించి 1934 ముందే ఓ లేఖలో వ్రాశారు.

“నేను వహించవలసిన బాధ్యతను మోయగలిగినది ఒక్క దివ్యప్రేమ మాత్రమే.

ఈ పృథ్విని అంధకారం నుంచి దివ్యత్వానికి ఉద్ధరించాలన్న ఆశయం కోసం సర్వాన్ని త్యాగం చేయగలవారందరూ ఈ భారాన్ని మోయవసిందే."

దివ్య ప్రేమతో సంధింపబడిన ఆధ్యాత్మిక చైతన్యం కలిగిన ఎవరైతే దివ్యాతీతుడి సంకల్పాన్ని అవధరించిన విశ్వవ్యాప్తి చెందిన వ్యక్తిగా ఎదిగాడో, ఆ ఒక్కడి శరీరంలో ఆ అపరిమిత విషం ఇమడకపోతే, కలలోనైనా ఊహించలేనటువంటి విపత్తు ఈ ప్రపంచానికి దాపురించి ఉండేదని చెప్పవచ్చు. ఇక్కడ మళ్ళీ మనం ఇంకోసారి గమనించగల విషయమేమిటంటే శ్రీఅరవిందులు వారి యోగంలో ఎదురైన అడ్డంకులేవీ నిజంగా వారి వ్యక్తిగతమైనవి కావు. అవన్నీ ఈ జాతికి సంకేతాత్మకమైనవి. ఈ వెనకపడ్డ మానవ విపత్కర పరిస్థితుల భారాన్ని, బహుశ వారికున్న విలక్షణమైన ప్రతిభ, సమర్ధతల వల్లనే సంతోషంగా స్వీకరించారు. ఈ సందర్భంలో శ్రీమాత యొక్క శరీరంలోని ఒక తాత్కాలిక అనారోగ్యం గురించిన ఓ ప్రశ్నకు చాలా ఏళ్ళ క్రితం వారు వ్రాసిన సమాధానం:

"మేం పరిపూర్ణతని ప్రత్యేకంగా మా కోసం కోరలేదు, సాధారణ మార్పులో భాగంగానే చేశాం — ఇతురలకు కూడా పరిపూర్ణతను సంభవం చేయడానికి. మేం ఈ అనుభవంలోను రూపాంతరంలోనుగల కష్టాలను మాలో మేం ఎదుర్కోకుండా అంగీకరించకుండా ఉన్నట్లయితే ఈ మార్పు సాధ్యపడేది కాదు. అది కొంతవరకు ఇతర స్థాయిలలో జరిగింది కాని శారీరకస్థితి యొక్క భౌతిక భాగంలో ఇంకా జరగలేదు. ఇది జరిగే వరకు ఈ పోరాటం కొనసాగుతుంది. శ్రీమాత యొక్క కష్టాలు ఆమె స్వీయకష్టాలు కావు. ఆమె ఇతరుల కష్టాలు భరించడంతో పాటు రూపాంతరం కోసం చేసే పనిలోను, కార్యాచరణలోను అంతర్గతంగా నుండే కష్టాలను కూడా భరించింది. అది ఆ విధంగా కాక మరో విధంగా నున్నట్లయితే పూర్తిగా భిన్నమైన విషయం అయివుండేది."

ఇప్పుడు సుస్పష్టంగా కనిపించేది, శ్రీఅరవిందులు, శ్రీమాత చేసిన త్యాగం, వారి వ్యక్తిగత ఇబ్బందుల వలన వారిపై మోపబడినది కాదన్న విషయం. వారివి అద్వితీయమైన ప్రత్యేక ఆధారాలు లేదా యోగసాధనకు ఉచితమైన వాహికలు. వాటిలో ఇతర జోక్యాలు లేనట్లయితే ఏ అవరోధాన్నైనా ఎదుర్కోగలవు. ఈ విషయం ఇప్పుడు శ్రీఅరవిందులు దేహత్యాగం చేసిన సందర్భంలో గమనించితే, వారు తనలో ఏదో లోపం కారణంగా మృత్యువును అంగీకరించలేదు. అది పరిణామం

చెందుతున్న పృథ్వీ-చైతన్యం యొక్క మహత్తర సంక్షోభం — దివ్యత్వం చేత ఎదుర్కోబడిన అచేతన యొక్క విప్లవాత్మక తిరుగుబాటు — అది వారి జీవితంవైపు మళ్ళింపబడింది. అదే చివరికి జీవితానికే అపాయకరమైన మూత్రపిండ వ్యాధి మూలంగా సంభవించిన అపస్మారక స్థితిగా కేంద్రీకృతమైంది. దానినే ఈ గణనీయమైన ప్రణాళికతో తన కార్యానికి మార్మికంగా అనుకూలపరచుకున్నారు. ప్రత్యక్ష వ్యక్తిగత సాఫల్యసిద్ధి కన్నా పనే అత్యంత ప్రధానమైన విషయం వారికి.

ఆ త్యాగంలోని అంతరార్థంతో పాటు వారి వ్యూహం శ్రీఅరవిందుల ప్రత్యేకత. అవి ఒక విస్తృత ప్రశాంతతతో కూడిన సమ్మతితో పాటు, ఒక నిశితమైన సంఘర్షణాత్మక ప్రతిఘటనాశక్తిని సూచిస్తుంది. అందుకే మనం శ్రీఅరవిందులు పైకి అంతా పోగొట్టు కున్నవారిగా కనిపించారని చెప్పాము. పృథ్వీప్రకృతిలోని ఏ లోపాన్ని సమ్మతించక పోవడం వారి సిద్ధాంతం. వారు ఈ పరిణామ రహస్యాన్ని పైకి అసంభవంగా కని పించే ఈ పృథ్వీతత్వంలో దర్శించారు — పృథ్విలో పైకి నిర్జీవంగా వుండే పదా ర్థంలో నుంచి పైకుబికొచ్చే ప్రాణశక్తి స్పందనను ప్రత్యక్షంగా కనిపించే సహజాతమైన మృగతత్వంలో నుంచి మనస్సు హేతువులు మినుకమినుకుమంటూ వెల్లడి కావటం, పైకి తముడముతున్నట్లుగా కనిపించే తెలివితేటలలో తడబడుతున్నట్టు కనిపించే ప్రాణశక్తిలో మృత్యుమయ శరీరంలో, సర్వసమగ్రమైన అతిమానస అభివ్యక్తిని వారు ధర్శించారు. అందుకే శ్రీఅరవిందులు ఈ సామాన్య ప్రపంచస్థితులకు తల వంచడంగాని, ఈ ప్రపంచానికి దూరంగా శాంతిని కాంక్షిస్తూ పలాయనం చిత్తగించటం గాని చేయలేదు. చెదరని కాలాతీత శాంతి వారికి వారి బరోడా రోజుల నుండి తెలిసినదే. 1908 లో బరోడాలో మూడు మహత్తర దినాల్లో వారు మనస్సును నిశ్శబ్దపరచి సంపూర్ణ నిర్వాణ అనుభవాన్ని పొందారు; అదే ఎన్నో యోగాల్లో చేర దగిన చివరి స్థితి. వారికది చివరి స్థితి కాలేదు, కానీ మరెన్నో సాధించవలసిన విజ యాలకు మూలమయింది. సమర్పణ విషయానికి వస్తే, వారు దైవానికి తప్ప దేనికీ సమర్పించుకోలేదు. పర్యవసానంగా వారు తుది శ్వాస వరకు అతిమానస అవరోహణ కోసం పోరాటంచేస్తూనే ఉన్నారు — ఆత్మ యొక్క అక్షయసూర్యుని క్రిందికి ఆహ్వానిస్తూ, తన పాంచభౌతిక దేహాన్ని గాఢావేశంతో అతిమానస ప్రకాశంతో నింపారు. ఎంతగానంటే ఆ ఆచ్ఛాదనను అనేక రోజుల వరకు ఏరకంగాను మార్పు చెందకుండా, రంగు మారకుండా, పాడవకుండా ఉంచగలిగారు. త్యాగం చేసే

క్షణాలలో కూడా ఆ విధంగా పోరాడడం వారి జీవితకాల కృషికి అనుగుణంగానె ఉంది. పైకి వైఫల్యంగా కనిపిస్తున్న దానిలోనే విజయం యొక్క కౌశలం ఉన్నట్టు వారు ఒక లేఖలో ప్రతిపాదించారు కదా?

"నేనొక వేళ చెడుఫలితాన్ని పొందుతానని భవిష్యదర్శనం చేసినా, నేను ఏం చేయాలనుకున్నానో దాని కోసం పనిచేసి తీరాలి. అదే నేను సేవించే ఆ శక్తిని, సూత్రాన్ని సజీవంగా ఉంచగలదు, అటుపైన దాని విజయానికి సంభావ్యత నిస్తుంది. ఆ విధంగా భవిష్య సానుకూల విధివిధానంలో భాగమవుతుంది — ప్రస్తుత సమయం ప్రతికూలంగా ఉన్నా. "

మన ప్రభువు యొక్క ఈ భవిష్య దర్శనవాక్కులతో, అద్భుత ధ్యానస్థితిలో కనిపించే వారి పార్థివ శరీరం ఏదైతే డిసెంబరు 5 నించి 111 గంటలకు పైగా వారి గదిలో, ఆ నిరాడంబరమైన శయ్య మీద ఉంచబడిందో, ఎక్కడైతే వారు రెండు దశాబ్దాలపాటు గాఢమైన విశ్వ-కార్యంలో నిమగ్నమై ఉన్నారో, అందులోని మార్మికతను విశ్లేషించే ప్రయత్నాన్ని ముగించవచ్చు. వారి శరీరాన్ని వర్ణించ గలిగిన సిసలైన పదం 'ఆధ్యాత్మిక సార్వభౌమత్వం'. ధీరోదాత్తమైన వారి ముఖవైఖరి, తెల్లని గడ్డం, విశాల ఫాలభాగంపై జీరాడుతున్న తెల్లని శిరోజాలు, మూతబడిన ప్రశాంత నయనాలు, కొనదేరిన నాసిక యొక్క విశాలమైన ముక్కు పుటాలు, దివ్యాశీస్సులు వెదజల్లే దృఢమైన పెదవులు, విశాలమైన నున్నని భుజాలు, ధీరోదాత్తమైన ఛాతీపై మడిచి ఉంచిన హస్తంపై వుంచిన మృదువైన, కళాత్మకమైన, సమర్థత కల్గిన మరో హస్తం, బంగారు అంచుగల పట్టువస్త్రంతో ఆచ్ఛాదితమైన మగసిరి ఉట్టిపడే శరీరం మధ్య భాగం, సామ్రాజ్య చక్రవర్తి సహజత్వాన్ని తలపిస్తున్న పారజాపిన కాళ్ళ యొక్క పవిత్ర పాదాలు ఏవైతే డెబ్బైతొమ్మిదేండ్లు ఈ పృథ్వీపై అడుగులు వేసి దానిని ఆశీర్వదించి తనదిగా చేసుకొన్నాయో, ఇవన్నీ ఆ వర్ణనకు సరిపోతాయి.

ఆ గదిలో వాతావరణమంతా ఓ పవిత్రశక్తితో ప్రకంపిస్తూ, ప్రక్షాళన గావిస్తూ ప్రకాశిస్తోంది. ఆ మహనీయుని విజయ విశ్రాంతిని తలపించే నిశ్చలస్థితిలో వున్న దేహం నుండి ఒక మహాశక్తి ఉత్పన్నమై చూపరుల తలలపై తీవ్ర గాఢతతో వారి శరీరంలోకి ప్రవేశిస్తున్నట్లనిపించింది. శ్రీఅరవిందుల నిస్వార్థ దైహిక ముకుళితం వలన ఆ శక్తి ద్విగుణీకృతమై అతిమానసం యొక్క జీవన రూపాంతర ఔచిత్యాన్ని మానవాళిలో వర్షింపజేసింది.

ఒక విధంగా శ్రీఅరవిందులు వ్యక్తిగత ఉనికి అధికతరమైనట్టుగా వుంది. రూపాంతర యోగప్రక్రియను ఏకాగ్రంతో శీఘ్రతరం చేయడానికి ఇంత కాలం ఒక గదికి మాత్రమే పరిమితమైనా, ఏ అద్భుత ప్రక్రియ యొక్క పరమానందాన్ని క్రియోన్ముఖ శక్తుల్ని శ్రీమాత, తాను భౌతికంగా దగ్గరగా ఉండి శిష్యులకు పంచేవారో — వారు దానిని తమ శారీరక కవచాన్ని త్యజించడం వలన తమ ననుసరించేవారితో ఒక నూతన సన్నిహిత సంబంధం పెంచుకొని తమ అపారమైన అస్తిత్వంలోకి తిన్నగా చేర్చుకున్నారు. దీనిని కేవలం అక్కున జేర్చుకొనే ప్రతిభగా తలిస్తే, అది అస్తిత్వానికి న్యాయం చేకూర్చదు.

ఈ భౌతిక ఆచ్ఛాదన వెనక మరింతగా వ్యవస్థీకరించబడిన వాహికలు సూక్ష్మ మరియు కారణ సంబంధమైనవి వున్నాయి. శ్రీఅరవిందులు అంతుచిక్కని కారణ సంబంధమైనదానిని, సమర్ధవంతంగా సన్నిహితమైన సూక్ష్మంలోకి కొనితెచ్చి వారి ప్రయోజనాత్మక త్యాగసమయంలో దానిని ఈ బాహ్య స్థూలకోశం లోకి జొప్పించారు. వారి మాటల్ని మళ్లీ ఉటంకించాలంటే, "ఇతర స్థాయిలలో రూపాంతరం అవసరమైనంత మేరకు" జరిగింది. దాని అర్థం వారు తన సూక్ష్మశరీరంలో అతిమానస స్వరూపాన్ని ధరించి ఉన్నారని, అందువలన వారికి ఏ రకమైన తాంత్రిక ఆవశ్యకత గానీ, ఏ సూక్ష్మప్రకృతి నిబంధనలకు లోబడిగాని ఆత్మ విశ్రాంతి పొందుతున్న మరో స్థాయికి తిరిగి చేరడానికి, ఈ సూక్ష్మశరీరాన్ని వదలి మరో నూతన సూక్ష్మ శరీరంతో, మరో నూతన స్థూల శరీరంతో మరో జన్మను పొందవలసిన ఆవశ్యకత లేదని. అతిమానస యోగం ద్వారా దేహధారణ గావించిన ఈ జన్మలో వారి వ్యక్తిగత అస్తిత్వం మూలంగా విశ్వాత్మగా, సర్వాతీత పురుషుడిగా ఎదిగినదాని కన్నా శ్రీఅరవిందులు వారి భౌతిక ముకుళిత సమయంలో మరింత బృహత్తరమైన కార్యాచరణ చేయగల స్థితిలో ఉన్నారు. వారు వారి కరిగిపోని సూక్ష్మరూపంలో చైతన్యశీలమైన పురుషుడిగా ఉండి, ఒకేసారి దివ్యంగాను, మానవునిగాను ఉండగలరు. దాని వలన ఈ పదార్థ ప్రపంచంతో ప్రత్యక్ష స్పర్శ మరింత ఎక్కువ కలిగి ఉంటారు. ఇది గతంలో మార్మికులు దర్శించిన ఋషులు, ప్రవక్తలు, అవతారాలు ధరించిన ఆకారాల కంటె ఎక్కువగా ప్రత్యక్ష స్పర్శ కలిగి ఉండగలరు.

అందువలన ఓ ప్రత్యేకార్థంలో, మన గురువులైన, మనం ఎంతో ప్రేమించిన, అద్భుత ప్రతిభాపాటవాలున్న, దయాళువైన శ్రీఅరవిందులు ఇంకా వారి కార్యసాధ

నలో ఉన్నారు. శ్రీమాత ఈ క్రింది మాటలు చెప్పినపుడు ఆమె ఒక కచ్చితమైన సత్యాన్ని వ్యక్తం చేశారు:

"మనం దుఃఖపడటం శ్రీఅరవిందులను అవమానించడమే, వారు ఇక్కడే సజీవంగా, చైతన్యంతో మనందరి మధ్య ఉన్నారు." ఈ స్పష్టమైన సత్యం, డిసెంబరు 7 న సుందరమైన సందేశంగా అక్షరమణులతో పొదగబడింది. ఆమె వారిద్దరు ఒక్కటిగా ఉన్న ఆ ప్రగాఢ లోతుల్లోంచి ప్రకటించారు:

"ప్రభూ, ఈ ఉదయం మీరు మీ కార్యం సాధించబడే వరకు మాతోనే ఉంటారన్న ఆశ్వాసన నా కిచ్చారు. మార్గదర్శకం చేస్తూ, ప్రకాశం వైపు నడిపించె చైతన్యంగానే కాక, ఓ క్రియాత్మక ఉనికిగా మా కార్యాచరణను నడిపిస్తారని, ఈ పృధ్వి రూపాంతరం చెందేవరకు మీరు ఈ పృధ్వి ఆవరణని విడిచి వెళ్ళరని, పూర్తిగా ఇక్కడే ఉంటారని, మీరు నాకు కచ్చితమైన వాగ్దానం చేశారు. మేము మీ అద్భుత ఉనికిని పొందే అర్హతను మాకు ప్రసాదించండి. ఇక పైన మేము మరింతగా సర్వశక్తుల్ని మీ ఉన్నత కార్యాన్ని సాఫల్యం చేయాలనే ఏకైక సంకల్పంపై కేంద్రీకృత మయ్యేటట్లు అనుగ్రహించండి."

ఆ విధంగా కార్యం కొనసాగుతుంది. భవిష్యత్తును శ్రీమాత ముందుండి నడిపిస్తారు. ఆమెతో సూక్ష్మరూపంలో ప్రభువు ప్రక్కన వుంటారు. ఈ పని యొక్క సాఫల్యంపై ఎవరికి విశ్వాసముంటుందో, ఆ పని ఏమిటో ఎవరు అర్థం చేసుకుంటారో, వారికి, భవిష్యత్తు హృదయానికి స్వాంతనను కల్గించే ప్రత్యేక సంభావ్యతలతో ఆశాజనకంగా ఉంటుంది. అతిమానసం సంపూర్ణంగా ఈ రక్తమాంసభరిత శరీరంలోకి అవరోహణ చేసే సమయం ఆసన్నమయ్యే సందర్భం గురించి శ్రీఅరవిందులు వ్రాశారు:

"తాంత్రికులు సిద్ధాంతాలలోను, మన అస్తిత్వ స్థితుల అంతస్తుల క్రమంలోను, యోగజ్ఞానం మనకు చూపించే రేఖాచిత్రం ప్రకారం, సూక్ష్మభౌతిక శక్తి ఒక్కటె కాదు, సూక్ష్మభౌతిక పదార్థం కూడా. ప్రాణ, స్థూల పదార్థాల మధ్య పనిచేస్తూ, ఈ సూక్ష్మభౌతిక పదార్థంలో సృజించిన రూపాల్ని ఘనీభవింపజేసి, వాటిని స్థూల పదార్థంలోకి పంపడం జరగవచ్చు. అది సంభవం కావడమే కాదు, అది సంభవించవచ్చన్న నమ్మకం ఉంది. ఈ సూక్ష్మభౌతిక పదార్థంలో తయారైన ఆకృతి తన సూక్ష్మస్థితి నించి, స్థూలపదార్థానికి తాంత్రికశక్తి జోక్యంచేత ఆ పద్ధతి వలన సూటిగా

మారగలదని, దానికి స్థూలపదార్థం యొక్క పద్ధతి సహాయంతో నిమిత్తం లేకుండానే సంభవించగలదని నమ్మవచ్చు. ఓ ఆత్మ శరీరంలో ప్రవేశించాలని కోరినా లేదా తనకు తాను ఓ శరీరాన్ని తయారుచేసుకుని, ఈ పృథ్విపై దివ్యజీవనంలో భాగం కావాలని కోరినా, దానికి కావలసిన సహాయం అందడమే కాదు, సూటిగా ఆకృతి పరివర్తన పద్ధతి ద్వారా సాధించవచ్చు. అది సామాన్య విధానాలైన లైంగిక పద్ధతి, లేదా మరింత నీచస్థితికి దిగజారకుండా లేదా మానసిక, శారీరక ఎదుగుదలకు పరిమితులకు లోనుకాకుండా జరగవచ్చు. ఇప్పుడవి మన సాధారణ మానవజీవితానికి తప్పని విధానాలు. అప్పుడు వెంటనే అది ఏదో ఒక రోజున గొప్ప శక్తులు నిర్వహణ చేసే ఒక వాస్తవమైన దివ్యభౌతిక దేహనిర్మాణాన్ని, ఉన్నత శక్తులను, కార్యాచరణను పొందవచ్చు. ఏదో ఒక రోజున క్రమంగా అభివృద్ధి చెందే పరిణామంలో, ఒక సంపూర్ణ రూపాంతరం చెందిన అస్తిత్వంగా, ప్రాణికంలోను, ఆకృతిలోను దివ్యత్వం పొంది ఈ పృథ్వి-ప్రకృతిలో ఆవిర్భవించవచ్చు."

ఈ మాటలు ఓ భవిష్య సూచనని నింపుకొని ఉన్నాయి. దివ్యీకరించబడిన సూక్ష్మభౌతిక ఆచ్ఛాదన కలిగివున్న శ్రీఅరవిందులు అతిమానస అభివ్యక్తిని శ్రీమాత ప్రారంభించబోయే నూతన మానవజాతి యొక్క పదార్థక్షేత్రంలో ఆధిపత్యం నెరపడానికి ఉపయోగించవచ్చు. ఆ సువర్ణ దివ్య ఉషోదయంలో శ్రీమాత సహజంగా పుట్టిన శరీరం నించి పురోగతి చెంది, దివ్యశరీరాన్ని సాధించిన ప్రథమవ్యక్తి అవుతారు. ఆమె సాధించిన విజయం యొక్క సహాయంతో శ్రీఅరవిందులు దివ్యప్రకృతిని ముందు నుండి గ్రహించబడిన పదార్థంతో, ఆకృతితో, రూపాంతరం చెందడానికి శరీరాచ్ఛాదనను గావించిన ప్రథమవ్యక్తి కావచ్చు. శ్రీఅరవిందులు ఏమి చేయ సంకల్పించారో మనం స్పష్టంగా చెప్పలేము. అయితే మనం ఊహించిన సంభావ్యతలన్నీ ప్రస్తుతం మనం చూస్తున్నది ఏదైతే ఒక ఆరని మానవాతీత విజయకాంతికి అనుబంధితంగా ఉండి, ఆకాంక్షాపరుల పైచూపులకు సార్వత్రిక సూర్యాస్తమయంగా కనిపించే సంఘటన ఈ శ్రీఅరవిందుల మహాభినిష్క్రమణం.

(శ్రీఅరవిందాశ్రమం ప్రచురించిన *The Passing of Sri Aurobindo* అను పుస్తకం నుండి సంగ్రహించబడినది.)

అమల్ కిరణ్

అనువాదం: డి. సత్యవాణి

మృత్యువుపై గెలుపు

("మీకు మా అనంత కృతజ్ఞతలు" (*To Thee Our Infinite Gratitude*) అన్న పుస్తకానికి శ్రీ మనోజ్ దాస్ వ్రాసిన పీఠికలో భాగం.)

ఎడతెగని పరిశ్రమతో తన విధి నుండి మృత్యువు అన్న దానిని తొలగించివేయడానికి మనిషి ఈ భౌతిక విజ్ఞానశాస్త్రి పరిధిలో, ఇరవైయ్యవ శతాబ్దంలో ఆశ్చర్యాన్ని కల్గించే ప్రగతిని సాధించాడు. లోపరహితంగా దీనిని రూఢీ పరచడానికి ఒక ఉదాహరణ: ప్రముఖ పరిశోధకుడు, రచయిత అయిన ఆల్విన్ సిల్వర్ స్టీన్ 'మృత్యువు పై విజయం' Conquest of Death (1979, మేక్ మిలన్, న్యూయార్క్) అన్న ప్రాచుర్యం పొందిన పరిశోధనా వ్యాసాన్ని వ్రాసి ఇలా అంకితం చేసారు. 'మన ప్రస్తుత తరానికి — ప్రథమ అమరులు' అని ఆ వ్యాసం ముగింపులో ఇలా అన్నారు "1980 వ శకంలో విజ్ఞానశాస్త్రిం మానవాళికి ఎంతో ముట్ట జెబుతుంది, విశేషంగా పతానావస్థకు చేరుకున్న గుండెజబ్బుల తీవ్రత, దాని వల్ల సంభవించే మరణాల రేటు తగ్గుదల యిప్పటికే మొదలై, ఉరవడి పుంజుకొంటున్నది. క్యాన్సరు చావులు తగ్గుముఖం పట్టి మటుమాయమై పోతున్నాయి. ప్రస్తుతమున్న కోట్లాదిమందికి క్రొంగొత్త యువశక్తిని అందివ్వగల పురోభివృద్ధి జరుగుతుంది. ఈ దశాబ్దం ముగింపు వ్యాధి అన్నదానికి యదార్థమైన ముగింపు నిచ్చి బాధావేదనల శమనానికి స్వాగతం పలుకుతుంది. నిజానికి 1950 ప్రారంభం నుండీ గుండెజబ్బుల నిష్పత్తి సంవత్సరం సంవత్సరం పడిపోతున్నది. క్యాన్సరు మరణాల రేటు కూడా ఇప్పటికే బాగా పడిపోయి, మున్ముందు తగ్గుముఖం పట్టడం వేగవంతమవుతుంది. రానున్న, పదేళ్ళల్లో విజ్ఞానంలో చోటు చేసుకొనే మార్పులు మిగిలిన విషాయల్లోనూ చెప్పుకోగలిగే పురోగతిని సమకూర్చి పెట్టగలవు. మరో పదేళ్ళలో కచ్చితంగా మీరంతా నవోత్తేజంతో, బలంతో జీవించబోతారు. మీరు అమరులు కాగలరు. మరో విధంగా చెప్పాలంటే అమరులు కాకపోయినా మృత్యువుకివశులైనా కాకుండా చూచుకొంటారు". మరో మాటగా చెప్పాలంటే అమరులు కాకపోయినా, మృత్యువాత పడకుండా ఉంటారు.

ఉల్లాసాన్ని కల్గించే ఈ జోస్యాన్ని చెప్పి ఏడాది గడిచిందో లేదా దానిని తునాతునకలు చేస్తూ ఒక భయంకర ఆకృతి ఈ భూగోళాన్ని ప్రాణాంతకమైన

కారుమేఘంలా కమ్మేసి అంతా అంధకారమయం చేసింది. అదే ఎయిడ్స్.

శ్రీఅరవిందులు తమ 'దివ్యజీవన' గ్రంథంలో 'పునర్జన్మ, ఇతర లోకాలు' అన్న శీర్షిక వున్న అధ్యాయానికి పాదటిప్పణిలో వ్రాసినది మనసులో మెదులుతుంది. అలాంటి భవిష్య సంఘటనను సూచిస్తున్నట్లుగా తోస్తుంది: "విజ్ఞానం — అది భౌతికమైనది లేదా మార్మికమైనదైనా — ఈ శరీరానికి చెందిన అనిశ్చితమైన మనుగడకు కావలసిన పరిస్థితులను, సాధనాలను కనుగొన్నప్పటికి కూడా, ఈ శరీరమన్నది దానంతట అదిగా ఆంతరికాభివృద్ధిని ప్రకటింపజేసేందుకు అనువైన ఉపకరణం కాలేకపోతే, అంతరాత్మ ఈ శరీరాన్ని వదిలిపెట్టడానికి మరో త్రోవను కనుగొని మరో క్రొత్త రూపం దాల్చటానికి మార్గం కనుగొంటుంది. మరణానికి చెందిన ఈ పదార్థ సంబధమైన లేదా భౌతికమైన కారణాలు దానికి మూలమైన లేక నిజమైన కారణాలు. కాజాలవు. నిజమైన అంతర్గత మూలకారణం ఒక క్రొత్త జీవికి చెందిన పరిణామానికి కావలసిన ఆధ్యాత్మికపరమైన ఆవశ్యకత."

ఇదొక పాదటిప్పణి అయినప్పటికీ దీనిలో మౌలికసత్యం యిమిడి ఉంది. నూతన జీవికి సంబంధించిన పరిణామం కోసం కావలసిన ఆధ్యాత్మిక అవసరమే, మృత్యువుని ఆధారంగా ఉపయోగించుకొంటుంది. ఈ మర్మగర్భమైన ప్రకటనను గురుదేవులు మన ముందుంచిన తత్త్వదర్శనం అందించిన కొద్దిపాటి వెలుగులో మనకు దానిని తెలిసినంతవరకు విశ్లేషిస్తాను. ఈ పరిస్థితిలో పరస్పర వైరుధ్యం కనబడుతుంది. ఒక వైపు వికాసం చెందాలని ఆకాంక్షించే ఆత్మకు తగినంత యోగ్యమైన ఉపకరణంగా ఈ శరీరం వుంటే తప్ప ఈ అనిశ్చితమైన భౌతిక మనుగడకు అవకాశము లేదు. మరో వైపు పరివర్తింపజేసే ఒక చైతన్యం యిక్కడ జోక్యం చేసుకోకుండా ఈ దేహం ఆ ప్రక్రియకు యోగ్యమైనది కాజాలదు అని కూడా అవ గతమౌతున్నది. శ్రీఅరవిందుల బోధనా పరంపరలో సాగిపోతున్న విద్యార్థులుగా మాకు తెలిసిందేమిటంటే ఇప్పటికి అనభివ్యక్తంగా వున్నదానిని సాధించడంలో సంక్లిష్టాంశంగా వున్నదానిని సామరస్యంగా పరిష్కరించడానికి ఆయన తమ అత్యంత శక్తివంతమైన యోగశక్తిని ధారపోసి, ఆ రూపాంతరీకరణ శక్తిని క్రిందకు దింపి, ఈ భౌతికంలో స్థాపింపజేయడంలో నిమగ్నులైయ్యారు. శ్రీమాత, శ్రీగురుదేవులిరువురు అనుసరించిన ఈ దివ్యకార్య ప్రక్రియను అందులో వారు సాధించిన విజయాన్ని అర్థం చేసుకోగలిగామని చెప్పడం ఒక దుస్సాహసమే అనిపిస్తుంది.

అనువాదం: హర్షవర్ధన్